గత40 సంవత్సరముల నుండి యీ గ్రంథకర్త కీర్తనలను ఉదయకాల ధ్యానములుగా కలిగియున్నారు. వాటియందు ఆయన నిరీక్షణ, సంతోషము, ప్రోత్సాహము, ఆరాధన, ప్రకృతిని గూర్చిన పరిజ్ఞానము మరియు మన స్తుతికి, ఆరాధనకు పాత్రుడైన సర్వశక్తిమంతుడగు దేవుని మార్గములను కనుగొన్నారు. గ్రంథకర్త సంవత్సరములోని ప్రతి దినమునకు ఒక్కొక్క వాక్యభాగమును తన తలంపులతో క్లుప్తంగా వర్ణించి, వాక్యభాగములో ఒక ధ్యాన వచనమును సూచించి, ప్రార్థనతో ముగించారు. కీర్తనలపై వ్రాయబడిన యీ అనుదిన ధ్యానములను చదివే వారందరూ తమకెలాంటి కష్టతరమైన పరిస్థితులున్నను ప్రోత్సహించబడాలనేది గ్రంథకర్తయొక్క హృదయపూర్వక ఆకాంక్ష. కీర్తనలు దేవునిపైనను మరియు ఆయన ఏమి జరిగించాడు, ఏమి జరిగించగలడు అను వాటిపైనను గురికలిగి యుండవలెనని మనకు గుర్తుచేయుచున్నాయి.



**నాతో కూడి యెహోవాను ఘనపరచుడి.**
**మనము ఏకముగా కూడి ఆయన**
**నామమును గొప్ప చేయుదము**

కీర్తనలు 34:3

డా. డేవిడ్ హాకింగ్ Ohio మరియు California రాష్ట్రాలలో సంఘకాపరిగా పనిచేసి, గత 45 సంవత్సరములుగా దేవుని వాక్యమును బోధిస్తూ, ప్రకటిస్తూ వున్నారు. ఆయన 1970 నుండి రేడియో ప్రసంగీకుడుగా వుంటూ, ప్రస్తుతము 'Hope For Today' అను రేడియో కార్యక్రమములో దేవుని వాక్యమును బోధించుచున్నారు. యీ కార్యక్రమము నార్త్ అమెరికాలో అనేక రేడియో స్టేషన్లలో ప్రసారమగుచున్నది. గ్రంథకర్త 1962లో వివాహము చేసుకొని, ముగ్గురు పిల్లలతో ఆశీర్వదింపబడియున్నారు.


**ప్రతులకు సంప్రదించండి:**

**Grace Ministries**

**D.No. 6-38-20/1, L.V. Nagar, Drivers Colony**
**Gajuwaka, Visakhapatnam - 530 026**
**Tel. # 0891-2511689, 9177747337**

**E.mail: dmbooks075@gmail.com**


కీర్తనల గ్రంథము - అనుదిన ధ్యానములు - డా. డేవిడ్ హాకింగ్
అనువాదం: సహో. ధర్మా మల్లు

# కీర్తనల గ్రంథము

## అనుదిన ధ్యానములు



రచయిత
**డా. డేవిడ్ హాకింగ్**

అనువాదం
**సహో. ధర్మా మల్లు**

**నాతో కూడి యెహోవాను ఘనపరచుడి.**
**మనము ఏకముగా కూడి ఆయన**
**నామమును గొప్ప చేయుదము**

కీర్తనలు 34:3

# కీర్తనల గ్రంథము

## (అనుదిన ధ్యానములు)

*Meditations in the Psalms*

*(A daily devotional )*

**రచయిత**

**డా. డేవిడ్ హాకింగ్**

**అనువాదం**

**సహో. ధర్మా మల్లు**

# *Meditations in the Psalms*
# *(A daily devotional)*

***Dr. DAVID HOCKING***

**Copyright @ 2000**

**This Telugu Edition is**

**Published with the kind permission of**

**Dr. David Hocking**

***Translation***

***Bro. DHARMA MALLU***

**First Edition Copyright @ 2014**

**Copies: 2000**

***Price ₹ 120 /-***

***Published by***

***Grace Ministries, # 6-38-20/1, L.V.Nagar***

***Old Gajuwaka - 530 026, Visakhapatnam. A.P, India***

***Mobile: 9177747337***

**Designing & type setting**

**Renee Graphics 9030863858**

**Written permission must be obtained from the author at the above address for reprinting or translating any part of this book.**

# విజ్ఞప్తి

ప్రియ సహోదర, సహోదరిలారా, ప్రభువైన యేసు క్రీస్తు నామమున మీకందరికీ నా వందనములు. గతంలో 'క్రీస్తు ఉపమానములు - దేవుని రాజ్య మర్మములు', 'మోషే ప్రత్యక్షపు గుడారము', 'యెహోవా పండుగలు' అను పుస్తకములను ప్రచురించిన తరువాత, 'కీర్తనల గ్రంథము - అనుదిన ధ్యానములు' అను యీ పుస్తకమును ఇంగ్లీషునుండి తెలుగులోనికి అనువాదముచేసి, ప్రచురించుటకు దేవుడు చూపిన కృపకొరకై ఆయనకు వందనములు చెల్లించుకొనుచున్నాను.

2012వ సంవత్సరము సెప్టెంబర్ నెలలో గ్రంథకర్త మరియు దైవదాసులైన డేవిడ్ హాకింగ్ గారిని ప్రత్యేక కూడికలలో కలుసుకున్నప్పుడు ఆయన వ్రాసిన 'Meditations in the Psalms - A daily devotional' అను పుస్తకమును ఆయననుండి పొందియున్నాను. దీనిని చదువుచున్నప్పుడు యీ పుస్తకము తెలుగుభాషలో కూడా ప్రచురింపబడితే, యిది ఎంతోమందికి మేలుకరముగా వుంటుందన్న ప్రేరణతో, గ్రంథకర్త అనుమతిపొంది, యీ పుస్తకమును తెలుగులో ప్రచురించడమైనది.

'కీర్తనలగ్రంథ అనుదిన ధ్యానములు' వ్యక్తిగత మరియు కుటుంబప్రార్థనలలో వాక్య ధ్యానముకొరకు సహాయపడుచున్నవి. అంతేగాక బోధకులు యిందులోని తలంపులను సంఘ ఆరాధన వర్తమానములద్వారా బోధించుటకును, తద్వారా దేవునిప్రజలు ఆయనను స్తుతించి, ఆరాధించుటకై ప్రేరేపించబడుటకును యీపుస్తకము తోడ్పడుచున్నది. కనుక అనేకులు యీ పుస్తకమును చదివి, ఆత్మీయమైన మేలు పొందవలెనని వారికి విజ్ఞప్తిచేయుచూ, సర్వశక్తిమంతుడైన దేవునికి స్తుతి చెల్లించుచున్నాను.

ఈ పుస్తకమును ప్రచురించుటలో సహకరించిన దైవదాసులు సహో॥ డి.యస్.యన్.రాజు గారికి, సహో॥ హానోకు గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రచురణకర్తలకు, టైపింగ్‌లో సహాయపడిన సహో॥ సతీష్‌బాబు (రెనీ గ్రాఫిక్స్) గారికి నా వందనములు. అంతేగాక, యీ పుస్తక పంపిణీలో సహాయము చేసిన సహో॥ ఇమ్మానుయేలు గారికి, సహో॥ చంద్ర కిరణ్ గారికి నా ప్రత్యేక వందనములు తెలియజేసుకుంటున్నాను. యీ పుస్తక ప్రచురణ కొరకు ప్రార్థించిన విశ్వాసులందరికీ నా వందనములు.

**సహో. ధర్మా మల్లు**
Email: dmbooks075@gmail.com

# అంకితం

గత అనేక సంవత్సరములుగా కీర్తనలు నాకు ఉదయ కాల ధ్యానములుగా వున్నాయి. అవి నాకు ప్రోత్సాహమును, నిరీక్షణను కలుగజేశాయి. కష్టమైన పరిస్థితులలో, యింకొక అడుగు ముందుకు వేయని స్థితిలో కీర్తనల ధ్యానములు నన్ను బలపరిచాయి. ఆరాధన, స్తుతి, ఆదరణ, నిరీక్షణ మరియు విడుదలను గూర్చిన అద్భుతమైన మాటలు గలిగియున్న యీ కీర్తనలను ధ్యానించిన తరువాత నా జీవితములో యీ గ్రహింపునకు వచ్చియున్నాను:

"దేవుడు ఎవరు మరియు ఆయన ఏమి జరిగించ గలడు అను సత్యమును సరిగా అర్థం చేసుకోక పోవడం లేదా సరిగా అనుసరించకపోవడమనేది విశ్వాసి జీవితము లోని ప్రతి సమస్యకు మూలకారణమై యున్నది".

అందుకే, యీ పుస్తకమును- ప్రతి పేజీలోను హెచ్చించబడిన అద్భుతకరుడు, గొప్పవాడైన దేవునికే అంకితము చేయుట కేవలము యుక్తమైయున్నది. ఆయన ప్రతి విధమైన ఊహకు మించియున్న "ఘనుడైన" దేవుడు. ఆయన ప్రతి విధమైన మానవ గ్రహింపునకు మించియున్న "మహిమగల" దేవుడు. ఆయన అందరికీ "ప్రభువు", యీ జగత్తుకే "రాజు" మరియు ఆయన నా "కాపరి".

**డా. డేవిడ్ హాకింగ్**

# ఉపోద్ఘాతము

'కీర్తనలు' కనీసం 3000 సంవత్సరముల క్రిందట వ్రాయబడియున్నను, మనకు ప్రోత్సాహము మరియు గ్రహింపు కలుగుటకై యీ దినమే వ్రాయబడినట్లు అనిపిస్తాయి. కీర్తనలు దేవుని స్వభావము మరియు గుణములను గూర్చి తెలియజేయుచూ, దేవుని గొప్ప తనమును మానవుల బలహీనత మరియు వారికున్న భయముతో పోలుస్తున్నాయి. కీర్తనలలో చాలా మట్టుకు "ఇశ్రాయేలు మధుర గాయకుడిగా" (2 సమూయేలు 23:1) పిలువబడే దావీదు రాజు ద్వారా వ్రాయబడినవి. యేసుక్రీస్తు 110వ కీర్తనను సూచిస్తూ మత్తయి 22:43లో, "దావీదు ఆయనను ప్రభువని ఆత్మ వలన ఏల చెప్పుచున్నాడు?" అని ప్రశ్నించాడు. దావీదు పరిశుద్ధాత్మ ప్రేరణతో యీ కీర్తనలను రచించాడు.

కీర్తనలు ఇశ్రాయేలు యొక్క 'ఆరాధన మరియు స్తుతి పుస్తకము'గా పిలువబడుతున్నాయి. అవి మనము ప్రార్థించి, స్తుతించుటకు, దేవునికి మొఱపెట్టుటకు ప్రోత్సహిస్తున్నాయి. కీర్తనలు మన జీవితాలలోని అన్ని విషయములను పరిగణిస్తూ, మనము దేవుని మీద పూర్తిగా ఆధారపడవలసిన వారముగా వున్నామని గుర్తు చేస్తున్నాయి. ఈ పుస్తకము కీర్తనలను ఒక 'బోధకుని చూపు'తో చూస్తూ, గ్రంథకర్త తన అధ్యయనములలో అనుభవించిన వాటిని వ్యక్తపరుస్తున్నది. యీ ధ్యానములు నీవు దేవునితో కలిగియున్న నడకలో నిన్ను ప్రోత్సాహపరచి, నీవు ఆయనయందు మాత్రమే సంపూర్ణమైన నమ్మిక కలిగియుండుటకు సహాయపడునుగాక!

'ధన్యుడు' (ధన్యులు) అను మాటను యేసుక్రీస్తు తన కొండమీది ప్రసంగము (మత్తయి 5:1–12) లో వాడెను. ఈ పదము మన మాటలు మరియు క్రియలను ప్రభావితము చేయునట్టి మన హృదయముయొక్క అంతరంగ స్థితిని తెలియజేస్తుంది. కీర్తనాకారుని ప్రకారము మనము యీ క్రిందివాటిని చేసిన యెడల 'ధన్యులము'గా వుందుము.

1. అవిశ్వాసపు లోకము యొక్క ఆలోచనలను, పద్ధతులను తిరస్కరించుట – వ. 1
2. దివారాత్రము దేవుని వాక్యమును ధ్యానించుట – వ. 2–3
3 దుష్టులు పొందు పర్యవసానమును తెలుసుకొనుట – వ. 4–6
4. దేవుని జ్ఞానము, సంరక్షణ మరియు వాగ్దానముల మీద ఆధారపడుట – వ. 6ఎ

నీవు యెంత 'ధన్యుడవు'గా వున్నావు? దేవుని వాక్యమును మన జ్ఞానమునకు మరియు మార్గమునకు మూలముగా కలిగి, యీ క్రొత్త సంవత్సరమును మొదలు పెట్టెదము.

**ధ్యాన వచనము 2**: *యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.*

**ప్రార్థన:** *ప్రభువా, దుష్టుల ఆలోచనలను వదలివేసి, మీ వాక్యమునందు ఆనందించుటకు సహాయపడుము.*

ఈ ప్రవచనపు కీర్తన మతాధికారులు 'మెస్సీయ' (యేసుక్రీస్తు) పట్ల కలిగియున్న కోపము, పగను జ్ఞప్తికి తెచ్చుచున్నది. అపొ.కా. 2:24-30 వచనముల ప్రకారము ఆది సంఘములోని యూదియ విశ్వాసులు యీ దావీదు కీర్తన యేసుక్రీస్తుకు యెదురైన వ్యతిరేకతను గూర్చి తెలియజేయుచున్నదని నమ్మిరి. అవును, ఆయన ఇశ్రాయేలీయులకు 'మెస్సీయ'.

1. అన్యజనులయొక్క అల్లరి - వ. 1
2. నాయకుల (ఏలికల) తిరుగుబాటు - వ. 2-3
3. దేవుని ప్రతిస్పందన -వ. 4
4. దేవుడు కలుగజేయు పరిణామము - వ. 5
5 మెస్సీయ పరిపాలన -వ. 6

మన హృదయములు బైబిల్ ప్రవచనముయొక్క నెరవేర్పునందేగాక మన దేవుడు మనకు వాగ్దానము చేసిన మహిమగల భవిష్యత్తును బట్టి ఆనందించును. దీనికి కారణము అభిషిక్తుడైన 'మెస్సీయ'.

**ధ్యాన వచనము 6**: *నేను నా పరిశుద్ధ పర్వతమైన సీయోనుమీద నా రాజును ఆసీనునిగా చేసియున్నాను.*

**ప్రార్థన:** *త్వరలో ఒకానొకరోజు మెస్సీయ (యేసుక్రీస్తు) యీ భూమియంతటి మీద పరిపాలన చేయునని ఆనందించుదును.*

ఈ ప్రవచనపు కీర్తనలో మన పరలోకపు తండ్రికి, ఆయన కుమారుడు, మన రక్షకుడు, మెస్సీయ యేసుక్రీస్తుకు గల సంబంధమును గూర్చి నేర్చుకొందుము. తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తుకు రావలసిన వారసత్వ సంపాద్యమును గూర్చి తనను అడుగమని యేసుక్రీస్తును ఆహ్వానిస్తున్నాడు (వ. 8). అంతేగాక, కుమారుడు (యేసుక్రీస్తు) భూమిమీదికి వచ్చి, ఆయన ప్రజలైన ఇశ్రాయేలీయులకు వ్యతిరేకముగా యుద్ధము చేయవచ్చిన దేశములన్నిటినీ నాశనము చేయబోవు దినమును గూర్చి దేవుడు యీ కీర్తనలో తెలియజేయు చున్నాడు (ప్రకటన 19:11-16).

1. తండ్రి, కుమారులకు మధ్యనున్న సంబంధము - వ. 7
2. కుమారుని విన్నపము - వ. 8
3. కుమారుని రాబోవు ఏలుబడి - వ. 9
4. కుమారుని పట్ల మనకుండవలసిన ప్రతిస్పందన -వ. 10-12ఎ
5. దేవుని ఆశీర్వాదమును గూర్చిన జ్ఞాపిక - వ. 12బి

'కుమారుని ముద్దుపెట్టుకొనుట' అనగా ఆయనకు (యేసుక్రీస్తుకు) నమస్కరించి, ఆయనను ప్రభువుగా ప్రకటించుట.

**ధ్యాన వచనము 12 బి :** *ఆయనను ఆశ్రయించు వారందరు ధన్యులు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ముందు మోకరించి, నిన్ను సంపూర్ణముగా విశ్వసించుచున్నాను.*

ఈ కీర్తనలో దావీదు గొప్ప పరీక్షలను, వ్యతిరేకతను యెదుర్కొంటున్నాడు. అతనికి యెలాంటి నిరీక్షణ, సహాయము లేవని ప్రజలు చెప్పుకొనుచుండిరి. ఒక విశ్వాసి నిరీక్షణ లేకుండా వుండుట అసాధ్యము. దేవుడు దావీదును సంరక్షించి, ఆయనకు కావలసిన 'ఆధారము'గా వున్నాడు. దావీదు స్థితిగతిని క్రింది వచనములలో చూడగలము:

1. తనను గూర్చి యితరులు చెప్పుకొంటున్న మాటలనుబట్టి దావీదు వ్యాకుల పడుట - వ. 1-2
2. దావీదుకు దేవునియందున్న విశ్వాసము -వ. 3
3. దావీదు మొఱ వినబడుట - వ. 4-6
4. తన పరిస్థితి అంతటిలో దావీదుకున్న తృప్తి - వ. 7-8

'నీ ప్రజలమీదికి నీ ఆశీర్వాదము వచ్చునుగాక' అని దావీదు చెప్పాడు. మనము పొందునంత కంటె అధికముగా దేవుడు మనలను ఆశీర్వదించాలని కోరుకుంటున్నాడు.

**ధ్యాన వచనము 3**: *యెహోవా, నీవే నాకు కేడెముగాను, నీవే నాకు అతిశయాస్పదముగాను, నా తల ఎత్తువాడవుగాను ఉన్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సంరక్షణ మరియు నీ ఆశీర్వాదమునుబట్టి నీకు వందనములు.*

నరులతో తాను చేసిన మనవి ద్వారా దావీదు యీ కీర్తనలో క్రింది ఆజ్ఞలను తెలియజేసి, మనకు మంచి సలహానిచ్చాడు: భయము నొందుడి (వ. 4); పాపము చేయకుడి (వ. 4); మీ పడకలమీద నుండగా, మీ హృదయములలో ధ్యానము చేసుకొనుడి (వ. 4); ఊరకుండుడి (వ. 4); నీతియుక్తమైన బలులు అర్పించుడి (వ. 5); యెహోవాను నమ్ముకొనుడి (వ. 5). యిట్టి సామాన్యమైన, సూటియైన ఆజ్ఞలు దేవుడు తనకొరకు, తన పరిచర్యకొరకు యేర్పరచుకొన్న నీతిమంతుల గుణములను గూర్చి తెలియజేయుచున్నవి.

1. దావీదు ప్రార్థన - వ. 1
2. నరులతో దావీదు చేయు మనవి - వ. 2-5
3. దావీదు స్తుతి - వ. 6-7
4. దావీదు సమాధానము - వ. 8

**ధ్యాన వచనము 3:** *యెహోవా తన భక్తులను తనకు ఏర్పరచుకొనుచున్నాడని తెలిసికొనుడి. నేను యెహోవాకు మొఱ్ఱపెట్టగా ఆయన ఆలకించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీ యొద్దకు ఒంటరిగా వచ్చి, నా ప్రార్థనకు జవాబిస్తావని విశ్వసిస్తున్నాను.*

దేవుని వాక్యమును ధ్యానించి, ప్రార్థించుటకు సాధారణముగా 'ఉదయకాలము' ఉత్తమమైనది. మన దినమును సరియైన రీతిలో మొదలుపెట్టవలెను. దేవుడు పాపము చేయువారిని అసహ్యించుకొనును. ఆయన దుష్టత్వమును చూచి ఆనందించడు. దేవుని యొక్క యీ గుణమే దావీదు ధ్యానమును ప్రేరేపించినది. మూడవ వచనము చివరి భాగములో "కాచియుందును" (look up) అను మాట ద్వారా మన పరిస్థితుల వైపు కాకుండా దేవుని వైపు చూస్తూ, కాచుకొనియుండవలెనని యెంతో చక్కగా జ్ఞాపకము చేయబడుచున్నాము.

1. దావీదు ధ్యానము –వ. 1
2. దావీదు ధ్యానించిన తీరు –వ. 1–2
3. ఉదయకాలమున చేయబడు దావీదు ధ్యానము –వ. 3
4. దావీదు ధ్యానమును ప్రేరేపించిన దేవుని గుణము –వ. 4–6

*నీ దినము దేవునితో ప్రత్యేక కలయిక ద్వారా మొదలైనదా? ఆయన నిన్ను ప్రేమించి, నీ నుండి వినగోరుచున్నాడు.*

**ధ్యాన వచనము 3**: *యెహోవా, ఉదయమున నా కంఠస్వరము నీకు వినబడును. ఉదయ మున నా ప్రార్థన నీ సన్నిధిని సిద్ధముచేసి,* కాచియుందును.

**ప్రార్థన:** *ప్రభువా, ప్రతి దినమును నేను ప్రార్థనతో మొదలుపెట్టవలెనని నాకు జ్ఞాపకము చేసినందుకు నీకు వందనములు.*

దావీదు ఆరాధన దేవుని స్వభావములో పాతుకొని పోయినది. తనచుట్టు వున్న దుష్టత్వమును చూచి, దానిని దేవునికే వదలివేయుట నేర్చుకొన్నాడు. రోమా 12:17–21లో పగతీర్చుకొనుట మన పనికాదు, దేవుని పనియని నేర్చుకొందుము.

1. దావీదు ప్రార్థనకు ప్రేరేపించబడుటకు గల కారణములు –వ. 7
2. మనకు అవరసమైన నీతి –వ. 8
3. దుష్టుల తిరుగుబాటు తనమును దేవుడు మాత్రమే అణచివేయవలెను –వ. 9–10
4. సంతోషము దేవుని నమ్మికొనుటద్వారా కలుగును –వ. 11–12

దేవుడు *"నీతిమంతులను ఆశీర్వదించెదనని"* (వ. 12) వాగ్దానము చేశాడు గనుక ఆయనను నమ్మికొనుము. ఆయన మనలను కాపాడు దేవుడు గనుక మనము ఆయన యందు *"ఆనందింతుము"*.

**ధ్యాన వచనము 11, 12 బి:** *నిన్ను ఆశ్రయించువారందరు సంతోషించుదురు. నీవే వారిని కాపాడుదువు గనుక వారు నిత్యము ఆనందధ్వని చేయుదురు. నీ నామమును ప్రేమించువారు నిన్నుగూర్చి ఉల్లసింతురు.*

**ప్రార్థన:** *ప్రభువా, పరిష్కరించబడని విభేదములను మరియు కష్టతరమైన పరిస్థితులను నీ చేతిలో వదిలివేసి, ఎన్నడూ ప్రతీకారము కోరుకొనకుండా, నేను నిర్దోషినని ప్రకటించు కోకుండా వుండుటకు నాకు సహాయము చేయుము.*

కొన్ని సమయములలో మనము మనకున్న పరిస్థితులనుబట్టి విసిగిపోయి, అధైర్యపడి, ఏమి చేయాలో, ఆ పరిస్థితులనుండి ఎలా బయట పడాలో తెలియక సతమతమై పోతుంటాము. దావీదు తన బలహీనతను మరియు తన ఆత్మలో వున్న గందరగోళమును గుర్తించాడు. ఆయనకు దేవుని విమోచన మరియు ఆయన కృప అవసరమాయెను.

1. తాను దేనికి పాత్రుడైయుండెనో దావీదు తెలుసుకున్నాడు-వ. 1
2. తన బాధాకరమైన పరిస్థితిని దావీదు గుర్తించాడు-వ. 2-3ఎ
3. దేవునికి మొఱపెట్టుట ద్వారా దావీదు తన పరిస్థితికి ప్రతిస్పందించాడు-వ. 3బి-4
4. తాను మరణిస్తే యిప్పుడు తనకున్న అవకాశమును కోల్పోతానని దావీదు తర్కించాడు-వ. 5

మనకున్న గర్వము మరియు అహంకారమును బట్టి అనేక సార్లు మనము దేవునికి మొఱపెట్టనివారముగా వుంటాము. అనగా మన బలహీనతను గుర్తించక, మన పరిస్థితులను మనమే చక్క బెట్టుకొనగలమని అనుకుంటాము. అపొస్తలుడైన పౌలు, *"నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను"* అని 2 కొరింథీ12:9-10 లో చెప్పియున్నాడు.

**ధ్యాన వచనము 2 :** *యెహోవా, నేను కృశించియున్నాను. నన్ను కరుణించుము....*

**ప్రార్థన:** *ప్రభువా, నా అహంకారమును మరియు నా బలహీనతను నీ ముందు ఒప్పుకొని, నీ బలమును మరియు నీ క్షమాపణను కోరుకుంటూ నీ యొద్దకు నేను వచ్చెదను.*

దావీదు యొక్క విచారము ఎంతో విషమించింది. ఆయన అంతరంగములో ఎంతో వ్యాకులపడుచున్నాడు. ఆయన శత్రువులందరినుండి వస్తున్న ఒత్తిడి ఆయనకు యెంతో బరువుగా వుంది. ఆయనకును, మనకును ఉన్న ఒకే ఒక్క జవాబు – "యెహోవా నా రోదన ధ్వని వినియున్నాడు" (వ. 8–9). మనము సాధారణముగా అధైర్యపడతాము (1కొరింథీ 10:13). అయితే అన్ని సమయములలో మనకు తోడైయుండు దేవుని మరచిపోవుట పెద్ద పొరపాటు. మన అధైర్యకర పరిస్థితిలో మనకు సహాయము చేయగలిగిన వాడు మన దేవుడొక్కడే.

1. దావీదు తన బాధను వ్యక్తపరిచాడు – వ. 6–7ఎ
2. దావీదు తన బాధకు గల కారణమును వివరించాడు – వ. 7బి,8బి
3. దావీదు తన మొఱను దేవుడు విని, తన పరిస్థితిని అదుపులోనికి తీసుకువస్తాడని ఉద్ఘాటించాడు – వ. 8ఎ, 9–10

అవును, ప్రభువు "వినియున్నాడు". మనము పడు ప్రయాస అంతయు ఆయన యెరిగియున్నాడు. దానిద్వారా మనకు మేలును, తనకు మహిమను ఎలా కలిగించుకోవాలో కూడా యెరిగియున్నాడు. నీ భారములన్నియు ఆయన పాదముల చెంత వుంచి, ఆయనను నమ్ముకొనుము.

**ధ్యాన వచనము 9:** *యెహోవా నా విన్నపము ఆలకించియున్నాడు. యెహోవా నా ప్రార్థన అంగీకరించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను మొఱపెట్టినపుడు నా మొఱలను ఆలకించే దేవుడవు గనుక నీకు వందనములు.*

దావీదు తన జీవితములో అందరితోను సమాధానముగా వుండాలని, ఎవరితోను వైరము లేకుండా వుండాలని ఎంతగానో కోరుకున్నాడు. గతములో పరిష్కరింపబడని సమస్యలకంటె మించి మనలను కలవర పరచేదేది వుండదు. దావీదు ఎవరి పట్లనైనా తప్పిదము చేసియుంటే, దేవుని తీర్పును అంగీకరిస్తున్నాడు. నీ జీవితములో నీవు ఎవరి పట్లనైనా తప్పిదము చేసి, దానిని పరిష్కరించుటకు లేదా క్షమాపణ కోరుకొనుటకు యేమీ చేయకుండా వున్నావా?

1. దావీదు యెహోవాయందు నమ్మిక గలిగి, ఆయనను ఆశ్రయించెను- వ. 1ఎ
2. దేవుని చేత విమోచింపబడుటకు దావీదు పరితపించుట- వ. 1బి-2
3. దావీదు యథార్థత కలిగి జీవించుటకు తీర్మానించుకున్నాడు- వ. 3-5

"నీతో సమాధానముగా వున్న" యెవరికైనా నీవు హాని కలుగజేసినావా? దానిని బట్టి నీ "ఘనత" మంటి పాలైందా? నీ ద్వారా గాయపరచబడిన వ్యక్తి యెవరైనా నీ దృష్టికి వస్తే, అతనిని కలుసుకొని, సమాధానపడి, సమస్యను పరిష్కరించుకొనుటకు అవకాశము దయచేయమని ప్రభువును 'త్వరగా' అడుగుము.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా, నా దేవా, నేను నీ శరణుజొచ్చియున్నాను...*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయమును కలవరపరచే సంగతులను నీకు వదిలివేసి, నీవు నిర్ణయించునది చేయుదువని నేను నిన్ను నమ్ముకొందును.*

దావీదు న్యాయాధిపతియైన దేవునికి విన్నవించుకుంటూ, "యెహోవా, కోపము తెచ్చుకొని, లెమ్ము" అని ఆయనను ఆహ్వానించుచున్నాడు. దావీదు తన హృదయము యొక్క "యథార్థత"ను గురించి పట్టింపు కలిగి యున్నాడు. మనహృదయపు యథార్థత విషయానికొస్తే, మనలను మనము నిర్దోషులముగా చెప్పుకుంటే సరిపోదుగానీ, మనము దేవుని ముందు జవాబుదారులముగా వున్నామని గ్రహించాలి. దేవుడు మాత్రమే "*హృదయములను, అంతరింద్రియములను పరిశీలించువాడు*". యిర్మియా 17:9-10 ప్రకారము మన గురించి మనకు తెలియదుగానీ దేవుడు మన గురించి అంతా తెలిసినవాడు (హెబ్రీ 4:13).

1. దేవుని కోపము మరియు తీర్పునకు దావీదు ఆహ్వానము - వ.6-7
2. దావీదుకు తన యథార్థత ఎంతో ప్రాముఖ్యమైనది - వ.8
3. దేవుడు పాపమునకు తీర్పు తీర్చును - వ.9-10ఎ
4. దావీదు తన హృదయమునకిచ్చిన ఉపదేశము - వ.10బి

దావీదు వలె దేవుని తీర్పును నీ హృదయముపైకి ఆహ్వానించాలంటే దేవునితో సరిగా వుండాలని కోరుకునే హృదయము నీవు కలిగి యుండవలెను. మనము దేవుని ఆట పట్టించలేము. ఎందుకనగా ఆయన "హృదయములను, అంతరింద్రియములను పరిశీలించు దేవుడు".

**ధ్యాన వచనము 10బి:** *యథార్థహృదయులను రక్షించు దేవుడే నాకేడెమును మోయువాడై యున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు సర్వ జనులకు న్యాయాధిపతిగా వున్నావు. నేను నీ జ్ఞానముపైనను మరియు నీ నిర్ణయములపైనను సంపూర్ణముగా ఆధారపడుదును.*

మోషే యీ వచనములను దేవునికి మరియు దేవుని 'న్యాయముతో కూడిన తీర్పు' నకు ఆరోపించాడు (ద్వితీయోపదేశకాండం 32:41-42). దుష్టులు తమ దుష్క్రియలతో ఎంత మాత్రము తప్పించుకొనలేరన్న నమ్మకము దావీదు కలిగియున్నాడు. ఎందుకనగా దేవుడు అందరికీ తీర్పు తీర్చువాడు.

1. దేవుని కోపము - వ. 11
2. దేవుని ప్రతీకారము - వ. 12-13
3. దుష్టుల అహంకారము - వ. 14-16
4. దేవుని నామము ఆరాధించబడుట - వ. 17

మన పరిస్థితులను దేవునికి అప్పజెప్పుకొనుట కష్టతరముగా వుండును. మన చుట్టూ దుష్టత్వము ఉన్నది. మన చుట్టు వున్న ప్రజలు పాపముచేసి, తప్పించుకు తిరుగుతున్నారని మనము అనేకసార్లు అనుకుంటుంటాము. ఇది నిజము కాదు. దేవుడు మనకందరికీ "నీతి"తో కూడిన తీర్పు తీరుస్తాడు. యీ లోకములో వున్న చెడుతనము మనలను కలవర పెడుతుంటే, దేవుని న్యాయము గురించి మనము నిశ్చయత కలిగియుండవచ్చును. దేవునికి స్తోత్రములు.

**ధ్యాన వచనము 17:** *యెహోవా న్యాయము విధించువాడని నేను ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను. సర్వోన్నతుడైన యెహోవా నామమును కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు ఎల్లప్పుడూ సరియైన దానినే చేయుదువు గనుక నీకు వందనములు. నీవు నీతిమంతుడైన దేవుడుగా వుండి, నేను నీ నామమును స్తుతించునట్లు చేయుదువు.*

ఈ వచనముల యొక్క అందము మరియు వాటి ప్రభావము లోకములోని సాహిత్యమంతటిలోను సాటిలేనిది. సృష్టి దేవుని మహిమను గూర్చి సాక్ష్యమిస్తున్నది (కీర్తన 19:1). మరియు మర్మములలో కెల్లా మర్మమేదనగా దేవుడు మానవుడుగా వచ్చి, మన పాపములనుండి మనలను రక్షించాడు (1తిమోతి 3:16). దైవ మానవుడుగా వున్న మెస్సీయ (ప్రభువైన యేసుక్రీస్తు) యొక్క అందమైన పనిని గూర్చి మరియు సమస్తముపైన ఆయన పొందబోవు విజయమును గూర్చి యిందులో వర్ణించబడినది.

1. దేవుని మహిమ మరియు ఆయన అంతిమ విజయమును గూర్చిన ప్రకటన – వ. 1–2,9
2. దేవుని మహిమకు మరియు మానవత్వమునకు మధ్యనున్న సందిగ్ధత – వ. 3–4ఎ
3. దేవుడు మానవుడగుటకై దిగివచ్చుట – వ. 4బి–5 (హెబ్రీ 2:6–9 చదువుము.)
4. ప్రభువైన యేసుక్రీస్తుకున్న ఆధిపత్యము – వ. 6–8.

"ఆకాశములకంటె" హెచ్చుగా వున్న మన గొప్ప దేవుని స్తుతులతో కొనియాడుట ద్వారా యీ దినపు అధ్యయనమునకు సరియైన స్పందన కలిగియుందుము.

**ధ్యాన వచనము 9 :** *యెహోవా, మా ప్రభువా, భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావము గలది!*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు కలుగజేసిన అద్భుతమైన సృష్టినిబట్టి నేను నిన్ను స్తుతించి, హెచ్చించకుండా ఉండలేను.*

దుష్టుల మీదికి రాబోవుచున్న దేవుని ఉగ్రత గురించి తన నమ్మకమును దావీదు అనేకసార్లు కీర్తనల గ్రంథములో వ్యక్తపరిచాడు. నీతిమంతులు దుష్టులపై పొందబోవు ఆఖరి విజయము మరియు నీతితోకూడిన దేవుని తీర్పు అనునవి దావీదు స్తుతి కీర్తనలయొక్క ఎడతెగని సారాంశములుగా వున్నాయి.

మన చుట్టువున్న దుష్టత్వమునుబట్టి మనము అనేకసార్లు కలవరపడి, దేవుడు దీనిని గురించి యేమి చేయబోతున్నాడని ఆలోచిస్తుంటాము. దేవుడు యీ లోకమునకు తీర్పు తీరుస్తాడని మరియు నీతి గెలుస్తుందని బైబిలు బోధించుచున్నది.

1. దావీదు హృదయముయొక్క స్తుతి మరియు సంతోషము – వ. 1–2
2. దుష్టులను దేవుడు శిక్షించుట – వ. 3–6ఎ
3. స్మరణకు రాని దుష్టుల స్థలములు – వ. 6బి
4. యీ లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుని సిద్ధపాటు – వ. 7–8

దుష్టులపై దేవుని ఆఖరి విజయమునుబట్టి ఆయనను స్తుతించుటద్వారా మనము ఆయన యందు నెమ్మది పొందుదుము.

**ధ్యాన వచనము 1 :** *నా పూర్ణ హృదయముతో నేను యెహోవాను స్తుతించెదను. యెహోవా, నీ అద్భుత కార్యములన్నింటిని నేను వివరించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు సమస్తమును జయించెదవు. నాకు విజయమునిచ్చు దేవుడవు నీవే.*

యీ కొన్ని వచనములలో మన హృదయములకు ఎంతో ఆదరణ, ప్రోత్సాహము కలుగుచున్నవి. ప్రభువు మనలను ఎడబాయలేదు గానీ ఆయన మనకు ఆశ్రయ దుర్గముగా ఉన్నాడు. తన పరిస్థితినిబట్టి తనను జ్ఞాపకము చేసుకొనమని దేవుని కృప కొరకు దావీదు మొఱ పెట్టుకుంటున్నాడు. యిట్లు మొఱ పెట్టు కొనుటలో *"దేవుని కీర్తి అంతటిని ప్రసిద్ధి చేయవలెనన్న"* ఉద్దేశ్యమును దావీదు కలిగియున్నాడు. నీవు దేవునికి మొఱపెట్టి, ఆయన ముఖదర్శనము చేసుకొనునపుడు యిట్టి ఉద్దేశ్యము కలిగియున్నావా? ప్రభువా, మా ప్రార్థనల ద్వారా నీవేమి కోరుకుంటున్నావో గ్రహించుటకు మాకు సహాయము చేయుము.

1. ఆపత్కాలములో మన ఆశ్రయదుర్గము -వ. 9
2. మనలను విడిచిపెట్టని దేవుడే మన ఆధారము -వ. 10
3. మన మొఱలను ఎన్నడూ మరువని దేవుని పట్ల మన ప్రతిస్పందన -వ. 11-12
4. దేవుని కృపకొరకు మనము మొఱపెట్టుటకు గల కారణము -వ. 13-14

నిన్ను ఎన్నడును ఎడబాయకుండా, మరువకుండా ఉన్నందుకు యీ దినమున ప్రభువుకు వందనములు చెల్లించుము. ఆయన నీ మొఱను ఆలకించును. నీకు కావలసిన అవసరముల గురించి సమస్తమును ఆయనకు తెలియును.

**ధ్యాన వచనము 10 :** *యెహోవా, నిన్ను ఆశ్రయించు వారిని నీవు విడిచిపెట్టువాడవు కావు. కావున నీ నామమెరిగిన వారు నిన్ను నమ్ముకొందురు.*

**ప్రార్థన:** *నీవు ఎల్లప్పుడు ఉన్న దేవుడవనియు, నీ ప్రేమయందును మరియు నీ ఉద్దేశ్యముల యందును దాగియుండగలనని నేను ఎల్లప్పుడు యెరుగుదును.*

అవును, మనము దేనిని విత్తెదమో, అదే పంటను కోయుదుము. దుష్టులు ఒకానొక రోజు తాము త్రవ్విన గుంటలో తామే పడిపోవుదురు. దేవుని లక్ష్యపెట్టకూడదని నిర్ణయించుకున్న జనులందరు "పాతాళమునకు దిగిపోవుదురు".

శుభవర్తమాన మేమనగా దేవుడు 'దరిద్రులను' మరియు 'బాధపరచబడువారిని' ఎన్నడూ మరువడు. ప్రస్తుతము పరిస్థితులు అన్యాయముగా కనిపించవచ్చును. అయితే, న్యాయవంతుడైన దేవుడు ఒకానొక రోజు సమస్తమును సరిచేయును.

1. అన్యజనులు ఎదుర్కొను పర్యవసానము – వ.15–17
2. దరిద్రులపట్ల దేవునికున్న కరుణ, జాలి – వ.18
3. ప్రభువు తాను దేవుడని, అన్యజనులు ఒట్టి మనుష్యమాత్రులని రుజువుచేయమని దేవునికి పిలుపు – వ.19–20.

మన నమ్మిక యీ లోకములోని జనులయందుకాదు గాని, ప్రభువు నందు మాత్రమే కలిగియుందుము. యీ లోక నాయకులు వట్టి "మనుష్యులు మాత్రమే".

**ధ్యాన వచనము 20:** *యెహోవా, వారిని భయపెట్టుము. తాము నరమాత్రులమని జనులు తెలిసికొందురు గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ ప్రపంచములో నాయకులుగా వున్నవారు ఎటువంటివారైయున్నదీ మరియు వారు చేయునదీ నేను చూచినపుడు, వారందరినీ నీ వశములో నీవు కలిగియున్నావు గనుక నీకు వందనములు.*

ఒక్కొక్కసారి దేవుడు లేడని మనకు అనిపిస్తుంది. కానీ దేవుడు ఎక్కడికీ వెళ్లిపోలేదు గాని యీ లోకములోని సమస్తమును చూచుచున్నాడు. దుష్టులు తమ దుష్టత్వముతో కూడిన ప్రణాళికలను జరిగించకుండా ఎవరూ వారిని ఆపలేరని అనుకొందురు. కానీ దేవుడు వారు చేసేదంతా చూస్తున్నాడు. ఒకానొక దినమున వారికి రావలసిన ప్రతిఫలము వారికిచ్చి, సమస్తమును సరిచేయు దేవుడుగా వున్నాడు. దావీదు తనచుట్టు వున్న దుష్టత్వమునుబట్టి తన పూర్ణవిశ్వాసమును తన ఆశ్రయదుర్గమును, యీ లోకమునకు తీర్పుతీర్చువాడును అయిన ప్రభువునందు మాత్రమే కలిగియున్నాడు. దావీదు కీర్తనలన్నిటిలో యిది స్థిరమైన సారాంశముగా వున్నది. దేవుడు యీ లోకమునకు తీర్పుతీర్చునన్న మాట మనము ఖచ్చితముగా నమ్మదగిన సత్యమైయున్నది.

1. ఆపత్కాలములో దేవుడు దూరముగా వుండుట – వ. 1
2. దుష్టుల మనోభిలాష మరియు వారి మోసక్రియలు– వ. 2–3
3. దుష్టుల తప్పుడు ఆలోచనలు – వ. 4
4. దుష్టుల భ్రమ – వ. 5–6

దుష్టుల గర్వము మరియు అహంకారములను దేవుడు చూచుటలేదని యెప్పుడూ అనుకొనవద్దు. దుష్టుల దుష్టత్వమంతటినీ దేవుడు చూస్తూనే వున్నాడు. వారికి ఒకానొక రోజు తీర్పు తీర్చబోతున్నాడు.

**ధ్యాన వచనము 4:** *దుష్టులు పొగరెక్కి, యెహోవా విచారణ చేయడనుకొందురు. దేవుడు లేడని వారెల్లప్పుడు యోచించుదురు.*

**ప్రార్థన:** *నా ప్రభువా, నీవు నీతిగల న్యాయాధిపతివనియు, ఎవరు కూడా తాము చేసిన దానినుండి తప్పించుకొనలేరనియు నేను యెరుగుదును.*

యీ వచనములు అవిశ్వాసముతో కూడిన హృదయముయొక్క పనులను గూర్చి, వైఖరిని గూర్చి వివరముగా వర్ణిస్తున్నవి. పదకొండవ వచనములో "ఆయన విముఖుడై యెప్పుడును చూడకుండును" అని వ్రాయబడిన ప్రకారము దేవుడు దుష్టత్వమును గురించి యేమియు చేయడని దుష్టుడు నమ్ముతాడు. అయితే, హెబ్రీ 4:13లో, "ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క అప్పజెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది" అని గుర్తు చేయబడుచున్నాము. దావీదు "యెహోవా లెమ్ము" అని దేవుని ప్రార్థిస్తున్నాడు. దేవుడు నీతిమంతులను మరియు హృదయమందు "దీనులైన" వారిని ఎన్నడూ మరచిపోడు.

1. దుష్టుల నోరు - వ.7
2. నిరపరాధుల హత్య - వ.8
3. బాధపడువారిని పట్టుకొనుటకు దుష్టులు వాడే పద్ధతులు– వ.9–10
4. దుష్టులు తర్కించే రీతి - వ.11
5. దేవునికి దావీదు విన్నవించు సందేశము - వ.12

"బాధపరచబడువారిని" యెన్నడూ మరువని దేవుని మీద మన విశ్వాసము ఆధారపడి యున్నది.

**ధ్యాన వచనము 12 :** *యెహోవా లెమ్ము, దేవా బాధపడువారిని మరువక నీ చెయ్యి యెత్తుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు దీనుల పక్షమున వ్యాజ్యెమాడు దేవుడవు మరియు నీ ప్రజలను ఎన్నడూ మరువని దేవుడవు గనుక నీకు వందనములు.*

తన చుట్టువున్న దుష్టత్వము మరియు దేవుడు వాగ్దానము చేసిన న్యాయము - యీ రెండు దావీదును నిత్యము కలవరపెట్టు అంశములుగా వున్నాయి. పరిస్థితులు చాలాసార్లు "చేయిదాటి పోయినట్లుగా" కనిపించును. కానీ దేవుడు యీ లోకములో తాను జరిగించుచున్న కార్యమును వదలి వెళ్లిపోలేదుగానీ సమస్తమును ఒక గొప్పమహిమతో కూడిన ముగింపునకు తీసుకువస్తున్నాడు. "యెహోవా నిరంతరము రాజైయున్నాడు".

1. దుష్టులు కలిగియుండు అభిప్రాయము– వ. 13
2. దేవుడు దుష్టులను చూచుచున్నాడు - వ. 14
3. దుష్టులను యెదుర్కొనమని దేవునికి మొఱపెట్టబడుట– వ. 15
4. బాధపరచబడువారి మరియు నలిగినవారి మొఱను ఆలకించే దేవుని విజయము - వ. 16–18

యీ లోకము అన్యాయముతో నిండియున్నది. బాధపరచబడువారు మరియు తండ్రిలేని వారు దుష్టుల చేతులలో ఎంతో శ్రమనొందుదురు. అయితే, ఒకానొక రోజు తప్పులన్నియు సరిచేయబడును. రాజు వస్తున్నాడు. దేవునికి స్తోత్రములు.

**ధ్యాన వచనము 16:** *యెహోవా నిరంతరము రాజైయున్నాడు. ఆయన దేశములోనుండి అన్యజనులు నశించిపోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, పరిస్థితులు సరిగా లేనప్పుడు మరియు దుష్టత్వము ప్రబలినపుడు నిన్ను నమ్ముకొనుటలో నాకు సహాయము చేయుము.*

"యెహోవా శరణుజొచ్చియున్నాను" అన్న అద్భుతమైన మాటలతో యీ కీర్తన మొదలగుచున్నది. దుష్టత్వముతో కూడిన యీ లోకమును ఎదుర్కొనుటకు యిదొక్కటే మార్గము. "పునాదులు పాడై పోయినపుడు" మనము నిస్సహాయులముగా వుందుమని మూడవ వచనములో గుర్తుచేయబడుచున్నాము. దుష్టులు యేమి చేసినను, "నీతి"ని ప్రేమించి, దేవుని యందు మాత్రమే యెల్లప్పుడు "నమ్మిక" కలిగియుండుట మన బాధ్యతగా వున్నది.

1. దుష్టులు చేయుదాని నుండి దాగియుండుటకు ప్రయత్నించవలెనన్న తప్పుడు ఆలోచన - వ. 1-2
2. పునాదులు ప్రాముఖ్యమైనవి - వ. 3
3. దేవుని సార్వభౌమత్వమును గూర్చిన సత్యము - వ. 4
4. దుష్టుల మీదికి రాబోవు దేవుని తీర్పు - వ. 5-6
5. యథార్థహృదయుల తట్టున్న దేవుని ముఖము- వ. 7

దేవుడు యిప్పటికిని తన సింహాసనము మీద వున్నాడన్న సత్యమును యెన్నడును మరువవద్దు. మానవుని జీవిత సంఘటనలను ఆయన చూస్తూ, వూరకే వుండువాడు కాడు. ఆయన తీర్పు దినము రాబోవుచున్నది. మనము ఆయనయందు నమ్మిక వుంచవలెను.

**ధ్యాన వచనము 4 :** *యెహోవా తన పరిశుద్ధ ఆలయములో వున్నాడు. యెహోవా సింహాసనము ఆకాశమందున్నది. ఆయన నరులను కన్నులార చూచుచున్నాడు. తన కనుదృష్టి చేత ఆయన వారిని పరిశీలించుచున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, లోకములో జరుగుతున్న సమస్తమును నీవు చూచుచున్నావు గనుక నీకు వందనములు. ప్రతి సంగతిని నీవు నీతివంతముగాను, న్యాయవంతముగాను సంబాళించు దేవుడవు.*

యీ కీర్తన ప్రారంభములో వ్రాయబడిన దావీదు మాటలు మనము ప్రార్థనలో దేవుని సన్నిధి యెలా సమీపించాలన్న విషయమును గురించి తెలియజేయుచున్నవి. యీ మాటలు సాధారణమైనవి గాని అదే సమయములో గంభీరమైనవి: "యెహోవా, నన్ను రక్షింపుము". దేవుని సహాయము కొరకు మనము పెట్టే మొఱలనుబట్టి ఆయన ఎన్నడూ అలసిపోడు. దావీదు, మనలో అనేకులము ప్రస్తుత దినములలో గమనించినట్లు, తన దినములలో ప్రజలు దైవభక్తి మరియు విస్వసనీయత చాలా తక్కువగా కలిగియుండుటను చూశాడు. అయితే, "యెహోవా మాటలను" మనము నమ్ముకొనవచ్చును. దేవునియందు సంపూర్ణ విశ్వాసము కలిగి, మన చుట్టువున్న దుష్టత్వమును ఎదిరించుటకైన అవసరమువైపు దేవుడు మన కన్నులను, మన హృదయములను తెరచునుగాక.

1. సహాయముకొరకు మొఱపెట్టుట - వ. 1
2. అపనమ్మకస్థుల ప్రవర్తన - వ. 2
3. అపనమ్మకస్థులు ఎదుర్కొనే పర్యవసానము - వ. 3-4
4. దేవుని ప్రతిస్పందననుబట్టి కలిగిన ఆదరణ - వ. 5
5. దేవునివాక్యమందు మనముంచుకొనగల నమ్మకము- వ. 6-7
6. దుష్టుల అహంకారము - వ. 8

దుష్టులు మరియు అపనమ్మకస్థులు యేమి చేసినను, వారు ఏలాగు తీర్పును తప్పించుకొని, విజయవంతులైనట్లుగా కనిపించినను, దేవుని మాటలు వారిపట్ల ఖచ్చితముగా నెరవేరునని నమ్ముటలో మనము పొరబడకూడదు.

**ధ్యాన వచనము 6:** *యెహోవా మాటలు పవిత్రమైనవి. అవి మట్టిమూసలో ఏడు మారులు కరిగి ఊదిన వెండియంత పవిత్రములు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీ సహాయము కొరకు ఎన్నిసార్లు మొఱపెట్టినను అలయక నాకు జవాబిచ్చే దేవుడవు గనుక నీకు వందనములు.*

దేవుని ప్రశ్నించి, ఆయన మనలను మరచిపోయాడని అనుకోవడం చాలా సులభము. ఆయన యితరుల జీవితములు, వారి పరిస్థితులతో అధికముగా పనిగలిగి, మనలను మరచిపోయాడని మనము అనేకసార్లు సందేహిస్తాము. అయితే, దేవుడు ఎన్నడూ మరచిపోడు. దేవుడు మన సమస్యలలో కలిగించుకొని, వాటిని పరిష్కరిస్తాడా అన్న సందేహము మనకు నిజంగా కలిగిన సందర్భములు మన జీవితములలో వున్నాయి. పరిష్కరించబడని సమస్యలు మరియు కష్టతరమైన మనుష్యులనుండి మనము పొందే బాధనుబట్టి దేవుడు ఎక్కడ వున్నాడు, యీ సమస్యలను పరిష్కరించుటకు యేమిచేస్తున్నాడు అని మనము ఆలోచిస్తుంటాము. అయితే వదలివేయకుము, వెనుకకుతిరగకుము. ఆయన యందు విశ్వాసముంచి, ఆయనను కీర్తించుము. ఎందుకు? ఎందుకనగా "యెహోవా నాకు మహోపకారములు చేసియున్నాడు"

1. మన హృదయములకు కొన్ని సమయములలో కలిగే నొప్పి- వ. 1-2
2. దేవునియొద్ద మనము చేయవలసిన ప్రార్థన - వ. 3-4
3. మనము దేవునికి చెల్లించవలసిన స్తుతి - వ. 5

ఆయన "కృప" నమ్మదగినది మరియు ఆయన "రక్షణ" నీ హృదయమును హర్షింపజేయును.

**ధ్యాన వచనము 5 ఎ :** *నేనైతే నీ కృపయందు నమ్మికయుంచి యున్నాను. నీ రక్షణ విషయమై నా హృదయము హర్షించుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నన్ను ఒక్క క్షణము కూడా మరచిపోని దేవుడవుగావున్న నిన్ను స్తుతించెదను.*

మానవులను దేవుడు ఏ దృక్పథంతో చూస్తాడనే విషయమును అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమైంది. ఆయన దృష్టిలో నీతిమంతుడు ఒక్కడును లేడు. మేలుచేయువాడు ఒక్కడును లేడు (రోమా 3:10-12). మనకందరికీ రక్షకుడు అవసరము. కీర్తనాకారుడు దేవుని ప్రజల "రక్షణ" కొరకు విన్నవించుకుంటున్నాడు మరియు దానినిబట్టి ఆనందిస్తున్నాడు.

1. ప్రజల హృదయములలో వున్న తప్పుడు అభిప్రాయము- వ.1 ఎ
2. దేవుని దృష్టిలో వారి జీవితముల పరిస్థితి - వ.1బి -4
3. నీతిమంతులకు కలుగు ఆదరణ- వ.5-6
4. రక్షణ కొరకు మొఱపెట్టుట - వ.7

దుష్టులు యెలా ప్రతిస్పందించినప్పటికీ, విశ్వాసి జీవితములో దేవుని సన్నిధి (వ.5) మరియు ఆయన మనకు "*ఆశ్రయమై*"యున్నాడను సత్యము (వ.6బి) మనకందరికీ ఎంతో ప్రోత్సాహకరంగా వున్నాయి. మనము లోకములో చూచుచున్న దుష్టత్వమంతటికీ భిన్నంగా ఒకానొకరోజు "*యాకోబు హర్షించును. ఇశ్రాయేలు సంతోషించును*". ఎందుకు? ఎందుకనగా మెస్సీయ, మన ప్రభువు, రక్షకుడైన యేసుక్రీస్తు యీ లోకములోనికి వచ్చి, నీతియుక్తమైన తన రాజ్యమును యీ భూమి మీద నెలకొల్పబోవుచున్నాడు. దేవునికి స్తోత్రము.

**ధ్యాన వచనము 7:** *సీయోనులో నుండి ఇశ్రాయేలునకు రక్షణ కలుగును గాక. యెహోవా చెరలోని తన ప్రజలను రప్పించునప్పుడు యాకోబు హర్షించును. ఇశ్రాయేలు సంతోషించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా నీవు భవిష్యత్తులో నెరవేర్చబోయే వాగ్దానములనుబట్టి నిన్ను నేను ఎంతో స్తుతించెదను.*

యీ కీర్తన ఒక నీతిమంతుని గురించి ఎంతో చక్కగా వర్ణిస్తున్నది. దావీదు పై కీర్తనలోని రెండవ వచనములో నీతి మంతునికి వుండవలసిన మూడు గుణములను గురించి తెలియజేయుచున్నాడు. అదే సమయములో, మిగిలిన వచనములలో దేవుని ప్రేమించి, ఆయనతో నడుచు వారి జీవితములలో 'ఉండకూడని' ఎనిమిది లక్షణములను గురించి కూడా తెలియజేయుచున్నాడు. వాటిని జాగ్రత్తగా ధ్యానించుడి. అట్టి లక్షణములు మన జీవితములలో కనబడుచున్నాయా? యితరులు మన గురించి యెటువంటి సాక్ష్యము పలుకుచున్నారు? ప్రభువుతో నడుచు నీతిమంతుని జీవితములో గర్వము, కొండెములు చెప్పుట, దురాశ, ద్వేషము మొదలగు వాటికి తావులేదు.

1. దేవుని సన్నిధిలో నివసించుట- వ. 1
2. నీతిమంతులకున్న నిశ్చయత - వ. 2
3. మన క్రైస్తవ తీర్మానమును రుజువు చేయు మన కార్యములు- వ. 3-5 ఎ
4. మొదటి వచనములో అడుగబడిన ప్రశ్నకు జవాబు - వ. 5 బి

మనకందరికీ అవసరమైన స్థిరత్వము గురించి ఒక నీతిమంతుని జీవనశైలి యొక్క వర్ణనద్వారా యీ కీర్తనలో తెలుపబడినది. యిటువంటి జీవనశైలి మనము కలిగియుండిన యెడల మనము "ఎన్నడును కదల్చబడమని" తెలుసుకొందుము.

**ధ్యాన వచనము 2:** *యథార్థమైన ప్రవర్తన కలిగి, నీతిననుసరించుచు, హృదయపూర్వకముగా నిజము పలుకువాడే.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ మార్గములయందు నడుచుచూ, ఎల్లప్పుడు సత్యమును మాట్లాడునట్లు నాకు సహాయము చేయుము.*

దేవుడు మనతో ఎలా వ్యవహరిస్తున్నాడన్నది మనము ఆయనయందు ఎంత వరకు విశ్వసించుచున్నామన్న సత్యముమీద ఎంతో ఆధారపడివుంటుంది. విశ్వాసముతో నడుచుకొంటూ, దేవునిపట్ల విధేయత కలిగిన "నీతిమంతులకు" దేవుని కాపుదల, మంచితనము, ఆశీర్వాదములు మొదలైనవి తోడైయుండును. దేవుడు తన దాసులయందు ఆనందించి, వారి మంచిని, వారిమీద ఆశీర్వాదమును కోరుకుంటున్నాడు.

1. దేవుని కాపుదల కొరకై ప్రార్థన - వ. 1
2. దేవుని మంచితనము బయలుపరచబడుట - వ. 2-3
3. యెహోవాను వదలిన వారికి వచ్చు సమస్యలు - వ. 4
4. యథార్థవంతుని హృదయములో దేవునికున్న స్థలము- వ. 5
5. దేవుడు కలుగజేయు సంతోషము - వ. 6

*"యెహోవా నా స్వాస్థ్యభాగము, నా పానీయ భాగమని"* దావీదు చెప్పియున్నాడు. యీ మాట ఒకని జీవితములో తాను దేవునికివ్వవలసిన కేంద్రస్థానము మరియు ప్రాధాన్యతలను గూర్చి ఎంతో చక్కగా తెలియజేయుచున్నది. అటువంటి అనుభవము నీవు కలిగియున్నావా?

**ధ్యాన వచనము 1 :** *దేవా, నీ శరణుజొచ్చియున్నాను. నన్ను కాపాడుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవే నా జీవితము. నాకు కావలసిన మరియు నేను ఆశపడు దేవుడవు. భవిష్యత్తులో జరుగబోవు ప్రతి విషయమందును నేను నిన్ను నమ్ముకొందును.*

యీ వాక్య భాగమును పేతురు పెంతెకొస్తు దినమందు తన సందేశములో ప్రస్తావించాడు (అపొ.కా. 2:25–28). అంతేగాక, పదవ వచనములో వున్న "పరిశుద్ధుడు" అనుమాట దావీదును కాదుగానీ, మెస్సీయను (ప్రభువైన యేసుక్రీస్తును) సూచిస్తున్నదని వివరించాడు. యీ మాట యేసుక్రీస్తుయొక్క పునరుత్థానమును గురించి తెలియజేస్తూ, మనకు కూడా సమాధిని దాటి, మరణము తరువాత నిత్యజీవమును గూర్చిన నిరీక్షణ వున్నదన్న సత్యమును గుర్తు చేయుచున్నది. యేసుక్రీస్తు సజీవుడై లేచాడు గనుక ఆయనయందు విశ్వాసముంచు వారందరూ కూడా సజీవులై లేచెదరు. దేవునికి స్తోత్రము.

1. దేవుని ఆలోచనయొక్క ప్రాధాన్యత– వ.7
2. మన హృదయములలో ప్రభువుకున్న స్థానము – వ.8
3. సమాధిని దాటి మనకున్న నిరీక్షణ వలన కలుగు సమాధానము– వ.9–10
4. రాబోవు సంతోషమును గూర్చిన వాగ్దానము – వ.11

ప్రస్తుత జీవితములో వున్న 'స్థిరత్వము' దేవుని వాగ్దానములయందు మనకున్న నిరీక్షణతో ముడిపడియున్నది. మరణము మనలను దేవుని సన్నిధిలోనికి కొనిపోవును. *"దేహమును విడిచిపెట్టుట"* అనగా *"ప్రభువుయొద్ద నివసించడమేనని"* పౌలు తెలిపాడు. మనకున్న అస్థిర, అనిశ్చయ పరిస్థితులలో భవిష్యత్తులో మనము పొందబోవు సంతోషము మన ప్రస్తుత జీవితకాలమును నింపి, మనకు స్థిరత్వము కలుగజేయును గాక!

**ధ్యాన వచనము 8 :** *సదాకాలము యెహోవాయందు నాగురి నిలుపుచున్నాను. ఆయన నా కుడిపార్శ్వమందు ఉన్నాడు గనుక నేను కదల్చబడను.*

**ప్రార్థన:** *ప్రభువా, మరణించిన తరువాత సమాధిని దాటి మాకిచ్చిన నిరీక్షణనుబట్టి నీకు వందనములు. నీతో నివసించునపుడు నిత్యము పరిపూర్ణమైన సంతోషము కలుగును.*

యీ వాక్య భాగములో దావీదు తనను ఓడించుటకు దుష్టులుచేయు ప్రయత్నమును గూర్చి ఆలోచన కలిగిన వాడై, తన నమ్మికను, తీర్మానమును ప్రభువునకు వ్యక్తపరుస్తున్నాడు. దేవునికి నమ్మకముగా వుండాలనే తన ఆశను సన్మానించి, తాను పడిపోకుండా కాపాడుమని ప్రభువును అడుగుచున్నాడు. కీర్తనల గ్రంథము నుండి మనము నేర్చుకొనే గొప్ప పాఠములలో ఒకటి యేమనగా ప్రతి రోజు ప్రభువు పైన సంపూర్ణముగా ఆధారపడి జీవించవలసిన వారముగా మనమున్నామని తెలుసుకొనుట.

1. దావీదు దేవునికి చేయు ప్రార్థన - వ. 1–3ఎ
2. దేవునియెదుట దావీదుకున్న ఉద్దేశ్యము - వ. 3 బి
3. దావీదు తప్పించుకున్న మార్గము - వ. 4
4. దేవునియొద్దనుండి దావీదు కోరుకున్న కాపుదల- వ. 5–7

జీవితము ఎన్నో అపాయములు మరియు ఉరులతో కూడియున్నది. మనము చాలా సులభముగా పడిపోయి, ప్రభువునందు విశ్వాసముంచుటలో విఫలమైపోగలము. మనలో వున్న గర్వము మన జీవిత సమస్యలను మనకై మనమే పరిష్కరించుకొనగలమని నమ్మునట్లు చేస్తుంది. అయితే, యిది నిజము కాదు. *"తన శరణుజొచ్చిన వారిని"* కాపాడుతానని దేవుడు వాగ్దానమిచ్చాడు (వ. 7).

**ధ్యాన వచనము 5 :** *నీ మార్గములయందు నా నడకలను స్థిరపరచుకొనియున్నాను. నాకు కాలు జారలేదు.*

**ప్రార్థన:** *నీవు నన్ను శోధించి, నీ పట్ల నాకున్న తీర్మానమును నీవు పరీక్షించినపుడు, అది నా మేలు కొరకు మరియు నీ మహిమ కొరకు చేయుదువని నేను యెరుగుదును.*

ఒక విశ్వాసి దేవుని యెదుట కలిగియున్న స్థానమును “కనుపాప” అను పదము ఎంతో చక్కని రీతిలో వర్ణించుచున్నది. దేవుని ప్రణాళికల నుండి ఎన్నడు కూడా తాను దూరముకాకుండా చేయుమని దావీదు దేవునికి మొఱపెట్టుకుంటున్నాడు. “నీ రెక్కల నీడక్రింద నన్ను దాచుము” అను ప్రార్థన చేయుటలో ఆయన దేవున్ని గొప్ప ఆశ్రయముగా, సమాధానముగా కనుగొన్నాడు.

1. దేవుని కాపుదలకొరకు దావీదు ప్రార్థన– వ. 8
2. దావీదు శత్రువుల వర్ణన– వ. 9–12
3. దేవునియొద్దనుండి దావీదుకు అవసరమైన విమోచన– వ. 13–14
4. దావీదు దేవునిపైన ఆధారపడుట – వ. 15

దావీదు తన శతృవుల గురించి తెలిపిన వర్ణన యెంతో స్పష్టమైనదై, ఆ శత్రువులు తన మనస్సులో, హృదయములో ఎంత గొప్పగా తనకు అగుపించారన్న సత్యమును తెలియజేయుచున్నది. లోకస్తులనుండి మనకు ఎదిరింపులు వచ్చినప్పుడు మనము దానిని ఎదుర్కోవడం కష్టంగానే ఉంటుంది. అయితే, మరొకసారి, మన నమ్మిక ప్రభువునందు, ఆయన కాపుదల మరియు విమోచనయందు వుండవలెనని తెలుసుకొంటున్నాము.

**ధ్యాన వచనము 8-9:** *ఒకడు తన కనుపాపను కాపాడుకొనునట్లు నన్ను కాపాడుము..... నీ రెక్కల నీడక్రింద నన్ను దాచుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములోని అన్ని విషయములలో నన్ను కాయుచు, నీ భద్రత నాకు తోడుగా వుంచినందుకు నీకు వందనములు.*

దేవుడు దావీదును ఏన్గెదీ అరణ్యములో సౌలు చేతిలో నుండి తప్పించినపుడు, దేవుడు తనకు కలుగజేసిన విమోచన మరియు కాపుదలనుబట్టి ఎంతో ఆనందించినవాడై దావీదు యీ స్తుతి కీర్తనను రచించాడు.

1. దేవునియెడల ప్రేమతో కూడిన దావీదు ప్రతిస్పందన – వ. 1
2. తనను విమోచించిన దేవుని గుణములను దావీదు గుర్తించుట – వ. 2
3. దేవునికి మొఱపెట్టే అవసరత గురించి దావీదు మరల తెలియజేయుట – వ. 3
4. తనకు కలిగిన శ్రమను దావీదు జ్ఞాపకము చేసుకొనుట– వ. 4–5
5. తన మొఱను దేవుడు ఎలా ఆలకించినది దావీదు జ్ఞాపకము చేసుకొనుట – వ. 6

కీర్తనల గ్రంథములో మనము చేయు ప్రశస్తమైన అధ్యయనములలో ఒకటి యేమనగా దావీదు దేవుని హెచ్చించి, ఆయన గుణగణములను వర్ణించి, వాటిని బట్టి నిరంతరము దేవుని స్తుతించుట. ఏన్గెదీ అరణ్యములోని అందమైన సరస్సువద్ద దేవుని కాపుదల మరియు ఆయన బలమును గురించి దావీదు ఎన్నో ఉదాహరణలను కనుగొన్నాడు.

**ధ్యాన వచనము 2:** *యెహోవా నా శైలము, నా కోట, నన్ను రక్షించువాడు. నా కేడెము, నా రక్షణ శృంగము, నా ఉన్నత దుర్గము, నా దేవుడు. నేను ఆశ్రయించియున్న నా దుర్గము.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు కావలసినదంతా నీ ఆశ్రయదుర్గము మరియు నీ బలము. నీ రక్షణ కొరకు మరియు నీ కాపుదలకొరకు నేను నిన్ను స్తుతించెదను.*

దేవుని గొప్ప బలమును బట్టి యీ వాక్యభాగములో దావీదు ఆయనను ఎలుగెత్తి స్తుతించుచున్నాడు. సమస్తమును సృష్టించుటకును, వాతావరణమును అదుపు చేయుటకును మరియు తనను రక్షించుటకును దేవునికున్న సామర్థ్యతను దావీదు తన సొంత మాటలలో వివరిస్తున్నాడు. మన చుట్టువున్న సంగతులను చూచుటలో అనేకసార్లు మనము మందబుద్ధి కలిగియుందుము. సమస్తమును చేయగల దేవుని దృష్టితో కాకుండా మన సొంత దృష్టితో వాటిని మనము చూస్తుంటాము. మన కష్టములు మరియు సమస్యలు దేవుని అధీనములో వున్నాయని మనము జ్ఞాపకముంచుకొన్నట్లయితే అవి మనకు చాలా చిన్నవిగా అగుపడును.

1. దేవుని బలము - వ.7-15
2. తన దాసులపట్ల దేవుని కాపుదల - వ.16-17

తన శత్రువుల నుండి తనకు దేవుడు కలుగజేసిన గొప్ప విమోచనను గూర్చి దావీదు ధ్యానించినపుడు, దేవుని ఉన్నతమైన మరియు ఆశ్చర్యకరమైన బలమును గూర్చిన చక్కని వర్ణనలు దావీదు హృదయమునకు గొప్ప సంతోషమును కలుగజేసినవి. తన శత్రువులు *"తన కంటె బలిష్ఠులని"* (వ.17ఎ) కూడా దావీదు గుర్తించాడు. అందుకే దేవునియందు నమ్మిక కలిగియున్నాడు.

**ధ్యాన వచనము 17:** *బలవంతులగు పగవారు, నన్ను ద్వేషించువారు నాకంటె బలిష్ఠులైయుండగా, వారి వశమునుండి ఆయన నన్ను రక్షించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు బలవంతుడైన దేవుడవు మరియు విమోచకుడవైన దేవుడవని యెరిగియున్నప్పుడు నేను దేనికిని భయపడవలసిన అవసరములేదు.*

యీ వాక్య భాగములోని మొదటి వచనములో తాను పొందిన దేవుని విమోచన మరియు కాపుదలను బట్టి దావీదు దేవుని స్తుతించుట కొనసాగించాడు. "యెహోవా నన్ను ఆదుకొనెను" అను చక్కటి మాటలు దావీదు తన స్తుతిలో వాడెను. "ఆదుకొనెను" అను పదము మనకు వ్యతిరేకముగా పరిస్థితులు మన చుట్టూ పనిచేయుచున్నప్పుడు మనలను కదలకుండా, స్థిరంగా వుంచు దేవుని "ఆసరా" (ఆదరువు లేదా సహాయము) ను గుర్తుచేయుచున్నది. ప్రభువు మనకెంతో అవసరమై యున్నాడు.

1. దావీదు విమోచనకు గల కారణము- వ. 18-19
2. దేవుడిచ్చు ప్రతిఫలము - వ. 20
3. దావీదు నీతియుక్తమైన ప్రవర్తన - వ. 21-23

దేవుని ఆశ్చర్యకరమైన విమోచనను అనుభవించుటకు దైవికమైన జీవనశైలి కలిగియుండుట ఎంతో ప్రాముఖ్యమైనదని దావీదు వక్కాణించుచున్నాడు. "యెహోవా మార్గములను నేను అనుసరించుచున్నాను. *భక్తిహీనుడనై* నేను నా దేవుని విడచినవాడను కాను" (వ. 21) అని దావీదు పలుకుచున్నాడు. నీ హృదయము విషయములో యీ మాటలు నిజమేనా? యిట్టి సాక్ష్యము నీవు కలిగియున్నావా? దావీదు "దోషక్రియలు నేను చేయనొల్లకుంటిని" (వ. 23ఎ) అని కూడా తెలుపుచున్నాడు. మన హృదయములలో వుండు పాపమే మనకు సమస్యగా వున్నది.

**ధ్యాన వచనము 19 :** *విశాలమైన స్థలమునకు ఆయన నన్ను తోడుకొని వచ్చెను. నేను ఆయనకు ఇష్టుడను గనుక ఆయన నన్ను తప్పించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను మునిగిపోయి, శత్రువు ఎదిరింపులు ఎదుర్కొన్న సమయములలో నన్ను విమోచించి మరియు సంరక్షించినందుకు నీకు వందనములు.*

ప్రభువు మన నిర్దోషత్వము, దయ, యథార్థత మరియు సద్భావములనుబట్టి మనలను ఆశీర్వదించును (వ.24-26). *"గర్విష్ఠులకు విరోధివై, వారిని అణచివేసెదవు"* అని 27వ వచనము చివరి భాగములో వ్రాయబడిన మాటలు దేవుడు గర్వమును ఎంతగా ద్వేషించునో మనకు గుర్తు చేస్తున్నాయి. చీకటి సమయములలోను, కష్టములలోను దేవుడు మనకు తన కాపుదలను తోడుగా ఉంచి, మనలను నడిపించును -*"తన శరణు జొచ్చువారందరికీ ఆయన కేడెము"* (వ.30 బి).

1. దేవుడిచ్చు ప్రతిఫలము - వ.24
2. దేవుని ప్రతిఫలముల గుర్తింపు - వ.25-27
3. నీతిమంతులు అనుభవించు ఫలితములు - వ.28-29
4. దేవుడు మనకు మూలాధారము - వ.30
5. విశ్వసించు హృదయముయొక్క ప్రతిస్పందన - వ.31

దేవుని గురించి, ఆయన మార్గముల గురించి దావీదు చెప్పిన మాటలను యెరిగిన వారమై, దావీదుతో కలిసి *"యెహోవా తప్ప దేవుడేడి?"* (వ.31 బి) అని మనముకూడా చెప్పవలసిన వారమైయున్నాము. యెహోవా తప్ప వేరొక దేవుడు లేడు.

**ధ్యాన వచనము 31** : *యెహోవా తప్ప దేవుడేడి? మన దేవుడు తప్ప ఆశ్రయదుర్గమేది?*

**ప్రార్థన:** *ప్రభువా, నీ గొప్ప సన్నిధిలో నన్ను నేను తగ్గించుకొని నీయందు నా నమ్మికయుంచెదను.*

దావీదు తాను ఎదుర్కొనబోయే యుద్ధములలో విజయము కొరకు దేవునియందు తన విశ్వాసమును వ్యక్తపరుస్తున్నాడు. 32వ వచనములో దేవునియొద్ద నుండి తనకు అవరసమైన బలమును గురించి చెప్పాడు. తనను యుద్ధమునకు సిద్ధపరిచేది దేవుడే. తన శత్రువులను యుద్ధములో యెదుర్కొన్నప్పుడు దేవుడే తనకు సహాయకుడిగా వుండి, తనను సంరక్షిస్తాడు. యుద్ధములలో తాను పొందే విజయములు దేవుడు తనకు అనుగ్రహించిన మూలాధారములనుండే వచ్చుచున్నవని దావీదు అంగీకరిస్తున్నాడు. ఈ సూత్రమును మనము నేర్చుకొన్నామా?

1. దేవుని బలము - వ.32-35
2. దేవుడిచ్చు స్థిరత్వము - వ.36
3. మన శత్రువులను అణగ ద్రొక్కుట - వ.37-42

దావీదుకు తన శత్రువులపై దేవుడు అనుగ్రహించిన విజయముల గురించి తాను చెప్పిన చక్కటి మాటను 41వ వచనములో మనము చూడగలము - *"యెహోవాకు వారు మొఱపెట్టుదురుగాని ఆయన వారికుత్తరమియ్యకుండును."* యీ మాటలు దావీదు తన శత్రువుల గురించి చెప్పాడు. నీతిమంతుల మొఱ వినుటకు దేవుని చెవులు యెప్పటికి సిద్ధముగా వున్నాయి. అయితే, ఆయన జవాబివ్వకుండునట్లు మన పాపము మరియు మన దుష్టమార్గములు ఎప్పుడు అడ్డుకొంటున్నాయి.

**ధ్యాన వచనము 36** : *నా పాదములకు చోటు విశాలపరచితివి. నా చీలమండలు బెణకలేదు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు మొఱపెట్టినప్పుడు ఆలకించే దేవుడవైనందుకు నీకు వందనములు. నేను నా జీవితములో ఎదుర్కొనబోయే ప్రతి విషయములోను నాకు బలమునిచ్చే దేవుడవు గనుక నీకు వందనములు.*

యీ అధ్యాయములో దావీదు చివరి తలంపులు దేవుడు తనకు కలిగించిన విమోచనయందును, దేవుడు జరిగించిన దానినిబట్టి ఆయనకు స్తుతులు చెల్లించుటయందును కేంద్రీకృతమయినవి. దేవుడు మనకు జరిగించిన సమస్తమును బట్టి ఆయనకు చెల్లించాల్సిన స్తుతి ప్రతి దినము మన పెదవులమీద వుండవలెను. దేవుడు నిన్ను యే విషయాలలో విమోచించాడో ఆ విషయముల పట్టిక యెందుకు సిద్ధపరచుకోకూడదు?

1. దావీదుకు రాబోవు అధికారము - వ.43-45
2. దేవుని సన్నిధిని మరియు ఆయన ఔన్నత్యమును ప్రకటించుట - వ.46
3. దేవుడు కలిగించబోవు విమోచన - వ.47-50

దేవుడు కలుగజేసిన విమోచన దావీదును ఆనందింపజేసి, తాను దేవునికి వందనములు చెల్లించునట్లు చేసినది. *"అన్య జనుల మధ్య దేవుని ఘనపరచడమనునది"* నేటి దినములలోని విశ్వాసులకు చాలా అరుదు. మనలో కొంతమందిమి భోజనము చేయుటకు ముందు ఆ భోజనమును అనుగ్రహించిన దేవునికి తలవంచి, వందనములు చెల్లించవలెనన్న విషయమును కూడా మరచిపోయాము. దేవుడు తనకు గొప్ప కృపను కనుపరచి, గొప్ప విమోచనను కలుగజేశాడన్న విషయమును దావీదు బాగా యెరిగియుండెను.

**ధ్యాన వచనము 46**: *యెహోవా జీవముగల వాడు. నా ఆశ్రయ దుర్గమైనవాడు స్తోత్రార్హుడు. నా రక్షణకర్తయయిన దేవుడు బహుగా స్తుతినొందునుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో నీ విమోచన మరియు కాపుదలనుబట్టి నీకు వందనములు. నేను యెల్లప్పుడూ నీయందు నమ్మిక యెలా కలిగియుండాలన్నది గ్రహించుటకు నాకు సహాయము చేయుచున్నందుకు నీకు వందనములు.*

అపొస్తలుడైన పౌలు రోమా 1:20లో, "*ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని, సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు*" అని చెప్పియున్నాడు. దేవుడు సృష్టించిన యీ అద్భుతమైన ప్రపంచంలో ఆయన మహత్వము, శక్తి మరియు మహిమ కనబడుచున్నది. కొన్నిసార్లు మనము రాత్రివేళ నక్షత్రములవైపు కేవలము చూచి, కీర్తన 147:4,5 వచనములలో దావీదు వ్రాసిన మాటలను జ్ఞాపకము చేసికొనుట వలన మేలు పొందిన వారమౌదుము – "*నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించియున్నాడు. వాటికన్నిటికి పేర్లు పెట్టుచున్నాడు. మన ప్రభువు గొప్పవాడు. ఆయన అధికశక్తిగలవాడు. ఆయన జ్ఞానమునకు మితిలేదు.*"

1. దేవుని సృజనాత్మక శక్తియొక్క మహత్వము – వ. 1
2. దేవుని సృష్టి యిస్తున్న సందేశము – వ. 2–4 ఎ
3. సూర్యుని అద్భుతము – వ. 4 బి–6

దేవుని "మహిమ" దేవుడు ఎవరైయున్నాడు మరియు ఆయన యేమి చేయగలడు అను వాటిని గురించి తెలుపుతుంది. "మహిమ" అను పదము దేవుని లక్షణములను మరియు ఆయన సామర్థ్యములను చూపిస్తూ, అదే సమయములో పాపము, తిరుగుబాటు స్వభావముతో కూడిన మన నిజ స్వరూపమును గురించి తెలియజేస్తున్నది– "అందరును పాపము చేసి, దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23).

**ధ్యాన వచనము 1:** *ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది.*

**ప్రార్థన:** *నేను రాత్రివేళ నిర్మలమైన ఆకాశములో నీ గొప్ప హస్తము సృష్టించిన సృష్టిని చూచినపుడు, నా జీవిత సమస్యలను నీవు ఎంతో సులభముగా తీర్చగలవని నాకు అర్థమగుచున్నది.*

పై వచనములలో దేవుని వాక్యమును గురించి ఆరు రకములైన వర్ణన యివ్వబడింది. అంతేగాక అవి మన జీవితములకు ఎంత విలువైనవో తెలుపబడియున్నాము. యీ లోకములో దేవుని ఆదేశముల చేత కాకుండా మనకై మనమే మన జీవితములు జీవించవచ్చని ఎన్నడూ అనుకోకుందుముగాక! దేవుని వాక్యము ద్వారా మనము హెచ్చరించబడెదము, కడుగబడెదము మరియు కాపాడబడెదము. దేవుని వాక్యమును మనము ధ్యానించునప్పుడు మన మాటలు దేవునికి సంతోషకరమైనవిగా వుండును.

1. దేవుని వాక్యము కలుగజేయు ఫలితములు – వ. 7–9
2. దేవుని వాక్యమునకున్న విలువను గ్రహించుట – వ. 10
3. దేవుని వాక్యము వలన కలుగు బహుమానము – వ. 11
4. పరిశుద్ధతకొరకు మరియు దేవుని యెదుట అంగీకరింపబడుటకు విన్నపములు – వ. 12–14

మనము మన "పొరపాట్లను" కనుగొనలేమని, మరియు మనము "రహస్యముగా *జరిగించిన తప్పులు*", "*దురభిమాన పాపములు*" కలిగియున్నామని కీర్తనాకారుడు తెలుపుచున్నాడు. మన పెదవులమీదను, మన హృదయములలోను వుండు దేవుని వాక్యము మనకు అవసరమైన కడుగుదలను కలుగజేయును.

**ధ్యాన వచనము 14** : *యెహోవా, నా ఆశ్రయ దుర్గమా, నా విమోచకుడా, నా నోటి మాటలును, నాహృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగునుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మాట్లాడాలని కోరుకున్నది మాత్రమే మాట్లాడవలెనని మరియు నా హృదయముయొక్క ఉద్దేశ్యములు నిన్ను తృప్తి పరచేవిగా వుండాలని నేను ఆశపడుచున్నాను.*

మనము ప్రార్థించినప్పుడు దేవుడు మన మొఱలను వింటున్నాడన్న నిశ్చయత మనకందరికీ అవసరము. అయిదవ వచనములోని చివరి భాగము ప్రతి విశ్వాసి హృదయమునకు ఉండే గొప్ప నిరీక్షణ: *"నీ ప్రార్థనలన్నియు యెహోవా సఫలపరచును గాక"*. పై వాక్యభాగము దేవుని రక్షణ మరియు విమోచన కొరకైన ప్రార్థన మాత్రమేగాక మన తరపునుండి దీని కొరకు యేమి అవసరమైయున్నదో తెలియజేస్తున్నది. మనము దేవుని రక్షణను బట్టి *"ఆనందించాలి"*, ఆయన నామమును *"జ్ఞాపకముంచు కోవాలి"* మరియు ఆయన బలమునందు, ఆయన కాపుదలయందు *"విశ్వసించాలి"*.

1. దేవుడు ఆలకించి, కాపాడి, సహాయమునందించి, ఆయన సొంత ఆలోచన నెరవేర్చుట కొరకైన ప్రార్థన – వ. 1–4
2. దేవుని విశ్వసించు హృదయములలోనుండి వచ్చే స్తుతి – వ. 5–6
3. దేవుని విమోచన గురించిన వాగ్దానము – వ. 7–8
4. దేవుని రక్షణకొరకైన విన్నపము – వ. 9

మన నమ్మికను *"రథములయందు"* మరియు *"గుఱ్ఱములయందు"* కలిగియుండడం ఎంత సులభమో మన మెరుగుదుము. దేవునిమీద ఆధారపడడానికి బదులు మనము అనేకసార్లు మన సొంత సామర్థ్యముల మీదను, సొంత వనరుల మీదను ఆధారపడియుంటాము.

**ధ్యాన వచనము 7** : *కొందరు రథములనుబట్టియు, కొందరు గుఱ్ఱములనుబట్టియు అతిశయపడుదురు. మనమైతే మన దేవుడైన యెహోవా నామమునుబట్టి అతిశయపడుదుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీయందు మాత్రమే నమ్మికయుంచునప్పుడు నీవు చేసిన వాగ్దానమును నెరవేర్చే దేవుడవైయున్నావు గనుక నీకు వందనములు.*

దేవుడు మనలను ఎలా ఆశీర్వదించాడన్న విషయములను పదే పదే స్మరణకు తెచ్చుకొనుట చాలా మంచిది. దావీదు దేవుని మీదను, తనను ఆశీర్వదించుటకు ఆయనేమి చేశాడను విషయముల మీదను తన మనసు నిలిపియున్నాడు. దేవుని "బలమును" బట్టి తాను "సంతోషించుచున్నానని" దావీదు తెలుపుచున్నాడు. మనమట్లు చేయుచున్నామా? పై వాక్యభాగములోని ఆరవ వచనములో "నిత్యము ఆశీర్వాదకారకుడుగా" వుండునట్లు దేవుడు తనను చేసియున్నాడని దావీదు వ్రాసియున్నాడు. కొంత సమయము యిప్పుడు తీసికొని, మన జీవితములలో దేవుని ఆశీర్వాదములన్నిటినిబట్టి ఆయనకు వందనములెందుకు చెల్లించకూడదు?

1. రాజైన దావీదుయొక్క సంతోషము – వ. 1
2. దేవుడు వినిన విన్నపము – వ. 2
3. దేవుని ఆశీర్వాదములు మరియు ఆయన మంచితనమును గూర్చిన జ్ఞాపకము– వ. 3–4
4. దేవుడు తనకు ఘనతను ఎలా కలుగజేశాడన్న గ్రహింపు దావీదు కలిగియుండుట– వ. 5–6
5. యీ ఆశీర్వాదమంతటికీ గల కారణము – వ. 7

దేవుని ఆశ్చర్యకరమైన ఆశీర్వాదములను మనమందరము ప్రతి దినము స్మరణకు తెచ్చుకొందుముగాక. "ఆయన నామమునకు వందనములు చెల్లించుట" ద్వారా దేవునికి మనము "స్తుతియాగము" చేసిన వారమౌతాము (హెబ్రీ 13:15).

**ధ్యాన వచనము 2**: *అతని మనోభీష్టము నీవు సఫలము చేయుచున్నావు. అతని పెదవులలోనుండి వచ్చిన ప్రార్థన నీవు మానక అంగీకరించుచున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను చూడదగినదానికంటె, గ్రహించగలదానికంటె ఎక్కువగా నన్ను నీవు ఆశీర్వదించియున్నావు. నీవు నా జీవితములో జరిగించిన సమస్తమునుబట్టి నీకు వందనములు.*

శత్రువులపై పగ తీర్చుకొనుట దేవునికే చెల్లుతుంది. తన శత్రువులందరినీ దేవుడే ఎదిరిస్తాడన్న సత్యమునందు దావీదు తన సంపూర్ణమైన విశ్వాసమును వెళ్ళబుచ్చాడు. దావీదు తన శత్రువుల గురించి మాట్లాడునపుడు వారిని "నీ శత్రువులందరిని" అని దేవుని యెదుట సంబోధించాడు. ఒక్కొక్కసారి కొందరిని మనము మన శత్రువులుగా యెంచినప్పటికిని వారు దేవుని శత్రువులు కావాల్సిన అవసరము లేదు. ఆయనను "ద్వేషించు" వారికందరికీ ఆయన తీర్పు తీర్చును (వ. 8). నీ పరిస్థితులను నీ చేతుల్లోకి తీసుకొని, దేవుని వలె ప్రవర్తించాలని అనుకొనవద్దు. దాని వలన ఫలితమేమీ వుండదు.

1. తన శత్రువులందరిపైనా దేవుని కోపము రగులుకొనును – వ. 8–9
2. వారు సమకూర్చుకున్న వాటిని ఆయన నాశనము చేయును – వ. 10
3. కీడు చేయుటకు వారు చేయు ప్రయత్నములు తిప్పికొట్టబడును – వ. 11–12
4. దేవుని బలము, పరాక్రమములనుబట్టి నీతిమంతులు ఆయనను స్తుతించుట– వ. 13

ఏ మనుష్యుడైనను తాను దేవునికి వ్యతిరేకముగా జరిగించు దేనినుండి గూడా తప్పించుకొని ఎక్కడికీ పోలేడు. యీ విషయములో మనము నమ్మకము గలిగియుండ వచ్చును. పగ తీర్చుకొను విషయములను మరియు యితరులను దండించే విషయములను దేవుని పాదములయొద్ద వదలివేయుము. ఆ విషయములకు ఆయన తన సమయ ప్రకారము, తాననుకున్న ప్రకారము స్పందిస్తాడు.

**ధ్యాన వచనము 13:** *యెహోవా, నీ బలమును బట్టి నిన్ను హెచ్చించుకొనుము. మేము గానముచేయుచు నీ పరాక్రమమును కీర్తించెదము.*

**ప్రార్థన:** *ప్రభువా, పరిష్కారము చేయబడని ప్రతి సమస్యను నీవు పరిష్కరించెదవు. నీకు వ్యతిరేకముగా పాపము చేయుచున్న ఎవ్వరైనను నీనుండి తప్పించుకొనలేరు.*

ప్రభువైన యేసుక్రీస్తును గురించి ప్రవచనాత్మకముగా వ్రాయబడిన గొప్ప కీర్తనలలో యిది ఒకటి. పై వాక్యభాగములో మొదటి వచనము కుమారుడైన యేసుక్రీస్తు సిలువలో శ్రమ పొందినపుడు తండ్రియైన దేవునితో పలికిన మాటలను గురించి తెలుపుచున్నది. దావీదు తన సొంత పరిస్థితిని వివరించుటకు యీ మాటలు వ్రాసినప్పటికీ, ఆ మాటలు దావీదు భౌతిక జీవితాన్ని దాటి, భవిష్యత్తులో యేసుక్రీస్తుకు వర్తిస్తున్నాయి.

1. దేవుడు తనను విడిచిపెట్టాడన్న నమ్మికతో దావీదు ఎంతో గొప్ప బాధను వ్యక్తపరచుట– వ. 1–2
2. దేవుని పరిశుద్ధతయందును, ఇశ్రాయేలీయులను ఆయన గతములో నడిపించిన విధానమునందును దావీదుకున్న నమ్మకము – వ. 3–5
3. యితరులు తనపట్ల వ్యవహరించిన తీరుపై దావీదు వ్యాఖ్యలు – వ. 6–8
4. తన జీవితమంతా దావీదు దేవునిపట్ల కలిగియుండిన తీర్మానము – వ. 9–10
5. దేవుని సన్నిధి మరియు సహాయము కొరకు దావీదు పెట్టిన మొఱ – వ. 11

యీ వచనములు శ్రమపొంది, సిలువ మరణము పొందబోవుచున్న ప్రభువైన యేసుక్రీస్తుకు వర్తిస్తున్నప్పటికీ, పరిశుద్ధాత్మ ప్రేరణతో యీ కీర్తనను వ్రాసిన దావీదు జీవితములో కూడా యీ మాటలకున్న ప్రాధాన్యతను మనము గమనించవలెను. ప్రభువు మన అవసరములను తప్పకుండా తీరుస్తాడన్న గ్రహింపు కలిగియుండుటకు కావలసిన జ్ఞానమును, నిరీక్షణను దేవుడు మనకు అనుగ్రహించునుగాక.

**ధ్యాన వచనము 3**: *నీవు ఇశ్రాయేలీయులు చేయు స్తోత్రముల మీద ఆసీనుడవైయున్నావు.*

**ప్రార్థన:** *యీ ఆశ్చర్యకరమైన మాటలు నీకుమారుడు, నా రక్షకుడైన ప్రభువైన యేసుక్రీస్తు చేసిన కార్యమును గుర్తు చేయుచున్నవి గనుక అందునుబట్టి నేను నిన్ను స్తుతించెదను.*

పై వచనములలో దావీదు తన శత్రువుల నుండిపొందిన ఎదిరింపులను స్పష్టమైన రీతిలో వర్ణించాడు. క్రొత్త నిబంధనలో ప్రభువైన యేసుక్రీస్తు పొందిన శ్రమకు సూచనగా వుండునట్లు పరిశుద్ధాత్మ పాత నిబంధనలో దావీదు తన స్థితిని పై విధంగా వర్ణించునట్లు ఆయనను ప్రేరేపించాడు. ముఖ్యంగా "వారు నా చేతులను, నా పాదములను పొడిచియున్నారు" (వ. 16), "నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, నా అంగీ కొరకు చీట్లు వేయుచున్నారు" (వ. 18) అను మాటలు యేసుక్రీస్తుపట్ల నెరవేరినట్లు చూస్తున్నాము. మనకు ఒత్తిళ్లు, ఎదిరింపులు కలుగు సమయములలో 19వ వచనములో దావీదు చేసిన ప్రార్థనను మనము కూడా చేయాలని కోరుకొందుము: *"యెహోవా, దూరముగా వుండకుము. నా బలమా, త్వరపడి నాకు సహాయము చేయుము".*

1. దావీదు తన శత్రువులను వృషభములు మరియు సింహములతో పోల్చుట– వ. 12–13
2. దావీదు ఎంతో బలహీనమై పోయాడు – వ. 14–15
3. దావీదుకు తన శత్రువులు చేసినదంతయు మన ప్రభువైన యేసుక్రీస్తును స్మరణకు తెస్తున్నది – వ. 16–18
4. దావీదు పెట్టిన మొఱ దేవుని సన్నిధి మరియు ఆయన సహాయముపై తాను ఆధారపడియున్నాడన్న సత్యమును తెలియజేస్తున్నది – వ. 19

కొన్ని సమయములలో మనము మొఱపెట్టినపుడు దేవుడు మనకు చాలా దూరంగా వున్నట్లు అనిపిస్తుంది. కానీ దేవుడు ఎక్కడికి వెళ్ళడు. మనకు సహాయము చేయుటకు సిద్ధముగా ఎల్లప్పుడూ మనతో వుంటాడు.

**ధ్యాన వచనము 19 :** *యెహోవా, దూరముగా వుండకుము. నా బలమా, త్వరపడి నాకు సహాయము చేయుము.*

**ప్రార్థన:** *నా రక్షకుడవైన ప్రభువా, నా పాపములకొరకు నీవు శ్రమపడి, మరణించితివి. నీ ఆశ్చర్యకరమైన మరియు సంపూర్ణమైన క్షమాపణనుబట్టి నిరంతరము నేను నిన్ను స్తుతించెదను.*

తాను ఎదుర్కొంటున్న ఒత్తిళ్ళు, ఎదిరింపుల మధ్య పై వచనములలో దావీదు ఎలుగెత్తి దేవుని స్తుతించుచున్నాడు. మనకున్న కష్టముల మధ్య మన గొంతెత్తి దేవుని స్తుతించుట ఎంతో ప్రాముఖ్యమైనది. అట్లు చేయుట ద్వారా మన మానసిక పరిస్థితి మెరుగుపడి, మన దర్శనములో మనము బలపడెదము.

1. దేవుని విమోచన కొరకు దావీదు ప్రార్థన - వ. 20-21
2. దేవుని నామమును ప్రకటించి, మహిమపరచవలసిన అవసరత - వ. 22-23
3. దేవుని సన్నిధిని మరియు ప్రార్థన జవాబును దావీదు పొందుట - వ. 24
4. యితరుల యెదుట దేవుని స్తుతించి, తన మ్రొక్కుబడులు తీర్చుకోవాలన్న దావీదు అంకిత భావము - వ. 25

మనము కష్టములగుండా వెళుతున్న సమయములలో యితరుల ముందు దేవుని స్తుతించడము ద్వారా దేవుని సన్నిధి మరియు ఆయన ఉద్దేశ్యములయందు మనకున్న నమ్మికను తెలియజేసే బలమైన సాక్ష్యము మనము కలిగియుంటాము. మనము ఎంతగొప్ప పరీక్ష ద్వారా వెళుతున్నప్పటికీ లేదా ఎంతగొప్ప కృంగుదలకు, నొప్పికి లోనైనప్పటికీ, దేవుడు "సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు"గా (1కొరింథీ 3:5) వుంటూ, తన ఆశ్చర్యకరమైన ఉద్దేశ్యమును మన జీవితములలో నెరవేరుస్తున్నాడు (రోమా 8:28). ఆయనకే సకల మహిమ, స్తుతి కలుగునుగాక.

**ధ్యాన వచనము 22** : *నీ నామమును నా సహోదరులకు ప్రచురపరచెదను. సమాజ మధ్యమున నిన్ను స్తుతించెదను.*

**ప్రార్థన:** *నా ఆశ్చర్యకరమైన ప్రభువా, యితరుల ముందు నిన్ను స్తుతించుట నా హృదయమునకు సంతోషమును కలిగించుచున్నది.*

దావీదు యీ కీర్తనను తన శత్రువుల నుండి తాను యెదుర్కొంటున్న సమస్యల గురించి వర్ణిస్తూ ప్రారంభించాడు. అయితే, మెస్సీయ (ప్రభువైన యేసుక్రీస్తు) యీ భూమికి తిరిగి వచ్చి, "అన్య జనులను పరిపాలించే" దినములను గూర్చి తలంచుకొని, దేవుని స్తుతిస్తూ, గొప్ప నిరీక్షణ మరియు విజయముతో దావీదు యీ కీర్తనను ముగించుచున్నాడు. ప్రభువు ప్రస్తుతము మనలను పరిపాలించడమే కాక రాబోవు కాలములో కూడా తన రాజ్యమును ఏర్పరచి, భూజనులందరిని పరిపాలించే దేవుడుగా వున్నాడు.

1. యెహోవాను వెదకు విశ్వాసులు ప్రతిస్పందించు విధానము - వ. 26
2. సకల ప్రజలు యెహోవాను ఆరాధించుట - వ. 27-29
3. విశ్వసించు వారు ప్రకటించే మాటలు - వ. 30-31

నీకున్న ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్తులో కలుగబోవు ఆశీర్వాదములను గూర్చిన సంతోషమును నీనుండి దోచుకొననియ్యకుము. గొప్పదైన ప్రభువు దినము రాబోవుచున్నది. రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు అయిన దేవుని స్తుతించి, ఆరాధించుటలో నీ హృదయము నిమగ్నమై యుండనిమ్ము.

**ధ్యాన వచనము 28** : *రాజ్యము యెహోవాదే. అన్యజనులలో ఏలువాడు ఆయనే.*

**ప్రార్థన:** *ప్రభువా, అంతిమ విజయము నీదే గనుకను మరియు నీ రాజ్యము శాశ్వతరాజ్యము గనుకను నేను అందును బట్టి సంతోషింతును.*

చరిత్రలో కోట్లాది మంది యీ చక్కటి మాటల చేత ఆదరించబడినారు. అయితే, "యెహోవా నా కాపరి" అని సాక్ష్యమిచ్చునట్లు 'మంచికాపరి' యైన యేసు క్రీస్తుతో ఎంతమంది వ్యక్తిగత సహవాసమును కలిగియుంటారన్నది ఆసక్తికరమైనది. దేవుని ఆశ్చర్యకరమైన సంరక్షణ, కాపుదల మరియు సమాధానము యీ కీర్తనలోని వచనముల ద్వారా వెల్లడి చేయబడుతున్నాయి. గొఱ్ఱెలను కాచే ఒక బాలుడిగా దావీదు యీ విషయములను గూర్చి వ్యక్తిగత అనుభవము కలిగినవాడై, తన 'గొఱ్ఱెలకాపరి' అనుభవమును ప్రభువుకు వర్తింపజేయుటలో గొప్ప సమాధానము మరియు సంతోషమును కనుగొన్నాడు.

1. గొఱ్ఱెలకాపరి పోషణ– వ. 1
2. దేవుడు నడిపించు పచ్చికగల స్థలములు – వ. 2
3. నీతిమార్గములు – వ. 3
4. ఆదరణ కలుగజేయు గొఱ్ఱెలకాపరి యొక్క సన్నిధి – వ. 4
5. బల్లను సిద్ధము చేయుట – వ. 5
6. మన జీవితములలో ప్రస్తుతకాలము మరియు రాబోవు కాలమునకు సంబంధించిన వాగ్దానములు – వ. 6

నాలుగవ వచనములో "నీవు నాకు తోడైయుందువు" అనుమాటలు వ్రాయబడినవి. అన్ని సమయములలో ఆయన సన్నిధి మనకు తోడైయుండునన్న నిశ్చయత మనకెంతో ఆదరణను కలుగజేయుచున్నది. "నిన్ను ఏమాత్రమును విడువను. నిన్ను ఎన్నడును ఎడబాయను" అని ప్రభువు సెలవిచ్చియున్నాడు (హెబ్రీ 13:5).

**ధ్యాన వచనము 1:** *యెహోవా నా కాపరి. నాకు లేమి కలుగదు.*

**ప్రార్థన:** *నీవు నా కాపరివన్న మాటలు యిచ్చు తృప్తికంటే నాకు యెక్కువ తృప్తినిచ్చే మాటలు యింకేమీలేవు.*

Valentine's day సందర్భముగా మన తలంపులు ప్రేమను గూర్చి కలిగియుందుము. ప్రస్తుత తరము దేవుని ఆశ్చర్యకరమైన ప్రేమను రుచిచూచి, తమ జీవితములకు దానిని అన్వయించుకొనవలసిన అవసరత యెంతైనా వుంది. కీర్తనల సారాంశము దేవుని ప్రేమను గూర్చి ఎన్నో విషయములను తెలుపుచున్నది. "ప్రేమ" లేదా "ప్రేమించెను" అను పదములు కీర్తనలలో 32 సార్లు వాడబడినవి. "కృప (Loving kindness)" అను పదము ఆంగ్లములో 21సార్లు వాడబడినది. కాని యీ పదము యొక్క హెబ్రీ భాషాంతరమైన "కెసెద్" (కృప) అను పదము కీర్తనలలో 129 సార్లు వాడబడినది. యీ పదములే కాకుండా, "దయాళుడు", "కృపగలవాడు", "కరుణాసంపన్నుడు" మరియు "క్షమించు స్వభావముగలవాడు" అను మాటలను కూడా కీర్తనలలో చూచెదము. 1యోహాను 4:8 లో "దేవుడు ప్రేమా స్వరూపి" అని వ్రాయబడినది. యీ సత్యము కీర్తనలలో పదేపదే చూపబడినది. గలతీ 5:22లో వ్రాయబడినట్లు ''ఆత్మఫలము"లో దేవుని ప్రేమ ఒక భాగము. దేవుని ప్రేమ పరిశుద్ధాత్మద్వారా మన హృదయములలో కుమ్మరింపబడియున్నదని రోమా 5:5లో వ్రాయబడినది.

1. నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమించడమన్నది ప్రధానమైనది (ద్వితీయోపదేశకాండం 6:5).
2. యీ దేవుని ప్రేమ మనలో వుండుటనుబట్టి మనము యితరులను ప్రేమిస్తామన్నది యిందులో నుండి వెలువడే సూత్రము (మత్తయి 22:37-40).
3. మనము యితరులను ప్రేమించుటకు ప్రభువైన యేసుక్రీస్తు మనము అనుసరించవలసిన మాదిరియైయున్నాడు (యోహాను 13:34-35).

**ధ్యాన వచనము కీర్తన 63:3** : *నీ కృప జీవము కంటె ఉత్తమము. నా పెదవులు నిన్ను స్తుతించును.*

**ప్రార్థన:** *ప్రేమకు జ్ఞాపకార్థమైన యీ దినమందు, ప్రభువా, నా హృదయమును నీ ప్రేమతో నింపుమని అడుగుచున్నాను.*

దేవుని సార్వభౌమాధికారమును, ఆయన సృష్టిని మరియు ఆయన సన్నిధిలో పరిశుద్ధత కలిగియుండవలసిన అవసరతను వ్యక్తపరుస్తూ కీర్తనాకారుడు యీ కీర్తనను ప్రారంభించాడు. తన రాజ్యమును యీ భూమిమీద స్థాపించుటకు రాబోవుచున్న మహిమగల రాజైన మెస్సీయను ఆహ్వానించుటకు సిద్ధపడుతూ, యీ స్తుతికీర్తనను ముగిస్తున్నాడు. మనముందున్న గొప్ప ప్రశ్న యేదనగా యీ రాజును కలుసుకొనుటకు సిద్ధంగా వున్నామా?

1. దేవుని శక్తి - వ. 1-2
2. ఆయన సన్నిధిలో నివసించుటకు కావలసిన పరిశుద్ధత - వ. 3-4
3. దేవుని ఆశీర్వాదమును గూర్చిన వాగ్దానము - వ. 5-6
4. మహిమగల రాజు రాకకొరకు సిద్ధపాటు - వ. 7-10

"*మహిమగల యీ రాజు ఎవడు?*" అను ప్రశ్నకు స్పష్టమైన జవాబు యివ్వబడినది: "సైన్యములకధిపతియగు యెహోవాయే". మెస్సీయ సైన్యములకు అధిపతి. ఆయన ఒకానొక రోజు యీ భూమికి తిరిగివచ్చి, తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు వ్యతిరేకముగా వచ్చిన దేశములన్నిటిని నాశనము చేయబోతున్నాడు.

**ధ్యాన వచనము 10** : *మహిమగల యీ రాజు ఎవడు? సైన్యములకు అధిపతియగు యెహోవాయే. ఆయనే యీ మహిమగల రాజు.*

**ప్రార్థన:** *నీ కుమారుడు, మా మెస్సీయ మరియు మా రాజు అయిన ప్రభువైన యేసుక్రీస్తు తన మహిమయంతటితోను యీ భూమిమీదకు తిరిగివచ్చు దినముకొరకు ఎదురు చూచెదను.*

అనుదినము ప్రార్థించుటకు మనలో ప్రతి ఒక్కరికి యిది చక్కటి ప్రార్థన. ఒకని "ఆత్మను" దేవునివైపునకు "యెత్తుకొనడమనగా" మన హృదయములు, కోరికలు మరియు అవసరములు వాటిని మార్చగల, తీర్చగల ఒకే ఒక్క దేవునివైపునకు మళ్లించుట. బలమైన ప్రార్థనా జీవితమును కలిగియుండాలంటే 2వ వచనములోని సామాన్యమైన మాటలు మనము అనుసరించాలి: "దేవా, నీయందు నమ్మికయుంచియున్నాను." దేవునియందు మనకున్న సంపూర్ణమైన నమ్మకము ఆయన సహాయము మరియు శక్తి కొరకు గోజాడునట్లు పదే పదే మనలను మోకాళ్ళమీదికి నడిపిస్తుంది.

1. విమోచనకొరకైన ప్రార్థన – వ. 1–3
2. నడిపింపుకొరకైన ప్రార్థన – వ. 4–5
3. సమర్పణకొరకైన ప్రార్థన – వ. 6–7

గతములో తాను చేసిన పాపములను కాకుండా, తన "కరుణాతిశయములను", "కృపాతిశయములను" జ్ఞాపకము చేసికొనమని కీర్తనాకారుడు దేవునితో మనవి చేసుకొనుచున్నాడు. గతములో నీవు ఎలాంటి పాపము చేసినప్పటికీ, దేవుడు నీ పాపమును క్షమించి, దానిని కడిగివేసి, తనతో సహవాసముకొరకు నిన్ను తిరిగి తనతో సమకూర్చే దేవుడైయున్నాడు. ఆయన "మంచితనము" మనలను పశ్చాత్తాపమువైపునకు నడిపిస్తుంది.

**ధ్యాన వచనము 5**: నన్ను నీ సత్యముననుసరింపజేసి, నాకు ఉపదేశముచేయుము. నీవే నారక్షణకర్తవైన దేవుడవు. దినమెల్ల నీ కొరకు కనిపెట్టుచున్నాను.

**ప్రార్థన:** ప్రభువా, నేను నీయందు నమ్మికయుంచెదను. ప్రతి దినము నేను వాటిలో నడచునట్లు నీ మార్గములను నాకు చూపుమని కోరుకొనుచున్నాను.

దేవుని మంచితనమును మరియు తన పట్ల యథార్థవంతుడిగా వుండగోరువాని జీవితములో దేవుడు చూపే నడిపింపును యీ కీర్తనలో దావీదు గుర్తించుచున్నాడు. అనేక సార్లు మనము మన పాపపు అలవాట్లలోను, తిరుగుబాటు స్వభావముతో కూడిన ప్రవర్తనలోను కొనసాగుతూనే, దేవుడు మన ప్రార్థనలకు జవాబు యివ్వలేదని లేదా మన జీవిత పరిస్థితులన్నిటిలో తన నడిపింపు మనకనుగ్రహించలేదని తలంచుచుంటాము. దేవుడు తనను ఆశీర్వదించడానికి అయిష్టత చూపించినందుకు అందులో దేవుని తప్పేమి లేదని, సమస్య తన సొంత హృదయములోవున్నదని దావీదు యెల్లప్పుడూ గుర్తించాడు. మనము స్వీకరించదగినదాని కంటే ఎక్కువగా మనలను ఆశీర్వదించాలని దేవుడు కోరుకుంటున్నాడు.

1. నీ జీవితములో దేవుని నడిపింపును గూర్చిన వాగ్దానము – వ.8–10
2. మనకు అవసరమైన పాపక్షమాపణ – వ.11
3. దేవునికి భయపడువారికి ఆయన యిచ్చు వాగ్దానము – వ.12–13

మనము దేవుని నామమును ఒప్పుకొని, ఆయనకు భయపడితే, మనము వెళ్ళవలసిన మార్గమును ఆయన మనకు బోధించును. మనకున్న సమస్య ఎల్లప్పుడూ మన "పాపమే". 11వ వచనములో దావీదు యీ పాపము *"బహుఘోరమైనదని"* స్పష్టంగా తెలిపాడు. దేవుని ఆశీర్వదమును గురించి తెలుసుకోవాలంటే మన అతిక్రమమును ఒప్పుకొని, దానిని విడిచిపెట్టడం ఎంతో ముఖ్యమైనదని సామెతలు 28:13 ద్వారా గుర్తుచేయబడుచున్నాము.

**ధ్యాన వచనము 11:** *యెహోవా, నా పాపము బహుఘోరమైనది. నీ నామమును బట్టి దానిని క్షమింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నడువవలసిన మార్గమును నాకు చూపించుము. నా జీవితములో నీవు కోరునది నెరవేర్చునట్లు నీ వాక్య బోధకు లోబడి, నీ చిత్తమును నేను జరిగించుదును గాక.*

దావీదు తనకున్న ఆపదలు మరియు తన శత్రువులనుండి వస్తున్న ఎదిరింపులను బట్టి దేవునియొద్ద తన హృదయమును కుమ్మరించి, ఆందోళనను వ్యక్తపరచుటలో వెనుకాడలేదు. తన పూర్ణ హృదయముతో దేవునియందు నమ్మికయుంచవలెనన్న ఖచ్చితమైన ఆజ్ఞను దావీదు వ్యక్తిగతంగా యెరిగియున్నాడు. 20వ వచనములో "నేను నీ శరణుజొచ్చియున్నాను" అని చెప్పాడు. మన సమస్య ప్రధానంగా ఏమిటంటే మన పూర్ణ హృదయములతో దేవునియందు విశ్వాసముంచలేకపోవడం.

1. తన హృదయమును మరియు తన కన్నులను దేవునిపై వుంచవలెనని దావీదు యెరిగియుండుట - వ. 14-15
2. దావీదు అనుభవిస్తున్న బాధలు ఆయనను దేవునికి మొఱపెట్టునట్లు చేయుట- వ. 16-18
3. తాను అనుభవించిన ఎదిరింపులనుండి దేవుని విమోచన మరియు కాపుదల కొరకు దావీదు మొఱ- వ. 19-21
4. ఇశ్రాయేలుకొరకు దావీదు దేవునికి మనవిచేయుట - వ. 22

కష్టములు మరియు ఒత్తిళ్ళు మనకందరికీ వస్తాయి. దేవుని సహాయము లేకుండా వాటిని మనమే ఎదుర్కోవాలని చూస్తే మనము భారము కలిగినవారముగా, కృంగిపోయినవారముగా, ఓడిపోయిన వారముగా వుంటాము. 21వ వచనములో వ్రాయబడిన సామాన్యమైన మాటలు మనకు అవసరమైయున్నవి: "నీ కొరకు నేను కనిపెట్టుచున్నాను".

**ధ్యాన వచనము 14** : *యెహోవా మర్మము ఆయనయందు భయభక్తులు గలవారికి తెలిసియున్నది. ఆయన తన నిబంధనను వారికి తెలియజేయును.*

**ప్రార్థన:** *నా జీవితములో ప్రతి కష్టములోను మరియు ఒత్తిడిలోను ప్రేమతో కూడిన నీ దయనుబట్టియు మరియు నా భారమును తొలగించుటకొరకు నీవు యిష్టపడు చున్నందుకును నేను నిన్ను స్తుతించెదను.*

దేవుని తీర్పును కోరుకొని, తన ఉద్దేశ్యములను పరిశీలించుమని దావీదు దేవునితో చేసిన మనివి ద్వారా దేవునితో సరియైన సహవాసము కలిగియుండవలెనని, మన పాపమును బట్టి ఆయన సన్నిధినుండి మరియు శక్తినుండి దాగి వుండకూడదని మనమందరము గుర్తు చేయబడు చున్నాము. యీ పాపముతో నిండిన లోకములో దేవునితో నడవవలెనని కోరుకొను ప్రతి విశ్వాసికొరకు దావీదు యెన్నో ప్రాముఖ్యమైన సత్యములను తెలియజేయుచున్నాడు.

1. దేవునిచేత దావీదు హృదయ పరిశోధన - వ. 1-2
2. దావీదు తీర్మానము వెనుక రహస్యము - వ. 3
3. అవిశ్వాసులనుండి వేరుపడి జీవించాల్సిన అవసరత - వ. 4-5
4. దేవుడు జరిగించిన సమస్తమునుబట్టి స్తుతి మరియు వందనములు అర్పించుట- వ. 6-7

మనము సాంగత్యము చేయుచున్న మనుష్యులతోను, దేవునితో ఉన్న మన నడకపై వారు యెటువంటి ప్రభావము చూపించుచున్నారు అను విషయముల లోను మనము జాగ్రత్త వహించవలెను. యీ ప్రమాదమును గురించి పౌలు 2 కొరింథీ 6:14 - 18లో స్పష్టముగా చెప్పియున్నాడు. మన సాక్ష్యము బలమైనదిగా ఉండాలంటే, దానిని బలహీనపరచు ప్రతి విషయమునుండి మనము వేరుపడి, జీవించాలి.

**ధ్యాన వచనము 3** : *నీ కృప నాకన్నుల యెదుటనుంచుకొని యున్నాను. నీ సత్యముననుసరించి, నడుచుకొనుచున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను ఎవరిని స్నేహితులుగా కలిగియున్నానన్న విషయమై జాగ్రత్తపడుటకు సహాయము చేయుము. నిన్ను ప్రేమించి, నిన్ను వెంబడించే విషయములో నన్ను ప్రోత్సాహపరిచేవారిని నేను స్నేహితులుగా కలిగియుందునుగాక.*

దేవుని మందిరములో ఆయన సన్నిధిలో సమయము గడిపినందుకు తాను ఎంతగా ఆశీర్వదించబడెనో దావీదు యీ వాక్యభాగములో స్పష్టముగా తెలుపుచున్నాడు. దావీదు జీవితము ఆరాధనతో కూడియున్నది. దేవుని ఆరాధించుటకు ఆయనకున్న గొప్ప ఆశను గూర్చి ఆయన వ్రాసిన కీర్తనలన్నీ సాక్ష్యమిచ్చుచున్నవి. మన పరిస్థితి యెలాగుంది? మన ఆశకూడా దావీదు ఆశవలెవున్నదా? దేవుని ఆరాధించువారు "ఆత్మతోను, సత్యముతోను" ఆయనను ఆరాధించవలెనని యేసుక్రీస్తు యోహాను 4:23-24లో సెలవిచ్చాడు. నిజమైన ఆరాధనను వర్ణించుటకు మన హృదయములలో దాగియున్న సంగతులు యెంతో ప్రాముఖ్యమైన పాత్రవహించును.

1. ఆరాధనయందు దావీదుకున్న సంతోషము - వ. 8
2. చెడు సహవాసము యొక్క ప్రమాదము - వ. 9-10
3. దావీదు సమర్పణ స్పష్టమైనది - వ. 11
4. యెహోవాను స్తుతించుటకు దావీదుకున్న ఆశ - వ. 12

మన జీవితములలో మనకున్న సహవాసము, సంబంధముల యొక్క ప్రమాదములను గుర్తించుట చాలా ముఖ్యమైనది. నిజమైన స్నేహము మరియు సహవాసముకొరకు మనము అవిశ్వాసులతో జోడిగాఉంటే యెంతో నిరాశచెందినవారమై, దేవునితో మన నడక విషయములో యెంతో దెబ్బతిన్నవారమగుదుము.

**ధ్యాన వచనము 11**: *నేను యథార్థవంతుడనై నడుచుకొనుచున్నాను. నన్ను విమోచింపుము. నన్ను కరుణింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీకు స్తుతియాగము చేసి, నిన్ను హెచ్చించుటకొరకు నేను నీ నివాస మందిరములో వుండవలెనని కోరుకొనుచున్నాను.*

యీ కీర్తన మన హృదయములకు ఎంత ఆదరణ మరియు ఆశీర్వాదమును కలుగజేయుచున్నది! జీవితము ఎన్నో రకముల భయము మరియు ఆతురతతో నిండివుంటుంది. అయితే మనము దేవునియందు నమ్మికగలవారమై, యితరులు మనకేమి చేయగలరన్న దానిగురించి భయపడకూడదు. విశ్వాసి అన్నిటికంటే ఆరాధనకు ఎక్కువ ప్రాధాన్యత యిచ్చునని కీర్తనాకారుడు స్పష్టము చేయుచున్నాడు. అందుకే 4వ వచనములో "యెహోవా ప్రసన్నతను చూచుటకు" అని వ్రాస్తున్నాడు. *"నీ కన్నులు యేసువైపు తిప్పుము, ఆయన ఆశ్చర్యకరమైన ముఖములోనికి పూర్తిగాచూడుము. ఆయన మహిమ మరియు కృపయొక్క వెలుగులో యీ లోకములోని సంగతులు మసకగా కనబడును"* అను పాటను మనము గుర్తుచేసుకొందుము.

1. దేవుని బలము - వ. 1
2. దుష్టులు తొట్రిల్లుట - వ. 2
3. విశ్వాసియొక్క స్థిరత్వము - వ. 3
4. దేవుని సన్నిధిని కోరుకొనుట - వ. 4
5. దేవుడు విశ్వాసులకిచ్చు భద్రత - వ. 5
6. ఉత్సాహముతో కూడిన బలులు - వ. 6

యీ దినము దేవునికి *"ఉత్సాహబలులు"* అర్పించుటతో నిండియుండును గాక. అవును, *"దేవునికి స్తుతి కీర్తన చేయుడి"*.

**ధ్యాన వచనము 1** : *యెహోవా నాకు వెలుగును, రక్షణయునైయున్నాడు. నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణ దుర్గము. ఎవరికి వెరతును?*

**ప్రార్థన:** *నీవు ఎవరైయున్నది నేను జ్ఞాపకముంచుకొనిన యెడల నేను భయపడను. ఎందుకనగా నా జీవితముయొక్క బలము నీవే.*

మనము ఎదిరింపులకు గురై, శత్రువుయొక్క ఒత్తిళ్లకులోనైనప్పుడు మాత్రమే కాకుండా, అన్నీ సక్రమముగా వున్నప్పుడు కూడా దేవుని వెదకాల్సిన అవసరత మనకున్నది. దేవుని మీద ఆధారపడుటకు 'సహనము' అవసరము. దీనినే కొందరు "యెహోవా కొరకు కనిపెట్టుట" అని పిలుస్తారు. ఆలాగు చేసినప్పుడు 'ధైర్యము' కలిగియుంటాము. అనగా మన పరీక్షలను దేవుని సహాయము మరియు బలముతో యెదుర్కొనే సామర్థ్యము పొందుదుము. కీర్తనాకారునికి దేవుని "మార్గము" గురించి బోధింపబడవలసిన అవసరత ఎంతగానో వుండెను (వ. 11). మనము వెళుతున్న మార్గము ఎల్లప్పుడూ దేవుని "మార్గము" కాకపోవచ్చును. మనము ఆగి, ఆయనకొరకు "కనిపెట్టవలసిన" వారముగా ఉన్నాము.

1. దేవుని కరుణ కొరకు ప్రార్థన- వ. 7
2. దేవుని సన్నిధిని వెదకుటకున్న ప్రాధాన్యత - వ. 8
3. దేవుని సన్నిధి మరియు సహాయము కొరకు మనవి - వ. 9-10
4. దావీదు శత్రువుల ఒత్తిళ్లు- వ. 11-12
5. దావీదు కలిగియున్న దేవుని దయ - వ. 13
6. మనకు అవసరమైన నిబ్బరము - వ. 14

మనలను ఎన్నడూ ఎడబాయనని దేవుడు వాగ్దానము చేశాడు. ఒక్కొక్కసారి దేవుడు మన నుండి ఎంతో దూరముగా వున్నాడనిపిస్తుంది. కాని అది సరికాదు. ఆయన యెల్లప్పుడు మనతోవుండే దేవుడు. ఆయనకు మొఱపెట్టుము.

**ధ్యాన వచనము 14**: *యెహోవాకొరకు కనిపెట్టుకొనియుండుము. ధైర్యము తెచ్చుకొని, నీ హృదయమును నిబ్బరముగానుంచుకొనుము. యెహోవాకొరకు కనిపెట్టుకొని యుండుము.*

**ప్రార్థన:** *నేను నీ దగ్గరకు వచ్చి, నీ సమయము మరియు నీ జ్ఞానము మీద ఆధారపడిన ప్రతీసారి నేను గొప్ప ఆశీర్వాదమును పొందియున్నాను. యీ సత్యమును నేను ఎన్నడూ మరువకుండుటకు సహాయపడుము.*

దుష్టులు మన చుట్టూ ఉన్నారు. వారిని మనము ప్రతి దినము యెదుర్కోవాలి. అయితే ముఖ్యమైన విషయమేమిటంటే, వారిని వెంబడించకూడదు. అనగా వారు వెళ్లు చోటుకి వెళ్లకూడదు. వారుచేయు పనులు చేయకూడదు. 5వ వచనము, "యెహోవా కార్యములను వారు లక్ష్యపెట్టరు" అని సెలవిస్తున్నది. యీ కీర్తనలోని ప్రార్థన దేవుని సహాయము మరియు కాపుదల కొరకు చేయబడినది. అదే సమయములో యిది దేవునియందు మనము నమ్మిక కలిగియుండాలన్న సత్యమును వక్కాణిస్తున్నది.

1. దావీదు దేవునికి మొఱపెట్టుట - వ. 1-2
2. దేవుని ప్రతీకారముకొరకు దావీదు మొఱ - వ. 3-5
3. దేవుని బలమందు దావీదుకున్న నమ్మకము - వ. 6-9

ప్రతి దినము మనము యీ మాటలను వినుచుండవలెను: "*నా హృదయము ఆయనయందు నమ్మికయుంచెను గనుక నాకు సహాయము కలిగెను*" (వ. 7బి). యెప్పుడూ దీనిని మరువవద్దు.

**ధ్యాన వచనము 7**: *యెహోవా నా ఆశ్రయము, నాకేడెము. నా హృదయము ఆయనయందు నమ్మికయుంచెను గనుక నాకు సహాయము కలిగెను. కావున నా హృదయము ప్రహర్షించుచున్నది. కీర్తనలతో నేను ఆయనను స్తుతించుచున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో నీ ఉద్దేశ్యములు మరియు నీ అనుభవములను చూడకుండా, నేను ఎంతో బలహీనుడనై, కలవరపడిపోయినప్పుడు నీ సహాయమును నాకందించి, నన్ను బలపరచినందుకు నీకు వందనములు.*

దేవుని స్వరముయొక్క శక్తి మరియు గొప్పతనమును బహుశా మనము తక్కువగా అంచనా వేశామేమో. మనము దేవుని ఆరాధించి, ఆయన నామమునకు మహిమ చెల్లించుటకు కారణము ఆయన స్వరమునకున్న శక్తి. ఆయన స్వరమును మనము వినుచున్నామా? ఆయన వాక్యమును వినవలెనని మనము ఆశపడుచున్నామా లేదా యీ లోక జ్ఞానమును మరియు మన సంస్కృతి యొక్క బుద్ధిహీనతను గూర్చి మనము ఎక్కువగా వింటున్నామా?

1. యెహోవాకు మాత్రమే చెందవలసిన మహిమ – వ. 1–2
2. యెహోవా స్వరముయొక్క గొప్పతనము – వ. 3–9
3. పరిస్థితులు తప్పకుండా సరిచేయబడతాయన్న హామీ – వ. 10
4. దేవుడు మనకు చూపే కృప – వ. 11

యెహోవా స్వరమును వినడమనగా ఆయనను ఆరాధించి, యీ లోకములో ఆయన ఉద్దేశ్యములన్నియు సాధించబడునని ఆయన శక్తియందు నమ్మిక కలిగియుండుట– "యెహోవా నిత్యము రాజుగా ఆసీనుడైయున్నాడు" (వ. 10బి).

**ధ్యాన వచనము 2**: *యెహోవా నామమునకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి. ప్రతిష్ఠితములగు ఆభరణములను ధరించుకొని, ఆయన యెదుట సాగిలపడుడి.*

**ప్రార్థన:** *నీ స్వరము బలమైనది. నా జీవితములో ప్రతి దినము నీ స్వరము వినవలసిన అవసరత నాకున్నది. నా హృదయముతో మాట్లాడినందుకు నేను నిన్ను స్తుతించెదను.*

కీర్తనల గ్రంథములోని అనేక కీర్తనలవలె యీ కీర్తన కూడా స్తుతితో కూడుకొనియున్నది. తన శత్రువుల యెదుట తనను లేవనెత్తి, తాను మొఱపెట్టినపుడు స్వస్థపరచి, తన శోధనలన్నిటియందు తనను సంరక్షించినందుకు దావీదు దేవుని స్తుతించుచున్నాడు. యెహోవాకు పాటలు పాడుతూ, వందనములు చెల్లించమని మనలను కోరుకుంటున్నాడు. యీ దినము నీ హృదయములో స్తుతిగానము వున్నదా?

1. యెహోవాను స్తుతించుటకు దావీదుకు గల కారణములు - వ. 1-3
2. దేవుడు యేమైయున్నాడో, తనకేమి చేసియున్నాడో దానిని బట్టి దావీదు ప్రతిస్పందన- వ. 4
3. తాత్కాలికమైన దేవుని కోపమును గుర్తించుట - వ. 5
4. దావీదు జీవితములో స్థిరత్వమును పొందుట - వ. 6

అవును, *"సాయంకాలమున యేడ్పువచ్చి, రాత్రియుండినను"* దేవునికి స్తోత్రములు - *"ఉదయమున సంతోషము కలుగును"*. మనము పొందుచున్న శ్రమలన్నియు మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఎన్నతగినవి కావు (రోమా 8:18). ఒకానొక రోజు మనము ఆయనను చూచినపుడు మనము పొందిన శ్రమ సరియేనని తెలుసుకొందుము.

**ధ్యాన వచనము 2**: *యెహోవా నా దేవా, నేను నీకు మొఱ్ఱపెట్టగా నీవు నన్ను స్వస్థపరచితివి.*

**ప్రార్థన:** *ప్రభువా, బాధ మరియు ఏడ్పుతో కూడిన సమయములు కొద్దిసేపు మాత్రమే వుండి, నీ సంతోషము నన్ను నిత్యము సంరక్షిస్తున్నందుకు నీకు వందనములు.*

దేవుడు మన "అంగలార్పు" సమయములను మార్చివేసి, మనము "నాట్యము చేసి", ''సంతోషవస్త్రము''ను ధరించుటకు కారణమగును. దావీదు 10వ వచనములో వ్యక్తపరచినట్లు యెహోవా మన "సహాయకుడు".

1. దేవుని యెదుట దావీదు ఆందోళన - వ. 7
2. దావీదు దేవునికి మొఱపెట్టుట - వ. 8
3. మరణించిన తరువాత ఏమగునని దావీదు ఆందోళన - వ. 9
4. దేవుని కృప మరియు సహాయముకొరకు దావీదు ప్రార్థన - వ. 10
5. దేవుని స్తుతించి, ఆయనకు వందనములు చెల్లించుటకు దావీదుకున్న తీర్మానము- వ. 11-12

మనము సణుగుకొనకుండా దేవునికి వందనములు చెల్లించవలెను. కృంగుదలలోనికి వెళ్లకుండా మనము దేవుని స్తుతించవలెను. యీలాగు చేయుట యిప్పుడే ఎందుకు మొదలుపెట్టకూడదు?

**ధ్యాన వచనము 11-12**: *నా ప్రాణము మౌనముగానుండక నిన్ను కీర్తించునట్లు... యెహోవా, నా దేవా, నిత్యము నేను నిన్ను స్తుతించెదను.*

**ప్రార్థన:** *అర్థము చేసుకొనుటకు మరియు భరించుటకు కష్టమైన వాటితోసహా నేను పొందిన అనుభవములన్నిటినిబట్టి ప్రభువా, నేను నీకు వందనములు చెల్లించెదను.*

మన జీవితములలో మనము శోధనలను ఎదుర్కొంటాము. అంతేగాక, దేవుని మరియు దేవునియెడల మనుకున్న తీర్మానమును లెక్కచేయని వారిని ఎదుర్కొంటాము. యిది సత్యము. అనేకసార్లు మనము దేవునికొరకు మాట్లాడి, ఆయననుగూర్చి సాక్ష్యమిచ్చుటకు సిగ్గుపడేవారముగాను, వెనుకాడేవారముగాను వుండి, రాజీపడే పరిస్థితులు కలిగియుందుము. యెవరు యేమి చెప్పినను లేదా చేసినను యెహోవాయందే తన నమ్మిక యెల్లవేళలా కలిగియుండవలెనని కీర్తనాకారుడు యెరిగియున్నాడు.

1. దేవుని విమోచనకొరకు ప్రార్థన – వ. 1
2. దేవుని కాపుదల – వ. 2–4
3. ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో పలికిన మాటను గూర్చిన ప్రవచనము – వ. 5
4. యితరులు మనలను గూర్చి ఏమి చెప్పుచున్నారో లేదా చేయుచున్నారో, దానిని యెదుర్కొనుటకు మనము కలిగియుండవలసిన కట్టడ – వ. 6

4వ వచనములో "నా ఆశ్రయదుర్గము నీవే" అని వ్రాయబడినది. దేవుడు మనకు ఆశ్రయదుర్గమైయున్నాడన్న సత్యమును తెలిసియుండుటకంటే గొప్పదైన గ్రహింపులేదు. నీ పూర్ణహృదయముతో ఆయనను నమ్ముకొనుము.

**ధ్యాన వచనము 3**: *నా కొండ, నా కోట నీవే. నీ నామమునుబట్టి త్రోవచూపి నన్ను నడిపించుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితమును నడిపిస్తూ, కష్ట సమయములలో నిన్ను నమ్ముకొనుటకు సహాయము చేయుమని నేను నిన్ను అడుగుచున్నాను.*

దావీదు పొందిన నిరాశయొక్క లోతునుబట్టి చూస్తే, జీవితము మనపైకి తీసుకువచ్చే ఒత్తిళ్లకు మనమెవరమూ అతీతులముకామని గుర్తుచేయబడుచున్నాము. యితరులు తనను పరిగణించిన తీరునుబట్టి దావీదు యెంతో కలత చెందాడు. తనకు వ్యతిరేకముగా యితరులు గుసగుసలాడుచు, కొండెములు చెప్పుకొన్నప్పుడు తన హృదయమందు ఎంతగానో బాధపడినాడు. అయితే తనకు సహాయము చేయగల ఒకే ఒక్క దేవుడికి తాను మొఱ పెట్టవలెనన్న సత్యమును దావీదు యెరిగియున్నాడు.

1. దేవుని కృపనుబట్టి దావీదు ఆనందించుట - వ. 7-8
2. తన దు:ఖమును దావీదు దేవునికి తెలియజేయుట - వ. 9-10
3. యితరులు తనను బాధపెట్టిన తీరును దావీదు వివరించుట - వ. 11-13
4. దావీదు దేవుని మీద ఆధారపడుట- వ. 14-16

దావీదు 15వ వచనములో *"నా కాలగతులు నీవశములోనున్నవి"* అని పలికిన మాటలు మన జీవితములయొక్క స్థితిగతులు, సంఘటనలు దేవుని అధీనములో వున్నాయని అద్భుతకరంగా మనమందరము గుర్తుచేయబడుచున్నాము. మనము ఆయన యందు పూర్ణవిశ్వాసము కలిగియుండవలసినవారముగా వున్నాము.

**ధ్యాన వచనము 14**: *యెహోవా, నీయందు నమ్మికయుంచియున్నాను. నీవే నా దేవుడవని నేను అనుకొనుచున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా గురించి సమస్తమును నీవు యెరుగుదువు. నేను బ్రతుకు దినములన్నియు నీ ప్రణాళికలో వున్నవి గనుక నేను నీయందు విశ్రమింతును.*

దేవుని మంచితనము మరియు కనికరమునుబట్టి దావీదు ఆనందించుచున్నాడు. తాను అన్యాయమునకు గురవుతున్న సంగతిని దేవుడు మరచి పోదని గుర్తించి, తమ నమ్మికను మరియు నిరీక్షణను దేవుని యందు కలిగి యుండుమని జనులందరికీ దావీదు విజ్ఞప్తి చేయుచున్నాడు. తన మీద ఆధారపడు వారందరికీ దేవుడు బలమును మరియు ధైర్యమును కలుగజేయుననన్న నమ్మకము ఆయన కలిగి యున్నాడు.

1. దుష్టులను అణచి వేసి, వారి అబద్ధ పెదవులను మూసివేయుమని దావీదు దేవునితో మనవి చేసుకొనుట – వ. 17–18
2. దేవుని మంచితనము మరియు ఆయన కాపుదలను దావీదు గుర్తించుట – వ. 19–21
3. దేవుడు తన మొఱను ఎలా విన్నాడో, ఆయనను నమ్ముకొను వారిని దేవుడు ఎలా సత్కరిస్తాడో దావీదు జ్ఞాపకము చేసుకొనుట – వ. 22–23
4. దేవునియందు నిరీక్షణ కలిగియుండవలెనని దావీదు జనులతో చేయు మనవి– వ. 24

అవును, దేవుడు ఎన్నో విధములుగా తన ఆశ్చర్యకరమైన కనికరమును మనకు కనబరచును. మనము దేవునియందు విశ్వాసముంచినయెడల ఆయన మనకు ధైర్యమును, బలమును కలుగజేస్తాడన్న దేవుని వాగ్దానము మనకున్నది. ప్రస్తుతము నీ జీవితములో పరిస్థితులు యెంత కష్టతరంగా వున్ననూ, నీవు ఎదుర్కొన వలసిన దానియందు నిన్ను సంరక్షించి, ధైర్యపరచి, బలపరచుటకు దేవుడు సమర్థుడై యున్నాడు.

**ధ్యాన వచనము 24:** *యెహోవాకొరకు కనిపెట్టువారలారా, మీరందరు మనస్సున ధైర్యము వహించి, నిబ్బరముగా వుండుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ కనికరమును నాకు అనేక విధములుగా బయలుపరచి, నా హృదయమును నిరీక్షణతో నింపుదువని నాకు గుర్తు చేయుచున్నందుకు నీకు వందనములు.*

దేవునికి వ్యతిరేకంగా ఒక విశ్వాసి పాపము చేసినపుడు ఆ పాప క్షమాపణ పొందవలసిన అవసరము కన్నా వేరొక ముఖ్యమైన విషయము ఆ విశ్వాసి హృదయములో వుండదు. మనము సంతోషముతో దేవుని పరిచర్య చేసి, ఆశీర్వదింప బడాలంటే మనకు శుద్ధ హృదయములు, శుద్ధ మనసులు అవసరమైయున్నవి. తనకున్న విరిగి, నలిగిన మనస్సునుబట్టి మరియు తన పాపమును దేవునియెదుట ఒప్పుకొన్న రీతినిబట్టి దావీదు దేవునికొరకైన హృదయమును కలిగియున్నాడని మనము తప్పక చెప్పవచ్చును. "*మన పాపములను మనము ఒప్పుకొనినయెడల, ఆయన నమ్మదగిన వాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును*" అని 1యోహాను 1:9 లో వ్రాయబడినది.

1. క్షమాపణ వలన వచ్చు ఆశీర్వాదము – వ. 1–2
2. మన పాపముయొక్క భారము – వ. 3–4
3. మనకు అవసరమైన పశ్చాత్తాపము – వ. 5

మనము నిజముగా విశ్వాసులమైతే, మన పాపములను గుర్తించి, వాటిని దేవుని యెదుట ఒప్పుకొనక పోయినపుడు దావీదు పై వాక్య భాగములో వర్ణించిన నొప్పిని, అంతరంగములో కలతను మనము కూడా అనుభవించెదము. మన పాపములను స్పష్టముగా దేవునియెదుట ఒప్పుకున్నప్పుడే మనము ఆయన క్షమాపణ పొందెదమని దావీదు ఎంతో స్పష్టంగా తెలుపుచున్నాడు. మన పాపమును ఒప్పుకొని, దేవుని ఆశ్చర్యమైన క్షమాపణను పొంది, మన భారమును ఆయన సన్నిధికి తీసుకొని వెళ్లుటకు మనకందరికీ బహుశా ఇప్పుడే గొప్ప సమయమును దేవుడిచ్చాడేమో.

**ధ్యాన వచనము 1 :** *తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు, తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా పాపములను కప్పి వేసుకొనకుండా నీ ముందు ఒప్పుకొనుటకు నాకు సహాయపడుము. నా గురించి సమస్తమును నీవు యెరుగుదువు. నా గ్రహింపులో లేని సంగతులు నీకు తెలిసి యున్నవి.*

ఎవరూ ఎప్పుడూ చూడలేదు కదా అని మన పాపములను కప్పుకొని, భ్రమలో జీవించుట కంటె దేవునియెదుట వాటిని ఒప్పుకొని, ఆయన క్షమాపణ పొందుట వలన కలుగు సంతోషము యెంతో గొప్పది. దేవుని మన "దాగుచోటు" గా కలిగి, ఆయన యెదుట మన పాపములను ఒప్పుకొనుటను గొప్ప ఆధిక్యతగా దావీదు భావించుచున్నాడు. మొండి తనముతో దేవుని వాక్యమునకు స్పందించకుండా వుండకూడదని దావీదు మనలను హెచ్చరించుచున్నాడు (వ.9). మనలను కాపాడి, విమోచించి, ఉపదేశించి, బోధించి, నడిపించి మరియు మన హృదయములను ఆయన సంతోషముతో నింపుతానని దేవుడు మనకు వాగ్దానము చేసియున్నాడు.

1. దేవుని సన్నిధికి మనకున్న ప్రవేశము - వ.6
2. దేవుని కాపుదల మరియు నడిపింపును గూర్చిన నిశ్చయత - వ. 7-8
3. ప్రమాదకరమైన వైఖరి - వ.9
4. యెహోవాయందు నమ్మిక యుంచుట మన పని - వ.10
5. తద్వారా కలుగు దేవుని స్తుతి - వ.11

మనము దేవునియందు విశ్వాసముంచి, మన పాపములను ఆయనయెదుట ఒప్పుకొన్నప్పుడు ఆయన తన నడిపింపు, కృప మరియు సంతోషముతో మనలను ఆశీర్వదిస్తాడు. *"అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని, విడిచి పెట్టువాడు కనికరము పొందును"* అని సామెతలు 28:13 లో వ్రాయబడినది.

**ధ్యాన వచనము 7 :** *నా దాగు చోటు నీవే. శ్రమలో నుండి నీవు నన్ను రక్షించెదవు. విమోచన గానములతో నీవు నన్ను ఆవరించెదవు.*

**ప్రార్థన:** *ప్రభువా, కంచర గాడిద వలె మొండిపట్టు గలిగియుండక, నా పాపములను ఒప్పుకొని, వాటిని విడిచిపెట్టి, నీ కృప మరియు క్షమాపణను నమ్ముకొనుటకు నాకు సహాయము చేయుము.*

యీ కీర్తన దావీదు వైఖరిలో మార్పును చూపించుచున్నది. యింత వరకు ఆయన అధైర్యమును మరియు తన శత్రువులనుండి ఎదిరింపులను ఎదుర్కొంటూ వచ్చాడు. రాబోయే కీర్తనలలో చెప్ప బడిన ప్రకారము యివి కొనసాగుతాయి. అయితే యిప్పటినుండి దావీదు తన సమస్యల మధ్య దేవుని స్తుతించుటయందు గురి నిలిపినట్లు మనము గమనించగలము. కనుకనే దావీదు కీర్తనలలో అనేకములు దేవుని స్తుతితో నిండియున్నవి. యీ కీర్తన ఆరంభములో దేవుడు ఎవరు మరియు ఆయన ఏమి చేయ గలడు అను విషయములపై మనము ధ్యానించ వలసిన వారముగా వున్నామని దావీదు బలమైన రీతిలో మనకు బోధపరచుచున్నాడు.

1. దేవునితో మనకున్న సంబంధము ఆనందముతో కూడినదై యుండ వలెను – వ. 1
2. స్తుతులతో మరియు కీర్తనలతో ప్రతిస్పందించుట – వ. 2–3
3. దేవుని స్తుతితో మనము ఉప్పొంగుటకు గల కారణములు – వ. 4–5
4. దేవుని శక్తి గురించి జ్ఞాపకము చేయబడుట – వ. 6–7

అయిదవ వచనములో వ్రాయబడిన మాటలు మనము దేవుని స్తుతించి, ఆయనకు కీర్తనలు పాడుటకై మనలను ఎంతగానో ప్రేరేపిస్తున్నాయి – *"లోకము యెహోవా కృపతో నిండియున్నది."* మన సొంత పరిస్థితులతో మనము గ్రుడ్డి వారముగా చేయబడి యున్నాము గనుక ఆయన "కృపను" మనము చూడలేక పోవచ్చును. దేవుడు నీకు చూపిన "కృపంతటిని" బట్టి యీ క్షణమే నీవు దేవునికి వందనములు చెల్లించుము.

**ధ్యాన వచనము 1 :** *నీతిమంతులారా, యెహోవానుబట్టి ఆనందగానము చేయుడి. స్తుతి చేయుట యథార్థవంతులకు శోభస్కరము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీయందు ఆనందింతును. నీవు జరిగించిన సమస్తమునుబట్టి, ప్రత్యేకముగా నీ వాక్యమునుబట్టి నీకు స్తుతి కీర్తనలు పాడుటకు యిష్టపడుదును.*

దేవుడు మనము చెప్పునదంతయు మరియు చేయునదంతయు చూచుచున్నాడు – ఆయన సన్నిధినుండి మరియు ఆయన యెరుకనుండి ఏ విషయము కూడా మరుగు చేయబడదు. భూమి మీద జరుగుచున్న దాని యంతటిలోను ఆయన చురుకుగా నిమగ్నమై యున్నాడు. సమస్తమును ఆయన నిత్యమూ గమనించు చున్నాడు. కనుకనే 12వ వచనములో కీర్తనాకారుడు *"యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు"* అని చెప్పుటలో ఆశ్చర్యమేమీ లేదు. హెబ్రీ 4:13 లో వ్రాయబడిన మాటలు దేవుడు మన హృదయము యొక్క ఉద్దేశ్యములన్నిటిని యెరిగియున్నాడని దృఢ పరచుచున్నవి. మనము దేవునినుండి దూరముగా దాగు కొనలేము. మన గురించి సమస్తమును తెలిసి కూడా దేవుడు మనలను ప్రేమిస్తున్నాడన్నది అద్భుతకరమైన సత్యము.

1. భూలోక నివాసులందరికీ సవాలు – వ. 8
2. దేవుని ఆజ్ఞ – వ. 9
3. దేవుని ఆలోచన – వ. 10–11
4. దేవుడు ఏర్పరచుకొనిన జనులు – వ. 12
5. మనము చేయు సమస్తముపైనను దేవుని కలిగియుండుట – వ. 13–15

మనమందరము దేవుని యెదుట నిలబడి, లెక్క అప్పజెప్పవలెను. ఆయన మనము చెప్పునదంతయు మరియు చేయునదంతయు యెరిగియున్నాడు. ఆయనకు తెలియకుండా దాచాలని మనము చేయు ప్రయత్నములు వ్యర్థమే. *"అన్యజనుల ఆలోచనలను"* (వ. 10) వినుటకంటె మనము *"యెహోవా ఆలోచన"* యందు పూర్ణమైన విశ్వాసము కలిగి యుండవలెను.

**ధ్యాన వచనము 13 :** *యెహోవా ఆకాశములో నుండి కనిపెట్టుచున్నాడు. ఆయన నరులందరిని దృష్టించుచున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు సమస్తమును యెరుగుదువని నాకు తెలియును. లోక నివాసులందరు నిన్ను ప్రప్రథమ స్థానములో కలిగి జీవించు అవసరత యెంత గొప్పదో నీవు యెరుగుదువు.*

యీరోజు ధ్యానములో మనము మానవ జ్ఞానము లేదా సైనికశక్తియందు గాక, దేవునిమీద మాత్రమే ఆధారపడవలసిన వారముగా వున్నామని గుర్తు చేయబడుచున్నాము. ఏదైనా కార్యము చేయుటకు "ఆలోచన కర్తలు అనేకులుండుట రక్షణ కరమని" బైబిల్ బోధించుచున్నది. కానీ దేవుడు అనేక మందితో కాక కొద్ది మందితోనే తన కార్యమును జరిగించునని మనము యెల్లప్పుడూ జ్ఞాపకముంచుకొన వలెను. దేవుడు+నీవు కలిసినపుడు అనేకుల కంటె అధిక సంఖ్యగా ఎంచబడెదరు.

1. మనము మానవుల సంఖ్య లేదా మానవుల సామర్థ్యము ద్వారా విమోచింప బడలేము - వ. 16,17
2. దేవునిమీద ఆధారపడి, ఆయనకొరకు కనిపెట్టుకొనుట ఎంతో అవసరమై యున్నది - వ. 18-22

మనము "ఆయన కృపకొరకు కనిపెట్టుకొనవలెనని" (వ. 19) మరియు "యెహోవా కొరకు కనిపెట్టుకొనవలెనని" (వ. 21), "ఆయననుబట్టి సంతోషించవలెనని" (వ. 20), "యెహోవా పరిశుద్ధ నామమందు నమ్మిక యుంచవలెనని" (వ. 20), కీర్తనాకారునిచే కోర బడుచున్నాము. యీ అధ్యాయములోని చివరి వచనము సామాన్యమైన దైనప్పటికిని, బలమైన ప్రార్థనగా వ్రాయబడినది - "యెహోవా, మేము నీ కొరకు కనిపెట్టుచున్నాము. నీ కృప మామీద నుండును గాక."

**ధ్యాన వచనము 21 :** *మన ప్రాణము యెహోవా కొరకు కనిపెట్టు కొనుచున్నది. ఆయనే మనకు సహాయమును, మనకు కేడెమునై యున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నిన్ను నమ్ము కొందును. నా జీవితములో నేను వెళ్లవలసిన మార్గము కొరకు, నీ సహాయముకొరకు నేను నీపై వేచియుందును.*

మనము కష్టసమయములలో ప్రార్థించినపుడు ప్రభువు మన ప్రార్థన ఆలకిస్తాడన్న సత్యము తెలుసుకోవడం చాలా ఆదరణ కలిగిస్తుంది. తన ప్రార్థనను వినడమే కాకుండా, తన కష్టములు మరియు ఆపదలన్నిటిలో నుండి తనను విమోచించినందుకు దావీదు తన హృదయముయొక్క స్తుతిని దేవునికి అర్పించుచున్నాడు.

1. మనము నిత్యము దేవుని స్తుతించ వలెను – వ. 1
2. మన స్తుతి పశ్చాత్తాప హృదయమునుండి రావలెను –వ. 2
3. మన స్తుతి ఏకత్వముతో కూడినదై యుండవలెను – వ. 3
4. విమోచనకొరకైన మన మొఱలు మన స్తుతికి ఆధారమైయున్నవి –వ. 4–6
5. దేవుని దూతయొక్క కాపుదల – వ. 7

దేవునికొరకు వెదకి, ఆయనకు మొఱపెట్టవలెనన్నది కీర్తనల గ్రంథములో మనము నేర్చుకునే గొప్ప ఉపదేశములలో ఒకటి. ఆయన సన్నిధిని, ఆయన బలమును అలక్ష్యము చేసిన యెడల, మన జీవితములలో గొప్ప నష్టము పొందుదుము. *"నేను యెహోవాయొద్ద విచారణ చేయగా ఆయన నాకుత్తర మిచ్చెను"* (వ. 4) అను మాటలు మన కష్టములు మరియు ఆపదల మధ్య మనము దేవునికి మొఱ్ఱపెట్టవలసినవారముగా వున్నామని బలమైన రీతిలో గుర్తు చేయబడుచున్నాము.

**ధ్యాన వచనము 6:** *ఈ దీనుడు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించెను. అతని శ్రమలన్నిటిలో నుండి అతని రక్షించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా శ్రమలన్నింటిలో నా మొఱ ఆలకించి, నీ జవాబులను నీ సమయానుసారము మరియు నీ చిత్తానుసారము నాకు అనుగ్రహించినందుకు నీకు వందనములు.*

"దేవునికి భయపడి, ఆయనను వెదకు వారి" మీద దేవుడు తన ఆశీర్వాదములను కుమ్మరించవలెనని కోరుకుంటున్నాడు. పై వాక్య భాగములో దేవుడు మన అవసరములన్నియు తీరుస్తానని వాగ్దానమిచ్చుచున్నాడు (ఫిలిప్పి 4:19). చివరి మూడు వచనములలో "*యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట*" అంటే ఏమిటన్న దానిని కీర్తనాకారుడు వర్ణించుచున్నాడు. మన అవసరములు తీర్చబడుటకొరకు మనము దేవుని వైపు చూడకుండా, మన సొంత చాతుర్యము, వనరులు, పరిస్థితులు, కుటుంబము లేదా స్నేహితులవైపు చూస్తున్నాము గనుక మనలో అనేకులము దేవునితో మన నడకలో యిబ్బందుల పాలవుతున్నాము. దేవుడు మన కన్నులను తెరచునుగాక!

1. దేవుని మంచి తనమును రుచి చూచుట –వ. 8ఎ
2. దేవుని ఆశ్రయించినపుడు కలుగు ఆశీర్వాదము – వ. 8బి
3. దేవునియందు భయభక్తులు గలవారికి ఆయన కలుగజేయు మేలులు – వ. 9–10
4. యెహోవాయందలి భయ భక్తుల గురించిన బోధ – వ. 11–12
5. పాపమునకు దారి తీసే మాటలు – వ. 13
6. మేలైనది చేయకుండా, కీడును జరిగించుటకు దారి తీసే శోధన – వ. 14

మనము దేవునియెదుట జవాబు దారులముగా వున్నామని గుర్తెరిగినపుడే మన జీవితములలో దేవునికి నమ్మకముగా జీవించగలము. "*యెహోవాయందు భయ భక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మరియు తెలివికి మూలము*" (సామెతలు 1:7; 9:10).

**ధ్యాన వచనము 8:** *యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలిసికొనుడి. ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ మంచితనమునందును మరియు నీ కనికరమునందును నేను ఆనందింతును. నిన్ను ఆరాధించి, నిన్ను మాత్రమే నమ్ముకొనుటకు నేను నీ యొద్దకు వచ్చియున్నాను.*

యీ వాక్య భాగములో నీతిమంతులయెడల మరియు దుష్టులయెడల దేవుడు స్పందించే విధానములోగల వ్యత్యాసము గురించి దావీదు తెలియజేయుచున్నాడు. దేవుడు నీతిమంతుల మొఱను ఆలకిస్తాడు. కానీ ఆయన దుష్టులకు వ్యతిరేకముగా వున్నాడు. దుష్టుల భవిష్యత్తు మరణమునకు, వినాశమునకు దారితీస్తుంది (వ. 21). అయితే నీతి మంతుల భవిష్యత్తు దేవుని ఉగ్రతనుండి విమోచన మరియు కాపుదల వైపునకు దారి తీస్తుంది. దేవుడు నీతిమంతులను చూచి, వారి మొఱలు విని, వారిని విమోచించి, రక్షించి, పోషించి, వారిని విముక్తులుగా చేయును. దేవుని నామము స్తుతింపబడును గాక!

1. దేవునియెదుట నీతిమంతులు కలిగియున్న స్థానము - వ. 15
2. దుష్టత్వము జరిగించువారిపై రాబోవు దేవుని శిక్ష - వ. 16
3. నీతిమంతుల ప్రార్థనలు - వ. 17
4. విరిగి, నలిగిన స్థితిలో మరియు ఆపత్కాలములో మనకు తోడైయుండే దేవుని సన్నిధి - వ. 18-19
5. నీతిమంతుల కాపుదల - వ. 20
6. దుష్టులయొక్క దురవస్థ - వ. 21
7. నీతిమంతులకున్న వాగ్దానము - వ. 22

మనము నీతిమంతులుగా వుండవలెనా లేదా దుష్టులుగా వుండవలెనా అను ప్రశ్నకు పై వాక్య భాగము సమాధాన మిచ్చినది. 19 వ వచనము ప్రకారము మనము ఎన్నో "బాధలను" ఎదుర్కొంటాము. అయితే, వాటన్నిటినుండి మనలను విమోచిస్తానని దేవుడు వాగ్దానమిచ్చి యున్నాడు - ఆయన నామమును స్తుతించుడి.

**ధ్యాన వచనము 18 :** *విరిగిన హృదయము గలవారికి యెహోవా ఆసన్నుడు. నలిగిన మనస్సు గలవారిని ఆయన రక్షించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయమందును, నా జీవితములోను నేను అనేక చిక్కులను కలిగి, నా పతనావస్థలో నేను క్రుంగిపోయి వున్నప్పుడు నన్ను ఆదరించి, సంరక్షించుటకు నీవు యెల్లప్పుడూ వున్న దేవుడవు. నీకు వందనములు*

పగ తీర్చుకొనుట దేవుని పని. తన శత్రువులపట్ల దేవుని న్యాయమును జరిగించ వలసినదిగా దావీదు దేవునితో మనవి చేసుకొనుచున్నాడు. తనను రక్షించి, తన శత్రువులను ఓడించమని దావీదు దేవునితో మొఱపెట్టుచున్నాడు. మన సమస్యలను మన సొంత చేతుల్లోకి తీసుకోవడం చాలా సులభము. మనకై మనమే "సంగతులను సరిచేయవలెనని" ప్రయత్నిస్తాము. అయితే, ప్రతీకారము తీర్చుకునే విషయములోను, న్యాయము జరిగించే విషయములోను దేవుడు మాత్రమే మన సంగతులను సరిచేయవలెను. దేవుని హస్తములో మన సంగతులను వదలివేయవలెను. ఏ ఒక్కరూ కూడా తప్పు చేసి, తప్పించుకోలేరు. ప్రతి మనిషి తన తప్పిదములకు మూల్యము ఒకానొక రోజు చెల్లించ వలసిందే.

1. దేవుడు తన తీర్పును తీసుకురావాలన్న దావీదు కోరిక – వ. 1
2. దేవుని సహాయముకొరకు దావీదు దేవుని మీద ఆధార పడుట – వ. 2–3
3. దేవుడు తనపట్ల ఏమి జరిగించాలన్న దాని గురించి దావీదు వర్ణన – వ. 4–6
4. దేవుడు తన శత్రువులకు ఎందుకు తీర్పు తీర్చాలన్న దానిపై దావీదు చర్చ – వ. 7
5. దేవుడు తన శత్రువులకు వినాశము కలుగజేయవలెనని దావీదు కోరుట – వ. 8

పై వాక్య భాగములో *"యెహోవా దూత"* (వ. 5–6) అను మాటలు ఆసక్తికరంగా వున్నాయి. చాలా మంది బైబిల్ పండితులు యీ మాటలు దేవుని దూత యైన మెస్సీయ ను (ప్రభువైన యేసుక్రీస్తును) సూచిస్తున్నాయని చెప్పుదురు..

**ధ్యాన వచనము 2 :** *కేడెమును, డాలును పట్టుకొని, నా సహాయమునకై లేచి నిలువుము.*

**ప్రార్థన:** *ప్రభువా, పరిష్కరించబడని సంగతులను నీకు వదలివేసి, నాపట్ల యితరులు జరిగించిన తప్పిదములు మరియు అన్యాయమునుబట్టి నేను ప్రతీకారము ఎన్నడూ తీర్చు కొనకుండా వుండుటకు నాకు సహాయపడుము.*

యీ వాక్య భాగము "యెహోవా యందు హర్షించుట" అను మాటలతో మొదలై, "నేను నిన్ను స్తుతించెదను" అను మాటలతో ముగియుచున్నది. యీ మాటల మధ్యలో తన శత్రువులు తప్పుడుగా తనను నిందించుటవలన తనకు కలిగిన నొప్పి గురించి మరియు తన శత్రువులు తన కష్టముల గురించి యెట్లు ఆనందించారన్న విషయము గురించి దావీదు తెలిపాడు. 16 వ వచనములో తన శత్రువులు "తన మీద పండ్లు కొరికారని" స్పష్టంగా తెలియజేయుచున్నాడు. యితరులు మనలను విమర్శించినపుడు తట్టుకోవడము సులభం కాదు. మనము గాయపరచబడిన వారమై, మొదట మనలను మనము సమర్థించుకోవాలని ప్రయత్నిస్తాము. అంతేగాక మనపట్ల అన్యాయముగా వ్యవహరించిన వారిపై ప్రతీకారము తీర్చుకొని, వారికి నొప్పి కలుగజేయాలని ప్రయత్నిస్తాము. అయితే యీ శోధనలన్నిటిని దేవునివైపు మళ్లించాలని దావీదు మరొకసారి యీ వాక్య భాగములో తెలుపుచున్నాడు.

1. యెహోవా రక్షణబట్టి దావీదు ఆనందించుట - వ. 9
2. దేవుని గూర్చియే దావీదు మననము చేసుకొనుట - వ. 10
3. అబద్ధ సాక్షులు తనపట్ల ప్రవర్తించిన తీరును దావీదు తెలుపుట - వ. 11-16
4. దేవుని జోక్యముకొరకై దావీదు మనవి - వ. 17
5. దేవునికి వందనములు మరియు స్తుతులను చెల్లించే ప్రతిస్పందనను దావీదు కలిగి యుండుట - వ. 18

పగ తీర్చుకునే భాగమును దేవునికి వదలి వేయుము - మన జీవిత దినములన్నియు ఆయనకు వందనములు, స్తుతులు చెల్లించుటయే మన భాగము.

**ధ్యాన వచనము 18 :** *అప్పుడు మహా సమాజములో నేను నిన్ను స్తుతించెదను. బహు జనులలో నిన్ను స్తుతించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు నీయందును మరియు నా జీవితములోని సమస్తమును నీవు జరిగించు విధమందును ఆనందించవలసియున్నది. ప్రభువా, నిన్ను స్తుతించుటకు ఆశపడు చున్నాను.*

తాను దేవునికొరకైన హృదయమును కలిగియున్నానని అందరూ తెలుసుకొని, చూచునట్లు తన శత్రువులకు తీర్పుతీర్చుట ద్వారా రుజువుచేయమని దావీదు దేవుని అడుగు చున్నాడు. దుఃఖకరమైన విషయమేమిటంటే ఈ లోకము సాతానుచేత గ్రుడ్డితనము పొంది యుండుట వలన (2కొరింథీ 4:3-4) అది నీతిమంతులను లెక్కచేయదు. అయితే, శుభవార్త ఏమిటంటే దేవుడు ఒకానొక దినము సమస్తమును సరిచేయబోవు చున్నాడు. యీ విషయములో మనము ఆయనను నమ్ముకొనవచ్చును. మనము ఆయనను స్తుతిస్తూ, సరియైనది జరిగించుటకొరకు ఆయనయందు ఎల్లప్పుడు విశ్వసిస్తూ ప్రతిస్పందించవలెను.

1. దావీదు శత్రువుల మోసము - వ.19-21
2. దేవుని నీతితో కూడిన తీర్పును దావీదు కోరుట - వ.22-24
3. తన బాధను చూచి సంతోషించు తన శత్రువులకు అవమానము కలుగజేయుమని దావీదు దేవుని కోరుట - వ.25-26
4. విశ్వాసులు స్తుతిని ప్రకటన చేయవలసిందిగా దావీదు కోరుట - వ.27
5. దేవుడు తనపట్ల జరిగించిన దానినిబట్టి దావీదు ఆయనను స్తుతించే నిర్ణయము తీసుకొనుట - వ. 28

మన సంగతులను మన సొంత చేతుల్లోకి తీసుకోకుండా, దేవునికి వదలి వేయవలెనన్న ముఖ్యమైన సూత్రము మన హృదయములపైన ముద్రించబడవలెను.

**ధ్యాన వచనము 28 :** *నా నాలుక నీ నీతిని గూర్చియు, నీ కీర్తిని గూర్చియు దినమెల్ల సల్లాపములు చేయును.*

**ప్రార్థన:** *ప్రభువా, దయచేసి ప్రజలు తాము చేయుచున్నవి యెందుకు చేయుచున్నారు మరియు బాధ కలిగించు సంగతులను మా జీవితములలో ఎందుకు అనుమతించెదవు అను వాటిపై నాకు గ్రహింపు కలుగజేయుము. వీటన్నిటిని బట్టి నీకు వందనములు.*

దావీదు దుష్టుల యొక్క వైఖరిని, వారి పనులను గూర్చి వర్ణిస్తూ, వాటికిని, దేవుని ఆశ్చర్యకరమైన కృప మరియు విశ్వసనీయతలకునుగల వ్యత్యాసమును తెలియ జేయుచున్నాడు. మనము అనేక సార్లు మన సంస్కృతిలో దేవునిపట్ల తీర్మానము లేని వారితోను, దైవభక్తిలేని జీవనశైలి కనుపరచువారితోను ఎంతో సమయము గడుపు తుంటాము. మన కన్నులు దేవునివైపు వుండవలెను.

1. దుష్టులవలన కలుగు సమస్య - వ. 1
2. దుష్టుల చెడు నడతలు - వ. 2-4
3. దేవుని గుణగణములకొరకు ఆయనను స్తుతించుట - వ. 5-6ఎ
4. దేవుని సృష్టిని ఆయన సంరక్షించుట - వ. 6బి

మనము ఎక్కడికి వెళ్లినను మనము జరిగించు దానియందు దేవుని కృప, విశ్వసనీయత, నీతి మరియు న్యాయవిధులు తోడుగా కలిగియుండవలెను. ఆయన సమస్తమును పరిపాలించు చున్నాడు. తన సొంత సృష్టిని తాను సంరక్షించు చున్నాడు.

**ధ్యాన వచనము 5 :** *యెహోవా, నీ కృప ఆకాశమునంటుచున్నది. నీ సత్యసంధత్వము అంతరిక్షమునంటుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ కృప ప్రతిచోటను బయలుపరచబడినది. నీ కృపద్వారా నా హృదయమునకు నీవు పరిచారము జరిగించుచున్నావు.*

దేవుని కృపనుబట్టియు మరియు దుష్టులకు కలుగబోవు అంతిమ ఓటమిని బట్టియు దావీదు ఆనందించుచున్నాడు. కొన్నిసార్లు దుష్టులు తాము యోచించి, జరిగించు దుష్ట క్రియల పర్యవసానమును పొందకుండ తప్పించుకుంటున్నారని అనిపిస్తుంది. అయితే, ఒకానొక దినము మన మందరము దేవునియెదుట నిలబడి, మనము జరిగించిన సమస్తమునకు లెక్క అప్పజెప్పవలసిన వారముగా వున్నామని బైబిల్ స్పష్టంగా సెలవిస్తున్నది. 9 వ వచనములో దావీదు చెప్పినట్లు *"జీవపు ఊట"* యైన దేవుని విశ్వసించుట ఎంతో ప్రాముఖ్యమైనది.

1. దేవుని విశ్వసించుటవలన కలుగు సంతృప్తి - వ. 7-9
2. దేవుని కృపను, ఆయన నీతిని పొందుటకుగల రహస్యము - వ. 10
3. దుష్టులనుండి దేవుడు కలుగజేయు భద్రత - వ. 11-12

దేవుని నమ్ముకొనుట గురించి 7 వ వచనములో చక్కని వర్ణన యివ్వబడినది- *"నరులు నీ రెక్కల నీడను ఆశ్రయించుచున్నారు."* దేవుని రెక్కలక్రింద సంపూర్ణమైన శాంతి మరియు సంతృప్తి వున్నాయి.

**ధ్యాన వచనము 9 :** *నీ యొద్ద జీవపు ఊట కలదు. నీ వెలుగును పొందియే మేము వెలుగు చూచుచున్నాము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ కృపనుబట్టి నీకు వందనములు. నీ వెలుగుతో నేను స్పష్టతకలిగి చూచుటకు నీవు నాకు సహాయము చేసినందుకు నీకు వందనములు.*

యీ కీర్తనలో ముఖ్యమైన పదము "వ్యసన పడకుము" (వ. 1,7,8). జీవితములో మనలను దిగులుకు, సందేహమునకు మరియు భయమునకు గురిచేసే సంగతులు అనేకముగా వున్నవి. ప్రభువైన యేసుక్రీస్తు మాటి మాటికీ తన శిష్యులకు ఆజ్ఞాపించిన ఆజ్ఞలలో "భయపడకుము" అన్న ఆజ్ఞ ఒకటి. యీ ఆజ్ఞకు హృదయపూర్వకంగా విధేయులమగుటకు కావలసిన సూత్రము పై కీర్తనలో యివ్వబడినది. యిది నాలుగు అంశములుగా 3,4,5 మరియు 7 వ వచనములో యివ్వబడినది.

1. మనమందరము ఎదుర్కొనే సమస్య – వ. 1–2
2. దేవుని సత్యమును అనుసరించుట – వ. 3
3 దేవుని వాగ్దానము – వ. 4
4. దేవుని ప్రణాళికలు – వ. 5–6
5. దేవుని సమాధానము – వ. 7
6. యెహోవాకొరకు కనిపెట్టుకొనుట – వ. 8–9

యెహోవాయందు నమ్మిక కలిగియుండుట (వ. 3), యెహోవానుబట్టి సంతోషించుట (వ. 4), మన మార్గమును యెహోవాకు అప్పగించుట (వ. 5), యెహోవా యెదుట మౌనముగా వుండుట (వ. 7) – అవును, యీ నాలుగు ఆజ్ఞలను నెరవేర్చి, యెహోవాకొరకు కనిపెట్టిన యెడల గొప్ప బహుమానము మరియు ఆశీర్వాదమును పొందెదము. మనము దేవుని కొరకు కనిపెట్టగలిగినప్పుడు దిగులుపడడం దేనికి?

**ధ్యాన వచనము 4 :** *యెహోవానుబట్టి సంతోషించుము. ఆయన నీ హృదయవాంఛలను తీర్చును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నిన్ను నమ్ముకొని, నీయందు ఉల్లసించెదను. నామాటలు మరియు క్రియలద్వారా నీకు మాత్రమే మహిమ, స్తుతి కలుగవలెనని ఆశపడుచున్నాను.*

యీ వాక్య భాగములో గొప్ప ఆదరణ వున్నది. అదేమనగా, మొదట, దుష్టులు తాము జరిగించుచున్న దుష్టత్వమునుబట్టి దేవుని శిక్షనుండి తప్పించుకోలేరు. రెండవది, దేవుడు నీతిమంతులను సంరక్షించి, వారికి నిత్యము ప్రతిఫలము దయచేయును. మన చుట్టు వున్న దుష్టత్వమును యెదుర్కొని, ప్రభువైన యేసుక్రీస్తును ప్రేమించని వారి నుండి వచ్చే దాడులను యెదుర్కొనునపుడు యీ సత్యమును చాలా సులభంగా మరచిపోతాము. దేవుడు మనకొరకు సిద్ధపరచిన భవిష్యత్తును గూర్చిన తెలివిని కలిగియుండునట్లు దేవుడు మన హృదయములను యీ దినము బలపరచునుగాక.

1. భక్తిహీనుల జ్ఞాపకము - వ. 10
2. దీనులకు కలుగు ప్రతిఫలము - వ. 11
3. భక్తి హీనులకు కలుగబోవు ప్రతిఫలము -వ. 12-15
4. నీతిమంతునికి కలిగినదానినిబట్టి అతని ప్రతిస్పందన - వ. 16
5. నీ పూర్ణ హృదయముతో దేవుని నమ్ముకొనుటకు గల కారణములు - వ. 17-18

దుష్టుల గురించి దిగులుపడకుము. వారి అహంకారమును చూచి దేవుడు నవ్వుచున్నాడు. వారి భవిష్యత్తును ఆయన నిర్ణయించి యున్నాడు. “నీతిమంతుల సంరక్షకుడైన” యెహోవాయందు ఆనందించుము.

**ధ్యాన వచనము 16:** *నీతిమంతునికి కలిగినది కొంచెమైనను బహుమంది భక్తిహీనులకున్న ధనసమృద్ధికంటె శ్రేష్టము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా చుట్టు వున్న దుష్టులు ఎంత వర్ధిల్లినను, నీవే నా హృదయము ఆనందించుటకు కారణమనియు, మేము ఊహించు వాటికంటె అధికమైనరీతులలో మాకు ప్రతిఫలమిచ్చే దేవుడవనియు నేను యెరుగుదును.*

దేవుడు మన ప్రతి అవసరమును తీరుస్తానని వాగ్దానమిచ్చాడు (ఫిలిప్పి 4:19). అంతే గాక *"నీతిమంతుడు పడిపోయినపుడు యెహోవా అతని చెయ్యి పట్టుకొనియున్నాడు"* (వ. 24) అను వాగ్దానము కూడా మనకు యివ్వబడినది. దేవుడు నీతిమంతులను యెన్నడూ ఎడబాయకుండా, తన కృపను యెల్లప్పుడూ వారికి కనుపరచునని దావీదు స్పష్టము చేయుచున్నాడు. కొన్నిసార్లు పరిస్థితులు చాలా కష్టంగా అనిపించి, దేవుడు గమనించు చున్నాడా లేదా అను సంశయములో మనముంటాము. అయితే, ఆయన నిన్ను నిరంతరము కాయుచున్నాడు. *"ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి"* (1పేతురు 5:7) అని చెప్పబడిన ప్రకారము మన భారమంతా ఆయనకు అప్పజెప్పమని మనలను ఆహ్వానిస్తున్నాడు.

1. దేవుడు అనుగ్రహించు సంరక్షణ - వ. 19
2. భక్తి హీనులు నశించి పోవుట - వ. 20
3. నీతిమంతులయొక్క అలవాటు - వ. 21
4. నీతిమంతులపై ఆశీర్వాదము - వ. 22
5. నీతిమంతుని కాపుదల - వ. 23-24
6. నీతిమంతుల కివ్వబడిన వాగ్దానము - వ. 25-26

దేవుడు నిన్ను ఎడబాసియున్నాడని ఒక్క నిమిషము కూడా అనుకొనవద్దు. ఆయనకు దగ్గరగా వున్నట్లు నీకు అనిపించకపోతే, యెవరు దూరంగా జరిగారో ఆలోచించు.

**ధ్యాన వచనము 23 :** *ఒకని నడత యెహోవాచేతనే స్థిరపరచబడును. వాని ప్రవర్తన చూచి, ఆయన ఆనందించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నన్ను ఎన్నడూ ఎడబాయనందుకు నీకు వందనములు. నాకు ఏ గతియు లేక, నిరాశతో జీవిస్తున్నప్పుడు కూడా నీవు యెల్లప్పుడూ తోడైయుంటివి.*

యీ వాక్య భాగము మనము కీడుచేయుట మాని, మేలుచేయుటకు మరియు దేవుని వాక్యము మన హృదయములలో ఉన్నదని నిశ్చయపరచుకొనుటకు ప్రోత్సహించుచున్నది. దుష్టులు యీ లోకములో నీతిమంతులకు హాని తలపెట్టి యున్నారన్న విషయమును దావీదు స్పష్టముగా తెలుపుచున్నాడు. అయితే, దేవుడు నిన్ను దుష్టుల హస్తములలో వదలివేయనని మరియు నీవు కష్టసమయములగుండా వెళ్లుచున్నప్పుడు నిన్ను దోషిగా చేయనని వాగ్దానము చేయుచున్నాడు. దేవునికి స్తోత్రములు.

1. మనము విధేయత చూపవలసిన ఆజ్ఞలు - వ. 27
2. దేవుని సన్నిధి యొక్క ఆదరణ - వ. 28-29
3. నీతిమంతుల లక్షణము - వ. 30-31
4. నీతిమంతులు ఆనందించవలసిన దేవుని సంరక్షణ - వ. 32-33

"కీడు చేయుట మాని, మేలు చేయుము." దేవునితో నడచుటకు యింతకంటె సామాన్యమైన సూత్రము మరొకటి లేదు. వినాశ పరచు వాటినుండి దూరముగా వుండి, యితరులను ఆశీర్వదించుటలో నీ సమయమును గడుపుము.

**ధ్యాన వచనము 31 :** *వారి దేవుని ధర్మశాస్త్రము వారి హృదయములో నున్నది. వారి అడుగులు జారవు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యము నా హృదయములోకలిగి, పాపపు వైఖరి, పాపపు పనుల నుండి దూరముగా వుండుటకు కావలసిన నీ కాపుదల మరియు నీజ్ఞానమును నాకు దయ చేయుమని నిన్ను అడుగుచున్నాను.*

అప్పుడప్పుడు ఒకచోట కూర్చుని, నీతిమంతులకు కలుగ బోయే ఆశీర్వాదములు మరియు దుష్టుల మీదికి రాబోవుచున్న తీర్పును గురించిన పట్టిక తయారు చేయుట మంచిది. దైవ భక్తి లేని వారి మార్గములో వెళ్లుటవలన బాగుండుననిగాని లేదా దాని వలన ఎన్నో ఫలితములుండుననిగాని ఎప్పుడూ అనుకొనవద్దు. వారు ఆలోచించినట్లు ఆలోచించవలెనని, వారు మాట్లాడినట్లు మాట్లాడవలెనని లేదా యిహలోక సంస్కృతి ప్రకారము నడచు కొనవలెనని అనుకొనవద్దు. దేవుని ఆశీర్వాదములు నీతిమంతుల మీద వుండును. *"బాధ కలుగునప్పుడు ఆయనే వారికి ఆశ్రయ దుర్గము"* అని ఆయన వాగ్దానమిచ్చుచున్నాడు (వ. 39).

1. మనము దేవునిమీద ఆధార పడినపుడు ప్రతిఫలము పొందెదము - వ. 34
2. నీతిమంతులు మరియు భక్తిహీనుల గమ్యము - వ. 35-38
3. నీతిమంతులకు దేవుడు వాగ్దానమిచ్చుచున్న విమోచన -వ. 39-40

మన ధ్యానమునకు ఎంతో చక్కని మాటలు 39 వ వచనములో చూచెదము - *"యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము"*. ఆయన మన ఆశ్రయ దుర్గము, మన రక్షణ మరియు మన అవసరములు తీర్చు దేవుడై యున్నాడు. 40 వ వచనములో చెప్ప బడిన ప్రకారము *"వారు యెహోవా శరణుజొచ్చియున్నారు"* గనుక యివన్నియు మనకు దేవుని నుండి వాగ్దానము చేయబడినవి.

**ధ్యాన వచనము 39:** *యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము. బాధకలుగునప్పుడు ఆయనే వారికి ఆశ్రయదుర్గము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో ఎటువంటి ఆపద సంభవించినప్పటికీ, నీవు నన్ను రక్షించి, ముందుకు సాగుటకు కావలసిన బలమునిచ్చు దేవుడవుగా నీవున్నావు.*

మనము చేసిన పాపములను మనము దేవుని యెదుట ఒప్పుకొనకుండ, వాటిని దాచి వేయుటకు ప్రయత్నించినపుడు, 4 వ వచనములో దావీదు చెప్పినట్లు అవి *"మోయలేని బరువు వలె"* మనమీద వుండును. మనకు దేవునికొరకైన హృదయము వున్నదని చెప్పుటకు మన పాపములనుబట్టి *"శ్రమచేత మిక్కిలి క్రుంగియున్నాము"* అని 6వ వచనములో వ్రాయబడిన మాటలకంటె వేరొక నిదర్శనము లేదు. మనము పాపములో కొనసాగుతూ, పాపమును గూర్చిన ఒప్పుదల లేకుండా మరియు మనము చెప్పిన, చేసిన దానినిబట్టి దుఃఖపడకుండా వున్నట్లయితే మన హృదయములలో పరిశు ద్ధాత్మ మరియు ఆయన శక్తి నివసించుటలేదని చెప్పగలము (గలతి 5:16-17).

1. కనికరముకొరకు దేవునియెదుట మనవి - వ.1-3
2. మన పాపముయొక్క ఒత్తిడి - వ.4
3. పాపము కలుగజేసే మురికి - వ.5-7
4. దేవునియెదుట మనము అనుభవించే నొప్పి - వ.8-9

దేవుని ప్రేమను, మనలను క్షమించి, మన పాపములనుండి మనలను కడుగుటకు ఆయనకున్న సిద్ధపాటును మనము తృణీకరించినయెడల మూర్ఖులమౌతాము. నీ జీవితములో, నీ హృదయములో దేవునియెదుట ఒప్పుకొన వలసిన పాపము యేదైనా వున్నదా? అలాగే కొనసాగకుము. "యిప్పుడే" దేవుని వెదకుము.

**ధ్యాన వచనము 4:** *నా దోషములు నా తల మీదుగా పొర్లిపోయినవి. నేను మోయలేని బరువు వలె అవి నామీద మోపబడియున్నవి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా పాపమును నేను అంగీకరించెదను. నా వైఖరులు మరియు పనులనుబట్టిన పర్యవసానములు న్యాయమైన రీతిలో నేను అనుభవింప తగియున్నాను. నీనుండి దాగవలెనన్న కోరిక నాకులేదు. వినయముతో నన్ను క్షమించుమని నేను అడుగుచున్నాను.*

దావీదు గొప్ప క్రుంగుదలను మరియు తన స్నేహితులనుండి యెడబాటును అనుభవించుచున్నాడు. యీ పరిస్థితిలో తన నిరీక్షణను దేవునియందు కలిగియున్నాడు. తన శత్రువులు తన గురించి బాధ కలిగించే మాటలను పలికినపుడు తాను వాటిని వినకూడదని నిశ్చయించుకున్నాడు. యిలాగుండుట ఎవరికీ సులభము కాదు. మనకు అత్యంత సన్నిహితంగా వున్నవారు మనలను వదలివేసి, విమర్శించి, మన హృదయములకు అవసరమైన ప్రేమను చూపకపోయినట్లయితే అది మనకు గొప్ప బాధ కలిగించు దెబ్బగా వుంటుంది.

1. దావీదు అనుభవించిన బాధ – వ. 10
2. తన స్నేహితులు దావీదును విడిచి వెళ్లుట – వ. 11–12
3. తన యెడబాటును గూర్చిన మాటలు వినుటకు దావీదు తిరస్కరించుట – వ. 13–14
4. దావీదుకున్న విశ్వాసము – వ. 15

అనేకసార్లు గొప్ప చీకటి మయమైన సమయములలోనే మనము దేవునియందు నిరీక్షణ కలిగి, ఆయనను ఆశ్రయముగా కలిగియుంటాము. స్నేహితులు నిన్ను విడచి వెళ్ల వచ్చు. అయితే, దేవుడు *"నిన్ను ఏమాత్రమును విడువను. నిన్ను ఎన్నడును ఎడబాయను"* అని వాగ్దానము చేసియున్నాడు (హెబ్రీ 13:5).

**ధ్యాన వచనము 15 :** *యెహోవా, నీ కొరకే నేను కనిపెట్టుకొనియున్నాను..... ప్రభువా, నా దేవా, నీవే ఉత్తర మిచ్చెదవు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీయందు నిరీక్షణయుంచి, నాజీవితముకొరకైన నీ ప్రణాళిక మరియు నీ చిత్తమందు పూర్ణ విశ్వాసము కలిగియున్నాను. నా స్నేహితులు నన్ను ఎంత ఎడబాసినను, నీవు నన్ను ఎన్నడూ ఎడబాయని దేవుడవు గనుక నీకు వందనములు.*

తన స్నేహితులుగా చెప్ప బడిన వారు తనను వదలి వేసి, తనను విమర్శించినపుడు దావీదు తట్టు కొనలేని బాధను అనుభవించాడు. వారు దావీదుకు శత్రువులుగా మారి, ఆయనను "ద్వేషించిరి". వారు దావీదు యొక్క ఒప్పుదల మరియు పశ్చాత్తాపముతో తృప్తిచెందక, తనకున్న ఖ్యాతిని మరియు తన నాయకత్వపు సామర్థ్యతను నాశనము చేయవలెనని నిశ్చయించుకున్నారు. అటువంటి ఒత్తిడిలో ఓటమికి గురవడం చాలా సులభము. అయితే దేవుడు పరిస్థితులు తన అధీనములో కలిగియున్నాడు. ఆయన నిన్ను ఎడబాయడు.

1. తన కష్టములపట్ల యితరులు స్పందిస్తున్న తీరుపై దావీదుకున్న ఆందోళన - వ. 16-17
2. దావీదు ఒప్పుకోలు -వ. 18
3. తన శత్రువులు చేయుచున్న పనులపై దావీదు స్పందన - వ. 19-20
4. దేవుని సహాయముకొరకు దావీదు మొఱపెట్టుట - వ. 21-22

మన జీవితములో ప్రతి పరిస్థితి అడుగంటి పోయినట్లయితే, దేవునికి మొఱ పెట్టుటకు అది గొప్ప సమయము. ఆయన మన బలము, రక్షణ మరియు మన సహాయము.

**ధ్యాన వచనము 21 :** *యెహోవా, నన్ను విడువకుము. నా దేవా, నాకు దూరముగా నుండకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకున్న పరిస్థితులను నేను తట్టుకోలేనని నా కనిపించినపుడు మరియు నేను స్నేహితులుగా యెంచిన వారు నన్ను ఎడ బాసినపుడు, నీయందును మరియు నీ సహాయమందును నమ్మికయుంచుటకు నాకు సహాయపడుము.*

దావీదు మన నాలుకలవల్ల కలిగే ప్రమాదమును గురించి తెలియజేస్తూ యీ కీర్తనను ప్రారంభించుచున్నాడు. తరువాత తాను యెంత "అల్పుడైనదీ" తాను తెలుసు కొనునట్లు ప్రార్థన చేయుచున్నాడు. చివరికి తన "నిరీక్షణ" దేవునియందే వున్నదన్న సత్యమును తెలియజేస్తూ, యీ వాక్య భాగమును ముగించుచున్నాడు. మనము చాలా సార్లు మన సొంత శక్తి సామర్థ్యములను ఎక్కువగా అంచనా వేసి, దేవుడు మనపట్ల ఏమి చేయగలడన్న దానిని తక్కువగా అంచనా వేస్తాము.

1. దావీదు తాను మాట్లాడు మాటలను గురించి పట్టింపు కలిగియుండుటకు గల కారణము - వ. 1-3
2. తన సొంత "అల్పత్వము" ను గురించి తనకు తెలియజేయుమని దావీదు మనవి చేయుట - వ. 4-5
3. తన చుట్టు వున్న ప్రజల జీవనశైలి గురించిన కారణము దావీదు తెలియజేయుట- వ. 6
4. దేవుని పట్ల దావీదు స్పందన - వ. 7

మన దినములు లెక్కింపబడియున్నవన్న సత్యమును మనము ఎన్నడును మరచి పోకూడదు. మన జీవితములు మరియు సమయములన్నియు దేవుని హస్తములలో వున్నవని మనము యెల్లప్పుడూ జ్ఞాపకముంచుకొనవలెను.

**ధ్యాన వచనము 7 :** *ప్రభువా, నేను దేనికొరకు కనిపెట్టుకొందును? నిన్నే నేను నమ్ము కొనియున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా సొంత సామర్థ్యములను నమ్ము కొనకుండా మరియు నేను కోరుకున్నది సాధించుటకు ఎంతో సమయము నాకున్నదని నేననుకొనకుండా, నీవు నాకు అవసరమైన దేవుడవని తెలుసుకొనుటకు నాకు సహాయపడుము.*

దావీదు తన సొంత పాపములనుండి మరియు వాటి పర్యవసానమునుండి విమోచన కోరుకుంటున్నాడు. దేవుని తీర్పుతో కూడిన హస్తము క్రింద నలిగినవాడై, *"నీవు పంపిన తెగులు నా మీదనుండి తొలగింపుము"* అని ప్రార్థించుచున్నాడు (వ. 10). తనను సరి చేయుటకు మరియు ఆశీర్వదించుటకు దేవుడు తన *"గద్దింపులను"* పంపు చున్నాడని దావీదు యెరిగియున్నాడు. తాను ఒక *"అతిథి"* మరియు *"పరవాసి"* వంటి అనుభూతి పొందిన వాడై, దేవునియొద్దనుండి మాత్రమే దొరికే బలము మరియు ఆదరణ కొరకు అంగలార్చు చున్నాడు.

1. దావీదు తన పాపములను ఒప్పుకొనుట – వ. 8
2. దేవుడు తనను శిక్షించుచున్నాడని దావీదు గ్రహించుట – వ. 9
3. తన జీవితమునుండి తన తీర్పుతో కూడిన హస్తమును తీసివేయుమని దావీదు దేవునితో మనవి చేసుకొనుట – వ. 10
4. దేవుని తీర్పు వలన నరులకు కలుగు పర్యవసానమును దావీదు గుర్తించుట–వ. 11
5. దావీదు సత్తువకొరకై దేవునితో మనవి చేసుకొనుట – వ. 12–13

దేవుని యెదుట మనము లెక్క అప్పజెప్పవలసిన వారముగా వున్నామని గుర్తించుట ఎంతో ప్రాముఖ్యమైనది. అంతేగాక, ఆయన *"గద్దింపులు"* మనకు హాని కలుగజేయ వలెనని కాదు గానీ, మనలను యింకా బలపరచి, ఫలభరితులనుగా చేయవలెనను ఉద్దేశ్యముతో వచ్చుచున్నవని తెలుసుకొనవలెను.

**ధ్యాన వచనము 13 :** *నేను వెళ్లిపోయి, లేక పోక మునుపు నేను తెప్పరిల్లునట్లు నన్ను కోపముతో చూడకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ బలమును, నీ క్షమాపణను తెలుసుకొనుటకు నాకు సహాయపడుము. పాపముతో కూడిన నా ప్రవర్తన యొక్క పర్యవసానమును నేను అంగీకరించెదను. ఎందుకనగా నీ ప్రతిరూపములోనికి తీసుకువచ్చుటకొరకే నన్ను సరిదిద్ది, నాలో మార్పు తీసుకొని రావలెనని నీవు కోరుచున్నావు.*

దేవుడు మనపట్ల జరిపించగల కార్యములను గురించి ఆలోచిస్తే మనకు ఆశ్చర్యమేస్తుంది. దేవుడు ఏమై యున్నాడు, ఆయన ఏమి చేయగలడు అను విషయములను గూర్చిన గ్రహింపు లేనికారణంగా అనేక సార్లు మనము అధైర్యముతోను, ఓటమితోను జీవిస్తుంటాము. దేవుడు చేయగల పనులను వర్ణించుటకు దావీదు "బహు విస్తారములు" అను పదమును వాడుచున్నాడు. మన సమస్య పై వాక్య భాగములోని మొదటి వచనము లో తెలుపబడినది – *"సహనముతో కనిపెట్టుకొనుట"*. దేవుని సామర్థ్యము మనము ఊహింపదగిన దానికంటె గొప్పదని 5 వ వచనములో స్పష్టపరచబడినది.

1. మనకు అవసరమైన సహనము – వ. 1
2. దేవుడు మనలను గుంటలోనుండి పైకెత్తుట – వ. 2
3. తద్వారా కలిగే స్తుతి – వ. 3
4. ఆశీర్వాదమును గూర్చిన వాగ్దానము – వ. 4
5. అనేక ఆశ్చర్యక్రియలను జరిపించగల దేవుని శక్తి – వ. 5

దేవుని సామర్థ్యతను ఎన్నటికినీ తక్కువగా అంచనా వేయవద్దు. మన సమస్యలు గొప్పగా వుండి, వాటిని తట్టుకునే శక్తి మనము కోల్పోయి, పరిస్థితులు మన చేయి దాటి పోయినట్లు మనకు అనిపించవచ్చును. కానీ "దేవునికి సమస్తము సాధ్యము" (ఎఫెసి 3:20–21).

**ధ్యాన వచనము 3 :** *తనకు స్తోత్ర రూప మగు క్రొత్త గీతమును మన దేవుడు నా నోట నుంచెను. అనేకులు దాని చూచి, భయభక్తులు గలిగి, యెహోవాయందు నమ్మిక యుంచెదరు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ శక్తినిబట్టియు, నన్ను రక్షించుటకు నీవు జరిగించిన దానినంతటిని బట్టియు నీకు వందనములు. నీ నామమును స్తుతించి, నీ యందు నమ్మికయుంచెదను. యితరుల దృష్టిలో నీకు మహిమతెచ్చునట్లు నా జీవితమును ఉపయోగించుకొనుము.*

పై వాక్య భాగములో 6,7,8 వచనములు హెబ్రీ 10 వ అధ్యాయములో చెప్ప బడినవి. యీ వచనములు ప్రభువైన యేసుక్రీస్తు అనేకుల పాపముల కొరకు “ఒక్కసారే” సిలువలో బలిగా అర్పింపబడెనన్న సత్యమును సూచిస్తున్నవి. దావీదు యీ వచనములను తన సొంత జీవితమునకు వర్తింపజేసుకొనగా, దావీదుకంటె గొప్పవాడు, దావీదు కుమారుడుగా పిలువబడుచున్న ‘మెస్సీయ’ (ప్రభువైన యేసుక్రీస్తు) తండ్రియైన దేవుని చిత్తము నేరవేర్చుటకు మరియు తండ్రికి యిష్టమైన కార్యములను యెల్లప్పుడు చేయుటకు వచ్చెనని దీనిద్వారా తెలుసుకుంటున్నాము (యోహాను 8:29).

1. దేవుడు బలిని కోరడు - వ.6
2. దేవుని చిత్తమును జరిగించుటకు యివ్వవలసిన ప్రాధాన్యత -వ.7-8
3. దేవుని నీతిని గూర్చియు మరియు ఆయన గుణములను గూర్చియు మహా సమాజమునకు దావీదు ప్రకటించుట - వ.9-10
4. దేవుని కాపుదల - వ.11

దేవుని గుణములనుబట్టి మనము సంరక్షింపబడుచున్నాము. ఆయన విశ్వసనీయత, కనికరము, సత్యము మొదలగు గుణములు ఆయన మార్గముల వెనుక దాగియున్నవి. మన పట్ల ఉత్తమమైనది మరియు సరియైనది ఎల్లప్పుడూ జరిగించుటకు దేవుని మీద మనము సంపూర్ణముగా ఆధారపడవచ్చును.

**ధ్యాన వచనము 8 :** *నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము. నీ ధర్మశాస్త్రము నా ఆంతర్యములోనున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, బలుల నర్పించుటకంటె నీకు సంపూర్ణ విధేయత చూపించి, నీ చిత్తము నెరవేర్చవలెనన్నది నీ కోరికయని నేనెరుగుదును. నా జీవితమును, నాకున్న సర్వమును నీకు తిరిగి సమర్పించుకొనుచున్నాను.*

మనకు ఎదురవుతున్న శోధనలు మరియు పోరాటములను గూర్చి మనము దేవుని యెదుట యెల్లప్పుడూ తెరువబడిన హృదయముతోను, పారదర్శకముగాను వుండవలెను. మనకు హాని తలపెట్టి, మనలను వినాశమునకు గురిచేయాలని ప్రయత్నించే వారి నుండి మనలను దేవుడు మాత్రమే విమోచించును.

1. దావీదు ఎదుర్కొంటున్న కష్టములు – వ. 12
2. దావీదుకు అవసరమైన విమోచన – వ. 13
3. తనకు వినాశము కలుగజేయ ప్రయత్నించే వారిని యెదుర్కొనుమని దావీదు దేవుని కోరుకొనుట – వ. 14–15
4. దేవునియందు దావీదు కలిగియున్న సంతోషము – వ. 16
5. దావీదుకున్న నిరాశా పూర్వక పరిస్థితి, దేవుడు త్వరగా ఆదుకోవలసిన అవసరత–వ. 17

కొన్నిసార్లు దేవుడు త్వరగా మనలను ఆదుకొనుటకు రాడని మనకు అనిపిస్తుంటుంది. మన సంగతులను "యిప్పటికిప్పుడే" పట్టించుకొనమని మనము దేవుని కోరుకుంటాము. దేవుని సమయముకొరకు సహనముతో కనిపెట్టి, మన జీవితములలోని సమస్యలు దేవుని మార్గములద్వారా పరిష్కరింపజేసుకొనుట యెంతో కష్టతరమైనదన్న భావన మనము కలిగియుంటాము.

**ధ్యాన వచనము 16:** *నిన్ను వెదకు వారందరు నిన్ను గూర్చి ఉత్సహించి, సంతోషించుదురు గాక. నీ రక్షణను ప్రేమించు వారు – 'యెహోవా మహిమపరచబడునుగాక' అని నిత్యము చెప్పుకొందురుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవే నా సహాయకుడవు మరియు నా విమోచకుడవు. నాకున్న ఆందోళన లన్నిటిని నీ పాదములచెంత వుంచి, నీ యందు విశ్రమించి, ఆనందింతును.*

యీ కీర్తన దావీదు తన శత్రువులనుండి ఎదుర్కొంటున్న కష్టమును గురించి తెలియ జేయుచున్నది. దావీదు తమ శరీరములో ముల్లుగా వుండకుండ ఎప్పుడు చనిపోవునని వారు ఎదురుచూచిరి. తన శత్రువులు తీసుకువచ్చు ఒత్తిడి మరియు వారి అబద్ధముల వల్ల దావీదు గొప్ప శ్రమను అనుభవించాడు. మన చుట్టు వున్న యీ లోకము మనతో స్నేహము చేయదు (యాకోబు 4:4). ఆపత్కాలములో మనలను విడిపించు దేవునియందే మనము నమ్మిక కలిగియుండవలెను.

1. నీతిమంతుని లక్షణము – వ. 1
2. నీతిమంతుని సంరక్షణ – వ. 2
3. నీతిమంతునికి కలుగు ఆదరణ – వ. 3
4. స్వస్థతకొరకై దావీదు ప్రార్థన – వ. 4
5. తన శత్రువులనుండి దావీదు యెదుర్కొన్న సమస్య – వ. 5

మన ఆత్మలలోని కలతను దేవుడు మానసికంగా మరియు ఆత్మీయంగా స్వస్థపరచును. దావీదు దేవునియెదుట తన పాపములను, బలహీనతలను కప్పుకొనక, వాటిని పదే పదే ఆయనముందు ఒప్పుకున్నాడు. కనుకనే దావీదు "దేవుని హృదయానుసారి" గా పిలువ బడ్డాడు.

**ధ్యాన వచనము 1 :** *బీదలను కటాక్షించు వాడు ధన్యుడు. ఆపత్కాల మందు యెహోవా వానిని తప్పించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ విమోచన మరియు నీ బలమును గూర్చిన వాగ్దానమునుబట్టి నీకు వందనములు.*

పై వాక్య భాగములోని 9 వ వచనము ఇస్కరియోతు యూదా యేసుక్రీస్తును యూదుల మతాధికారులకు అప్పగించుటను గూర్చి ప్రవచిస్తున్నది. ప్రస్తుత సందర్భములో దావీదు యెంతో నమ్ముకున్న ఆయన సలహా దారుడగు అహీతోఫెలు దావీదు పక్షమునుండి అబ్షాలోము పక్షమున చేరి, దావీదును వదలివేసెనని 9 వ వచనము ద్వారా గ్రహిస్తున్నాము. బత్షెబ భర్త ఊరియను చంపించి, ఆమెను భార్యగా చేసుకొన్న దావీదు తప్పిదమును ఆమె తాతయగు అహీతోఫెలు బహుశా క్షమించలేకపోయాడు. అయితే, మన ప్రభువైన యేసుక్రీస్తు మన పాపములను క్షమించడమే గాక, వాటిని ఎన్నడును తిరిగి జ్ఞాపకము చేసుకోడు.

1. దావీదు శత్రువుల వైఖరి – వ.6–7
2. దావీదు శత్రువుల నిందలు – వ.8
3. దావీదు స్నేహితుని మోసము – వ.9
4. దావీదు దేవునికి చేయు మనవి – వ.10–12
5. దావీదు దేవుని స్తుతించుట – వ.13

యింత వరకు ధ్యానించిన కీర్తనలలో మనము నేర్చుకున్న సత్యము స్పష్టంగా తెలియ జేయబడినది – *"మన సమస్యలు యెంత బాధాకరమైన వైనను, వాటిని దేవుని హస్తములలో వదలివేయవలెను."* మనకు బాధ కలిగించేది మన శత్రువులు మాత్రమే కాదు గానీ, చాలా సార్లు మనకు బాగా *"పరిచయమున్న సొంత స్నేహితుడే"* మనకు హాని కలుగజేయగలడు. దేవుడు మనకు జ్ఞానమును అనుగ్రహించును గాక.

**ధ్యాన వచనము 13 :** *ఇశ్రాయేలు దేవుడైన యెహోవా శాశ్వత కాలమునుండి శాశ్వత కాలము వరకు స్తుతింపబడును గాక, ఆమేన్. ఆమేన్.*

**ప్రార్థన:** *ప్రభువా, నా శత్రువు లేదా నా స్నేహితుడు నామీద నింద మోపునపుడు లేదా నన్ను ఎదిరించునపుడు, నా సమస్యలను నీ చేతులలో వదలివేయుటకు నాకు సహాయపడుము.*

ఉప్పు సముద్రమునకు పశ్చిమవైపున వున్న ఏన్గెదీ అరణ్యములోని జలపాతము యొద్దకు వెళ్లి, ఆ అందమైన ప్రదేశములో దావీదు ధ్యానములను ధ్యానించుట ఒక మధురమైన అనుభూతి. ఆ ప్రదేశములో యిప్పటికీ చాలా జంతువులు తిరుగులాడుచున్నవి. చాలా గుహలు కూడా వున్నాయి. దావీదు సౌలునుండి దాగుకొన్నప్పుడు ఆ గుహల్లో ఒకదానిలో నివసించాడు. ఆ ప్రదేశములో తాను దేవునికి చాలా దగ్గరగా జరిగి, తన స్తుతి, ఆరాధనను పదే పదే దేవునికి వ్యక్తపరిచాడు.

1. దేవుని కొరకు కీర్తనాకారుని ప్రాణము ఆశ పడుట - వ. 1-2
2. నొప్పితో కూడిన కీర్తనాకారుని మాటలు - వ. 3
3. దేవుని ప్రజలతో కలిసి దేవుని స్తుతించుటలో ఆనందించిన కీర్తనాకారుడు -వ. 4
4. దేవుని యందు మాత్రమే వున్న సమాధానమును కనుగొన్న కీర్తనాకారుడు - వ. 5

బహుశా నీవు దావీదువలె క్రుంగుదలలోను, గొప్ప అధైర్యములోను వున్నావేమో. దావీదు తన ధ్యానములలో కనుగొన్నట్లు, మన నిరీక్షణ దేవునియందు మాత్రమే వుండ వలెను. మన పరిస్థితులు మనలను అధైర్యపరుస్తాయి. అయితే దేవుడు మనలను ధైర్య పరుస్తాడు.

**ధ్యాన వచనము 2 :** *నా ప్రాణము దేవునికొరకు తృష్ణ గొనుచున్నది. జీవముగల దేవుని కొరకు తృష్ణ గొనుచున్నది. దేవుని సన్నిధికి నేనెప్పుడు వచ్చెదను? ఆయన సన్నిధిని నేనెప్పుడు కనబడెదను?*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నా నిరీక్షణ. నా ప్రాణము నీకొరకు ఆశపడుచున్నది. బాధలలోను, ఆపదలలోను నీవు యెల్లప్పుడూ నాకు తోడుగా వున్నావని తెలుసుకొనుటకు నాకు సహాయపడుము.*

42 వ కీర్తనలో *"నా ప్రాణమా, నీవు ఏల క్రుంగియున్నావు? నాలో నీవేల తొందర పడుచున్నావు?"* అనుమాటలు రెండుసార్లు వ్రాయబడినవి. దైవసేవకులు కొన్ని సమయములలో అనుభవించు పరిస్థితులను యీ మాటలు సూచిస్తున్నవి. మనము ఎల్లప్పుడూ ఆత్మీయంగా ఉన్నతస్థాయిలో వుండము. అప్పుడప్పుడు దిగువస్థాయిలో కూడా మనముంటాము. అయితే దిగువస్థాయిలో వున్నప్పుడు అధైర్య పడకుండా, దేవునియందు నమ్మికగలిగి, ఆయన సమయముకొరకు, ఆయన మార్గములకొరకు మరియు ఆయన వాగ్దానములకొరకు వేచిచూస్తూ, పరిస్థితులను ఎదుర్కోవాలి.

1. కీర్తనాకారుడు దేవుని జ్ఞాపకము చేసుకొనుట - వ.6
2. తాను అనుభవిస్తున్న సమస్యలను కీర్తనాకారుడు వర్ణించుట -వ.7
3. దేవునిపట్ల కీర్తనాకారుని ప్రతిస్పందన - వ.8
4. కీర్తనాకారుడు తన కష్టములను తిరిగి జ్ఞాపకము చేసుకొనుట -వ.9-10
5. దేవునికొరకు కనిపెట్టవలసిన అవసరమును కీర్తనాకారుడు తిరిగి గుర్తించుట-వ.11

నీవు యింకొక అడుగు ముందుకు వేయలేనంత కష్టంగా నీకు అనిపిస్తున్నప్పటికీ, దేవుడు నిన్ను ఏమాత్రమును విడువడని, ఎన్నడును ఎడబాయడని జ్ఞాపకముంచుకొనుము. దేవుడు సదాకాలము నివసిస్తున్న దేవుడు.

**ధ్యాన వచనము 8 :** *అయినను పగటి వేళ యెహోవా తన కృప కలుగనాజ్ఞాపించును. రాత్రి వేళ ఆయనను గూర్చిన కీర్తనయు, నా జీవదాతయైన దేవుని గూర్చిన ప్రార్థనయు నాకు తోడుగా వుండును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను ఎంతో అధైర్య పడిపోయినపుడు నాకు తోడుగా వున్నందుకు నీకు వందనములు.*

దావీదు విమోచనను కోరుకున్నాడు. కానీ తన అధైర్యకర పరిస్థితి గురించి తాను బాగా యెరిగియున్నాడు. దేవుడు తనకు *"ఆనంద సంతోషములు కలుగజేయు దేవుడని"* మరియు తన *"రక్షణ కర్త"* యని దావీదు స్పష్టము చేయుచున్నాడు. కొన్నిసార్లు మనము యేమి చేయాలన్నది మనకు తెలిసియుండవచ్చు. కానీ, దానిని ఆచరణలో పెట్టడము అంత సులభము కాదు. నీ నిరీక్షణ దేవునియందు కలిగియున్నావా? ఆయన పాదముల దగ్గర నీ భారమును మోపుచున్నావా? ఆయనను స్తుతించుచున్నావా?

1. దేవునినుండి న్యాయము మరియు విడుదలకొరకై దావీదు ప్రార్థన - వ. 1
2. తన దుఃఖమునుబట్టి దావీదుకు కలిగిన కలవరము- వ. 2
3. తన పక్షమున కార్యము జరిగించమని దావీదు మనవి - వ. 3
4. క్రుంగుదలలో వుండినను దావీదు దేవుని స్తుతించుట - వ. 4-5

కీర్తనలలో ఇది మూడవ సారిగా క్రుంగుదల మరియు మనోవ్యాకులము గురించి వ్రాయబడినది. క్రుంగుదలలో వున్న ప్రతిసారీ *"దేవునియందు మన నిరీక్షణ కలిగి యుండవలెనని"* దావీదు తనకు తాను గుర్తు చేసుకోవడమే కాకుండా, మన కందరికీ గుర్తు చేయుచున్నాడు.

**ధ్యాన వచనము 4:** *అప్పుడు నేను దేవుని బలిపీఠము నొద్దకు, నాకు ఆనంద సంతోషములు కలుగజేయు దేవునియొద్దకు చేరుదును. దేవా, నా దేవా, సితారా వాయించుచు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములోని సమస్యలతో నీవేమి చేయుదువో దానినిబట్టి నీకు వందనములు.*

యీ వాక్య భాగమును మనమందరము నమ్మినట్లుగా ఇశ్రాయేలు కూడా నమ్మ వలసియున్నది. దేవుడు గతములో జరిగించినది ప్రస్తుత దినములలో కూడా జరిగించుటకు సమర్థుడు. మన స్వబుద్ధిని, నేర్పరి తనమును, చాతుర్యమును నమ్ము కొనినయెడల చాలా సార్లు సమస్యల్లో చిక్కుకుంటాము. మన శతృవులందరి నుండి మనలను కాపాడగల దేవుని యందే మన నమ్మిక కలిగియుండవలెను.

1. దేవుడు ఇశ్రాయేలీయులపట్ల చేసిన కార్యములను గూర్చి తెలియజేయుట– వ. 1–2
2. ఇశ్రాయేలీయులు గతంలో పొందిన విజయమునకు గల కారణము – వ. 3
3. దేవుని విమోచనకొరకై మనవి –వ. 4–5
4. దేవునిమీద ఆధారపడుట – వ. 6–7
5. దేవుని నామము స్తుతింపబడుట – వ. 8

మనయందు మనమే నమ్మిక కలిగియుండడము మరియు దేవునియందు నమ్మిక కలిగియుండడము అనునవి రెండు వ్యతిరేకమైనవి. అన్ని సమయములలోను ఆయన మీద ఆధారపడి, ఆయన యేమై యున్నాడో మరియు ఏమి చేయగలడో వాటి నిమిత్తము ఆయనను స్తుతించుట నేర్చుకొనవలెనని దేవుడు కోరుకుంటున్నాడు.

**ధ్యాన వచనము 8:** *దినమెల్ల మేము దేవునియందు అతిశయపడుచున్నాము. నీ నామమును బట్టి మేము నిత్యము కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.*

**ప్రార్థన:** *ప్రభువా, నన్ను నేను నమ్ముకొన్నందుకు నన్ను క్షమింపుము. నీవు మాత్రమే సకల స్తుతి మరియు మహిమకు పాత్రుడవు. నీవు మాత్రమే నాకు విడుదల కలిగించు దేవుడవు.*

దేవునియందు నమ్మిక వుంచకపోవడంద్వారా దేవుని ప్రజలు గతంలో ఎలాంటి విషాదకర పరిస్థితులను ఎదుర్కొన్నారో యీ వాక్య భాగము తెలియజేయుచున్నది. చాలాసార్లు మనము భరింపలేనివిగా కనిపించే కష్టములతో జీవితము నిండియుంటుంది. మనము ఎంత కష్టతర పరిస్థితిద్వారా వెళ్లవలసివచ్చినను, మనలను విమోచింప శక్తిగల ఏకైక దేవుని మరచి పోకూడదని 17 వ వచనము ద్వారా గుర్తు చేయబడుచున్నాము. మనకు మేలు కలుగుటకు మరియు తన నామమునకు మహిమ కలుగుటకే దేవుడు మన జీవితములో ఆయా పరిస్థితులను అనుమతిస్తున్నాడు.

1. ఇశ్రాయేలీయులు ఎదుర్కొన్న పరిస్థితులు - వ. 9
2. వారు తమ శత్రువుల చేత దోచుకొనబడుట - వ. 10
3. అన్యజనులలోనికి వారు చెదరగొట్టబడుట - వ. 11
4. వారు అన్యజనులకు అమ్ముడు పోవుట - వ. 12
5. అన్యజనులచేత వారు ఎగతాళి చేయబడుట - వ. 13-14
6. వారు ఎదుర్కొన్న అవమానము - వ. 15-16
7. ఎంత కష్టము వచ్చినను వారు నిలకడగా వుండుట - వ. -17

మనము దేవునితో నడువకుండా వున్నప్పుడు ఆయన మన జీవితములలో కష్టములను తీసుకొని వచ్చును. ఆ కష్టములు మనలను శిక్షించుటకు కాదు గానీ, మనము సరిచేయబడి, ఆయనకు బలమైన మరియు ఫలవంతమైన సాక్షులుగా జీవించుటకని మనము తెలుసుకొన వలెను.

**ధ్యాన వచనము 17 :** *ఇదంతయు మా మీదికి వచ్చినను మేము నిన్ను మరువలేదు. నీ నిబంధన మీరి ద్రోహులము కాలేదు.*

**ప్రార్థన:** *ప్రభువా, ఏమి సంభవించినను నా హృదయము నీ మీద స్థిరముగా వున్నది. నీవు నా పట్ల సరియైనది మరియు మేలైనది జరిగించెదవని నేనెరుగుదును.*

మనము సహాయముకొరకు దేవునియొద్ద మొఱపెట్టుట సహజము. అయితే మనము కోరుకున్న జవాబే ప్రతిసారీ దేవునియొద్దనుండి పొందము. దేవుని సమయము మనమనుకొను సమయముకంటె ఎంతో భిన్నమైనది. తాను అనుభవిస్తున్న ప్రతి విషయము గురించి దేవునికి తనకంటె ఎక్కువ తెలియునని కీర్తనాకారుడు యెరిగియున్నాడు. ఆయన దేవుని నామమును మరువలేదు గానీ దేవునియొద్దనుండి తన ప్రార్థనలకు జవాబు ఎందుకు రావడం లేదని విస్మయము పొందుచున్నాడు. దేవుడు మనలను ఎడబాయ లేదనియు, మన ప్రార్థనలను ఆలకిస్తాడనియు మనము నేర్చుకొనవలసిన వారముగా వున్నాము. మన కందరికీ ఆయనదగ్గర కనిపెట్టుకొనవలసిన అవసరత వున్నది. మన జీవితములకు నిజంగా అవసరమైనది, ఉత్తమమైనది మరియు పరిపూర్ణమైనది ఆయన మార్గము మాత్రమే.

1. దేవునిపట్ల తనకున్న తీర్మానమును కీర్తనాకారుడు వ్యక్త పరచుట - వ. 18-21
2. దేవుడు అన్ని విషయములను యెరిగియున్నాడని కీర్తనాకారుడు గుర్తు చేయుట- వ. 22
3. విశ్వాసులు ఎటువంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నదీ కీర్తనాకారుడు జ్ఞాపకముంచుకొనుట - వ. 23
4. కీర్తనాకారుడు తన ప్రస్తుత పరిస్థితిని తలపోసి కొనుట - వ. 24-25
5. దేవుని కృపకొరకు కీర్తనాకారుడు మొఱపెట్టుట - వ. 26

దేవుడు మన సహాయకుడనియు, ఆయన కృప గల దేవుడు గనుక మనలను ఎన్నడును ఎడబాయడనియు మనము ఎన్నడును మరువకుందుము గాక!

**ధ్యాన వచనము 21 :** *హృదయరహస్యములు ఎరిగిన దేవుడు ఆ సంగతిని పరిశోధింపక మానునా?*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నా మొఱ ఆలకించ లేదని నేననుకున్నాగానీ నీవు ఆలకించు దేవుడవై యున్నందుకు నీకు వందనములు.*

యీ కీర్తన మెస్సీయ మరియు రాజులకు రాజైన ప్రభువైన యేసుక్రీస్తుకు ఒక అందమైన, శక్తివంతమైన నివాళి. యీ కీర్తనాకారుడు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క సౌందర్యము మరియు మహిమను యీ కీర్తనలో తలపోయుచున్నాడు. యిందులోని వచనములు నూతన నిబంధనలో యేసుక్రీస్తును గురించి వాడబడినవి. నీ చుట్టువున్న పరిస్థితులు చీకటి మయము గాను, కష్ట తరముగాను అనిపించినపుడు నీ తల యెత్తి కొనుము – నీ విడుదల సమీపించి యున్నది, యేసుక్రీస్తు వచ్చుచున్నాడు.

1. కీర్తనాకారుడు ప్రభువును గూర్చి చెప్పబోవు మాటలు – వ. 1
2. మెస్సీయ సౌందర్యము ఆరాధించబడుట – వ. 2
3. మెస్సీయ యొక్క సామర్థ్యము – వ. 3–4
4. తన శత్రువులపై మెస్సీయ వాడు బాణములు – వ. 5

ప్రభువైన యేసుక్రీస్తు శక్తితోను మరియు మహిమతోను తిరిగి రానైయున్నాడన్న సత్యము మన హృదయములను ఎంతో ఉప్పొంగింప జేయును. ఆయన ప్రభావము మరియు సౌందర్యము మన ఊహకు మించినదై యుండును.

**ధ్యాన వచనము 2 :** *నరుల కంటె నీవు అతి సుందరుడవై యున్నావు. నీ పెదవుల మీద దయారసము పోయబడియున్నది. కావున దేవుడు నిత్యము నిన్ను ఆశీర్వదించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ రాకడ దినము యొక్క మహిమ మరియు ప్రభావము యీ దినమంతయు మరియు నీ రాకడ వరకు నా హృదయము ఆనందముతో ఎదురు చూచుటకు కారణమగును గాక.*

పై వాక్యభాగములోని మాటలు ఎంతో అందమైనవి గాను, మనలను కదిలింపజేయునవి గాను వున్నవి. యీ వాక్య భాగము "అతనికి నమస్కరించుము" అను మాటలతో ముగియుచున్నది. యిది ప్రధాన అంశము. మన కొరకు తిరిగి రానైయున్న మెస్సీయ యొక్క మహిమ మరియు ప్రభావమును గూర్చి ధ్యానించినపుడు ఆయనను స్తుతించి, ఆరాధించుటకు దేవుడు మన హృదయములను ప్రేరేపించును గాక. వెనుకాడకుండా, యిప్పుడే ఆయనను స్తుతించుము, కీర్తించుము, హెచ్చించుము, ఘనపరుచుము, మహిమ పరచుము, ఆరాధించుము.

1. తిరిగి రానైయున్న మెస్సీయ యొక్క పరిపాలన – వ. 6
2. మెస్సీయ యితరులపై హెచ్చింపబడుట – వ.7
3. మెస్సీయయొక్క వైభవము – వ.8–9
4. మెస్సీయను జ్ఞాపకముంచుకొనుట – వ.10
5. మెస్సీయపట్ల మనకుండవలసిన ప్రతిస్పందన – వ.11

ఆయన సౌందర్యవంతుడు. పదివేలలో అతిసుందరుడు మరియు ఆశ్చర్యకరమైన ఆధ్యాత్మిక స్నేహితుడు.

**ధ్యాన వచనము 6:** *దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచును. నీ రాజ దండము న్యాయార్థమైన దండము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సౌందర్యము మరియు ప్రభావమునుబట్టి నిన్ను ఆరాధించుటకు నేను వచ్చెదను. నీవేమై యున్న దానినిబట్టి మరియు నీవు జరిగించబోవు దానినిబట్టి నీకు వందనములు.*

ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడలో అన్ని తరముల విశ్వాసులు ఆయనకు వధువుగా సమకూర్చబడి, ఆయనతో వివాహమాడునన్న సత్యమును పై వాక్య భాగములో చూడగలము. భవిష్యత్తులో విశ్వాసికి కలుగబోవు ఆశీర్వాదముల ముందు ప్రస్తుత కాలపు బాధలు, శ్రమలు, కష్టములు ఎన్నదగినవి కావు (1 కొరింథీ2:9).

1. రాజుయొద్దకు తీసుకు రాబడు బహుమానము - వ.12
2. రాజకుమార్తెయొక్క వస్త్రములు - వ.13-14
3. రాజ నగరులోని సంతోషము - వ.15
4. రాజకుమార్తె యొక్క గొప్పతనము - వ.16
5. దేవుని స్తుతించు తరములు - వ.17

ప్రభువైన యేసుక్రీస్తు మహిమను గూర్చిన ప్రకటన అన్ని తరముల వారు ఆయనను స్తుతించు నట్లు చేయును.

**ధ్యాన వచనము 17:** తరములన్నిటను నీ నామము జ్ఞాపకముండునట్లు నేను చేయుదును. కావున జనములు సర్వకాలము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురు.

**ప్రార్థన:** *ప్రభువా, నీ కుమారుడు మరియు నా రక్షకుడైన ప్రభువైన యేసుక్రీస్తు (మెస్సీయ) భూమియంతటి మీద రాజుగా వుండబోయే భవిష్యత్తు యొక్క మహిమపైన నా గురిని కలిగి యుండునట్లు చేయుము.*

యీ కీర్తన దేవునిపై కేంద్రీకృతమైనది. అనేక సార్లు మన కన్నులు మన చుట్టు వున్న పరిస్థితులపై మరియు యితరులపై నిలుపుకొని, మనకు అత్యంత అవసరమైన ప్రభువుయందు నమ్మికయుంచడములో విఫలమైపోతుంటాము. నీకు సహాయము చేయగలవాడు దేవుడొక్కడే. నీ పూర్ణ హృదయముతో ఆయనయందు విశ్వాసముంచుము.

"దేవుని పట్టణము" మనకొరకు రాబోవుచున్నది. దానిని సంతోషమయముగా చేయుటకు ఒక "నది" కూడా సిద్ధపరచబడియున్నది. గొప్ప శుభవార్త ఏమిటంటే దేవుడు యీ పట్టణమును తన నిత్యమైన నివాస స్థలముగా చేసుకొనబోవుచున్నాడు.

1. మన సహాయమునకున్న పునాది – వ. 1
2. మనము విడిచిపెట్టవలసిన భయము – వ. 2–3
3. రాబోవుచున్న మహిమతో కూడిన భవిష్యత్తు – వ. 4–5

భూమి యావత్తు "నిర్మూలింపబడి", పర్వతములు అదృశ్యమై పోయి, నీరు కదిలించ బడినను, నీవు దేవునియందు విశ్వాసముంచిన యెడల నీకు భయపడవలసిన అవసరము లేదు. దేవుడు మనకు "ఆశ్రయమును, దుర్గమును, ఆపత్కాలములో నమ్ముకొన దగిన సహాయకుడు" నై యున్నాడు.

**ధ్యాన వచనము 1 :** *దేవుడు మనకు ఆశ్రయమును, దుర్గమునై యున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు.*

**ప్రార్థన:** *ప్రభువా, ఆపద సమయములలో బలమును మరియు సహాయమును పొందుటకు నేను నీ దగ్గరకు వెళ్లవలెనను సత్యమును నాకు పదే పదే గుర్తుచేయుము.*

దేవుడు పొందబోవు విజయము భవిష్యత్తులో భూమి యందంతటను ప్రచురము చేయబడును. మన దేవుడు, "సైన్యముల కధిపతియగు యెహోవా" ప్రపంచ దేశములన్నిటిని ఓడింపబోవుచున్నాడు (యోవేలు 3, జెకర్యా 12,14). ఆయన ప్రతి ఒక్కరి కన్నుల యెదుట "మహోన్నతుడు"గా హెచ్చించబడును. భూమియందలి ప్రజలందరూ ఆయనను ఆరాధించుదురు. మన పరిస్థితులు చేజారి పోయినట్లు మరియు దుష్టులు ప్రబలిపోతూ వున్నట్లు మనకు అనిపించినను తీర్పు దినము రాబోవుచున్నదని ఎన్నడును మరువకుము. ఒక విశ్వాసిగా నీవు గెలుపుపొందే దేవునివైపు వున్నావు.

1. జనములు ఘోషించుట - వ. 6
2. మనకున్న ఆశ్రయము - వ. 7
3. మనము చూడబోవు ఫలితములు - వ. 8-9
4. మన దేవునిమీద మనము సంపూర్ణముగా ఆధారపడి యుండవలసిన వారము- వ. 10-11

యీ మాటలు ఎంతో గొప్ప ఆదరణను కలుగజేయుచున్నవి. మన దేవుడు పరిపాలించబోవుచున్నాడు - ఒకానొక దినము యీ సత్యము మనకందరికిని స్పష్టము చేయబడును. అన్నిటికంటె ఉత్తమంగా, ఆయన "మనకు తోడైయున్నాడు."

**ధ్యాన వచనము 10:** *ఊరకుండుడి. నేనే దేవుడనని తెలిసికొనుడి. అన్య జనులలో నేను మహోన్నతుడనగుదును. భూమిమీద నేను మహోన్నతుడనగుదును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను మౌనముగా ఉండి, యీ భూమిమీది దేశములన్నిటిమీద విజయముతో నీవు సమస్త జనులయెదుట మహోన్నతుడవయ్యే దినమును గూర్చి ధ్యానించుటకు సహాయపడుము.*

యీ కీర్తన రాజులకు రాజైన మన దేవునికి ఎంతో అద్భుతమైన స్తుతిగా వ్రాయబడినది. సమస్తముపైన మన దేవుడు అధికారముకలిగి, పాలించుచున్నాడని యీ కీర్తన బయలు పరచుచున్నది. ఆయన "సర్వభూమికి మహారాజై యున్నాడు" (వ. 2,7). ఆయన "తన పరిశుద్ధ సింహాసనముమీద ఆసీనుడైయున్నాడు" (వ. 8). ఆయన మాత్రమే మన స్తుతికి, ఆరాధనకు యోగ్యుడై యున్నాడు గనుక మనమెంతగానో ఆయనను ఆరాధించ బద్ధులమై యున్నాము. ఆయన మనలను ఒంటరిగా విడిచిపెట్టలేదని మరియు యీ జగత్తులో జరుగుచున్నదానినంతటిని చూస్తూ అలక్ష్యము చేయడని ఎరుగుట ఎంత ఆశీర్వాదకరము!

1. చప్పట్లతో కూడిన స్తుతి - వ. 1
2. సర్వ జనములపై దేవుడు పొందు విజయము - వ. 2-3
3. మనకొరకు దేవుడు ఏర్పాటు చేసిన స్వాస్థ్యము - వ. 4
4. దేవుని కీర్తించుటకు యివ్వబడిన ఆజ్ఞ - వ. 5-7
5. దేవుడు అన్య జనులపై విజయము పొందుట - వ. 8
6. దేవుని అధికారము క్రిందికి జనములు సమకూర్చబడుట -వ. 9-10

మనము సేవించుచున్న దేవుడు ఎంత బలవంతుడు! ఆయన సర్వ భూమికి రాజు. సమస్తమును తన అధీనములో కలిగియున్నాడు. ఆయనయొక్క మహిమగల నామమును స్తుతించుము. ఎన్నడూ సందేహించకుము.

**ధ్యాన వచనము 7:** *దేవుడు సర్వభూమికి రాజైయున్నాడు. రమ్యముగా కీర్తనలు పాడుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, అన్ని విషయములు నీ అధీనములో వున్నాయన్న సత్యమును ఎన్నడూ నేను సందేహించకుండునట్లు నాకు బోధింపుము.*

యింతవరకు ధ్యానించిన కీర్తనలలో దావీదు తన కృంగుదల మరియు అధైర్య కర పరిస్థితిని వ్యక్తపరుస్తూ వచ్చినట్లు చూచితిమి. ఆయన తన శత్రువుల నుండి వచ్చే దాడులను ఎదుర్కొనుటకు ప్రయత్నిస్తూ వచ్చాడు. యిప్పుడు ఆయన గెలుపును మరియు ఘన విజయమును గూర్చి తన కీర్తనలలో వ్రాయుచున్నాడు. దేవునియందు మరియు దేవుడు వాగ్దానము చేసిన అంతిమ విజయమునందు ఎంతో గొప్ప నమ్మికను వ్యక్త పరుస్తున్నాడు. “యెహోవా గొప్పవాడు” అను మాటలతో యీ దినమును ప్రారంభించుట ఎంతో మంచిది.

1. మన స్తుతులకు పాత్రుడైన దేవుడు – వ. 1బి
2. దేవుడు స్తుతించబడు స్థలము – వ. 1ఎ, 2
3. దేవుడు తాను స్తుతించ బడు స్థలమును కాపాడుట – వ. 3–7
4. దేవుని నామము నిరంతరము స్తుతింపబడునన్న వాగ్దానము – వ. 8

“మన దేవుని పట్టణము” (వ. 1,8) మరియు “మహారాజు పట్టణము” (వ. 2) అను మాటలు యీ కీర్తనలో నొక్కిచెప్పబడుచున్నాయి. అనగా యీ మాటలు ఒకానొక దినము యెరూషలేము పట్టణము భూమిమీద నున్న అన్ని పట్టణములకు పైగా హెచ్చింపబడునన్న సత్యమును సూచిస్తున్నవి. యెరూషలేము పట్టణము “దేవుని మహిమ” తో తిరిగి రూపొందించ బడుతుంది. మన నిరీక్షణ దేవునియందు వున్నది గనుక సందేహము లేకుండా దేవుని వాగ్దానములతో కూడిన మన భవిష్యత్తు ప్రకాశ మానముగా వుండబోవు చున్నది.

**ధ్యాన వచనము 1 :** *మన దేవుని పట్టణమందు ఆయన పరిశుద్ధ పర్వతమందు యెహోవా గొప్పవాడును, బహు కీర్తనీయుడునై యున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ లోకముతోనే నా జీవితము ముగియక దీనిని మించిన నిత్య జీవమును నాకు యిచ్చియున్నావు గనుక నీకు వందనములు. నీ మీదను, నీ వాగ్దానముల మీదను నా కన్నులు నిలుపుకొనుటకు నాకు సహాయపడుము.*

మన దేవుని హెచ్చించడమనేది మనకు అనుదినము వుండవలసిన ఒక అలవాటు. జీవితము అనేక కష్టతరమైన మనుష్యులతోను మరియు పరిస్థితులతోను నిండివున్నది. దీనినిబట్టి మన కష్టములను ఎదుర్కొనుటకు కృప నిచ్చే దేవునిపై కాక మన సమస్యలపైన మన దృష్టి నిలుపుకోవడము చాలా సులభము. అయితే దేవుడు మన కష్టములలో మనకు సహాయకుడు మాత్రమే కాక మనకు మహిమతో కూడిన భవిష్యత్తును వాగ్దానము చేసి యున్నాడు – ఆయన వచ్చుచున్నాడు మరియు *"ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడై యున్నాడు"*.

1. మనలను స్తుతింపజేసే దేవుని కృప – వ.9–10
2. అన్ని తరముల వారికి మనము సంతోష సమాచారమును వివరింపవలెను– వ.11–13
3. దేవుని సన్నిధి మరియు ఆయన వాగ్దానము యొక్క భావము – వ.14

*"సంతోషించుట"* మరియు *"ఆనందించుట"* (వ.11) – యీ మాటలనే మనము వినవలసిన వారముగా వున్నాము. దేవుడు మనకు యెల్లప్పుడూ తోడైయుండి, మనలను *"నడిపించెదనని"* వాగ్దానమిచ్చాడు.

**ధ్యాన వచనము 14:** *ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడై యున్నాడు. మరణము వరకు ఆయన మనలను నడిపించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాగ్దానములు నిజమైన వైనందుకు మరియు నా మార్గమంతయు నడిపించుటకు నీవు నమ్మ దగిన దేవుడవైనందుకు నిన్ను స్తుతించెదను.*

దేవునినుండి వచ్చు జ్ఞానము మనకెంతో అవసరమైనది. ఒకరి సామర్థ్యము, విద్య, అనుభవము మరియు వయసుతో నిమిత్తములేకుండా ప్రతిఒక్కరికి దేవుని జ్ఞానము అవసరమైయున్నది. యాకోబు 1:5–8 లో దానికొరకు ఎలా ప్రార్థించాలో చెప్పబడి యున్నది. జీవితములో మారుతున్న పరిస్థితులనుబట్టి భయపడి, ఒత్తిడికి లోనవవలసిన అవసరము లేదు. మనము దేవునికొరకు వెదకి, ఆయనను నమ్ముకొన్నట్లయితే, మనకు అర్థం కాని సంగతులపట్ల కూడా దేవుని జ్ఞానము సహాయముతో ఒక అవగాహన కలిగి యుందుము.

1. దేవుని జ్ఞానము అవసరమైన ప్రజలు – వ. 1–2
2. దేవుని జ్ఞానమునకు యివ్వవలసిన ప్రాధాన్యత – వ. 3
3. ఉపమాన రూపములో చెప్పబడినవాటిని దేవుని జ్ఞానము బయలుపరచును– వ. 4
4. దేవుని జ్ఞానము వలన మనకు కలిగే సమాధానము – వ. 5

నీవు యీ లోక రీతిగా "ధనవంతుడవై", యితరులకంటె పై అంతస్తులో వున్నట్లుగా నీ జీవితములో ఆశీర్వదింపబడియున్నావు గనుక దేవుని జ్ఞానముతో నీవు నింపబడలేదు. మన మందరము దేవుని యెదుట దిగంబరులముగాను, దేవుని జ్ఞానము ఎంతగానో అవసరమైన వారముగాను వున్నాము.

**ధ్యాన వచనము 3 :** *నా నోరు విజ్ఞాన విషయములను పలుకును. నా హృదయధ్యానము పూర్ణ వివేకమును గూర్చినదై యుండును.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో జరుగు సమస్త విషయములను గూర్చి నీ జ్ఞానము మరియు నీ వివేకము కలిగియుండే నిత్యమైన కోరిక నేను కలిగియుందునుగాక.*

మానవుని జీవితములో ధనము అపాయకరమైన సమస్యను తీసుకువస్తుంది. 1తిమోతి 6:6-10లో పౌలు సంతుష్టి కలిగియుండవలసిన అవసరమును గూర్చి వ్రాస్తూ, "ధనాపేక్ష" సమస్తమైన కీడులకు మూలమని చెప్పియున్నాడు. నీ ఆస్తియందు నీవు నమ్మికకలిగి యున్నట్లయితే అది మూర్ఖత్వమే అవుతుంది. "*అస్థిరమైన ధనమందు నమ్మిక యుంచక, సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మిక యుంచుమని*" 1తిమోతి 6:17 లో దేవుని వాక్యము సెలవిస్తున్నది. "అధిక" ధనము కలిగియుండాలన్నది నీకున్న గొప్ప అవసరత కానేకాదు. నీకు యెంత డబ్బు వున్నను, లేకున్నను, దేవునియందు నమ్మిక యుంచవలెనన్నది నీకున్న అతి పెద్ద అవసరత.

1. ధనము తీర్చలేని అవసరత - వ. 6-7
2. నిత్యజీవమును ధనముతో కొనుట అసాధ్యము - వ. 8-9
3. ధనమును, ఆస్తిని నమ్మువారు యితరులకు వాటిని స్వాస్థ్యముగా వదిలివెళ్లుదురు - వ10-11
4. మరణమును తప్పించుకొనుట అసాధ్యము - వ. 12-13

యీ వాక్య భాగము ధనముయొక్క తాత్కాలిక స్వభావమును గూర్చి గంభీరమైన రీతిలో తెలియజేయుచున్నది. అది ఎక్కువ కాలము నిలువదు మరియు నిత్య జీవమును కొనిపెట్టలేదు. నీకు ధనమున్నంత మాత్రమున దేవుని దృష్టిలో యితరులకంటె ఎక్కువ ప్రాముఖ్యతను పొందలేవు.

**ధ్యాన వచనము 12:** *ఘనత వహించిన వాడైనను మనుష్యుడు నిలువజాలడు. వాడు నశించు మృగములను పోలినవాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా కున్న డబ్బుయందు, ఆర్థిక వనరులయందు నమ్మిక ఎన్నడూ వుంచకుండా, వాటిని నీ మహిమకొరకు వాడుటకు సహాయపడుము.*

దేవునికి స్తోత్రములు. మనకు *"సమాధి తరువాత నిరీక్షణ"* వున్నది. పై వాక్య భాగములో కీర్తనాకారుడు మనము మరణించిన తరువాత యింకేమియు జరుగకుండా సమాప్తియగునని చెప్పుటలేదుగానీ, మనము మన ధనమునందు నమ్మిక యుంచకూడదనియు, యితరుల కంటె మనలను ముఖ్యులనుగా ఎంచుకొని, వారిని మన కంటె తక్కువగా పరిగణించ వద్దని హెచ్చరించుచున్నాడు.

1. మరణము, సమాధి మన పలుకుబడిని మరియు స్వరూపమును అంతము చేయును - వ. 14
2. పునరుత్థానమనే బహుమానము దేవునియొద్దనుండి కలుగును - వ. 15
3. ఈ జీవితమునకు సంబంధించిన మహిమ మన మరణముతో అంతమైపోవును - వ. 16-17
4. మరణము తరువాత మనము ఇతరులకు మేలు చేయలేము - వ. 18-19
5. ఒక మనుష్యుడు మరణించిన తరువాత అతని ఘనత జంతువుకంటె గొప్పదేమీ కాదు - వ. 20

ధనసంపాదన, ఆస్తిపాస్తులతో కూడుకొని, ఒకరి హోదాను, అంతస్తును వారికున్న ఆస్తినిబట్టి నిర్ణయించే మన సంస్కృతి పై దేవుని వాక్యము ఎంతగానో దోషారోపణ చేయుచున్నది. దేవుడు తన జ్ఞానముతో మనలను ఆశీర్వదించును గాక.

**ధ్యాన వచనము 15 :** *దేవుడు నన్ను చేర్చుకొనును. పాతాళబలములోనుండి ఆయన నా ప్రాణమును విమోచించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీయందు మా కున్న నిరీక్షణనుబట్టి నీకు వందనములు.*

పై వాక్య భాగములో 3 వ వచనములో వ్రాయబడిన "మన దేవుడు వేంచేయుచున్నాడు" అను మాటలు ఒక విశ్వాసికి ఎంతో ఆదరణ మరియు ఆశీర్వాదమును కలిగిస్తున్నాయి. అయితే దేవుని అలక్ష్యము చేసి, ఆయనకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేయువారికి యీ మాటలు తీవ్రమైన హెచ్చరికను యిస్తున్నాయి. దేవుడు అందరికీ తీర్పు తీరుస్తాడు, యెవరును తప్పించుకోలేరు. దుష్టులు వర్ధిల్లుతూ, "తప్పించుకుని తిరుగుతున్నట్లు" అనిపించిన యెడల ఒకానొక దినము దేవుని తీర్పు రాబోవుచున్నదని జ్ఞాపకముంచు కొనుము.

1. బలమైన దేవునియొక్క పిలుపు –వ. 1
2. దేవుని సౌందర్యము ప్రకాశించుట – వ. 2
3. దేవుడు మౌనముగా వుండడు – వ. 3
4. దేవుడు తన భక్తులను తన ఉగ్రతనుండి తప్పించును – వ. 4,5
5. దేవుని సార్వభౌమాధికారము బయలుపరచబడుట – వ. 6

*"నాథా, సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని"* ప్రకటన 6:9–11 లో బలిపీఠము క్రిందనున్న హతసాక్షులు బిగ్గరగా చేసిన ప్రార్థనలకు జవాబు త్వరలోనే రాబోవుచున్నది. తీర్పు దినము రాబోవుచున్నది.

**ధ్యాన వచనము 6 :** *దేవుడు తానే న్యాయకర్తయై యున్నాడు. ఆకాశము ఆయన నీతిని తెలియ జేయుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు అందరికీ న్యాయకర్తగా వున్నావనియు, నీకు మాత్రమే నా జీవితము యొక్క లెక్క అప్పజెప్పవలసినవాడనై యున్నాననియు నేను ఎన్నడూ మరువకుండుటకు సహాయపడుము.*

దేవుడు మనయొద్దనుండి నిజంగా ఏమి కోరుకుంటున్నాడు? ఇశ్రాయేలీయులు దేవునియొద్దకు బలులను తీసుకువచ్చేవారు. ఆయన వారిని బలులను అర్పించడం కొనసాగించమని చెప్పాడు కానీ వారి హృదయము ఆయనకు దూరముగా వున్నది. దేవునికి "స్తుతియాగము" చేయుటకును, "ఆపత్కాలములో" ఆయనకు "మొఱ పెట్టుటకును" దేవుడు ఇశ్రాయేలీయులను ఆహ్వానించాడు. వారిని విడిపించెదనని దేవుడు వాగ్దానము చేశాడు. అంతేగాక "నీవు నన్ను మహిమపరచెదవు" అని 15వ వచనము చివరి భాగములో స్పష్టంగా సెలవిచ్చాడు. 1 కొరింథి 10:31 చదువుము.

1. తన ప్రజలపట్ల దేవుని ప్రతిస్పందన - వ. 7
2. ఇశ్రాయేలీయుల బలులను దేవుడు తృణీకరించుట - వ. 8-9
3. భూమిమీది వనరులన్నీ దేవునికి చెందినవే - వ. 10-13
4. దేవుడు మనయొద్దనుండి కోరుకునేవి - వ. 14-15

దేవుని పనిలో నిమగ్నమై పోవడమనేది ఒక్కొక్కసారి ఎండిపోయిన, ఖాళీయైన, నిష్ఫలితమైన జీవితమువైపుకు దారితీస్తుంది. దేవునితో నడచుచున్నావని నీకై నీవు నచ్చ జెప్పుకొనుటకు పరిచర్య చేయడమువలన ప్రయోజనము లేదు. దేవుడు తనను మహిమ పరచవలెనని నిన్ను కోరుకుంటున్నాడు. ఆయన నీపట్ల జరిగించిన సమస్తమునుబట్టి ఆయనకు వందనములు చెల్లించవలెనని, యెల్లప్పుడూ ఆయనకు మొఱపెట్టవలెనని దేవుడు నిన్ను కోరుకుంటున్నాడు.

**ధ్యాన వచనము 14:** *దేవునికి స్తుతియాగము చేయుము. మహోన్నతునికి నీ మ్రొక్కుబడులు చెల్లించుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను చేయు క్రియలు నా హృదయముయొక్క ఆరాధనకు బదులుగా వుండగలవని నేను అనుకున్నందుకు నన్ను క్షమించుము.*

యెవరు కూడా దేవుని దృష్టిలో నుండి తప్పించు కొనలేరు. ప్రతి మనిషి హృదయములోని తలంపులు మరియు ఉద్దేశ్యములు, అవి మంచి వైనను, దుష్టత్వముతో కూడిన వైనను, దేవుడు వాటిని సంపూర్ణముగా యెరిగియున్నాడు. దేవుడు తన తీర్పును దుష్టుల మీదకును, "దేవుని మరచు" వారి మీదకును (వ. 22) తీసుకు వచ్చునని యీ వాక్య భాగము స్పష్టముగా తెలియజేయుచున్నది.

1. దుష్టుడు దేవుని వాక్యమును ఘనపరచుట మూర్ఖత్వము - వ. 16-17
2. దుష్టుల ప్రవర్తనను గూర్చిన వాస్తవములు - వ. 18-20
3. దుష్టత్వమును చూచియు దేవుడు ఏమీ చేయడని అనుకొనుటలో గల దోషము - వ. 21-22
4. దేవుడు ఘనపరచే విశ్వాసము - వ. 23

దేవుని అలక్ష్యము చేయడమనేది ప్రమాదకరమైన పని. మనము ఆయన యెఱుక నుండి లేదా తీర్పునుండి తప్పించుకోలేము. దేవునితో నీ సహవాసము విషయములో నీవెక్కడ నిలబడి యున్నావు? నీ జీవితము 16-22 వచనములలో వర్ణింపబడినదా? లేదా 23 వ వచనములో దేవుడు తన రక్షణను కనపరచే వారిలో నీవును ఒకరిగా వున్నావా?

**ధ్యాన వచనము 23 :** *స్తుతియాగము అర్పించువాడు నన్ను మహిమపరచుచున్నాడు. నేను వానికి దేవుని రక్షణ కనుపరచునట్లు వాడు మార్గము సిద్ధపరచుకొనెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను ఎల్లప్పుడు నీమీద ఆధారపడి యుండవలెనన్న సత్యమును జ్ఞాపకము చేసుకొని, నిన్ను స్తుతించి, మహిమపరచవలెనని కోరుకుంటున్నాను.*

బత్షెబతో వ్యభిచారము చేసి, ఆమె భర్తను చంపించుట ద్వారా దావీదు చేసిన పాపము ఆయన దేవునినుండి పొందిన అద్భుతమైన విజయము మరియు విడుదలపై గొప్ప కళంకమును తెచ్చిపెట్టింది. దావీదు "దేవుని హృదయానుసారి"గా యెందుకు పిలువబడినాడో పశ్చాత్తాపముతో కూడిన యీ చక్కని కీర్తనద్వారా బయలుపరచబడు చున్నది. దావీదు "విరిగి, నలిగిన హృదయము" కలిగియుండెను. నీకు అటువంటి హృదయమున్నదా? దేవుడు తప్పకుండా క్షమిస్తాడు. అయితే మనము పాపమును ఒప్పుకొని, పశ్చాత్తాప పడవలసిన అవసరము మనకున్నది.

1. దేవుని కృపకొరకై దావీదు ప్రార్థన - వ. 1
2. తన పాపమును కడుగుమని దావీదు దేవునితో చేసిన మనవి- వ. 2
3. దేవునికి వ్యతిరేకముగా తాను చేసిన పాపమును దావీదు ప్రకటించుట- వ. 3-4
4. తన హృదయ పతనావస్థను, తన నేపథ్యమును దావీదు దేవునియెదుట ఒప్పుకొనుట- వ. 5
5. దావీదు ఒప్పుకోలులో సత్యమునకున్న ప్రాధాన్యత - వ. 6

మనము పాపక్షమాపణను, కడుగుదలను పొందాలంటే మన పతనావస్థను మరియు పాపస్వభావమును గుర్తించుట ఎంతో ప్రాముఖ్యము. దేవునియొద్ద యేదియు దాచుకొనుటకు ప్రయత్నించవద్దు. అది అసంభవము. అంతేగాక అట్లుచేయుటద్వారా అధికమైన నొప్పిని అనుభవించెదము. నీ పాపమును దేవునియెదుట ఒప్పుకొనుము. ఆయన నిన్ను క్షమించుటకు నమ్మదగినవాడును, నీతిమంతుడునైయున్నాడు (1యోహాను 1:9).

**ధ్యాన వచనము 6 :** *నీవు అంతరంగములో సత్యమును కోరుచున్నావు. ఆంతర్యమున నాకు జ్ఞానము తెలియజేయుదువు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీనుండి దాగియుండలేనన్న సత్యము ఎప్పుడూ మనసున కలిగిన వాడనై, నాపాపములు నీముందు ఒప్పుకొందును. నీ కృపా కనికరములను కాదని పాపులకు క్షమాపణ, వారి పాపముల కడుగుదలను గూర్చిన నిరీక్షణ వారికి వుండదు.*

ఒక పవిత్రమైన హృదయము కలిగియుండుట కంటె ఎక్కువ ఉత్తమమైనదేదీ లేదు. తన రక్షణానందము తనకు తిరిగి సమకూర్చబడాలన్నా, తాను తిరిగి యితరులను ప్రభావితము చేయాలన్నా, తాను దేవునిచేత కడుగబడాలన్న తన అవసరతను దావీదు తెలుసుకున్నాడు. మనము కూడా యీ సత్యమును తెలుసుకొనుట ఎంతో అవసరము! మన జీవితములలో ఒప్పుకొనని పాపమును కలిగి, పశ్చాత్తాప పడుటకు తిరస్కరించుట ద్వారా మనము మానసికంగా, శారీరకంగా మరియు ఆత్మీయంగా ఎంతో దు:ఖము, నొప్పికి గురియై నష్టపోయెదము.

1. దావీదు పాపము పరిహరింపబడుట– వ.7
2. సంతోషమును తిరిగి సమకూర్చుమని దావీదు దేవునితో చేయుమనవి – వ.8
3. దేవుడు చేయవలసిన పనిని దావీదు యెరిగియుండుట– వ.9
4. శుద్ధ హృదయముకొరకు దావీదు ప్రార్థన– వ.10
5. దావీదు హృదయమునకు ఎంతో అవరసమైన దేవుని సన్నిధి– వ.11
6. దేవుని శక్తితో సమకూర్చబడుటకు దావీదు ప్రార్థన– వ.12
7. దేవుని కట్టడలను బోధించుట– వ.13

దేవుడు శుద్ధహృదయము  మరియు సరియైన ఆత్మను గలిగిన వారినే తన పరిచర్యలో వాడుకొనును. యీ సత్యమును తెలుసుకొనుటకు నీ నేత్రములు తెరువుము.

**ధ్యాన వచనము 10 :** *దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము. నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా పాపమును నీముందు ఒప్పుకొని, వినయముతో నీ క్షమాపణ మరియు కడుగుదలకొరకు విన్నవించుకొందును.*

పశ్చాత్తాప పడడమనగా యింతవరకు మనము జరిగించిన చెడును యికమీద చేయకుండా మానివేయుట. అది వాస్తవమైనప్పుడు మనము విరిగిన హృదయము కలిగి యుందుము. మన హృదయము సరియైనదిగా వున్నప్పుడే మనము అర్పించు బలి (పరిచర్య) సరియైనదిగా యెంచబడుతుంది. మన హృదయములో దోషమున్నయెడల మనము చేయు పరిచర్యతో దేవుని తృప్తిపరచలేము. ఆయననుండి దాచలేము. విశ్వాసి మనసులోను, హృదయములోను పాపమున్నప్పుడు దేవుని స్తుతించుట కష్టము. మన హృదయములు దేవునియెదుట విరిగినవిగా వుండి, ఆయననుండి మాత్రమే వచ్చు కడుగుదలతో మన హృదయములు కడుగుకొని, దేవుని స్తుతించుదుము గాక!

1. దావీదుకు అవరసమై యున్న విడుదల– వ. 14
2. దేవుని స్తుతించుటకు దావీదు ఆయనమీద ఆధారపడుట – వ. 15
3. బలులు అర్పించుటపట్ల దేవుడు విధించిన షరతు– వ. 16–17
4. దేవునికి తృప్తి కలిగించే బలులు – వ. 18–19

నీవు చేయుచున్న పరిచర్య దేవునియెదుట శుద్ధమైన, విరిగిన, వినయముతో కూడిన హృదయముతో చేయుచున్నావో లేదో నిన్ను నీవే ప్రశ్నించుకొనుము.

**ధ్యాన వచనము 17:** *విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు. దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నిన్ను స్తుతించెదను. నేను కలుసుకొను ప్రతివారితోను నీవు యెంత ఆశ్చర్యకరుడవో తెలుపవలెనని కోరుకొందును.*

అనేకమంది తమ జీవితములను తప్పుడు పద్ధతులు, ప్రాధాన్యతలతో కట్టుకొందురు. కీర్తనాకారుడు అనేకుల జీవితములను పరిశీలించినవాడై, వారు జీవముగల దేవుని యందుగాక, తమ "ధనసమృద్ధి" యందు నమ్మిక గలిగియున్నారని తెలుపుచున్నాడు.

1. దుష్టుల అతిశయము - వ.1
2. నాలుకకున్న శక్తి- వ.2
3. దుష్టుల ప్రాధాన్యతలు - వ.3
4. దుష్టుల నాలుకలను దేవుడు అణగగొట్టుట- వ.4-5
5. నీతిమంతుల ఆలోచనావిధానము- వ. 6-7
6. నీతిమంతుల స్తుతి - వ. 8-9

దుష్టులు తమ సొంత సామర్థ్యమును, ధనమును నమ్ముకొని అవే తమ జీవితములలో ఎన్నదగినవని నమ్ముదురు. వారు మంచికంటె చెడును ఎక్కువగా ప్రేమించెదరు. అబద్ధమాడుటలోను, మోసము చేయుటలోను ఎలాంటి భయము, సంకోచము వారికి వుండవు. దేవుని కృపను ఎల్లప్పుడూ నమ్ముకొని జీవించుటకు దేవుడు మనకు సహాయము చేయునుగాక!

**ధ్యాన వచనము 8 :** *నేనైతే దేవుని మందిరములో పచ్చని ఒలీవ చెట్టువలెనున్నాను. నిత్యము దేవుని కృపయందు నమ్మికయుంచుచున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ జీవితములోని ధనముపై కాకుండా, నీమీద నాకన్నులు నిలుపు కొనుటకు సహాయము చేయుము.*

దేవుడు లేడని అనుకొంటూ, ఆయనకు మనము జవాబుదారులము కామని నమ్మడము కేవలము మూర్ఖత్వము. దేవుని ప్రజలను, ప్రత్యేకించి ఇశ్రాయేలీయులను దుష్టులు ఎంత కష్టపెట్టినప్పటికీ, ఒకానొక దినము దేవుడు ఇశ్రాయేలీయులను రక్షించును. దానినిబట్టి వారు ఆనందించెదరు.

1. మూర్ఖులు మేలు చేయలేరు - వ. 1-3
2. దుష్టత్వమును జరిగించు వారికుండు అభద్రతాభావము- వ. 4-5
3. సీయోనులోనుండి దేవుని విమోచన ఇశ్రాయేలునకు కలుగుట - వ. 6

దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులను విమోచించు దినము రాబోవుచున్నది. "*సీయోనులోనుండి ఇశ్రాయేలునకు రక్షణకలుగునుగాక*" అని 6వ వచనములో కీర్తనాకారునిచేత చేయబడిన ప్రార్థనకు జవాబు....రోమా 11:26లో ''*ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు*" అని పౌలు వ్రాసిన మాటలద్వారా యివ్వబడినది.

**ధ్యాన వచనము 6 :** *సీయోనులో నుండి ఇశ్రాయేలునకు రక్షణ కలుగును గాక. దేవుడు చెరలో నున్న తన ప్రజలను రప్పించునప్పుడు యాకోబు హర్షించును. ఇశ్రాయేలు సంతోషించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీయందు మాకున్న అద్భుతమైన నిరీక్షణ మరియు భవిష్యత్తునుబట్టి నీకు వందనములు.*

తన స్థానములో దేవుడు దావీదును ఎన్నుకొన్నాడని యెరిగి రాజైన సౌలు దావీదును చంపుటకు ప్రయత్నించుచుండగా దావీదు సౌలుయొద్ద నుండి పారిపోవుచుండెను. దావీదు దేవునిమీద ఆధారపడి జీవించుటద్వారా, ప్రత్యేకించి తాను ఒంటరిగా వున్న సమయములలో దావీదు దేవునిమీద ఆధారపడుటద్వారా చక్కటి సమాధానమును దేవుని యొద్ద కనుగొన్నాడు. నీవు యెక్కడున్నను, ఎటువంటి పరిస్థితులు యెదుర్కొంటున్నను దేవుడు నీకు తోడైయున్నాడన్న సత్యమును ఎన్నడూ మరువవద్దు.

1. దేవుని సహాయముకొరకు దావీదు ప్రార్థన- వ. 1-2
2. దావీదును చంపుటకు ప్రయత్నిస్తున్నవారు- వ. 3
3. దేవున్ని నిజముగా నమ్మిన దావీదు- వ. 4-5
4. తన విమోచననుబట్టి దేవుని స్తుతించిన దావీదు- వ. 6

కొన్ని సమయములలో మనము దేవుడు యేమి చేయుచున్నాడన్నది చూడలేము. మనచుట్టూ ఒత్తిడికి లోనై, ఏమి చేయాలో తెలియని అయోమయ స్థితిలో పడిపోతూవుంటాము. అటువంటి సమయములో దేవుని స్తుతించి, ఆయనకు మొఱపెట్టవలెను.

**ధ్యాన వచనము 5-6 :** *స్వేచ్ఛార్పణలైన బలులను నేను నీ కర్పించెదను. యెహోవా నీ నామము ఉత్తమము. నేను దానికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నాకు సహాయకుడవుగా యెల్లప్పుడూ వున్నావని మరియు నీవు నన్ను విడిపించెదవని నేను చూచుటకు నాకు సహాయపడుము.*

పై వాక్యభాగములో దావీదు భయమును వ్యక్తపరుస్తూ, దేవునికి తన కష్టమును గూర్చి మొఱపెట్టుకుంటున్నాడు. విశ్వాసముగల హృదయముతో యీ వాక్య భాగమును నీవు చదివినయెడల దావీదు అనుభవిస్తున్న వేదనను అర్థం చేసుకోకుండా వుండలేవు. యిటువంటి పరిస్థితులు మనకు వచ్చినప్పుడు అనేకసార్లు *''గువ్వవలె నాకు రెక్కలున్న యెడల నేను ఎగిరి పోయి, నెమ్మదిగా నుందునే''* అని అనిపిస్తుంది.

1. తన మొఱను వినుమని దావీదు దేవునికి విన్నవించుకొనుట- వ. 1-2
2. దావీదు దేవునికి మొఱపెట్టుటకుగల కారణము- వ. 3
3. తన పరిస్థితులనుబట్టి దావీదు ప్రతిస్పందించిన తీరు- వ. 4-5
4. తాను యెదుర్కొంటున్న పరిస్థితులనుండి పారిపోవాలని దావీదుకు అనిపించుట- వ. 6-7

దేవుడు నీకు తోడుగా లేడని ఒక్క క్షణము కూడా అనుకోవద్దు. ఆయన నిన్ను ఎన్నడును విడువడు, ఎడబాయడు. మన మొఱలను వినుటకు ఆయన చెవులు తెరువబడియున్నవి. పారిపోకుము.

**ధ్యాన వచనము 1 :** *దేవా, చెవియొగ్గి నా ప్రార్థన ఆలకింపుము. నా విన్నపమునకు విముఖుడవై యుండకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకున్న సమస్యలు మరియు ఒత్తిళ్లనుండి పారిపోవుటకు ప్రయత్నించకుండా, నా భారమంతటిని నీ పాదములచెంత పడవేయునట్లు నాకు తోడైయుండుము.*

దుష్టులు మనచుట్టు వున్నారు. వారు చెప్పుచున్న వాటినుండి, చేయుచున్న వాటినుండి మనము తప్పించుకొనలేము. అయితే, ఎదిరింపులు మన “స్నేహితులు”గా పిలువబడుచున్న వారినుండియు, మనము నమ్ముకున్న వారినుండియు వచ్చినప్పుడు మనకు నిజంగా బాధకలుగుతుంది. దావీదుపైన తిరగబడినవానిని దావీదు తన “సహకారి, చెలికాడు మరియు పరిచయుడుగా” వర్ణించాడు. బహుశా దావీదు తనను అప్పగించిన తాను నమ్మకొనిన మంత్రియగు అహీతోపెలును గూర్చి యీ మాటలను చెప్పుచుండవచ్చును. అది బాధ కలిగిస్తుంది. అయితే, యింకొకసారి చెప్పుచున్నదేమనగా, శత్రువు నిన్ను ఓడింపనియ్యవద్దు. అటువంటి సమయములో దేవునికి మొఱ్ఱపెట్టవలెను.

1. దావీదుకు పారిపోవాలన్న కోరిక బలంగా వుండింది- వ. 8
2. దుష్టులు జరిగిస్తున్న వినాశకర కార్యములను గూర్చి దావీదు ప్రార్థించుట- వ. 9-11
3. తన స్నేహితుడే దావీదును మోసగించుట- వ. 12-14
4. తన శత్రువులకు మరణము కలుగవలెనని దావీదు ప్రార్థించుట- వ. 15
5. దావీదు దేవునిమీద ఆధారపడే అవసరము కలిగియుండుట- వ. 16

నీవు నమ్ముకున్న నీ స్నేహితుడు నిన్ను మోసము చేసినను లేదా బాధపరిచినను, అతనిపై నీ హృదయములో పగపెంచుకొని, ప్రతీకారము తీర్చుకోవాలని అనుకొనవద్దు. దానికంటె, నిన్ను రక్షించగల దేవునికి మొఱపెట్టుము.

**ధ్యాన వచనము 16 :** *అయితే నేను దేవునికి మొఱ్ఱపెట్టుకొందును. యెహోవా నన్ను రక్షించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నా స్నేహితులు నాకు కలిగించిన బాధలపై నా దృష్టివుంచకుండా, నీకు మొఱ్ఱపెట్టుకొనుటకు నాకు సహాయము చేయుము.*

మన స్నేహితులు మనకు నమ్మక ద్రోహము చేసి, “తమ హృదయములలో కలహము” కలిగియుండే సమయములను మనము ఎదుర్కొనే అవకాశముందని దావీదు మనకందరికీ గుర్తుచేయుచున్నాడు. అయితే మన సంగతులను తన సమయానుసారము, తన మహిమ కొరకు మరియు మన మేలుకొరకు దేవుడే సరిచేయగలడని ఆయనను నమ్ముకుని, మన భారమంతా మనము ఆయనమీద మోపవలెను. యెవరు కూడా తప్పుచేసి, దేవునియొద్దనుండి తప్పించుకొనలేరు. తమ తప్పిదమునకు ప్రాయశ్చిత్తము అనుభవించాల్సి వుంటుంది.

1. దావీదుయొక్క ప్రార్థన సమయములు– వ. 17
2. దేవుడు మాత్రమే యివ్వగల సమాధానము– వ. 18
3. దేవుడు మారుమనస్సు లేనివారిని శిక్షించును– వ. 19
4. మన స్నేహితులు కలుగజేయగల బాధ – వ. 20–21
5. మన భారము యెహోవామీద మోపవలెను – వ. 22–23

22వ వచనములో “*నీ భారము యెహోవామీద మోపుము, ఆయనే నిన్ను ఆదుకొనును*” అని వ్రాయబడిన మాటల ప్రకారము మన భారమును దేవునిమీద మోపవలసిన గొప్ప అవసరత మన హృదయములకున్నది. అనేకసార్లు మన భారమును మనమే మోస్తూ వుంటాము. తద్వారా మన భారము మనము చేసే ప్రతి క్రియను, చెప్పే ప్రతి మాటను శాసిస్తుంది. నీ భారమును వదలివేయుము. దానిని దేవునికి అప్పగించుము.

**ధ్యాన వచనము 22:** *నీ భారము యెహోవామీద మోపుము. ఆయనే నిన్ను ఆదుకొనును. నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనీయడు.*

**ప్రార్థన:** ప్రభువా, నిన్ను అలక్ష్యము చేసి, నా సమస్యలను ఎన్నో సార్లు నాకు నేనే పరిష్కరించు కొనుటకు ప్రయత్నిస్తూ వుండినందుకు నన్ను క్షమించుము.

తన శత్రువులు తనను యెదిరించినప్పుడు లేదా తనమీద వారు ఒత్తిడి తీసుకు వచ్చినప్పుడు దేవునియందు విశ్వాసముంచవలసిన సమయము వచ్చియున్నదని దావీదు స్పష్టము చేయుచున్నాడు. నీవు భయపడినపుడు లేదా యేమి చేయాలో, యేమి చెప్పాలో నీకు తోచనపుడు దేవునియందు విశ్వాసముంచుము. అట్లు చేసినపుడు యితరులు నీకేమైనా చేసెదరన్న భయము నీకుండదు.

1. దేవుని కృపకొరకై దావీదు మొఱపెట్టుట - వ. 1
2. దావీదుకు అనుదినము కలుగుతున్న ఆందోళన- వ. 2
3. దేవునియందు నమ్మిక కలిగియుండవలెనని తీర్మానించుకున్న దావీదు - వ. 3-4
4. దుష్టులు దావీదుకొరకు పొంచియుండుట - వ. 5-6
5. తనకు వ్యతిరేకముగా పోరాడు వారిని అణగగొట్టమని దావీదు ప్రార్థన - వ. 7

ప్రభువైన యేసుక్రీస్తు యీ భూమికి తిరిగివచ్చి, తన నీతి రాజ్యమును మనందరి కొరకు స్థాపించే సమయము వచ్చువరకు నీతిమంతులను మాటల ద్వారాను, శారీరకంగానూ హింసించే దుష్టులు ఎల్లప్పుడూ వుందురు. అయితే ప్రస్తుతమున్న మనము మన పూర్ణ హృదయములతో దేవునియందు నమ్మికయుంచవలెను.

**ధ్యాన వచనము 4 :** *దేవునిబట్టి నేను ఆయన వాక్యమును కీర్తించెదను. దేవునియందు నమ్మికయుంచియున్నాను. నేను భయపడను. శరీరధారులు నన్నేమి చేయగలరు?*

**ప్రార్థన:** *ప్రభువా, నన్ను రక్షించు నీ హస్తములు నా చుట్టూ వున్నవని విశ్వసించెదను. నీ చిత్తమును కాదని నాకేమియు సంభవింపదు.*

దేవుడు మన గురించి సమస్తమును యెరిగియున్నాడు. మనము అనుభవించిన బాధలు, యెదుర్కొన్న కష్టములు, సహించిన విషాదములన్నీ ఆయనకు తెలియును. వీటన్నిటి మధ్య మనము దేవునియందు నమ్మికయుంచి, ఆయనను స్తుతించుట ద్వారా మన ప్రతిస్పందనను కనపరచవలెనని కీర్తనాకారుడు స్పష్టపరుస్తున్నాడు. ఆయన చేతులకు అప్పగించినపుడు ప్రతి పరిస్థితి సరిచేయబడును.

1. దేవుడు సమస్తమును యెరిగియున్నాడని దావీదు గుర్తించుట - వ. 8
2. దేవుడు తనను కాయుచున్నాడన్న నిశ్చయత దావీదు కలిగియుండుట- వ. 9
3. దావీదు దేవుని స్తుతించే వైఖరిని కనపరచుట- వ. 10,11,13
4. దేవుడు తనకు జరిగించిన మేలును దావీదు గుర్తించుట- వ. 12

దేవుడు *"మరణములో నుండి నీ ప్రాణమును తప్పించియున్నట్లయితే"*, అదే దేవుడు *"జారిపడకుండ నీ పాదములను తప్పించలేడా?"*

**ధ్యాన వచనము 10 :** *దేవునిబట్టి నేను ఆయన వాక్యమును కీర్తించెదను. యెహోవాను బట్టి ఆయన వాక్యమును కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీయందును మరియు నీ వాక్యమునందును నమ్మికయుంచెదను. నిన్ను స్తుతిస్తూ నా సమయము గడపవలెనని కోరుకొనెదను.*

దావీదు సౌలుయొద్దనుండి పారిపోయి, ఉప్పు సముద్రమునకు పశ్చిమ వైపునవున్న ఏన్గెదీ గుహలలో దాగుకొని యుండెను. అటువంటి తీవ్రమైన పరిస్థితులలో దావీదు దేవుని స్తుతించి, ఆయనను హెచ్చించెననియు, ఆయన తనకు కృపను కనపరచి, తనపై జరుగుతున్న హత్యాయత్నములన్నిటినుండి తనను రక్షిస్తాడనే విశ్వాసము దావీదు కలిగియుండెననియు ఆయనను గూర్చి చదువుదుము.

1. దేవుని రెక్కల నీడ- వ.1
2. దేవుడు మాత్రమే రక్షణ కలుగజేయగలడని దావీదు యెరిగియుండుట - వ.2-3
3. ప్రమాదకర పరిస్థితులమధ్య వున్న దావీదు - వ.4
4. దేవునికి స్తుతి కీర్తన, ఆయనను హెచ్చించే కీర్తన దావీదు హృదయములోనుండి వచ్చుట - వ.5-11

దేవుని స్తుతించుటకు తనకున్న తీర్మానమును సూచిస్తూ, “నా హృదయము నిబ్బరముగా వున్నది” అని దావీదు చెప్పాడు. మన మాలాగు చెప్పగలమా? మన ప్రార్థనకు జవాబు దేవుడు తన సొంత సమయములో, తనదైన మార్గములోనే అనుగ్రహిస్తాడు. మనము ఆయనయందు పూర్ణమైన విశ్వాసముకలిగి, ఆయనను స్తుతించుట ద్వారా బలవంతులమై యుందుము.

**ధ్యాన వచనము 5,11 :** *దేవా, ఆకాశము కంటె అత్యున్నతుడవుగా నిన్ను కనుపరచుకొనుము. నీ ప్రభావము సర్వభూమిమీద కనబడనిమ్ము.*

**ప్రార్థన:** *ప్రభువా, ఆకాశముకంటె హెచ్చుగాను మరియు భూమి అంతటికి పైగాను హెచ్చించబడి, స్తుతించబడుటకు నీవు మాత్రమే యోగ్యుడవు.*

దుష్టత్వము జరిగించు వారందరిపైనా దేవుని న్యాయముతో కూడిన తీర్పు రావలెనని దావీదు యీ కీర్తన ద్వారా తన ఉద్దేశ్యమును వ్యక్తపరుస్తున్నాడు. దావీదు యీ కీర్తనలో దుష్టుల గురించి వివరిస్తూ, దేవుడు వారిపై ప్రతీకారము తీర్చుకునే దినము రాబోవు చున్నదని ఆనందిస్తున్నాడు.ప్రకటన గ్రంథములో కూడా దేవుడు తన ఉగ్రత దినమందు భూమి మీదనున్న జనులందరి పైనా విజయము సాధిస్తాడని చదువుదుము.

1. అధిపతులు, నరులయొక్క నీతిని గూర్చి దావీదు ప్రశ్నించుట – వ. 1
2. దుష్టులను గూర్చి దావీదు విశ్లేషించుట – వ. 2–5
3. దుష్టులను శిక్షించుమని దావీదు దేవునికి విన్నవించుకొనుట – వ. 6–8
4. దేవుని ప్రతి దండనను గుర్తించిన దావీదు – వ. 9–11

యీ లోకములో పరిస్థితులెంత దిగజారినను దేవుని ప్రతిదండన మరియు ఆయన తీర్పు లోకస్తులపైకి రాబోవుచున్నది. అప్పుడు పరిస్థితులన్నీ సరిచేయబడును. దానిని గూర్చి మనము ఖచ్చితంగా చెప్పవచ్చును. మన దేవుడు న్యాయవంతమైన, నీతివంతమైన తీర్పును లోకముపై తీసుకు రాబోవుచున్నాడు గనుక దావీదు దానిని *"నీతిమంతులకు కలుగు ఫలము"* గా వర్ణిస్తున్నాడు.

**ధ్యాన వచనము 11 :** *కావున నిశ్చయముగా నీతిమంతులకు ఫలము కలుగుననియు, నిశ్చయముగా న్యాయము తీర్చు దేవుడు లోకములో నున్నాడనియు మనుష్యులు ఒప్పుకొందురు.*

**ప్రార్థన:** *ప్రభువా, ఒకానొక దినము నీవు యీ భూమిమీద నీతిని నెలకొల్పి, దుష్టులకు తీర్పు తీర్చే దేవుడవైనందుకు నీకు వందనములు.*

రాజైన సౌలు దావీదు సింహాసనముమీద కూర్చోబెట్టబడునన్న దేవుని వాగ్దానమును బట్టి భయపడ్డాడు. సౌలు తన మనుష్యులతో కలిసి దావీదును కనుగొని, చంపవలెనని ప్రయత్నిస్తున్నాడు. తన పాపములకొరకు కాకుండా కేవలము దేవుడు తనను రాజుగా ఏర్పరచుకున్న కారణమునుబట్టి తరుమబడుతున్న దావీదు ఎంతో దుర్భర పరిస్థితిలో యీ కీర్తనను వ్రాయుచున్నాడు. దేవుడు మనలను బలమైన రీతిలో వాడుకోవాలని ఉద్దేశిస్తే, దాని అర్థము మనకు ఒత్తిడి, హింసలు, నిందలు కలుగవని కాదు. దేవునిపైననే మన కన్నులను నిలుపవలసిన అవసరత మనకు ఎంతగానో వున్నది.

1. దేవుని విమోచనకొరకు దావీదు ప్రార్థన - వ. 1-2
2. దేవుని సహాయముకొరకై దావీదు విన్నపము - వ. 3-4
3. దుష్టులపై తన శిక్షను తీసుకురమ్మని దావీదు దేవుని కోరుకొనుట - వ. 5
4. దావీదు శత్రువులు ప్రతిరాత్రి తనకు వ్యతిరేకంగా చేయు పనులు - వ. 6-7
5. దేవుని వైఖరి మరియు ఆయన కాపుదలను గూర్చి దావీదు చాటి చెప్పుట- వ. 8-9

మన దేవుని రాజ్యము వచ్చువరకు మనపై దాడిచేసే దుష్టులు ఎల్లప్పుడూ వుందురు. దానిని దేవుడు అనుమతించి, ఆ పరిస్థితులద్వారా మనము వెళ్లుటకు ఒక ప్రణాళికను ఆయన కలిగియుంటాడు. మనము ఆయనయందు నమ్మికయుంచి, ఆయన సహాయము మీద అన్ని సమయములలో ఆధారపడుటద్వారా సరియైన ప్రతిస్పందన కలిగియుందుము.

**ధ్యాన వచనము 9 :** *నా బలమా, నీ కొరకు నేను కనిపెట్టుచున్నాను. నా ఉన్నతమైన దుర్గము దేవుడే.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నన్ను యెన్నడును ఎడబాయవనియు, శత్రువునుండి వచ్చు ఎలాంటి ఎదిరింపులైనా నీకు తెలియనివి కావనియు నేనెరుగుదును. నీయందు మాత్రమే నేను నమ్మికయుంచెదను.*

దేవుడు దుష్టులను తనదైన మార్గములో మరియు తన సమయములో యెదుర్కొంటాడని దావీదు నమ్మిక కలిగియున్నాడు. దుష్టులు ఎంత మొరిగినను, దావీదు దేవుని నామమునకు స్తుతులు పాడుచూ, ఆయన శక్తిని ఆశ్రయించి, తన హృదయమును ఆయన మీద నిలుపుకొని యున్నాడు.

1. దేవునియందు దావీదుకున్న నమ్మకము – వ.10–11
2. దుష్టులు నిర్మూలము చేయబడుట – వ.12–13
3. దుష్టులు మొరుగుట – వ. 14–15
4. దేవుడు తన పక్షమునవుండి, తనను కాపాడునన్న ఒప్పుదల దావీదు కలిగి యుండుట – వ. 16–17

దేవుని స్తుతించి, ఆయన బలమును గూర్చి కీర్తించుట ఎంతో ప్రాముఖ్యమైనది. దేవునిమీద మన దృష్టి నిలుపుటద్వారా నీ కష్ట పరిస్థితులనుండి, యీ లోకములోని దుష్టులు నీపై తీసుకురాగల ఒత్తిళ్లనుండి నీ కనుదృష్టి తొలగించుకొనగలవు.

**ధ్యాన వచనము 17 :** *దేవుడు నాకు ఎత్తయిన కోటగాను, కృపగల దేవుడుగాను ఉన్నాడు. నా బలమా, నిన్నే కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, దుష్టులనుండి నేను ఏది ఎదుర్కొన్నను నీవు దానియంతటి నుండి నన్ను తప్పించే దేవుడవు గనుక నీకు వందనములు. యీ కారణమునుబట్టి నేను నీ బలమును గూర్చి పాడెదను.*

యోవాబు ఉప్పు పల్లములో పండ్రెండు వేల మంది ఎదోమీయులను చంపి తిరిగి వచ్చినప్పుడు దావీదు పై వాక్య భాగములోని మాటలను రచించాడు. యిందులోని 3వ వచనములో ముఖ్యమైన మాటలను చూడగలము : "నీ ప్రజలకు నీవు కఠిన కార్యములు చేసితివి". మనకు కావలసిన జవాబులన్నీ మనకు దొరకవు. జీవితము ఎన్నో "కఠిన విషయములతో" కూడుకొనియున్నది.

1. దేవుడు ఇశ్రాయేలీయులయెడల కలిగియున్న వైఖరిపట్ల దావీదు ఆందోళన– వ. 1
2. దేవుని బలమును గూర్చి దావీదు వ్యాఖ్యానించుట – వ. 2
3. దేవుడు చేయుచున్న కార్యముపట్ల దావీదు కలిగియున్న తీర్మానము – వ. 3–4
4. దేవుని విమోచనకొరకు దావీదు మొఱపెట్టుట – వ. 5
5. దేవుడు సెలవిచ్చిన మాటపై దావీదుకున్న నమ్మకము – వ. 6

పై వాక్య భాగమును పరిశీలించినయెడల, దేవుడు జరిగించిన కార్యములను దావీదు నొక్కి వక్కాణించుచున్నాడు. ఆ కార్యములలో కొన్ని : "*దేవుడు చెదర గొట్టియున్నాడు, దేవుడు చేసియున్నాడు, దేవుడు బద్దలుచేసియున్నాడు, దేవుడు బయలుపరచియున్నాడు, దేవుడు మాటయిచ్చియున్నాడు, దేవుడు యిచ్చియున్నాడు*" మొదలగునవి. దేవుడు ఏమి చేయుచున్నాడు, ఏమి చేసియున్నాడు అను వాటిపై మనకున్న గ్రహింపు మీద మన సమాధానము ఆధారపడియుండును.

**ధ్యాన వచనము 6 :** *తన పరిశుద్ధత తోడని దేవుడు మాటయిచ్చియున్నాడు. నేను ప్రహర్షించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు చేయుచున్నది చూచి, దానియందు నన్ను నేను నెమ్మది పరచుకొని, ఆనందించుటకు నాకు సహాయపడుము.*

దేవుడు మనకు ఎంతో అవసరమై యున్నాడన్న సత్యమును పై వాక్య భాగము గుర్తు చేయుచున్నది. యిందులో తెలుపబడిన ప్రదేశములన్నీ దేవునికి చెందుచున్నవి. ఆయన మాత్రమే మనకు విజయము అనుగ్రహించగలడు. ఇశ్రాయేలీయులకు అవసరమైన సహాయమును దేవుడు మాత్రమే అందించగలడన్న సత్యమును దావీదు స్పష్టము చేయుచున్నాడు. మన నమ్మిక ఆయనయందు ఉండవలయును.

1. అన్ని దేశములు దేవుని అధీనములో వున్నాయి – వ.7–8
2. దేవుని సహాయముకొరకు మొఱపెట్టుట – వ.9–10
3. మనిషి సామర్థ్యము, సహాయము సరిపోదు – వ.11
4. దేవుడు మాత్రమే కలుగజేయు విజయము – వ. 12

*"మనుష్యుల సహాయము వ్యర్థము. శత్రువులను జయించుటకు మాకు సహాయము దయచేయుము"* అని 11 వ వచనములో దావీదు సెలవిచ్చిన మాటలు ఎంతో నిజమైనవి. మనుష్యులు మనకు సహాయము చేయలేరు. అయితే దేవుని సహాయము మనకు అవసరమై యున్నది.

**ధ్యాన వచనము 12 :** *దేవుని వలన మేము శూరకార్యములు జరిగించెదము. మా శత్రువులను అణగ ద్రొక్కువాడు ఆయనే.*

**ప్రార్థన:** *ప్రభువా, యితరులు నాకు చేయు వాగ్దానములయందు నమ్మిక యుంచకుండా, నేను ఎల్లప్పుడూ నీ సహాయము కోరునట్లు నా కన్నులు నీపై నిలువజేయుము.*

యీ లోకములోని ఒత్తిళ్లను ఎదుర్కొనుటకు యీ కీర్తనద్వారా మనకు లభిస్తున్న ప్రోత్సాహము ఎంతో అవసరము. దేవుడు వున్నాడా అనియు, మన మొఱలను వింటున్నాడా అనియు మన ప్రాణములో మనము సులభంగా తల్లడిల్లిపోగలము. మన చుట్టూ మనలను భయకంపితులనుగా చేసి, మనలను బెదిరించే పరిస్థితులనుండి కాపాడుటకు దేవుడు మనకు "ఆశ్రయము"గాను, "బలమైన కోట'' గాను వున్నాడని దావీదు హామీ యిచ్చు చున్నాడు.

1. తన ప్రార్థనకు జవాబు దయచేయమని దావీదు దేవుని కోరుట - వ. 1
2. దావీదు సమస్య పరిష్కరించబడుటకు అవసరమైన దేవుని సహాయము - వ. 2
3. దావీదు దేవుని స్తుతించుట - వ. 3
4. దేవునియందు నమ్మికయుంచవలెనని దావీదు నిర్ణయించుకొనుట - వ. 4
5. దావీదు దేవునిచేత కాపాడబడుట - వ. 5-7
6. దావీదు తన మ్రొక్కుబడులను దేవునికి చెల్లించుట - వ. 8

*"నేను ఎక్కలేనంత యెత్తయిన కొండ"* అని 2 వ వచనములో వ్రాయబడిన మాటలు ప్రభువునే సూచిస్తున్నాయి. దేవుడు *"తన రెక్కల చాటున"* మనలను భద్ర పరుస్తాడు. దేవుని ప్రేమ మరియు కాపుదల యీ మాటల ద్వారా ఎంతో చక్కగా వ్యక్త పరచబడియున్నవి.

**ధ్యాన వచనము 8 :** *దినదినము నా మ్రొక్కుబడులను నేను చెల్లించునట్లు నీ నామమును నిత్యము కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో ప్రేమతో కూడిన నీ సంరక్షణ, కాపుదలనుబట్టి నీకు వందనములు.*

మనము మౌనముగా వుండుట చాలా కష్టము. అయితే, *"దేవుని నమ్ముకొని, మౌనముగా వుండుట"* అను మాటలు దేవునిమీద మనము ఆధారపడి యుండవలెనన్న సత్యమును సూచిస్తున్నాయి. శత్రువులనుండి రాబోయే ఎదిరింపులకు పరిష్కారము దేవుని నమ్ముకొని, మౌనముగావుండుట మాత్రమే అని దావీదు బాగా యెరిగియున్నాడు. అనగా నీవు దేవుని నమ్ముకొని, ఉత్తమమైన దానిని నీపట్ల దేవుడు జరిగిస్తాడని పూర్ణమైన విశ్వాసము కలిగియుండుట. రోమా 8:28 లో, *"దేవుని ప్రేమించు వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని"* గుర్తు చేయబడుచున్నాము. యీ సత్యము మనకు మొదట్లో సరియైనదిగా అనిపించకపోయినప్పటికీ, సంవత్సరములు గడిచేకొద్దీ, మనమేలుకొరకు మరియు ఆయన మహిమకొరకు దేవుడు తన చిత్తమును మన జీవితములలో జరిగించు చున్నాడని స్పష్ట పరచబడుచున్నది. మనము మనమీద కాకుండా ఆయనమీద ఆధారపడియుండుటద్వారా సంతోషము కలిగిన వారమౌదుము.

1. మనకు అవసరమైన రక్షణ దేవునినుండి వచ్చును – వ. 1
2. మన జీవితమునకు స్థిరత్వము కలుగజేసేది దేవుడే – వ. 2
3. మనము ఎదుర్కొంటున్న పరిస్థితులు ఎన్నడూ సులభతరంగా వుండవు – వ. 3-4
4. మనము దేవునిమీద ఆధారపడినప్పుడే మౌనముగా వుందుము – వ. 5
5. మన జీవితముయొక్క బలము దేవునియందే కలిగియుందుము – వ. 6

4 వ వచనములో వ్రాయబడినట్లు కొందరికి *"అబద్ధమాడుట సంతోషము. వారు తమ నోటితో శుభ వచనములు పలుకుచు అంతరంగములో దూషించుదురు"*. నీ పరిస్థితుల మీద, నిన్ను బాధ పరచవలెనని చూస్తున్న వారిమీద కాక, నీ కన్నులు దేవుని మీదనే నిలుపుము.

**ధ్యాన వచనము 1-2:** *ఆయనే నా ఆశ్రయ దుర్గము, ఆయనే నా రక్షణ కర్త. ఎత్తయిన నాకోట ఆయనే, నేను అంతగా కదిలింపబడను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితము నీమీద పూర్తిగా ఆధారపడియున్నది. నా జీవితమునకు బలమును, స్థిరత్వమును నీవే.*

దేవుని బలము మరియు ఆయన కృప గొప్ప ధననిధిగా వున్నాయి. 8 వ వచనములో "ఆయన సన్నిధిని మీ హృదయములు కుమ్మరించుడి. దేవుడు మనకు ఆశ్రయము" అని వ్రాయబడినది. ఒక్కొక్కసారి మన జీవిత పరిస్థితులు మనలను అణచివేసి, దేవునియందు ఎల్లప్పుడు నమ్మిక కలిగియుండవలెనన్న మన కోరికను బలహీనపరచడం ద్వారా మనము ఎటూ తోచక సతమతమై పోతుంటాము. పరిస్థితులు ఎంత కష్టంగా వున్నా దేవునిమీద నుండి నీ కన్నులను ప్రక్కకు తొలగించవద్దు. 10 వ వచనములో ఒక ప్రాముఖ్యమైన కట్టడ మరియు హెచ్చరికను చదువుచున్నాము : *"ధనము హెచ్చినను దానిని లక్ష్య పెట్టకుడి". "ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము* కాదని" యేసుక్రీస్తు లూకా 12:15 లో సెలవిచ్చాడు.

1. దేవునియందు మనకున్న ఆశ్రయము – వ. 7
2. మనము దేవునిపట్ల కలిగియుండవలసిన ప్రతిస్పందన – వ. 8
3. మనుష్యుల అల్పత్వము – వ. 9
4. మనకున్న ధనము మనలను రక్షించదు – వ. 10
5. దేవుడు తన బలమును గూర్చి స్పష్ట పరచుట – వ. 11
6. దేవుడు మనుష్యులకిచ్చు ప్రతిఫలము – వ. 12

దేవునియందు యెల్లప్పుడూ విశ్వాసము కలిగియుండడమనగా మన జీవితములో యిక ఎలాంటి ఆపద లేదా ఒత్తిడి రాదని కాదు. అవి వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో దేవుని విశ్వసించుట ద్వారా తెలుసుకొందుము. మనకు ఆయన బలము అవసరము. ఆయనకు మొఱపెట్టువారందరికీ ఆయన బలము అందుబాటులో వున్నది.

**ధ్యాన వచనము 8 :** *జనులారా, యెల్లప్పుడు ఆయనయందు నమ్మికయుంచుడి. ఆయన సన్నిధిని మీ హృదయములు కుమ్మరించుడి. దేవుడు మనకు ఆశ్రయము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీయందు నమ్మికయుంచి, నా జీవిత భవిష్యత్తులో నీ వాగ్దానముల మీద, నీ బలముమీద ఆధారపడుచున్నాను.*

దేవుడు యెవరో, ఆయన యేమి చేయగలడో యెరిగియున్న వారు దేవునికొరకు ఆకలి దప్పులు కలిగియుందురు. యీ కీర్తన విశ్వాసియొక్క హృదయమునకు ఆశీర్వాదముగాను, ప్రోత్సాహకరంగాను వున్నది. మనము దేవుని వెదకినపుడు ఆయనకున్న "లక్షణములు" మన "జీవము కంటె వుత్తమములని" కనుగొందుము. మన ప్రాణములు "తృప్తి పరచబడి" మన నోట సంతోషము నిండియుండును. తన జీవితములో ఎదిరింపులు, ఒత్తిళ్లు కలిగినప్పటికీ రాజైన దావీదు తన ప్రమాణము మరియు దేవునియందు తనకున్న సంతోషమును గూర్చి చక్కని మాట 11 వ వచనములో వ్రాసియున్నాడు: "రాజు దేవుని బట్టి సంతోషించును". మన జీవితములో పరిష్కరింపబడని సమస్యలను, నిందారోపణలను దేవుని చేతులలో వదలివేయవలెను. తన సమయములో మరియు తన మార్గములో ఆయనే సంగతులన్నియు సరిజేయును.

1. దేవుని వెదకుట - వ. 1
2. దేవుని బలమును, ఆయన ప్రభావమును దావీదు దర్శించుట - వ. 2
3. దేవుని స్వభావమునుబట్టి దావీదు పొందిన తృప్తి - వ. 3,5,6
4. రాత్రి జాములలో దేవుని గూర్చి దావీదు కలిగియుండు జ్ఞాపకములు - వ. 4
5. దేవుని రెక్కల నీడ - వ. 7
6. దేవుడు దావీదు ప్రాణమును ఆదుకొనుట - వ. 8
7. దావీదును యెదిరించు వారికొరకు వేచియున్న ఖడ్గము - వ. 9-10
8. అబద్ధములాడువారి నోరు మూయబడుట - వ. 11

దేవుడు మన సంగతులన్నీ సరిజేయగల దేవుడని మనము నమ్మవలెను. ఆయన కృప మరియు ఆయన సహాయముకొరకు కనిపెడుతూ, ఆయనను స్తుతించవలెను.

**ధ్యాన వచనము 1-2 :** *దేవా, నా దేవుడవు నీవే. వేకువనే నిన్ను వెదకుదును. నీళ్లు లేక యెండి యున్న దేశమందు నా ప్రాణము నీ కొరకు తృష్ణగొనియున్నది. నీ మీది ఆశచేత నిన్ను చూడవలెనని నా శరీరము కృశించుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వెవరివనే దానినిబట్టి నిన్ను స్తుతించినప్పుడు నా హృదయము బలము నొంది, పూర్తిగా తృప్తి పరచబడినది.*

దుష్టుల బాణములు నీతిమంతులపైకి ఎగురుతూ వస్తాయి. కానీ దేవుడు వారిని బాణముతో తిరిగి కొట్టునన్న నమ్మకము దావీదు వ్యక్త పరుస్తున్నాడు (వ. 7). తనను "భయము" నుండి, తన శత్రువుల నుండి కలుగుతున్న బెదురునుండి విమోచించుమని దావీదు ప్రార్థించు చున్నాడు. యితరులు మనగురించి యేదో చెబుతారని లేదా మనకేదైనా హాని చేస్తారని మనము సులభంగా భయపడిపోతాము. అయితే, దేవుడు మనకు ఆశ్రయము గాను, మన కాపరిగాను వున్నాడు. మరొకసారి మనము "ఆయనయందు విశ్వాసముంచ వలెనని" యీ కీర్తన ద్వారా ప్రోత్సహించబడుచున్నాము.

1. దేవుని కాపుదలను దావీదు కోరుకొనుట – వ. 1–2
2. దుష్టుల ఎత్తుగడలను గురించి దావీదు వర్ణించుట – వ. 3–6
3. దుష్టులు శిక్షించబడుటకై దావీదు దేవునిమీద ఆధారపడుట – వ. 7–8
4. దేవుని కార్యములు తెలియజేయబడుట – వ. 9
5. నీతిమంతులు సంతోషించుట – వ. 10

నీకు శత్రువు నుండి కలుగుతున్న ఎదిరింపుల గురించి దేవునికి తెలియదని యెప్పుడూ అనుకోవద్దు. తన సమయములో శత్రువులపై ప్రతీకారము తీర్చుకుంటానని దేవుడు వాగ్దానము చేయుచున్నాడు.

**ధ్యాన వచనము 10 :** *నీతిమంతులు యెహోవానుబట్టి సంతోషించుచు, ఆయన శరణు జొచ్చెదరు. యథార్థ హృదయులందరు అతిశయిల్లుదురు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా విరోధులనుండి నన్ను రక్షించి, నా తరపున వారితో వ్యాజ్యెమాడెదవన్న నిశ్చయతనుబట్టి నీకు వందనములు. నేను నీయందు నమ్మికయుంచెదను.*

మనము దేవుని ఆరాధించి, ఆయన మేలుచేత “తృప్తిపొందవలయునని” యీ కీర్తనలో దావీదు మనలను ప్రోత్సహించుచున్నాడు. మన కష్టములగురించి సణుగు కొనుట ద్వారా మనమేమీ సాధించలేము. సమస్తమును పరిపాలించుచున్న దేవుని స్తుతించి, ఆయన యెడల మన భక్తిశ్రద్ధలను కనపరచవలెను.

1. ప్రార్థనలకు జవాబిచ్చే దేవుని దావీదు స్తుతించుట – వ. 1–2
2. మన పాపములు తొలగింపబడుట – వ. 3
3. మనము ఆరాధించుటకు కూడివచ్చు స్థలము – వ. 4
4. మన ప్రార్థనలకు జవాబునివ్వగల దేవుని బలము – వ. 5–7

నీవు దేవుని మేలుచేత నిజంగా తృప్తి పరచబడియున్నావా? ఆయన నీకు నిజంగా *“ఆశ్రయంగా”* వున్నాడా? దేవుడు *“మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగలిగియున్నాడు”.*

**ధ్యాన వచనము 2 :** *ప్రార్థన ఆలకించువాడా, సర్వశరీరులు నీ యొద్దకు వచ్చెదరు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ బలమును మరియు నా జీవితములోని అన్ని పరిస్థితులలోను నీవు చేయబోవు ఆశ్చర్య కార్యములను చూచుటకు నాకు సహాయము చేయుము.*

కొన్నిసార్లు మనము చేయుచున్న పనులను ఆపి, దేవుడు సృష్టించి, పోషిస్తున్న యీ అద్భుతమైన సృష్టివైపు మన దృష్టి నిలుపవలెను. యీ ప్రపంచములోని సృష్టిద్వారా దేవుడు జరిగించు ఆశ్చర్య క్రియలను దావీదు తనకు తాను గుర్తు చేసుకొని, దేవుని యందు ఆనందించుచూ, ఆయన శక్తిని ఆశ్రయించుచున్నాడు.

1. ఉదయ, సాయంత్రములు సంతోషభరితముగా వుండుట - వ. 8
2. దేవుని నది - వ. 9-10
3. ప్రకృతి యావత్తు దేవుని మేలునుబట్టి స్పందించుట - వ. 11-13

దేవుని మంచితనము మరియు ఆయన బలమును గూర్చిన రుజువు యీ ప్రపంచములోని ప్రతి స్థలములో కనిపించుచున్నది. ప్రకృతి యావత్తు దేవుని సంరక్షణకు సాక్ష్యముగా వున్నది. ప్రేమతో కూడిన దేవుని కాపుదలను మనము ఎన్నడూ సందేహించలేము. ఎందుకనగా దేవుడు మనలను మొక్కలు మరియు జంతవుల కంటే శ్రేష్టముగా యెంచుచున్నాడు (మత్తయి 6:25-34).

**ధ్యాన వచనము 13 :** *పచ్చిక పట్లు మందలను వస్త్రమువలె ధరించియున్నవి. లోయలు సస్యములతో కప్పబడియున్నవి. అన్నియు సంతోషధ్వని చేయుచున్నవి. అన్నియు గానము చేయుచున్నవి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సృష్టియొక్క అద్భుతములను మరియు నీ సృష్టి అంతటిని నీ శక్తితో నీవు పోషించు విధానమును చూచుటకు నా కన్నులు తెరువుము.*

యీ కీర్తనలో కీర్తనాకారుడు మనము నిమ్మళంగా వుండకుండా, దేవుని స్తుతించ వలెనను సత్యమును వక్కాణిస్తున్నాడు. *"సర్వలోక నివాసులారా, దేవుని గూర్చి సంతోష గీతము పాడుడి".* మనము ఎలుగెత్తి దేవుని స్తుతించాలని కీర్తనాకారుడు కోరుకుంటున్నాడు. దేవుని అద్భుతమైన శక్తిని గూర్చి ఉద్ఘాటిస్తూ, *"సర్వలోకము నీకు నమస్కరించి, నిన్ను కీర్తించును"* అని ఆయన పలుకుచున్నాడు. మానవులు దేవుని స్తుతించుటకొరకు ఆయన చేత సృష్టించబడ్డారు. ఆయనను స్తుతించుటలో మనము ఎంతో గొప్ప తృప్తిని కలిగి యుంటాము.

1. యీ లోక ప్రజలపట్ల కీర్తనాకారుని కోరిక – వ. 1–2
2. దేవుని బలము ముందు శత్రువుల లొంగుబాటు – వ. 3–4
3. దేవుని బలమును గూర్చి కీర్తనాకారుని వర్ణన – వ. 5–7
4. దేవుడు జరిగించిన కార్యములనుబట్టి ఆయనను హెచ్చించుట – వ. 8–9

మన కన్నులను దేవునిపై నిలిపి, ఆయన ఏమి చేయగలడు మరియు ఏమి చేయ బోవుచున్నాడు అను వాటిపై మన ధ్యాస వుంచినయెడల మనము అధికమైన సమాధానము కలిగియుందుము. మన పరిస్థితులు అనేకసార్లు మనలను ఒత్తిడి, కలవరము, సందేహము లవైపు నడిపించి, దేవుని ప్రశ్నించే స్థితిలోనికి మనలను తీసుకువెళ్తాయి. దేవునికి అసాధ్యమైనది ఏదియు లేదు.

**ధ్యాన వచనము 4 :** *సర్వలోకము నీకు నమస్కరించి, నిన్ను కీర్తించును. నీ నామమును బట్టి నిన్ను కీర్తించును.*

**ప్రార్థన:** *ప్రభువా, సణుగులతో కాకుండా స్తుతితో నేను స్పందించుటకు నాకు సహాయము చేయుము. నీ గొప్ప శక్తిని చూచి, సంపూర్ణముగా నిన్ను నమ్ముకొనుటకు సహాయ పడుము.*

కీర్తనాకారుడు ఇశ్రాయేలీయులు గతంలో పొందిన శ్రమలను గూర్చి వ్రాస్తూ, దేవుని యొద్దకు స్తుతి, ఆరాధనలను కానుకలుగా తీసుకొని రావలసిన అవసరతను గూర్చి తెలియ జేయుచున్నాడు. "నా నోరు వచించిన మ్రొక్కుబడులను నేను నీకు చెల్లించెదను" (వ. 14) అని ఆయన చెప్పుచున్నాడు. మనలో అనేకులము దేవుడు ఏమి కోరుచున్నాడో తెలుసుకొనుటలో విఫలులమౌతుంటాము. దేవుడు మన ఆరాధనను, మన స్తుతిని కోరుచున్నాడు.

1. దేవుని ప్రజలు నిర్మలులుగా చేయబడుట – వ. 10
2. దేవుడు తన ప్రజలను శ్రమలద్వారా నడిపించుట – వ. 11–12
3. ఆపత్కాలములో మ్రొక్కుబడులను చెల్లించుట – వ. 13–14
4. బలుల నర్పించి, దేవుని ఆరాధించుట – వ. 15

మనము ఆపదలలో వున్నప్పుడు దేవుని సేవించవలెనని తీర్మానించుకుంటాము. కానీ మన ఆపదలనుండి దేవుడు మనలను విమోచించినపుడు మనము దేవునితో చేసిన తీర్మానములను గూర్చి మరచిపోతాము. గతములో నీవు అటువంటి తీర్మానము చేసి, దానిని నెరవేర్చుట మరచిపోయావా?

**ధ్యాన వచనము 10:** *దేవా, నీవు మమ్మును పరిశీలించియున్నావు. వెండిని నిర్మలము చేయు రీతిగా మమ్మును నిర్మలులను చేసియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీతో చేసిన వాగ్దానములను, మ్రొక్కుబడులను నెరవేర్చుకొన వలెనని కోరుకొనుచున్నాను.*

దేవుడు తనపట్ల జరిగించిన దానిని కీర్తనాకారుడు పై వాక్య భాగములో మనకు తెలియజేయుచున్నాడు. దేవుడు చాలా మంచివాడు. ఆయన మనము గుర్తెరుగనన్ని విధములలో మనలను ఆశీర్వదించును. దేవుని మంచితనము మన స్తుతిలో ప్రధానమైన అంశము. అయితే మన సమస్యను కీర్తనాకారుడు 18 వ వచనములో తెలుపుచున్నాడు: "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినక పోవును". అనగా సమస్య దేవునితో లేదు గానీ మన సొంత హృదయములలో వున్న పాపమే మనకు సమస్య. బహుశా ఆ పాపమును యిప్పుడు దేవునియెదుట ఒప్పుకొనుటకు సరైన సమయమేమో. దేవుడు నీ సమస్యల గురించి సమస్తము యెరిగియున్నాడు.

1. దేవుడు జరిగించిన కార్యములను గూర్చి ప్రకటించుట - వ.16-17
2. మన హృదయములలో పాపమునకు తావిచ్చుటవలన కలుగు ప్రమాదము- వ.18
3. మన ప్రార్థనలకు జవాబిచ్చుటలో దేవుని యొక్క నమ్మకత్వము - వ.19-20

మనము అర్హులము కానప్పటికీ దేవుడు మన ప్రార్థనలను ఆలకించి, వాటికి జవాబు యిచ్చుచున్న సత్యమును గూర్చి తెలుసుకొనుట ఎంతో ప్రోత్సాహము కలుగజేయుచున్నది. దీనికి కారణము ఆయన స్వాభావికంగా కనికరము గలవాడు మరియు *"దయాదాక్షిణ్య పూర్ణుడు".*

**ధ్యాన వచనము 20 :** *దేవుడు నా ప్రార్థనను త్రోసి వేయలేదు. నాయొద్దనుండి తన కృపను తొలగింపలేదు. ఆయన సన్నుతింపబడునుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను ఎన్నో సార్లు నిన్ను ఘనపరచవలసిన రీతిలో ఘనపరచలేదు. అయినను నీవు యెల్లప్పుడూ నాతో వున్నావు. నన్ను ఎన్నడూ ఎడబాయలేదు.*

పై వాక్య భాగములో దేవుని స్తుతించుటకు గల కారణములు కీర్తనాకారుడు తెలియ జేయుచున్నాడు. అయితే ఆ కారణములలో మొట్ట మొదటిది దేవుని స్వభావము. అనగా ఆయన యేమైయున్నాడో, దానినిబట్టి ఆయనను స్తుతింతుము. మన మార్గములన్నిటిలో ఆయన అధికారమునకు లోబడియున్న దానినిబట్టే మనము దేవుని యొద్దనుండి ఆశీర్వాదములు పొందెదమని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు. దేవుని స్తుతించుటలో విఫలులమైనప్పుడు మనకు మనమే నష్టమును కొనితెచ్చుకొందుము. మనము పట్టజాలనంత రీతిలో మనలను ఆశీర్వదించవలెనని దేవుడు కోరుకొనుచున్నాడు.

1. దేవుని రక్షణ ఎంతో అవసరమైయున్నది. వ. 1
2. దేవుని కరుణను గూర్చిన నిరీక్షణ – వ. 2
3. దేవుని బలమునుబట్టి ఆయనను స్తుతించవలెను – వ. 3–5
4. దేవుని స్తుతించుట ద్వారా కలుగు ఆశీర్వాదములు – వ. 6–7

మన జీవితములలో అనేకమైన దేవుని ఆశీర్వాదములను గూర్చి మనము తలంచ వచ్చును. వాటన్నిటినిబట్టి దేవుని స్తుతించవలెనన్న వర్తమానమును యీ కీర్తనద్వారా తెలుసుకొనుచున్నాము. దేవుని ప్రజలందరూ దేవుని స్తుతించుటకు ప్రోత్సహించ బడుచున్నారు. యిందుకు గల కారణములలో ఒక దానిని 3 వ వచనములో మనము చూడగలము – *"న్యాయమును బట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు. భూమిమీద నున్న జనములను ఏలెదవు".*

**ధ్యాన వచనము 3-4 :** *న్యాయమునుబట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు. భూమి మీద నున్న జనములను ఏలెదవు. జనులు సంతోషించుచు, ఉత్సాహధ్వని చేయుదురు గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, అనేకమైన నీ ఆశీర్వాదములకొరకును మరియు ప్రపంచ దేశములన్నియు నీ వశములో వున్నందునుబట్టియు నీకు వందనములు చెల్లింతును.*

అవును, దేవుడు తన శత్రువులపై ప్రతీకారము తీర్చుకుంటాడు. తద్వారా నీతిమంతులు ఆనందించి, పాడుటకు కారణమౌతాడు. పై వాక్య భాగపు అధ్యయనములో దేవుడు హెచ్చించ బడుచున్నాడు. ఆయన "యెహోవా" పేరు గలవాడని, అనగా "ఉన్నవాడు, అనువాడని" మనము గుర్తు చేయబడుచున్నాము – *"యెహోవా అను ఆయన నామమునుబట్టి ఆయన సన్నిధిని ప్రహర్షించుడి" (వ. 4 సి).*

1. దుష్టులు నశించి పోవుట – వ. 1–2
2. నీతిమంతుల స్తుతి – వ. 3–4
3. దేవుని ప్రజలను ఆయన కాపాడును – వ. 5
4. దేవుడు తన ప్రజలను సంరక్షించును – వ. 6

దేవుని స్తుతించుటకు మనకెన్నో కారణములున్నవి. మన మెలాంటి శత్రువులను ఎదుర్కో వలసివచ్చినా, దేవుడు తన సమయప్రకారము, తన మార్గములో వారిని ఓడిస్తాడన్న నమ్మకము మనము కలిగియుండవచ్చును. మనలను కాపాడి, మన అవసరములను తీర్చుటకు దేవుడు వాగ్దానమిచ్చియున్నాడు. నీతిమంతులు విడిచిపెట్టబడరు.

**ధ్యాన వచనము 3 :** *నీతిమంతులు సంతోషించుదురుగాక. వారు దేవుని సన్నిధిని ఉల్లసించుదురుగాక. వారు మహదానందము పొందుదురుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నా అవసరములన్నియు తీర్చే దేవుడవై యున్నావు గనుక నేను నీ యందు ఆనందింతును.*

కీర్తనాకారుడు పై వాక్య భాగములో దేవుని బలమును, ఆయన తన ప్రజల మధ్య వున్నాడన్న సత్యమును గుర్తు చేయుచున్నాడు. అనేకసార్లు దేవుడు మనతో వున్నాడన్న సత్యమును మరచిపోతుంటాము. దేవుడు తాను తన ప్రజలతో వుంటానని చెప్పుట మాత్రమే గాక (వ. 7–8), తన మంచితనమును గూర్చి సెలవిచ్చి (వ. 10), తన ప్రజలతో నివసించ వలెనన్న తన కోరికను వ్యక్తపరుస్తున్నాడు (వ. 16). నిన్ను విడువని, ఎడబాయని దేవునికి నీ ప్రేమను, విశ్వాసమును వ్యక్తపరచి, ఆయనను స్తుతించి, ఆయనకు వందనములు చెల్లించుటలో కొంత సమయమును గడుపుము.

1. అరణ్యము ద్వారా దేవుని ప్రయాణము – వ. 7
2. దేవుని సన్నిధి యొక్క శక్తి – వ. 8
3. దేవుడు మన అవసరములను తీర్చు విధానము – వ. 9–10
4. దేవుని వర్తమానము ప్రకటింపబడుట – వ. 11
5. రాజులు పారిపోవుట – వ. 12–14
6. దేవుని పర్వతముపట్ల దేవుని వుద్దేశ్యము – వ. 15–16

దేవుడు మన పక్షమున ఉన్నప్పుడు దేనికిని భయపడవలసిన అవసరము లేదు. ఆయన తన ప్రజలతో నిత్యమూ నివసించును.

**ధ్యాన వచనము 8:** *భూమి వణకెను. దేవుని సన్నిధిని అంతరిక్షము దిగజారెను. ఇశ్రాయేలు దేవుడగు దేవుని సన్నిధిని ఆవలి సీనాయి కంపించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సన్నిధి, నీ కాపుదల, నీ సంరక్షణ మరియు నీ శక్తినిబట్టి నేను ఆనందింతును.*

యీ లోకస్తులు దేవ దూతల గురించి కథనములు చెప్పుకుంటారు. కానీ వారు చెప్పుకుని, సత్యమని నమ్మే సంగతులేవీ బైబిలులో కనిపించవు. దేవుడు తన దూతలను సృష్టించాడు. దేవదూతలు దేవుని ప్రజలకు పరిచారము చేసి, వారిని సంరక్షించుటకు దేవునిచేత పంపబడిన *"సేవకులైన ఆత్మలని"* బైబిలు సెలవిస్తున్నది (హెబ్రీ 1:14). పై వాక్య భాగములోని 19వ వచనము సెలవిచ్చుచున్నట్లుగా *'అనుదినము ఆయన మన భారము భరించుచున్నాడు'.* అయితే మన సమస్య యేమిటంటే మనము దేవుని మేలులను గుర్తించకుండా మన సొంత నిరాశ, నిరుత్సాహములతో గ్రుడ్డివారముగా చేయబడుచున్నాము.

1. దేవ దూతలయొక్క గొప్ప తనము - వ. 17
2. దేవుని కానుకలు - వ. 18
3. దేవుని మంచితనము - వ. 19
4. దేవుని ఏలుబడి - వ. 20-23

దేవుడు తన సొంత సమయములో, తన మార్గములో ఆయన ప్రజలను ఘనపరచి, వారిని పరిపాలిస్తాడు. ఆయన మనపట్ల కలిగియున్న ఉద్దేశ్యములను, మన క్షేమాభివృద్ధి కొరకు ఆయనకున్న ప్రణాళికలను విశ్వసించుట మన వంతు, మన అవసరతగా వున్నది. ఆయన మార్గములు చాలాసార్లు మన మార్గములకంటె భిన్నమైనవిగా వుంటాయి.

**ధ్యాన వచనము 19:** *ప్రభువు స్తుతి నొందును గాక. అనుదినము ఆయన మా భారము భరించుచున్నాడు. దేవుడే మాకు రక్షణకర్తయై యున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితముపై ఆధిపత్యముతో కూడిన నీ ప్రణాళికలను మరియు అనేకమైన నీ ఆశీర్వాదములను చూచుటకు నాకు సహాయపడుము.*

దేవుడు తన ప్రజల స్తుతి మరియు ఆరాధనయందు ఆనందించునని మనము పై వాక్య భాగములో గుర్తు చేయబడుచున్నాము. దేవుడు మనపట్ల జరిగించినదానిని మరియు జరిగించబోవుదానిని చూచినయెడల మనము స్తుతులతో ఆయనను ఆరాధింతుము. ఆయన జరిగించిన సమస్తమునుబట్టి మన హృదయములయొక్క సంగీతముతో మన ఆరాధనను, ప్రేమను దేవునిపట్ల వ్యక్తపరతుము. నీవు అట్లు చేయగలుగుచున్నావా? యిప్పుడు దేవుని ఆరాధించెదవా?

1. దేవుని గమనమును చూచుట – వ. 24
2. కీర్తనలు పాడువారు దేవుని ఆరాధనను నడిపించుట – వ. 25
3. దేవుని ఆరాధించువారు అనేకులు – వ. 26–27
4. దేవుని బలము – వ. 28
5. దేవుని మందిరమునకు తీసుకొని రాబడుచున్న కానుకలు – వ. 29

దేవుని ప్రజల ఆరాధన దేవుని మందిరమును కేంద్రీకృతముగా కలిగియున్నది. దేవుని మందిరము ఆయన మహిమతో నిండియుండును. మందిరమనగా కట్టడము కాదు గానీ తన ప్రజలు చేయు స్తోత్రములమీద ఆసీనుడైన దేవున్నే సూచిస్తున్నది.

**ధ్యాన వచనము 26 :** *సమాజములలో దేవుని స్తుతించుడి. ఇశ్రాయేలులో నుండి ఉద్భ వించిన వారలారా, ప్రభువును స్తుతించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయమును మరియు నా నోటిని నీ స్తుతి గానములతో నింపుము.*

పై వాక్య భాగములో యీ ప్రపంచములోని జనములు, రాజ్యముల మీదే గాకుండా సకల జగత్తుపైన వున్న తన గొప్పతనమునుబట్టి దేవుడు స్తుతింపబడుచున్నాడు. దేవుని ప్రేమించువారు ఆయన బలమును మరియు గొప్ప తనమును జ్ఞాపకముంచుకొని, ఆయనను స్తుతించుట యెంతో ప్రాముఖ్యమైనది. మన సమస్యలు, కష్టములు, ఒత్తిళ్లు ఒక్కొక్కసారి అధికమైనట్లుగా మనకు కనిపిస్తాయి. సాధారణంగా అట్టి సమయములలో దేవుడు ఏమి చేయగలడన్న సత్యమును గుర్తుంచుకొనకుండా అలక్ష్యము చేస్తుంటాము.

1. దేవుడు జనములను గద్దించుట – వ. 30–31
2. ప్రజలయొద్దనుండి దేవుడు కోరే ప్రతిస్పందన – వ. 32
3. దేవుడు ఆకాశ మండలముపై ప్రయాణించుట – వ. 33
4. దేవుని బలమును గుర్తించుట – వ. 34–35

యీ కీర్తన *"దేవుడు స్తుతి నొందును గాక"* అను మాటలతో ముగింపబడుటను బట్టి యిందులో దేవుని స్తుతికి యివ్వబడిన ప్రాధాన్యతను గుర్తించుచున్నాము. సర్వ శక్తి మంతుడైన దేవుడే *"తన ప్రజలకు బల పరాక్రమముల ననుగ్రహించుచున్నాడని"* మనము గుర్తు చేయబడియున్నాము. దేవుని స్తుతించుము. అంతేగాక నీవు చేయలేని దానికొరకు తప్పకుండా ఆయనయందు నమ్మకముంచుము.

**ధ్యాన వచనము 34:** *దేవునికి బలాతిశయమును ఆరోపించుడి. మహిమోన్నతుడై ఆయన ఇశ్రాయేలు మీద ఏలుచున్నాడు. అంతరిక్షమున ఆయన బలాతిశయమున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను బలహీనుడనైనప్పుడు నీ బలమును నాకు అనుగ్రహించినందుకు నీకు వందనములు.*

పై వాక్య భాగములో దావీదు తన హృదయములోని సంగతులను బహిర్గతము చేయుచున్నాడు. యీ కీర్తనలోని మాటలు ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి ప్రవచన పూర్వకముగా వ్రాయబడినవి. రాజైన సౌలును, అతని మనుష్యులును దావీదును చంపుటకు ప్రయత్నించు చుండినందున అతనికి కలిగిన దుఃఖమును గూర్చి, ఆయన కార్చిన కన్నీరును గూర్చి మనకందరికీ వాక్యముద్వారా తెలుపబడినది. మనము దావీదు పొందిన నొప్పిని బట్టి బాధ పడుతాము. అయితే ఆ నొప్పి మనము కూడా పొందితేనే గానీ దాని లోతును మనము అంచనా వేయలేము. అటువంటి పరిస్థితులలో నిజమైన ఆదరణ ప్రభువు నుండి మాత్రమే కలుగుతుంది.

1. దావీదు తన పరిస్థితులనుబట్టి క్రుంగుదలకు లోనై పోవుట – వ.1–2
2. దావీదు దుఃఖము ఎంతో గొప్పదిగా, బాధాకరంగా వుండింది – వ.3
3. యితరులు తనను పరిగణించు విధానమునుబట్టి దావీదు అధైర్య పడుట – వ.4
4. తన అపరాధములను దావీదు వర్ణించుట – వ.5
5. దావీదు దేవునిమీద ఆధారపడుట – వ.6

మనకు గొప్ప దుఃఖము, బాధ కలిగినపుడు మన పరిస్థితులను దేవుని ప్రణాళిక మరియు ఉద్దేశ్యములను గూర్చిన వెలుగులో చూడవలెను. దేవుడు సమస్తమును యెరిగి యున్నాడు. ఆయన సంరక్షిస్తాడు. తన ఉద్దేశ్యమును తన మార్గములో, తన సంపూర్ణ సమయములో నెరవేరుస్తాడు.

**ధ్యాన వచనము 1 :** *దేవా, జలములు నా మీద పొర్లుచున్నవి. నన్ను రక్షింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో ఏది జరిగినను నీమీద ఆధారపడెదను.*

నిన్నటి వాక్య భాగములో *"నిర్నిమిత్తముగా నా మీద పగ పట్టు వారు"* అను మాటలను 4 వ వచనములో చదివాము. యీ మాటలు ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి యోహాను 15:25 లో వ్రాయబడినవి. యీ దినపు భాగములోని 9వ వచనములో ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి రోమా 15:3లో వ్రాయబడిన మాటలను చదువుచున్నాము – *"నిన్ను నిందించిన వారి నిందలు నామీద పడియున్నవి"*. దావీదు అనుభవములు ప్రవచన పూర్వకంగా "దావీదు కుమారుడు" గా పిలువబడిన ప్రభువైన యేసుక్రీస్తుకు వర్తింపబడినవి.

1. దావీదు భరించిన నింద – వ. 7–8
2. దావీదు పొందిన నిందకు కారణము – వ. 9–10
3. దావీదు శ్రమలను బట్టి యితరులు ప్రతిస్పందించిన తీరు – వ. 11–12
4. దావీదు దేవునితో తన ప్రతిస్పందనను వ్యక్తపరుచుట – వ. 13
5. దావీదు దేవునితో చేసిన విన్నపము – వ. 14–15

యితరు లెవ్వరూ అర్థం చేసుకోలేకున్నను దేవుడు అర్థం చేసుకొనగలడు. మనము కార్చే కన్నీరును గూర్చి యితరులెవ్వరికీ తెలియకపోవచ్చును. అయితే దేవుడు మన ప్రతి కన్నీటి బిందువును చూచుచున్నాడు. దేవుడు తన విమోచనను తన సమయములో, తన మార్గములో కలుగజేయుటకు వాగ్దానమిచ్చియున్నాడు.

**ధ్యాన వచనము 13 :** *యెహోవా, అనుకూల సమయమున నేను నిన్ను ప్రార్థించు చున్నాను. దేవా, నీ కృపా బాహుళ్యమునుబట్టి, నీ రక్షణ సత్యమునుబట్టి నాకుత్తరమిమ్ము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో నేననుభవించు బాధ, నేను ఎదుర్కొనే నిరుత్సాహము ఎంత గొప్పవైనను, వాటిని నీ పాదముల చెంత పడవేసి, ఫలితముకొరకు నేను నిన్ను నమ్ముకొందును.*

మనలను బెదిరించి, బలహీనపరచే పరిస్థితులు మనలను చుట్టుముట్టినపుడు మనము చేయగల ఒకే ఒక్క పని యేదనగా దేవునికి మొఱ పెట్టి, ఆయన విమోచన కొరకు, ఆయన ప్రతీకారముకొరకు వేడుకొనుట. నీ పరిస్థితులను నీ సొంత చేతుల్లోకి తీసుకొనవద్దు (రోమా 12:17-21). మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో పొందిన శ్రమను సూచించే మాటలు పై వాక్య భాగముయొక్క 21 వ వచనములో చదువు చున్నాము - "వారు చేదును నాకు ఆహారముగా పెట్టిరి. నాకు దప్పి యైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి" (మత్తయి 27:34). ఆయన యింతకు మునుపే శ్రమననుభవించాడు. మనలను సంరక్షించే ఆయన యందు విశ్వాసముంచుము.

1. దేవుని కృపకొరకు దావీదు మొఱపెట్టుట - వ. 16
2. దేవుని విమోచనకొరకు దావీదు మొఱపెట్టుట - వ. 17-18
3. దావీదుకు దొరకని ఆదరణ - వ. 19-21
4. దేవుని ఉగ్రత, తీర్పునందు దావీదుకున్న నమ్మకము - వ. 22-24

దేవుడు ప్రతి పరిస్థితిని చక్క బరుస్తానని వాగ్దానమిచ్చాడు. నీవు పెట్టే మొఱను దేవుడు ఆలకించి పరిష్కరిస్తాడు, నీవు కాదు. నీవు ఎదిరింపులకు లోనవుతుంటే, నీ సొంత తెలివి, యుక్తియందు నమ్మకముంచక, నీ పూర్ణ హృదయముతో దేవునివైపు తిరుగుము.

**ధ్యాన వచనము 16 :** *యెహోవా, నీ కృప ఉత్తమత్వమునుబట్టి నాకు ఉత్తరమిమ్ము. నీ వాత్సల్య బాహుళ్యతనుబట్టి నా తట్టు తిరుగుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నన్ను భయపెట్టు సమస్యలను నాకు నేనే పరిష్కరించుకొనే ప్రయత్నము మానివేసి, నీమీద ఆధారపడవలసిన అవసరత నాకున్నది.*

తనను ఎదిరించిన వారిమీద దేవుని ఉగ్రత రావలెనని దావీదు కోరుకుంటున్నాడు. తాను కోరుకుంటున్న దేవుని ఉగ్రతను దావీదు ఎంతో స్పష్టంగా వర్ణిస్తున్నాడు. అయితే, మనము మన సమస్యలన్నిటిని దేవునికి అప్పజెప్పాలి గాని దేవుని ఉగ్రతను మన శత్రువుల పైకి రావలెనని కోరుకోకూడదు. దావీదు తన శతృవుల రక్షణ గురించి ప్రార్థించకుండా వారిని శిక్షించమని దేవుని ఎందుకు కోరుకుంటున్నాడన్నది వింతగా వున్న విషయమే. అయితే కీర్తనలలోని యితర వాక్య భాగాల్లో తన శతృవుల పట్ల దేవుడు తన కృపను కనపరచవలెనని దావీదు కోరాడు. యిటువంటి పోరాటము ప్రతి ఒక్కరి హృదయములోను వుంటుంది. ఫలితములు దేవునికి వదలివేయబడతాయి.

1. దావీదు శతృవుల గుడారములు పాడైపోవుట – వ. 25
2. దేవునిచేత మొత్తబడిన వానిని దావీదు శతృవులు హింసించుట – వ. 26
3. తన శతృవులపై తీర్పుకొరకు దావీదు ప్రార్థించుట – వ. 27–28
4. దావీదుయొక్క మనోవ్యాకులము – వ. 29
5. దావీదు దేవుని నామమును స్తుతించుట – వ. 30

యీ భాగమును దావీదు స్తుతి, వందనములు చెల్లిస్తూ ముగించుచున్నాడు. యీ లోకములో యెటువంటి ఒత్తిళ్లు, కష్టములు మనకు కలిగిననూ, మనము మన దేవుని నామమును స్తుతించ బద్ధులమైయున్నాము.

**ధ్యాన వచనము 30 :** కీర్తనలతో నేను దేవుని నామమును స్తుతించెదను. కృతజ్ఞతా స్తుతులతో నేనాయనను ఘనపరచెదను.

**ప్రార్థన:** *ప్రభువా, నేను పరిష్కరించుకొనలేని సంగతులను నీకు వదలి వేసి, నీవు నాయెడల జరిగించిన సమస్తమునుబట్టి నీకు వందనములు చెల్లించుటకు సహాయపడుము.*

నిన్నటి వాక్య భాగములోని ఆఖరి వచనము నుండి దావీదు “దేవుని స్తుతించ వలెనన్న” అంశము గురించి వ్రాయుచున్నాడు. మనము అర్పించే బలులన్నిటికంటె మన స్తుతి, వందనములను దేవుడు కోరుకొంటున్నాడని దావీదు తెలుపుచున్నాడు. అనేకసార్లు మనము ‘అలవాటు ప్రకారముగా’ ఆరాధించే వారముగా వుంటాము గానీ మన హృదయములు దేవుని స్తుతి, వందనములతో నిండియుండవు.

1. దేవునికి ఏది ప్రీతికరము? - వ. 31
2. మనము దేనిని వెదుకుచుండవలెను?- వ. 32
3. దేవుడు ఎటువంటి మొఱలను ఆలకిస్తాడు? - వ. 33
4. దేవునికి ఎచ్చటనుండి స్తుతి కలుగుచున్నది? - వ. 34
5. విశ్వాసులకున్న భవిష్యత్తు ఎటువంటిది?- వ. 35-36

సీయోనును రక్షించి, యూదా పట్టణములను కట్టించే దేవునియందు మనము విశ్వాసముంచవలెను. యీ చక్కటి వాక్య భాగమును దావీదు “దేవుని నామమును ప్రేమించువారికి” ఒక వాగ్దానముతో ముగించుచున్నాడు.

**ధ్యాన వచనము 36:** *ఆయన సేవకుల సంతానము దానిని స్వతంత్రించుకొనును. ఆయన నామమును ప్రేమించువారు అందులో నివసించెదరు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాగ్దానములనుబట్టియు, వాటిని నెరవేర్చే నీ శక్తినిబట్టియు నీకు వందనములు.*

పై వాక్య భాగములో దావీదు విమోచనకొరకు పెట్టిన మొఱ ఆపత్కాలములోను, అవసరములోను మనము దేవునివైపు తిరుగవలెనన్న సత్యమును మనకందరికీ గుర్తు చేయుచున్నది. తనకు సహాయము చేయుటకు "త్వరగా రమ్మని" దావీదు దేవుని వేడుకుంటున్నాడు. మనమంతా ప్రార్థించుటకు యిష్టపడే ప్రార్థననే దావీదు చేయుచున్నాడు - "ప్రభువా, నాకు త్వరగా సహాయము చేయుము". అయితే, మనకందరికీ తెలిసిన రీతిలో, ఆయనయొద్ద మనము వేచిచూస్తూ, కనిపెట్టవలెను. ఎందుకనగా మన పరిస్థితులలో మన సమస్యలను పరిష్కరించుటకు ఉత్తమమైన సమయము ఆయన మాత్రమే యెరిగియున్నాడు.

1. విమోచన కొరకు దావీదు దేవునికి మొఱపెట్టుట - వ. 1
2. తనను చంపజూచు వారికి సిగ్గును, విస్మయమును కలుగజేయుమని దావీదు దేవుని కోరుట - వ. 2-3
3. దేవునియందు ఆనందించుటకు తీర్మానించుకొనియున్న దావీదు- వ. 4
4. తన సహాయమునకు దేవుడు ఆలస్యము చేయుచున్నాడని దావీదు ఆందోళన -వ. 5

మనము కష్ట సమయములగుండా వెళుతుండవచ్చును. అయితే మనము ఎల్లప్పుడు ఆనందించవలసిన వారముగా వున్నాము. ఫిలిప్పీ 4:4లో పౌలు, "ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి. మరల చెప్పుదును ఆనందించుడి" అని చెప్పిన ప్రకారము తప్పకుండా దేవునియందు ఆనందించుము.

**ధ్యాన వచనము 4:** *నిన్ను వెదకువారందరును నిన్ను గూర్చి ఉత్సహించి, సంతోషించుదురుగాక. నీ రక్షణను ప్రేమించువారందరు - దేవుడు మహిమ పరచబడునుగాక అని నిత్యము చెప్పుకొందురు గాక.*

**ప్రార్థన:** *ప్రతి కష్ట సమయములోను నా హృదయములోనుండి "దేవుడు మహిమపరచబడును" అను మాటలు వచ్చునుగాక.*

యీ వాక్యభాగములో కీర్తనాకారుడు దేవునియందు తన నమ్మికను వ్యక్తపరుస్తూ, విమోచనకొరకు ప్రార్థించుచున్నాడు. పై వచనములలో దేవుని వివిధ లక్షణములను ముఖాముఖిగా చూస్తున్నట్లు కీర్తనాకారుడు వర్ణిస్తున్నాడు. దేవుడు మనకు “ఆశ్రయ దుర్గము”, “శైలము” మరియు “దుర్గము”గా వున్నట్లు యీ వచనములలో చదువు చున్నాము. అంతేగాక, ఆయన మనకు “నిరీక్షణాస్పదముగా” వున్నాడు. మన కన్నులను ఆయనమీదనుండి తొలగించుకొన్నట్లయితే మన నిరీక్షణను, నిశ్చయతను కోల్పోతాము. అయితే, మనము ఆయనయందు “విశ్వాసము” వుంచినట్లయితే వాటిని తిరిగి పొందుకుంటాము.

1. కీర్తనాకారుడు దేవునిమీద ఆధారపడుట - వ. 1
2. విమోచనకొరకు ఆయన ప్రార్థించుట - వ. 2
3. తన జీవితములో దేవుని కాపుదలను గూర్చి కీర్తనాకారుడు వర్ణించుట - వ. 3-4
4. తల్లి గర్భమునుండే రూపింపబడిన కీర్తనాకారుని గమ్యము - వ. 5-6

5,6 వచనములలో ఎంతో చక్కని సత్యమును మనము గ్రహిస్తున్నాము- “తాను గర్భవాసిగా వున్నప్పటినుండే దేవుడు కీర్తనాకారునికి తోడైయున్నాడు”. కనుకనే ఆయన దేవునిపట్ల స్తుతులతో నింపబడియున్నాడు.

**ధ్యాన వచనము 5 :** *నా ప్రభువా, యెహోవా, నా నిరీక్షణాస్పదము నీవే. బాల్యమునుండి నా ఆశ్రయము నీవే.*

**ప్రార్థన:** *ప్రభువా, నా తల్లి గర్భములోనున్నప్పుడే నాకు తోడుగా వుండి, నన్ను ఎన్నడును విడువను, ఎడబాయనని వాగ్దానము చేసినందుకు నీకు వందనములు.*

మనము వయసులో పెరిగే కొద్దీ మనమెన్నడూ ఊహించని అభద్రతాభావము (భయము) మనలో కొంత చోటుచేసుకుంటుంది. కీర్తనాకారుడు "వృద్ధాప్యమందు నన్ను విడనాడకుము" (8 వ.) అని ప్రార్థించుచున్నాడు. యెవరు కూడా విడువబడి, ఒంటరి తనములో వుండుటకు యిష్టపడరు. దావీదు గురించి కీర్తనలలో మనము చదువు సంగతులు చాలావరకు తాను శత్రువులచేత తరుమబడి, దేవుడు తన శ్రమలో తనకు తోడైయున్నాడా లేదా అన్న పరిస్థితిని యెదుర్కొనుటద్వారా కలిగినవని చూస్తాము. అయితే, దేవునికి స్తోత్రములు. అటువంటి చీకటి సమయములలోనే మనము యింతకుముందు ఎన్నడూ గ్రహించని, నూతనమైన, సంతోషకరమైన విధములలో దేవుని సన్నిధిని, ఆయన శక్తిని అనుభవిస్తాము.

1. దేవుడు కీర్తనాకారునికి ఆశ్రయమగుట– వ. 7
2. తాను స్తుతులతో ప్రతిస్పందించుట – వ. 8
3. తన హృదయములోనుండి వచ్చుచున్నమనవి – వ. 9
4. తన శత్రువులనుండి ఎదురవుతున్న నింద– వ. 10–11
5. దేవుని సహాయము తనకు అవసరమని కీర్తానాకారుడు గుర్తెరుగుట – వ. 12

నీ చుట్టువున్నవారు నీవు పరీక్షలగుండా వెళ్లుతున్నప్పుడు ఏమి చూస్తున్నారు? దేవుని చేత విడువబడిన ఒక ఓడిపోయిన విశ్వాసినా లేదా దేవుని సహాయము కొరకు విశ్వసిస్తున్న ఒక జయించే విశ్వాసినా?

**ధ్యాన వచనము 9:** *వృద్ధాప్యమునందు నన్ను విడనాడకుము. నా బలము క్షీణించినప్పుడు నన్ను విడనాడకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములోని సంగతులు నేను కోరుకొన్నట్లు లేనియెడల నిన్ను నమ్ముకొనుటకు నాకు సహాయపడుము.*

యీ వాక్య భాగములోని వచనములు మన హృదయములకు ఎంతో ప్రోత్సాహకరంగా వున్నవి. ప్రత్యేకించి మనము గొప్ప శ్రమ, పరీక్షద్వారా వెళుతున్నప్పుడు యీ వచనములు మనలను ఎంతో ధైర్యపరుస్తాయి. 16వ వచనములో "ప్రభువైన యెహోవాయొక్క బలవత్కార్యములనుబట్టి నేను వర్ణింప మొదలుపెట్టెదను" అని వ్రాయబడినది. దేవుడు తన నుండి స్తుతిని, వందనములు చెల్లించుటను, తన శౌర్యము మరియు బాహుబలమును గూర్చి రాబోవు తరమువారికి తెలియజెప్పే తీర్మానమును కోరుకుంటున్నాడని కీర్తనాకారుడు యెరిగియున్నాడు.

1. కీర్తనాకారుని శత్రువులు నశించిపోవుట - వ. 13
2. దేవుని స్తుతించుటకు ఆయనకున్న తీర్మానము - వ. 14-15
3. దేవుని బలమునందు తనకున్న నమ్మకము - వ. 16
4. దేవుని ఆశ్చర్యకార్యములను గూర్చి ప్రకటించుటకు తన వృద్ధాప్యము అడ్డువచ్చునేమో అని కీర్తనాకారుడు ఆందోళనచెందుట - వ. 17-18

మన జీవితములలో ఎన్ని సమస్యలున్నను మనము దేవుని స్తుతించి, ఆయన శక్తిని గూర్చి రాబోవు తరములవారికి ప్రకటించుటకు మనము తీసుకొనే నిర్ణయము ఎంతో ప్రశస్తమైనది.

**ధ్యాన వచనము 14:** *నేను ఎల్లప్పుడు నిరీక్షింతును. నేను మరియెక్కువగా నిన్ను కీర్తింతును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవే నా నిరీక్షణ మరియు నా బలము. నిన్ను నిరంతరము స్తుతించెదను.*

కీర్తనాకారుడు *“దేవా, నీతో సాటియైన వాడెవడు?”* అని 19వ వచనములో పలికిన మాటలు ప్రవక్తయైన యెషయాను గుర్తుచేస్తున్నవి. యెషయా యీ మాటలను యెన్నో సార్లు పలికినవాడై దేవునితో సాటియైన వారు వేరెవ్వరూ లేరని చెప్పాడు. దావీదు తన జీవితములో ఎన్నో పరీక్షలు, శ్రమలనుండి దేవుని చేత విమోచింపబడి, తన శత్రువులనుండి కాపాడబడి, యీ వాక్యభాగములో తన వందనములను వ్యక్తపరుస్తున్నాడు. నీవు అట్లుచేయుచున్నావా?

1. దేవుని నీతి - వ. 19
2. దేవునినుండి మరల ఉజ్జీవము కలుగుతుందని నమ్మిన కీర్తనాకారుడు- వ. 20
3. దేవుడు తనకు నెమ్మది కలుగజేయునని తాను యెరిగియుండుట - వ. 21
4. కీర్తనాకారుడు తన స్తుతులతో దేవునిపట్ల ప్రతిస్పందించుట - వ. 22-23
5. తన స్తుతికి గల కారణము - వ. 24

మనము కష్టతర పరిస్థితులగుండా వెళుతున్నప్పుడు *“నాతట్టు మరలి నాకు నెమ్మది కలుగజేయుము”* అను మాటలు ఎంతో ప్రోత్సాహమును కలిగించేవిగా వున్నాయి.

**ధ్యాన వచనము 23:** *నేను నిన్ను కీర్తించునప్పుడు నా పెదవులును, నీవు విమోచించిన నా ప్రాణమును నిన్ను గూర్చి ఉత్సాహధ్వని చేయును.*

**ప్రార్థన:** *ప్రభువా, నన్ను విడనాడకుండా నా బాధలన్నిటిలోనుండి నన్ను బయటికి తీసుకు వచ్చినందుకు నీకు వందనములు.*

పై వాక్య భాగములోని మాటలను దావీదు తన కుమారుడైన సొలొమోనుతో పలుకుచున్నాడు. సొలొమోను మొదటి వచనంలో “రాజ కుమారుడి” గా తనను తాను పిలుచుకుంటున్నాడు. ప్రజలకు నీతినిబట్టి న్యాయముతీర్చుట ముఖ్యమైనదని, అట్లు చేయుట ద్వారా శాంతి కలిగియుందువని సొలొమోను యీ వాక్య భాగములో బోధింపబడుచున్నాడు. యీ మాటలు సొలొమోనుకే గాక, భవిష్యత్తులో జరుగబోవు యేసుక్రీస్తు పరిపాలనకు కూడా వర్తిస్తున్నాయి. యేసుక్రీస్తు సత్యముతోను మరియు నీతితోను పరిపాలించును.

1. న్యాయపు తీర్పుయొక్క మూలము, దాని సారాంశము– వ. 1–2
2. న్యాయపు తీర్పుద్వారా కలుగు విజయము– వ. 3
3. న్యాయపు తీర్పుద్వారా కలుగు రక్షణ – వ. 4
4. న్యాయపు తీర్పునకు లోబడుట– వ. 5

ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడలో యీ వాక్య భాగములోని మాటలు విశదముగా నెరవేర్చబడుతాయి. అయితే, యీ మాటలను ప్రస్తుతము మన చుట్టువున్న ప్రజలతో మనకున్న సంబంధమునకు మనము వర్తింపజేసి, వాటి ప్రకారము జీవించవలెను.

**ధ్యాన వచనము 5:** *సూర్యుడు నిలుచునంతకాలము చంద్రుడు నిలుచునంతకాలము తరములన్నిటను జనులు నీయందు భయభక్తులు కలిగి యుందురు.*

**ప్రార్థన:** *ప్రభువా, ఒకానొక దినమున నీవు సమస్తమును చక్కబెట్టి, సమస్తమును పరిపాలించెదవు గనుక నీకు వందనములు.*

యీ వాక్య భాగములోని వచనములు సొలొమోను కాలములో నెరవేరి యుండడమనేది అసంభవము కాదు. ఆయన జీవితము, ఆయన రాజ్యమును గూర్చి బైబిల్ లో ఎంతో గొప్పగా వర్ణించబడినది. అయిననూ ప్రభువైన యేసుక్రీస్తు తన రెండవ రాకడలో రాజుగా వచ్చి, తన రాజ్యమును ఏర్పరచినపుడు మాత్రమే మనము యీ వచనములలోని సత్యమంతయు నిత్యము నెరవేరుతుండడం చూస్తాము. ప్రపంచములోని దేశములన్నియు ఆయనను ఆరాధించి, సేవించబోవుచున్నాయి.

1. ఆయన కలిగించబోయే అభివృద్ధి- వ. 6
2. భూమి యందంతటా ఆయన నెలకొల్పే శాంతి- వ. 7-8
3. ఆయన ముందు తలవంచబోయే వారు- వ. 9
4. ఆయన యొద్దకు తీసుకురాబడబోయే కానుకలు- వ. 10
5. ఆయనను ప్రజలందరూ సేవించుట- వ. 11

ప్రభువైన యేసుక్రీస్తు తన పరిపాలన మొదలు పెట్టినపుడు ఎంత అద్భుతకరంగా వుంటుంది! ఫిలిప్పి 2:9-11 లో పౌలు యిలా చెప్పియున్నాడు- *"అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద ఉన్న వారిలో గాని, ప్రతి వాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను".*

**ధ్యాన వచనము 11:** *రాజులందరు అతనికి నమస్కారము చేసెదరు. అన్యజనులందరు అతని సేవించెదరు.*

**ప్రార్థన:** *ప్రభువా, నాదేవా, నా రక్షకా, నిన్ను ఆరాధించెదను. నీవు నన్ను పరలోకమునకు పిలుచు ఆ తియ్యని దినము వచ్చువరకు నాకు చేతనైన రీతిలో నిన్ను సేవించవలెనని ఆశపడుచూ, నీ సన్నిధిలో వినయముగా తలవంచి, నమస్కరించుచున్నాను.*

మనము ఎంతో కష్టతరమైన సమయములద్వారా వెళుతున్నపుడు దేవుడు మన మొఱలను ఆలకించి, మనలను విమోచిస్తాడన్న సత్యము మనకు ఆదరణ కలిగిస్తుంది. ఆయన మన "సహాయకుడు." మరొకసారి యీ వచనములు సొలొమోను గూర్చి వ్రాయబడినప్పటికీ, సొలొమోను కంటె గొప్పవాడైన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా యీ వచనములు సంపూర్ణముగా నెరవేరును. "అతని క్షేమమునకై జనులు నిత్యము ప్రార్థన చేయుదురు. దినమంతయు అతని పొగడుదురు" (15వ.) అను మాటలు త్వరలో రానైయున్న 'రాజు', 'మెస్సీయ' యగు ప్రభువైన యేసుక్రీస్తుకు చెందియున్నవి.

1. దరిద్రులను ఆయన విడిపించుట - వ.12-13
2. ఆయన దృష్టికి మనము ప్రియమైన వారము - వ.14
3. ఆయనకొరకు ప్రార్థనచేయబడి, ఆయన నామము పొగడబడుట - వ.15

మన పరిస్థితులు ఎంత కష్టతరంగా వున్నప్పటికీ మన "ప్రాణము" ఆయన దృష్టికి "ప్రియము"గానే వున్నది. "సాయంకాలమున ఏడ్పు వచ్చి, రాత్రి యుండినను" దేవునికి స్తోత్రములు, "ఉదయమున సంతోషము కలుగును."

**ధ్యాన వచనము 12:** *దరిద్రులు మొఱపెట్టగా అతడు వారిని విడిపించును. దీనులను, నిరాధారులను అతడు విడిపించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ దృష్టికి నేను విలువగల వాడినని నాకు చూపించి, నన్ను విడిపించుటకు నీవు చేసిన వాగ్దానమునుబట్టి నీకు వందనములు.*

దావీదు తన కుమారుడైన సొలొమోనును గూర్చి యీ మాటలు పలికినను, అవి మెస్సీయయైన ప్రభువైన యేసుక్రీస్తుకు ప్రవచన పూర్వకంగా వర్తిస్తున్నవి. 17వ వచనములోని *"అన్యజనులందరును అతడు ధన్యుడని చెప్పుకొందురు"* అను మాటలు యీ ప్రపంచమంతటినీ పాలించబోవుచున్న రాజైన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి వ్రాయబడినవి. ఆఖరి వచనములో "యెష్షయి కుమారుడగు దావీదు "ప్రార్థనలు" ముగిసెను" అని వ్రాయబడినది. అయితే కీర్తనల గ్రంథములో దావీదు వ్రాసిన మరి కొన్ని కీర్తనలను రానున్న అధ్యాయములలో చూచెదము.

1. రాబోయే సమృద్ధిని గూర్చిన వాగ్దానము – వ. 16
2. ఆయన పేరు శాశ్వతముగా నిలుచుట – వ. 17
3. దేవుని అగ్రగణ్యత్వము (ఆధిక్యత) – వ. 18–19

17వ వచనములో *"అన్య జనులందరును అతడు ధన్యుడని చెప్పుకొందురు"* అని వ్రాయబడినది. ప్రతివాని మోకాలును వంగి, ప్రతివాని నాలుక యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొను దినము రాబోవుచున్నది. ఆయనకే సకల మహిమ, స్తుతి కలుగును గాక!

**ధ్యాన వచనము 18:** *దేవుడైన యెహోవా, ఇశ్రాయేలుయొక్క దేవుడు స్తుతింపబడును గాక. ఆయన మాత్రమే ఆశ్చర్యకార్యములు చేయువాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ భూమి అంతయు నీ మహిమ మరియు నీ స్తుతితో నిండియుండు ఆశ్చర్యకరదినముకొరకు యెదురుచూస్తూ, నా మాటలు మరియు క్రియలన్నిటిద్వారా నిన్ను మహిమపరచవలెనని ఆశపడుచున్నాను.*

దేవుడు ఇశ్రాయేలుపట్ల మంచివాడని యెరిగియుండియు, కీర్తనాకారుడు దుష్టులతో తనను తాను పోల్చుకొని, తన సొంత పరిస్థితినిబట్టి దుఃఖమును వ్యక్తపరచుచున్నాడు. యిట్లు చేయుట చాలా సులభము. పురాతన కాలమునుండి అడుగబడుతున్న ప్రశ్నను యిక్కడ చూస్తున్నాము– *"దుష్టులు ఎందుకు వర్ధిల్లుచున్నారు? నీతిమంతులు ఎందుకు శ్రమ పడుచున్నారు?"* అయితే, దేవుడు సకలమును తన అధీనములో కలిగియున్నాడు. ఆయన తీర్పు ఒకానొక దినము దుష్టులపైకి రాబోవుచున్నది. ఆయన నీతిమంతులకు యివ్వ బోయే ప్రతిఫలము మన ఊహకు మించియుండును (1కొరింథీ 2:9).

1. దేవుని మంచితనమును కీర్తనాకారుడు హెచ్చించుట – వ. 1
2. కీర్తనాకారుడు తన ఆందోళనను వ్యక్తపరచుట – వ. 2
3. దుష్టులు వర్ధిల్లుట చూచి కీర్తనాకారుడు ఈర్ష్యపడుట – వ. 3
4. కీర్తనాకారుడు తాను యెందుకు కలవర పడుతున్నాడో తెలియజేయుట – వ. 4–5

ఒక్కొక్కసారి మనచుట్టు వున్న సంగతులు న్యాయముగా, నిష్పక్షపాతముగా అగుపించవు. దుష్టులు వర్ధిల్లుతారు. నీతిమంతులు శ్రమల పాలవుతారు. అయితే, దేవుడు నీతిమంతులపట్ల తన తీర్పును కాక, తన కృపను, ప్రేమను మరియు క్షమాపణను కనుపరుస్తాడు. మన పాపమునకు రావలసిన తీర్పును ప్రభువైన యేసుక్రీస్తు తానే భరించాడు. మనము "నరకము" నకు పాత్రులమైయుండగా దేవుడు మనకు "పరలోకమును" అనుగ్రహించాడు.

**ధ్యాన వచనము 1:** *ఇశ్రాయేలుయెడల, శుద్ధ హృదయులయెడల నిశ్చయముగా దేవుడు దయాళుడైయున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా పరిస్థితులు నాకు అర్థముకాని విధముగా ఉన్నప్పటకీ, నీయందు విశ్వాసముంచుదును.*

దుష్టులు వర్ధిల్లుచూ, నీతిమంతులు శ్రమ పడుచున్నప్పుడు "అట్లు యెందుకు *జరుగుతున్నది? దేవుడు యీ విషయములను యెరిగేయున్నాడా?"* అను ప్రశ్నలు మనకు కలుగుతాయి. దేవుడు మానవులపట్ల పట్టింపు కలిగియున్నాడా లేదా అను సంశయము ఒక్కొక్కసారి మనకు కలుగుతుంది. దేవుడు సమస్తమును యెరిగియున్నాడు. 2 తిమోతి 2:12 లో *"సహించిన వారమైతే ఆయనతో కూడ ఏలుదుము"* అని వ్రాయబడినది. దేవుడు సమస్తమును యింకా ముగింపునకు తీసుకు రాలేదు. మనము అతి కష్టమైన సమయములలో కూడా దేవునియందు నమ్మిక కలిగియుండవలెను.

1. దుష్టులయొక్క గర్వము - వ. 6-7
2. దుష్టుల అహంకారపుమాటలు - వ. 8-9
3. దుష్టుల పక్షమున చేరు ప్రజలు - వ. 10-11
4. భక్తిహీనులు వర్ధిల్లుట - వ. 12

యీ విషయములను నేను ప్రపంచమంతటా చూశాను. అయిననూ వీటిని నేను అర్థం చేసుకొనలేక పోవుచున్నానని ఒప్పుకుంటున్నాను. దేవుని ప్రజలు అన్నిచోట్లా శ్రమపడుచున్నారు. అనేక మంది విశ్వాసులు తమ విశ్వాసమునుబట్టి చంపబడుచున్నారు. అనేక చోట్ల దేవుని ప్రజలు నమ్మశక్యముగాని హింసలకు గురవుచున్నారు. *"దేవుడు ఎక్కడ ఉన్నాడు?"* అని అడగడము చాలా సులభము. అయితే, దేవుడు తన ప్రణాళికను నెరవేర్చబోవుచున్నాడు. ఆయనను ప్రేమించువారు తన రాబోవు రాజ్యములో ఎంతో గొప్ప ప్రతిఫలము పొందెదరు.

**ధ్యాన వచనము 11:** *'దేవుడు ఎట్లు తెలిసికొనును, మహోన్నతునికి తెలివియున్నదా?' అని వారనుకొందురు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ప్రజల శ్రమలను నేను చూచినపుడు, మాకు భవిష్యత్తును గూర్చిన నిరీక్షణ మరియు బహుమానమును వాగ్దానము చేసియున్నావు గనుక నీకు వందనములు.*

దుష్టులు వర్ధిల్లి, నీతిమంతులు శ్రమ పడుట అను సత్యము కీర్తనాకారునికి జీవితములో జరుగు అన్యాయముగా అగుపిస్తున్నది. కేవలము మానవ దృక్పథముతో మాట్లాడుతున్న కీర్తనాకారుడు, దేవుని వెదకి, పాపములు కడుగబడి, ఆయన యెదుట దైవికమైన జీవితములు జీవించుటవలన ప్రయోజనమేమున్నదని అభిప్రాయపడు తున్నాడు. తన అభిప్రాయము గురించి యితరులతో చెబితే వారు అభ్యంతర పడతారని కూడా గ్రహించాడు. ఆయన "దేవుని పరిశుద్ధ స్థలము" లోనికి పోయేవరకు తనకు యీ విషయము అర్థము కాలేదు. అయితే, దేవుని మందిరములోనికి వెళ్ళినతరువాత దుష్టుల అంతము గురించి తెలుసుకున్నాడు.

1. కీర్తనాకారుడు తన్నుతాను బాధపరుచుకొనుట – వ.13–14
2. కీర్తనాకారుని కలవరపాటు – వ. 15–16
3. కీర్తనాకారుడు దేవునియందు నమ్మిక కలిగియుండుట – వ. 17

పరిస్థితులు ఎప్పుడూ ఒకేరకంగా వుంటాయని ఒక్క నిమిషం కూడా అనుకొనవద్దు. జీవితములోని ప్రతి సంగతి, పరిస్థితి కూడా రాజుల రాజు, ప్రభువుల ప్రభువైన యేసుక్రీస్తు వచ్చినపుడు చక్క జేయబడుతుంది.

**ధ్యాన వచనము 17:** *నేను దేవుని పరిశుద్ధ స్థలములోనికి పోయి, వారి అంతమును గూర్చి ధ్యానించువరకు ఆ సంగతి నాకు ఆయాసకరముగా ఉండెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు అర్థము కాని మరియు నేను భరించుటకు మిక్కిలి బాధాకరమైన పరిస్థితులగుండా వెళ్లునప్పుడు నిన్ను నమ్ముకొనుటకు నాకు సహాయపడుము.*

దుష్టుల యొక్క దుర్గతిని గూర్చి ఆలోచిస్తున్న కీర్తనాకారుడు తన సొంత ఆత్మీయ స్థితిగతిని, తనకు అవసరమైయున్న దేవుని సహాయమును, బలమును గూర్చి జ్ఞాపకము చేయబడుతున్నాడు. దుష్టులు దేవుని తీర్పునుండి తప్పించుకుంటారని యెన్నడూ అనుకొనవద్దు. వారు తప్పించుకోలేరు. ప్రస్తుతము వారు "వర్ధిల్లుచుండవచ్చును." అయితే భవిష్యత్తులో వారి పాపమునకు తగిన ప్రతిఫలమును వారు అనుభవించెదరు.

1. దుష్టులు పడవేయబడుట – వ. 18
2. వారు మహాభయముతో కడముట్ట నశించుట – వ. 19
3. దేవుడు దుష్టులను తృణీకరించుట – వ. 20
4. కీర్తనాకారుని ఆత్మీయ స్థితి – వ. 21–22
5. తన ప్రజలకు దేవుడు తన కాపుదలను తోడుగా వుంచుట – వ. 23

మనము పాపపు స్వభావముతో, పతనావస్థతో మరియు చెడును జరిగించాలన్న కోరికతో ఉన్నవారమైనను, దేవునియందు నమ్మికయుంచినయెడల, "నిత్యముగా నుండు ఆయన బాహువులు" మన క్రింద వుండి (ద్వితీయోపదేశ కాండం 33:27), మనలను ఎత్తి పట్టుకొనును.

**ధ్యాన వచనము 23:** *అయినను నేను ఎల్లప్పుడు నీ యొద్దనున్నాను. నా కుడిచెయ్యి నీవు పట్టుకొనియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ఉగ్రతకు నేను పాత్రుడనన్న సత్యమును నేను ఎన్నటికి మరువకుందును గాక. నా జీవితములో నన్ను సంరక్షిస్తూ, కాపాడుతూ వస్తున్నందుకు నీకు ఎల్లప్పుడూ వందనములు చెల్లించుదునుగాక.*

కీర్తన 73 లోని యీ చివరి వచనములలో మన ప్రభువు, దేవుడైన యేసుక్రీస్తు తో మనము బలమైన, సన్నిహిత సంబంధము కలిగియుండాలని గుర్తు చేయ బడుచున్నాము. ఆయనవంటి దేవుడు మరొకరు లేరు. ఎంతో అస్థిరముతో వున్న యీ లోకములో దేవుని పైన మన కన్నులు నిలిపియుండుటవలన మన హృదయములు, మనస్సులు స్థిరముగా వుండును. దేవునికి సన్నిహితంగా మనము జీవించవలెను. ప్రార్థనలో, వాక్య ధ్యానములో మనము గడిపే సమయము వ్యర్థము కాబోదు. మన శారీరక జీవితములకు గాలి, నీరు మరియు ఆహారము ఏలాగు అవసరమో అలాగే మన ఆత్మీయ జీవితముల యెదుగుదల కొరకు ప్రార్థన, వాక్య ధ్యానము అవసరమైయున్నవి.

1. మన భవిష్యత్తును గూర్చిన వాగ్దానము - వ. 24
2. మనము లోకమును కాకుండా దేవుని సన్నిధిని కోరుకొనవలెను- వ. 25
3. దేవుడు మన నిత్యమైన సంరక్షకుడు - వ. 26
4. దుష్టులు నశించి పోవుట - వ. 27
5. దేవునికి సన్నిహితంగా జీవించుట ఎంతో ప్రధానమైనది -వ. 28

విశ్వాసులందరికీ పూర్ణ హృదయముతో దేవునియందు విశ్వాసముంచుట యెంతో ప్రధానమైన కట్టడగా వున్నది. ఆయనయందు సంపూర్ణమైన నమ్మిక కలిగియున్నప్పుడే ఆయనకు సన్నిహితంగా జీవించగలము. దేవుని ఎల్లప్పుడును అలక్ష్యము చేయకుము. ఆయన ఎల్లప్పుడూ జీవిస్తున్న దేవుడు.

**ధ్యాన వచనము 26:** *నా శరీరము, నా హృదయము క్షీణించిపోయినను దేవుడు నిత్యము నా హృదయమునకు ఆశ్రయ దుర్గమును, స్వాస్థ్యమునై యున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మాత్రమే నా హృదయ వాంఛను తీర్చే దేవుడవు. నీవు నమ్మదగిన వాడవు గనుక నీయొద్దకు మాత్రమే వచ్చెదను.*

పై వాక్య భాగములోని మొదటి వచనములో అడుగ బడిన ప్రశ్నను యూదులు అనేకసార్లు ప్రశ్నించారు. రోమా 11:1–2 లో దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులను ఎన్నడూ విడిచిపెట్టలేదని పౌలు చెప్పియున్నాడు. గత చరిత్రలో ఇశ్రాయేలీయులు ఎన్నో శ్రమల పాలయ్యారు. వారికి దేవుడు తీర్పు తీరుస్తున్నాడని బైబిలు సూచిస్తుంది. అయితే ఇశ్రాయేలీయులకు దేవుడు తీరుస్తున్న తీర్పు ప్రపంచ దేశములపై రానున్న ఆయన తీర్పు లాంటిది కాదు. దేవుడు ఇశ్రాయేలుపట్ల ఎల్లప్పుడూ జాలి చూపిస్తూ, వారిని పూర్తిగా అంతమొందించకుండా వచ్చాడు. వారితో ఎలాంటి షరతులు లేకుండా తాను చేసిన నిబంధననుబట్టి వారిని ఒక జనముగా నిత్యమూ భద్రపరుస్తున్నాడు. నీవు యూదుడవైనను లేదా అన్యుడవైనను, విశ్వాసివైతే ఆయన నిన్ను ఎన్నడును ఎడబాయడు (హెబ్రీ 13:5).

1. దేవుని కోపమును బట్టి ఆందోళన – వ. 1
2. దేవుని స్వాస్థ్యమైన ఆయన ప్రజలు – వ. 2
3. ఇశ్రాయేలీయులను ఎదిరిస్తున్న శత్రువుల ప్రవర్తన – వ. 3–8
4. తమ శత్రుబాధనుబట్టి ఇశ్రాయేలీయులు ఆందోళన చెందుట – వ. 9

యిది ఎంతో నిజము. దేవుడు ఎంత కాలము మన జీవితములలో శ్రమలను అనుమతిస్తాడో మనకు తెలియదు. 9వ వచనములో తెలుపబడినట్లు దేవుడు మనకు బయలు పరచనప్పుడు మనకు ఏమి జరుగబోతుందో, ఎందుకు జరుగబోతుందో తెలియదు. కనుక, పరిస్థితులెట్లున్నను ఆయనయందు నమ్మిక కలిగియుండుట మన బాధ్యత.

**ధ్యాన వచనము 1:** *దేవా, నీవు నిత్యము మమ్మును విడనాడితివేమి? నీవు మేపు గొఱ్ఱెలమీద నీ కోపము పొగరాజుచున్నదేమి?*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు కలిగిన పరీక్ష ఎంత కష్టమైనదైనను మరియు నా పరిస్థితులు ఎంత వర్ణింప శక్యము కాకపోయినను, వాటన్నిటిలోను నిన్ను నమ్ముకొందును.*

కష్ట పరిస్థితుల ద్వారా వెళుతున్నప్పుడు మనము అనేకసార్లు దేవుని సన్నిధిని, ఆయన సంరక్షణను ప్రశ్నిస్తుంటాము. మనము *"యెంత కాలము?"* మరియు *"నీవెక్కడున్నావు?"* మొదలగు ప్రశ్నలను అడుగుతాము. అయితే దేవుడు మనలను యెడబాయలేదు. మనమెలాంటి వారముగా వుండవలెనని దేవుడు కోరుకుంటున్నాడో అలాంటి వారమగుటకు ఆయన కొన్ని పరిస్థితులను మన జీవితములలో అనుమతిస్తాడు. ఆయన మనలను శిక్షించాలని కాదుగాని, ప్రేమతో బలవంతులనుగాచేయు ఉద్దేశ్యముతో మనలను గద్దిస్తాడు (1పేతురు 5:8-11 చదువుము). కీర్తనాకారుడు గతంలోని దేవుని కార్యములను, ఆయన శక్తిని గూర్చి క్లుప్తంగా తెలియజేయుచున్నాడు. అవును, దేవుడు సర్వమును జరిగించుటకు సమర్థుడు. ఆయన సమయానుసారమైన ఆశీర్వాదములు మనకెంతో వుత్తమమైనవి.

1. మన శత్రువుల యెదిరింపులు - వ. 10
2. దేవునికి చేయబడుచున్న విన్నపము - వ. 11
3. దేవుని రక్షణను గూర్చిన నిశ్చయత - వ. 12
4. దేవుని సామర్థ్యముయొక్క వర్ణన - వ. 13-17

అవును, సకలమును తన అధీనములో కలిగి, పగటిని, రాత్రిని, యెండాకాలమును మరియు చలికాలమును కలుగజేయుచున్న దేవుడు తన సమయ ప్రకారము, తన మార్గములో మనకు విడుదల కలుగజేయును. మన పూర్ణ హృదయములతో ఆయనయందు నమ్మిక యుంచడమే మనవంతు.

**ధ్యాన వచనము 16:** *పగలు నీదే, రాత్రి నీదే. సూర్య చంద్రులను నీవే నిర్మించితివి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సన్నిధిని మరియు నీ శక్తిని యెప్పుడూ ప్రశ్నించుచున్నవాడనుగా వున్నందుకు నన్ను క్షమించుము.*

శ్రమనొందు వారిని, నలిగినవారిని జ్ఞాపకము చేసుకొని, వారికి విడుదల కలిగించుమని కీర్తనాకారుడు పై వాక్య భాగములో దేవునికి మొఱపెట్టుచున్నాడు. తాను చేసుకున్న మనవిలో 20వ వచనములో "*కాగా నిబంధనను జ్ఞాపకము చేసికొనుము*" అని వ్రాయబడినది. దేవుని నిబంధన షరతులు లేనిది. దేవుని ప్రజలు యీ నిబంధన దేనిమీద ఆధారపడియున్నదో యెరుగుదురు. కనుక, కీర్తనాకారుడు దేవుని విశ్వసనీయతను బట్టి తన నిబంధనను నెరవేర్చుమని దేవునికి మొఱపెట్టుచున్నాడు. యీ నిబంధన దేవుని నీతిమీద కూడా ఆధారపడియున్నది. అనగా దేవుడు ప్రేమ మరియు క్షమాపణ గలిగిన దేవుడు మాత్రమే గాక తీర్పు మరియు ప్రతీకారములతో నిండియున్నాడు గనుక తనను తృణీకరించు వారిపై ప్రతీకారము తీర్చుకొని, తనను తాను రుజువు చేసుకోమని కీర్తనాకారుడు మనవి చేయుచున్నాడు.

1. దుష్టులు పలికిన మాటలను, చేసిన పనులను జ్ఞాపకము చేసుకొనమని కీర్తనాకారుడు దేవునితో చేసిన మనవి – వ. 18
2. తమ చుట్టువున్న దుష్టులనుండి దేవుని ప్రజలు ఎదుర్కొంటున్న శ్రమలను బట్టి కీర్తనాకారుడు ఆందోళన చెందుట – వ. 19
3. దేవుని నిబంధననుబట్టి ఆయన స్తుతింపబడుట – వ. 20-21
4. తన ప్రజల శత్రువులను అణచివేసి, వారికి న్యాయము చేయమని కీర్తనాకారుడు దేవునికి మొఱపెట్టుట – వ. 22-23

కీర్తనాకారుడు దేవుని గుణమును ఎరిగిన హృదయముతో ఆయనకు మనవిచేయుచున్నాడు. లేఖనములలో బయలుపరచబడిన దేవుని గుణమును ఆధారముగా చేసుకొని ఆయనయొద్దకు వచ్చుట జ్ఞానయుక్తమైనదని మనము తెలుసుకొనుచున్నాము.

**ధ్యాన వచనము 18:** *యెహోవా, శత్రువులు నిన్ను దూషణ చేయుటను, అవివేక ప్రజలు నీ నామమును దూషించుటను మనస్సునకు తెచ్చుకొనుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా సంగతులు సరిజేసికొని, తీర్పునకు సంబంధించిన విషయములను నీ చేతులలో వదలి వేయుటకు కావలసిన విశ్వాసము కలిగియుండునట్లు నీవు నాకు సహాయము చేయుము.*

దేవుడు సర్వభూమికి న్యాయాధిపతియని, ఆయన నీతి ప్రబలిపోయి దుష్టులను శిక్షించునని గుర్తుచేస్తూ కీర్తనాకారుడైన ఆసాపు దేవునికి వందనములు చెల్లించుమని చెప్పుచున్నాడు. యీలాగున దేవునికి వందనములు చెల్లించుట యనేది విశ్వాసుల అలవాటు కాకపోవచ్చును. అయితే ఇట్లు చేయుట దేవుని కోరికయై యున్నది. 1థెస్సలొనీకయులకు 5:18 లో *"ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము"* అని వ్రాయబడినది.

1. దేవునికి వందనములు చెల్లించమని కీర్తనాకారుని సూచన - వ. 1
2. భవిష్యత్తులో జరుగబోవు దేవుని తీర్పు - వ. 2-3
3. మనలను మనము హెచ్చించుకొనకుండా తగ్గించుకొనుట ప్రధానమైనది-వ. 4-7
4. దేవుని ఉగ్రతయొక్క తాకిడి - వ. 8
5. దేవుని నిత్యము కీర్తించవలెనన్న కీర్తనాకారుని ఉద్దేశ్యము -వ. 9-10

అవును, *"యెహోవా చేతిలో"* ఒక *"పాత్ర"* వున్నది. ఆ *"పాత్ర"* యీ దుష్ట లోకముమీదికి రాబోవు దేవుని ఉగ్రతతో నిండియున్నది. అయితే, దేవునిమీద నమ్మిక యుంచువారికి నేడును, భవిష్యత్తులోను నిరీక్షణ యున్నది.

**ధ్యాన వచనము 9:** *నేనైతే నిత్యము ఆయన స్తుతిని ప్రచురముచేయుదును. యాకోబు దేవుని నేను నిత్యము కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, అన్ని విషయములు నీ వశములో వున్నవనియు, నీవు దుష్టులకు ఒకానొక దినము తీర్పు తీర్చెదవనియు నాకు స్పష్టముగా తెలియజేసినందుకు నీకు వందనములు.*

దేవుని ప్రజలమధ్య ఆయన బలమును మరియు ఆయన సన్నిధిని హెచ్చించడమే పై వాక్య భాగముయొక్క ప్రధాన అంశము. *“ఆయన నామము గొప్పది”* అని కీర్తనాకారుడు మొదటి వచనములో చెప్పిన ప్రకారము ఆయన నామము నిజముగా గొప్పది. ఆయన నామము “ఆశ్చర్యకరమైనది”. అనగా హెబ్రీ భాషలో *“ఊహింప శక్యము గానిది”.* ఆయన నామము *“అన్ని నామములకంటె పై నున్నది.”* ఆయన నామము ద్వారా మాత్రమే మనము రక్షణ పొందుదుము. దేవుడు తన నామమును మరియు తన గుడారమును “షాలేము” లో అనగా యెరూషలేములో ఏర్పరచుటకు నిర్ణయించాడు. యెరూషలేము ఇశ్రాయేలుకు నిత్యమైన రాజధాని నగరము. యిది దేవుని పట్టణము మరియు భవిష్యత్తులో ఉండబోవు ముఖ్య పట్టణము.

1. మన దేవుని గొప్ప తనము - వ. 1
2. మన దేవుడు నివసించు స్థలము - వ. 2-3
3. మన దేవుని బలము - వ. 4-6

దేవునికి కష్టమైనది, అసాధ్యమైనది యేదియు లేదు. ఆయన ఓడించలేని దేశ మేదియు లేదు. ఆయన మన దేవుడు మరియు సమస్తమును పరిపాలించుచున్నాడు.

**ధ్యాన వచనము 1:** *యూదాలో దేవుడు ప్రసిద్ధుడు. ఇశ్రాయేలులో ఆయన నామము గొప్పది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వంటి దేవుడు వేరొకరు లేరు గనుక నిన్ను ఆరాధింతును.*

భూమి మీదనున్న రాజులు మరియు నాయకులందరి పైనా దేవుని బలము మరియు విజయము ప్రకటింపబడినది. దేవుడు పరలోకమునుండి జనములపై తన ఉగ్రత కుమ్మరించినపుడు ఆయన ఎదుట ఎవరును నిలువలేరు. దేవునికి భయపడి, ఆయనకు చెల్లించవలసిన మ్రొక్కుబడులను చెల్లించుమని కీర్తనాకారుడు మనవి చేయుచున్నాడు.

1. దేవునిపట్ల మనకుండవలసిన వైఖరి – వ.7
2. దేవుడు లేచి భూమికి తీర్పు తీర్చుట – వ.8-9
3. నరుని ఆగ్రహము దేవుని స్తుతించును – వ.10
4. దేవుని చేరవలసిన విధానము – వ.11
5. ఈ లోకములోని నాయకులపై దేవుడు తన ఆగ్రహము ప్రదర్శించుట –వ.12

ఒకానొక దినము దేవుడు పరిస్థితులను పూర్తిగా మార్చివేసి, భూమిమీద న్యాయము జరిగించునన్న సత్యము ప్రతి విశ్వాసికి సంతోషమును, ప్రోత్సాహమును కలిగించుచున్నది. ప్రపంచ దేశములన్నిటిపైన దేవుడు తన తీర్పును తీసుకువస్తాడు. భూమిమీదనున్న జనముల కోపము మరియు వారి తిరుగుబాటు దేవుని గొప్పశక్తిని స్తుతించుటకు వాడబడును.

**ధ్యాన వచనము 7:** *నీవు, నీవే భయంకరుడవు. నీవు కోపపడు వేళ నీ సన్నిధిని నిలువ గల వాడెవడు?*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మాత్రమే యోగ్యుడవు గనుక నా తలాంతులు, వరములు మరియు ఆరాధన నీయొద్దకు మాత్రమే తీసుకొనివచ్చెదను.*

గత కాలమును మరియు “పూర్వకాల సంవత్సరములను” పరీక్షించినయెడల దేవుని ప్రజలు యెలా శ్రమపడిరో చూడగలము. వారు అలా శ్రమ పొందుటకు గల కారణములు పూర్తిగా తెలుపబడలేదు. మరియు ఆ కారణములు అర్థము చేసుకొన బడలేదు. దేవుడు జరిగించుచున్న సమస్తము మనకు అర్థం కాకపోయినప్పటికీ, చరిత్ర యంతటిలోను ఆయన సమస్తమును ఎరిగినవాడై, తన ఉద్దేశ్యములను జరిగించుచున్నాడు.

1. కీర్తనాకారుడు దేవునికి మొఱపెట్టుట – వ. 1
2. దేవుడు కీర్తనాకారుని ఆదరించకపోవుట – వ. 2
3. కీర్తనాకారుడు నిట్టూర్పుతో క్రుంగిపోవుట – వ. 3
4. కీర్తనాకారుడు గత సంవత్సరములను జ్ఞాపకమునకు తెచ్చుకొనుట – వ. 4–5
5. కీర్తానాకారుడు తన హృదయమందు ధ్యానించుకొనుట – వ. 6

పై వాక్య భాగములో కీర్తనాకారుడు కలవరపడి, క్రుంగియున్నాడు. దేవుడు తన మొఱను ఆలకిస్తాడని ఆయనకు మొఱపెట్టుచున్నాడు. కొన్నిసార్లు దేవుడు లేడనిపిస్తుంది. కానీ ఆయన ఎల్లవేళలా జీవిస్తున్నాడు. మనము ఆయనకు దగ్గరగా లేమంటే దేవుడు దూరమై పోలేదుగాని మనమే ఆయనకు దూరంగా జీవిస్తున్నామని అర్థము.

**ధ్యాన వచనము 1:** *నేను యెలుగెత్తి దేవునికి మొఱ్ఱపెట్టుదును. ఆయనకు మనవి చేయుదును. దేవుడు నాకు చెవి యొగ్గు వరకు నేను యెలుగెత్తి ఆయనకు మనవి చేయుదును.*

**ప్రార్థన:** *ప్రభువా, నా మొఱలను నీవు ఆలకించినందుకు నీకు వందనములు.*

దేవుని ప్రజలు చరిత్ర యంతటిలో ఎంతో శ్రమపడి, అనేకసార్లు 7వ వచనములో అడుగబడిన ప్రశ్నను అడుగుతూ వచ్చిరి – *"ప్రభువు నిత్యము విడనాడునా?"* రోమా 11:1–2 లో దేవుడు తాను ముందే యెరిగియున్న తన ప్రజలను ఎన్నడును విడనాడలేదని పౌలు చెప్పియున్నాడు. యీ వాగ్దానము దేవుని విశ్వసనీయత మరియు ఆయనయొక్క షరతులు లేని నిబంధనపై ఆధారపడి యున్నది. యీ వాగ్దానమును మనము ఎల్లప్పుడు విశ్వసించవచ్చును.

1. దేవుని విశ్వసనీయత గురించి కీర్తనాకారుని ఆందోళన – వ. 7
2. దేవుని కృపను గూర్చి ఆయన ప్రజలు కలిగియున్న ఆలోచన – వ. 8–9
3. కీర్తనాకారుడు దేవుడు గతములో జరిగించిన సమస్తమును జ్ఞాపకము చేసుకొనుట – వ. 10–11
4. దేవుని సమస్త కార్యములను గూర్చి ధ్యానించుట – వ. 12

దేవుడు మనయెడల జరిగించిన కార్యములను మనము మాటి మాటికీ జ్ఞాపకము చేసుకొనుచుండవలయును. ఆయన వాక్యమును ధ్యానిస్తూ, ఆయనచేసిన గొప్ప కార్యములను గూర్చి తలపోసుకోవడం ద్వారా ఆయనను యింకను నమ్మికొనుటకు మన హృదయములలో ప్రోత్సహించబడెదము. తన వాగ్దానములను మనపట్ల నెరవేరుస్తాడని గ్రహించెదము.

**ధ్యాన వచనము 11:** *యెహోవా చేసిన కార్యములను, పూర్వము జరిగిన నీ ఆశ్చర్య కార్యములను నేను మనస్సునకు తెచ్చుకొందును.*

**ప్రార్థన:** *ప్రభువా, గతములో నీవు నీ ప్రజల యెడల జరిగించినదంతటిని నేను ఎన్నడూ మరువకుండునట్లు నాకు సహాయపడుము. నీ ప్రజలు కలిగియుండిన విశ్వాసమును నేను నీయందు కలిగియుండుట నేర్చుకొందునుగాక.*

పై వాక్య భాగము దేవుని మార్గములు మరియు ఆశ్చర్యకరమైన ఆయన గొప్ప తనమును గూర్చిన సంతోషముతో నిండియున్నది. *"ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు. ఆయన మార్గములెంతో అగమ్యములు"* (రోమా 11:33-36). పై వాక్య భాగములోని 19 వ వచనములో *"నీ అడుగు జాడలు గుర్తింపబడకయుండెను"* అని కీర్తనాకారుడు చెప్పియున్నాడు. దేవుడు జరిగించుచున్నది మనకు తెలియకపోవచ్చును. అయితే ఒక విషయమును మనము గట్టిగా చెప్పగలము- *"ఆయన యెల్లప్పుడూ మన మేలుకొరకు, ఆయన మహిమకొరకు సమస్తమును జరిగిస్తాడు."*

1. దేవుని మార్గము ఉన్నతమైనది - వ. 13
2. దేవుని ఆశ్చర్య కార్యములు అనేకములు - వ. 14-15
3. దేవుని సన్నిధినిబట్టి జలములు ప్రభావితమాయెను - వ. 16,17,19
4. దేవుని శక్తినిబట్టి లోకము ప్రభావిత మాయెను - వ. 18
5. దేవుడు తన ప్రజలను నడిపించే ప్రక్రియలో ఆయన శక్తి మరియు ఆయన ప్రేమ బయలుపరచబడును - వ. 19-20

యిటువంటి వాక్య భాగమును చదివిన తరువాత నీవు యెలుగెత్తి దేవుని స్తుతించవలెనని కోరుకొందువు. మనము సేవిస్తున్న దేవుడు ఎంత గొప్పవాడు! మనము నడుస్తున్న మార్గమును గూర్చి యెరిగిన దేవుని నమ్ముకొనుట ఎంత చక్కటి విషయము!

**ధ్యాన వచనము 13:** *దేవా, నీ మార్గము పరిశుద్ధమైనది. దేవుని వంటి మహా దేవుడు ఎక్కడనున్నాడు?*

**ప్రార్థన:** ప్రభువా, నన్ను నడిపిస్తూ, నా జీవితములో ప్రతి విషయములోను నీ మార్గము నాకు చూపించుచున్నందుకు నీకు వందనములు.

యీ కీర్తనలోని 72 వచనములు దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులపట్ల చేసిన కార్యములను గుర్తు చేయుచున్నవి. ఇశ్రాయేలీయుల చరిత్ర అనేకసార్లు వారు తమ దేవునికి వ్యతిరేకంగా కనుపరచిన తిరుగుబాటు స్వభావముతోను, అదే సమయములో దేవుడు వారి పట్ల చూపించిన ఆశ్చర్యమైన కరుణాకటాక్షముతోను నిండియున్నది. దేవుడు ఎవరిని ప్రేమిస్తాడో వారిని శిక్షిస్తాడు. తన ప్రజలు ఫలించే వారుగా వుండాలని, తన పరిశుద్ధత వలన కలుగు ఆశీర్వాదములలో వారు కూడా పాలుగలిగి యుండవలెనని దేవుడు వారిని శిక్షిస్తాడు (హెబ్రీయులకు 12).

1. దేవుని వాక్యమునకు ప్రతిస్పందించమని కీర్తనాకారుడు
   జనులతో చేయు మనవి- వ. 1
2. ఉపమానములద్వారా దేవుడు మాట్లాడుట - వ. 2-3
3. దేవుని స్తోత్రార్హ క్రియలను గూర్చి చెప్పుట - వ. 4
4. భవిష్యత్తులోని తరములవారికి దేవుని వాక్యము తెలియ జేయబడుట - వ. 5
5. తన వాక్యమును రాబోవు తరముల వారికి తెలియజెప్పుటలో
   దేవుని ఉద్దేశ్యము - వ. 6-8

కుమారులు, కుమార్తెలు, మనవండ్లు *"దేవునియందు నిరీక్షణ గలవారగునట్లు"* దేవుని ఆశ్చర్యక్రియలు వారికి తెలియజేయబడవలెను. తలిదండ్రులు తమ పిల్లలను "ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను పెంచే" బాధ్యత కలిగియున్నారు (ఎఫెసి 6:4).

**ధ్యాన వచనము 5:** *రాగల తరములలో పుట్ట బోవు పిల్లలు దాని నెరుగునట్లును, వారు లేచి, తమ పిల్లలకు దానిని వివరించునట్లును, వీరును దేవునియందు నిరీక్షణ గలవారై, దేవుని క్రియలను మరువకయుండునట్లు.... ఆయన యాకోబు సంతతికి శాసనములను నియమించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు జరిగించిన దానిని ఎన్నడూ మరువకుండా, నా పిల్లలతో దానిని నిరంతరము పంచుకొనుటకు సహాయపడుము.*

యీ వాక్య భాగములో ఎఫ్రాయిము సంతతి వారు దేవునికి వ్యతిరేకంగా తిరుగబడడాన్ని గురించి తెలియజేయబడినది. దేవుడు అరణ్యములో వారిని సంరక్షించి, నడిపించినప్పటికీ వారు ఆయనమీద తిరుగబడిరి. యిచ్చట "ఇశ్రాయేలీయులు" అను పదమునకు బదులుగా "ఎఫ్రాయిము" అను పదము వాడబడినది. ఎందుకనగా ఎఫ్రాయిము సంతతి వారు బేతేలులో బంగారు దూడలను నిలుపుట ద్వారా ఇశ్రాయేలీయుల 10 గోత్రముల వారు విగ్రహారాధన చేయుటకు కారకులైరి (హోషేయ 4:17).

1. ఎఫ్రాయిము సంతతి వారు గుర్తు చేయబడుట - వ. 9
2. వారు దేవుని మార్గములో నడచుటకు తిరస్కరించుట - వ. 10-11
3. దేవుని శక్తిచేత వారు ఐగుప్తు నుండి విడిపించబడుట - వ. 12-13
4. అరణ్యములో దేవుడు వారి అవసరములను తీర్చిన విధానము గుర్తు చేయబడుట- వ. 14-16

మనము చాలా సులభంగా మరచిపోతుంటాము. గతములో అద్భుతములు జరిగించిన దేవున్ని ప్రస్తుతములో అలక్ష్యము చేస్తాము. మనలను మన మార్గమంతటా నడిపించిన దేవుని యందు కాక మనలను మనమే నమ్ముకొనడమనేది మన స్వాభావిక లక్షణముగా వున్నది.

**ధ్యాన వచనము 10 :** *వారు దేవుని నిబంధనను గైకొనకపోయిరి. ఆయన ధర్మశాస్త్రము ననుసరింపనొల్లక పోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నన్ను సంరక్షించిన విధమును నేను ఎన్నటికీ మరువకుందునుగాక. నేను ఎల్లప్పుడూ నిన్ను, నీ వాక్యమును అనుసరించుదును గాక.*

దేవుడు మనలను పోషిస్తున్నప్పటికీ కొన్నిసార్లు మనము దేవునిపై ఎంతగానో తిరుగబడతాము. దేవుని పోషణకు వ్యతిరేకంగా ఇశ్రాయేలీయులు ఆయనపై సణుగులు, గొణుగులు కలిగియుండిరి. దేవుని శక్తిని వారు తిరస్కరిస్తూ "ఈ అరణ్యములో దేవుడు భోజనము సిద్ధపరచగలడా?" అని ప్రశ్నించిరి. దేవుడు వారికి ఆహారము సిద్ధ పరచుటకు సామర్థ్యుడు మాత్రమే గాక వారిని నిజంగానే ఆహారంతో పోషించాడు.

1. దేవునిమీద ఇశ్రాయేలీయులు తిరుగబడుట -వ. 17
2. దేవుని పోషణకు వ్యతిరేకంగా వారు మాట్లాడుట - వ. 18-20
3. దేవుడు ఇశ్రాయేలీయులను శిక్షించుట - వ. 21
4. ఇశ్రాయేలీయులు దేవునియందు విశ్వాసముంచకపోవుట - వ. 22
5. అయినప్పటికీ దేవుడు వారిని పోషించుట -వ. 23-25

దేవుని సంరక్షణను ప్రశ్నించుటద్వారా మనమేమీ సాధించలేము. మన అవసరములన్నీ తీరుస్తానని దేవుడు వాగ్దానము చేసియున్నాడు. మన అవిశ్వాసపు సమస్యను మనము యెదుర్కొని, దానిని అధిగమించి, మన అవసరములు తీర్చబడుటకొరకు దేవుని యందు మనము నమ్మిక కలిగియుండవలెను.

**ధ్యాన వచనము 22:** *వారు దేవునియందు విశ్వాసముంచక పోయిరి. ఆయన దయచేసిన రక్షణయందు నమ్మిక యుంచలేదు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా అవసరములు తీర్చు దేవుడవుగా నిన్ను నమ్మనందుకు మరియు నీ వాక్యమందు విశ్వాసముంచుటలో విఫలము చెందినందుకు నన్ను క్షమించుము.*

ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణము చేయుచున్నప్పుడు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటుచేసి, ఆయనకు కోపమును పుట్టించినందుకు దేవుని తీర్పు వారి మీదికి వచ్చింది. 20 నుండి 30 లక్షల వరకు వున్న ఇశ్రాయేలీయులు ఎండిపోయిన అరణ్యములో 40 సంవత్సరముల పాటు దేవునిచేత పోషించబడడమనేది అద్భుతమైన విషయము. ఆలాగు దేవుడు వారిని పోషించినప్పటికీ వారు ఆయనకు వ్యతిరేకంగా సణిగి, తిరుగబడిరి. దేవుడు వారిపట్ల ఎన్ని మేలులు జరిగించినను వారు పశ్చాత్తాపము లేని వారుగా వుండిరి. యెంత విషాదకర విషయము! దేవునిపట్ల మన ప్రతిస్పందన యెలాగున్నది? మనము కూడా ఇశ్రాయేలీయులవలె వున్నామా?

1. ఇశ్రాయేలీయుల ఆకలి తీర్చబడుట – వ. 26–29
2. ఇశ్రాయేలీయులు దేవుని చేత మొత్తబడుట – వ. 30–31
3. ఇశ్రాయేలీయులు అవిశ్వాములో కొనసాగి, పాపము చేయుట – వ. 32

సినాయి పర్వతము వేడిగా, ఎండి పోయినదై యుండి, కుటుంబమును పోషించుటకు సరియైనది కాకుండా వున్నది. అయినప్పటికీ, దేవుడు ఇశ్రాయేలీయులను పోషించాడు. బాధాకరమైన సత్యమేమనగా దేవుడు వారిని పోషిస్తూ వచ్చినప్పటికీ, వారు ఆయనమీద తిరుగుబాటు చేస్తూ, పాపము చేయుచునే వచ్చిరి.

**ధ్యాన వచనము 2:** *ఇంత జరిగినను వారు ఇంకను పాపము చేయుచు, ఆయన ఆశ్చర్య కార్యములనుబట్టి ఆయనను నమ్ముకొనకపోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నా అవసరములన్ని తీర్చిన విధమును నేను యెల్లప్పుడు జ్ఞాపకముంచుకొందును గాక. నిన్ను యెల్లప్పుడు స్తుతించి, నీకు వందనములు చెల్లించు దును గాక.*

దేవుడు మనలను గద్దించినపుడు మనము తెలుసుకొన్నవారమైతే అనేకసార్లు అది మనలను పశ్చాత్తాపమువైపునకు నడిపిస్తుంది. ఎందుకనగా దేవుని మంచితనము మరియు ఆయన కనికరమును గూర్చి మనము యెరిగియున్నాము. ఇశ్రాయేలీయులు అనేక సార్లు దేవునికి వ్యతిరేకంగా ఆయనపై తిరుగుబాటుచేసి, అవిధేయతలో జీవించినప్పటికీ, దేవుడు వారిని క్షమించి, తన ఆశ్చర్యకరమైన కనికరమును వారికి బయలుపరిచాడు. యిట్టి కృప గల దేవుని తెలుసుకొని, ఆయనను ప్రేమించుట ఎంత ధన్యకరము!

1. ఇశ్రాయేలీయుల దినములు గతించిపోవుట - వ.33
2. వారు దేవునియొద్దకు తిరిగివచ్చుట - వ.34-35
3. వారు దేవుని నిబంధనను గైకొనక పోవుట - వ.36-37
4. దేవుని వాత్సల్యత - వ.38-39

దేవుడు మనకు ఆశ్రయ దుర్గమును, విమోచకుడునై యున్నాడని మనము జ్ఞాపకము చేసుకొనవలెను. మన మూర్ఖత్వముతో చాలాసార్లు ఆయనను అలక్ష్యము చేస్తుంటాము. "అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది. ఆయన యెంతైనా నమ్మదగిన దేవుడు."

**ధ్యాన వచనము 35:** *దేవుడు తమకు ఆశ్రయ దుర్గమనియు, మహోన్నతుడైన దేవుడు తమకు విమోచకుడనియు వారు జ్ఞాపకము చేసికొనిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ జాలిని మరియు నీ క్షమాపణనుబట్టి నీకు వందనములు.*

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో వున్నప్పుడు దేవుని ప్రేమ, కృప మరియు ఆయన కాపుదల ఎంతో బలమైన రీతిలో వారిపట్ల బయలుపరచబడినవి. ఐగుప్తీయులు తమ మీదికి దేవుడు పంపిన తెగుళ్లనుబట్టి ఎంతో బాధ పడిరి. అయితే తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు దేవుడు తన కనికరమును చూపించి, ఆ తెగుళ్లనుండి వారిని తప్పించాడు. దేవుడు ఒక గొర్రెల కాపరిగా మనలను నడిపిస్తాడనియు, ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణములన్నిటిలోను ఆయన వారిని నడిపించి, కాచెననియు పై వాక్య భాగము బోధించుచున్నది. యీ సత్యమును మనము అలక్ష్యముచేసి, మనలను మనమే బాధ పరచుకుంటాము. నిన్ను ప్రేమించుచున్న ఆ 'గొప్ప కాపరి' వైపు నీ కన్నులను తిప్పుము.

1. ఇశ్రాయేలీయులు దేవునిపై తిరుగబడుట - వ. 40-41
2. దేవుడు వారిపట్ల చేసిన అద్భుతములను వారు మరచిపోవుట - వ. 42-43
3. దేవుడు పంపిన తెగుళ్లు ఆయన శక్తిని బయలుపరచుచున్నవి - వ. 44-48
4. దేవుడు ఐగుప్తీయులను శిక్షించుట - వ. 49-51
5. గొప్ప కాపరిగా దేవుడు ఇశ్రాయేలీయులను నడిపించుట - వ. 52-53

దేవుడు తన ప్రజలను ఎట్లు కాయుచున్నాడో, గొప్ప కష్టములనుండి ఆయన వారిని యెట్లు విడిపించుచున్నాడో ఆసంగతులను తెలియజేయుచున్న పై వాక్య భాగమును చదువుచున్నప్పుడు సంతోషించకుండా వుండలేము. నిన్ను ఎదిరించుచున్న పరిస్థితులనుండి విడిపించబడుటకు నీవు యీ దినము ఆయనను నమ్ముకొనుచున్నావా?

**ధ్యాన వచనము 52:** *అయితే, గొఱ్ఱెలవలె ఆయన తన ప్రజలను తోడుకొని పోయెను. ఒక మందను నడిపించునట్లు అరణ్యములో ఆయన వారిని నడిపించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా మార్గమంతటిలోను, ప్రతి కష్ట సమయములోను నన్ను నడిపిస్తూ వస్తున్నందుకు నీకు వందనములు.*

మానవులు నిర్మించే యే కట్టడమైనను దేవునిమహిమతో నింపబడిన సామాన్యమైన ప్రత్యక్షపు గుడారముతో పోల్చబడలేదు. ప్రత్యక్షపుగుడారములోని ప్రతి వస్తువు దేవుని ఆరాధించుటను గూర్చియు, ఆయనకు ప్రార్థించుటను గూర్చియు, బలుల అర్పణయొక్క ప్రాముఖ్యతను గూర్చియు తెలియజేయుచున్నది. అది దేవుని పరిశుద్ధ స్థలము. అచ్చట దేవుని చిత్తము తెలియజేయబడుచుండెను. అది దేవుని ప్రజలు ఆయనను ఎల్లప్పుడు ఆరాధించు స్థలము. అయితే, యిటువంటి ఆశీర్వాదమును లెక్కచేయకుండా వారు విగ్రహారాధనవైపు తిరిగి, దేవుని ఉగ్రతకు గురియైరి.

1. ప్రత్యక్షపు గుడార నిర్మాణము – వ. 54
2. అన్యజనులు వెళ్ల గొట్ట బడుట – వ. 55
3. ఇశ్రాయేలీయులు దేవునిపై తిరుగబడి, ఆయనకు కోపము పుట్టించుట – వ. 56–58
4. వారి విగ్రహారాధన యొక్క పర్యవసానము – వ. 59–61

దేవుని విడిచిపెట్టి, ఆయనను వెంబడించుటకు మరియు ఆరాధించుటకు మనకు అవసరములేదని నిర్ణయించుకొన్నట్లయితే, మనము దాని పరిణామమును అనుభవించెదము.

**ధ్యాన వచనము 56:** *అయినను వారు మహోన్నతుడైన దేవుని శోధించి, తిరుగుబాటు చేసిరి. ఆయన శాసనముల ననుసరింపకపోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నిన్ను ఆరాధించి, నీ వాక్యమును నా పూర్ణ హృదయముతో అనుసరించుటకు నీ యొద్దకు వచ్చెదను.*

ఇశ్రాయేలీయుల పాపము మరియు వారి అవిధేయత కారణంగా వారు అనుభవించిన భయంకరమైన పరిణామములను గూర్చి పై వాక్య భాగము వర్ణిస్తున్నది. మన జీవితములలో మన పాపమువలన మనము ఎటువంటి పర్యవసానమును ఎదుర్కొందుమో దానిని గూర్చి యీ వాక్య భాగముద్వారా గుర్తు చేయబడుచున్నాము. అయితే, అదే సమయములో యీ వచనములు దేవుడు తన ప్రజలను ఎన్నడును వదలి వేయడని తెలియజేయుచున్నవి. ఆయన నిబంధన షరతులు లేనిది. ఆయన ప్రేమ నిత్యమూ నిలుచునది. దానిని బట్టి దేవునికి వందనములు.

1. దేవుని ప్రజల మరణము – వ.62
2. ఇశ్రాయేలీయుల కన్యకలకు వివాహము కాకపోవుట – వ.63
3. ఇశ్రాయేలీయుల యాజకులు మరణమగుట – వ. 64
4. ఇశ్రాయేలీయుల శత్రువులపై పగ తీర్చుకొనుటకు దేవుడు నిర్ణయించుకొనుట–వ.65
5. దేవుడు ఇశ్రాయేలీయుల శత్రువులను తరిమికొట్టుట – వ.66

దేవుడు ఇశ్రాయేలు చరిత్రలో వారికి తోడై యుండి, వారిని భద్రపరచకపోయుంటే ఆ దేశము యీ దినమున ఉండేది కాదు. ఆ దేశము ఎన్నో దుర్ఘటనలు ఎదుర్కొన్నప్పటికీ, దేవుడు వారిని విడిపిస్తూ వచ్చాడు. యీ సత్యము మన హృదయములను ఎంతో ప్రోత్సాహ పరుస్తున్నది.

**ధ్యాన వచనము 65:** *అప్పుడు నిద్రనుండి మేల్కొను ఒకని వలెను, మద్య వశుడై ఆర్భటించు పరాక్రమశాలివలెను ప్రభువు మేల్కొనెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ప్రజలకు విడుదల కలుగజేసి, నన్ను కూడా అనేక సందర్భములలో కాపాడినందుకు నీకు వందనములు.*

బేతేలులో బంగారు దూడను నిలువబెట్టి, ఇశ్రాయేలు లోని ఉత్తరమున ఉన్న గోత్రముల వారితో విగ్రహారాధన చేయించిన ఎఫ్రాయిమును దేవుడు తృణీకరించాడు. దానికి బదులు ఆదికాండం 49:8–12 లో యూదా తండ్రియైన యాకోబు ప్రవచించినట్లు యూదా గోత్రమును దేవుడు ఏర్పరచుకున్నాడు. యూదా గోత్రములో జన్మించిన దావీదును దేవుడు తన ప్రజలను నడిపించుటకు పిలుచుకున్నాడు. రాజైన దావీదుతో దేవుడు నిబంధన చేసి, దావీదు సంతతిలో నుండి ఆయన సింహాసనముమీద కూర్చొని, యీ ప్రపంచ మంతటినీ పరిపాలించబోయే రాజు రాబోవు చున్నాడని వాగ్దాన మిచ్చాడు. ఆయనే ప్రభువైన యేసుక్రీస్తు.

1. దేవుడు ప్రత్యక్షపు గుడారమును తిరస్కరించుట – వ.67
2. దేవుడు యూదా గోత్రమును, సీయోను పర్వతమును ఏర్పరచుకొనుట – వ.68–69
3. దేవుడు సౌలు స్థానములో దావీదును ఏర్పరచుకొనుట –వ.70–71
4. దావీదు నాయకత్వమును గూర్చి దేవుడిచ్చు సాక్ష్యము – వ.72

దేవుడు దావీదు సోదరులను కాదని ఆయనను ఏర్పరచుకొన్నప్పుడు యీ సత్యమును తెలుసుకొన్నాము – "మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును (1 సమూయేలు 16:7)."

**ధ్యాన వచనము 72:** అతడు యథార్థహృదయుడై వారిని పాలించెను. కార్యములయందు నేర్పరియై వారిని నడిపించెను.

**ప్రార్థన:** ప్రభువా, నేను ఎక్కడినుండి వచ్చినదీ, నీవు నన్ను ఎంతగా ఆశీర్వదించినదీ జ్ఞాపకముంచుకొనుటకు నాకు సహాయపడుము.

ఇశ్రాయేలీయుల సాక్ష్యము సరిగా లేదు – *"మా పొరుగు వారికి మేము అసహ్యులమైతిమి, మా చుట్టునున్న వారు మమ్మునపహసించి యెగతాళి చేసెదెరు"* (వ. 4). వారి చుట్టు వున్న అన్య జనులు వారిని జయించి, వారి పరిశద్ధాలయమును అపవిత్రపరచి, దేవుని ప్రజలను చంపిరి. అందుకు ఇశ్రాయేలీయులు *"యెహోవా, ఎంత వరకు కోపపడుదువు? ఎల్లప్పుడును కోపపడుదువా?"* అని దేవుని ప్రశ్నించుచున్నారు. దేవునికి వందనములు. ఇశ్రాయేలీయుల శ్రమలు ముగిసినవి. భవిష్యత్తులో వారి శ్రమలు శాశ్వతంగా ముగియబోవుచున్నవి. ఇశ్రాయేలు దేశము పూర్తిగా నిర్మూలించబడకుండా దేవుడు తన కరుణనుబట్టి ఆ దేశమును కాపాడుచున్నాడు. ఆయన షరతులు లేని నిబంధన మరియు ఆయన విశ్వసనీయత ఇశ్రాయేలీయులను నశించకుండా కాపాడుచున్నాయి.

1. ఇశ్రాయేలుపై దేవుని తీర్పుయొక్క ఫలితము – వ. 1–3
2. ఇశ్రాయేలీయులు తమ పొరుగువారిచేత తిరస్కరింపబడుట – వ. 4
3. దేవుని కోపమునకు ఇశ్రాయేలీయుల ప్రతిస్పందన – వ. 5
4. తమ శత్రువులపై దేవుని ప్రతీకారమును ఇశ్రాయేలీయులు కోరుకొనుట – వ. 6–7

ఇశ్రాయేలీయుల పట్లయు, అన్ని తరములలో వున్న విశ్వాసులందరిపట్లయు దేవుడు తన వాగ్దానములను మరచి పోలేదు. యీ దుష్ట లోకము ఒకానొక దినము దేవుని ఉగ్రతను ఎదుర్కో బోవుచున్నది.

**ధ్యాన వచనము 5:** *యెహోవా, ఎంతవరకు కోపపడుదువు? ఎల్లప్పుడును కోపపడుదువా? నీ రోషము అగ్నివలె ఎల్లప్పుడును మండునా?*

**ప్రార్థన:** *ప్రభువా, యీ లోకమును నీవు నీతితో తీర్పు తీర్చబోవుచున్నావు గనుక నీకు వందనములు.*

పై వాక్య భాగములో కీర్తనాకారుడు అత్యవసరమైన రీతిలో దేవుని సహాయము కొరకు ప్రార్థించుచున్నాడు. మన జీవితములలో మనకు అర్థం కాని సంగతులు అనేకములున్నవి. శత్రువుయొక్క ఎదిరింపులు, యితరులనుండి వచ్చు నిందలు, దుష్టులు వర్ధిల్లుట మొదలగునవి వీటిలో కొన్ని మాత్రమే. గొప్ప బాధ, తరచుగా వచ్చు నిరాశ, పరిష్కరించబడని సమస్యలతో జీవితము నిండియుంటుంది. యివన్నియు మనలను మోకాళ్ల మీద దేవునికి ప్రార్థన చేయుటకు నడిపించాలి. దేవుడు సమస్తమును యెరిగినవాడై, సమస్తమును మన మేలుకొరకు, ఆయన మహిమకొరకు జరిగించుచున్నాడు.

1. గత దోషములను మరువమని కీర్తనాకారుడు దేవునికి మనవి చేయుట - వ. 8
2. ఇశ్రాయేలీయులకు అవసరమైయున్న పాప క్షమాపణ - వ. 9
3. దుష్టులు చేసిన దానినిబట్టి దేవుని దండన వారిమీదికి వచ్చుట -వ. 10
4. శ్రమపడిన వారిని దేవుడు కాపాడుట - వ. 11
5. దేవుని ప్రతీకారముకొరకు కీర్తనాకారుడు ప్రార్థించుట -వ. 12
6. అన్ని తరముల వారికి దేవుని కీర్తి ప్రచురపరచబడుట - వ. 13

మన సంగతులు, సమస్యలన్నిటిని దేవుని చేతులలో వదలివేయవలెను. దేవునికి వందనములు చెల్లించి, నిరంతరము ఆయనను స్తుతించుటయే మన గురిగా కలిగి యుండవలెను.

**ధ్యాన వచనము 13 :** *అప్పుడు నీ ప్రజలమును, నీ మంద గొఱ్ఱెలమునైన మేము సదా కాలము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదము. తరతరముల వరకు నీ కీర్తిని ప్రచుర పరచెదము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు సమస్తమును సరి చేయబోవుచున్నావు గనుక నీకు వందనములు చెల్లించి, నీ నామమును నిరంతరము స్తుతించెదను.*

యీ కీర్తన ఒక ప్రార్థనగా "ఇశ్రాయేలు కాపరి" యైన దేవునికి మొఱపెట్ట బడుచున్నది. అతి పరిశుద్ధ స్థలములో "కెరూబుల మధ్య ఆసీనుడైన" దేవుడు తన ప్రజలను వారి మార్గమంతా నడిపించాడు. రక్షణ దేవునియందే యున్నదని, దేవుని కోపము తన ప్రజలమీద బరువుగా వున్నదని కీర్తనాకారుడు గుర్తించాడు. కనుక, మనము అనేక సార్లు అడిగే ప్రశ్ననే కీర్తనాకారుడు అడుగుచున్నాడు –*"నీ ప్రజల మనవి నాలకింపక నీ వెన్నాళ్లు నీ కోపము పొగరాజనిచ్చెదవు?"*

1. 'ఇశ్రాయేలు కాపరి' కి చేయబడుతున్న ప్రార్థన - వ. 1
2. తన ప్రజల రక్షణకు అవసరమైన దేవుని పరాక్రమము - వ. 2
3. దేవుడు మాత్రమే యివ్వగల రక్షణ - వ. 3
4. దేవుని కోపమును గూర్చి కీర్తనాకారుని ప్రశ్న - వ. 4
5. దేవుని ప్రజల దుఃఖము మరియు వారి శత్రువుల అపహాస్యము - వ. 5–6

జీవితములోని బాధలు, కష్టములు దేవుడు మనకు ఎంతగా అవసరమై యున్నాడన్న సత్యమును తెలియజేయుచున్నవి. దేవుని జ్ఞానము, ఆదరణ, బలము, సమాధానము మొదలగునవి మనకు అవసరమైయున్నవి. ఆయన సమయము ఎల్లప్పుడు ఉత్తమమైనది.

**ధ్యాన వచనము 3 :** *దేవా, చెరలో నుండి మమ్మును రప్పించుము. మేము రక్షణ నొందు నట్లు నీ ముఖ కాంతి ప్రకాశింప జేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా యెడల ఏది ఉత్తమమో అది జరిగించెదవని నిన్ను నమ్ముకొందును. నీ సమయానుసారమైన జవాబుల కొరకు వేచిచూచెదను.*

పై వాక్య భాగములో "చెరలో నుండి మమ్ము రప్పించుము" అను మాటలు పశ్చాత్తాపముతో కూడిన ప్రార్థనను సూచిస్తున్నాయి. అనగా యివి మన పాపమును వదిలి, దేవుని వైపు తిరిగి, పలుకబడుతున్న మాటలు. కీర్తనాకారుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తులో నుండి తీసుకు రాబడి, "నాటబడిన" ఒక "ద్రాక్షావల్లి"గా వర్ణిస్తున్నాడు. ఇది దేవుడు జరిగించిన ఒక ఆశ్చర్య కార్యము. అయితే వారు దేవునిపై చేసిన తిరుగుబాటును బట్టి ఇశ్రాయేలీయులు వారి శతృవుల ఎదిరింపులు, ఎగతాళికి గురయ్యారు. కనుక ఇశ్రాయేలీయులు పశ్చాత్తాప పడవలసిన అవసరము వారికున్నది.

1. రక్షణ కొరకు చేయబడుచున్న ప్రార్థన - వ. 7
2. గతంలో దేవుడు ఇశ్రాయేలీయులపట్ల బలమైన అద్భుత కార్యములు జరిగించుట - వ. 8-11
3. తమ పాపము, తిరుగుబాటునుబట్టి ఇశ్రాయేలీయులు నష్టమును అనుభవించుట - వ. 12-13

దేవుడు మనలను తన వైపునకు తిరిగి మళ్లించుట కొరకు మన జీవితములలో ఆపదలను, పరీక్షలను అనుమతిస్తాడు. తిరుగుబాటులోను, శరీర సంబంధమైన క్రియలలోను, అటువంటి వైఖరిలోను కొనసాగవద్దు. దేవుడు దీర్ఘశాంతము గలవాడు. అయితే, ఆయన మనలను ప్రేమిస్తున్నాడు గనుక మనలను శిక్షిస్తున్నాడు. మనకు హాని కలుగ జేయాలన్న ఉద్దేశ్యము ఆయనకు లేదు (హెబ్రీయులకు 12).

**ధ్యాన వచనము 7 :** *సైన్యముల కధిపతివగు దేవా, చెరలో నుండి మమ్ము రప్పించుము. మేము రక్షణ నొందునట్లు నీ ముఖ కాంతి ప్రకాశింప జేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేనిప్పుడు నీ వైపునకు తిరిగి, నా పాపములను ఒప్పుకొని, నేను చేయుచూ వచ్చిన పాపములను బట్టి పశ్చాత్తాప పడుచున్నాను.*

పై వాక్య భాగము పశ్చాత్తాపముతో కూడిన ప్రార్థనగా వ్రాయబడినది. ఇశ్రాయేలీయుల మొఱలకు ప్రతిస్పందించమని కీర్తనాకారుడు దేవునితో మనవి చేసు కొనుచున్నాడు. 18 వ వచనములో వ్రాయబడిన "బ్రదికింపుము" అను పదమునకు "ఉజ్జీవింపజేయుము" అని అర్థము. మన పాపము, తిరుగుబాటును వదిలి, దేవునివైపు తిరిగినపుడు ఉజ్జీవము మొదలౌతుంది. 1థెస్సలొనీకయులకు 1:9-10 లో "విగ్రహములను" విడిచిపెట్టి, "జీవముగల దేవునికి దాసులగుటకు" మరియు "పరలోకమునుండి ఆయన కుమారుడైన యేసు రాక కొరకు ఎదురు చూచుటకును" అక్కడి విశ్వాసులు దేవునివైపు తిరిగియున్నారని వాక్యము తెలియజేయుచున్నది.

1. దేవుని సహాయమును కోరుకుంటున్న కీర్తనాకారుడు - వ. 14
2. ఇశ్రాయేలీయులు అనుభవించిన నష్టము - వ. 15-16
3. దేవుని బాహుబలము ఇశ్రాయేలీయులకు తోడైయుండుట - వ. 17
4. ఇశ్రాయేలీయులు దేవునిపై ఆధారపడుట వారి కవసరము - వ. 18
5. దేవునినుండి మాత్రమే కలుగు విడుదల - వ. 19

18 వ వచనములో "*నీ నామమును బట్టియే మేము మొఱ పెట్టుదుము*" అను మాటలలో మనము చేయవలసిన దానిని గూర్చి తెలుసుకొనుచున్నాము. దేవునివైపు తిరిగి, మన పూర్ణ హృదయములతో ఆయన యందు నమ్మికయుంచుటకు ఇదే సమయము.

**ధ్యాన వచనము 19 :** *యెహోవా, సైన్యములకధిపతివగు దేవా, చెరలోనుండి మమ్ము రప్పించుము. మేము రక్షణ నొందునట్లు నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు మొఱ పెట్టుదును. నా పూర్ణ హృదయముతో నీ యొద్దకు తిరిగి వచ్చెదను.*

యీ కీర్తన దేవుని ఆరాధించుట కొరకైన పిలుపుగా వ్రాయబడినదని అనేకులు నమ్ముదురు. అమావాస్య నాడు, 'పండుగ' దినమైన పున్నమి నాడు కొమ్ము ఊద వలెనని 3 వ వచనములో వ్రాయబడినది. యిది బూరల పండుగ (రోష్ హషానా) ను గూర్చి వ్రాయబడి యుండ వచ్చును. దేవుడు మనము చేయు స్తుతి కీర్తనల యందు ఆనందిస్తాడు. దేవుడు తన ప్రజలను యెలా విమోచించాడో, అరణ్యములో వారి అవసరములను ఎలా తీర్చాడో పై కీర్తన గుర్తు చేయు చున్నది.

1. దేవునికి సంతోషము కలిగించే స్తుతి గానము – వ. 1–2
2. కొమ్ము ఊదబడుట – వ. 3
3. కొమ్ము ఊది, దేవుని స్తుతించుట ఆయన ఇశ్రాయేలీయులకు నియమించిన కట్టడ – వ. 4
4. ఐగుప్తులో దేవుడు ఇశ్రాయేలీయులకు కలిగించిన విడుదల – వ. 5–6
5. దేవుడు ఇశ్రాయేలీయుల మొఱ ఆలకించుట – వ. 7

ఆయన దేవుడనియు, మన స్తుతి, ఆరాధనకు తాను మాత్రమే యోగ్యుడనియు మనము తెలుసుకొనునట్లు దేవుడు మన మొఱలను విని, తన సమయప్రకారము, తన మార్గములో మనకు విమోచన కలిగిస్తాడు.

**ధ్యాన వచనము 1 :** *మనకు బలమైయున్న దేవునికి ఆనంద గానము చేయుడి. యాకోబు దేవుని బట్టి ఉత్సాహ ధ్వని చేయుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవేమై యున్నావో దానిని బట్టియు మరియు నీవు చేయు సమస్తమును బట్టియు నీ నామమును కీర్తించి, స్తుతించెదను.*

'స్వాతంత్ర్యము' అను పదము ఆశ్చర్యకరమైనది. అయితే, మనము దేవునికి వ్యతిరేకంగా పాపము చేయుటకు "స్వాతంత్ర్యము" పొందలేదు. మనము "అన్యదేవత" లను ఆరాధిస్తే, దేవుని తీర్పు మనపైకి వస్తుంది. 11వ వచనములో సమస్యను గూర్చి స్పష్టంగా వ్రాయబడినది – *"అయినను నా ప్రజలు నామాట ఆలకింపక పోయిరి."* మరియు, 12 వ వచనములో నేటి తరమును గూర్చి వర్ణించబడినది – "కాబట్టి వారు *తమ స్వకీయాలోచనలను బట్టి నడుచుకొనిరి."* దేవుని నైతిక విలువల పరిధి లేకుంటే నిజమైన స్వాతంత్ర్యమును కోల్పోతాము. దేవుడు మనకు సహాయము చేయును గాక.

1. దేవుడు తన ప్రజలకు యిచ్చుచున్న పిలుపు – వ. 8
2. విగ్రహారాధనను దేవుడు నిషేధించుట – వ. 9
3. ఇశ్రాయేలీయులకు దేవుడు ఐగుప్తీయులపై విజయమిచ్చుట – వ. 10
4. ఇశ్రాయేలీయుల ప్రవర్తనను బట్టి దేవుని తీర్పు వారిపైకి వచ్చుట – వ. 11–12
5. ఇశ్రాయేలీయుల అవిధేయతనుబట్టి దేవుడు వ్యక్త పరుస్తున్న ఆందోళన – వ. 13–15
6. వారు విధేయులైతే కలుగు దేవుని ఆశీర్వాదము, ఆదరణ –వ. 16

దేవుని హస్తము ద్వారా కలుగు తృప్తిని కోరుకునే వారికి ఆయన గొప్ప ఆశీర్వాదమును వాగ్దానము చేసియున్నాడు. సామెతలు 14:34 ప్రకారము, "నీతి జనములు ఘనత కెక్కుటకు కారణము. పాపము ప్రజలకు అవమానము తెచ్చును."

**ధ్యాన వచనము 10 :** *ఐగుప్తీయుల దేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడనగు యెహోవాను నేనే. నీ నోరు బాగుగా తెరువుము. నేను దాని నింపెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, పాపము నుండి మమ్ములను స్వతంత్రులనుగా చేసినందుకు నీకు వందనములు. మునుపు ఇశ్రాయేలీయులకు నీవు బోధించిన సంగతులను మేము నేర్చుకొందుము గాక.*

పై వాక్య భాగము ఎంతో చక్కగా వ్రాయబడినదై, దేవుని న్యాయమును గూర్చి మాట్లాడుతూ, యీ ప్రపంచ నేతల యొక్క అన్యాయపు క్రియలను బట్టి వారిని గద్దిస్తున్నది. 1 వ వచనములో 'దైవములు' అను పదము దేవుని అధికారమును బట్టి పిలువ బడవలసిన యీ భూసంబంధమైన న్యాయాధిపతులను సూచిస్తున్నది. వారు దేవుని పక్షముగా వుండి, తీర్పు తీర్చవలసినవారై యున్నారు. అయితే, అనేకసార్లు జరిగినట్లు, ఇశ్రాయేలీయుల యొక్క న్యాయాధిపతులు సామాజిక అన్యాయమును జరిగిస్తూ, మంద బుద్ధితో కూడిన తీర్పు తీర్చుచూ వుండిరి. దేవుడు వారిపై తాను తీసుకు వచ్చే అంతిమ తీర్పును గూర్చి వారికి గుర్తు చేయుచున్నాడు.

1. దేవుని సన్నిధి - వ. 1
2. మారవలసిన పద్ధతులు - వ. 2
3. నిరుపేదల పక్షమున ప్రతివాదన చేయవలసిన అవసరత - వ. 3-4
4. జనులు అంధకారంలో వుండుటవలన కలుగు సమస్య - వ. 5
5. న్యాయాధిపతులకున్న స్థానము - వ. 6
6. న్యాయాధిపతులు తాత్కాలికంగా వుండి, తరువాత చనిపోవుదురు - వ. 7
7. తీర్పు తీర్చమని దేవునికి మనవి చేయుట - వ. 8

ఒక్కొక్కసారి ప్రజలు దుష్టత్వమును జరిగించి, తప్పించుకుంటున్నారనిపిస్తుంది. అనేక దేశములలో న్యాయము జరిగించబడుట లేదు. అయితే, మనమందరమూ అంతిమ తీర్పరి, న్యాయాధిపతియైన దేవునికి లెక్క అప్పజెప్పవలసిన వారముగా వున్నాము. మనము ఎల్లప్పుడు స్వచ్ఛమైన, దేవునికి జవాబు దారీతనముతో కూడిన జీవితములు జీవించుదుము గాక!

.**ధ్యాన వచనము 8 :** *దేవా లెమ్ము, భూమికి తీర్పు తీర్చుము. అన్యజనులందరు నీకే స్వాస్థ్యముగా వుందురు.*

**ప్రార్థన:** *నా దేవా, సర్వ జనులకు న్యాయకర్తవైన నా ప్రభువా, తీర్పు తీర్చుటకు నేను పిలువ బడినపుడు నీకు లోబడి, నిన్ను ఘనపరచే తీర్పు తీర్చుదునుగాక.*

ప్రపంచ చరిత్ర యంతటిలోను ఆయా దేశములు, వాటి నాయకులు ఇశ్రాయేలు దేశమును తుడిచి వేయాలని ప్రయత్నించారు. 6–8 వచనములలో ఆ ప్రయత్నము చేసిన కొన్ని దేశముల గురించి చెప్పబడినది. అవి జోర్డాను, సిరియా, లెబానాను మరియు ఇరాక్. ఇశ్రాయేలును నశింపజేయవలెనని ఆ దేశ శత్రువులు ప్రయత్నిస్తుండగా, మౌనముగా వుండకుండా వాని ప్రయత్నములను విఫల పరచుమంటూ దేవునికి చేయు ఒక ప్రార్థనగా యీ కీర్తన వ్రాయబడినది. అయితే, మనకు తెలిసిన రీతిగా దేవుడు సమస్తమును చూచు చున్నాడు. తన ప్రజలు సంపూర్ణంగా నాశనమగునట్లు ఆయన ఎన్నడూ అనుమతించడు. యిది ఆయన నిబంధన – యిర్మీయా 31:31–37.

1. దేవుడు జోక్యము కలిగించుకొనమని కీర్తనాకారుని మనవి – వ. 1–2
2. ఇశ్రాయేలు శత్రువులు చేయుచున్న ఆలోచన – వ. 3
3. ఇశ్రాయేలును ఉండకుండ చేయవలెనని ఆ దేశ శత్రువులు ఆలోచించుట – వ. 4–5
4. ఇశ్రాయేలు యొక్క శత్రు కూటమి – వ. 6–8

మన చుట్టు వున్న ప్రతి ఒక్కరూ మనకు వ్యతిరేకమై, హాని చేయవలెనని కోరుకున్నప్పుడు, దేవుడు యింకా మన బలముగా, మన పక్షమున వాదించు వాడుగా వున్నాడు. యిది ఆయన యందు నమ్మిక యుంచవలసిన సమయము. మన శత్రువులు చేయు ప్రణాళికలను ఆయన యెరిగి యున్నాడు. మనకు తన సమయము, తన ప్రణాళిక ప్రకారము విజయమును వాగ్దానము చేసి యున్నాడు.

**ధ్యాన వచనము 1 :** *దేవా, ఊరకుండకుము. దేవా, మౌనముగా వుండకుము. ఊరకుండకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ప్రజలైన ఇశ్రాయేలీయులను, నిన్ను నమ్ముకొను వారినందరిని కాయుమని ప్రార్థిస్తున్నాను.*

దేవుని ప్రజలపై వారి శత్రువులు దాడి చేసి, వారు కలిగించిన హానిని బట్టి వారికి తీర్పు తీర్చి, వారిపై ప్రతీకారము తీర్చుకొనమని దేవునికి మనవి చేసుకుంటూ యీ కీర్తన వ్రాయబడినది. ఇశ్రాయేలు చరిత్రలో గతంలో జరిగిన సంగతులను యీ కీర్తన గుర్తు చేయుచూ, అన్ని దేశముల ప్రజలకు తానెవరైనదీ చూపించమని దేవునికి మనవి చేయుచున్నది. రోమా 12:17-21 లో మనము యితరులపై వ్యక్తిగతంగా ప్రతీకారము తీర్చుకొనకూడదని, మన సంగతులను దేవుని హస్తములకు అప్పజెప్ప వలెనని స్పష్టముగా తెలియజేయబడినాము. మనము “మేలు” చేత “కీడు” ను జయించవలసిన వారముగా వున్నాము.

1. గతంలో జరిగిన సంగతులు గుర్తు చేయబడుట - వ. 9-12
2. ఇశ్రాయేలు శత్రువులకు తీర్పు తీర్చమని దేవునికి మనవి చేయబడుట - వ. 13-15
3. దేవుని తీర్పు కొరకైన మనవి చేయబడుటకు గల కారణములు - వ. 16-18

16 వ వచనములో, “వారు నీ నామమును వెదకునట్లు” అని వ్రాయబడగా, 18 వ వచనములో, “యెహోవా అను నామము ధరించిన నీవు మాత్రమే సర్వ లోకములో మహోన్నతుడవని వారెరుగుదురు” అని చెప్పబడినది. వారి మనవికి వెనుక గల ఉద్దేశ్యము దేవుని హెచ్చింపు మరియు ఘనత యందు వేరు పారి యున్నదని తెలుసుకొను చున్నాము. మనందరికీ ఒక గొప్ప పాఠముగా యీ కీర్తన వ్రాయబడినది.

**ధ్యాన వచనము 18:** *యెహోవా అను నామము ధరించిన నీవు మాత్రమే సర్వలోకములో మహోన్నతుడవని వారెరుగుదురు గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, దుష్టులు నాకేమి చేయుదురోనని కలవరపడి, నీ తీర్పును కోరు కొన్నప్పుడు, నా దృష్టి నీ ఘనత మరియు నీ మహిమలపై నిలుపు కొనుటకు సహాయపడుము.*

అనేకమంది విశ్వాసుల అనుభవములో దేవుని సన్నిధి కొరకు ఆశతో కనిపెట్టడమన్నది లోపిస్తున్నది. యీ వాక్య భాగములో కీర్తనాకారుడు దేవుని మందిరములో వుండి, ఆయనను ఆరాధించుటద్వారా కలుగు ఆశీర్వాదముల గురించి వివరించు చున్నాడు. యీ జీవిత వ్యాపారములలో పడిపోయి, దేవునిపట్ల ఎండిపోయిన, చల్లారిపోయిన హృదయము కలిగి యుండడం చాలా సులభమైన విషయము. దేవుడు మనపట్ల జరిగించిన మేలులన్నిటినిబట్టి ఆయనకు వందనములు చెల్లిస్తాము. కానీ సకలఆశీర్వాదములకు కారకుడైన దేవున్నే మరచిపోతుంటాము. జీవము గల దేవుని కొరకు నీ హృదయము కేకలు వేయుచున్నదా? *"నీ వలన బలము నొందు మనుష్యులు ధన్యులని"* 5వ వచనములో చదువుచున్నాము.

1. ఆరాధన చేయు స్థలము రమ్యమైనది - వ. 1
2. ఆరాధన కొరకు ఆశపడుట - వ. 2
3. పిచ్చుక మరియు వాన కోవెలను గూర్చిన సత్యము - వ. 3-4
4. దేవుని విశ్వసించు వారి జీవన శైలి - వ. 5-7

దేవుని పరిచర్యలో అధికమైన పని కలిగియుండడము ఎంత ముఖ్యమో, దేవుని పాదముల యొద్ద కూర్చుని, ఆయన నుండి నేర్చుకొనుటకు సమయము కేటాయించడము కూడా అంతే ముఖ్యమైన విషయము.

**ధ్యాన వచనము 4 :** *నీ మందిరము నందు నివసించు వారు ధన్యులు. వారు నిత్యము నిన్ను స్తుతించుదురు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ మందిరములో నివసించి, నిన్ను స్తుతిస్తూ, నిన్ను ఆరాధించవలెనని ఆశపడుచున్నాను.*

దేవుని సన్నిధి కొరకు ఆశపడి, ఆయనను ఆరాధించ గోరువారికి ఎన్నో ఆశ్చర్యకరమైన వాగ్దానములు మరియు ఆశీర్వాదములు కలుగుచున్నవి. యీ వాక్య భాగములో దేవుడు "సైన్యములకు అధిపతియగు దేవుడు"గా పిలువ బడుచున్నాడు (వ. 8,12). ఆయన "మన కేడెము" మరియు "సూర్యుడును, కేడెమునై" యున్నాడని వాక్యము తెలియజేయుచున్నది (వ. 9,11). ఆయన మనకు మేలుకరమైనది చేయక మానడని, "కృపయు, ఘనతయు" మనకు వాగ్దానము చేయుచున్నాడని 11 వ వచనములో చదువుచున్నాము. ఎంత అద్భుతమైన దేవున్ని మనము కలిగి యున్నాము!

1. దేవుడు ఆలకింప వలెనని కీర్తనాకారుడు మొఱ పెట్టుట – వ. 8–9
2. దేవుని మందిర ఆవరణములు – వ. 10
3. దేవుని గుణము వర్ణింప బడుట – వ. 11
4. దేవునియందు మనముంచవలసిన నమ్మిక – వ. 12

యీ వాక్య భాగమును పదే పదే చదువుట ద్వారా నీ హృదయము దేవునికొరకు ఆశపడునట్లు చేయబడును. మనలో అనేకులము *"దేవుని మందిరము"* లో ఉండుట కంటె *"భక్తిహీనుల గుడారములో"* వుండుటకు యిష్ట పడుతుంటాము. భక్తిహీనులకు వున్నవి మనము కూడా కోరుకొని, వారి వలె వుండాలని ఆశిస్తుంటాము. అయితే, మనకు కావలసిన వన్నీ దేవుని యందు వున్నాయన్న సత్యమును మరచి పోతుంటాము.

**ధ్యాన వచనము 12:** *సైన్యముల కధిపతివగు యెహోవా, నీ యందు నమ్మిక యుంచువారు ధన్యులు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ప్రజలైన ఇశ్రాయేలీయులను, నిన్ను నమ్ముకొను వారినందరిని కాయుమని ప్రార్థిస్తున్నాను.*

పై వాక్య భాగములో కీర్తనాకారుడు దేవుని క్షమాపణను మరియు ఆయన తన ఉగ్రత మన నుండి దూర పరచడాన్ని గుర్తు చేయుచున్నాడు. అంతేగాక, దేవుని తీర్పును గూర్చి ప్రశ్నిస్తూ, ఆయన ప్రజలను ఉజ్జీవింపజేసి, తన కృపను కనపరచమని దేవునికి మనవి చేయుచున్నాడు. ఉజ్జీవము మన హృదయములలో ఎంతో అవసరమైయున్నది. దాని వలన కలుగు ఫలితమును 6 వ వచనములో చూస్తున్నాము: "*నీ ప్రజలు నీ యందు సంతోషించెదరు.*" ఉజ్జీవము పాప క్షమాపణతో మొదలవుతుంది. మన పాపమును ఒప్పుకొని, విడిచి పెట్టినట్లయితే దేవుని కనికరమును పొందుతాము. (సామెతలు 28:13). మనము దేవుని ఉగ్రతకు పాత్రులమై యుండగా, దానిని మన నుండి దూరము చేసిన దేవుని కృపకై వందనములు చెల్లించుము.

1. గతంలో దేవుడు తన కృపను ఆయన ప్రజలపట్ల కనుపరచుట – వ. 1
2. మనము పొందిన దేవుని క్షమాపణ – వ. 2
3. దేవుని కోపము మన నుండి దూరమగుట – వ. 3
4. ఉజ్జీవము కొరకైన ప్రార్థన – వ. 4–6
5. దేవుని కృపకొరకు చేయబడుచున్న మనవి – వ. 7

దేవుని కనికరము మరియు క్షమాపణ విశ్వాసి హృదయమును ఎంతో కదిలించును. ఎంత మాత్రము వాయిదా వేయకుండా పాపములను ఒప్పుకొని, పశ్చాత్తాపపడి, దేవుని వైపునకు తిరుగుము. ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు.

**ధ్యాన వచనము 7 :** *యెహోవా, నీ కృప మాకు కనుపరచుము. నీ రక్షణ మాకు దయ చేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీ యొద్ద నుండి వైదొలగి పోయిన ప్రతి సందర్భములోను నా పూర్ణ హృదయముతో నీ వైపునకు తిరిగెదను. నీ క్షమాపణ మరియు సహనమునుబట్టి నీకు వందనములు.*

యీ వాక్య భాగములో పశ్చాత్తాపము మరియు ఉజ్జీవము వలన కలుగు ఆశ్చర్యకర దీవెనల గురించి వివరింపబడినది. దేవుడు మనతో ఏమి మాట్లాడుచున్నాడన్నది తెలుసుకొని, మనము పొందగల దానికంటే ఎక్కువగా మనలను ఆశీర్వదించగోరుచున్నాడని గుర్తించుట చాలా ముఖ్యమైనది. 9,12 వచనములలో వ్రాయబడిన "మన దేశము" మరియు "మన భూమి" అను మాటలు దేవుడు అబ్రహాము, ఇస్సాకు, యాకోబులతో చేసిన నిబంధనను గుర్తు చేయుచున్నవి. దేవుడు అబ్రహాముతో "జనము" (nation)ను గూర్చియు, యీ లోకమునకు రక్షకుడుగా రాబోయే "విత్తనము" (seed) అనగా యేసుక్రీస్తును గూర్చియు వాగ్దానము చేసియుండెను. అంతేగాక దేవుని ప్రజలు నివసించే ఒక "దేశము" (Land)ను గూర్చియు వాగ్దానము చేశాడు. ఇశ్రాయేలు విషయములో యీ వాగ్దానములు నెరవేరి యుండగా, ఆత్మీయంగా ప్రపంచ ప్రజలందరి విషయములో కూడా యివి సంపూర్ణంగా నెరవేరబోవునని గ్రహించుచున్నాము.

1. దేవుని మాటలను వినుట ఎంతో ప్రాముఖ్యము - వ.8
2. దేవుని రక్షణ యొక్క ఉద్దేశ్యము - వ.9
3. దేవుని ఆశీర్వాదముల వివరణ - వ.10-11
4. దేవుని ప్రజలమీదను, ఆయన వారికిచ్చు దేశముమీదను కలుగు ప్రభావము - వ.12-13

అవును, దేవుడు తన ప్రజలకు గొప్ప ఆశీర్వాదములనుగూర్చి వాగ్దానము చేసి యున్నాడు. అయితే, దేవుని ప్రజల వైఖరి, వారి క్రియలు, నీతి, సమాధానమునకు బదులు తిరుగు బాటును, సణుగుడును కలుగజేసినవి. యీ సత్యము గ్రహించుటకు దేవుడు మనకు సహాయపడును గాక!

**ధ్యాన వచనము 12:** *యెహోవా ఉత్తమమైనదానిననుగ్రహించును. మన భూమి దాని ఫలము నిచ్చును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యములోని నీ మాటలను వినుటకును మరియు నీవు వాగ్దానము చేసిన అద్భుతకరమైన ఆశీర్వాదములను తెలుసుకొని, అనుభవించుటకును సహాయ పడుము.*

యీ కీర్తనలో రాజైన దావీదు చేసిన ప్రార్థనలను తిరిగి ధ్యానించుకోబోతున్నాము. తాను దేవుని యెదుట తన హృదయమును కుమ్మరించి, దేవుని కృపకొరకు మొఱ పెట్టుచున్నాడు. దావీదు దేవుని యొద్దకు ప్రార్థనలో వచ్చిన విధానము చూస్తే, మనము కూడా అలా ప్రవర్తించవలెనని వాక్యముద్వారా సవాలు చేయబడుతున్నాము. అనగా తగ్గింపు స్వభావము గలిగి, దేవుని కృప, దయ మరియు క్షమాపణ మనకు అవసరమైయున్నాయని గుర్తెరిగి, ఆయన సన్నిధికి చేరుకొనవలెను. దావీదు దేవుని ఘనపరచి, ఆయన క్షమించుటకు సిద్ధముగా, యిష్టముతో వున్నాడని యీ కీర్తనద్వారా తెలుపుచున్నాడు.

1. దావీదు తన అవసరత గురించి ఒప్పుకొనుట – వ. 1
2. దేవునిపట్ల ఆయనకున్న తీర్మానము – వ. 2
3. దేవుని కృపకొరకు దావీదు మొఱపెట్టుట – వ. 3
4. దేవునియందలి ఆనందమును తిరిగి అనుభవించుటకు దావీదు ఆశపడుట –వ. 4
5. క్షమించుటకు సిద్ధముగా వున్న దేవునికి దావీదు ప్రార్థించుట – వ. 5,6

దేవుడు నిన్ను క్షమించుటకు సిద్ధముగా లేడని ఒక్క క్షణము కూడా అనుకొనవద్దు. ఏది సంభవించి యున్నను నీ హృదయమును కడిగి, నిన్ను సమకూర్చ గల దేవుని యెదుట నీ హృదయమును కుమ్మరించుము.

**ధ్యాన వచనము 5 :** *ప్రభువా, నీవు దయాళుడవు. క్షమించుటకు సిద్ధమైన మనస్సు గలవాడవు. నీకు మొఱ్ఱపెట్టు వారందరి యెడల కృపాతిశయము గలవాడవు.*

**ప్రార్థన:** *ఓ ప్రభువా, నీ కృపను, కనికరమును యెరిగిన వాడనై, నీ యొద్దకు మాత్రమే వచ్చెదను. నా పాపమును ఒప్పుకొని, నీ క్షమాపణ నా కవసరమైయున్నదని విన్నవించుకొందును.*

తనకున్న శ్రమలు, పరీక్షలమధ్య దావీదు దేవుడు ఎవరైనది మరియు ఆయన ఏమి జరిగించగలడన్న దానినిబట్టి ఆయనను హెచ్చించి, స్తుతించుచున్నాడు. మనకు దేవుడు ఏమైయున్నాడు మరియు ఆయన యేమి జరిగించగలడు అన్న విషయములపై సరియైన అవగాహన లేని కారణంగా ఎన్నో సమస్యలతో మనము జీవిస్తుంటాము. దావీదు తన ఆపదలలో సణుగుకొనకుండా, దేవుని స్తుతించుచున్నాడు. "నా ఆపత్కాలమందు నేను నీకు మొఱపెట్టెదను" అని 7 వ వచనములో చెప్పియున్నాడు. నీవు కూడా అట్లు యెందుకు చేయకూడదు?

1. దేవుడు తన ప్రార్థనకు జవాబిస్తాడని దావీదు నిశ్చయత కలిగియుండుట – వ.7
2. దేవుని ఆశ్చర్యకార్యములనుబట్టి దావీదు ఆయనను స్తుతించుట – వ.8
3. అన్య జనులందరు దేవుని ఆరాధిస్తారని దావీదు ప్రకటించుట – వ.9–10
4. తనకు బోధించి, తనను నడిపింపుమని దావీదు దేవుని ప్రార్థించుట – వ.11

అవును, ప్రపంచ ప్రజలందరు వచ్చి ఒకానొక దినము దేవుని ఆరాధిస్తారు (జెకర్యా14:16). యిప్పుడే ఆ పనిని మనము చేయుటకు మొదలు పెట్టగలము. ఆయన కార్యములను గూర్చి సాక్ష్యమిచ్చి, ఆయనను స్తుతించి, మహిమపరచి, హెచ్చించి, ఘనపరచి, ఆయన నామమును గొప్పజేసి, ఆయన నామమునకు వందనములు చెల్లించుము.

**ధ్యాన వచనము 8 :** *ప్రభువా, నీవు మహాత్మ్యము గలవాడవు. ఆశ్చర్య కార్యములు చేయు వాడవు. నీవే అద్వితీయ దేవుడవు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మాత్రమే దేవుడవు. నేను నీ నామమును మహిమ పరతును.*

దావీదు నిరంతరము తన శత్రువులచేత ఎదిరింపబడుతున్నాడు. వారు ఆయనను చంపవలెనని ప్రయత్నించుచుండిరి. దానికి దావీదు భయాందోళనకు గురికాకుండా ప్రార్థించుచున్నాడు. విచారపడి, దుఃఖించకుండా ధ్యానించుచున్నాడు. అలుగకుండా, దేవుడు తనపట్ల జరిగించగల, జరిగించబోవు కార్యములనుబట్టి ఆయనను స్తుతించు చున్నాడు. మన పరీక్షలు, శ్రమల మధ్య మన కనులను, హృదయమును ప్రభువు పైనే కలిగి యుండవలెను. ఆయన *"దయాదాక్షిణ్యములుగల దేవుడు. దీర్ఘశాంతుడు. కృపా సత్యములతో నిండినవాడు"* (వ. 15).

1. దావీదు దేవుని స్తుతించుట – వ. 12–13
2. గర్విష్టులు దావీదుకు వ్యతిరేకముగా తిరుగబడుట – వ. 14
3. దేవుని గుణములను దావీదు గుర్తించుట – వ. 15
4. కృపకొరకు, బలముకొరకు దావీదు ప్రార్థించుట – వ. 16
5. శుభకరమైన ఆనవాలు కొరకు దావీదు మనవి – వ. 17

దేవుడు కృపా కనికరములు గలవాడని, ఆయనను ప్రేమించి, ఆయనను సేవించే తన పిల్లలను ఎన్నడూ ఎడబాయడని, దావీదు సంపూర్ణముగా యెరిగినవాడై, దేవుని గుణములనుబట్టి ఆయనకు మొఱపెట్టుచున్నాడు.

**ధ్యాన వచనము 12:** *నా పూర్ణ హృదయముతో నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను. నీ నామమును నిత్యము మహిమపరచెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వొక్కడవే నాకు సహాయము చేయగల దేవుడవు. నేను నీ యొద్దకు వచ్చి, నిన్ను స్తుతించెదను.*

యీ కీర్తన "దేవుని పట్టణమైన" యెరూషలేమును గూర్చి వ్రాయబడినది. యీ ప్రపంచము యెరూషలేమును గూర్చి అస్పష్టముగా వున్నది. ప్రస్తుతమున్న యెరూషలేము పట్టణము భవిష్యత్తులో భిన్నంగా వుండబోతోంది. ఆ పట్టణము ఇశ్రాయేలు దేశమునకు నిత్యమైన రాజధాని. దేవుడు తన నామమును, తన సన్నిధిని ఆ పట్టణములో కలిగియుండుటకు ఆ పట్టణమును ఏర్పరచుకొన్నాడు. ఆ పట్టణము ప్రపంచ దేశములకు "వణకు పుట్టించు పాత్ర" గా వుండబోవుచున్నది (జెకర్యా 12 :1–2). మన నిత్య నివాసమునకు అదే పేరు యివ్వబడినది –"నూతన యెరూషలేము". యిక సమయము కొంచెమే మిగిలియున్నది. యేసు త్వరలో రాబోవు చున్నాడు.

1. యెరూషలేము యొక్క పునాది – వ. 1
2. యెరూషలేముపట్ల దేవుడు కలిగియున్న ప్రేమ – వ. 2
3. యెరూషలేముయొక్క గొప్పతనము – వ. 3
4. యెరూషలేమునుగూర్చి నేర్చుకొనవలసిన సంగతులు – వ. 4–7

దేవుని ప్రజలు తమ వాయిద్యములు, తమ స్వరములతో యెరూషలేము పట్టణమందు ఒకానొక దినము రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువైన యేసుక్రీస్తును స్తుతించి, మహిమ పరచెదరు. యీ పట్టణము దేవునికి చెందియున్నది. యీ పట్టణము దేవుని ప్రజలకు నిత్యమైన నివాస స్థలము. అవును, దేవుని ప్రజలకు "సమాధి తరువాత నిరీక్షణ" యున్నది.

**ధ్యాన వచనము 2-3 :** *యాకోబు నివాసములన్నిటి కంటె సీయోను గుమ్మములు యెహోవాకు ప్రియములై యున్నవి. దేవుని పట్టణమా, మనుష్యులు నిన్ను గూర్చి మిక్కిలి గొప్ప సంగతులు చెప్పుకొందురు.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ భూమిపట్ల భవిష్యత్తులో నీ కున్న ప్రణాళికను బట్టియు మరియు నీ వాగ్దానములన్నియు మా పట్ల నెరవేర్చే దేవుడవైనందును బట్టియు నీకు వందనములు.*

కీర్తనాకారుడు జీవితములో గొప్ప కష్టము, బాధను అనుభవించుచున్నట్లు పై వాక్య భాగములో వర్ణించబడియున్నది. కీర్తనాకారుని ప్రార్థనలు తాను కోరుకున్న ఫలితములను తీసుకురాలేదు. తన ఆపదలో తాను దేవునికి మొఱపెట్టుచున్నాడు. ఒక విశ్వాసి తన జీవితములో ఆయా సమయములలో అనుభవించు పరిస్థితులను గూర్చి పై వాక్య భాగము వర్ణించుచున్నది. నీవు గొప్ప బాధను అనుభవించునపుడు దేవుడు యెక్కడ వున్నాడు అని నీకు అనిపిస్తుంది. అయితే దేవుడు యెక్కడికో వెళ్లిపోలేదుగాని, తన ప్రణాళికను నీ జీవితములో అమలు చేయుచున్నాడు. దేవుని ప్రణాళికను మనము చూడలేము మరియు గ్రహించలేము. మన పూర్ణ హృదయములతో ఆయనయందు నమ్మిక యుంచడమే మన కర్తవ్యము.

1. భారముగల హృదయముయొక్క ప్రార్థన – వ. 1–2
2. అనేక ఆపదలవలన కలుగు బాధ – వ. 3
3. కీర్తనాకారుడు యెదుర్కొంటున్న సమాధి – వ. 4–5
4. దేవుని హస్తమునుండి కీర్తనాకారుడు యెదుర్కొంటున్న కష్టములు – వ. 6–7

మనకు యెదురయ్యే ఆపదలు దేవుని హస్తమునుండి కలుగుచున్నాయన్న సత్యమును అనేక సార్లు మనము గ్రహించము. కీర్తనాకారుడు, *"నీ ఉగ్రత నా మీద బరువుగా నున్నది. నీ తరంగములన్నియు నన్ను ముంచుచున్నవి"* అని 7 వ వచనములో చెప్పియున్నాడు. దేవుడు మనకు హాని కలుగజేయాలనే ఉద్దేశ్యముతో కాదు గానీ, మనలను ప్రేమిస్తూ, మన మేలు కోరుతూ మనలను గద్దించి, శిక్షిస్తాడు. మన జీవితములు పాడుచేయబడాలని ఆయన యెన్నడూ కోరడు.

**ధ్యాన వచనము 2 :** *నా ప్రార్థన నీ సన్నిధిని చేరునుగాక. నా మొఱ్ఱకు చెవి యొగ్గుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా శ్రమలు నీ నుండి వచ్చు చున్నాయనియు మరియు నీ యందు సంపూర్ణ విశ్వాసము నేను కలిగియుండవలెనని నీవు కోరుకొనుచున్నావనియు జ్ఞాపకముంచు కొనుటకు నాకు సహాయపడుము.*

పై వాక్య భాగములో కీర్తనాకారుని మాటలలో ఆవేదన కనిపించుచున్నది. బాధతో దేవుని ప్రశ్నించుచున్నాడు. మన జీవితములలో కూడా మన పరిస్థితులు మనకు బహు కష్టంగా అనిపిస్తాయి. ఏమి చేయాలో తెలియని స్థితిలో వుంటాము. ప్రార్థించినపుడు దేవుడు జవాబు యివ్వడం లేదనిపిస్తుంది. *"బాధ చేత నా కన్ను క్షీణించుచున్నది"* అని 9 వ వచనములో చదువుచున్నాము. మనకు కావలసిన ఆదరణ దేవుని నుండి మాత్రమే వస్తుంది. అయితే దేవుని ఆదరణను అనేక సార్లు అనుభవించకుండా, దేవుడు మనలను విడిచి పెట్టాడని అభిప్రాయపడుతుంటాము. అది నిజం కాదు.

1 కీర్తనాకారుడు ఒంటరియై, ద్వేషింపబడుట - వ. 8
2. కీర్తనాకారుడు అనుభవిస్తున్న బాధ - వ. 9
3. మరణించిన వారు చేయలేని కార్యములు - వ. 10-12
4. కీర్తనాకారుడు ప్రతి దినము చేయుచున్న మనవి - వ. 13

మనము శ్రమ పడుటలో దేవుడు మనపట్ల ఒక ఉద్దేశ్యము కలిగియున్నాడు (ప్రసంగి 3:1). మనకు అర్థం కాకపోయినప్పటికీ మనకు జరుగుచున్న సమస్తము ద్వారా దేవుడు తన చిత్తమును నేరవేర్చుచున్నాడు (ప్రసంగి 1:11).

**ధ్యాన వచనము 9 :** *బాధ చేత నా కన్ను క్షీణించుచున్నది. యెహోవా, ప్రతి దినము నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నీ వైపు నా చేతులు చాపుచున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా దుఃఖము, నాశ్రమ నీకు తెలిసే యున్నవి. నా యెడల ఉత్తమమైన దానిని జరిగించెదవని నిన్ను నమ్ముకొని, నీకై వేచిచూచెదను.*

ఎవరైనా మనలను విడిచి పెట్టడమనేది తీవ్రమైన సంగతి. అయితే ఒక విశ్వాసి దేవుని చేత విడువబడడమనేది అన్నిటి కంటె బాధాకరమైన విషయము. అయితే సత్యమేమిటంటే, దేవుడు మనలను విడిచిపెట్టినట్లు మనకనిపించినా, ఆయన అలా ఎన్నడూ చేయడు. ఆయన యెల్లప్పుడూ వున్నవాడు. మన జీవితములలో జరుగు సమస్తమును ఆయన యెరిగి యుండి, మన మేలు కొరకు మరియు ఆయన మహిమ కొరకు సమస్తమును జరిగించు చున్నాడు (రోమా8:28).

1. దేవుడు తనను విడిచిపెట్టినట్లు కీర్తనాకారునికి అనిపించుట - వ.14
2. కీర్తనాకారుని కలవరపెట్టుచున్న భయము - వ.15
3. దేవుని ఉగ్రత యొక్క తీవ్రత - వ.16-17
4. కీర్తనాకారుని స్నేహితులు తనను విడిచిపెట్టుట - వ.18

కీర్తనాకారుని జీవితములో పై వాక్య భాగములోని పరిస్థితులు వాస్తవంగా దుఃఖాన్ని కలిగించుచున్నవి. అయినప్పటికీ, అలాంటి చీకటి సమయములలోనే మనము దేవుని శక్తిని, సన్నిధిని అనుభవించగలము. దేవుని ప్రేమను, భవిష్యత్తులో ఆయన ఆశీర్వాదములను పొందుటకు యీ జీవితములో కొన్నిసార్లు నష్టమును అనుభవించవలసి వుంటుంది.

**ధ్యాన వచనము 14:** *యెహోవా, నీవు నన్ను విడుచుట యేల? నీ ముఖము నాకు చాటు చేయుట యేల?*

**ప్రార్థన:** *ఒంటరి వాడను గాను, తృణీకరింపబడిన వాడను గాను ఉన్నానని నేనను కొనునప్పుడు నీ ప్రేమను మరియు నా జీవితముపట్ల నీ చిత్తమును జ్ఞాపకము చేసికొనుటకు నాకు సహాయపడుము.*

యీ కీర్తన దేవుని విశ్వసనీయతను గూర్చి వ్రాయబడినది. విశ్వసనీయత దేవునికున్న చక్కటి గుణము. మన జీవితములో ప్రతి పరిస్థితిలోను ఆయన విశ్వసనీయత పై ఆధారపడ వచ్చును. ఆయన మనలను ఎన్నడూ విడువడు. దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనను గూర్చి యీ కీర్తన ప్రత్యేకంగా నొక్కి చెప్పుచున్నది. వారు దేవునికి వ్యతిరేకంగా ఏమి చేసిననూ ఆయన వారిని విడిచిపెట్టడు. యీ సత్యము మన హృదయములకు ఎంతో ప్రోత్సాహమును కలుగజేయుచున్నది.

1. కీర్తనాకారుడు దేవుని కృపాతిశయమును స్తుతించుట - వ. 1
2. దేవుని విశ్వాస్యత ఆకాశములో బయలుపరచబడుట - వ. 2
3. దేవుని విశ్వాస్యత ఇశ్రాయేలుపట్ల బయలుపరచబడుట - వ. 3ఎ, 4బి
4. దేవుని ప్రజలు, దేవుని సింహాసనము స్థిరపరచబడుట- వ. 3బి, 4ఎ
5. దేవుని ఆశ్చర్య కార్యములు ఆకాశమంతటా స్తుతించబడుట - వ. 5
6. దేవుడు హెచ్చింపబడుట - వ. 6

పై వాక్య భాగము దేవుని యెలుగెత్తి స్తుతించి, కీర్తించునట్లు మనలను చేయుచున్నది. ఆయన విశ్వాస్యత అంతటా బయలుపరచబడుచున్నది. ఆయన వాక్యమును తాను నెరవేరుస్తాడని మనము నమ్మవచ్చును.

**ధ్యాన వచనము 1:** *యెహోవా యొక్క కృపాతిశయమును నిత్యము నేను కీర్తించెదను. తరతరములకు నీ విశ్వాస్యతను నా నోటితో తెలియజేసెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ కృపను, నీ విశ్వాస్యతనుబట్టి నీకు వందనములు. నీ సంతానమును ఎన్నటికిని తృణీకరించువాడవు కావు.*

దేవుని విశ్వసనీయతను స్తుతిస్తూ వ్రాయబడిన యీ కీర్తన మన దేవునికి సమానమైన వారెవరూ లేరని గంభీరమైన మాటలతో తెలియజేయుచున్నది. అది దేవుని బలమును హెచ్చించుచున్నది. దేవుడు ఎవరైయున్నదీ, ఆయన యెటువంటి కార్యములు జరిగించినదీ తెలియజేయుచూ ఆయన గొప్ప కార్యములు జరిగించ సమర్థుడని బోధించుచున్నది. మనము దేవుని ప్రశ్నించుటకు శోధించబడినపుడు లేదా ఆయన సామర్థ్యతను, ఆయన చిత్తమును సందేహించినపుడు వెంటనే ఆయన బలము అన్నిటికంటె గొప్పదని, సకల సృష్టి ఆయనకు చెందియున్నదని మనము జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను.

1. దేవునికి మాత్రమే చెందవలసిన గౌరవము – వ. 7
2. దేవుని పోలిన వారెవరూ లేరు – వ. 8
3. సృష్టిపైన దేవుని పరిపాలన – వ. 9
4. శత్రువులపై దేవుని విజయము – వ10
5. దేవుని సృష్టి ఆనందించుట – వ. 11–12
6. దేవుని బాహుబలము – వ. 13

దేవుడు సమస్తమును తన అధీనములో కలిగియున్నాడని మరియు మనము ఎదుర్కొనే ప్రతి పరిస్థితికి కావలసిన శక్తిని తాను కలిగియున్నాడని తెలుసుకొనుట మన హృదయములకు ఎంతో ఆదరణ కలిగించుచున్నది. దేవునియందు, ఆయన బలము మరియు విశ్వసనీయత యందు మనము ఎంతో నమ్మికయుంచవలసిన వారముగా వున్నాము.

**ధ్యాన వచనము 8 :** *యెహోవా, సైన్యములకధిపతివగు దేవా, యెహోవా, నీ వంటి బలాఢ్యుడెవడు? నీ విశ్వాస్యత చేత నీవు ఆవరింపబడియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవే నా బలము. నేను ఆధారపడగల దేవుడవు నీవు ఒక్కడవే.*

పై వాక్య భాగములోని వచనములలో దేవుని అనేక గుణములను గూర్చి వ్రాయబడి, ఆయనను ఆరాధించు వారికి కలుగు ఆశీర్వాదములను గూర్చి తెలుప బడినది. దేవుని గుణములు, అనగా నీతి, న్యాయము, కృప, సత్యము, బలము, దయ మరియు సంరక్షణ యివన్నియు దేవుని విశ్వసనీయతవలన ఆయననుండి కలుగుచున్నవి. 15వ వచనములోని *"శృంగధ్వనుల నెరుగు ప్రజలు ధన్యులు"* అను మాటలు బూరలతో దేవుని ఆరాధించుటకు ఆహ్వానముగా వున్నాయని కొందరు చెప్పుదురు. మరి కొందరు యీ మాటలు క్రీస్తు రాకడలో మ్రోగే "బూరల" ధ్వనిని గూర్చి వ్రాయబడినవని నమ్ముదురు. యీ వాక్య భాగములోని 16వ వచనములో మనము "దినమెల్ల హర్షించుచుండవలెనని" గుర్తు చేయబడుచున్నాము.

1. దేవుడు కూర్చొని, పరిపాలించే సింహాసనము – వ. 14
2. మనలను ఆరాధించుటకు పిలుపునిచ్చే ధ్వని – వ. 15
3. దేవుడు తన బలముతో తన ప్రజలను ఆశీర్వదించుట – వ. 16–17
4. దేవుని సార్వభౌమత్వానికి ఆయన ప్రజలు లోబడుట – వ. 18

దేవుని ఆరాధించి, ఆయన చేయబోయే మరియు చేయగల కార్యములనుబట్టి ఆయనయందు ఆనందించేవారికి దేవుడు గొప్ప ఆశీర్వాదమును వాగ్దానము చేసియున్నాడు. కీర్తనాకారునితో కలిసి మనము *"మారాజు ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుని వాడు"* అని చెప్పెదము.

**ధ్యాన వచనము 18 :** *మా కేడెము యెహోవా వశము. మా రాజు ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుని వాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, ఒంటరి వాడను గాను, తృణీకరింపబడినవాడనుగాను ఉన్నానని నేనను కొనునప్పుడు నీ ప్రేమను మరియు నా జీవితము పట్ల నీ చిత్తమును జ్ఞాపకము చేసికొనుటకు నాకు సహాయపడుము.*

దేవుడు తాను చేసిన వాగ్దానములను నెరవేరుస్తాడని ఆయన విశ్వాస్యతద్వారా మనము గుర్తు చేయబడుచున్నాము. పై వాక్య భాగములో దేవుడు గతంలో దావీదును రాజుగా, నాయకునిగా ఏర్పరచుకొన్న సత్యమును గూర్చి చదువుచున్నాము. అయితే యీ మాటలు రాబోవు కాలములో మన ప్రభువైన యేసుక్రీస్తునందు సంపూర్ణంగా నెరవేర బోవుచున్నాయని గ్రహించగలము. 25 వ వచనములో *"నేను సముద్రము మీద అతని చేతిని, నదుల మీద అతని కుడి చేతిని ఉంచెదను"* అని వ్రాయబడిన మాటలు దావీదు కంటె గొప్ప వాడైన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి వ్రాయబడి యున్నవి. యీ మాటలు ప్రకటన 10 వ అధ్యాయములో కూడా వ్రాయబడినట్లు చూడగలము. దేవుడు ప్రభువైన యేసుక్రీస్తు ను *"అభిషేకించి"*, *"నా సేవకుడు"* అని సంబోధించాడు. దేవుడు యీ మాటలు మన విషయములో కూడా పలుకును గాక!

1. దైవ సేవకుని ఏర్పరచుకొనుట – వ. 19
2. దైవ సేవకుని అభిషేకించుట – వ. 20
3. దైవ సేవకునికి యివ్వబడిన బలము –వ. 21
4. దేవుడు తన సేవకుని కాపాడు విధము – వ. 22–23
5. దైవ సేవకునికి దేవుడిచ్చు ఆధారము – వ. 24
6. దైవ సేవకుని దేవుడు హెచ్చించు విధానము – వ. 25

దావీదు దేవుని చేత ఏర్పరచబడి, ప్రవక్తయైన సమూయేలు ద్వారా రాజుగా అభిషేకించ బడినాడనుటలో సందేహమే లేదు (1సమూయేలు 16:13). అయితే, దావీదు కంటె గొప్ప వాడైన ప్రభువైన యేసుక్రీస్తును దేవుడు తన పరిశుద్ధాత్మచే "అభిషేకించాడని" వాక్యము మనకు తెలియజేయుచున్నది (యెషయా 61:1).

**ధ్యాన వచనము 20 :** *నా సేవకుడైన దావీదును నేను కనుగొనియున్నాను. నా పరిశద్ధ తైలముతో అతని నభిషేకించియున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ కుమారుని నీవు ఏర్పరచుకొని, రాజులకు రాజుగా మరియు ప్రభువులకు ప్రభువుగా ఆయనను అభిషేకించినందుకు నీకు స్తుతులు చెల్లించెదను.*

యీ దినము ధ్యానించుటకు నాలుగు వచనములే అయినప్పటికీ, యివి ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి మనకు జ్ఞాపకము చేయుచున్నవి. యీ వచనములు రాజైన దావీదును గూర్చి వ్రాయబడినప్పటికీ, అవి ప్రభువైన యేసుక్రీస్తునందు నెరవేరబోవుచున్నాయి. కొలొస్సి 1:15,18 మరియు హెబ్రీ 1:6 లో యేసుక్రీస్తు *"ఆది సంభూతుడు"* గా పిలువ బడినాడు (జ్యేష్ఠ కుమారుడు). ఆయన "భూరాజులలో అత్యున్నతుడు". ఆయన "సింహాసనము" నిరంతరము నిలుచును. దావీదు విషయములో యీ మాటలు దేవుని వాగ్దానముగా నెరవేరాయి (2 సమూయేలు 7:13). అయితే, "దావీదు కుమారుడు" గా పిలువబడుతున్న ప్రభువైన యేసుక్రీస్తు నందు యీ మాటలు సంపూర్ణంగా నెరవేరబోవు చున్నాయి. ఆయన సింహాసనము నిత్యము నిలుచును.

1. యేసుక్రీస్తు దేవుని మీద ఆధారపడుట – వ. 26
2. దేవుడు యేసుక్రీస్తును హెచ్చించుట – వ. 27
3. దేవుని నిబంధన స్థిరపరచబడుట – వ. 28
4. యేసుక్రీస్తు సంతానము, ఆయన సింహాసనము నిరంతరము నిలుచుట – వ. 29

అవును, దేవుని వాగ్దానములన్నీ నెరవేరుతాయి. యీ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును, ఆయన క్రీస్తు రాజ్యమునాయెను. ఆయన యుగ యుగముల వరకు యేలును (ప్రకటన 11:15).

**ధ్యాన వచనము 28 :** *నా కృప నిత్యము అతనికి తోడుగా నుండజేసెదను. నా నిబంధన అతనితో స్థిరముగా నుండును.*

**ప్రార్థన:** *ప్రభువా, ప్రస్తుతమున్న యీ లోకమును ఒకానొక రోజు నీవు జయించబోవు దేవుడవను సత్యము ఎంతో సంతోషమును కలుగ జేయుచున్నది.*

ఇశ్రాయేలీయులు దేవునికి వ్యతిరేకంగా బహుగా పాపముచేసి, అనేక మారులు ఆయన చేత శిక్షింపబడిరి. వారి పాపమును, అవిధేయతనుబట్టి ఇశ్రాయేలీయులను దేవుడు అధికారికంగా విడిచిపెట్టాడని, వారి స్థానము సంఘమునకు యివ్వబడినదని అనేకులు నమ్ముతారు. అయితే, యీ మాటలు సత్యము కాదని పౌలు రోమా 11:1-2 లో చెప్పియున్నాడు. దేవుడు ఇశ్రాయేలీయులను ఎన్నడూ విడిచిపెట్టలేదు. భవిష్యత్తులో కూడా యెన్నటికీ విడిచిపెట్టడు. వారు దేవునికి వ్యతిరేకంగా పాపములో, అవిధేయతలో జీవించినప్పటికీ, వారి రక్షణ వారి ప్రవర్తననుబట్టి కాక దేవుడు వారితో చేసిన నిబంధనపై ఆధారపడియున్నది. యీ సత్యమునుబట్టి దేవునికి వందనములు. పాపక్షమాపణను, నిత్యజీవమును కోరుకునే యూదులకు, అన్యజనులకు కూడా యిదే సత్యము వర్తిస్తుంది.

1. దేవుని ప్రజల అవిధేయత - వ. 30-31
2. దేవుడు తన ప్రజలను శిక్షించుట - వ. 32
3. దేవుని నిబంధన కొట్టివేయబడదు - వ. 33-34
4. దేవుని నిబంధన ఎంతో నమ్మదగినది, ఆధారపడదగినది - వ. 35-36
5. దేవుడు అబద్ధమాడడు - వ. 37

దేవుని స్వభావము మరియు ఆయన వాగ్దానములను పై వాక్యభాగము ఎంతో చక్కగా మనకు గుర్తుచేయుచున్నది. ఆయన తన మాటలను నెరవేరుస్తాడు. ఆయన యెదుట ఇశ్రాయేలు దేశముగా ఉండకుండా పోవుట ఎన్నటికీ జరుగదు (యిర్మియా 31 : 35-37).

**ధ్యాన వచనము 33:** *కాని నా కృపను అతనికి బొత్తిగా ఎడము చేయను. అబద్ధికుడనై నా విశ్వాస్యతను విడువను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు విశ్వసనీయుడవనియు మరియు నన్ను ఎన్నడును ఎడబాయని దేవుడవనియు నేను ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకొందును గాక.*

పై వాక్య భాగమును నిన్నటి వాక్య భాగముతో పోల్చి చూస్తే, గంభీరమైన సత్యమును చూడగలము. నిన్నటి వాక్య భాగములో (వ.30-37) దేవుడు తన ప్రజలను ఎన్నడూ విడువడని చదివాము. యిప్పుడు, పై వాక్య భాగములో వారి పాపము మరియు అవిధేయతనుబట్టి ఇశ్రాయేలీయులపైకి దేవుని దండన యెలా వచ్చిందో గుర్తుచేయ బడుచున్నాము. ఇశ్రాయేలీయుల సుదీర్ఘ చరిత్ర దేవుని వాక్యము ద్వారా చక్కగా వర్ణింప బడియున్నది. దేవుని దండననుబట్టి కీర్తనాకారుడు, *"యెహోవా, ఎంతవరకు నీవు దాగి యుందువు?"* అని మొఱపెట్టుచున్నాడు (వ.46).

1. దేవుడు తన ప్రజలను విడనాడియున్నాడని కీర్తనాకారుడు వాపోవుట - వ. 38
2. తన ప్రజలపైకి వచ్చిన దేవుని దండన - వ.39-40
3. దేవుని ప్రజలు తమ శత్రువుల చేత జయింపబడుట - వ.41-43
4. ఇశ్రాయేలు వైభవము గతించిపోవుట - వ.44
5. దేవుని ప్రజలు సిగ్గుచేత కప్పబడుట - వ.45

దేవుడు పరిశుద్ధుడు మరియు న్యాయవంతుడు. మనము పశ్చాత్తాప పడుటకు నిరాకరించి, పాపము, అవిధేయతలో కొనసాగిన యెడల దేవుడు మనలను శిక్షిస్తాడు. సామెతలు 14:34 లో, *"నీతి జనములు ఘనత కెక్కుటకు కారణము. పాపము ప్రజలకు అవమానము తెచ్చును"* అని వ్రాయబడినది.

**ధ్యాన వచనము 44:** *అతని వైభవమును మాన్పి యున్నావు. అతని సింహాసనమును నేల పడగొట్టియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు వ్యతిరేకముగా పాపము చేసి, దాని పర్యవసానమును ఎదుర్కొననని ఎన్నడూ తలంచకుండా వుండుటకు సహాయపడుము.*

నీతిమంతులు ఎందుకు శ్రమ పొందుచున్నారు? దుష్టులు ఎందుకు వర్ధిల్లుచు వున్నారు? యీ ప్రశ్న మాటి మాటికీ అడుగబడినది. కీర్తనాకారుడు *"యెహోవా, నీవు ఎంతవరకు దాగియుందువు?"* అని ప్రశ్నించుచున్నాడు. అంతే గాక, 49 వ వచనములో *"ప్రభువా, నీ విశ్వాస్యత తోడని నీవు దావీదుతో ప్రమాణము చేసిన తొల్లిటి నీ కృపాతిశయమెక్కడ?"* అని దేవుని ప్రశ్నించుచున్నాడు. నీవు కూడా బహుశా, 'దేవుడెక్కడ వున్నాడు? నాకు యెందుకు సహాయము చేయడు?' అని ప్రశ్నించుచున్నావేమో. సత్య మేమిటంటే, దేవుడు తన అద్భుతమైన ప్రణాళికను జరిగించుచూ, సమస్తమును ఒక ముగింపునకు తీసుకువస్తున్నాడు. ఆయన *"అభిషిక్తుడు"*గా తిరిగివచ్చి, యీ భూమి మీద తన రాజ్యమును ఏర్పరచబోవుచున్నాడు. అలసి పోయిన యాత్రికులారా, సహనముతో కనిపెట్టండి.

1. దేవుని జవాబు వచ్చుటలో ఆలస్యము - వ. 46
2. మన ఆయుష్కాలము - వ. 47
3. మరణమునుండి తప్పించుకొనలేము - వ. 48
4. దేవుడు తన వాగ్దానములను నెరవేర్చుటలో ఆయన చేయుచున్న ఆలస్యమును అర్థం చేసుకొనుటకు మనకు కష్టతరము - వ. 49
5. శతృవుల నిందలనుబట్టి తన ప్రజలకు సహాయము చేయుమని కీర్తనాకారుని మనవి - వ. 50-51
6. పరిస్థితు లెట్లున్నను దేవుని స్తుతించవలెనన్న సంకల్పము - వ. 52

కొన్ని కొన్ని సార్లు మనము ఎంతగా మొఱపెట్టినను దేవుడు యెందుకు ప్రతిస్పందించడో మనకు అర్థమవడం కష్టంగా వుంటుంది. అయితే, ఒక విషయము మనము ఎరుగుదుము: తన చిత్త ప్రకారమైన సంకల్పమును నెరవేర్చుటకు ఆయన సమస్తమును జరిగించుచున్నాడు (ఎఫెసి 1:11).

**ధ్యాన వచనము 52:** *యెహోవా నిత్యము స్తుతి నొందును గాక. ఆమేన్..ఆమేన్.*

**ప్రార్థన:** *ప్రభువా, నా ప్రార్థనలకు నీ విచ్చు జవాబు ఆలస్యమైన ప్రతి సమయములోను దానిని అర్థము చేసుకొని, ఆ సమయము లన్నిటిలోను నిన్ను నమ్ముకొనుటకు నాకు సహాయము చేయుము.*

ఎంత చక్కటి మాటలు! నిరంతరము జీవిస్తున్న దేవునికి స్తుతులు - *"యుగయుగములకు నీవే దేవుడవు"* (వ. 2). దేవుడు నిత్యుడగు తండ్రిగా కీర్తనాకారుడు యెరిగి యున్నాడు గనుక *"నీ దృష్టికి వేయి సంవత్సరములు గతించిన నిన్నటి వలెనున్నవి"* అని వ్రాయుచున్నాడు (వ. 4). మన జీవిత కాలము చాలా అల్పమైనదని తెలుపుటకు మనము పచ్చగడ్డితో పోల్చబడినాము. పచ్చగడ్డి ఉదయమున చిగురిస్తుంది. సాయంకాలమున కోయబడుతుంది. 1పేతురు 1:24-25లో యిదే సత్యమును గూర్చి వ్రాస్తూ, *"అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును"* అని పేతురు తెలియ జేయుచున్నాడు.

1. దేవుడు నివసించు స్థలము - వ. 1
2. దేవుడు నిత్యము జీవించుచున్నాడు -వ. 2
3. పశ్చాత్తాప పడుమని దేవుడు మనలను కోరుట - వ. 3
4. మన జీవితములు అల్పమైనవి - వ. 4-6

నిత్యత్వమును గూర్చి ఆలోచించినపుడు మనము సరియైన గ్రహింపు లేని వారంగా వుంటాము. మనము సమయమునకు లోబడి యున్నవారమై, మన జీవిత కాలమును గూర్చి మాత్రమే గ్రహింపు గలిగియుంటాము. దేవుడు మన సౌకర్యము కొరకు, తన ప్రణాళికను నెరవేర్చుటకు మాత్రమే సమయమును సృష్టించాడు గాని ఆయన సమయమునకు లోబడువాడు కాదు. మన "సమయములను" ఆయనకు అప్పగించు కొనవలెను.

**ధ్యాన వచనము 2 :** *పర్వతములు పుట్టక మునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగయుగములు నీవే దేవుడవు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నిత్యత్వము కలిగి, ఆది అంతములు లేని దేవుడవని, నీ ప్రణాళిక నిత్యత్వమునకు సంబంధించినదని నాకు గుర్తు చేసినందుకు నీకు వందనములు.*

యీ కీర్తన మొదటి వచనములలో దేవుడు సమయమునకు, కాలమునకు అతీతుడనియు, తాను నిత్యము నివసించుచున్నాడనియు తెలిపిన కీర్తనాకారుడు పై వాక్య భాగములో మన పాపముల వలన కలుగు దేవుని కోపము, ఉగ్రత మనలను ఎట్లు బాధించునన్న విషయమును గూర్చి తెలియజేయుచున్నాడు. పాపముతో కూడిన నిర్ణయములు, పనులనుబట్టి కలుగు పరిణామములను యీ జీవితములో అనుభవిస్తాము. అందుకే 12 వ వచనములో, "మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మాదినములు లెక్కించుటకు మాకు నేర్పుము" అని పలుకుచున్నాడు. యిది ఎంతో నిజము. మన జీవితము స్వల్పమైనది గనుక మనము బ్రతుకు దినములన్నియు ఆయన మహిమ కొరకు జీవించవలెను.

1. దేవుని కోపము మనలను దహించి వేస్తుంది - వ. 7
2. మన జీవితములోని అన్ని సంగతులు ఆయన ముఖకాంతిలో కనబడుచున్నవి- వ. 8
3. మన జీవిత ఆయుష్కాలము తగ్గింపబడుట - వ. 9-10
4. దేవుని కోపము యొక్క బలమును ఊహించలేము - వ. 11
5. దేవుని జ్ఞానము కలిగి జీవించుట - వ. 12

మన గతించిన జీవితము "నిన్నటి వలె" వున్నది. యెంతో స్వల్ప కాలములోనే మన పిల్లలు పెరిగి పెద్దవారవుతారు. వారి పిల్లలను కూడా చూస్తాము. సమయము ఎంతో త్వరగా గడిచిపోతుంది. దాని కనుగుణంగా ఆ స్వల్ప సమయాన్ని దేవుని జ్ఞానముతో జీవించునట్లు, ఆయన తన జ్ఞానమును మనకు అనుగ్రహించును గాక!

**ధ్యాన వచనము 12 :** మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము.

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితము చాలా స్వల్పమైనదనియు మరియు నీ జ్ఞానము ఎంతో ముఖ్యమైనదనియు నాకు గుర్తు చేసినందుకు నీకు వందనములు.*

దేవుడు మన బ్రతుకు దినములన్నిటిని తన అధీనములో కలిగియున్నాడు గనుక మనము ఆయనయందు నమ్మికయుంచి, మన దినములన్నియు ఆయనయందు ఆనందించ వలెను. 90 వ కీర్తన *"మా దేవుడైన యెహోవా ప్రసన్నత"* మా మీద వుండును *గాక*, *"మా చేతి పనిని స్థిర పరచుము"* అను మాటలతో చక్కని ముగింపు కలిగియున్నది.

*"నా రక్షకుడైన క్రీస్తు మనస్సులో నేను దినదినము ఎదుగుదును గాక!* నేను చేయు క్రియలును, మాట్లాడే మాటలును ఆయన ప్రేమ మరియు ఆయన శక్తితో కూడుకొని *యుండును గాక!* నశించిపోయిన వారిని క్రీస్తు కొరకు గెలుచుటలో దేవుని ప్రసన్నత మా మీద వుండునుగాక! ప్రజలు క్రీస్తునే చూచెదరు గాక!" అను పాటలోని మాటలు మనము గుర్తు చేసుకొనగలము.

1. దేవుడు తన ప్రజల యొద్దకు తిరిగి రావలెనని కీర్తనాకారుడు మనవి చేయుట–వ. 13
2. దేవుని యందు ఆయన ప్రజలు సంతోషించుట – వ. 14
3. దేవుడు మన శ్రమలను మన మేలుకొరకు ఉపయోగపడునట్లు చేయుట – వ. 15
4. దేవుడు జరిగించిన కార్యములను జ్ఞాపకము చేసుకొనుట – వ. 16
5. దేవుని ప్రసన్నత తన ప్రజలమీద వుండుట – వ. 17

మనము పరిచర్యలో వాడబడవలెనని ఎంత కోరుకుంటామో అంతకంటె ఎక్కువగా మనలను వాడుకొనవలెనని దేవుడు కోరుకుంటాడు. మన సమస్త మాటలు, క్రియల ద్వారా ఆయన ప్రసన్నతను కలిగి, ప్రకాశించాలని ఆయన కోరుచున్నాడు (మత్తయి 5:16).

**ధ్యాన వచనము 14 :** *ఉదయమున నీ కృపతో మమ్మును తృప్తి పరచుము. అప్పుడు మేము మా దినములన్నియు ఉత్సహించి, సంతోషించెదము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా తలంపులు మరియు క్రియలద్వారా నీ ప్రసన్నతను మరియు నీ గుణములను ప్రతిబింబింప చేయవలెనని కోరుకొందును.*

పై కీర్తనలో దేవుని సన్నిధి మరియు ఆయన కాపుదలను గూర్చిన ఆశీర్వాదమును గూర్చి వర్ణించబడినది. మనలను విచారమునకు, భయమునకు గురిచేసే అనేక పరిస్థితులు మన జీవితములో ఎదురవుతాయి. తద్వారా దేవుడు మన "ఆశ్రయము", "కోట" గా యున్నాడన్న సత్యమును సులభంగా మర్చిపోతుంటాము. తెగులు మరియు పాడుచేయు రోగము, విపత్తు మరియు అపాయము, ఊసులాడు మాటలు మరియు తప్పుడు నేరము మోపుట – మొదలగునవి మనము మానసిక స్థైర్యాన్ని మరియు నమ్మకాన్ని కోల్పోవునట్లు చేస్తాయి. అయితే దేవుడు నిన్ను ఎన్నడును విడువడని, ఎడబాయడని జ్ఞాపకముంచు కొనుము. ఆయన యెల్లప్పుడూ వుంటున్న దేవుడు.

1. దేవుని సన్నిధిలో నివసించుట – వ.1
2. దేవుని మీద ఆధారపడుట – వ.2
3. దేవుడు వాగ్దానము చేసిన విడుదల – వ.3–4
4. చీకటిని ఛేదించగలిగిన దేవుడు – వ.5–6
5. అపాయమునుండి తప్పించే దేవుడు – వ.7–8

మనము భయపడుటకు కారణము యెప్పుడూ లేదు. దేవుడు మనతో వున్నాడు. మనకు విడుదల కలుగ జేస్తానని ఆయన వాగ్దానము చేసి యున్నాడు. ఒకవేళ మనము మరణించినా ఆయన సన్నిధిలో ప్రవేశించి, "సంపూర్ణమైన సంతోషము" ను అనుభవిస్తాము.

**ధ్యాన వచనము 1:** *మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు ఎదురయ్యే భయము మరియు చింత నంతటిని యెదుర్కొనుటకు నాకు కావలసిందంతా "నీ సన్నిధి".*

పై వచనములలో ఒక విశ్వాసికి సమృద్ధికరమైన ఆశీర్వాదములు వాగ్దానము చేయబడి యున్నవి. మన రక్షకుడైన యేసుక్రీస్తును శోధించుటకు, తన రక్షణ ప్రణాళిక నుండి ఆయన గురిని తప్పించేందుకు సాతాను, పై వాక్య భాగములోని మాటలను ప్రయోగించాడు (మత్తయి 4:1-11). అయితే సాతాను యుక్తి పని చేయలేదు. మనము కష్టతరమైన సమయముల గుండా వెళుతూ, భయమునకు గురియైనపుడు యీ వచనములు మనకెంతో గొప్ప ప్రోత్సాహమును కలుగ జేయుచున్నవి.

1. దేవుని ప్రజలయొద్దకు రాని అపాయము, తెగులు - వ. 9-10
2. దేవుని దూతలు ఆయన ప్రజలను కాపాడుట - వ. 11-13
3. దేవుని యందు విశ్వసించువారిని ఆయన ఘనపరచుట - వ. 14
4. దేవుడు జవాబిచ్చే ప్రార్థన - వ. 15
5. దేవుడు తన ప్రజలకిచ్చే సమాధానము - వ. 16

మనము దేవుని "ప్రేమించి" ఆయనకు "మొఱపెట్టినపుడు" ఆయన మనలను విమోచించి, మన ప్రార్థనలకు జవాబిస్తాడు. ఆయనయందు నమ్మికయుంచువారికి దేవుడు సంపూర్ణమైన తృప్తిని వాగ్దానము చేసియున్నాడు.

**ధ్యాన వచనము 15 :** *అతడు నాకు మొఱ్ఱ పెట్టగా నేనతనికి ఉత్తరమిచ్చెదను. శ్రమలో నేనతనికి తోడై యుండెదను. అతని విడిపించి, అతని గొప్ప చేసెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నా నివాస స్థలము. నీ సన్నిధిలో నేను నివసింపగోరుదును. నా జీవితములో ప్రతిపరిస్థితిలోను నిన్ను నమ్ముకొందును.*

ఇశ్రాయేలీయులకొరకు మోషేద్వారా దేవుడు విశ్రాంతి దినము (సబ్బాతు) ను గూర్చిన నిబంధన చేసియున్నాడు. పై కీర్తన విశ్రాంతి దినమున విశ్రమించి, దేవుని ఆరాధించుట కొరకైన ఒక కీర్తనగా వ్రాయబడినది. నిర్గమ కాండం 31:12-18 లో విశ్రాంతి దినము ఆచరించుట దేవునికిని, ఇశ్రాయేలీయులకును మధ్య చేయబడిన నిత్యమైన కట్టడగా (గురుతుగా) వున్నది. యూదులైనను, అన్యజనులైనను మనమందరము దేవుని గొప్ప తనమును గుర్తుచేసుకొని, ఆయనయందు నమ్మికయుంచి, ఆయనకు స్తుతులు పాడి, ఆరాధించవలసిన వారముగా వున్నామని తెలుసుకొనుచున్నాము.

1. దేవుని ప్రజల కీర్తన - వ. 1
2. దేవుని గుణగణములను పది తంతుల స్వరమండలముతోను, సితారాతోను స్తుతించుట- వ. 2-3
3. దేవుని కార్యములను బట్టి ఆయనను స్తుతించుట - వ. 4-5
4. భక్తిహీనులు నశించిపోవుట - దేవుడు మహోన్నతుడుగా వుండుట - వ. 6-8

ప్రస్తుతము ఎంత వర్ధిల్లినప్పటికిని భక్తిహీనులు ఒకానొక దినము నశిస్తారన్న సత్యమును మూర్ఖులు గ్రహింపరు. దేవుడు మరియు ఆయనయందు విశ్వాసముంచు ఆయన ప్రజలును నిత్యము నివసిస్తారు.

**ధ్యాన వచనము 1:** *యెహోవాను స్తుతించుట మంచిది. మహోన్నతుడా, నీ నామమును కీర్తించుట మంచిది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మాత్రమే స్తుతులకు యోగ్యుడవు గనుక అనుదినము నీ నామమును స్తుతించెదను. నిన్ను గూర్చి పాడెదను.*

కొన్నిసార్లు నీతిమంతులు మాత్రమే శ్రమపడుచున్నట్లు, దుష్టులు కేవలము వర్ధిల్లుచున్నట్లు మనకు అగుపిస్తుంది. అయితే ఒకానొక దినము పరిస్థితులు వేరుగా వుండబోవు చున్నవి. దుష్టులు నాశనము వైపునకు వెళ్లుచున్నారు. అయితే నీతిమంతులు "ఖర్జూర వృక్షము వలె మొవ్వు వేయుదురు". వారు "దేవుని ఆవరణములలో వర్ధిల్లుదురు". వారు ముసలి వారైనను ఆగకుండా "ఇంకా చిగురు పెట్టుచుందురు" (వ. 15). మనము పొందగల దాని కంటె ఎక్కువగా దేవుడు మనలను ఆశీర్వదించవలెనని కోరుకుంటున్నాడు.

1. దుష్టులు నశించిపోవుట - వ. 9
2. దేవుడు నీతిమంతులకిచ్చు స్థానము - వ. 10
3. దేవుడు దుష్టులకు చేయబోవు కీడును గూర్చి తెలుసుకొనుటనుబట్టి నీతిమంతులు పొందు తృప్తి - వ. 11
4. నీతిమంతులు నాటబడి, వర్ధిల్లుట - వ. 12,13,15
5. దేవుని పరిశుద్ధత - వ. 14

ఒక విశ్వాసి హృదయమునకు పై వచనములు ఎంతో ప్రోత్సాహకరంగా వున్నాయి. మనము "దేవుని మందిరములో నాటబడినపుడు" ముసలివారమైనను యింకను చిగురు పెట్టుచూ, ఫలిస్తూ వుంటాము.

**ధ్యాన వచనము 13 :** *వారు యెహోవా మందిరములో నాటబడినవారై, మన దేవుని ఆవరణములలో వర్ధిల్లుదురు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సన్నిధిలో నివసిస్తూ, నీ పాదముల యొద్ద నేర్చుకొనుటద్వారా మాత్రమే ఫలభరితమైన జీవితము జీవించగలనన్న సత్యమును నేను ఎన్నడూ మరువక యుందును గాక.*

యీ కీర్తన దేవుని పరిపాలనను హెచ్చించుచున్నది. ఆయన సమస్తమును పరిపాలించుచున్నాడు. ఒకవేళ పరిస్థితులు చేయిదాటినట్లు అనిపిస్తే, దేవుడు ఆ విషయము యెరిగి యున్నాడని, సమస్తమును తన అధీనములో కలిగి, తన ఉద్దేశ్యముల కొరకు మన (మితిమీరిన) పరిస్థితులను వాడుకుంటున్నాడన్న సత్యమును మరిచిపోకూడదు (కీర్తన 103:19). ఏదియును వ్యర్థమైపోదు. సమస్తము ఆయనను మహిమ పరుస్తుంది. ఆయన బలము ఎంతో గొప్పది. ఆయనకు అసాధ్యమైనదేదీ లేదు. నీ పూర్ణ హృదయముతో ఆయనయందు నమ్మిక యుంచుము.

1. దేవుని పరిపాలన - వ. 1
2. దేవుడు నిరంతరము జీవించుచున్నాడు - వ. 2
3. తన సృష్టితో దేవునికున్న సంబంధము - వ. 3-4
4. ఆయన మాటలు ఎంతో నమ్మదగినవి - వ. 5

దేవుడు సెలవిచ్చిన మాటలను మనము ఎంతైనా నమ్మవచ్చును. ఆయన వాక్యములోని ప్రతి పొల్లును నేరవేరును. ఆయన "శాసనములు ఎన్నడును తప్పిపోవు".

**ధ్యాన వచనము 1:** *యెహోవా రాజ్యము చేయుచున్నాడు. ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నాడు. యెహోవా బలము ధరించి, బలముతో నడుము కట్టుకొనియున్నాడు. కదలకుండునట్లు భూలోకము స్థిరపరచబడియున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, సమస్తమును నీ యొక్క సంపూర్ణ అధీనములో వున్నందుకు నీకు వందనములు. నీ గొప్ప బలమునుబట్టియు, ప్రభావమునుబట్టియు నిన్ను స్తుతించెదను.*

మనలను కించపరచిన వారిపైన, మనకు హానిచేసిన వారిపైన లేదా మనకు చెడు జరిగించిన వారిపైన ప్రతీకారము తీర్చుకొనకూడదని రోమా12:17-21 లో దేవుని వాక్యము సెలవిస్తున్నది. యెందుకనగా ప్రతీకారము తీర్చుకొనుట దేవుని పని గనుక మన పరిస్థితులను ఆయన చేతులలో వదిలి వేయవలెను. మనము మేలుచేత కీడును జయించవలెను. అయితే మనము పై వాక్య భాగములో వేయబడిన ప్రశ్నను దేవునితో అడుగుతుంటాము - *"యెహోవా, భక్తిహీనులు ఎంత వరకు ఉత్సహించుదురు?"* దేవుని తీర్పు రాబోవుచున్నది. శ్రమల కాలమంతా దేవుని ఉగ్రతా దినముగాను, యీ లోకము పై ఆయన ప్రతీకారము తీసుకునే కాలముగాను వర్ణింపబడినది.

1. ప్రతీకారము తీర్చుకొనమని దేవునికి కీర్తనాకారుడు మనవి చేయుట - వ. 1
2. దుష్టులకు దేవుడు ప్రతిఫలమిచ్చుట - వ. 2
3. దేవుడు ప్రతీకారము తీర్చుకొనుటకు ఆలస్యము చేయుచున్నాడని కీర్తనాకారుడు తలంచుట - వ. 3-4
4. దేవుని ప్రజలు బాధింపబడుట - వ. 6-7
5. దేవుడు వారి పాప కార్యములను చూచుట లేదని భక్తిహీనులు తలంచుట - వ. 5

దుష్టులు ఎంతో పొరబడుతున్నారు. దేవుడు ప్రతి తలంపు, మాట, క్రియను తీర్పులోనికి తీసుకు రాబోతున్నాడు. దుష్టులు భయంకరమైన నరకపు తీర్పును యెదుర్కొన బోవుచున్నారు.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా, ప్రతీకారము చేయుదేవా, ప్రతీకారము చేయు దేవా, ప్రకాశింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు యితరులు కలుగజేయు హానిని బట్టి నేను వారి మీద ప్రతీకారము తీర్చుకొనకుండా నా పరిస్థితిని నీ చేతులకు అప్పుజెప్పుకొనుటకు నాకు బోధించుము.*

దేవుడు ఎన్నడూ తమకు తీర్పు తీర్చలేదని, తమ కార్యములను తాము జరిగించుకు పోవచ్చని తలంచే వారికి యీ వాక్య భాగము ఒక హెచ్చరికగా వున్నది. దుష్టులకు తీర్పు తీర్చబడుట ఎంత నిజమో, దేవుని ప్రజలు శిక్షింపబడుట కూడా అంతే నిజము. విశ్వాసులముగా జీవిస్తూ మనము పాపపు కార్యములు జరిగించి, తప్పించుకోవాలని చూస్తే దేవుడు తన ప్రేమతో మనపైకి ఆయన శిక్షను తీసుకువస్తాడు. మనకు హాని జరిగించాలని కాదుగాని, ఆయనతో మన నడకలో మనకు సహాయపడుటకు మనలను గద్దిస్తాడు. మన జీవితములను మనమే పాపముతో నష్టపరచుకోవాలని ఆయన ఎంత మాత్రము కోరుకోడు.

1. బుద్ధిహీనులను దేవుడు గద్దించుట - వ. 8
2. బుద్ధిహీనులు దేవునిపట్ల తప్పుడు అవగాహన కలిగి యుండుట - వ. 9-10
3. మానవుల ఆలోచనలకు దేవుని ప్రతిస్పందన - వ. 11
4. దేవుడు నీతిమంతులకు కలుగజేయు నెమ్మది- వ. 12-13
5. దేవుడు తన ప్రజలను విడనాడకుండుట - వ. 14
6. దేవుని నీతి స్థాపించబడుట - వ. 15

అవును. దేవుడు తన ప్రజలపై తనకున్న ప్రేమ, అనురాగమును బట్టి వారిని దండిస్తాడు. దేవుని తృణీకరించి, ఆయన ప్రజలకు హానిచేసిన భక్తిహీనులను కూడా దేవుడు ఒకానొక దినము తన ఉగ్రతతో తీర్పు తీరుస్తాడు.

**ధ్యాన వచనము 12 :** *యెహోవా, నీవు శిక్షించు వాడు నీ ధర్మశాస్త్రమును బట్టి నీవు బోధించువాడు ధన్యుడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను లాభకరముగాను, నీవు కోరిన విధముగాను జీవించునట్లు నా జీవితములో నీవు నన్ను ఆయా సమయములలో దండించినందుకు నీకు వందనములు.*

పై వాక్య భాగములో కీర్తనాకారుడు దుష్టులపైకి దేవుని తీర్పు తప్పకుండా వచ్చునని నమ్మకము వ్యక్తపరుస్తూ, దేవుడు తనకు యెట్లు "సహాయకుడు" గా వున్నది జ్ఞాపకము చేసుకొనుచున్నాడు. అనేక సార్లు మనము మనకు సహాయపడని వాటి వైపు తిరుగుతాము. కానీ మనము కష్టములకు మరియు ఒత్తిళ్లకు గురియైనపుడు మనకు కావలసిన ఆదరణ, జ్ఞానము మరియు ప్రోత్సాహము దేవుని నుండి మాత్రమే లభిస్తాయి. "*యెహోవా నాకు ఎత్తయిన కోట. నా దేవుడు నాకు ఆశ్రయదుర్గము*" అని కీర్తనాకారుడు పలుకుచున్నాడు. ఇశ్రాయేలులోని ఉప్పు సముద్రమునకు పశ్చిమ తీరమున దావీదు సౌలు రాజు నుండి తప్పించుకొనుటకు ఏన్గెదీ అరణ్యములో దాగుకున్నాడు. ఆ స్థలములో కుందేలు లేదా పెద్ద ఎలుకలను పోలిన జంతువులు కూడా ఆపదలు వచ్చినపుడు తమ ఆశ్రయమైన రాతి సందులలో దాగుకొనుటకు వెళ్లుట నేను చూశాను. ఆ జంతువులు అట్లు చేయుట నేర్చుకున్నట్లు మనము కూడా ఆపదలలో దేవుని ఆశ్రయముగా కలిగియుండుటకు నేర్చుకొందుము గాక!

1. దుష్టులనుండి విడిపింపబడుటకు కీర్తనాకారుని ఆందోళన – వ. 16
2. దేవుని ఆదరణ కీర్తనాకారునికి తోడైయుండుట – వ. 17-19
3. దుష్టులకు, దేవునికి మధ్య వ్యత్యాసము – వ. 20
4. దుష్టులు నీతిమంతులను హింసించుట – వ. 21
5. దుష్టులు సంహరించబడుట – వ. 22-23

మన విశ్వాసము దేవునియందు కలిగి, ప్రతీకారము తీర్చుకునే పనిని దేవునికి అప్పగించాలి. ఒకానొక దినము ఆయన సమస్త సంగతులను సరిజేయబోవుచున్నాడు.

**ధ్యాన వచనము 19:** *నా అంతరంగమందు విచారములు హెచ్చుగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగజేయుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నా పాదము తొట్రిల్లినప్పుడు నన్ను ఎత్తి పట్టుకొను దేవుడవు నీవే గనుక నీకు వందనములు.*

ఆరాధన మరియు స్తుతితో కూడిన కీర్తనలు విశ్వాసి యొక్క హృదయమునకు ఎంతో నెమ్మది, విశ్రాంతిని కలిగిస్తాయి. యీ కీర్తనలు దేవుడు మన యొద్దనుండి నిజంగా యేమి కోరుకుంటున్నాడో బయలుపరుస్తున్నాయి. ఆయన మనయొద్దనుండి సణుగుడు, అలక్ష్యము లేదా తిరుగుబాటును కోరుట లేదు గానీ మన స్తుతిని, వందనములు చెల్లించుటను కోరుకుంటున్నాడు – "ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగుచేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము" (1థెస్సలొనీకయులకు 5:18). యీ దినము నీవు ఏ సంగతులనుబట్టి దేవునికి వందనములు చెల్లించ దలుచుకున్నావో వాటి పట్టికను తయారు చేయగలవా? వందనములు చెల్లించుటద్వారా మన హృదయములయొక్క వైఖరిలో మార్పు రాగలదు.

1. దేవునికి కీర్తనలు పాడుటకు ఆహ్వానము - వ. 1-2
2. దేవుని గొప్పతనము - వ. 3
3. మన స్తుతికి పాత్రుడుగా చేయబడిన దేవుని గొప్పతనము యొక్క ప్రాముఖ్యత - వ. 4-5

పాటలు సరిగా పాడని వారందరికీ దేవుని వాక్యము "సంతోషగానము చేయుమని" బుద్ధి చెప్పు చున్నది. దేవుడు మన స్తుతిని కోరుకుంటున్నాడు. పై వాక్య భాగములో సృష్టికర్త గా దేవుడు మన స్తుతికి పాత్రుడై యున్నాడని దేవుని వాక్యము సెలవిస్తున్నది. యీ సృష్టి దేవుని చేతిపనియై యున్నది. ఆకాశములు దేవుని మహిమను ప్రచురపరచు చున్నవి. మన సంతోషము మరియు ఆశీర్వాదముకొరకు దేవుడు సృష్టించిన యీ సృష్టియంతటిని బట్టి ఆయనకు స్తుతి, వందనములు చెల్లిస్తూ యీ దినమున కొంత సమయము గడుపుము.

**ధ్యాన వచనము 1 :** *రండి యెహోవాను గూర్చి ఉత్సాహధ్వని చేయుదము. మన రక్షణ దుర్గమును బట్టి సంతోష గానము చేయుదము.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ జగత్తులోను, యీ భూమి మీదను నీవు సృష్టించిన సృష్టి యంతటిని బట్టి నీకు వందనములు. అది నీ మహాత్మ్యమును గూర్చి వివరిస్తున్నది.*

దేవుని ఆరాధించుటకు యివ్వబడుచున్న పిలుపు ఆయన మననుండి నిజంగా ఏమి కోరుకుంటున్నాడన్న సత్యమును ప్రతి విశ్వాసికి గుర్తు చేయుచున్నది. అరణ్యములో ఇశ్రాయేలీయులు తమ హృదయములను కఠినపరచుకున్నట్లు మన హృదయములను కఠిన పరచుకొనకూడదన్న ఒక హెచ్చరిక కూడా పై వాక్య భాగములో మనకు యివ్వ బడినది. ఇశ్రాయేలీయుల అవిధేయతయొక్క పరిణామము తీవ్రంగా వుండింది. ఒక తరమంతా "దేవుని విశ్రాంతిలో ప్రవేశింపక పోయిరి". మనలో అనేకులము దేవుడు మనకిచ్చుచున్న *"విశ్రాంతి"* ని పొందలేక పోవుచున్నాము. కలవరపడి, విచారముతో నిండుకొనియున్నాము. కొంత వరకు దీనికి కారణము దేవునిపైన మన మనస్సు వుంచుకొని, ఆయనను ఆరాధించుటలో విఫలమవడమే.

1. దేవుని గుణము, వ్యక్తిత్వము మనలను ఆయనయొద్దకు నడిపిస్తుంది - వ. 6
2. దేవుని ఆరాధించుటకు పిలుపు - వ. 7
3. ఆరాధన లోపించుటకు గల కారణము - వ. 8-9
4. దేవుడు తన ప్రజలపట్ల విసిగిపోవుట - వ. 10
5. దేవుని ప్రజల అవిధేయత యొక్క పరిణామము - వ. 11

మనము మనకవసరమైన వాటి గురించే ఎప్పుడూ ఆలోచిస్తూ, అదే ధ్యాసలో వుంటే సులువుగా దేవునిపైన సణిగి, ఆయన మనకొరకు యేమి చేశాడు లేదా యేమి చేయట్లేదు అను వాటినిబట్టి దేవునిపై కోపించువారముగా వుంటాము. ఆరాధన లోపించి, దేవునికి లోబడక పోవడమనేది మన జీవిత పరిస్థితులకు కారణంగా వుంటున్నది.

**ధ్యాన వచనము 7 :** *రండి నమస్కారము చేసి సాగిలపడుదము. మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేనెదుర్కొంటున్న ప్రతి పరిస్థితిలోను, నీ నుండి ఆశించు ప్రతి విషయమును బట్టియు నీవు నా ఆరాధనను, స్తుతిని కోరుకొందువన్న సత్యమును మరువ కుండునట్లు నాకు సహాయము చేయుము.*

మనము పాడగలిగినను, పాడలేకపోయినను దేవుని వాక్యము విశ్వాసులను దేవుని మహిమను ప్రచురపరచమని, ఆయన పరిశుద్ధ నామమును స్తుతించి, ఘనపరచుమని కోరుకుంటున్నది. ఆరాధనకు మనము అత్యంత ప్రాధాన్యత యివ్వవలెను. ఆరాధన మనకు సంబంధించిన విషయముల మీద లేదా మన పరిస్థితుల మీద కాకుండా దేవుని మీద మన మనస్సు కేంద్రీకరించాలని కోరుతుంది. అనేకసార్లు దేవుడు తన సృష్టిలో తాను జరిగించిన దానిని బట్టి ఆయన గొప్పతనమును గూర్చి పొగడుతూ ఆయనను స్తుతించుదుము. కీర్తన 19:1 లో వ్రాయబడిన ప్రకారము “ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి”. నేడు యింటి బయటికి వెళ్లి, ఆకాశమువైపు చూసి, దేవుడు సృష్టించిన నక్షత్రములనుబట్టి, సృష్టినిబట్టి ఆయనకు నీ ప్రేమను తెలియపరచి, ఆయనను ఆరాధించుము.

1. యెహోవాను కీర్తించమన్న దేవుని వాక్య ఉపదేశము – వ. 1
2. మన క్రియలు దేవుని పట్ల మన యొక్క ఆరాధనను బయలుపరుస్తున్నాయి – వ. 2
3. దేవుని గొప్పతనమును జనులందరికీ తెలియజేయుట – వ. 3
4. దేవుడు సమస్తముపైన హెచ్చించబడుట – వ. 4
5. దేవుని సృష్టి ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది – వ. 5
6. దేవుడు తన గుణములనుబట్టి మన స్తుతులకు పాత్రుడైయున్నాడు – వ. 6

దేవుని మహత్వము, ఆయన మహిమ మానవ మనస్సు యొక్క ఊహకు మించి యున్నవి. బైబిలు మన దేవుని గూర్చి యిచ్చుచున్న సాక్ష్యము ఎంతో విలువైనది మరియు ఆకర్షణీయమైనది. మన హృదయములు ఎల్లప్పుడూ దేవుని ఆరాధన, స్తుతులతో నిండి యుండును గాక !

**ధ్యాన వచనము 2:** *యెహోవా మీద పాడుడి. ఆయన నామమును స్తుతించుడి. అనుదినము ఆయన రక్షణ సువార్తను ప్రకటించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవెవరవై యున్నదానినిబట్టియు, నీవు జరిగించిన సమస్తమునుబట్టియు నిన్ను స్తుతించి, నిన్ను గూర్చి పాడెదను.*

ప్రతి విశ్వాసికి దేవుని మహిమ పరచుట అత్యంత ప్రధానమైనది. 1కొరింథీ 10:31 లో "కాబట్టి మీరు భోజనము చేసినను, పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి" అని వాక్యము సెలవిచ్చుచున్నది. యీ కీర్తన దేవుని స్తుతిని ఉద్ఘాటిస్తూ, ఆయన రాజ్యమును, ఆయన పరిపాలనను మరియు ప్రపంచ ప్రజలపై ఆయన చేయబోవు తీర్పునుగూర్చి సెలవిస్తున్నది. మనము అనేక సార్లు "రాజు వచ్చుచున్నాడు" అని మాట్లాడు చుంటాము. యిది నిజమే. అయితే మనము "న్యాయాధిపతి వచ్చుచున్నాడు" అని కూడా చెప్పవచ్చును. యిది కూడా నిజమే.

1. మనము దేవుని యొద్దకు రావలసిన విధానము - వ. 7-8
2. మనము దేవునికి చెల్లించ వలసిన ఆరాధన - వ. 9
3. యీ లోకమునకు దేవుడు తీర్పు తీర్చబోవుచున్నాడు - వ. 10
4. దేవుని రాకనుబట్టి తన సృష్టి సహితము సంతోషించుట - వ. 11-12
5. దేవుని రాకను గూర్చిన వాగ్దానము - వ. 13

ఒకానొక దినము అన్ని విషయములు సరిచేయబడునని యెరుగుట ఎంత చక్కటి సత్యము! న్యాయాధిపతి వచ్చుచున్నాడు. 10 వ వచనములో, "న్యాయమునుబట్టి ఆయన జనములను పరిపాలన చేయును" అనియు, 13 వ వచనములో "న్యాయమునుబట్టి లోకమునకు, తన విశ్వాస్యతనుబట్టి జనములకు ఆయన తీర్పు తీర్చును" అనియు వాక్యము సెలవిచ్చుచున్నది.

**ధ్యాన వచనము 9 :** *పరిశుద్ధాలంకారములు ధరించుకొని, యెహోవాకు నమస్కారము చేయుడి. సర్వ భూజనులారా, ఆయన సన్నిధిని వణకుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా సమయము, నా సిరి సంపదలను నీకు సమర్పించి, నిన్ను స్తుతించి, ఆరాధించెదను.*

దేవుని మహిమ ఆకాశములయందును, ఆయన జరిగించిన గొప్ప కార్యముల యందును బయలుపరచబడినది. దేవుడు ఎవరై యున్నాడన్న దానినిబట్టియు మరియు ఆయన జరిగించిన సమస్త కార్యములనుబట్టియు దేవుని ఆరాధించడమనేది ప్రతి విశ్వాసికి ప్రాధాన్యతగా వుండవలెను. యీ కీర్తన “యెహోవా రాజ్యము చేయుచున్నాడు” అను మాటలతో మొదలవుతున్నది. యీ మాటలు సాధారణమైనవే అయినప్పటికీ అవి శక్తివంతమైనవి. కొన్నిసార్లు పరిస్థితులు మన చేయిదాటిపోయినట్లు అనిపిస్తుంది. అయితే దేవుడు వాటన్నిటిపైన రాజ్యము చేయుచున్నాడు. మన జీవితములలో కలుగు విపత్తులు, ఆపదలు మనకు ఏమాత్రం అర్థం కావు. అయినప్పటికీ దేవుడు వాటిపైనా రాజ్యము చేయుచున్నాడు.

1. దేవుని పరిపాలనను బట్టి కలుగుతున్న సంతోషము – వ. 1
2. దేవుని సింహాసనమునకున్న నీతి – వ. 2
3. దేవుని శత్రువులు దహించివేయబడుట – వ. 3
4. దేవుని శక్తి బయలుపరచబడుట – వ. 4–5
5. ప్రజలు దేవుని మహిమను చూచుట – వ. 6

దేవుడు మన జీవిత పరిస్థితులన్నిటి మధ్య రాజ్యము చేయుచూ, సర్వమును తన అధీనమందు కలిగియున్నాడని తెలుసుకొనుట మనకు గొప్ప ఆదరణను, మన హృదయములకు సమాధానమును కలిగించుచున్నది.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా రాజ్యము చేయుచున్నాడు. భూలోకము ఆనందించును గాక. ద్వీపములన్నియు సంతోషించును గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, సమస్తమును నీవు పరిపాలించుచున్నందుకు నీకు వందనములు. నా జీవితమును, నా భవిష్యత్తును నీ చేతులలో కలిగియున్నందుకు నీకు వందనములు.*

పై వాక్య భాగములో దేవుని గొప్ప తనము మరియు ఆయన మహిమ పట్ల నీతిమంతుల యొక్క ప్రతిస్పందనను గూర్చి వర్ణించబడినది. మానవులు తమకై తాము ఊహించుకొని, కల్పించుకున్న దేవుళ్లందరికంటే పైగా మన దేవుడు హెచ్చించబడ్డాడు. నిజమైన దేవుడు ఒక్కడే. ఆయనయందు ఆనందించవలెనని వాక్యము మనలను ప్రోత్సహించుచున్నది. ఆయన మహోన్నతుడు, పరిశుద్ధుడు మరియు తాను సృష్టించిన వాటినుండి పూర్తిగా వేరై యున్నవాడు. ఆయన మాత్రమే సకల స్తుతి మరియు ఆరాధనకు యోగ్యుడై యున్నాడు. 7 వ వచనములో వ్రాబడినట్లు ఆయనకు "నమస్కారము చేయుము".

1. దేవుని ఆరాధించమని కీర్తనాకారుని ప్రోత్సాహము - వ. 7
2. దేవుని ప్రజల సంతోషము - వ. 8
3. దేవుని ఔన్నత్యము - వ. 9
4. చెడుతనమును అసహ్యించుకొనమని దేవుని ప్రజలకు కీర్తనాకారుని మనవి - వ. 10
5. నీతిమంతులపై దేవుని ఆశీర్వాదము - వ. 11
6. దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట - వ. 12

దేవుడు మన సమస్యలను తీర్చలేక పోవుచున్నాడని ఓటమితో, క్రుంగుదలతో వుండి పోవుటవలన ఏ మాత్రమూ ప్రయోజనము లేదు. అయితే ఆయనయందు *"ఆనందించి"*, ఆయనకు *"వందనములు చెల్లించి"*, ఆయనను *"ఆరాధించుట"* ద్వారా దేవుని పట్ల సరియైన ప్రతిస్పందన కలిగియుందుము.

**ధ్యాన వచనము 9:** *ఏలయనగా, యెహోవా, భూలోకమంతటికి పైగా నీవు మహోన్నతుడవై యున్నావు. సమస్త దేవతలకు పైగా నీవు అత్యధికమైన ఔన్నత్యము పొందియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నిన్ను హెచ్చించి, ఆరాధించి, నీకు వందనములు చెల్లించి, నీ యందు ఆనందించెదను.*

దేవుడు మనపట్ల చేసియున్న కార్యములు మనము దినమంతా ఆయనను గూర్చి పాడుతూ, స్తుతిస్తూ, ఆయన యందు ఆనందించునట్లు చేయుచున్నవి. పై నున్న వచనములలో “యెహోవా చేసియున్న” కార్యములను గూర్చి చదువుచున్నాము. అవి “ఆశ్చర్య కార్యములు” గా వర్ణింపబడియున్నవి. దేవుడు దేనిని “వెల్లడిచేసి యున్నాడు”, దేనిని “బయలుపరచియున్నాడు”, దేనిని “జ్ఞాపకము చేసికొనియున్నాడు” అను వాటిని గూర్చి పై వచనములలో తెలుపబడియున్నది. మన జీవితములలో జరుగుతున్న సమస్తము వెనక వున్న దేవుని హస్తమును మనము గుర్తించలేకపోవుట మన ప్రధాన సమస్యగా వున్నది. ఆయన జీవించుచున్న దేవుడై యుండి, సమస్తమును మన మేలుకొరకు, ఆయన మహిమకొరకు జరిగించుచున్నాడు (రోమా 11:36; ఎఫెసి 1:11).

1. దేవుడు జరిగించిన వాటినిబట్టి ఆయనను కీర్తించుట – వ.1
2. దేవుడు వెల్లడిచేసిన రక్షణ – వ.2
3. దేవుని రక్షణను చూసిన భూదిగంత నివాసులు – వ.3

గత అధ్యాయము (కీర్తన 97) ను నీవు చదివి యున్నట్లయితే విశ్వాసులు సమస్తముపైన విజయము సాధించుదురన్న సత్యమును నీవు యెరిగియుందువు. దేవునికి వందనములు చెల్లించుటకు మన యొద్ద అనేక కారణములు వున్నవి. వాటిలో దేవుడు మనకిచ్చిన రక్షణ ప్రథమ స్థానములో వున్నది. తన ప్రజలైన ఇశ్రాయేలీయులపట్ల దేవుడు చేసిన వాగ్దానములు ఆయన ఎన్నడూ మరువలేదు. నిన్ను ఆయన ఏ మాత్రమును విడువడు, ఎన్నడును ఎడబాయడు. దేవునికి స్తోత్రములు.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా ఆశ్చర్య కార్యములు చేసియున్నాడు. ఆయనను గూర్చి క్రొత్త కీర్తన పాడుడి. ఆయన దక్షిణ హస్తము, ఆయన పరిశుద్ధ బాహువు ఆయనకు విజయము కలుగజేసియున్నవి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా ఆత్మను రక్షించినందుకు నీకు వందనములు. నీ ప్రజల యెడల నీ వాగ్దానములను యెన్నడూ మరువకయున్నందుకు నీకు వందనములు.*

యీ వాక్య భాగములో దేవుడు యీ భూమికి తీర్పు తీర్చుటకై రాబోవుచున్నాడన్న కారణమునుబట్టి వాయిద్యములు వాయించుచూ, దేవునికి కీర్తనలు పాడుమని వాక్యము ఆదేశించుచున్నది. ప్రస్తుతము సరిలేని సంగతులన్నియు ఆయన రాకడలో సరిచేయ బడును. ప్రతి విషయములోను ఆయన అందరికి సంపూర్ణమైన న్యాయము కలుగ జేయును. యీ సత్యము మనము దేవుని ఎలుగెత్తి స్తుతించునట్లు చేయుచున్నది. అన్యాయము యీ లోకములో ప్రతిచోటా వున్నది. అయితే, రాబోయే మెస్సీయ పరిపాలనను గూర్చి యెషయా 11:4 లో దేవుడు *"నీతిని బట్టి బీదలకు తీర్పు తీర్చును. భూనివాసులలో దీనులైన వారికి యథార్థముగా విమర్శ చేయును"* అని వ్రాయబడియున్నది.

1. దేవుని ప్రజలు సంగీతముతో ఆయనయందు ఆనందించుట – వ. 4–6
2. దేవుని సృష్టియొక్క ప్రతిస్పందన – వ. 7–8
3. దేవుడు నీతితో భూమి యంతటినీ పరిపాలించుట – వ. 9

భూమి మీద తన రాజ్యమును స్థాపించుటకు దేవుడు రాబోవుచున్నాడు. అది యెన్నడును నిర్మూలింపబడని నిత్య రాజ్యము. శుభవార్త ఏమిటంటే విశ్వాసులందరూ దేవునితో కలిసి యీ భూమిని పాలింతురు.

**ధ్యాన వచనము 4 :** *సర్వ భూజనులారా, యెహోవాను బట్టి ఉత్సహించుడి. ఆర్భాటముతో సంతోష గానము చేయుడి. కీర్తనలు పాడుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీతితోను, సత్యముతోను తీర్పు తీర్చుట కొరకు నీవు యీ భూమి మీదికి వచ్చినపుడు ఆనందించునట్లు నా నోటిని సంగీతముతోను, స్తుతితోను నింపుము.*

యీ కీర్తన దేవుని పరిశుద్ధతను గూర్చి తెలుపుచున్నది. దేవుని "ఘన పరచి", ఆయనను ఆరాధించమని ప్రోత్సహించుచున్నది. "దేవుడు గొప్పవాడు మరియు ఆయన సమస్తము పైన రాజ్యము చేయుచున్నాడు" అనునది యీ కీర్తన యొక్క ప్రధాన వర్తమానము మరియు మన ఆరాధనకు కారణము. నిజమైన ఆరాధన దేవుని స్తుతిపై కేంద్రీకృతమై, ఆయన గతంలో ఏమి జరిగించాడు, ప్రస్తుతము ఏమి జరిగించుచున్నాడు, భవిష్యత్తులో ఏమి జరిగించ బోవుచున్నాడు అను వాటిని గూర్చినదై వుంటుంది. ఆయనను స్తుతించుటకు సమయము తీసుకొని, యీ దినమంతటిలో ఎన్నిసార్లు నీవు దేవుని సార్వభౌమత్వమును, సమస్తముపైన తన అధీనమును గుర్తించబోవుచున్నావో పరిశీలింపుము.

1. దేవుని పరిపాలన – వ. 1
2. అందరిపైన హెచ్చించబడిన దేవుని స్థానము – వ. 2
3. మనము దేవుని స్తుతించుటకు గల కారణము – వ. 3
4. నీతితో కూడిన దేవుని పరిపాలన – వ. 4
5. దేవుని పట్ల మన ప్రతిస్పందన – వ. 5

దేవుని నామము పరిశుద్ధమైనది. ఆయన పాపము నుండి పూర్తిగా వేరై యున్నాడు. ఆయన స్థానము అన్నిటి కంటె పైనున్నది. ఆయన పరిపాలించుచున్నాడు. ఆయన మనవైపు స్తబ్దతతో చూచు ప్రేక్షకుడు కాదు గానీ, మన జీవితములలో తన ప్రణాళికలను చురుకుగా జరిగించుచున్నాడు. దేవుడు సమస్తమును తన అధీనములో కలిగియున్నందుకు ఆయనకు స్తోత్రములు.

**ధ్యాన వచనము 3 :** *భయంకరమైన నీ గొప్ప నామమును వారు స్తుతించెదరు. యెహోవా పరిశుద్ధుడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో సమస్తము నీ ఆధీనములో వున్నందుకును మరియు నా మేలుకొరకు, నీ మహిమకొరకు నీ ప్రణాళికను నా పట్ల నేరవేర్చుచున్నందుకును నిన్ను స్తుతించెదను.*

5 మరియు 9 వ వచనములు 99 వ కీర్తన యొక్క ప్రధాన వచనములుగా వున్నాయి. యీ రెండు వచనములలోను ఒకే మాటలు వ్రాయబడినవి – "*మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి. ఆయన పాదపీఠము యెదుట సాగిలపడుడి. ఆయన పరిశుద్ధుడు*". దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయన పాపమునుండి వేరై యున్నాడు. యీ కీర్తనలో మొదటి అయిదు వచనములు దేవుని గొప్పతనమును గూర్చి సెలవిచ్చుచుండగా మిగిలిన యీ వచనములు తనకు మొఱ పెట్టువారికి దేవుడెలా జవాబిస్తాడన్న సత్యమును గూర్చి ప్రధానంగా తెలియ జేయుచున్నవి.

1. దేవుని నామమునకు మొఱపెట్టుట – వ. 6
2. తనకు మొఱపెట్టువారితో దేవుడు సంభాషించుట – వ. 7
3. తనకు మొఱపెట్టువారిని దేవుడు క్షమించుట – వ. 8
4. దేవుని ఘనపరచి, ఆరాధించమని కీర్తనాకారుడు జనులకు మనవి చేయుట – వ. 9

దేవునికి మొఱ పెట్టుటలో విఫలమై మనలను మనమే నష్ట పరచుకుంటుంటాము. సమస్తమునకు పైనున్న దేవుడు మన పాపములను క్షమించి, మన మొఱలకు జవాబిచ్చుటకు సిద్ధంగా వున్నాడు. మనము ఆయనను స్తుతించి, హెచ్చించి, ఆరాధించి, గౌరవించి, ఆయనకు మొఱపెట్టవలెను.

**ధ్యాన వచనము 6 :** *ఆయన యాజకులలో మోషే అహరోనులుండిరి. ఆయన నామమును బట్టి ప్రార్థన చేయువారిలో సమూయేలు ఉండెను. వారు యెహోవాకు మొఱపెట్టగా ఆయన వారికుత్తరమిచ్చెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నిన్ను మాత్రమే ఆరాధించి, హెచ్చించెదను. నీ విశ్వాస్యతనుబట్టియు, క్షమాపణనుబట్టియు మరియు నా మొఱలను ఆలకించుటలో నీ సంసిద్ధతనుబట్టియు నీకు వందనములు.*

యీ కీర్తన దేవుడెవరైయున్న దానినిబట్టి, మన పట్ల జరిగించిన సమస్తమును బట్టి ఆయనను స్తుతించి, ఆయనకు వందనములు చెల్లించాల్సిన అవసరము మనకున్నదని బోధించుచున్నది. యెహోవాకు "ఉత్సాహ ధ్వని" చేసి, "ఉత్సాహ గానము" తో ఆయన సన్నిధికి వెళ్లవలెనని యీ కీర్తన మనలను ప్రోత్సహించుచున్నది. ఆయన మననుండి ఉదాసీనతను, నిర్లక్ష్యముతో కూడిన ప్రతిస్పందనను కోరుకొనుట లేదు. మనము దేవుని ఎలుగెత్తి స్తుతించవలెనని ఆయన మనలను కోరుకుంటున్నట్లు మనలో చాలామంది గ్రహించరు. తన ప్రజలు తనను స్తుతించినపుడు దేవుడు సంతోషిస్తాడు. అనేక సార్లు దేవుని గొప్పతనమును గూర్చి సరియైన అవగాహన లేకపోవడమనేది దేవుని స్తుతించుటలో మనలను ఉదాసీనత వైపు, నిర్లక్ష్యమువైపు నడిపిస్తుంది. యీ జీవిత కష్టములు, బాధల యొక్క బరువుతో మనము చాలా సులభంగా వెనుకబడి పోగలము. అయితే మన కన్నులు దేవునిమీద మనము నిలుపు కొనవలెను.

1. మనము దేవునికి చేయవలసిన ధ్వని – వ. 1
2. సంతోష గానముతో మనము దేవుని సేవించాల్సిన అవసరత – వ. 2
3. దేవునితో మనకున్న సంబంధముయొక్క స్వభావము – వ. 3
4. దేవునికి స్తుతి, వందనములు చెల్లించాల్సిన అవసరత – వ. 4
5. మన స్తుతులకు పాత్రునిగా చేయుచున్న దేవుని గుణములు – వ. 5

దేవుడు ఏమైయున్నాడు, ఆయన యేమి జరిగించియున్నాడు అను వాటినిబట్టి దేవునికి వందనములు చెల్లించకపోవుట వలన విశ్వాసి తన జీవితములో ఓటమి, అధైర్యమునకు గురియౌతాడు. దేవుని సహాయము కావలసి వచ్చినపుడు కొన్నిసార్లు మనకు సహాయపడమని బతిమాలుకుంటాము. అయితే దేవుడు మన స్తుతిని, ఆరాధనను కోరుచున్నాడు.

**ధ్యాన వచనము 4 :** *కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములలో ప్రవేశించుడి. కీర్తనలు పాడుచు ఆయన ఆవరణములలో ప్రవేశించుడి. ఆయనను స్తుతించుడి. ఆయన నామమును ఘనపరచుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మంచి దేవుడవు, కృప మరియు నమ్మకము గల దేవుడవు గనుక నీ యొద్దకు వచ్చి, కృతజ్ఞతార్పణలు చెల్లించెదను. నీ ఆశ్చర్యకరమైన ప్రణాళికను నా జీవితములో నెరవేర్చుచున్నందుకు నీకెన్నో వందనములు చెల్లించెదను.*

మనలో అనేకులము కోరినట్లుగానే కీర్తనాకారుడు తన కొరకు దేవుని ఆశీర్వాదమును కోరుకుంటున్నాడు. తీర్మానముతో కూడిన జీవితముయొక్క ప్రాముఖ్యతను తాను యెరిగియున్నాడు గనుక దేవుని మార్గములలో నడచుటకు, దేవుని దృష్టిలో సరియైనది జరిగించుటకు తాను నిర్ణయించుకున్నట్లు చెప్పుచున్నాడు. మన భక్తి, సమర్పణలను యితరుల పట్ల గాక, దేవుని పట్ల మనము కలిగి యుండుట మంచిది. నీ భక్తి, విశ్వాసములను దేవునికి తెలియ జేయుటకు యిప్పుడు కొన్ని క్షణములు దేవునితో గడుపుము. నీ జీవిత సమస్యల గురించి నీవేమి చేయదలుచుకున్నావో ఆయనకు తెలియ జేయుము.

1. దేవుని కీర్తించుటలో కీర్తనాకారుని హృదయముయొక్క భక్తి – వ. 1
2. దేవుని మార్గములలో నడుచుటకు కీర్తనాకారుడు చేసుకున్న సమర్పణ – వ. 2
3. దుష్టత్వము నుండి దూరముగా వుండుటకు కీర్తనాకారుడు తీసుకున్న నిర్ణయము – వ. 3–4

దేవుని అనుసరించుటకు తీర్మానములు తీసుకొనుట ఒక ఎత్తయితే, వాటిని పాటించుట మరొక యెత్తు. దేవుని మార్గములలో నడుచుటకు పరిశుద్ధాత్మ మనకు సహాయపడును గాక (గలతి 5:16)!

**ధ్యాన వచనము 1 :** *నేను కృపను గూర్చియు, న్యాయమును గూర్చియు పాడెదను. యెహోవా, నిన్ను కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ మార్గములలో నడచుటకును, నీ చిత్తము నెరవేర్చుటకును నేను కోరుకొందును. అయితే నేను నీ మీద మాత్రమే ఆధారపడవలసియున్నది.*

పై వాక్య భాగములో దుష్టత్వము జరిగించువారిపై రాబోయే దేవుని తీర్పును గూర్చి బలమైన రీతిలో వివరింపబడినది. కొండెములు, చాడీలు చెప్పుట, గుసగుసలాడుట, వదరుబోతువలె మాట్లాడుట, గర్వము, మోసము, అబద్ధములాడుట - యివన్నియు దేవుని వాక్యములో బలంగా ఖండించబడినాయి. దేవుని మార్గములో నడుస్తూ, ఆయనను సేవించమని వాక్యము మనందరికీ బుద్ధి చెప్పుచున్నది. పైన తెలుపబడిన దుష్టత్వపు పనులు, మాటలు, వైఖరి మనపై వినాశనమును తీసుకువచ్చి, మన కుటుంబాలను పడద్రోస్తాయి. అయితే, దేవుని ప్రేమ మనలను ప్రోత్సహించి, మన ఆత్మీయ జీవితములను కట్టబడునట్లు చేస్తుంది. మనము ఆలోచించు వాటిని గూర్చి, మాట్లాడు సంగతులను గూర్చి మరియు మనము చేయు క్రియలను గూర్చి జాగ్రత్త పడవలెను. వీటన్నిటి బట్టి దేవుని తీర్పు మనపైకి వస్తుంది. ఆయనకు లెక్క అప్పజెప్పవలసిన వారముగా వున్నాము.

1. మన పొరుగు వారితో మనముండవలసిన రీతి - వ. 5
2. దేవుడు యిష్టపడే నడక - వ. 6
3. మోసము చేయువారు తిరస్కరింపబడుట - వ. 7
4. దుష్టులను దేవుడు సంహరించుట - వ. 8

మన నోటి మాటలతో ఒక వ్యక్తి యొక్క మంచి పేరును చెడగొట్టవచ్చును. మోసముతో యింకొక వ్యక్తి యొక్క జీవితమును నాశనము చేయవచ్చును. యిటువంటి పనులు చేసి, పరిశుద్ధాత్మను దుఃఖపరచకుండా మన వైఖరిని, మన నోటి మాటలను జాగ్రత్తగా కాచుకొనవలెను (ఎఫెసి 4:30). దేవుడు మనకు సహాయపడును గాక !

**ధ్యాన వచనము 6 :** *నా యొద్ద నివసించునట్లు దేశములో నమ్మకస్థులైన వారిని నేను కనిపెట్టుచున్నాను. నిర్దోష మార్గమందు నడచు వారు నాకు పరిచారకులగుదురు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకెల్లప్పుడు ఇష్టుడనుగా వుండునట్లు హాని మరియు నాశనము కలుగజేయు నా నోటి మాటలను నా గమనమునకు తీసుకురమ్మని నిన్ను వేడుకొందును.*

కీర్తనాకారుడు యీ కీర్తనను మిక్కిలి బాధతో వ్రాయుట మొదలు పెట్టుచున్నాడు. గొప్ప శ్రమ, బాధ ద్వారా వెళుతున్న తన హృదయములో నుండి వస్తున్న మొఱగా యీ కీర్తనను వ్రాయుచున్నాడు. నీవు అటువంటి శ్రమ ద్వారా వెళ్లి యున్నట్లయితే కీర్తనాకారుని పరిస్థితి నీకు అర్థమవుతుంది. నీ ఆపదలలో నీవు అనుభవించు ఒంటరితనము ఎంతో బాధాకరంగా వుంటుంది. జీవితము కష్టముతో కూడుకొని యున్నది. యితరులతో చెడు సహవాసము గొప్ప హాని కలిగిస్తుంది. శారీరక అనారోగ్యము మానసికంగా నిన్ను క్రుంగదీస్తుంది. ఎన్నడూ ముగియదనిపించే ఆర్థిక భారము నీ తీర్మానమును బలహీన పరుస్తుంది. అయితే, మనకందరికీ కలుగు సాధారణమైన జబ్బు యేదనగా దేవునికి వ్యతిరేకమని తెలిసి కూడా పాపము చేసి, దానిలో కొనసాగడం. దీనివల్ల గొప్ప మూల్యమును మనము చెల్లించుచున్నాము. కనుక దేవుని స్వస్థత మరియు ఆయన కలుగజేయు పునరుద్ధరణ మనకెంతో అవసరమై యున్నది.

1. దేవునియొద్దకు చేరు మొఱ – వ. 1
2. దేవుని ప్రతిస్పందనను గూర్చిన ఆందోళన – వ. 2
3. మన దినములు గతించిపోవుట – వ. 3
4. బాధలో భోజనము చేయకపోవుట – వ. 4
5. ఎముకలు దేహమునకు అంటుకొనిపోవుట – వ. 5

కీర్తనాకారుడు గొప్ప దురవస్థలోను, బాధలోను వున్నాడు. దేవుడు మాత్రమే అట్టి పరిస్థితినుండి విడిపించి, స్వస్థపరచి, సమకూర్చ గలడు. యిట్టి పరిస్థితులలో మన పాపమును ఒప్పుకొని, విడిచిపెట్టి, దేవుని కనికరమును, క్షమాపణను మరియు ఆయన బలమును కోరుతూ ఆయన యొద్దకు రావలెను.

**ధ్యాన వచనము 1 :** యెహోవా, నా ప్రార్థన ఆలకింపుము. నా మొఱ్ఱ నీ యొద్దకు చేరనిమ్ము.

**ప్రార్థన:** *ప్రభువా, కష్ట దినములు నాకు కలిగినపుడు, నా హృదయమును బాగుచేయుట కొరకు నేను నీకు మొఱ పెట్టుదును.*

కీర్తనాకారుడు తన బాధాకరమైన పరిస్థితిని ఎడారిలోని జంతువులతోను, ఒంటరితనముతో వుండు అల్పమైన పిచ్చుకతోను పోల్చుకొని, వర్ణించుచున్నాడు. మత్తయి 10:29 లో అల్పమైన పిచ్చుక కూడా నేలను పడిపోయినపుడు దేవుడు ఎరిగి యున్నాడని ప్రభువైన యేసుక్రీస్తు సెలవిచ్చాడు. కీర్తనాకారుడు శత్రువులచేత ఎదిరింపబడుతూ, తన దయనీయమైన పరిస్థితిని గూర్చి మాట్లాడుతున్నాడు. దీని వెనుక దేవుని తీర్పు ఉన్నదని కీర్తనాకారుడు పూర్తిగా యెరిగి యున్నాడు. దేవుడు మన ఆపదల నుండి బయటికి లాగడమేగాక, మనలను గద్దించుటకు శ్రమలను మన జీవితములలో అనుమతిస్తాడు కూడా. మన జీవితములలో మనమెదుర్కొంటున్న శ్రమలు మనలను ఓడించడానికి గాక, మనలను బలపరచడానికి ప్రభువు వాటిని రప్పించు చున్నాడని యెరిగి, ఆయన యందు ఎల్లప్పుడూ నమ్మిక యుంచుదుము గాక !

1. శ్రమ పొందుచున్న వాని ఒంటరితనము – వ.6
2. శ్రమ పొందుచున్న వాని అల్పత్వము – వ.7
3. కీర్తనాకారుని పై తన శత్రువుల తాకిడి – వ.8
4. కీర్తనాకారుని బాధ యొక్క తీవ్రత – వ.9
5. కీర్తనాకారుని పై దేవుని ఉగ్రత – వ.10

అవును, మనలను బహుగా ఫలింపజేయు నిమిత్తము దేవుడు మనలను శ్రమల గుండా తీసుకువెళ్తాడు. మనలను తుడిచి వేయాలన్న ఉద్దేశ్యము దేవునికి లేదు. శ్రమలు అనేక సార్లు యెంతో క్షోభతో కూడుకొనియున్నను చివరికి అవి “ఆల్చిప్ప లో ముత్యము ఏర్పడినట్లు” మనలను ఫలము ఫలించే వారముగా చేస్తాయి.

**ధ్యాన వచనము 9-10 :** *నీ కోపాగ్నిని బట్టియు, నీ ఆగ్రహమును బట్టియు బూడిదెను ఆహారముగా భుజించుచున్నాను. నా పానీయముతో కన్నీళ్లు కలుపుకొనుచున్నాను. నీవు నన్ను పైకెత్తి, పారవేసియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నన్ను దండించు సమయములలో నన్ను ప్రేమించి, నా మంచిని మాత్రమే కోరుకొని అట్లు చేయుదువని గ్రహించుటకు నాకు సహాయపడుము.*

దేవునితో పోల్చినపుడు మన జీవితము ఒక "నీడ" వలె వున్నది. దేవుడు మాత్రమే "నిరంతరము జీవించుచున్నాడు". ఆయన తన ప్రజలతో చేసిన వాగ్దానములు నెరవేరుతాయి. ఆయన సమయము మన సమయము కాదు. సీయోను పట్ల "దయ" చూపి, దానిని ఆశీర్వదించుటకు దేవుడు ఒక "నిర్ణయ కాలము"ను నియమించియున్నాడు (వ.13). యిది మనము నమ్మదగిన సత్యము. దేవుని ఆశీర్వాదము సీయోను (లేదా యెరూషలేము) మీదికి వచ్చుట ద్వారా ప్రపంచ దేశములన్నియు ప్రతిస్పందించి, దేవునికి భయపడి, ఆయనను మహిమ పరుస్తాయి. ఆ దినము త్వరలో వచ్చును గాక !

1. మన దినములు స్వల్పమైనవి – వ.11
2. దేవుడు నిరంతరము జీవించుచున్నాడు – వ.12
3. దేవుని సమయమును గుర్తించుట – వ.13
4. యెరూషలేము పట్ల దేవుని ప్రతిస్పందన – వ.14
5. ప్రపంచ దేశముల మీద కలుగు ప్రభావము – వ.15

దేవుని ఆశీర్వాదము యెరూషలేము మీదికి వచ్చుచున్నదనియు, తద్వారా లోకమంతయు ఆయనను స్తుతించబోవుచున్నదనియు తెలుసుకొనుట మన హృదయములకు ఎంతో సంతోషమును కలిగించుచున్నది.

**ధ్యాన వచనము 15:** *అప్పుడు అన్యజనులు యెహోవా నామమునకును, భూరాజులందరు నీ మహిమకును భయపడెదరు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మహిమ పరచబడి, నీ వాగ్దానములన్నీ నెరవేరునపుడు ఆశీర్వాదముల దినములు వచ్చుచున్నవన్న మాటను నేను ఎన్నడూ మరువకుందును గాక !*

యీ వాక్య భాగములో దేవుడు *"దిక్కులేని దరిద్రుల"* ప్రార్థనను ఆలకిస్తానని వాగ్దానము చేయుచున్నాడు. అంతేగాక, *"చెరసాలలో ఉన్న వారి మూల్గులను"* ఆయన వింటాడు. మరియు రాబోయే మెస్సీయ రాజ్యములో ప్రజలు *"దేవుని స్తుతించెదరనియు"*, *"సీయోనులో ఆయన నామ ఘనతను, యెరూషలేములో ఆయన స్తోత్రమును ప్రకటించెదరనియు"* యీ వాక్య భాగము తెలియజేయుచున్నది.

1. దేవుడు తన మహిమతో ప్రత్యక్షమగుట – వ. 16
2. ఆయన జవాబిచ్చే ప్రార్థనలు – వ. 17
3. దేవుని ప్రజలు ఆయనను సేవించుటకై కూర్చబడుట – వ. 18
4. మానవులు తనను స్తుతించవలెనను ఉద్దేశ్యముతో వారిని విడిపించుటకొరకై దేవుడు ఆకాశమునుండి వారిని దర్శించుట – వ. 19–21
5. రాబోయే తరము దేవుని స్తుతించుట – వ. 22

మనకున్న *'నిరీక్షణ'* ఎంతో *'శుభప్రదమైనది'*. మన ప్రతి మొఱను ఆలకించే దేవుడు  ఒకానొక దినము తన రాజ్యమును భూమి మీద స్థాపించబోవుచున్నాడు.

**ధ్యాన వచనము 22 :** *వచ్చు తరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను. సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ రాజ్యము వచ్చుచున్నది గనుకను, నీ నామము భూమియందంతటను స్తుతింపబడబోవుచున్నది గనుకను నీకు వందనములు.*

యీ దినపు వాక్య భాగములో తాత్కాలికమైన మన జీవితములు నిరంతరము జీవించే దేవునితోను, ఆయన ప్రణాళికలు, ఉద్దేశ్యములతోను పోల్చబడియున్నవి. కీర్తనాకారుడు "నా దినములు కొద్ది పరచెను" అని 23 వ వచనములో పలుకుచున్నాడు. అయితే, 26 వ వచనములో "నీవు నిలచి యుందువు" అని దేవుని గూర్చి వ్రాయుచున్నాడు. ఆయన "ఏకరీతిగా వుండే" దేవుడు మరియు ఆయన "సంవత్సరములకు అంతము లేదు" (వ. 27). దేవుడు మానవ హద్దుబాట్లు, మానవ సమయములకు అతీతుడై యున్నాడు. అయితే, తన ప్రజల పట్ల తన ప్రణాళిక స్థిరపరచబడియున్నదని దేవుడు వాగ్దానము చేయుచున్నాడు. యీ వాగ్దానము దేవుని విశ్వాస్యత మరియు ఆయన గుణము మీద ఆధారపడియున్నది.

1. మానవుల బలము క్రుంగి పోవుట - వ. 23-24
2. భూమి పునాదులు నిత్యము నిలువవు - వ. 25-26
3. మనము నిత్యము ఆధారపడదగిన దేవుని విశ్వాస్యత - వ. 27-28

మనము ప్రస్తుతము యీ ప్రపంచములో వున్న 'వస్తువులను' చూడగలుగుతున్నాము. మరియు వాటిమీద ఆధారపడగలుగుతున్నాము. అయితే అటువంటి ప్రపంచమే ఒకానొక దినము గతించి పోబోవుచున్నది. దేవుడు సమస్తమును నూతనముగా చేయబోవు చున్నాడు – ప్రకటన 21:5. మన దేవుని విశ్వాస్యత ఎంతో ఆశ్చర్యకరమైనదై, ఎన్నడూ మారనిదిగా వుంటున్నది.

**ధ్యాన వచనము 27 :** *నీవు ఏకరీతిగా నుండు వాడవు. నీ సంవత్సరములకు అంతము లేదు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను ఎంతో అపనమ్మకస్తుడను మరియు ఏకరీతిగా లేని వాడను. కానీ, నీవైతే, నిన్న, నేడు, నిరంతరము ఏకరీతిగా వున్న దేవుడవు గనుక నీకు వందనములు చెల్లింతును.*

యీ కీర్తన దేవుని గుణమును, మనపట్ల ఆయన కలిగియున్న జాలిని గూర్చి తెలియ జేస్తూ, ఆయన "పరిశద్ధ నామమును" సన్నుతించమని మనలను ప్రోత్సహించుచున్నది. ఆయన నామము "పరిశద్ధమైనది". ఎందుకనగా అది అన్ని నామముల కంటె పై నుండి, వేరుగా నున్నది. ఆయన నామము ఆయన గుణములను మరియు ఆయన సామర్థ్యమును గూర్చి తెలియజేయుచున్నది.

1. దేవుని పరిశుద్ధనామమునకు ప్రతిస్పందన - వ. 1
2. దేవుడు చేసిన ఉపకారములన్నిటిని జ్ఞాపకము చేసుకొనుట - వ. 2
3. పాపమునుండి, వ్యాధినుండి విడుదల - వ. 3
4. దేవుడు నాశనమునుండి మనలను విమోచించుట - వ. 4ఎ
5. దేవుని కరుణాకటాక్షములు మనకు అనుగ్రహింపబడుట - వ. 4బి
6. మనము తృప్తిపరచబడునట్లు దేవుడు మనలను మేలుతో నింపుట - వ. 5

మన దేవుడు మనలను "క్షమించాడు", "స్వస్థపరిచాడు", "విమోచించాడు", "పట్టాభిషిక్తునిగా" చేశాడు మరియు "తృప్తి పరిచాడు". ఆయన ఆశ్చర్యకరమైన నామమును స్తుతించుము. కొంత సమయము కేటాయించి, ఆయన ఆశీర్వాదములన్నింటిని జ్ఞాపకము చేసుకొని, ఆయన గుణమునుబట్టి ఆనందించుము.

**ధ్యాన వచనము 1 :** *నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. నా అంతరంగమున నున్న సమస్తమా, ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయ వాంఛలను తీర్చుటకు నీవు నా పట్ల జరిగించు మంచి విషయములన్నిటినిబట్టి నిన్నెంతో స్తుతించుదును.*

పై వాక్య భాగములో దేవుని న్యాయము మరియు ఆయన కృపకు వున్న సంబంధము గురించి వివరింపబడినది. యీ దినపు ధ్యానములోని 7 వ వచనములో, "*ఆయన మోషే కు తన మార్గములు తెలియజేసెను*" అని వ్రాయబడిన మాటలకు ప్రత్యేకమైన అర్థమున్నట్లు చూడగలము. నేను యీ మధ్యనే ఇశ్రాయేలులో సినాయి ఎడారిలోని తిమ్నా (Timna ) అను స్థలములో పూర్తి స్థాయి కొలతలతో నిర్మింపబడిన ప్రత్యక్షపు గుడారము యొక్క నమూనాను దర్శించితిని. యీ నమూనా ఐలతు (Eilat) అను పట్టణమునకు ఉత్తరము వైపు 25 మైళ్ల దూరములో వున్నది. యీ ఎడారిలో ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణములు నా మనస్సు మరియు హృదయములో స్పష్టముగా మెదలుచున్నవి. ఇశ్రాయేలీయుల 40 సంవత్సరముల పోరాటముతో కూడిన అరణ్య ప్రయాణములో దేవుడు మోషేకు తన న్యాయము మరియు కృపను గూర్చి బోధపరిచాడు. మన జీవితపరిస్థితులద్వారా మన దేవుని గురించి మనమెంతవరకు తెలుసుకున్నామని నాకు ఆశ్చర్యము కలుగుచున్నది.

1. దేవుని న్యాయము తీర్చబడుట - వ.6
2. దేవుని మార్గములు తెలియపరచబడుట - వ.7
3. దేవుని దయను గూర్చిన వివరణ - వ.8-10
4. దేవుని కృప హెచ్చింపబడుట - వ.11

మన పాపము ఎంత గొప్పదైనప్పటికీ, దేవుని కృప, కనికరములు మన పాపముకంటె గొప్పవి. మన జీవితములలోని ప్రతిదినము ఆయనను స్తుతిస్తూ జీవించెదము గాక!

**ధ్యాన వచనము 8 :** *యెహోవా దయాదాక్షిణ్య పూర్ణుడు. దీర్ఘ శాంతుడు. కృపా సమృద్ధి గలవాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నిజముగా పొంద వలసిన దానిని (శిక్షను) నా మీదికి రానివ్వకుండా, నీ కృపను నాకు కనుపరచినందుకు నీకు వందనములు.*

ఒక తండ్రి తన పిల్లల యొక్క బలహీనతలను, పతనములను యెరిగి, వారిపట్ల జాలిపడునట్లు పరలోకపు తండ్రియైన దేవుడు కూడా అదేలాగున తన పిల్లలయందు జాలి పడును. దేవుడు మనలను క్షమించినపుడు, మన పాపములను మననుండి తొలగిస్తాడు. వాటిని యింకెన్నడూ జ్ఞాపకముంచుకోడు. సండేస్కూల్‌లో మేము "*తొలగించ బడినవి, తొలగించబడినవి. అవును నా పాపములు తొలగించబడినవి*" అను ఆంగ్ల పాటను పాడేవారము. యిది అద్భుతమైన సత్యము. దేవుని క్షమాపణ సంపూర్ణమైనది. దేవుని ముందు మన జీవితము యొక్క అల్పత్వము, దౌర్బల్యమును గూర్చి యీ కీర్తన నొక్కి పలకడ మనేది మనము దేవునియందు నమ్మిక యుంచి, ఆయనమీద ఆధార పడవలెనను సత్యమును సూచిస్తున్నది.

1. మన పాపములు తొలగించబడుట - వ. 12
2. మనపట్ల దేవుని ప్రతిస్పందన - వ. 13
3. మన నిర్మాణమును దేవుడు జ్ఞాపకము చేసుకొనుట - వ. 14
4. మానవ జీవితమును గూర్చిన వాస్తవము - వ. 15-16

యాకోబు 4:14 లో దేవుని వాక్యము మన జీవితములు "ఆవిరి" వంటివని సెలవిస్తున్నది. బహు త్వరగా మన జీవిత కాలము ముగిసిపోవును. మన జీవితములోని ప్రతిక్షణము దేవుని మహిమకొరకై జీవించుట ఎంత ముఖ్యమైనదో దీనిని బట్టి మనము తెలుసుకొనుచున్నాము.

**ధ్యాన వచనము 13 :** *తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తన యందు భయభక్తులు గలవారియెడల జాలిపడును.*

**ప్రార్థన:** *ప్రభువా, నా బలహీనతలు, నా జీవితము యొక్క దౌర్బల్యము నీకు తెలిసి యున్నవి. నీవు నా పట్ల తీర్పరివిగా వుండక, జాలిగలిగిన దేవుడవుగా వున్నందుకు నీకు వందనములు.*

యెహోవాను సన్నుతించడమనగా ఆయన జరిగించిన గొప్ప కార్యములను గూర్చి ప్రతి స్థలమందును, ప్రతి ఒక్కరితోను సాక్ష్యమిచ్చుట. *"ఆయన నిబంధనను గైకొని"*, ఆయన ఆజ్ఞలను "నెరవేర్చే" దేవుని పిల్లల గురించి పై వాక్య భాగము నొక్కి చెప్పు చున్నది. 20 వ వచనములో ఆయన వాక్యము 'నెరవేర్చే" "దూత" ల గురించి సెలవిస్తున్నది. 21 వ వచనము యెహోవాను సన్నుతించే వారి నిర్వచనము తెలియజేయుచున్నది - "ఆయన చిత్తము నెరవేర్చు ఆయన పరిచారకులారా". దేవునికి విధేయత చూపడమనగా ఆయనకిష్టమైన కార్యములు జరిగించుట.

1. దేవునికి భయపడు వారిమీద నుండు దేవుని కృప - వ. 17బి, 18
2. దేవుని కట్టడలను అనుసరించుట - వ. 17ఎ
3. దేవుడు సమస్తముపైన రాజ్యము చేయుట - వ. 19
4. యెహోవా దూతల యొక్క ప్రతిస్పందన - వ. 20
5. దేవుడు స్తుతించబడుట - వ. 21-22

మన దేవుడు సమస్తముపైన రాజ్యము చేయుచూ, "యెహోవా ఏలుచుండు స్థలములన్నిటిలో" (వ. 22) తన నామమును స్తుతించవలెనని మనలను కోరుచున్నాడు. పై వాక్య భాగములో విధేయత గురించి నొక్కి చెప్పబడినది. అనగా దేవుని అధీనములో వుంటూ, ఆయన కిష్టమైన కార్యములు జరిగించుట.

**ధ్యాన వచనము 19:** *యెహోవా ఆకాశమందు తన సింహాసనమును స్థిరపరచియున్నాడు. ఆయన అన్నిటిమీద రాజ్య పరిపాలన చేయుచున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు యీ లోక వ్యవహారములన్నిటిమీదను మరియు నా జీవితము పైననూ పరిపాలన కలిగియున్న దేవుడవు గనుక నీకు వందనములు.*

పై వాక్యభాగములోని మొదటి వచనమును ఆధారముగా చేసుకొని "నీవెంత గొప్పవాడవు" (How great thou art) అని ఆంగ్లములో వ్రాయబడిన పాటను బట్టి ఎంతోమంది విశ్వాసులు ఆనందించిరి. యీ వాక్య భాగములో మన దేవుని గురించి యివ్వబడిన వర్ణన ఆయన యందు ఆనందించి, ఆయన నామమును స్తుతించునట్లు చేయుచున్నది. దేవునికి అసాధ్యమైనదేదీ లేదను మాట ఎంతో వాస్తవము. నీ జీవితములో ప్రస్తుతము నీకు కలుగుతున్న ఆటంకములు, సమస్యలు లేదా కష్టములు అధిగమించలేనంతగా నీకు అనిపించు చుండవచ్చును. సాధారణముగా మన కనుదృష్టి దేవుని గొప్పతనముపై లేకుండా మన పరిస్థితులపై కలిగియున్నప్పుడు యిలా అనిపిస్తుంది. నిన్ను ప్రేమించి, నీవు ఎదుర్కొంటున్న సమస్తమును గూర్చి ఆలోచన కలిగియున్న దేవుని పాదముల చెంతకు వచ్చి, నీ సమస్యలన్నిటిని ఆయన ప్రేమగల హస్తములకు అప్పజెప్పుటకు యిప్పుడే కొంత సమయమును కేటాయించుము.

1. మన దేవుని గొప్పతనము - వ. 1
2. వస్త్రమువలెనున్న దేవుని వెలుగు - వ. 2
3. ఆకాశములలో దేవుని సన్నిధియొక్క మహిమ - వ. 3-4
4. భూమి పునాదులను నిర్మించిన దేవుడు - వ. 5

కొన్నిసార్లు మనకున్న పనులనుబట్టి యీ ప్రపంచములో దేవుని గొప్పతనమును, ఆయన మహిమను చూపించే సృష్టిని చూడలేక పోతుంటాము. యీ సృష్టి అంతయు దేవుని గూర్చి జ్ఞాపకము చేయుచూ, ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది.

**ధ్యాన వచనము 1 :** *నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. యెహోవా, నా దేవా, నీవు అధిక ఘనత వహించినవాడవు. నీవు మహాత్మ్యమును, ప్రభావమును ధరించియున్నావు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ గొప్పతనము నా హృదయమునకు ఎంతో ఆదరణను, ప్రోత్సాహమును కలిగించుచున్నది. నీ గొప్పతనమునుబట్టి నా సమస్యలు నీవు పరిష్కరించుటకు ఎంతో స్వల్పమైన విషయములుగా వున్నవని నేను ఒప్పింపబడియున్నాను.*

పై వాక్యభాగములో సృష్టి పట్ల దేవుని సంరక్షణ మరియు ఆయన దానిపై కలిగియున్న నియంత్రణలను గూర్చి చక్కగా తెలియజేయబడినది. సృష్టి అంతయు దేవుని గొప్పతనము మరియు ఆయన బలమును గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది. తాను సృష్టించిన జంతువులనే దేవుడు యింత చక్కగా పోషించినపుడు మానవులమైన మనపట్ల యింకెంత గొప్ప ప్రేమను చూపించి, సంరక్షించునో మనము ఊహించగలము. దేవుడు అలక్ష్యముగా వున్నాడని యెన్నడూ అనుకొనవద్దు. ఆయన మన ప్రతి అవసరతను తీరుస్తానని (ఫిలిప్పీ4:19), 'నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను' అని వాగ్దానమిచ్చాడు (హెబ్రీ 13:5). నీవు ఏ విషయములోనైనా ఆందోళన, కలత చెందియున్నట్లయితే, నీ చుట్టువున్న తన సృష్టిని దేవుడేలాగు సంరక్షించుచున్నాడో ఒకసారి చూడుము.

1. దేవుడు జలములతో భూమిని కప్పుట– వ.6
2. జలములను దేవుడు తన అధీనములో కలిగియుండుట – వ.7–10
3. దేవుడు జంతువులను, పక్షులను సంరక్షించుట – వ.11–12
4. దేవుని సంరక్షణనుబట్టి భూమి తృప్తిచెందుట – వ.13

అవును, దేవుడు నీ అవసరములు తీరుస్తాడు. జలములను తన స్వాధీనములో కలిగి, జంతువులను పోషించే దేవుడు నిన్ను ఎన్నడూ ఎడబాయడు. నీ మార్గములో ఎటువంటి పరిస్థితులు ఎదురైనను, ఆయన నిన్ను మరిచిపోయాడని ఎప్పుడూ అనుకొనవద్దు. ఆయన ఎల్లప్పుడు జీవిస్తూ, మనలను పోషించే దేవుడైయున్నాడు.

**ధ్యాన వచనము 13:** *తన గదులలో నుండి ఆయన కొండలకు జలధారలనిచ్చును. నీ క్రియల ఫలముచేత భూమి తృప్తిపొందుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సంరక్షణనుబట్టియు, నిరంతరము నాకు అవసరమైన వాటిని సమకూరుస్తున్నందుకును నిన్ను స్తుతించెదను.*

నీవు అధైర్యము చెంది, నీ జీవిత పరిస్థితులు నీకు అర్థముకాక, అవి నీ అదుపుతప్పినట్లు నీకనిపిస్తే, మరొకసారి దేవుని సృష్టి ఏలాగు పనిచేయుచున్నదో చూడుము. ఆ సృష్టి అంతటి వెనుక సమస్త జ్ఞానముతో నిండిన సృష్టికర్త వున్నాడు. తన సృష్టిని పోషిస్తున్నాడు. పై వచనములలో దేవుడు సృష్టించిన చెట్లు, కొండలు, బండలు మరియు పక్షులకు, కొండమేకలకు, కుందేళ్లకు ఆయన కలుగజేసిన ఆశ్రయస్థానముల గురించి చదువుచున్నాము. 1పేతురు 5:7లో "*ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింతయావత్తు ఆయన మీద వేయుడి*" అని వ్రాయబడియున్నది. నీ ప్రతి అవసరతకు ఆయన సంరక్షణ మరియు ఆయన కృప మీద ఆధారపడి, ఆయనయందు నమ్మికయుంచుము.

1. దేవుడు పశువులకు, మానవులకు ఆహారమును కలుగజేయుట – వ. 14
2. దేవుడు నరుల ముఖములు ప్రకాశింపజేయుట – వ. 15
3. దేవుడు పక్షులకొరకు వృక్షములను కలుగజేయుట – వ. 16–17
4. దేవుడు కొండలు, బండలను ఆశ్రయ స్థానములుగా సృష్టించుట – వ. 18

జంతువులు ఎక్కడ దాగుకొనవలెనో, ఎక్కడ వాటికి ఆహారము దొరుకుతుందో యెరిగియున్నవి. అయితే నీ అవసరములెట్లు తీరునో నీవు యెరుగుదువా?

**ధ్యాన వచనము 14-15:** *పశువులకు గడ్డిని, నరుల ఉపయోగమునకు కూరమొక్కలను ఆయన మొలిపించుచున్నాడు. అందుమూలమున భూమిలోనుండి ఆహారమును......ఆయన పుట్టించుచున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, ప్రతి విషయములోను నేను నీ మీద ఆధారపడి, నా జీవితములో నీ సంరక్షణకు నన్ను అప్పగించుకొందును.*

మన జీవితముల యొక్క ప్రక్రియ దేవుని చేత నిర్ణయించబడినది. మన దిన చర్యలను జరిగించుటకొరకు మరియు మన అవసరతలన్నీ తీర్చుటకొరకు కావలసిన ఏర్పాట్లను ఆయన సృష్టిలో కలిగించియున్నాడు. పై వాక్య భాగము *"అడవి జంతువులను"* గూర్చి (ముఖ్యముగా సింహములనుగూర్చి) తెలియజేయడంద్వారా దేవుని ప్రేమతో కూడిన కాపుదలను గూర్చి వివరించుచున్నది. పగటి పూట సింహములు తమ *"గుహలలో"* పండుకొని, దేవుడు సృష్టించిన రాత్రిసమయములో అవి తమ *"వేట కొరకు గర్జించుచున్నవి"*. 23వ వచనములో మానవులమైన మనము ఉదయమున పనులకు బయలుదేరి, సాయంకాలమున విశ్రమించుటకై తిరిగి వస్తామని వ్రాయబడినది. యిదంతయూ జ్ఞానవంతుడైన సృష్టికర్తను గూర్చి సాక్ష్యమిచ్చుచూ, ఆయన మన జీవితముల పట్ల కలిగియున్న సాధారణమైన ప్రణాళికను గూర్చి తెలియజేయుచున్నది.

1. ఆకాశములో సూర్యచంద్రుల కదలిక– వ. 19
2. దేవుడు చీకటిని సృష్టించుట – వ. 20
3. దేవుడు సింహములను మాంసముతో పోషించుట – వ. 21
4. జంతువులు నిద్రించుటకు దేవుడు కలిగించిన ఏర్పాటు– వ. 22
5. మానవులు పనిచేయు తీరు– వ. 23

దేవుని సృష్టి అంతటి వెనుక ఆయన క్రమము, నిర్మాణము దాగియున్నవి. అదేలాగున నీ జీవితము కూడా దేవుని హస్తములలో వున్నది.

**ధ్యాన వచనము 23 :** *సాయంకాలము వరకు పాటుపడి తమ పనులను జరుపుకొనుటకై మనుష్యులు బయలు వెళ్లెదరు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను పనిచేయుచు నిన్ను సేవించవలెనని కోరుకుంటున్నాను. దీని కొరకు నా దినములను జ్ఞానముతో ఉపయోగించుకొనుటకు సహాయము చేయుము.*

యీ ప్రకృతి మరియు వాతావరణములో జరుగుచున్న అద్భుతమైన ప్రక్రియలన్నియు దేవునిచేత సృష్టింపబడి, ఆయన అధీనములో వున్నాయి. యిది మనకు ఎంతో ఉత్సాహమును కలిగించే విషయము. పై వాక్యభాగము దేవుని క్రియలను గూర్చియు, ఆయన జ్ఞానమును గూర్చియు బలమైన రీతిలో నొక్కిచెప్పుచున్నది. యిది మనము దేవుని అనుదినము స్తుతించునట్లు చేయుచున్నది. 29,30 వచనములు మన జీవితముల అల్పత్వమును, దేవుని సృష్టించే శక్తిని గురించి తెలియజేయుచున్నవి. దేవునికొరకు కనిపెట్టుకొని, మన అవసరతలన్నింటికొరకు ఆయనయందు సంపూర్ణమైన నమ్మిక కలిగియుండవలెనని పై వాక్యభాగముద్వారా గుర్తు చేయబడుచున్నాము.

1. దేవుని కార్యములు, ఆయన జ్ఞానము హెచ్చింపబడుట– వ. 24
2. సముద్రములో దేవుడు సృష్టించిన జీవరాసులు లెక్కలేనివి– వ. 25
3. సముద్రము ఉపయోగింపబడు విధము– వ. 26
4. సముద్ర జీవరాసులు ఆహారముకొరకు దేవునివైపు చూచుట– వ. 27–28
5. సముద్ర జీవరాసుల అంతము దేవునిచేతిలో నున్నది– వ. 29
6. జీవరాసులు సృష్టించబడుటకు, ఆ సృష్టి తిరిగి నూతన పరచబడుటకు అవసరమైన దేవుని ఊపిరి - వ. 30

యీ ప్రపంచములోని సముద్రములు ఎంతో విశాలమైనవి. వాటిలో లెక్కలేనన్ని జీవరాసులున్నాయి. యివన్నియు జ్ఞానము మరియు ప్రేమ కలిగిన దేవుని చేత సృష్టించబడినవి. దేవుని శక్తి మరియు ఆయన కనికరమునకు ఆయన సృష్టించి, పోషిస్తున్న యీ జీవరాసులు సాక్ష్యములు.

**ధ్యాన వచనము 24 :** *యెహోవా, నీ కార్యములు ఎన్నెన్ని విధములుగా నున్నవి! జ్ఞానము చేత నీవు వాటన్నిటిని నిర్మించితివి. నీవు కలుగజేసిన వాటితో భూమినిండియున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ దినము నేను నిన్ను ఆరాధించుటకు వచ్చెదను. నీవు కలుగజేసిన సముద్రముల గొప్పతనమునుబట్టి, అందులోని నీ సృష్టియంతటినిబట్టి నీకు వందనములు చెల్లించెదను.*

యీ కీర్తన యొక్క సారాంశమును చదువుట మనకు ఆశీర్వాదకరముగా వుంటున్నది. యీ కీర్తన "యెహోవాను సన్నుతించుము" అను మాటలతో ప్రారంభమై, "యెహోవాను స్తుతించుడి" అను మాటలతో ముగియుచున్నది. యీ కీర్తనలో దేవుని గొప్ప బలము మరియు తాను సృష్టించిన సృష్టి అంతటిని తాను పోషిస్తూ, సంరక్షిస్తున్న తీరును గూర్చి తెలియజేయ బడినది. యిప్పుడు పై వాక్య భాగములో అటువంటి దేవున్ని, ఆయన కార్యములను ధ్యానించి, "యెహోవాకు కీర్తనలు పాడుమని" దేవుని వాక్యము మనకు సెలవిస్తున్నది. దేవునిపై మన మనస్సు కేంద్రీకరించి, ఆయన ధ్యానములో యెక్కువ సమయము గడిపినట్లైయితే, మన దృక్పథము మరియు మన వైఖరిలో కలుగబోయే మార్పులనుబట్టి బహుశా మనకే ఆశ్చర్యమేస్తుంది. దేవుడు తన గుణములు, తన సామర్థ్యమును గూర్చి ధ్యానించుటకు మన హృదయములు, మన మనస్సులను వెలిగించును గాక!

1. దేవుని మహిమ నిత్యము నిలుచుట – వ. 31 ఎ
2. దేవుడు తన సంతోషమును వ్యక్తపరచుట – వ. 31 బి
3. భూమి మీద దేవుని శక్తి యొక్క ప్రభావము – వ. 32
4. స్తుతించుటలో మనకుండవలసిన తీర్మానము – వ. 33
5. దేవుని ధ్యానమును గూర్చిన అభ్యాసము, దాని ఫలితము– వ. 34
6. భక్తిహీనులకు కలుగబోవు అంతము – వ. 35

దేవుని శక్తి ఎంతో గొప్పది. మనమాయనయందు నమ్మికయుంచుట వలన ప్రతిఫలము పొందెదము. దుష్టులు దేవుని తీర్పును యెదుర్కొంటారు. అయితే, తాను చేయబోయేదానియంతటిలో దేవుడు నీతిమంతుడన్న సత్యమునుబట్టి మనము దేవుని స్తుతింతుము.

**ధ్యాన వచనము 34 :** *ఆయనను గూర్చిన నా ధ్యానము ఆయనకు యింపుగా నుండును గాక. నేను యెహోవాయందు సంతోషించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నిన్ను హెచ్చించెదను. నీ పరిశుద్ధనామమును కీర్తించెదను. నా జీవితములోను, యీ లోకములోను నీ ప్రణాళిక, నీ చిత్తము నెరవేరునట్లు నిన్ను నమ్ముకొందును.*

యీ దినమును మొదలు పెట్టుటకు యిది చక్కని వాక్యభాగము. దేవునికి మనము వందనములు చెల్లించవలసిన అవసరత ఎంతగానో వున్నది. దేవుని ఆశ్చర్యకార్యములను ప్రశ్నించి, ఆయనకు వ్యతిరేకముగా సణుగుకొనడం సులభమైనపని. ఒక్కొక్కసారి దేవుడు మనకు ఎంతో దూరంగా వున్నట్లుండి, మనము ఆయనతో ఎలాంటి సంబంధము కలిగియుండవలెనో తెలియని వారముగా వుందుము. అయితే, దేవుడు మనకు దూరముగా వెళ్లిపోలేదు. ప్రతి కష్ట పరిస్థితిలోను, సంతోషకర పరిస్థితిలోను దేవుడు మనకు తోడైయున్నాడు. మనము దేవుని స్వరమునకు అనుదినము ఎలా ప్రతిస్పందిస్తామన్న దానిని బట్టి మన క్రియలు, మన మాటలు ప్రభావితము చేయబడతాయి. ఆయనమీద దృష్టియుంచి, యీ దినము జరిగే ప్రతి సంగతిని దేవునికి వివరించుము. అప్పుడు నీ హృదయములో కలిగే మార్పును బట్టి నీవు ఆశ్చర్యపడెదవు.

1. దేవునికి వందనములతో ప్రతిస్పందించుట– వ. 1
2. ఆయనను గూర్చి పాటలు పాడుట – వ. 2
3. ఆయనయందు ఆనందించుట– వ. 3
4. ఆయన సన్నిధిని వెదకుట – వ. 4
5. ఆయన కార్యములను జ్ఞాపకము చేసుకొనుట– వ. 5 బి, 6

దేవుని వాక్యము పై వచనములలో స్పష్టమైన ఉపదేశము చేయుచున్నది – *"కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఆయన నామమును ప్రకటన చేయుడి. ఆయన కార్యములను తెలియజేయుడి. ఆయనను గూర్చి పాడుడి. సంభాషణ చేయుడి. ఆయన పరిశుద్ధనామమును బట్టి అతిశయించుడి. సంతోషించుడి. యెహోవాను వెదకుడి. ఆయన చేసిన ఆశ్చర్యకార్యములను జ్ఞాపకము చేసుకొనుడి".* సర్వశక్తుడైన దేవుని ఆరాధించి, ఆయనను స్తుతించుట ఒక విశ్వాసి జీవితములో ఎంతో ప్రాధాన్యమైనదని గ్రహించుట చాలా ముఖ్యమైన విషయము.

**ధ్యాన వచనము 3:** *ఆయన పరిశుద్ధనామమును బట్టి అతిశయించుడి. యెహోవాను వెదకువారు హృదయమందు సంతోషించుదురుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవేమైయున్న దానిని బట్టి, నీవు జరిగించు కార్యములన్నిటిని బట్టి నిన్ను స్తుతించెదను. మునుపటికంటె అధికముగా నిన్ను ఆరాధించవలెనని ఆశపడుదును.*

బైబిలును గూర్చి మనము కలిగియున్న గ్రహింపు మరియు తీర్మానమునకు సంబంధించి *'దేవుని నిబంధన'* అను సత్యము ఎంతో ముఖ్యమైనది. దేవుడు అబ్రహాముతో చేసిన "నిబంధన" షరతులు లేనిది (ఆదికాండం 12:1-3). అనగా ఆ నిబంధన మానవుని ప్రయత్నము, కృషి మరియు పనితనము మీద కాకుండా దేవుని విశ్వాస్యత మీదనే ఆధారపడియున్నది. దేవుడు ఎన్నడూ మాట తప్పడు. ఆయన వాగ్దానము చేసినది తప్పక నెరవేరుస్తాడని మనము ఆయనను నమ్మవచ్చును. దేవుడు అబ్రహాముతో చేసిన నిబంధనలో అబ్రహామును ఒక గొప్ప జనముగా చేయుదునని, కనాను దేశమును వారికి యిచ్చెదనని మరియు భూమిమీద సమస్త వంశములను ఆశీర్వదించే కుమారుని అనుగ్రహిస్తానని వాగ్దానము చేశాడు. యీ వాక్య భాగము దేవుడు అబ్రహాముకు వాగ్దానము చేసిన కనాను దేశమును గూర్చి తెలియజేయుచున్నది. యీ దేశమును ఇశ్రాయేలీయులు ప్రస్తుతము సంపూర్ణముగా పొందకపోయినప్పటికీ, భవిష్యత్తులో ప్రభువైన యేసుక్రీస్తు రాకడలో ఆ వాగ్దానము సంపూర్ణముగా నెరవేరును.

1. దేవుడు ఏర్పరచుకొనిన ప్రజలు - వ.5ఎ
2. దేవుని తీర్పు జరిగించబడుట - వ.7
3. దేవుడు తాను చేసిన నిబంధనను జ్ఞాపకము చేసుకొని, దానిని స్థిరపరచుట- వ.8,9,12
4. తన ప్రజలు కొద్దిమందియైనను దేవుడు తన వాగ్దానమును నెరవేర్చుటలో కలిగియున్న తీర్మానము- వ.10,11

యీ వాక్యభాగము దేవుని నిత్యమైన విశ్వాస్యతను గూర్చి అద్భుతమైన రీతిలో జ్ఞాపకము చేయుచున్నది. ఆయన వాగ్దానము మన యోగ్యత, కృషి లేదా మనము సాధించిన వాటినిబట్టి ఆధారపడియుండదు.

**ధ్యాన వచనము 8 - 9:** *తాను సెలవిచ్చిన మాటను, వెయ్యితరముల వరకు అబ్రహాముతో తాను చేసిన నిబంధనను .......నిత్యము ఆయన జ్ఞాపకము చేసికొనును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాగ్దానములు నా పనితనమునుబట్టిగాక నీ విశ్వసనీయతమీద ఆధారపడియున్నందుకు నీకు వందనములు.*

ఇశ్రాయేలు చరిత్ర దేవుడు తన ప్రజలను ఎట్లు సంరక్షిస్తాడను సత్యము యొక్క ఉదాహరణలతో నిండియున్నది. వాటిలో ఒక సంఘటనగా ఇశ్రాయేలులో కరువు కలిగినపుడు యాకోబు తన కుటుంబముతో ఐగుప్తునకు వెళ్లుట గురించి చెప్పుకొనవచ్చును. యాకోబు కుమారులు తమ సోదరుడైన యోసేపును తమ తండ్రి వారికంటె ఎక్కువగా ఘనపరచుట చూచి, అసూయతో యోసేపును ఐగుప్తునకు బానిసగా అమ్మివేసిరి. ఇదంతయు దేవుని ప్రణాళిక ప్రకారము జరిగింది. ఎందుకనగా ఆదికాండం 50:20లో యోసేపు తన సోదరులతో, "*మీరు నాకు కీడు చేయనుద్దేశించితిరిగాని నేటి దినమున జరుగుచున్నట్లు, అనగా బహుప్రజలను బ్రతికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను*" అని పలుకుచున్నాడు. దేవుడు జరిగించుచున్న కార్యములు మనకు ఎల్లప్పుడు అర్థం కాకపోవచ్చును గాని ఆయన సమస్తమును మన మేలుకొరకు, ఆయన మహిమకొరకు జరిగించుచున్నాడని మనము గట్టిగా నమ్మవచ్చును (రోమా 8:28).

1. ఇశ్రాయేలీయులు అన్య దేశములలో తిరుగులాడుట- వ. 13
2. దేవుడు వారిని అన్య దేశములలో కాపాడుట- వ. 14-15
3. దేవుడు కరువును రప్పించుట- వ. 16
4. దేవుడు యోసేపును ముందుగా ఐగుప్తునకు పంపించుట - వ. 17
5. యోసేపు పొందిన బాధ - వ. 18
6. దేవుడు యోసేపును ఉన్నత స్థానమునకు హెచ్చించుట- వ. 19-22

ఒక్కొక్కసారి మనకు దేవుడు మనలను విడిచి పెట్టాడనిపిస్తుంది. కానీ అటువంటి తలంపులను అసలే నమ్మకూడదు. దేవుడు తన ప్రణాళికను మన జీవితములలో జరిగించుచున్నాడు. మన మేలునే ఆయన దృష్టించియున్నాడు.

**ధ్యాన వచనము 19 :** *అతడు చెప్పిన సంగతి నెరవేరువరకు యెహోవా వాక్కు అతని పరిశోధించుచుండెను.*

**ప్రార్థన:** *ప్రభువా, అన్ని వేళలయందు నిన్ను నమ్ముకొనుటకు సహాయము చేయుము. ముఖ్యముగా నీవు నన్ను పరీక్షించునప్పుడు నేను నిన్ను నమ్ముకొనుటకు సహాయము చేయుము.*

ఇశ్రాయేలీయులు మొదట్లో ఐగుప్తునకు వెళ్లినపుడు వారు కరువు నుండి రక్షించబడి, గౌరవమర్యాదలతో జీవించుట దేవుని నుండి వారు పొందిన ఆశ్చర్యకరమైన ఆశీర్వాదముగా మనకు అనిపిస్తుంది. అయితే, కొంతకాలము తరువాత “యోసేపును యెరుగని” క్రొత్త ఫరో అధికారములోకి రావడాన్నిబట్టి పరిస్థితులు పూర్తిగా మారాయి. ఇశ్రాయేలీయుల సంఖ్య బాగా పెరగడాన్ని బట్టి వారు ఐగుప్తునకు ఆశీర్వాదముగా కాక ఒక బెదిరింపుగా ఉండిరి. మన జీవితములో కూడా యిలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశముంది. మనము నమ్ముకున్న స్థితిగతులు మారిపోగలవు. ఒకప్పుడు ఆశీర్వాదకరముగా వున్న పరిస్థితులు యిప్పుడు కష్టతరంగా మారిపోవచ్చును. అయితే, మరొకసారి, ప్రతి కష్టతర పరిస్థితిలోను మనము దేవునియందు నమ్మికయుంచాల్సిన వారంగా వున్నాము. ఇశ్రాయేలీయుల కష్టములమధ్య దేవుడు తన బలమును ఐగుప్తీయులమీద ప్రదర్శించాలన్న దైవిక సంకల్పము నెరవేరింది.

1. ఇశ్రాయేలీయులు ఐగుప్తునకు తరలివచ్చుట - వ. 23
2. ఇశ్రాయేలీయులు ప్రబలిపోవుటనుబట్టి ఐగుప్తీయులకు కలిగిన ఆందోళన- వ. 24
3. ఐగుప్తీయుల ప్రవర్తన మారిపోవుట- వ. 25
4. దేవుడు మోషే, అహరోనులను నాయకులుగా ఎన్నుకొనుట- వ. 26
5. దేవుడు తన శక్తిని ఐగుప్తులో బయలుపరచుట- వ. 27

నీ పరిస్థితులు నీకు ఎంత కష్టతరముగా అనిపించినా, దేవుడు వాటిని తన మహిమకొరకు మలుపుకొని, వాటిద్వారా నీకు మేలును జరిగించగలడు. నీ పూర్ణహృదయముతో ఆయనయందు నమ్మికయుంచుము.

**ధ్యాన వచనము 24 :** *ఆయన తన ప్రజలకు బహుసంతానవృద్ధి కలుగజేసెను. వారి విరోధుల కంటె వారికి అధికబలము దయచేసెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో సమస్తమును నీ మహిమకొరకై, నా మేలుకొరకై జరిగించుచున్నందుకు నీకు వందనములు.*

ఐగుప్తు మీదికి దేవుడు రప్పించిన తెగుళ్లు ఐగుప్తీయులు దేవుళ్లుగా భావించి, ఆరాధించే విగ్రహాలకు వ్యతిరేకంగా తీసుకురాబడినవి. తాను మాత్రమే నిజమైన దేవుడనని రుజువు చేస్తూ, తన శక్తిని దేవుడు ఆమోఘమైన విధానములో ప్రదర్శించాడు. ఇశ్రాయేలీయులు ఐగుప్తులోనికి వెళ్లి, ఎంతో గొప్ప శ్రమను, బానిసత్వమును అనుభవిస్తున్నప్పుడు దేవుడు వారి పట్ల చేయబోయే అద్భుత కార్యముల గురించి వారు అసలే ఊహించలేదు. మన జీవిత పరిస్థితులు అనేకసార్లు మనకు ఒక మర్మముగా ఉండిపోతాయి – మనకు యెదురవుతున్న పరిస్థితులలో దేవుని హస్తమును చూడలేని వారముగా వుంటాము. అయితే, దేవుడు "*తన చిత్తప్రకారమైన సంకల్పమునుబట్టి సమస్త కార్యములను*" జరిగించుచున్నాడు (ఎఫెసీ 1:11) మరియు "*ఆయన మూలమునను, ఆయన ద్వారాను, ఆయన నిమిత్తమును "సమస్తము" కలిగియున్నవి*" (రోమా 11:36).

1. దేవుడు కలుగజేసిన చీకటి– వ. 28
2. ఐగుప్తు జలములు రక్తముగా మారుట– వ. 29
3. దేవుడు కప్పలు, జోరీగలు, దోమలను రప్పించుట – వ. 30–31
4. వడగండ్లు, అగ్ని జ్వాలలను రప్పించుట – వ. 32
5. ఐగుప్తు దేశములోని వృక్షములు పడగొట్టబడుట– వ. 33
6. దేవుని ఆజ్ఞనుబట్టి పెద్ద మిడతలు, చీడపురుగులు వచ్చుట– వ. 34
7. ఐగుప్తు భూమి పంటలు తినివేయబడుట – వ. 35
8. ఐగుప్తు ప్రథమ సంతానము మొత్తబడుట – వ. 36

దేవుడు యీ భూమియంతటి మీద నిజమైన దేవుడెవరన్న సత్యమును నిరూపించాడు. ఆయన అద్భుతశక్తి స్పష్టంగా ప్రదర్శింపబడి, ఆయనకు సకల మహిమ, స్తుతి కలిగినవి. యీ దినమున ఎంత చక్కని పాఠము దేవునివాక్యము ద్వారా మనము నేర్చుకున్నాము!

**ధ్యాన వచనము 36 :** *వారి దేశమందలి సమస్త జ్యేష్ఠులను, వారి ప్రథమ సంతానమును ఆయన హతము చేసెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీకు మహిమ, స్తుతి కలుగుటకే నా జీవితప్రణాళికను నీవు రూపొందించియున్నావు. నాకు కష్టములు ఎదురైనప్పుడు, నీ ప్రణాళికను, నీ వుద్దేశ్యమును నీవు నెరవేర్చెదవని నమ్ముటకు నాకు సహాయము చేయుము.*

ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణములో వున్నప్పుడు దేవుడు ఎంతో ఆశ్చర్యకరమైన రీతిలో వారిని సంరక్షించాడు. సినాయి ఎడారిలో ప్రయాణము చేయునప్పుడు ఆ ప్రాంతము ఎంతో నిర్మానుష్యంగా, ఎండిపోయి, ఎంతో వేడిగా వుంటుందని మనము గ్రహించాలి. మన దేవుడు వారిని కాపాడితేనేగాని ఇశ్రాయేలీయులు ఆ ఎడారిలో జీవించలేరు. దేవుడు తన ప్రజలను సంరక్షిస్తానని వాగ్దానము చేశాడు. మనకు పరిస్థితులు ఒక్కొక్కసారి కష్టతరంగా వుండి, మన అవసరాలకు తగిన సౌకర్యములు లోపించినట్లు మనకనిపించినా, దావీదు రాజు కీర్తన 37:25లో చెప్పినట్లు, *"దేవుడు నీతిమంతులను ఎన్నడూ విడువడు. వారి సంతానము ఎన్నడూ భిక్షమెత్తుకొనదు".*

1. ఇశ్రాయేలీయులు వెండి బంగారములతో ఐగుప్తునుండి బయటకు వచ్చుట– వ. 37
2. ఇశ్రాయేలీయులు వెళ్లి పోవుట ద్వారా ఐగుప్తీయులకు కలిగిన ఉపశమనము– వ. 38
3. దేవుడు మేఘము, అగ్నిద్వారా తన సన్నిధి ఇశ్రాయేలీయులకు తోడుగా వుంచుట– వ. 39
4. పూరేళ్లను, ఆహారమును ఆయన తన ప్రజలకు అనుగ్రహించుట– వ. 40
5. బండనుండి నీరు యేరుగా పారుట– వ. 41

దేవుడు ఆకాశమునుండి ఆహారమును, బండలో నుండి నీళ్లను తీసుకురాగలిగితే, మన అవసరతలన్నీ ఆయన తీర్చగలడు.

**ధ్యాన వచనము 37 :** *అక్కడనుండి తన జనులను వెండి బంగారములతో ఆయన రప్పించెను. వారి గోత్రములలో నిస్సత్తువచేత తొట్రిల్లు వాడొక్కడైనను లేకపోయెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా అవసరతలన్నీ తీర్చినందుకు నీకు వందనములు. నా శోధనలలో నన్ను యెన్నడును విడిచి పెట్టని దేవుడవైనందుకు నీకు వందనములు.*

దేవుడు తన ప్రజలకు చేసిన వాగ్దానమును నెరవేర్చాడు. ఆయన వాగ్దానము ఎటువంటి షరతులు లేనిది. ప్రజలు ఆయనకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేసినప్పటికీ తాను చేసిన వాగ్దానముపట్ల ఆయన విశ్వాస్యతను కనపరిచాడు. మనలో అనేకులము మనము చేసిన వాగ్దానములను మరచి పోతుంటాము. అయితే దేవుడు ఎన్నడూ మరువడు. ఆయన ఎల్లప్పుడు "తన పరిశుద్ధ వాగ్దానమును జ్ఞాపకము చేసుకుంటాడు". మన దేవుని విశ్వాస్యతయందు మనము నమ్మికయుంచగలుగుట ఎంత ధన్యకరము! ఇశ్రాయేలీయులు దేవుని ఆశీర్వాదములకు యోగ్యులు కాకపోయినప్పటికీ దేవుడు వారి పట్ల తన విశ్వాస్యతను కనబరిచాడు. వారు అనేకసార్లు దేవునికి వ్యతిరేకంగా సణుగు కొన్నప్పటికిని ఆయన 40 సంవత్సరములు వారి అవసరములు తీరుస్తూ వచ్చాడు.

1. దేవుడు తన వాగ్దానములను జ్ఞాపకము చేసుకొనుట– వ. 42
2. దేవుడు తన ప్రజలను సంతోషముతో బానిసత్వము నుండి వెలుపలికి రప్పించుట – వ. 43
3. దేవుడు తన ప్రజలకు అన్యజనుల భూములు అప్పగించుటలో ఆయనకున్న ఉద్దేశ్యము, తద్వారా ఆయనకు చెందవలసిన స్తుతి – వ. 44–45

ఇశ్రాయేలీయులను వాగ్దానము చేయబడిన దేశములోనికి దేవుడు తీసుకు వెళ్లినపుడు వారు వట్టిచేతులతో అక్కడికి వెళ్లలేదు. ఆయన వారికి "భూములను" యిచ్చి, వారి హృదయములను "సంతోషము"తోను, "ఉత్సాహము" తోను నింపెను.

**ధ్యాన వచనము 42:** *ఏలయనగా ఆయన తన పరిశుద్ధ వాగ్దానమును, తన సేవకుడైన అబ్రాహామును జ్ఞాపకము చేసుకొనెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా అవసరతలన్నీ తీర్చి, నా హృదయమును సంతోషముతో నింపినందుకు నీకు వందనములు.*

యీ కీర్తన దేవుని మంచితనమును మరియు ఆయన కృపను గూర్చి జ్ఞాపకము చేయుచూ, ఆయనకు స్తుతిరూపకముగా వ్రాయబడినది. దేవుడు చాలా మంచివాడు. మన పరిస్థితులు బాగాలేనప్పుడు ఆయన మంచితనమును గూర్చి ప్రశ్నించే వారంగా వుంటాము. రోమా 8:28లో దేవుని వాక్యము స్పష్టముగా సెలవిస్తున్నది – దేవుడు మన మేలుకొరకు మరియు ఆయన "మహిమ" కొరకు "సమస్తమును" జరిగించుచున్నాడు. "ఆయన పరాక్రమకార్యములనుబట్టి" మనము ఎంతగా ఆయనను స్తుతించితే అంత "ధన్యులమగుదుము". దేవుడు తనను ఆరాధించాలని మనలను కోరుచున్నాడు. ఆయన మార్గములను గూర్చి, ఆయన కార్యములను గూర్చి సాక్ష్యమివ్వాలని మనలను ఆయన కోరుచున్నట్లు కీర్తనలద్వారా తెలుసుకొనుచున్నాము.

1. దేవుడు తనకు వందనములు చెల్లించాలని మానవులను కోరుకొనుట– వ. 1
2. తన పరాక్రమకార్యములనుబట్టి దేవుడు స్తుతినొందదగినవాడు – వ. 2
3. మనము అనుసరించవలసిన నీతి న్యాయములు – వ. 3
4. దేవుని రక్షణయొక్క సత్యమును జ్ఞాపకము చేసికొని తనను రక్షింపుమని కీర్తనాకారుని మనవి– వ. 4–5

ఇశ్రాయేలీయుల అరణ్యప్రయాణములో తాను వారికి తోడైయుండి, వారి అవసరములు తీర్చిన దానినిబట్టి మనము ఆనందించవలెనని దేవుడు కోరుకుంటున్నట్లు పై వాక్య భాగములోని 4వ వచనము ద్వారా స్పష్టమగుచున్నది. ఆయన మనకిచ్చిన స్వాస్థ్యమునుబట్టి మనము అతిశయించవలెను.

**ధ్యాన వచనము 1 :** *యెహోవాను స్తుతించుడి. యెహోవా దయాళుడు. ఆయనకు కృతజ్ఞతా స్తుతులుచెల్లించుడి. ఆయన కృప నిత్యముండును.*

**ప్రార్థన:** *నీవు నీ ప్రజలైన ఇశ్రాయేలీయులను సంరక్షించిన విధమును గూర్చి నేను ఆలోచించినపుడు వారి పట్ల నీవు జరిగించిన సమస్తమునుబట్టి నీకు స్తుతులు, వందనములు చెల్లించెదను.*

దేవుడు తన మహా పరాక్రమమును తన ప్రజలకు చూపించినప్పటికీ వారు ఆయనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిరి. యీ దినపు వాక్య భాగము తన ప్రజలు తనకు వ్యతిరేకంగా తిరుగుబాటు మరియు పాపములో జీవించినప్పటికీ దేవుడు వారిని యెలా "రక్షించాడన్న" సత్యమును బయలుపరుస్తున్నది. రోమా 5:20 ప్రకారము పాపము యెక్కడ "విస్తరించెనో" అక్కడ దేవుని కృప "అపరిమితముగా విస్తరించెను". అనేకసార్లు మన జీవితములలో మనము దేవుని అద్భుతకరమైన హస్తము అగుపడాలని కోరుకుంటాము. అయితే, అరణ్యములో ఇశ్రాయేలీయుల అనుభవము మనకు తెలుపుచున్న ప్రకారము మన హృదయములు దుష్టత్వముతోను, మొండితనముతోను నిండుకొని వుంటాయి. దానిని బట్టి దేవుడు మనపట్ల ఏమి జరిగించినను, మన హృదయములు ఆయన యెడల "రాతిగా" మార్చుకొని, ఆయన కార్యములు యెరుగక యుంటాము.

1. ఇశ్రాయేలీయుల పితరుల పాపము, వారి మొండితనము - వ. 6-7
2. దేవుని రక్షణ, ఆయన ఉద్దేశ్యము - వ. 8
3. అద్భుత రీతిగా ఆరిపోయిన ఎర్ర సముద్రము - వ. 9ఎ
4. తన ప్రజలకు దేవుడు కలిగించిన విడుదల- వ. 9బి-11

అవును, మనము యోగ్యులము కానప్పటికీ, దేవుడు మనలను విమోచింప గలడు. ఇశ్రాయేలీయుల చరిత్ర యీ విషయమును రుజువు చేయుచున్నది. దేవుడు తన మహా పరాక్రమమును చూపించ గోరుచున్నాడు.

**ధ్యాన వచనము 8 :** *అయినను తన మహా పరాక్రమమును ప్రసిద్ధి చేయుటకై ఆయన తన నామమును బట్టి వారిని రక్షించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేసి, నా జీవితములో నీ శక్తిని, నీ ఉద్దేశ్యములను అలక్ష్యము చేసినందుకు నన్ను క్షమింపుము.*

ఇశ్రాయేలీయులు దేవునియందు నమ్మిక యుంచి, వెంటనే ఆయన యొద్ద నుండి తొలగి పోవడమనే విషయము మనకు యెంతో ఆశ్చర్యమును కలిగిస్తుంది. మనము ఇశ్రాయేలీయుల కంటె మంచి వారమేమీ కాము. అనేకసార్లు మనము కూడా మనకు తెలియని రీతిలోనే దేవునియొద్ద నుండి తొలగిపోతుంటాము. దేవునిపట్ల మనము ప్రతి స్పందించే తీరు మన పరిస్థితులపై ఎంతో ఆధారపడి వుంటుంది. మన పరిస్థితులు బాగుంటే దేవుని స్తుతిస్తాము. పరిస్థితులు బాగా లేకపోతే సణుగుకుంటాము. ఇశ్రాయేలీయుల విషయములో ఆసక్తి కరమైన సంగతిని చూస్తున్నాము : దేవుడు వారి అవసరమును తీర్చాడు. కానీ *"వారి ప్రాణములకు ఆయన క్షీణత కలుగ జేశాడు"* (వ. 15). అనగా శారీరకంగా వారి ఆకలి తీరింది. కానీ వారి *'ఆత్మీయ ఆకలి'* బాగా పెరిగి, వారి ఆత్మీయ బలము ఎంతో సన్నగిల్లింది.

1. ఇశ్రాయేలీయుల విశ్వాసము బయలుపడుట – వ. 12
2. వెంటనే వారు దేవుని మరచిపోవుట – వ. 13
3. వారు దేవుని నమ్మే విషయములో విఫలమగుట – వ. 14
4. వారి ఆత్మీయ ఆహారము వారికి లోపించుట – వ. 15
5. వారి నాయకులను అనుసరించడంలో వారు వెనుకబడిపోవుట – వ. 16

మన అసరములన్నీ తీరుస్తానని వాగ్దానము చేసిన దేవుని అలక్ష్యము చేసిన యెడల గొప్ప మూల్యము చెల్లిస్తాము. మనము శారీరకంగా "తృప్తి పొందిన వారముగా" వుండి యుండవచ్చు. కానీ ఆత్మీయంగా ఎంతో "ఆకలి" కలిగియుందుము.

**ధ్యాన వచనము 13 :** *అయినను వారు ఆయన కార్యములను వెంటనే మరచిపోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ జీవితములో అన్నిటికంటె మించి నిన్ను కోరుకుంటున్నాను. ప్రతి అవసరత కొరకు నీ మీద సంపూర్ణముగా ఆధారపడెదను.*

అరణ్యములో ఇశ్రాయేలీయులకు కలిగిన సంగతులు మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడినవి (1కొరింథీ 10:11). మోషే పరిశుద్ధ పర్వతముమీద దేవుని ఆజ్ఞలను పొందుచుండగా, ఇశ్రాయేలీయులు వారి పాళెములో బంగారు దూడను సృష్టించుకొని, దానిని ఆరాధించుచుండిరి. మహిమగల దేవుని మరచిపోయి, ఆయన స్థానములో మనము విగ్రహములను సృష్టించుకొనుట ఎంత సులభము! ఇశ్రాయేలీయులు చేసిన తప్పిదమునుండి మనము సత్యమును జరిగించుట నేర్చుకొని, మన జీవితములో యెదురయ్యే ప్రతి పరిస్థితిలోను, ప్రతి సమయములోను దేవుని వెంబడించుదుము గాక!

1. ఇశ్రాయేలీయులు తమ పాపము యొక్క పరిణామమును అనుభవించుట - వ. 17
2. వారికి తీర్పు తీర్చుటకై దేవునినుండి అగ్ని వచ్చుట - వ. 18
3. వారు సృష్టించిన దూడ - వ. 19
4. దేవుని మహిమను సృష్టించబడిన జంతువు రూపమునకు వారు మార్చుట- వ. 20
5. వారు దేవుని క్రియలను మరచిపోవుట - వ. 21-22
6. వారిని నశింపజేయవద్దని మోషే దేవుని వేడుకొనుట - వ. 23

1 కొరింథీ 10:11 ప్రకారము ఇశ్రాయేలీయులకు జరిగిన సంగతులు మనకు "బుద్ధికలుగుటకై" వ్రాయబడినవి. 22 వ వచనములో ప్రాముఖ్యమైన మాటలు వ్రాయ బడినవి - "వారు తమ రక్షకుడైన దేవుని మరచిపోయిరి". దాని వలననే వారు దేవుని ఉగ్రతను యెదుర్కొనవలసి వచ్చింది.

**ధ్యాన వచనము 21 :** *ఐగుప్తు దేశములో గొప్ప కార్యములను చేసిన తమ రక్షకుడైన దేవుని మరచిపోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు చేసిన కార్యములను, చేయగల కార్యములను యెన్నటికీ మరువ కుందును గాక. నీ స్థానములో యితరులను నీకు బదులుగా కలిగి యుండకుందును గాక.*

ఇశ్రాయేలీయులు దేవుని స్వరమునకు ప్రతిస్పందించకుండా, ఆయనకు వ్యతిరేకంగా సణిగి, ఆయనయందు నమ్మికయుంచుటకు నిరాకరించిరని పై వాక్య భాగము స్పష్టంగా తెలియజేయుచున్నది. దీని ఫలితమేమనగా అరణ్య ప్రయాణములో వున్న ఆ తరము వారందరూ వాగ్దానము చేయబడిన దేశములోనికి ప్రవేశింపలేకపోయిరి. హెబ్రీ 3:19 ప్రకారము వారు తమ అవిశ్వాసముచేతనే కనాను దేశములోనికి ప్రవేశింపలేకపోయిరి. దేవుని యందు, ఆయన వాక్యమందు నమ్మిక లేకపోవుట మనకు ప్రమాదకరము. విశ్వాసులు సణుగుకొనుటను, మాటి మాటికీ తమ నిరాశను ఒకరితో ఒకరు వ్యక్త పరచుకొనుటను గమనిస్తే, నేటి దినములలోని మానవ హృదయము అరణ్య ప్రయాణములో ఇశ్రాయేలీయులు కలిగియున్న హృదయము ఒక్కటేయని తెలుసుకొను చున్నాము.

1. రమ్యమైన దేశమును గూర్చిన వాగ్దానమును ఇశ్రాయేలీయులు నిరాకరించుట– వ. 24ఎ
2. దేవుని మాటను నమ్ముటకు వారు నిరాకరించుట – వ. 24బి
3. వారు దేవునికి వ్యతిరేకంగా సణుగుకొనుట – వ. 25
4. దేవుడు ఇశ్రాయేలీయులకు ఓటమి కలుగజేసి, వారిని చెదరగొట్టుట – వ. 26–27

మనము దేవుని మాటలకు ప్రతిస్పందించని యెడల తీవ్రమైన పరిణామములను ఎదుర్కొంటాము. దేవుడు తన హస్తమును మనకు వ్యతిరేకంగా ఎత్తినయెడల మన తిరుగుబాటు మరియు సణుగుడు స్వభావమునకు తగిన ప్రతిఫలము పొందుతాము. ప్రతి సమయములోను ఆయన వాక్యమునకు విధేయులమై, సంతుష్టులముగా వుండ వలసిన అవసరత మనకున్నది.

**ధ్యాన వచనము 24 :** *వారు రమ్యమైన దేశమును నిరాకరించిరి. ఆయన మాట నమ్మక పోయిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు వ్యతిరేకంగా అనేకసార్లు సణగియున్నానని నీ సన్నిధిలో ఒప్పుకొనెదను. అయితే, నా జీవితములో యేది జరిగినను నీ చిత్తము నెరవేర్చుచూ, నీ వాక్యమునే నమ్ముకొని, నిన్ను విశ్వసించుచుందును గాక.*

దేవునికి కోపము పుట్టించునట్లు జీవించుట మన మూర్ఖత్వమవుతుంది. అది ఆశీర్వాదమునకు దారితీయదు. ఇశ్రాయేలీయులు మాటిమాటికీ దేవునికి కోపము పుట్టించునట్లు జీవించిరి. దేవుడు వారి పట్ల సహనము వహించాడు. అయితే ఒక సమయములో ఆయన తన కోపమును ప్రదర్శించుటవలన ఇశ్రాయేలీయులు తీవ్ర పరిణామములను ఎదుర్కొనిరి. పై వాక్య భాగము రెండు సంఘటనలను గూర్చి తెలుపుచున్నది - (1) ఇశ్రాయేలీయుల యొక్క విగ్రహారాధన, ఫీనెహాసు యొక్క విధేయత; (2) మెరీబా జలముల యొద్ద ఇశ్రాయేలీయుల సణుగుడు. అరణ్యములో ఇశ్రాయేలీయుల ప్రవర్తనను విమర్శించే ముందు మనకున్నట్లుగా ఆ దినములలో వారికి బైబిలు లేదన్న విషయము గమనించాలి. ఎండిపోయిన ఆ అరణ్యములో దేవుడు తన సన్నిధిని మరియు తన సంరక్షణను భౌతికమైన రీతిలో వారికి బయలు పరుస్తుండటంతో అటువంటి గుర్తులపైనే వారు ఆధార పడవలసియుండెను.

1. ఇశ్రాయేలీయులు విగ్రహారాధన చేసి, బలి మాంసమును తినుట - వ. 28
2. వారు దేవునికి కోపము పుట్టించి, తెగులుతో చనిపోవుట - వ. 29
3. తెగులు ఆగిపోవుట - వ. 30
4. ఫీనెహాసు నీతిమంతుడుగా ఎంచబడుట - వ. 31
5. మెరీబా జలముల యొద్ద ఇశ్రాయేలీయులు దేవునికి కోపము పుట్టించుట- వ. 32
6. మోషే పెదవులతో పాపముచేయుట - వ. 33

మన కష్టములు ఎంత తీవ్రమైనవైనను, మన అవసరములను తీర్చి, మన విధేయతకు తగినట్లుగా మనలను ఆశీర్వదిస్తానని దేవుడు వాగ్దానమిచ్చాడు. నీ సమస్యలకు యితర విధములైన పరిష్కారము కాకుండా, నీ పూర్ణ హృదయముతో దేవుని సహాయముకొరకు అర్థించుము.

**ధ్యాన వచనము 31 :** *నిత్యము తరములన్నిటను అతనికి ఆ పని నీతిగా యెంచబడెను.*

**ప్రార్థన:** *ప్రభువా, ఫీనెహాసు వలె నీ దృష్టికి సరియైనది చేసి, నీ ఘనతను, నీ మహిమను మాత్రమే లక్ష్యము చేయుదును గాక.*

ఇశ్రాయేలీయుల విగ్రహారాధనను గూర్చి చదువుట బాధాకరంగా వుంటుంది. అయితే అటువంటి పాపములో మనము పడిపోయే అవకాశం లేదనుకుంటే అది మన మూర్ఖత్వము, అపరిపక్వత అవుతుంది. ప్రతి దినము మనము విగ్రహారాధనను చూస్తున్నాము. కొలస్సి 3:5 లో పౌలు విగ్రహారాధనను "ధనాపేక్ష" గా వర్ణించుచున్నాడు. మనము కొన్నిసార్లు పొందలేని వాటిని కోరుకుంటుంటాము. మనము ఆశీర్వదింపబడే కోరికలు గాక మనలను నాశనపరచే దురాశనే అనేకసార్లు మనము కలిగి యుంటాము. యీ దినపు వాక్యభాగములో ఎంతో ప్రాముఖ్యమైన సత్యము 35 వ వచనములో వ్రాయబడింది–"*వారి క్రియలు నేర్చుకొనిరి*". యిది రాజీపడిన జీవితము యొక్క ప్రభావము. దీని ఫలితములు ఎంతో దుర్భరంగా వుండగలవు. మన చుట్టువున్న లోకముతో రాజీ పడకుండా వుండుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక ! '*జీవము గల దేవుని వాక్యమనే*' సందేశమును మనము అనుసరించెదము.

1. ఇశ్రాయేలీయులు అన్యజనులను నాశనము చేయకపోవుట – వ. 34
2. వారి అవిధేయత '*రాజీ పడే జీవితము*' వైపునకు దారితీయుట – వ. 35
3. విగ్రహములను సేవించాలన్న వారి నిర్ణయము వారికి ఎంతో నష్టము కలిగించుట – వ. 36
4. వారు దయ్యములకు బలులు అర్పించుట– వ. 37
5. తమ పిల్లలను దయ్యములకు బలిగా అర్పించుట – వ. 38
6. వారు తమ క్రియలచేత అపవిత్రులైరి – వ. 39

ఎంత దుర్భరమైన పరిస్థితి! దేవుని ప్రజలు యిటువంటి భయంకర క్రియలు జరిగించుటకు ఎట్లు దిగజారగలరు? యిది అవిశ్వాసము మరియు దేవునికి, ఆయన వాక్యమునకు తిరుగుబాటు చేయుట వలన మొదలవుతున్నది.

**ధ్యాన వచనము 35 :** *అన్యజనులతో సహవాసము చేసి, వారి క్రియలు నేర్చుకొనిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితమును నీకు తిరిగి అప్పజెప్పుకొనుచున్నాను. యీ లోకములో అన్ని రకములైన విగ్రహారాధన, రాజీపడు స్వభావమునకు వ్యతిరేకముగా నిలబడుటకు నాకు సహాయము చేసి, బలమును అనుగ్రహించుము.*

అరణ్యములో ఇశ్రాయేలీయుల కథ దుర్భరంగా వుండింది. అయితే వారు కనాను దేశములో జీవించుట కూడా విషాదకరంగా వుండింది. "న్యాయాధిపతుల" పరిపాలనా కాలంలో ఇశ్రాయేలీయులు పాపము, శత్రుదాడి, బంధకము, బానిసత్వము మరియు విడుదల అను చక్రము ద్వారా వెళ్లుచుండిరి. యీ దినపు వాక్యభాగము వారి బాధాకరమైన చక్రముతో కూడిన జీవితమును గూర్చి తెలియజేయుచున్నది. మనందరి జీవితములలో కూడా యిది సాధారణంగా యెదుర్కొనే అనుభవమైయున్నది. మనము దేవునిచేత విడుదల పొందియుండి, తిరిగి పాపము, అవిధేయతలో పడిపోయి, మన సొంత యిచ్ఛలకు బానిసలమై, సాతాను ఎదిరింపులు ఎదుర్కొంటాము. అపుడు దేవునికి మొఱ పెట్టుదుము, దేవుడు మనలను విడిపించును. మన మొఱలు వినుటకు దేవుని చెవులు ఎల్లప్పుడూ సిద్ధంగా వున్నందుకు ఆయనకు వందనములు చెల్లించుము.

1. తన ప్రజల పట్ల దేవుని ప్రతిస్పందన – వ. 40
2. అన్యజనులు దేవుని ప్రజలమీద రాజ్యము చేయుట – వ. 41
3. బానిసత్వము యొక్క ఫలితము – వ. 42
4. దేవుడు అనేక పర్యాయములు తన ప్రజలను విడిపించుట – వ. 43ఎ
5. దేవుని ప్రజలు బానిసత్వములోనికి వెళ్లుటకు గల కారణము – వ. 43బి

అవును, ఇశ్రాయేలీయులు *"తమ దోషముచేత హీన దశ నొందిరి"*. పాపము మనలను అటువంటి స్థితికి తీసుకు వెళుతుంది. అది క్రూరత్వముతో కూడిన యజమానిగా మన జీవితములపై పట్టుగలిగి యుండును. అప్పుడు దాని ఫలితములు మనము ఊహించిన దానికంటె దుర్భరముగా వుండును.

**ధ్యాన వచనము 43 :** *అనేక పర్యాయములు ఆయన వారిని విడిపించెను. ఆయినను వారు తమ ఆలోచనను అనుసరించి, తిరుగుబాటుచేయుచు వచ్చిరి. తమ దోషముచేత హీన దశ నొందిరి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీకు వ్యతిరేకముగా పాపము చేయుట వలన కలుగు దుఃఖకరమైన పర్యవసానమును నేనెన్నటికిని మరువకుందును గాక.*

ఇశ్రాయేలీయుల పాపము, తిరుగుబాటు, బానిసత్వము మరియు ఓటమిలను లెక్క చేయకుండా వారు తన సహాయము కొరకు మొఱపెట్టినపుడు దేవుడు వారిని విమోచించాడు. ఎంత అద్భుతకరమైన దేవుడు మనకున్నాడు! ఆయన మనలను ప్రేమిస్తున్నాడు. ఆయన కృప మన పాపముకంటె గొప్పది. ఆయన తన నిబంధనను జ్ఞాపకము చేసుకుంటాడు గనుకను, ఆయన గొప్ప కనికరముగల దేవుడు గనుకను మనకందరికి నిరీక్షణ యున్నది. మన పాపమును ఒప్పుకొని, పశ్చాత్తాప పడినపుడు మన దేవుడు మనలను క్షమించి, రక్షిస్తాడు. మనము దేవునితో సంబంధమును సరిజేసుకున్నప్పుడు కనికరము పొందెదమని సామెతలు 28:13 లో దేవుని వాక్యము సెలవిచ్చుచున్నది.

1. తన ప్రజల రోదనమును దేవుడు వినును – వ. 44
2. తన నిబంధనను దేవుడు జ్ఞాపకము చేసుకొనుట – వ. 45
3. తమను చెరగొని పోయిన వారి దృష్టిలో ఇశ్రాయేలీయులు కనికరము పొందునట్లు దేవుడు చేయుట – వ. 46
4. తమను రక్షించి, స్తుతి పొందుమని ఇశ్రాయేలీయులు దేవునికి మనవి చేయుట– వ. 47
5. దేవుని స్తుతించుట కొరకైన తీర్మానము – వ. 48

యీ కీర్తన యెంతో చక్కని మాటలతో ముగియుచున్నది – *"ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యుగములన్నిటను స్తుతి నొందును గాక! ప్రజలందరు ఆమేన్ అందురు గాక! యెహోవాను స్తుతించుడి".* యింకా యేమి చెప్పగలము? దేవుని స్తుతించెదము.

**ధ్యాన వచనము 44 :** *అయినను వారి రోదనము తనకు వినబడగా వారికి కలిగిన శ్రమను ఆయన చూచెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నరకము తప్ప దేనికిని అర్హుడను కాని నాపట్ల నీ అపారమైన కరుణను కనుపరచినందుకు నీకు వందనములు. నా విమోచకుడా, నిన్ను స్తుతించెదను.*

యీ కీర్తన ఒక పాటగా పాడ బడుటకు వ్రాయ బడినది. యీ కీర్తనలోని 8,15,21, మరియు 31 వ వచనములలో “ఆయన కృపనుబట్టియు, నరులకు ఆయన చేయు ఆశ్చర్యకార్యములనుబట్టియు వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురు గాక” అను పల్లవి దేవుని స్తుతించుటకు వ్రాయబడినది. యీ కీర్తన యొక్క ప్రారంభ వచనములలో దేవుడు తన ప్రజలను అరణ్యములో వారు పొందుచున్న కష్టముల నుండి వారిని విమోచించినందుకు ఆయనను స్తుతించి, ఆయనకు వందనములు చెల్లించ వలెనని తెలుపబడినది. బహుశా నీవు కష్ట సమయము గుండా వెళుతూ, దేవుడు నీ కష్టమును గూర్చి యెరిగి యున్నాడా, ఆయన నిన్ను సంరక్షించి, నీకు సహాయము చేయగలడా అను ప్రశ్నలతో జీవిస్తున్నావేమో. యీ వాక్యభాగములో స్తుతింపబడుతున్న దేవుడు నిన్ను విడిపించగలడన్న నిశ్చయత కలిగియుండుము. ఆయనకు మొఱపెట్టుము.

1. యెహోవా దయాళుడు. యిది దేవుని గుణము – వ. 1
2. బంధకములనుండి విమోచింపబడిన దేవుని ప్రజలు– వ. 2–3
3. అరణ్యములో నున్న పరిస్థితులు– వ. 4–5
4. దేవుని ప్రజలు ఆయనకు మొఱపెట్టుట – వ. 6
5. దేవుడు తన ప్రజలను నివాసపురమునకు చేర్చుట – వ. 7
6. దేవుని స్తుతించుటకై పిలుపు – వ. 8

దేవుడు ఎంతో దయాళుడు గనుక మన మొఱలను ఆయన ఆలకిస్తాడు. ఆయన కృప నిత్యముండును.ఆయన “నరులకు ఆశ్చర్యకార్యములు జరిగిస్తాడు”. యిప్పుడే దేవుని స్తుతించి, నీ యెడల జరిగించిన సమస్తమునుబట్టి ఆయనకు వందనములు చెల్లించుము.

**ధ్యాన వచనము 8 :** *ఆయన కృపనుబట్టియు, నరులకు ఆయనచేయు ఆశ్చర్యకార్యములను బట్టియు వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురు గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు పెట్టిన మొఱలను ఆలకించినందుకు నీకు వందనములు. నీ ఆశ్చర్యకరమైన కృపనుబట్టి, నా జీవితములో నీవు చేయు కార్యములనుబట్టి నీకు వందనములు.*

దేవునికి మొఱపెట్టినపుడు మనము నిరీక్షణ కలిగి యుంటాము. పై వాక్యభాగములో *"బాధచేతను, ఇనుపకట్లచేతను బంధింపబడినవారై, చీకటిలోను, మరణాంధకారములోను"* నివసించు వారిపట్ల దేవుని ప్రతిస్పందనను గూర్చి చదువుచున్నాము (వ. 11). అయితే, *"కష్ట కాలమందు వారు యెహోవాకు మొఱపెట్టగా, ఆయన వారి ఆపదలలో నుండి వారిని విడిపించెను"*(వ. 13). దేవుని మంచితనమునుబట్టి మరియు ఆయన జరిగించిన ఆశ్చర్య కార్యములనుబట్టి ఆయనను స్తుతించుటకు యిది చక్కని కారణమై యున్నది. మనజీవితములో శ్రమ, ఆపద ఎంత గొప్పవైనను మనలను విమోచించి, మన పరిస్థితులన్నిటిని తన మహిమకొరకు మరియు మన మేలు కొరకు వాడుకొనుటకు దేవుడు సమర్థుడై యున్నాడు.

1. దేవుడు కలిగించు తృప్తి – వ. 9
2. పాపముతో కూడిన తిరుగుబాటు – వ. 10
3. మానవులెదుర్కొనే మరణాంధకారము – వ. 11
4. వారి పరిస్థితి యొక్క తీవ్రత – వ. 12
5. దేవుడనుగ్రహించు రక్షణ – వ. 13-14
6. దేవునికి స్తుతియాగము చేయుట – వ. 15

దేవుని కృపనుబట్టి ఆయనను స్తుతించాలన్నది యీ కీర్తనయొక్క సందేశము. మనము దేవునితో సంబంధమును సరిజేసుకొని, విమోచనకొరకు ఆయనకు మొఱ పెట్టినట్లయితే ఆయన ప్రతిస్పందిస్తాడు.

**ధ్యాన వచనము 13 :** *కష్టకాలమందు వారు యెహోవాకు మొఱపెట్టిరి. ఆయన వారి ఆపదలలో నుండి వారిని విడిపించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో నేను సృష్టించుకునే ప్రతి గందరగోళ పరిస్థితినుండి నన్ను రక్షిస్తూ వచ్చుచున్నందుకు నీకు వందనములు.*

యీ వాక్యభాగములోని ప్రతి వచనమునకు "దేవుని కృపనుబట్టి మరియు ఆయన ఆశ్చర్య కార్యములనుబట్టి దేవుని స్తుతించుడి" అను పల్లవి వర్తిస్తున్నది. యీ వాక్య భాగము మరొకసారి దేవుడు మన మొఱలను విని, మన ఆపదలనుండి మనలను విడిపిస్తాడన్న సందేశమును తెలియజేయుచున్నది. 17 వ వచనములో చెప్పబడినట్లు మన సొంత పాపమునుబట్టి అనేకసార్లు మనము బాధను కొనితెచ్చుకుంటాము. మన పాపమును ఒప్పుకొని, దానిని విడిచిపెట్టుటద్వారా మాత్రమే మన బాధకు పరిష్కారము (సామెతలు 28:13). మన సొంత మూర్ఖత్వమునుబట్టి మనము అనేక ఆపదలెదుర్కొని, వాటి పరిణామములను అనుభవించాల్సి వస్తుంది. అయితే, మరొకసారి, మనము దేవునికి మొఱపెట్టి, ఆయనమీద ఆధారపడినట్లయితే, ఆయన మనలను విమోచించును.

1. దేవుడు ప్రదర్శించే బలము - వ.16
2. మన పాపము వలన మనకు కలిగే సమస్య - వ.17
3. తద్వారా మనము అనుభవించే యాతన - వ.18
4. దేవుని సహాయముకొరకు మనవి - వ.19
5. దేవుడు విడుదల కలిగించే విధానము - వ.20
6. దేవుడు మన యొద్దనుండి కోరుకుంటున్న స్తుతి - వ.21

మన పాపపు వైఖరి మరియు క్రియలు అనేకసార్లు మనకెంతో దుఃఖమును, వేదనను కలిగిస్తాయి. మనము మన పాపములొప్పుకొని, పశ్చాత్తాప పడినట్లయితే మన దుఃఖపూరిత పరిస్థితినుండి వెలుపలికి రాగలుగుతాము. మనలను క్షమించి, మనకు విడుదల కలుగ జేయుటకు దేవుడు సిద్ధముగా వున్నాడు.

**ధ్యాన వచనము 20 :** *ఆయన తన వాక్కును పంపి వారిని బాగుచేసెను. ఆయన వారు పడిన గుంటలలోనుండి వారిని విడిపించెను.*

**ప్రార్థన:** *ప్రభువా, ఆశ్చర్యకరమైన నీ క్షమాపణనుబట్టి నీకు వందనములు. నా జీవితములో నేను సృష్టించుకున్న ఆపదలలోనుండి నన్ను విడిపించుటకు సంసిద్ధుడవుగా వున్నందుకు నీకు వందనములు.*

పై వాక్యభాగములో "తుఫాను" వలన సముద్రములో ప్రయాణించే నావికులు ఎంతో అనుభవజ్ఞులైనప్పటికీ మత్తులైన వారివలె "ముందుకు వెనుకకు దొర్లుదురని" స్పష్టమైన రీతిలో వివరింపబడిన తీరును చూచిన యెడల మన జీవితములలో ప్రభువు మనకు ఎంతగా అవసరమై యున్నాడన్న సంగతి గుర్తు చేయబడుచున్నాము. సముద్రము యొక్క బలము దేవుడు ఎంత గొప్పవాడన్న సత్యమును గుర్తు చేయుచున్నది. సృష్టికర్తయైన దేవుడు సముద్రమును "నిమ్మళింప జేసి", తుఫానులో చిక్కుకున్న వారు సంతోషించి, ఊరట పొందునట్లు చేయును. మన జీవితములలో కూడా మనకు కలిగే అనేక ఆపదలు తుఫానువలె వున్నప్పటికీ, మనము విడుదలకొరకు మొఱపెట్టినయెడల దేవుడు మన ఆపదలను తొలగించి, మన జీవితములు *"శాంతింప జేయును"*.

1. దేవుడు కోరుకునే కృతజ్ఞతార్పణలు – వ. 22
2. దేవుని శక్తికి సాక్ష్యముగా నున్న సముద్ర జలములు – వ. 23–24
3. దేవుడు కలుగజేసే తుఫాను – వ. 25
4. తుఫానుచేత కలవరపడుచున్న ప్రాణము – వ. 26
5. నావికులు తుఫాను మధ్యలో ముందుకు, వెనుకకు దొర్లుట – వ. 27
6. వారు దేవునినుండి పొందే రక్షణ – వ. 28
7. దేవుడు అనుగ్రహించే ప్రశాంతత – వ. 29
8. దేవుడు ప్రజలకు అనుగ్రహించే క్షేమము – వ. 30
9. దేవుని కృపను గూర్చి తెలియజేయుట – వ. 31

మన జీవితములలోని తుఫానులు దేవుని మహా బలముచేత అణచి వేయబడును. యిందులో సందేహించాల్సిన అవసరము లేదు.

**ధ్యాన వచనము 29 :** *ఆయన తుఫానును ఆపివేయగా దాని తరంగములు అణగిపోయెను.*

**ప్రార్థన:** *ప్రభువా, కలవరపడిన నా ఆత్మకు నీవు సమాధానము కలుగజేసి, నా జీవితములో కోల్పోయిన నెమ్మదిని నీవు నాకు తిరిగి కలుగజేసిన విధమునుబట్టి నిన్ను స్తుతించెదను.*

పై వాక్యభాగములో వాతావరణములోని నీటివనరులు నీతిమంతులకును, అనీతి మంతులకును సమానముగా దయచేయుటనుబట్టి దేవుని కృప యిరువురికీ బయలు పరచబడుచున్నదని తెలుసుకొనుచున్నాము. అంతేగాక మన పాపము, చెడుతనమును బట్టి నీటిసమస్య, పంటలు పండకపోవడంలాంటివి జరుగుచున్నవి. ఇశ్రాయేలు విషయములో కూడా యీ సత్యము వర్తిస్తున్నది. అవును, అనేకసార్లు మనము చేసిన దానినిబట్టి లేదా చేయని దానినిబట్టి మనకున్న కష్టములను మనము అనుభవించు చున్నాము. సొలొమోనుతో దేవుడు చాలా సంవత్సరముల క్రిందట సెలవిచ్చినట్లు, *"మన దేశము స్వస్థ పరచబడాలంటే"*, మన పూర్ణ హృదయములతో దేవుని యొద్దకు వచ్చి, *"చెడు మార్గములను విడచిపెట్ట వలయును"* (2 దినవృత్తాంతములు 7:14).

1. సమాజము ఆయనను స్తుతించ వలెను – వ. 32
2. మన దుష్టత్వమునుబట్టి దేవుడు కలిగించే మార్పులు – వ. 33–34
3. మనము పశ్చాత్తాపపడిన యెడల మనము పొందే ఆశీర్వాదము – వ. 35–37

ప్రజల పాపము, అవిధేయతలనుబట్టి దేశములు, భూములు నష్టపోవుచున్నవి. సామెతలు 14:34 లో, "నీతి జనములు ఘనత కెక్కుటకు కారణము. పాపము ప్రజలకు అవమానము తెచ్చును" అని వ్రాయబడినది. మనము దేవునికి మరియు ఆయన ఆజ్ఞలకు వ్యతిరేకంగా యెంతో పాపము జరిగించినప్పటికీ ఆయన గొప్ప సహనము మనపట్ల వహించియున్నాడు. అయితే, మనము వర్ధిల్లి, ఆర్థికంగా ఎదిగినప్పటికీ, మన పాపమును బట్టి పశ్చాత్తాపపడని యెడల ఆయన తన తీర్పును మనపై తీసుకువచ్చును.

**ధ్యాన వచనము 32:** *జన సమాజములో వారాయనను ఘనపరచుదురు గాక. పెద్దల సభలో ఆయనను కీర్తించుదురు గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, మేము పాపులము, అవిధేయులము అయినప్పటికీ, నీ దీర్ఘశాంతము, కరుణను మా పట్ల కనుపరచినందుకు నీకు వందనములు. మా పాపములను నీ యెదుట ఒప్పుకొని, పశ్చాత్తాపపడుచున్నాము.*

పై వాక్యభాగములో యివ్వబడిన చివరి సారాంశము దేవుని కృపను గూర్చి అధ్యాయమంతటిలో మునుపు చెప్పబడిన దానిని గుర్తు చేయుచున్నది. తాను తన ప్రజలను ఆశీర్వదింపగా వారు "అధికముగా సంతానాభివృద్ధి" పొందిరని దేవుడు సెలవిచ్చుచున్నాడు. తరువాత వారి అరణ్య ప్రయాణములను గూర్చి మరియు ఒక "మందగా" వారిని తన ప్రేమతో సంరక్షించిన విషయమును గూర్చియు దేవుడు గుర్తు చేయుచున్నాడు. యీ అధ్యాయము యొక్క చివరి వచనములో యింతకు ముందు వ్రాయబడిన మాటలన్నిటి బట్టి ఏమి తెలుసుకోవాలన్న విషయము వ్రాయబడినది: మనము బుద్ధిమంతులమై, దేవుడు తన ప్రజలను ఎలా విలువ కడుతున్నాడన్న విషయమును గ్రహించిన యెడల "యెహోవా కృపాతిశయములను" తలపోసుకునే వారమగుదుము. అనేకసార్లు దేవుడు మన పట్ల చూపుతున్న ప్రేమ, కనికరములను గమనించుటలో మనము విఫలమవుతుంటాము. ఆయన మన సణుగుడును ఓర్చుకొని, మన పాపములను క్షమించి, మన వ్యాధులను నయపరచి, మన అవసరములు తీర్చుచున్నాడు.

1. దేవుని ఆశీర్వాదము - వ. 38
2. దేవుడు తన ప్రజలను తగ్గింపజేయుట - వ. 39
3. దేవుని ప్రజలు మోయుచున్న భారము - వ. 40
4. వారి బానిసత్వమునుండి దేవుడు వారిని విడిపించుట - వ. 41
5. దానిని బట్టి దేవుని ప్రజలు సంతోషించుట - వ. 42
6. దేవుని కృపాతిశయము జ్ఞాపకము చేసుకొనబడుట - వ. 43

గతములో చేసిన పొరపాట్ల నుండి నేర్చుకొనడమనేది ఎంతో ముఖ్యమైన విషయము. దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులకు జరిగినదంతయు భవిష్యత్తులోని మానవులకందరికీ ఒక పాఠముగా వున్నది. దేవుడు ఒకే రీతిగా వున్నాడు. ఆయన మారడు.

**ధ్యాన వచనము 43 :** *బుద్ధిమంతుడైన వాడు ఈ విషయములను ఆలోచించును. యెహోవా కృపాతిశయములను జనులు తలపోయుదురు గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను అనుదినము సంపూర్ణమైన విశ్వాసము, ప్రేమతో నీ కొరకు జీవించునట్లు గతములోని నీ యొక్క మార్గములు, పనుల నుండి నేర్చుకొనుటకు నాకు సహాయము చేయుము.*

దావీదు పాడుతూ, దేవుని మహిమ కొరకై వాయిద్యములు వాయిస్తూ, తన స్తుతిని దేవుని పట్ల వ్యక్త పరచుచున్నాడు. దేవుని స్తుతించిన తరువాత 6 వ వచనములో తనను విడిపించి, రక్షించి, తనకుత్తరమిమ్మని ఆయన దేవునికి మనవి చేయుచున్నాడు. దేవుడు తన గుణము మరియు బలమును బట్టి దావీదు మనవికి జవాబివ్వగలడు. దేవుడు ఏమై యున్నాడో మరియు ఆయన యేమి జరిగించ గలడో వాటిని బట్టి ఆయనను మనము స్తుతించినపుడు మన అవసరతల నిమిత్తము ఆయనకు మొఱపెట్టే స్థితిని పొందగలము. పై వాక్యభాగములోని మొట్టమొదటి వచనము "దేవా, నా హృదయము నిబ్బరముగా వున్నది" అని మొదలయ్యింది. యీ వాక్యము మనమందరము ఆలోచించ వలసిన ఒక బలమైన సాక్ష్యము. దేవుని స్తుతి, ఆరాధన యందు మన హృదయములు "నిబ్బరముగా" వుండుట మన జీవితములలో యెంతో మేలు కలిగించే విషయము. యిటువంటి నిబ్బరమైన హృదయము కలిగియుండుట మన మొట్టమొదటి ప్రాధాన్యత గాను, మన అనుదిన జీవితములలో ప్రధానాంశముగాను వుండవలెను.

1. కీర్తనాకారుడు తన స్తుతిని దేవునికి వ్యక్త పరచుట – వ. 1
2. ఉదయముననే లేచి కీర్తనాకారుడు దేవుని స్తుతించుట – వ. 2
3. తన స్తుతిని జనముల మధ్య దేవునికి చెల్లించుట – వ. 3
4. దేవుని కృప మరియు సత్యముల యొక్క ఔన్నత్యము – వ. 4
5. కీర్తనాకారుడు దేవుని హెచ్చించుట – వ. 5
6. తనకు వుత్తరమిచ్చి, తనను రక్షింపుమని కీర్తనాకారుని మనవి – వ. 6

మన హృదయములోని అవసరతలను దేవుని యెదుటకు తీసుకువచ్చే ముందు మనము దేవుని స్తుతించి, ఆరాధించుటకు నేర్చుకొనవలెనన్న బలమైన పాఠమును యీ దినపు ధ్యానముద్వారా తెలుసుకున్నాము. మన మొఱలను వినుటలో దేవుడు ఎన్నడూ అలసిపోనందుకు ఆయనకు వందనములు చెల్లించుము. అయితే ఆయనను ఆరాధించ వలసిన వారముగా వున్నాము.

**ధ్యాన వచనము 3 :** *జనుల మధ్య నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను. ప్రజలలో నిన్ను కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవేమైయున్నవో దానినిబట్టి, నీవు జరిగించు సమస్తమునుబట్టి నిన్ను స్తుతించెదను. నేను కలుసుకొను ప్రతి ఒక్కరు నేను నిన్ను యెంతగా ప్రేమించునదీ, యెంతగా నిన్ను ఆరాధించునదీ తెలుసుకొనవలెనని ఆశపడుదును.*

ఇశ్రాయేలు ప్రజలకు ఎంత గొప్ప నిరీక్షణ యీ వచనములలో యివ్వబడియున్నది! యీ వాక్యభాగములో చెప్ప బడిన పట్టణములు, ప్రదేశములన్నియు ఒకానొక దినము వారికి చెందబోవుచున్నవి. ఎందుకనగా అవన్నియు దేవునికి చెందియున్నవి. ఆయన యీ స్థలములన్నిటిని తన అధీనములో కలిగియున్నాడు. ఆయన తన ప్రజలను విడిచిపెట్టలేదు. ఇశ్రాయేలు శత్రువులు నాశనము చేయబడెదరు. యిది ప్రస్తుత కాలమునకు సంబంధించిన గొప్ప ప్రవచనముగా వున్నది. 12 వ వచనములో "*మనుష్యుల సహాయము వ్యర్థము. శత్రువులను జయించుటకు నీవు మాకు సహాయము దయ చేయుము*" అని వ్రాయబడినది. యీమాటలు ఎంతో సత్యమైనవి. ఒకానొక దినము దేవుడు ఇశ్రాయేలుకు చేయబోవు సహాయమును యీ ప్రపంచములో ఎంతో బలమైన దేశములు మరియు నాయకులు కూడా చేయలేరు. మన నమ్మిక సంపూర్ణముగా దేవుని యందే కలిగియుండవలెను. ఆయన వాగ్దానములు నెరవేరును.

1. దేవుని పరిశుద్ధతనుబట్టి ఆనందించుట – వ. 7ఎ
2. సమస్తమును పరిపాలిస్తున్న దేవుడు – వ. 7బి–9
3. దేవుడు మాత్రమే సహాయపడగలడు – వ. 10
4. దేవుడు మాత్రమే విజయము నివ్వగలడు – వ. 11,13
5. మనుష్యుల సహాయము వ్యర్థము – వ. 12

మన నమ్మిక యితర దేశముల ఆయుధములు, వారి వనరులయందు గాక దేవుని యందే కలిగియుండవలెను. మనకు యెదురయ్యే అడ్డంకులు, మన శత్రువులు ఎంత బలంగా, భయానకంగా వున్నప్పటికీ, మన దేవుడు మనలను విడిపించుటకు సమర్థుడు.

**ధ్యాన వచనము 13 :** *దేవుని వలన మేము శూర కార్యములు జరిగించెదము. మా శత్రువులను అణగద్రొక్కువాడు ఆయనే.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు రాజులకు రాజువును, ప్రభువులకు ప్రభువును, సమస్తమును పరిపాలించుచున్న దేవుడవు అయినందుకు నీకు వందనములు.*

దావీదు ఎంతో గొప్ప విమర్శలకు లోనై, తన శత్రువుల దాడికి అనేకసార్లు గురి కావలసి వచ్చింది. యిది సులభమైన విషయము కాదు. అంతేగాక యిది గొప్ప హాని కలిగించే విషయము. యితరులు మనపట్ల ప్రదర్శించే అసూయ, ద్వేషము, తీర్పు తీర్చే వైఖరి, కనికరము లేనితనము మొదలగునవి హాని కలిగిస్తాయి. దావీదుకు ఎదురైన అనుభవము మనము కూడా ఎదుర్కుంటాము. నేటి దినములలో INTERNET ద్వారా ప్రజలు యితరులను తాము ముఖాముఖిగా చూడనప్పటికీ, ఒకరిని విమర్శించే హక్కు లేకపోయినప్పటికీ యితరులను విమర్శిస్తుంటారు. యితరుల గురించి పుకార్లు పుట్టించి, తప్పుడు మాటలు ప్రచారం చేసి, వారి సేవను, వారికున్న పేరును నాశనపరిచే విధంగా ప్రవర్తిస్తుంటారు. దీని గురించి మనమేమి చేయగలము? నీ భారము దేవుని పాదముల యొద్ద ఉంచుము. *"పగ తీర్చుట నాపని అని ప్రభువు చెప్పుచున్నాడని"* రోమా 12:17-21 లో పౌలు పేర్కొన్నాడు. కీడుకు ప్రతికీడు చేయుటకు ఎన్నడూ ప్రయత్నించవద్దు. అది పనికిరాదు. అట్లు చేయుట వలన దేవుని ఆశీర్వాదము మనపైన వుండదు.

1. దేవుని సహాయముకొరకు దావీదు మనవి - వ. 1
2. ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడుచున్న వారి కపటము - వ. 2
3. దావీదు శత్రువులు నిర్నిమిత్తముగా ఆయనతో పోరాడుట - వ. 3
4. దావీదు ప్రార్థనమీద మాత్రమే ఆధారపడుట - వ. 4
5. యితరులను ప్రేమించి, వారికి మేలు చేయుట వలన కలిగే నిరాశ - వ. 5

అవును, యితరులు నిన్ను నొప్పించినపుడు వారికి జవాబిచ్చి, వారికి నష్టము చేసి, వారిమీద పగ తీర్చుకోవాలనిపిస్తుంది. అయితే అట్లు చేయవద్దు. దేవునిమీద ఆధారపడి, ఆయనకొరకు ఓపికతో కనిపెట్టుకొనుము.

**ధ్యాన వచనము 1 :** *నా స్తుతికి కారణభూతుడవగు దేవా, మౌనముగా వుండకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను పగ తీర్చుకొనకుండా, నా పరిస్థితిని నీ చేతులలో వుంచి, నన్ను నేను ప్రార్థనకు అప్పగించుకొందును.*

యీ వాక్య భాగము దుష్టుల మీదకు రాబోయే దేవుని తీర్పు గురించి తెలియజేయు చున్నది. దుష్టులు చేయు పనుల గురించి దావీదు యీ కీర్తన ప్రారంభ వచనములలో తెలిపాడు. యిప్పుడు దావీదు తన శత్రువులపై పగ తీర్చుకొనమని ప్రార్థిస్తున్నాడు. పగ తీర్చుకునే విషయములను మనము దేవునికి వదలివేయవలెను. 8 వ వచనములో, *"వాని జీవిత దినములు కొద్దివగునుగాక! వాని ఉద్యోగమును వేరొకడు తీసికొనునుగాక!"* అని దావీదు తనను అప్పగించిన అహితోపెలు విషయమై పలుకుచున్నాడు. అయితే యీ మాటలు అపొస్తులుల కార్యములు 1:20 లో ప్రభువైన యేసుక్రీస్తును అప్పగించిన ఇస్కరియోతు యూదాకు వర్తించుచున్నవి. సమస్తమును దేవుని కన్నులకు *"మరుగు లేక తేటగా"* వున్నవి (హెబ్రీ 4:13). యెవరు కూడా తప్పిదముతో తప్పించకొనలేరు.

1. దుష్టులు ఎదుర్కొనే పరిణామములు - వ. 6
2. వారు దోషులుగా తీర్పు పొందుట - వ. 7
3. ఇస్కరియోతు యూదాను గూర్చిన ప్రవచనము - వ. 8
4. దుష్టుల సంతానము - వ. 9-10
5. దుష్టుల ఆస్తి దోచుకొనబడుట - వ. 11
6. దుష్టులకు దయ చూపకుండా ప్రతీకారము తీర్చుకొనమని దావీదు దేవునికి మనవి చేయుట - వ. 12

దుష్టులకు ఏమి జరుగవలెనన్న విషయమును దేవుడు నిర్ణయిస్తాడు. దావీదు తనకు జరిగిన హానినిబట్టి తన బాధను వ్యక్తపరిచాడు. మనలో కూడా అనేకులము యితరులు మనతో సరిగా వ్యవహరించకపోతే, వారు మనపై తప్పుడు ఆరోపణలు చేస్తే లేదా నిష్కారణంగా మనపై దాడి చేస్తే అట్టి పరిస్థితులలో దావీదువలె ప్రతిస్పందిస్తాము. అయితే మనము అట్లుచేయకుండా మన సమస్యలను దేవుని హస్తములకు అప్పజెప్పవలసిన వారముగా వున్నాము (రోమా 12:17-21).

**ధ్యాన వచనము 7 :** *వాడు విమర్శలోనికి తేబడునప్పుడు దోషియని తీర్పు నొందును గాక. వాని ప్రార్థన పాపమగునుగాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను దేని విషయములోను పగ తీర్చుకొనకుండా, నా పరిస్థితిని నీ చేతులలో వుంచి, నీ నీతికరమగు మార్గములలో సమాధానము కలిగియుండుటకు నాకు సహాయము చేయుము.*

పై వాక్యభాగములో దావీదు తనను అప్పగించిన వారిమీద, తనకు హాని చేయ తలపెట్టిన వారిమీద దేవుని తీర్పు రావలెనన్న తన కోరికను మరొకసారి తెలియజేయుచున్నాడు. తన శత్రువుల స్వభావమును గూర్చి దావీదు పునరాలోచించి, దేవుడు వారికి తీర్పు తీర్చుట యుక్తమే అని అభిప్రాయపడుతున్నాడు. అయితే, యింతకు ముందు మనము చూసినట్లుగా తీర్పునకు సంబంధించిన విషయములన్నిటిని నిత్యము నీతిని నెరవేరుస్తూ, సర్వభూమికి న్యాయాధిపతిగా వున్న దేవుని హస్తములకు మనము అప్పజెప్పవలెను (ఆదికాండం 18:25). తన శత్రువులపై పగ తీర్చుకొనమని దావీదు దేవునికి చేసిన ప్రార్థనలో దావీదు వైఖరి గమనించదగినది. దావీదు తన శత్రువుల విషయమై ప్రతీకారము కోరకుండా వారిని క్షమించి యుండవలసినదని మనము అభిప్రాయ పడవచ్చు. అయితే మనకు బుద్ధి చెప్పుటకు, జ్ఞానమనుగ్రహించుటకు దేవుని వాక్యములో యిలా వ్రాయబడినది. మనము శత్రువుల దాడిని యెదుర్కొని, హాని పొందినపుడు మనందరిలో కూడా దావీదు పొందిన భావములు కలుగుతాయి. అయితే ఆయన తన భావములను ప్రభువుతో చెప్పుకున్నాడన్నది ముఖ్యమైన విషయము.

1. తన శత్రువుల వంశము నిర్మూలించబడవలెనని దావీదు కోరుట - వ. 13
2. తన శత్రువుల తలిదండ్రులు తీర్పు తీర్చ బడవలెనని దావీదు కోరుట - వ. 14-15
3. దరిద్రులను హింసించిన దావీదు శత్రువులు - వ. 16
4. శపించుట దావీదు శత్రువులకు ప్రీతికరము - వ. 17
5. శపించుట వలన దావీదు శత్రువులు పొందిన శిక్ష - వ. 18-19
6. తన శత్రువులకు ప్రతీకారము చేయుమని దావీదు మనవి - వ. 20

మరొకసారి, ప్రతీకారము తీర్చుకునే విషయములను మనము దేవుని హస్తములలో వదలి వేయవలెను. దావీదు వ్రాసిన అనేక కీర్తనలలో శత్రువుపై ప్రతీకారము తీసుకొనుట అనేది ప్రధాన అంశముగా వున్నది. అయితే మనము ప్రతీకారము కోరుకొనకూడదు. కీడుకు ప్రతికీడు చేయకూడదు. దేవునికి మన పరిస్థితిని వదలి వేయవలెను.

**ధ్యాన వచనము 20 :** *నా విరోధులకు, నా ప్రాణమునకు విరోధముగా మాటలాడు వారికి ఇదే యెహోవా వలన కలుగు ప్రతీకారము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు అన్నివేళలందు ఏది సరియైనదో దానినే జరిగించుచు, న్యాయమైన నీ తీర్పును కలుగజేసే దేవుడవైనందుకు నీకు వందనములు.*

తన శత్రువుల మీద ప్రతీకారము తీర్చుకొనమని దేవునితో మనవి చేసిన దావీదు యీ వచనములలో తన కొరకు దేవుని కృపను, విమోచనను కోరుకుంటూ, మొఱ పెట్టుచున్నాడు. ఎండిపోయినట్లున్న తన ఆత్మీయ స్థితిని, శారీరక మరియు మానసిక అలసటను దేవుని ముందు ఒప్పుకొనుచున్నాడు. తన చుట్టు వున్న ప్రజలు తన పరిస్థితి గురించి యెరిగి యున్నారని తెలుసుకున్నాడు. వారు తనమీద *"నిందలు"* మోపుచుండిరి (వ. 25). అయితే మనము నేర్చుకొనవలసిన దేమనగా తన భారమంతటినీ తానెరిగియున్న దేవుని యొద్దకు దావీదు తీసుకువచ్చుచున్నాడు. *"నీ భారము యెహోవా మీద మోపుము. ఆయనే నిన్ను ఆదుకొనును"* అని కీర్తన 55:22 లో వ్రాయ బడినది.

1. దేవుని కృప మరియు విడుదలకొరకు దావీదు మొఱపెట్టుట – వ. 21
2. దావీదు మానసిక సమస్యలు తనకు నొప్పి కలిగించుట – వ. 22
3. దావీదు విశ్వాసములో బలహీనుడగుట – వ. 23
4. దావీదు శారీరకంగా బలహీనుడగుట – వ. 24
5. యితరుల ముందు తన సాక్ష్యము దెబ్బతినుట – వ. 25

దావీదు ఎదుర్కొన్న అనుభవములు మనకు కూడా ఎదురయినట్లయితే, మన పూర్ణ హృదయముతో దేవునికి మొఱ పెట్టవలెను. ఆయన సజీవుడైన దేవుడు. మనలను యెన్నడును విడువడు మరియు ఎడబాయడు.

**ధ్యాన వచనము 21 :** *యెహోవా ప్రభువా, నీ నామమునుబట్టి నాకు సహాయము చేయుము. నీ కృప ఉత్తమమైనది గనుక నన్ను విడిపింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను బాధలలో కూరుకునిపోయి, అడుగు ముందుకు వేయలేననుకొను సమయములో నీవు కృప గలిగి, నన్ను విడిపించు దేవుడవుగా నాకున్నందుకు నీకు వందనములు.*

యీ అధ్యాయపు ప్రారంభ వచనములలో తనపై దాడి చేసిన వారికి తీర్పు తీర్చమని దేవుని కోరుకున్న దావీదు ఆ తరువాత దేవుని "సహాయము" కొరకు మొఱపెట్టిన వాడై యిప్పుడు దేవుని "స్తుతించ" గోరుచున్నాడు. వారిపై ఎటువంటి తీర్పు వచ్చినా అది దేవుని "హస్తము" నుండి వచ్చినట్లుగా తెలుసుకొనమని దావీదు తన శత్రువులను కోరుతున్నాడు. దేవుని హస్తములకు మన విషయములను అప్పజెప్పడమనగా యిదే. నీకై నీవు ప్రతీకారము తీర్చుకోవాలని కోరుకోవద్దు. నీవు ప్రార్థించినపుడు నీ సంగతులను దేవుని హస్తములకు అప్పజెప్పుము. సమాధానమును కలిగియుండాలంటే యిట్లు చేయక తప్పదు. మనపై జరిగిన దాడి ఎంత హాని కలిగించినా లేదా ఎంత బాధాకరమైన అనుభవము ద్వారా మనము వెళ్ల వలసి వచ్చినా, సర్వాధికారియైన దేవుడు జరిగినదంతా స్పష్టంగా యెరిగియుండి, దానికంతటికీ జవాబు కలిగియున్నాడు. ఆయన యందు నమ్మిక యుంచుము.

1. తన శత్రువులు చూసి, తెలుసుకొనునట్లుగా తనకు సహాయము చేయుమని దావీదు దేవునికి మనవి చేయుట – వ.26–27
2. దావీదు కోరుతున్న సంతోషము – వ.28
3. తన విరోధులు సిగ్గు పడవలెనని దావీదు కోరుకొనుట – వ.29
4. దావీదు స్తుతితో దేవుని పట్ల ప్రతిస్పందించుట – వ.30
5. దేవుని రక్షణ యొక్క నిశ్చయత – వ.31

దేవుడు *"దరిద్రుల కుడిప్రక్కన నిలుచుచున్నాడు"*. ఆయన జరిగినదంతటినీ స్పష్టంగా చూసియున్నాడు. తనదైన మార్గములో తన సమయానుసారముగా ఆయన నీతిమంతులకు న్యాయము తీర్చి, దుష్టులపై తన తీర్పును తీసుకువస్తాడు.

**ధ్యాన వచనము 26-27 :** యెహోవా నా దేవా, యిది నీచేత జరిగినదనియు, యెహోవావైన నీవే దీని చేసితివనియు వారికి తెలియునట్లు నాకు సహాయము చేయుము. నీ కృపను బట్టి నన్ను రక్షింపుము.

**ప్రార్థన:** ప్రభువా, సమస్తము నీ చేతులలో వున్నందుకు నీకు వందనములు. నీ సమయానుసారము ప్రతి విషయమును సరిచేయుదువన్న గ్రహింపునుబట్టి విశ్రమింతును.

ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి ప్రవచించుచున్న కీర్తనలలో యిది ఒకటి. మత్తయి 22:41-46 లో పరిసయ్యులతో మాట్లాడుచున్నప్పుడు యేసుక్రీస్తు యీ కీర్తనలోని మాటలను ప్రస్తావించాడు. ప్రభువైన యేసుక్రీస్తును, ఆయన పరిచర్యను గూర్చి వర్ణిస్తున్న హెబ్రీ పత్రిక రచయిత ఆయన అబ్రహాము, అహరోను మరియు యితర యాజకులందరి కంటె గొప్పవాడని తెలియజేయుటకు పై వాక్యభాగములోని నాలుగవ వచనమును ఉదహరించాడు." మెల్కీసెదెకు క్రమము చొప్పున ఆయన నిరంతరము యాజకుడై యున్నాడు". ఆదికాండం 14వ అధ్యాయములో పేర్కొనబడిన యీ మెల్కీసెదెకు ప్రభువైన యేసుక్రీస్తే అయ్యుండవచ్చు. హెబ్రీ పత్రిక 7వ అధ్యాయములో యివ్వబడిన వివరణ యీ సత్యమును సూచిస్తున్నది. మెస్సీయ రాజులందరికి రాజైయుండి, ఒకానొక రోజు యీ భూమి మీద తన రాజ్యమును స్థాపించబోవుచున్నాడు. అందులో సందేహము లేదు. మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రవక్త, యాజకుడు మరియు రాజైయున్నాడు.

1. మెస్సీయ తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండుట - వ. 1
2. మెస్సీయ పరిపాలన - వ. 2
3. మెస్సీయ బలము మరియు ఆయన పరిశుద్ధత - వ. 3
4. మెస్సీయ యాజకత్వము - వ. 4
5. ఉగ్రత దినమందు మెస్సీయ రాజులను నలుగగొట్టుట - వ. 5
6. అన్యులకు తీర్పు తీర్చుటలో మెస్సీయ సార్వభౌమత్వము - వ. 6-7

మన కొరకు విజ్ఞాపన చేయుచున్న మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క యాజకత్వపు పరిచర్యనుబట్టి మన విశ్వాసము, ప్రార్థన ద్వారా తండ్రియైన దేవుని సన్నిధికి మనము ప్రవేశము కలిగియున్నాము.

**ధ్యాన వచనము 4 :** మెల్కీసెదెకు క్రమము చొప్పున నీవు నిరంతరము యాజకుడవై యుందువని యెహోవా ప్రమాణము చేసియున్నాడు. ఆయన మాట తప్పనివాడు.

**ప్రార్థన:** ప్రభువా, మనుష్యులెవరి ద్వారా కాకుండా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నీ సన్నిధిలోనికి నన్ను నేరుగా ప్రవేశింపజేసినందుకు నీకు వందనములు.

యీ కీర్తనలో "యెహోవా క్రియలు"మన ప్రత్యేక శ్రద్ధను మరియు స్తుతిని ఆకట్టుకొనుచున్నవి. యీ ప్రపంచములోను, మన జీవితములలోను దేవుడు జరిగించుచున్నదంతయు తానెవరైయున్నదీ మనకు తెలియజేయుట కొరకే. ఆయన గుణములు ఆయన క్రియలద్వారా బయలుపరచబడుచున్నవి. ఆయన జరిగించే సమస్తమును "మహిమా ప్రభావము"తో కూడియున్నది. తాను జరిగించిన సమస్తమును మనము జ్ఞాపకముంచు కొనవలెనని దేవుడు మనలను కోరుతున్నాడు. "నా పూర్ణ హృదయముతో నేను యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదనని" కీర్తనాకారుడు పలుకుచున్నాడు. మనము చెల్లించే స్తుతి చాలా వరకు పూర్ణహృదయముతో కాకుండా అర్ధాంగీకారమైన రీతిలో వుంటున్నది. మనము యితరులను విమర్శించినపుడు "ఆయన హృదయము అందులో లేదని" చెబుతుంటాము. అయితే మన విషయములో కూడా దేవుడు మన పూర్ణ సామర్థ్యము చొప్పున ఆయనను స్తుతించి, ఆయన చేసిన, చేయబోయే కార్యములను గూర్చి ప్రకటించి, యీ లోకమునకు ఆయన ఎవరన్నదీ తెలియజేయాలని మనలను కోరుతున్నాడు.

1. దేవుడు కోరుకునే స్తుతి- వ. 1
2. యెహోవా క్రియలయందు మనకుండవలసిన యిష్టము - వ. 2
3. ఆయన క్రియల క్రమము ఆయన గుణమును గూర్చి తెలియజేయుచున్నది- వ. 3-4
4. దేవుడు తన ప్రజలను సంరక్షించుట - వ. 5

అవును, దేవుడు "నిత్యము తన నిబంధనను" జ్ఞాపకము చేసుకుంటాడు. ఆయన వాగ్దానము చేసియున్నాడు. తన వాగ్దానమును ఆయన నెరవేరుస్తాడు. ఆయన విశ్వసనీయత యందు, కనికరమునందు మనము నమ్మిక కలిగియుండవలెను.

**ధ్యాన వచనము 4 :** ఆయన తన ఆశ్చర్యకార్యములకు జ్ఞాపకార్థ సూచనను నియమించియున్నాడు. యెహోవా దయాదాక్షిణ్యపూర్ణుడు.

**ప్రార్థన:** ప్రభువా, ఈ లోకములోను, నా జీవితములోను నీవు జరిగించినదంతటినిబట్టి నీకు స్తుతులు చెల్లించెదను. నీ కార్యములన్నిటిలోను నీవు ఎంతో ఆశ్చర్యకరుడవు.

నిన్నటి భాగములో “యెహోవా క్రియలు” ప్రత్యేక ఆకర్షణయై యుండగా పై వాక్య భాగము దేవుని “శాసనముల” గురించి తెలియజేయుచున్నది. దేవుడు ఎవరైయున్నదీ, ఆయన యేమి జరిగించినదీ తెలుసుకొనుటద్వారా దేవుని జ్ఞానమందు, ఆయన తీర్పులయందు నమ్మిక కలిగి, ఆయన చెప్పిన మాటలకు విధేయత చూపునట్లు మనము చేయబడెదము. మనము చాలా సులభంగా సొంత సామర్థ్యమునందు నమ్మిక కలిగి, మనకెదురయ్యే సమస్యలను మనమే పరిష్కరించు కొనగలమని అనుకుంటాము. అయితే, జీవితము గడిచే కొలదీ మనకు దేవుని సహాయము తప్పనిసరి అని తెలుసుకుంటాము. దేవుడు మనము అడుగుదాని కంటె, ఊహించు దానికంటె అత్యధికముగా చేయగల సమర్థుడు (ఎఫెసీ 3:20). గతములో దేవుడు జరిగించినదంతా యీ సత్యమును రుజువు చేయుచున్నది. నీ పూర్ణ హృదయముతో ఆయనయందు నమ్మికయుంచుము.

1. తన క్రియల మహాత్మ్యమును దేవుడు వెల్లడిపరచుట– వ. 6
2. ఆయన శాసనములు నమ్మకమైనవి– వ. 7
3. ఆయన శాసనములు నిత్యము నిలుచునవి – వ. 8
4. దేవుడు తన విమోచనమును ప్రజలకు కలిగించుట– వ. 9
5. ఆయన శాసనములు మనకు వివేకము కలుగజేయును– వ. 10

దేవుని శాసనములను వెంబడించి, వాటికి విధేయత చూపినట్లయితే మనము ఎన్నడూ పొరపాటు చేయము. అట్లు చేయకపోతే మనము మూర్ఖత్వముతో కూడిన నిర్ణయములు తీసుకొని, అజ్ఞానముతో కూడిన ప్రవర్తన కలిగియుంటాము. దేవుడెవరైయున్నదీ గుర్తించి, ఆయన యేమి చేయగలడో దానిని విశ్వసించి, ఆయన ఆజ్ఞల ప్రకారము జీవించుటవలన దేవుని జ్ఞానము మనకు కలుగును.

**ధ్యాన వచనము 10 :** యెహోవాయందలి భయము జ్ఞానమునకు మూలము. ఆయన శాసనముల ననుసరించు వారందరు మంచి వివేకముగలవారు. ఆయనకు నిత్యము స్తోత్రము కలుగుచున్నది.

**ప్రార్థన:** నీ బలము నాకు కావలయును. నేను బ్రతుకు దినములన్నియు నీ ఆజ్ఞలను పాటించ బద్ధుడనుగా నేనున్నాను.

యీ కీర్తన *"భాగ్యవంతుడు"* యెవరన్న అంశమును గూర్చి వివరిస్తున్నది. అట్టి మనుష్యుడు *"యెహోవా యందు భయభక్తులు కలిగి, ఆయన ఆజ్ఞలనుబట్టి అధికముగా ఆనందించును". "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట"* అను మాటలు "పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివి" అను మాటలకు సమాంతరముగా చెప్పబడినవి (సామెతలు 9:10). యీ తెలివి దేవుడు ఎవరైయున్నదీ విశ్వసించడమేగాక ఆయన ఆజ్ఞలకు ప్రతిస్పందించుటకు సిద్ధముగా వుంటుంది. హెబ్రీ 11:6లో "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యమని" వ్రాయబడినది. అంతేగాక యీ వచనము దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన వున్నాడనియు, తన్ను "వెదకు వారికి" ఫలము దయచేయువాడనియు నమ్మవలెనని సెలవిచ్చుచున్నది.

1. యెహోవాయందు భయభక్తులు గలవాడు – వ. 1
2. అట్టి మనుషులకున్న బలము – వ. 2
3. అట్టి వారు ఆశీర్వదింపబడే విధానము – వ. 3
4. దేవుని గుణము వారి జీవితములో కనబడుట – వ. 4
5. వారి దైవిక గుణములను వారు ప్రదర్శించే పద్ధతులు – వ. 5

*"యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట"* ఒక దైవికమైన జీవనశైలికి మూలముగా వున్నది. యిట్టి జీవితము నీతికొరకు మానవులు వెంటాడే అన్ని రకముల పద్ధతులకు మిన్నగా వున్నది. యీ లోకపు కీర్తి, అంతస్తు లేదా విజయము ఎన్నడూ దేవుని ఆశీర్వాదమునకు ప్రత్యామ్నాయము కాదు.

**ధ్యాన వచనము 5 :** *దయాళులును, అప్పిచ్చువారును భాగ్యవంతులు. న్యాయవిమర్శలో వారి వ్యాజ్యము గెలుచును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ఆజ్ఞలనుబట్టి నేను ఆనందింతును. నీతితో కూడిన, యథార్థమైన జీవనశైలి కలిగియుండవలెనని ఆశపడుచున్నాను. దీనికొరకు నీ సహాయము, నీ బలము నాకు అవసరమైయున్నవి.*

పై వాక్యభాగము ఒక నీతిమంతుడు కలిగియుండే లక్షణములను గూర్చి వర్ణించుచున్నది. ముఖ్యంగా నీతిమంతుని స్థిరత్వము గూర్చి నొక్కి చెప్పబడుచున్నది –"*నీతిమంతుడు ఎప్పుడును కదిలింపబడడు*". విశ్వాసులలో అనేకులు అస్థిరులుగా వుంటారనిపిస్తుంది. కష్టతరమైన పరిస్థితులు మరియు కష్టతరమైన మనుష్యులను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు వారి మానసిక ప్రతిస్పందన ఆత్మీయానుసారముగా కాకుండా శరీరానుసారంగా వుంటుంది. అయితే మన దృష్టి ప్రభువుపై నిలిపి, ఆయనకు భయపడి, ఆయనను స్తుతించినపుడు సరియైన సంగతులను గ్రహించి, వాటిని ఆచరించుటకు అంతరంగికంగా పరిశుద్ధాత్మ శక్తిని కలిగివుంటాము.

1. నీతిమంతుల స్థిరత్వము – వ. 6
2. నీతిమంతులకున్న భద్రత– వ. 7
3. వారి హృదయమునకున్న బలము – వ. 8
4. వారు బీదల యెడల దాతృత్వము కలిగి, ఘనత నొందెదరు – వ. 9
5. నీతిమంతులను ఎదిరించినపుడు భక్తిహీనులు క్షీణించిపోవుట– వ. 10

భవిష్యత్తులో జరుగబోయే పరిణామములు మన పూర్ణహృదయములతో దేవుని వెదకునట్లు మనలను ప్రేరేపించాలి. భక్తిహీనులు "నశించిపోవుదురు". నీతిమంతులు "ఘనతనొంది, హెచ్చింపబడెదరు". మన హృదయములు యెహోవాను "ఆశ్రయించి, స్థిరముగా వున్నప్పుడు" (వ. 7) మనమెన్నడూ భయపడవలసిన అవసరములేదు.

**ధ్యాన వచనము 9:** *వాడు దాతృత్వము కలిగి, బీదలకిచ్చును. వాని నీతి నిత్యము నిలుచును. వాని కొమ్ము ఘనతనొంది, హెచ్చింపబడును.*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయమును నీయందు స్థిరముగా వుంచుకొనవలెనని ఆశపడుచున్నాను. నా జీవితములో ప్రతి పరిస్థితిలోను భయపడకుండ నీ కొరకు నిలబడునట్లు నీ వాక్యమందు నా హృదయమును స్థిరపరచుకొనవలెనని కోరుకొనుచున్నాను.*

విశ్వాసి జీవితములో దేవుని “స్తుతించవలసిన” అవసరత నిత్యము వుండును. దేవుని స్తుతించడమనేది కేవలము సంఘములలో ఆరాధనా కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మాత్రమే కాదుగానీ ఉదయమున లేచినది మొదలు రాత్రి పడుకునే వరకు మనము ఆయనను స్తుతించవలెనని దేవుడు కోరుకుంటున్నాడు – దేవునికి స్తోత్రములు. మనకు దేవుని స్తుతించుట ఎంతో అవసరమైనది. యీ జీవిత పరిస్థితులు మనలో బలవంతులుగా చెప్పబడేవారిని సైతం తమ కన్నులను దేవుని వైపునుండి ప్రక్కకు తొలగించి, వారిని అణచివేసి, అధైర్యపరచగలవు. దేవుని స్తుతించుట వలన మన పరిస్థితులకు పైగా మన హృదయములు ఎత్తబడును. అప్పుడు సమస్తమును తన అధీనములో కలిగి, సమస్తమును మన మేలుకొరకు, ఆయన మహిమకొరకు జరిగిస్తున్న దేవునియందు మనము విశ్రమించగలము. యిప్పుడే ఆగి, దేవుడేమై యున్నాడో, తానేమి జరిగించాడో దానంతటిని బట్టి ఆయనను స్తుతించుము.

1. తన నామము స్తుతించబడవలెనని దేవుడు కోరుట– వ. 1
2. యెల్లకాలము దేవుని నామము స్తుతించబడుట – వ. 2
3. మనము దేవుని స్తుతించవలసిన సమయము – వ. 3
4. దేవుని గొప్పతనమునుబట్టి ఆయనను స్తుతించవలెను – వ. 4

అవును, ఆయన *“అన్యజనులందరి యెదుట మహోన్నతుడు”.* లోకములో జరుగుతున్న దానిని మనము చూచుచున్నప్పుడు యీ సత్యమును మనము జ్ఞాపకముంచు కొనుట మంచిది. *“ఆయన మహిమ ఆకాశవిశాలమున”* వ్యాపించియున్నది. దేవుని గొప్పతనమును గూర్చిన మన గ్రహింపు ఎంతో మితము గలదై, మనసొంత ఊహతో కూడుకొన్నదై వుంటుంది. నీ కన్నులు పైకెత్తి, సకల మహిమతో నిండియున్న ప్రభువును చూడుము. *‘ఆయన గొప్ప తనము శోధింపనశక్యము. ఆయన మార్గములెంతో అగమ్యములు’.* ఆయనయందు నమ్మిక యుంచుము. ఎందుకనగా ఆయన సమస్తమును సరియైన రీతిలో, మన మేలుకొరకు జరిగించే దేవుడు.

**ధ్యాన వచనము 3:** *సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయము వరకు యెహోవా నామము స్తుతినొందదగినది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు అన్నిటికంటె పైగావుండి, నీ మహిమకొరకు మరియు నా మంచికొరకు సమస్తమును జరిగించుచున్నావు గనుక నిన్ను స్తుతించుచున్నాను.*

దేవుడు మనకు జరిగించు వాటిని చూస్తే ఆశ్చర్యము కలుగుతుంది. ఆకాశములకు పైగా హెచ్చించబడిన దేవుడు తనను తాను తగ్గించుకొని, మనతో నివసించి, మన అవసరములను తీర్చుటకు సిద్ధముగా వున్నాడు. యిది యెంత ప్రోత్సాహకరము! కీర్తనాకారుడు *"దరిద్రులను"*, *"బీదలను"* మరియు *"సంతులేని దానిని"* అను వారిని గురించి వ్రాయుచున్నాడు. వీరినందరినీ దేవుడు దర్శించి, తన సంరక్షణను ప్రగాఢమైన రీతిలో వారికి అనుగ్రహించుచున్నాడు. దేవుడు మనపట్ల చూపించే జాలి, తాను సృష్టించిన సృష్టములతో సహవాసము కలిగియుండాలనే బలమైన కోరిక దేవుని గొప్ప తనములో భాగము. మనము "ఆయన కొరకు" సృష్టించబడిన వారము. ప్రభువునందున్న సంతోషమును మనము కనుగొనే వరకు యీ జీవితములో సంపూర్ణమైన తృప్తిని ఎన్నడూ పొందలేము.

1. దేవునికి సమానమైన వారెవరూ లేరు - వ. 5
2. తన సృష్టిపట్ల దేవుడు కలిగియున్న పట్టింపు యొక్క ఫలితము - వ. 6
3. దరిద్రులను, బీదలను దేవుడు లేవనెత్తుట- వ. 7-8
4. సంతులేని స్త్రీలపట్ల దేవుని ప్రతిస్పందన - వ. 9

దేవుని స్తుతించడం ఎన్నడూ మానవద్దు. మన జీవితములలోని కష్ట పరీక్షలన్నింటిలోను ప్రభువు మనలను వెన్నంటి, మనము ఎదుర్కొంటున్న దానియంతటిని గూర్చి ఆలోచనగలిగినవాడై, తన మహిమకొరకు మరియు మన మేలుకొరకు మన పరిస్థితులను ఎట్లు వాడుకోవాలన్నది ఎరిగియున్నాడు. ఆయన యందు నమ్మికయుంచుము.

**ధ్యాన వచనము 9 :** *ఆయన సంతులేని దానిని ఇల్లాలుగాను, కుమాళ్ల సంతోషముగల తల్లిగాను చేయును. యెహోవాను స్తుతించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితమును గురించి ఆలోచన కలిగి, నేనెదుర్కొంటున్న పరీక్షలలో నాకు తోడైయున్నందుకు నీకు వందనములు. నీవంటి దేవుడు, నీకంటే ప్రశస్తమైన దేవుడు వేరొకరు లేడు.*

దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి బయటకు వచ్చినపుడు దేవుడు ఎలా వారి అవసరములు తీరుస్తూ, వారిని కాపాడాడన్న సంగతులను గూర్చి యీ కీర్తన తెలియజేయుచున్నది. ప్రకృతిలోని సమస్తము దేవునిహస్తము తన ప్రజల పక్షమున పనిచేయుచుండుటనుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నది. యీ కీర్తన వర్తమాన మేమనగా, "యూదా ఆయనకు పరిశుద్ధ స్థలమాయెను. ఇశ్రాయేలు ఆయనకు రాజ్యమాయెను" (వ. 2). దేవుడు తమను విమోచించి, నలభై సంవత్సరములు తమను ఎండిన అరణ్య ప్రాంతములో నడిపించి, వారి అవసరములు ఆ అరణ్యములో తీర్చుటనుబట్టి ఇశ్రాయేలీయులు దేవుని రాజ్యముగా వున్నారని 2వ వచనములో వ్రాయబడిన మాటలు రుజువు చేయబడుచున్నవి. నేటి దినములలో నున్న విశ్వాసులకు కూడా దేవుడే తోడైయుండి, వారిని నడిపిస్తున్నాడు.

1. దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తునుండి రప్పించుట – వ. 1
2. దేవుడు నివసిస్తున్న స్థలము – వ. 2
3. సముద్రము, నది, కొండలు, గుట్టలు దేవుని బలమునకు ప్రతిస్పందించుట– వ. 3–6
4. దేవుని సన్నిధినిబట్టి భూమి వణకుట – వ. 7
5. దేవుడు ఎడారిలో తన ప్రజలకు నీరు అనుగ్రహించుట – వ. 8

అవును, దేవుడు తన ప్రజలను సంరక్షిస్తూ, అదే సమయములో సముద్రము, నది, కొండలు, గుట్టలపై తన గొప్ప బలమును ప్రదర్శించెను. మనకెలాంటి సమస్యలున్నా అవేవీ దేవుడు తీర్చలేనంత గొప్పవి కావు.

**ధ్యాన వచనము 7 :** *భూమీ, ప్రభువు సన్నిధిని, యాకోబు దేవుని సన్నిధిని వణకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ శక్తిని ఇశ్రాయేలీయులకు నీవు బయలుపరచిన విధానమునుబట్టి నీకు వందనములు. 'నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను యెన్నడును ఎడబాయను' అను నీ వాగ్దానమునుబట్టి నీకు వందనములు.*

జీవముగల దేవుని యందు గాక మనుష్యుల చేతిపనులైన విగ్రహములయందు నమ్మికయుంచవద్దని పై వాక్య భాగము హెచ్చరించుచున్నది. కొన్నిసార్లు మన బ్యాంకు ఖాతా లేదా ఒక సంస్థ లేదా మనము తలపెట్టిన పనులు లేదా ఒకరి సామర్థ్యము మనకు విగ్రహముగా వుండవచ్చును.దేవునిపై నుండి మన కన్నులు తొలగించుకొని, ఆయన యందు నమ్మికయుంచకుండా యితరులు మనకు వాగ్దానము చేసిన వాటియందు లేదా వారు చేయగల వాటియందు నమ్మికయుంచుట చాలా సులువు. దేవుడు సర్వాధికారియై మనలో ప్రతి ఒక్కరి జీవితములోను తన అద్భుతమైన ప్రణాళికను జరిగిస్తున్నాడు. మనము ఆయనయందు సంపూర్ణముగా నమ్మికయుంచవలెను. దేవుడు మాత్రమే మహిమను పొందవలెను. ఆయనకు చెందవలసిన మహిమ యింకెవ్వరికీ చెందకూడదు. దేవుడు మనకు జ్ఞానమనుగ్రహించును గాక!

1. సకల మహిమకు పాత్రుడైన దేవుడు - వ.1
2. దేవుడు నివసించు స్థలము - వ.2,3 ఎ
3. దేవుడు తన యిష్టము చొప్పున పరిపాలించుట - వ.3 బి
4. మనుష్యులు నిర్మించిన విగ్రహముల స్థితి - వ.4-7
5. విగ్రహములను నిర్మించువారు విగ్రహములవలె వుండుట- వ.8

ఆకాశమును, భూమిని సృష్టించి, వాటియందు తన యిష్టప్రకారము జరిగిస్తున్న దేవునియందు విశ్వాసముంచుమని పై వాక్య భాగముద్వారా గుర్తుచేయబడుచున్నాము. దేవుడు చేయగల పనిని మనము మన చేతులతో సృష్టించుకున్న విగ్రహములు చేయలేవు.

**ధ్యాన వచనము 1 :** *మాకు కాదు, యెహోవా మాకు కాదు. నీ కృపా సత్యములనుబట్టి నీ నామమునకే మహిమ కలుగును గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నీకే సకల మహిమ కలుగజేయుటకు ఆశపడుచున్నాను. నా జీవితములో ప్రతి పరిస్థితిలోను, ప్రతి అవసరతలోను నిన్ను నమ్ముకొనవలెనని కోరుకొనుచున్నాను.*

మనకు అవసరమైన వాటిని యిచ్చుటకు “మనుష్యుల చేతిపనులైన” విగ్రహములకు సామర్థ్యము లేదు గనుక “దేవునియందు విశ్వాసముంచుమని” పై వాక్య భాగము మనకందరికీ బుద్ధి చెప్పుచున్నది. పై వచనములలో మన దేవుడు మన “సహాయమనియు”, మన “కేడెమనియు” చెప్పబడినది. దేవుడు మనలను “మరచిపోలేదనియు”, తనయందు “భయభక్తులు” గలవారిని మరియు తమ మార్గములన్నిటిలో ఆయనను గుర్తించువారిని తాను “ఆశీర్వాదించుననియు” చదువుచున్నాము. తాను ప్రజలను, పరిస్థితులను మన జీవితములో యెలా వాడుకున్నా, మన నమ్మిక, విశ్వాసము దేవునియందు మాత్రమే యుండవలెను. మనుష్యులవైపు, సంస్థలవైపు, వనరులవైపు లేదా విజయము కొరకైన మనుష్యుల వాగ్దానములవైపు గాకుండా దేవుని వైపు చూడుము.

1. ఇశ్రాయేలీయులకు, అహరోను వంశస్తులకు దేవునియందు నమ్మికయుంచుమన్న మందలింపు – వ.9–10
2. నిజదేవునియందు భయభక్తులు గలవారికున్న లాభము– వ.11
3. దేవుడు అనుగ్రహించే ఆశీర్వాదములు – వ.12–13

తనయందు భయభక్తులు గలవారిని యెహోవా ఆశీర్వదించునని 13 వ వచనములో గుర్తు చేయబడిన వాగ్దానము “పిల్లలకు మరియు పెద్దలకు” వర్తింపజేయబడుచున్నది. కొన్నిసార్లు మనము లోకములో “గొప్పగా” పరిచర్య చేస్తున్న కొద్దిమందిని మాత్రమే దేవుడు ఆశీర్వదిస్తాడని అనుకొంటాము. అయితే, దేవుని నామమున యివ్వబడిన ప్రతి గిన్నెడు మంచినీటికిని ఆయన ప్రతిఫలము అనుగ్రహిస్తాడు.

**ధ్యాన వచనము 11 :** *యెహోవాయందు భయభక్తులు గలవారలారా, యెహోవాయందు నమ్మికయుంచుడి. ఆయన వారికి సహాయము, వారికి కేడెము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీయందు భయభక్తులు గలిగి, నిన్ను నమ్ముకొను ప్రతివానిని నీవు ఆశీర్వదించే దేవుడవైనందుకు నీకు వందనములు.*

దేవుని స్తుతించుట, ఆయన నామమును నిత్యము స్తుతించుటయనేది యీ వాక్య భాగము యొక్క ముఖ్యాంశముగా వున్నది. దేవుడు మనము ఊహించగలిగిన లేదా కోరగలిగిన దానికంటే ఎక్కువగా మనలను ఆశీర్వదించాలని కోరుకుంటున్నాడని యీ వాక్య భాగము బోధించుచున్నది. 14వ వచనములో, "యెహోవా మిమ్మును, మీ పిల్లలను వృద్ధిపొందించును" అని వ్రాయబడియున్నది. దేవుని స్తుతించుటకు సమయము యిదే, మనము చనిపోయిన తరువాత కాదు. ఎందుకనగా, "*మృతులును, మౌనస్థితిలోనికి దిగిపోవు వారును యెహోవాను స్తుతింపరు*" (వ. 17). యీ వాక్యము మొదట యిబ్బంది కరంగా వుంటుంది. చనిపోయి పరలోకములో వున్నవారు దేవుని ఎన్నడూ స్తుతించరని యీ వాక్యము చెప్పుటలేదు. అయితే, యీ భూమిమీద మన శారీరక జీవితములో మనకు దేవుని స్తుతించుటకు దొరుకుతున్న అవకాశముల గురించి యిచ్చట సూచింపబడుచున్నది. మనము చనిపోయిన తరువాత యీ అవకాశములను కోల్పోతాము. ప్రకటన గ్రంథములో వ్రాయబడిన ప్రకారము మనము చనిపోయి, పరలోకమునకు చేరుకున్నప్పుడు దేవుని మనము గొప్పగా స్తుతించి, సంతోషించెదము. అయితే, యీ భూమిమీద ప్రభువు మనకిచ్చిన జీవితముతో యేమిచేయుచున్నాము?

1. నీ మీదికి, నీ పిల్లల మీదికి వచ్చు దేవుని ఆశీర్వాదము – వ. 14
2. మనలను ఆశీర్వాదించేది సృష్టికర్తయైన దేవుడే – వ. 15
3. భూమియందలి ఆశీర్వాదములతో మనలను నింపిన దేవుడు – వ. 16
4. మనము మరణించినపుడు భూమిమీద మన స్తుతి ఆగిపోవుట – వ. 17
5. దేవుని నిత్యము స్తుతించుట కొరకైన తీర్మానము – వ. 18

దేవుడు యీ భూమిని మానవులకిచ్చియున్నాడు గనుక యీ భూమిని దేవుని మహిమకొరకు, ఆయనను స్తుతించుటకొరకు వాడవలయును. దేవుడు మనము గుర్తించని రీతిగా అనేకమైన దీవెనలతో పదేపదే మనలను ఆశీర్వదిస్తున్నాడు. ఆయన చేసిన, చేయబోయే కార్యములన్నిటిపట్ల మనమాయనను స్తుతించుటద్వారా ప్రతిస్పందించాలి.

**ధ్యాన వచనము 18 :** *మేమైతే ఇది మొదలుకొని నిత్యము యెహోవాను స్తుతించెదము. యెహోవాను స్తుతించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, సృష్టిలోను, నా జీవితములోను నీవు జరిగించిన సమస్తమునుబట్టి నీ నామమును పొగడి, స్తుతించుటకు ఆశపడుచున్నాను.*

తాను కలిగియున్న బాధ, దు:ఖములో దేవుడు తన మొఱను ఆలకించి, తనకు విడుదల కలిగించిన విధానమును కీర్తనాకారుడు పై వాక్య భాగములో ప్రకటించుచున్నాడు. 7వ వచనములో "నా ప్రాణమా, యెహోవా నీకు క్షేమము విస్తరింపజేసియున్నాడు" అని పలికియున్నాడు. దేవుని ఆశీర్వాదములు సాధారణముగా మనము పరిశీలించుచున్న దానికంటె అధికముగా వుండును. దేవుడు అనేకమైన మార్గములలో మనకు కలుగజేయుచున్న ఆశీర్వాదములను గ్రహించకుండా మన పరిస్థితులు మనకు గ్రుడ్డితనము కలుగజేస్తాయి. పరిస్థితులను మన సొంత దృక్పథముతో కాకుండా దేవుని దృక్పథముతో చూడవలసిన వారముగా వున్నాము. కీర్తనాకారునికి కలిగిన దు:ఖమును ప్రభువు మాత్రమే దూరపరచగలిగాడు. యిది ఎంతో సత్యము.

1. కీర్తనాకారుడు దేవుని పట్ల ప్రేమతో ప్రతిస్పందించుట – వ. 1
2. దేవునికి మొఱపెట్టుటకు కీర్తనాకారుడు తీర్మానించుకొనుట – వ. 2
3. కీర్తనాకారుడు శ్రమల మూలంగా మానసిక వేదనకు గురియగుట – వ. 3
4. విడుదల కొరకు ఆయన చేసిన మనవి – వ. 4
5. దేవుని నీతి మరియు ఆయన దయాళుత్వము – వ. 5
6. దేవుడు కీర్తనాకారుని రక్షించుట – వ. 6
7. కీర్తనాకారునికి అవసరమైన విశ్రాంతి – వ. 7

కీర్తనాకారుడు 7వ వచనములో పలికిన మాటలను దినములో అనేకమార్లు మనకై మనము చెప్పుకొనవలెను–*"నా ప్రాణమా, యెహోవా నీకు క్షేమము విస్తరింపజేసియున్నాడు. తిరిగి నీ విశ్రాంతిలో ప్రవేశింపుము".*

**ధ్యాన వచనము 4 :** *అప్పుడు యెహోవా, దయచేసి నా ప్రాణమును విడిపింపుమని యెహోవా నామమునుబట్టి నేను మొఱపెట్టితిని.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నాకు కలుగజేసిన విడుదలను బట్టి, విస్తారమైన ఆశీర్వాదములను నా జీవితములో కుమ్మరించినందును బట్టి నీకు వందనములు.*

దేవుడు మనకు చేసిన "ఉపకారములన్నిటిని"బట్టి మనము ఆయన పట్ల కలిగియుండవలసిన తీర్మానమును గూర్చిన ప్రాముఖ్యత యీ వాక్య భాగములో వెల్లడి చేయబడినది. కీర్తనాకారుడు "కన్నీళ్లు" విడువకుండా తన "కన్నులను", "జారిపడకుండ" తన "పాదములను" దేవుడు కాపాడెనని 8వ వచనములో సాక్ష్యమిచ్చినట్లు మన జీవితములలో కూడా యిట్టి అనుభవముల ద్వారా వెళ్లే సమయములు వస్తాయి. 10వ వచనములో కీర్తనాకారుడు, "నేను మిగుల బాధపడిన వాడను" అని ఒప్పుకొంటున్నాడు. అయితే, యిది కూడా దేవుడు అనుమతించిందే. మన జీవిత దినములన్నియు సందేహము లేకుండా ఆయనను వెంబడించవలెనని మనకు బోధించుటకై అటువంటి బాధను దేవుడు మన జీవితములలో అనుమతిస్తాడు. శ్రమపడుట అనేది విశ్వాసిని పరిపక్వతవైపు తీసుకు వెళ్తుంది. శ్రమపడుట ద్వారా మన జీవితములోని సంగతులన్నియు స్పష్టముగా చూడగలుగుదుము. మన శ్రమలు వెళ్లిపోవాలని కోరుకుంటాము. అయితే, శ్రమద్వారా మనము నేర్చుకొని, యింకను బలపడాలనే ఉద్దేశ్యముతో దేవుడు అనేకమార్లు మన జీవితములోని శ్రమలను కొంతకాలము కొనసాగిస్తాడు.

1. దేవుడు కీర్తనాకారునికి కలుగజేసిన విడుదల – వ. 8
2. దేవునితో నడవవలెనని కీర్తనాకారుడు నిర్ణయించుకొనుట – వ. 9
3. తన బాధలో కీర్తనాకారుడు దేవుని నమ్మవలెనని నిశ్చయించుకొనుట – వ. 10
4. మనుష్యుల వలన తనకు కలిగిన నిరాశ – వ. 11
5. దేవుని ఉపకారములకై ఏమీ చెల్లించలేనన్న కీర్తనాకారుడు – వ. 12
6. ఆయన ప్రార్థనలో దేవునిపై ఆధారపడుట – వ. 13
7. ఆయన దేవునికి మ్రొక్కుబళ్లు చెల్లించుట – వ. 14

మనలను ఆత్మీయ పరిపక్వత వైపు నడిపించే నిమిత్తము దేవుడు మన జీవితములలోని కష్టములు, శ్రమలను అలాగే కొంతకాలము కొనసాగిస్తాడు. అంతేగాక, వాటిద్వారా, "ఆయన ప్రజలందరి యెదుట మన మ్రొక్కుబళ్లు దేవునికి చెల్లించాలన్నది" ఆయన ఉద్దేశ్యము.

**ధ్యాన వచనము 12 :** *యెహోవా నాకు చేసిన ఉపకారములన్నిటికి నేనాయనకేమి చెల్లించుదును?*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితమును మరియు నీవు నాకిచ్చిన తలాంతులన్నింటిని నీ సేవ కొరకు మరియు నీ మహిమకొరకు నీకు తిరిగి అర్పించుదును.*

కీర్తనాకారుడు పై వాక్య భాగములో దేవుని స్తుతించుట కొనసాగిస్తూ, తాను దేవుని "సేవకుడనని" ప్రకటించుచున్నాడు. దేవుడు మననుండి నిజంగా ఏమి కోరుకుంటున్నాడన్నది అర్థం చేసుకొనుటకు యీ వాక్య భాగములో ప్రతి వచనము ప్రాముఖ్యమైనది. విశ్వాసి దేవునితో కూడా నివసించుటకై పరలోకమునకు తన ప్రయాణమును కొనసాగిస్తున్నాడు. మరణము ఒక గొప్ప ఆశీర్వాదమని కీర్తనాకారుడు తెలియజేయుచున్నాడు. అది "*యెహోవా దృష్టికి విలువ గలదని*" పలుకుచున్నాడు. విశ్వాసికి మరణము ఒక విషాద ఘటన కాదుగానీ "సంపూర్ణ సంతోషము"తో నింపబడిన దేవుని సన్నిధి లోనికి తన మరణము ద్వారా ప్రవేశిస్తాడు. దేవుని కుడిచేతిలో "నిత్య సుఖములు" కలవు (కీర్తన 16:11). దేవుడు తన సన్నిధిలోనికి మనలను పిలిచే వరకు యీ భూమి మీద మన మ్రొక్కుబళ్లు, మన కృతజ్ఞతార్పణలు ఆయనకు చెల్లించుతూ నివసిస్తాము.

1. విశ్వాసి మరణము దేవుని దృష్టికి విలువైనది – వ. 15
2. మనము దేవునికి "దాసులమన్న" సత్యమును గ్రహించుట – వ. 16
3. కృతజ్ఞతార్పణలు దేవునికి చెల్లించుట – వ. 17
4. మన మ్రొక్కుబళ్లు దేవునికి చెల్లించి, ఆయనను స్తుతించుట – వ. 18–19

దేవుడు నీపట్ల జరిగించిన, జరిగించబోయే సమస్తమునుబట్టి ఆయనకు వందనములు, స్తుతులు చెల్లించి, ఆయనను సేవించుట ఎన్నడూ మానవద్దు. నీ జీవితమును ఆయనకు పునరంకితము చేసుకొని, నీవు చేయు పనులద్వారా, పలికే మాటలద్వారా దేవుని మహిమపరచుము.

**ధ్యాన వచనము 17 :** *నేను నీకు కృతజ్ఞతార్పణ నర్పించెదను. యెహోవా నామమున ప్రార్థన చేసెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, ప్రతి దినము నిన్ను సేవించుటకును, మరణము తరువాత నిత్యత్వములో నీతో జీవించుటకును నిరీక్షణ నాకు కలిగించినందుకు నీకు వందనములు. నా పట్ల నీవు జరిగించిన సమస్తమునుబట్టి నీకు వందనములు, స్తుతులు చెల్లించెదను.*

దేవుని స్తుతించు అంశముమీద యీ కీర్తనలోని రెండు వచనములు చక్కగా వ్రాయబడినవి (హల్లెలూయా). భూమి మీదనున్న జనములందరినీ దేవుని స్తుతించునట్లు చేయవలెనన్నది సర్వాధికారియైన మన దేవుని ప్రణాళిక. దేవుని ప్రజలను వ్యతిరేకించే ఫరో రాజుగా వున్నప్పటికీ, తన బలమును ఐగుప్తులో ప్రదర్శించేందుకు దేవుడే ఫరోను రాజుగా నిలబెట్టాడు. కీర్తన 76:10లో, "నరుని ఆగ్రహము నిన్ను స్తుతించును" అని వ్రాయబడినది. ప్రతి వస్తువు, ప్రతి మనిషి కూడా ఆశ్చర్యకరుడైన మన దేవునికి స్తుతులర్పించుటకు సృష్టించబడియున్నారు. పై కీర్తనలో మనము దేవుని స్తుతించునట్లు చేసే రెండు కారణములు చెప్పబడినవి –"దేవుని కృప" మరియు "దేవుని విశ్వాస్యత". దేవుడు మనయెడల ఎంతో దయను, జాలిని, కనికరమును గలవాడు. మనము తీర్పునకు, నరకమునకు పాత్రులము. అయితే దేవుని కృప, ఆయన క్షమాపణ మనకు నిరీక్షణను, నిత్య జీవమును యిచ్చినవి. మనము యెల్లప్పుడూ దేవుడు తన వాగ్దానము నెరవేరుస్తాడని నమ్మవలెను. ఆయన యెల్లప్పుడూ సత్యమును పలుకుతాడు. ఆయన సత్యము నిరంతరము నిలుచును.

1. దేవుని కృపయొక్క బలము – వ.1 ఎ
2. దేవుని విశ్వాస్యత ఎల్లప్పుడూ నమ్మదగినది– వ.1 బి
3. సమస్త జనములును, దేశములును తనను స్తుతించవలెనని కోరుతున్న ప్రభువు– వ.2

ఉదయము నీవు లేచినపుడు, దినమంతా ఆయా బాధ్యతలు, పనులు నిర్వర్తిస్తున్నప్పుడు, భోజనమునకు కూర్చునప్పుడు, రాత్రి యింటికి వెళ్లునపుడు, పడకకు వెళ్లేముందు – యిలా అన్ని సమయములలోను దేవుని స్తుతించుము.

**ధ్యాన వచనము 2:** సమస్త అన్యజనులారా, యెహోవాను స్తుతించుడి. సర్వజనములారా ఆయనను కొనియాడుడి.

**ప్రార్థన:** *ప్రభువా, నీ కృపాకనికరములను బట్టి నిన్ను స్తుతించెదను. నీ వాగ్దానములు సత్యమైనవి మరియు ఒకానొకరోజు నెరవేరునవి గనుక నీకు స్తుతులు చెల్లించెదను.*

దేవుని కృప ఆయన మంచితనముమీద ఆధారపడినదై, నిరంతరము నిలుచుచున్నది గనుక మనము ఆయన కాపుదలను, ఆయన ఆశీర్వాదమును మరియు ఆయన మన ప్రార్థనలకిచ్చు జవాబులను నమ్ముకొనవచ్చును. తాను మొఱపెట్టినపుడు దేవుడు జవాబు అనుగ్రహిస్తాడన్న నమ్మకము ఒక విశ్వాసికుంటుంది. కీర్తనాకారుడు, *"యెహోవా నా పక్షమున ఉన్నాడు. నేను భయపడను. నరులు నాకేమి చేయగలరు?"* అని 6వ వచనములో ప్రకటిస్తున్నాడు. యేసుక్రీస్తు, *"ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడా నరకములో నశింపజేయగల వానికి మిక్కిలి భయపడుడి"* అని సెలవిచ్చాడు (మత్తయి 10:28).

1. మనము కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు గల కారణములు - వ. 1
2. ఇశ్రాయేలీయులు చూపవలసిన ప్రతిస్పందన - వ. 2
3. ఆరాధనను నడిపించే యాజకుని ప్రతిస్పందన - వ. 3
4. దేవునియందు భయభక్తులు గలవారందరియొక్క ప్రతిస్పందన - వ. 4
5. దేవునికి మొఱ పెట్టుట వలన కలుగు ఫలితము - వ. 5
6. దేవుని కాపుదలను గూర్చిన గ్రహింపు- వ. 6
7. మన శత్రువులపై దేవుడు ప్రతీకారము తీర్చుకొనుట - వ. 7

అవును, యెహోవా దయాళుడు, ఆయన కృప నిరంతరము నిలుచును. ఆయన కృప మనతో యెల్లప్పుడూ వుంటున్నది గనుక మనకు దు:ఖము కలిగించే లేదా మనలను భయపెట్టే ప్రతి విషయములోను మనము సంపూర్ణముగా దేవుని నమ్ముకొనవచ్చును.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా దయాళుడు. ఆయన కృప నిరంతరము నిలుచును. ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా యెడల నీ కృపాకనికరములనుబట్టి నీకు వందనములు. నేను మొఱపెట్టినప్పుడు నా మొఱ ఆలకించే దేవుడవు గనుక నీకు వందనములు.*

పై వాక్య భాగము దేవుని ప్రజలు పొందు గెలుపు లేదా విజయమును గూర్చి తెలియజేయుచున్నది. తనకు వ్యతిరేకంగా వచ్చే శతృవులందరినీ నాశనపరచుటకు దేవుని సహాయము తాను కలిగియున్నట్లు కీర్తనాకారుడు పలుకుచున్నాడు. యీ సత్యము ఇశ్రాయేలీయుల చరిత్ర అంతటిలో నిజమైయున్నప్పటికీ, ప్రస్తుత సందర్భములో దేవుని ప్రజలకు వ్యతిరేకంగా రాబోయే ప్రపంచ దేశములన్నిటినీ మెస్సీయయైన యేసుక్రీస్తు ఓడించబోవుచున్నాడని మరి విశేషంగా వాక్యము తెలియజేయుచున్నది (జెకర్యా 12:9). యీ ప్రపంచ దేశములు కొన్నిసార్లు అజేయమైనవిగా కనిపించినప్పటికీ సకలమును తన అధీనములో కలిగియున్న దేవుడు గతంలో అనేకసార్లు వారిని ఓడించియున్నాడు. అంతేగాక భవిష్యత్తులో కూడా వారిని ఓడించబోవు చున్నాడు. మన నమ్మిక దేశములయొక్క రాజకీయ, సైనికపరమైన బలముమీదగాకుండా దేవునియందు కలిగియున్నాము.

1. దేవుని నమ్ముకొనవలసిన ప్రాధాన్యత - వ. 8-9
2. శతృదేశములమీద దేవుడు వాగ్దానముచేసిన విజయము - వ. 10-11
3. శతృదేశములు పొందబోయే శిక్ష- వ. 12
4. దేవుడు మనకు సహాయము చేయుటలో ఆయన వంతు - వ. 13
5. దేవుడు స్తుతి పొందుటకు యోగ్యుడు - వ. 14

విజయము దేవుని నుండే వస్తుంది. యీ లోకపు నాయకులమీద విశ్వాసముంచక, మనకు *"దుర్గము మరియు గానమై"* యున్న దేవునియందే నమ్మికయుంచుము. ఆయన మనకు *"రక్షణాధారమాయెను"*.

**ధ్యాన వచనము 13 :** *నేను పడునట్లు నీవు నన్ను గట్టిగా తోసితివి. యెహోవా నాకు సహాయము చేసెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు మాత్రమే నన్ను విడిపించే దేవుడవు. నీవే నా దుర్గము, నా గానము.*

113వ కీర్తననుండి 118వ కీర్తన వరకు మొత్తం ఆరు కీర్తనలను 'స్తుతి కీర్తనలు' లేదా 'హల్లేల్' అని యూదులు పిలుస్తారు. పస్కాపండుగ రోజు మందిరములో గొఱ్ఱె పిల్లలను వధించినపుడు లేవీయులలో దేవుని స్తుతించు గాయక సమూహము ద్వారా పై వాక్య భాగము పాటగా పాడబడుతుంది. యీ వాక్య భాగము విజయము మరియు విడుదలను గూర్చి మాట్లాడుతూ దేవుడు కలిగించిన రక్షణకొరకై ఆయనను స్తుతించవలెనని మనకు తెలియజేయుచున్నది. 19వ వచనములో "నేను వచ్చునట్లు నీతి గుమ్మములు తీయుడి" అని వ్రాయబడినది. కొందరు యీ మాటలను ప్రభువైన యేసుక్రీస్తు గాడిదపై యెరూషలేములోనికి విజయముతో కూడిన ప్రవేశము చేసినప్పటి సందర్భమునకు వర్తింపజేస్తారు. దేవుడు తానెవరైయున్నాడో మరియు మనపట్ల తానేమి జరిగించాడో, దానంతటినిబట్టి మన స్తుతిని కోరుకుంటున్నాడని ఖచ్చితంగా చెప్పగలము.

1. దేవుడు జరిగించిన దానినిబట్టి ఉత్సహించుట – వ. 15
2. దేవుని బలమును గుర్తించుట – వ. 16
3. దేవునిపట్ల విశ్వాసియొక్క ప్రతిస్పందన – వ. 17
4. మరణమునుండి విశ్వాసిని దేవుడు రక్షించుట – వ. 18
5. నీతిమంతులు యెహోవా గుమ్మములలో ప్రవేశించుట – వ. 19–20
6. దేవుడు కలిగించిన రక్షణకై ఆయనను స్తుతించుట – వ. 21

21వ వచనములో, "నీవు నాకు రక్షణాధారుడవై నాకు ఉత్తరమిచ్చియున్నావు" అని వ్రాయబడిన మాటలు మనకెంతో ప్రోత్సాహకరంగా వున్నాయి. మన ప్రేమగల దేవుడు మన మొఱలను ఆలకిస్తాడని మనమెప్పుడూ జ్ఞాపకముంచుకొనవలెను. నీ స్తుతిని ఆయనకు చెల్లించి, నీ భారములను ఆయన యొద్దకు తీసుకు వచ్చి, ఆయనకు మొఱపెట్టుము.

**ధ్యాన వచనము 19:** *నేను వచ్చునట్లు నీతి గుమ్మములు తీయుడి. నేను వాటిలో ప్రవేశించి, యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నాకు జరిగించిన సమస్తమునుబట్టి నేను నీకు స్తుతియాగము చేసి, కృతజ్ఞతలతో కూడిన పాటలు పాడెదను.*

బైబిల్‌లో క్రొత్త నిబంధనను చదివిన వారు మన ప్రభువు, ఇశ్రాయేలు మెస్సీయయైన యేసుక్రీస్తు గురించి పై వాక్య భాగములో వ్రాయబడిన మాటలను వెంటనే గుర్తుకు తెచ్చుకొందురు. ఆయన "ఇల్లు కట్టువారు" నిషేధించిన "రాయి"గా వున్నాడు. యీ వచనము క్రొత్త నిబంధనలో అనేక సార్లు వ్రాయబడినది. యీ వచనము యేసుక్రీస్తును చంపుటకు ప్రయత్నము చేసి, సిలువవేయబడుటకు రోమా సైనికులకు ఆయనను పట్టించిన ఇశ్రాయేలు మతాధికారుల గురించి మాట్లాడుచున్నది. 24వ వచనము "ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము" అని సెలవిస్తున్నది. అనగా ఇది యేసుక్రీస్తు సిలువవేయబడిన దినమును సూచిస్తున్నది. అదే వచనములో, "దీనియందు మనము ఉత్సహించి, సంతోషించెదము" అనుమాటలు ప్రభువు మరణము ద్వారా సాధ్యమైన మన రక్షణను బట్టిన ఆనందమును సూచిస్తున్నది - దేవునికి స్తోత్రములు. పై వాక్య భాగములోని 26వ వచనములో ప్రభువైన యేసుక్రీస్తు గాడిదపై యెరూషలేములోనికి ప్రవేశించినపుడు తానుపొందిన స్తుతినిగూర్చి ప్రవచన పూర్వకంగా తెలియజేయబడినది (జెకర్యా 9:9). యీ ప్రవచనము మత్తయి 21:9 ద్వారా నెరవేరింది.

1. నిరాకరించబడిన రాయి - వ. 22
2. దేవుని రక్షణ మన కన్నులకు ఆశ్చర్యకరమైనది - వ. 23
3. ప్రభువు మరణము దేవుని సర్వాధికారము, ఆయన అనాదికాల సంకల్పమును బట్టి జరిగినది- వ. 24
4. రక్షణ మెస్సీయద్వారా మాత్రమే సాధ్యము- వ. 25
5. యేసుక్రీస్తు స్తుతి కీర్తనతో స్తుతింపబడుట - వ. 26
6. బలిపశువును అర్పించుటద్వారా ప్రజలు ఉత్సహించుట - వ. 27
7. దేవునికి కృతజ్ఞతాస్తుతులను చెల్లించుట - వ. 28-29

మెస్సీయను గూర్చి ఎంత అద్భుతమైన ప్రవచనములు! "యెహోవా పేరిట వచ్చువాడు ఆశీర్వాదమొందును గాక"! "ఆశీర్వదింపబడిన ప్రభువు" వచ్చి, మన పాపముల కొరకు మరణించి, మరణమునుండి తిరిగి లేచియున్నాడు. మనకొరకు మళ్లీ రాబోతున్నాడు.

**ధ్యాన వచనము 28:** *నీవు నా దేవుడవు, నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను. నీవు నా దేవుడవు. నిన్ను ఘనపరచెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ ఆశ్చర్యకరమైన రక్షణకై నీకు వందనములు. ఇల్లుకట్టువారు నిషేధించిన రాయిమీద విశ్వాసుల మందిరమును నీవు కట్టుచున్నందుకు నీకు వందనములు.*

176 వచనములతో కూడిన యీ కీర్తన 22 భాగములుగా చేయబడినది. యిది హెబ్రీ పద్యమాలగా వ్రాయబడినది. హెబ్రీ భాషలో 22 అక్షరములున్నవి. ఒక్కొక్క భాగము ఒక అక్షరమును సూచిస్తున్నది. 22 భాగములలోని ఒక్కొక్క భాగములో 8 వచనములు వున్నవి. ఈ 8 వచనములు కూడా హెబ్రీ అక్షరముతో మొదలయ్యే ఒక పదముతో మొదలవుతున్నాయి. ఉదాహరణకు యీ దినము హెబ్రీ అక్షరమైన 'అలెఫ్' (aleph)తో మొదలు పెడుతున్నాము. పై వాక్యభాగములోని ప్రతి వచనముయొక్క మొదటి పదములోని మొదటి అక్షరము హెబ్రీభాషలో అలెఫ్ – యిది యెంతో అద్భుతకరము. దేవుని వాక్యము పరిశుద్ధాత్మచేత ప్రేరేపించబడి, యెలాంటి తప్పులు లేకుండా వ్రాయబడినదనుటకు యిది గొప్ప సాక్ష్యము. యీ కీర్తనలోని 176 వచనములు కూడా ఒక స్తుతి కీర్తనగా దేవుని వాక్యమును పొగడుతూ వ్రాయబడినవి. పై వాక్య భాగములో *"యెహోవా ధర్మశాస్త్రము", "ఆయన శాసనములు", "ఆయన మార్గములు", "నీ ఆజ్ఞలు", "నీ కట్టడలు", "నీ న్యాయ విధులు"* మొదలగు మాటలన్నియు దేవుని ఆశ్చర్యకరమైన వాక్యమును వర్ణిస్తున్నవి.

1. ధన్యులైన మనుష్యుల నడక – వ.1
2. ధన్యులైన మనుష్యులు దేవుని వెదకు విధానము – వ.2
3. దేవుని మార్గములు మనలను నడిపించును – వ.3-5
4. దేవుని వాక్య జ్ఞానము మనలను అవమానమొందనియ్యదు – వ.6
5. దేవుని వాక్యమును నేర్చుకొనుచున్నప్పుడు దేవుని స్తుతించుట – వ.7
6. దేవుని వాక్యమునకు విధేయత చూపుటకు యిష్టపడుట – వ.8

జీవితములో యేదియు దేవుని వాక్యములోని తెలివితేటలు, జ్ఞానమునకు సరితూగదు. దేవుని వాక్యమునకు ప్రత్యామ్నాయ మార్గములలో నడచి, నష్టపోవడం చాలా సులభము. దేవుని వాక్యమును తెలుసుకొని, దానికి విధేయత చూపుట కొరకు మనలను మనము పునరంకితము చేసుకొనవలసిన వారముగా వున్నాము.

**ధ్యాన వచనము 2:** *ఆయన శాసనములను గైకొనుచు, పూర్ణ హృదయముతో ఆయనను వెదకువారు ధన్యులు.*

**ప్రార్థన:** *ప్రియ ప్రభువా, నా పూర్ణహృదయముతో నిన్ను, నీ వాక్యమును తెలుసుకొనవలెనని ఆశపడుచున్నాను.*

యీ దినపు భాగము హెబ్రీ అక్షరమైన 'బేత్' (beth)ను తెలియజేయుచున్నది. మరొకసారి, యీ భాగములోని ప్రతి వచనము యొక్క మొదటి పదములోని మొదటి అక్షరము హెబ్రీ భాషలో బేత్. యీ అక్షరము ఆదికాండం 1:1లో మొదటి అక్షరముగా వాడబడింది. పై వాక్య భాగము మన జీవితములలో మనము దేవుని వాక్యముద్వారా కడుగబడవలసిన ప్రాముఖ్యత గురించి తెలియజేయుచున్నది. పాపము మరియు దాని ప్రలోభములను ఎదుర్కొనుటకు దేవుని వాక్యము మనకు బలమునిచ్చి, వాటినుండి కాపాడుతుంది. మనకు ఒప్పుదలను కలుగజేసి, పరిశుద్ధాత్మ సహాయముతో మన జీవన శైలి మార్చుకొని, మన పాపపు యిచ్ఛలనుండి దూరముగా వుండి, మన మాటలు మరియు క్రియలద్వారా దేవుని సౌందర్యమును అగుపరచుటకు దేవుని వాక్యము సహాయపడును.

1. మనకు దేవుని వాక్యమునుండి అవసరమైన శుద్ధీకరణ - వ. 9
2. దేవుని ఆజ్ఞలకు లోబడియుండుట- వ. 10
3. దేవుని వాక్యముద్వారా పాపమును నియంత్రించుట- వ. 11
4. తనకు బోధించుమని కీర్తనాకారుడు దేవునికి మొఱపెట్టుట - వ. 12
5. దేవుని వాక్యము పట్ల తీర్మానము- వ. 13-16

దేవుని వాక్యము పట్ల మన తీర్మానము బలమైనదైనపుడు కీర్తనాకారుడు పలికిన మాటలలో బయలుపరచబడిన స్వభావము మనము కూడా కలిగియుందుము: "…..నేను సంతోషించుచున్నాను". "……నేను ధ్యానించెదను". "…..నేను మన్నించెదను". "….నేను హర్షించెదను". "……నేను మరువకయుందును".

**ధ్యాన వచనము 11 :** *నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యము నా హృదయమును కడిగి, నా జీవితమును మార్చుటకు శక్తి కలదని నమ్మి, నీ వాక్యముద్వారా నీ సన్నిధికి వచ్చెదను.*

యీ వాక్య భాగములో ప్రతి వచనము యొక్క మొదటి పదము హెబ్రీ భాషలో 'గీమెల్' (gimel) అను అక్షరముతో మొదలవుతుంది. 18వ వచనములో ముఖ్యమైన సారాంశమును చదువుచున్నాము - "నీవు నా కన్నులు తెరువుము". దేవుడు తన ఆశ్చర్యకరమైన వాక్యములోనుండి ఏమి చూడవలెనని కోరుకుంటున్నాడో దానిని మనము చూచుటకు యిష్టము, విశ్వాసముతో కూడిన కన్నులు మరియు గ్రహింపు మనకవసరమైయున్నవి. 'దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను (2 కొరింథీ 4:3-4). దేవుడు మనలను చేయమని కోరుకునే సంగతులు చూడకుండు నిమిత్తము మన పాపము కూడా మన కన్నులకు గ్రుడ్డితనము కలుగజేస్తుంది (కీర్తన 119:11).

1. ఆత్మీయ గ్రహింపు మరియు విధేయతకు ముందుగా కావలసినవి - వ. 17
2. ఆత్మీయ గ్రహింపు కావలెనని కోరుకొనుటకు వెనుక వున్న ఉద్దేశ్యము - వ. 18
3. కీర్తనాకారుడు యెదుర్కొంటున్న సమస్య (దేవుని మీద ఆధారపడుట) - వ. 19
4. ఆత్మీయ గ్రహింపుకొరకు కీర్తనాకారుని పట్టుదల - వ. 20
5. కీర్తనాకారుడు గ్రహించుచున్న సత్యము - వ. 21
6. కీర్తనాకారుడు చేయుచున్న ప్రార్థన - వ. 22-24
   ఎ) ఆత్మీయ కాపుదలకొరకు మనవి - వ. 22
   బి)విమర్శలకు ప్రతిస్పందించుట - వ. 23
   సి) తన జీవితములో దేవుని వాక్యముపట్ల తనకున్న కోరికను బట్టి ప్రార్థించుట - వ. 24

దేవుని ఆజ్ఞలకు విధేయత చూపించి, ఆయన ఉద్దేశ్యములను మరియు మార్గములను గ్రహించడమనేది ఆత్మీయ పరిపక్వత మరియు ఆశీర్వాదము వైపునకు దారితీయును.

**ధ్యాన వచనము 18:** *నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యమును నిర్లక్ష్యము చేయుట ద్వారాగాని లేక నా హృదయము యొక్క భ్రష్టత్వమునుబట్టిగాని నేను ఆత్మీయంగా గుడ్డివాడనైయుండకుండా జాగ్రత్త పడుటకు నాకు సహాయము చేయుము.*

యీ వాక్య భాగములోని వచనములు హెబ్రీ భాషలోని నాలుగవ అక్షరమైన 'దాలెత్' (daleth) తో మొదలవుచున్నవి. పై వాక్య భాగము 'ఉజ్జీవము' యొక్క అవసరత గురించి వక్కాణించుచున్నది. నిజమైన ఉజ్జీవము ఏదైనా కూడికకు వెళ్లడం ద్వారా లేదా జనసమూహము యొక్క ఉత్సాహంలో పాల్గొనడంద్వారా కలుగదు. ఉజ్జీవము దేవుని వాక్యముద్వారా కలుగుతుంది. అనగా మన జీవితములలో మనము మారవలసిన సంగతులను గూర్చి దేవుని వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ బయలుపరుస్తాడు. మనము బోధింపబడే ఆత్మ మరియు లోబడే స్వభావము గలిగి, దేవుని మాటలను విని, వెంటనే వాటి ప్రకారము చేయుటకు మన హృదయములు మార్చుకున్నట్లయితే, ఉజ్జీవము మనలో మొదలవుతుంది.

1. మన జీవితములలో ఉజ్జీవమెందుకు అవసరమైయున్నది?
   ఎ) మానసికంగా నీరుగారి పోయి, దు:ఖములో వుండుట వలన- వ.25,28
   బి) కపటము లేకుండా పారదర్శకత కలిగియుండుటకు- వ.26,29,30
2. ఉజ్జీవపు అవసరత గురించి తెలుపుచున్న విన్నపములు
   ఎ) గ్రహింపు - వ.26-27 బి) ఆత్మీయ బలము - వ.28
   సి) కృపతో కూడిన ఉపదేశము - వ.29 బి
3. ఉజ్జీవింపబడిన హృదయము కలిగియుండే ప్రతిస్పందన
   ఎ) ధ్యానము - వ.27బి బి) నిర్ణయము - వ.30
   సి) లోబడుట - వ.31ఎ డి) విధేయత - వ.32 ఎ
4. ఉజ్జీవము వలన కలుగు ఫలితములు
   ఎ) దేవుడు వుత్తరమిచ్చుట- వ.26 ఎ
   బి) హృదయము విశాలపరచబడుట- వ. 32 ఎ

"సత్య మార్గమును నేను కోరుకొనియున్నాను" అని 30వ వచనములో వ్రాయబడిన మాటలు మనలో అనేకుల సమస్యను చూపిస్తున్నవి. మన హృదయములలో మనము ఉజ్జీవము కావాలని కోరుకుంటాము. కానీ దేవుని వాక్యములోని సత్యమార్గమును ఎంచుకొనవలసిన బాధ్యత మనమీద వున్నదని గుర్తించము.

**ధ్యాన వచనము 27 :** *నీ ఉపదేశ మార్గమును నాకు బోధపరచుము. నీ ఆశ్చర్య కార్యములను నేను ధ్యానించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయమును నీ వాక్యముతో ఉజ్జీవింపజేసి, నా హృదయములో రావలసిన మార్పును గూర్చి నాకు తెలియజేసినందుకు నీకు వందనములు.*

పై వాక్య భాగములోని వచనములు 'హే' (he) అనుహెబ్రీ అక్షరముతో మొదలగుచున్నాయి. యీ వాక్యభాగము 40 వ వచనములో "బ్రతికింపుము" అను పదముతో ముగియుచున్నది. యీ పదము నిన్నటి భాగములో ధ్యానించినట్లు 'ఉజ్జీవము' అను పదమును పోలియున్నది. యీ వాక్య భాగములో ఏ సంగతులు మనలను దేవుని నుండి దూరపరుస్తాయో, వాటిని గూర్చి హెచ్చరింపబడుతూ, అదే సమయములో ఏ సంగతులు మనలను దేవుని యొద్దకు తిరిగి తీసుకువస్తాయో వాటిని గూర్చి బోధింపబడుతున్నాము. వినాశకరమైన వాటినుండి మన కన్నులు తొలగించి, ప్రభువు మరియు ఆయన వాక్యముమీద వాటిని నిలుపుకొని, మన హృదయములలో ఉజ్జీవింపబడుటకు దేవుని వాక్యము ఎంతో ప్రాముఖ్యమైనదని యీ వాక్యభాగముద్వారా తెలుసుకుంటున్నాము. నీ హృదయమును యీ దినము "ఉజ్జీవింపజేయుమని" ప్రభువును నీవు ప్రార్థించుము. ఉజ్జీవమునకున్న నిజమైన అర్థములో యీ క్రింది సంగతులు ఇమిడియున్నవి:

1. నీ జీవిత దినములన్నియు దేవుని వాక్యమునకు విధేయుడుగా వుండుటకు నీవు తీర్మానించుకొని యుందువు- వ. 33-35
   (33,34,35 వచనములలోని 3 విన్నపములు, 3 ప్రతిస్పందనలను గమనించుము).
2. పాపపు దురాశలు మరియు వ్యర్థమైన పనులనుండి దూరంగా వుండాలన్న ఒప్పుదలను కలిగియుందువు - వ. 36-37
3. నీ సాక్ష్యము మరియు నీ గౌరవమును గూర్చిన ఆలోచన కలిగి, వాటిని కాపాడుకోవాలన్న తలంపు కలిగియుందువు - వ. 38-39
4. దేవుని నియమములకు లోబడి నీవు జీవించుచుందువు- వ. 40

ఉజ్జీవమనగా నీవు పాపము నుండి వైదొలగి, దేవుని వైపు మరియు ఆయన వాక్యము వైపునకు తిరిగియున్నావు. దేవుని వాక్యమును నేర్చుకోవాలన్న ఆకలి నీవు కలిగియుందువు. దేవుని మార్గములలో నడువవలెనన్న నూతనమైన కోరికను నీవు కలిగియుందువు.

**ధ్యాన వచనము 34 :** *నీ ధర్మశాస్త్రముననుసరించుటకు నాకు బుద్ధి దయచేయుము. అప్పుడు నా పూర్ణ హృదయముతో నేను దాని ప్రకారము నడుచుకొందును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను బ్రతుకు దినములన్నియు నిన్ను వెంబడించునట్లు నీ మార్గములను నాకు బోధింపుము. నిన్ను గూర్చి తెలుసుకొని, నీ మాటలకు విధేయుడనై యుండవలెనని ఆశపడుచున్నాను.*

యీ వాక్యభాగములోని వచనములు 'వావ్' (vav) అను హెబ్రీ అక్షరముతో మొదలవుచున్నవి. ఈ అక్షరము *"మరియు (and)"* అను అర్థమును కలిగియున్నది. పై వాక్య భాగములోని 47వ వచనములో దేవుని "ఆజ్ఞలను" కీర్తనాకారుడు *"ప్రేమించుచున్నాడని (ప్రియముగా ఎంచుచున్నాడని)"* తెలియజేయబడినది.

యీ సందర్భములో నిన్ను నీవు ప్రశ్నించుకొనగల ఒక మంచి ప్రశ్న ఏదనగా, *"నేను నిజంగా దేవుని వాక్యమును ప్రేమించుచున్నానా?"* మనము దేవుని వాక్యమును ప్రేమించుట ఎందుకంత ముఖ్యమైనదనుటకు కీర్తనాకారుడు క్రింద తెలుపబడిన కారణములను కలిగియున్నాడు:

1. దేవుని కనికరములను, ఆయన రక్షణను ప్రకటించుటకు - వ. 41
2. మనలను నిందించువారికి సమాధానమిచ్చుటకు - వ. 42
3. మనలో నిశ్చయతను కలుగజేయుటకు - వ. 43
4. మనము స్వతంత్రులంగా వుండుటకు - వ. 45
5. మనకు ధైర్యమును కలిగించుటకు - వ. 46

44,47 మరియు 48వ వచనములో దేవుని వాక్యమును ప్రేమించువారు కలిగియుండే మూడు రకముల ప్రతిస్పందనను గూర్చి చదువుచున్నాము:

ఎ) సమర్పణ -వ. 44 బి) సంతోషము -వ. 47

సి) దేవునిపై ఆధారపడియుండుట -వ. 48

యీదినమందు దేవుని వాక్యము నీకు గొప్ప సంతోషమును కలుగజేయును గాక !

**ధ్యాన వచనము 47 :** *నీ ఆజ్ఞలనుబట్టి నేను హర్షించెదను. అవి నాకు ప్రియములు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యమునుబట్టి మరియు నీ ఆశీర్వాదముతో నా జీవితమును ఎలా జీవించవలెనన్న సత్యమును నా హృదయమునకు తెలియజేసినందునుబట్టి నీకు వందనములు.*

పై వాక్యభాగములోని వచనములు 'జాయిన్' (zain) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నవి. ఈ అక్షరము చేతి కర్రలాంటి ఆకారము గలిగి, దేవుని వాక్యము మనము ఆనుకొనుటకు ఒక చేతి కర్రలా వుందన్న సత్యమును గుర్తు చేయుచున్నది. యీ వాక్య భాగములో 50వ వచనములో ప్రాముఖ్యమైన మాటలను చదువుచున్నాము. –"నీ వాక్యము నన్ను బ్రతికించియున్నది". దేవుని వాక్యము మనకు జీవమిచ్చుచున్నది. మనము శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమను అక్షయ బీజమునుండి పుట్టింపబడి యున్నాము (1పేతురు 1:23–25). మన జీవితములలో పరీక్షలు, కష్టతరమైన పరిస్థితులు బలంగా వుండి, మన పోరాటమును వదిలివేయాలని మనమనుకున్నప్పుడు దేవుని వాక్యము మనకు "జీవము"నిస్తుంది. 49వ వచనములో "నిరీక్షణ" గురించి చదువుచున్నాము. సమాధి తరువాత జీవితమును గూర్చిన నిరీక్షణ దేవుని వాక్యము ద్వారా మనకు కలుగుతుంది. అయితే ప్రస్తుత జీవితములో కూడా నిరాశతోవున్న మనకు దేవుని వాక్యము నిరీక్షణ కలిగించుచున్నది.

1. దేవుని వాక్యము నిరీక్షణ కలిగిస్తుంది – వ.49
2. బాధలో నెమ్మది కలిగించుచున్నది – వ.50
3. వ్యక్తిగత ఎదిరింపులను తట్టుకొనుటకు శక్తినిస్తుంది – వ.51
4. దేవుని న్యాయవిధులను జ్ఞాపకము చేయుట ద్వారా ఓదార్పునిస్తుంది – వ.52
5. భక్తిహీనుల పట్ల భారము కలిగిస్తుంది – వ.53
6. పాటలు పాడుటకు దేవుని వాక్యము సహాయపడుతుంది – వ.54
7. తీర్మానముతో దేవుని వెంబడించుటకు సహాయపడుతుంది – వ.55–56

పై వాక్య భాగములో రెండుసార్లు కీర్తనాకారుడు దేవుని గూర్చిన సత్యమును "జ్ఞాపకము" చేసుకుంటున్నాడు (వ.52, వ.55). దేవుని వాక్యము మనకు కూడా యిదే రీతిలో సహాయపడుచున్నది.

**ధ్యాన వచనము 50 :** *నీ వాక్యము నన్ను బ్రదికించియున్నది. నా బాధలో యిదే నాకు నెమ్మది కలిగించుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను కష్ట సమయములగుండా వెళుతున్నప్పుడు నీ వాక్యమును జ్ఞాపకముంచుకొని, నీ వాక్యముద్వారా మాత్రమే నేను బ్రతికింపబడుదునన్న గ్రహింపుతో జీవించుటకు నాకు సహాయపడుము.*

పై వాక్యభాగములోని వచనములు 'హేత్' (cheth) అను హెబ్రీ అక్షరముతో మొదలవుచున్నవి. *"కనికరములు (mercies)"* లేదా 64వ వచనములో వ్రాయబడిన *"కృప" (loving kindness)* అనుపదము యీ అక్షరముతోనే మొదలవుతున్నది. దేవుని వాక్యము ద్వారా మనము ప్రభువుతో కలిగియున్న సంబంధమును గురించి యీ వాక్య భాగములోని మొదటి కొన్ని వచనములు గొప్ప వివరణ యిచ్చుచున్నవి –*"యెహోవా, నీవే నా భాగము"*. అనేకసార్లు మనము దేవునితో కలిగియుండవలసిన యీ సంబంధమునకు ప్రత్యామ్నాయంగా లోకంలో అనేక విషయాలతో సంబంధము కలిగి, దేవునికి దినములో మిగిలిన *"చివరి నిమిషములు లేదా ఘడియలను"* కేటాయిస్తాము. మన హృదయములు మారి, మన మాటలు, క్రియలలో దేవునికి ప్రథమ స్థానము యిచ్చెదముగాక!

1. మన జీవితములలో దేవునికివ్వవలసిన ప్రాధాన్యత – వ. 57
2. దేవుని కటాక్షము, కరుణకొరకు మనవి – వ. 58
3. మన హృదయములలో మనము దేవుని వాక్యమునకు యిచ్చే ప్రాధాన్యత క్రింది విధంగా బయలుపరచబడుతుంది:
   ఎ) స్వయం పరిశీలన చేసుకొని, పశ్చాత్తాపపడుటద్వారా –వ. 59
   బి) ఆలస్యము చేయకుండా దేవుని వాక్యమునకు ప్రతిస్పందించుటద్వారా – వ. 60
   సి) దేవుని వాక్యమును నమ్మకంగా జ్ఞాపకము చేసుకొనుటద్వారా –వ. 61
4. దేవుని స్తుతిచేత కీర్తనాకారుని హృదయము నింపబడుట – వ. 62
5. కీర్తనాకారుడు ఎన్నుకొన్న స్నేహితులు – వ. 63
6. కీర్తనాకారుని జీవితములో ప్రబలమైన ప్రార్థన – వ. 64

*"నీకట్టడలను నాకు బోధింపుము"* అని కీర్తనాకారుడు పై వాక్య భాగములోని చివరి వచనములో పలికిన మాటలు దేవుని వాక్యముయొక్క ప్రాముఖ్యతను బయలుపరచుచున్నవి.

**ధ్యాన వచనము 58:** *కటాక్షముంచుమని నా పూర్ణహృదయముతో నిన్ను బతిమాలుకొనుచున్నాను. నీవిచ్చిన మాట చొప్పున నన్ను కరుణింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ మార్గములను నేను నేర్చుకొనగోరుచున్నాను. నా జీవిత సమస్యలన్నిటిలోను నన్ను సంరక్షించుటకు నీ కనికరము నాకు యెంతగానో అవసరమైయున్నది.*

యీ వాక్య భాగములోని వచనములు హెబ్రీ అక్షరమైన 'తేత్' (teth)తో మొదలవుతున్నాయి. యీ వచనములు దేవుని వాక్య విలువను గూర్చి వక్కాణించుచున్నాయి. కీర్తన 19:10లో దావీదు, "*అవి బంగారుకంటెను, విస్తారమైన మేలిమి బంగారు కంటెను కోరదగినవి. తేనెకంటెను, జుంటి తేనె ధారలకంటెను మధురమైనవి*" అని దేవుని న్యాయవిధులను గూర్చి పలికాడు.మనము దేవుని వాక్యమునకు యివ్వలసిన విలువను యివ్వడం లేదు గనుకనే దేవుని వాక్యమును చదవడంలో సమయము గడపలేక పోవుచున్నాము. తద్వారా వాక్యమును నేర్చుకొని, అనుసరించుటలో కూడ వెనుకబడి పోవుచున్నాము. కీర్తన 1:1లో దేవుని వాక్యము యితరుల ఆలోచనలను, మరీ ముఖ్యముగా దుష్టుల ఆలోచనలను వినకూడదని హెచ్చరించుచున్నది. దేవుని వాక్యమునందే మనము ఆనందించవలెను (కీర్తన 1:2).

1. దేవుని వాక్యపు విలువ యొక్క వివరణ (వ.65-71)

    ఎ) వాక్యముయొక్క విలువ మన జీవితములలో అది కలుగజేసే ఫలితముల ద్వారా బయలుపడుతున్నది -వ.65-67

    బి) వాక్యముయొక్క విలువ మన జీవిత పరిస్థితులకు అది యిచ్చుచున్న కారణముల ద్వారా బయలుపడుతున్నది -వ.68-71

యీ కారణములు దేవుని స్వభావము మీదను (వ.68), వాక్యము నేర్చుకొనుటకు వివిధ అనుభవములను పొందవలసిన మన అవసరత మీదను (వ.71) ఆధారపడి యున్నాయి.

2 దేవునివాక్యము యొక్క అమూల్యత -వ.72

66వ వచనములో ఎంతో ముఖ్యమైన మాటలను చదువుచున్నాము -"*నేను నీ ఆజ్ఞలయందు నమ్మికయుంచి యున్నాను*". *యిది నిజము కాకపోతే, దేవుని వాక్యపు విలువ మన ఆలోచనలలో క్షీణించిపోతుంది.*

**ధ్యాన వచనము 71 :** *నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొందియుండుట నాకు మేలాయెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యమును నా హృదయములో భద్రపరచుకొందును. సత్యముగా పిలువబడు యితర పుస్తకములు, మూలముల కంటె యెక్కువగా నీ వాక్యమునకు వెలకట్టెదను. నీవు నా కొరకై నియమించిన సమస్తమును నేర్చుకొనుటకు నా జీవితమును నీకు పునరంకితము చేసుకొందును.*

యీ వాక్యభాగములోని వచనములు హెబ్రీ భాషలో అతి చిన్న అక్షరమైన 'యోద్' (yod)తో మొదలవుచున్నాయి. యేసుక్రీస్తు మత్తయి 5:18లో, *"ఆకాశమును, భూమియు గతించి పోయిననేగాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి ఒక పొల్లయినను (హెబ్రీ భాషలో యోద్), ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను"* అని పలికాడు. ప్రతి చిన్న అక్షరము, పొల్లుకూడా దేవునికి ముఖ్యమైనవి. అందుకే యీ భాగములోని సందేశము దేవుడు మనకనుగ్రహించే అద్భుతమైన ఆదరణను గూర్చి తెలియజేయుచున్నది. 2 కొరింథీ 1:3లో *"సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు"* గా మన ప్రభువు పిలువబడుతున్నాడు.

1. దేవుని వాక్యము దేవుడు మనలను సృష్టించుటలో ఆయనకున్న ఉద్దేశ్యమును గూర్చి తెలియజేయుచున్నది - వ. 73
2. దేవుని వాక్యము మనకు కలిగే పరీక్షలను అంగీకరించుటకు, ఎదుర్కొనుటకు కావలసిన నమ్మకమును కలుగజేస్తుంది - వ. 74-75
3. మన హృదయములను ధైర్యపరచుటకు అవసరమైన దేవుని కృప, కరుణాకటాక్షములను గూర్చి వాక్యము తెలియజేయుచున్నది -వ. 76-77
4. మన జీవితములలో పోరాటములను ఎదుర్కొనుటకు కావలసిన ధైర్యమును దేవుని వాక్యము మనకు అనుగ్రహించుచున్నది - వ. 78-80

75వ వచనములో వ్రాయబడిన చక్కటి మాటలు ఎంతో ప్రాముఖ్యమైనవి: *"విశ్వాస్యతగల వాడవై నీవు నన్ను శ్రమపరచితివి"*. మనకు బాధాకరంగాను, అర్థం చేసుకొనుటకు కష్టమనిపించేవిగాను వున్న వాటితో సహా సమస్తమును దేవుడు మన మంచి కొరకు జరిగిస్తున్నాడు. మనము ఆయనయందు సంపూర్ణమైన నమ్మికయుంచవలసిన అవసరత మనకున్నది.

**ధ్యాన వచనము 77 :** *నీ ధర్మశాస్త్రము నాకు సంతోషకరము. నేను బ్రదుకునట్లు నీ కరుణా కటాక్షములు నాకు కలుగును గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యములోను, నీ మార్గములలోను నేను పొందు ఆదరణనుబట్టి నీకు వందనములు.*

యీ వచనములు హెబ్రీ భాషలోని 11వ అక్షరమైన 'కఫ్' (caph) తో మొదలవుతున్నాయి. యీ అక్షరము గుండ్రంగా ఆంగ్లంలో 'C' అక్షరము తలక్రిందులైనట్లుగా కనిపిస్తుంది. అనగా ఒక మనిషి పశ్చాత్తాపముతో నేలపై వంగియున్న తలంపును కలిగిస్తుంది. 86వ వచనములో ముఖ్యమైన మాటలను చదువుచున్నాము: "నాకు సహాయము చేయుము". మనకు నిరంతరము దేవుని సహాయము అవసరమైయున్నది. హెబ్రీ 4:16లో, "కనుక మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయముకొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము యొద్దకు చేరుదుము" అని వ్రాయబడియున్నది. కీర్తనాకారుడు తాను ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు, దాడులను గూర్చి ప్రస్తావిస్తూ, సహాయము కొరకు దేవునికి మొఱపెట్టుచున్నాడు. మనము ఎన్నిసార్లు 'సహాయము చేయమని' మొఱపెట్టినను దేవుడు విసుగడు, అలసిపోడు.

1. దేవుని వాక్యముపట్ల కీర్తనాకారుని దృక్పథము - వ.81-83
   ఎ) వ్యక్తిగతంగా బలహీనుడైనప్పటికీ, కీర్తనాకారుడు దేవునిపై నమ్మిక కలిగియున్నాడు - వ.81
   బి) తనకున్న పరిస్థితిలో దేవుని ఆదరణ కలుగలేదని ఆందోళన చెందిన కీర్తనాకారుడు- వ.82
   సి) వ్యక్తిగతంగా అధైర్యపడిపోయినప్పటికీ, కీర్తనాకారుడు తీర్మానము కలిగియున్నాడు - వ.83
2. దేవుని సమయము గురించి కలత చెందిన కీర్తానాకారుడు - వ.84
3. దేవుని జోక్యము కొరకు కీర్తనాకారుని మనవి- వ.85-87
4. వ్యక్తిగతంగా తనను ఉజ్జీవింపజేయుమని కీర్తనాకారుడు ప్రార్థించుట- వ.88

81వ వచనములో "నేను నీ వాక్యముమీద "ఆశ" పెట్టుకొని యున్నాను" అని వ్రాయబడిన మాటలు మనపట్ల యెప్పుడూ నిజమైయుండవలెను. దేవుని మీద, ఆయన వాక్యముమీద మనము ఆధారపడియున్నాము.

**ధ్యాన వచనము 86 :** *నీ ఆజ్ఞలన్నియు నమ్మదగినవి. పగవారు నిర్నిమిత్తముగా నన్ను తరుముచున్నారు. నాకు సహాయము చేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా హృదయమును ఉజ్జీవింపజేయు నీ కృపకై నీకు వందనములు చెల్లించుదును.*

యీ వాక్యభాగములోని వచనములు హెబ్రీ అక్షరమైన 'లామెద్' (lamed)తో మొదలవుచున్నాయి. యీ భాగములో 89వ వచనము ప్రాముఖ్యమైనది– "యెహోవా, నీ వాక్యము ఆకాశమందు నిత్యము నిలకడగా నున్నది". యీ భాగములోని వచనముల సారాంశము "దేవుని వాక్యము యొక్క విశ్వాస్యత". దేవుని సృష్టిని గూర్చి కీర్తనాకారుడు బలంగా ప్రతిస్పందిస్తూ, "సమస్తము నీకు సేవచేయుచున్నవి" అని పలుకుచున్నాడు. దేవుని సృష్టిలోని సమస్తమును మనకు సేవచేయుచున్నవి. మనకు కష్టము, పరీక్ష కలిగినప్పుడు దేవుని వాక్యమును యెరిగి, దానిని అనుసరింపక పోయినట్లయితే యీ దృక్పథము మనము కలిగియుండము. 90వ వచనములో, "నీ విశ్వాస్యత తరతరములుండును" అని దేవుని విశ్వసనీయత గురించి వాక్యము సెలవిస్తున్నది.

1. దేవుని వాక్యముయొక్క నిత్యత్వపు గుణము– వ.89–91
   ఎ) అది ఆకాశమందు నిత్యము నిలకడగా వున్నది – వ.89
   బి) దేవుని వాక్యము విశ్వసనీయమైనది – వ. 90–91
2. జీవముగల ఆదరణ కలుగజేసే దేవుని వాక్యం– వ.92–93
   ఎ) శ్రమలో వాక్యము మనలను ధైర్యపరచును – వ.92
   బి) మనము జయముతో నిత్యము జీవించునట్లు చేయుచున్నది – వ.93
3. దేవుని వాక్యము కలిగించు రక్షణ – వ.94–95
   ఎ) మనము దేవుని వారము గనుక ఆయన మనలను రక్షించును – వ.94
   బి) మనకు దేవుని కాపుదల అవసరమైయున్నది – వ.95
4. దేవుని వాక్యము అపరిమితమైనది – వ.96

యెంత అద్భుతమైన వాక్యమును దేవుడు మన జీవితములకు మూలముగా అనుగ్రహించియున్నాడు! దేవుని వాక్యము లేకుండా యింటినుండి బయలుదేరవద్దు.

**ధ్యాన వచనము 92:** *నీ ధర్మశాస్త్రము నాకు సంతోషమియ్యని యెడల నా శ్రమయందు నేను నశించియుందును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యము నీ హృదయమునుండి నా హృదయమునకు సంపూర్ణమైన రీతిలో బయలుపరచబడినది. నీ వాక్యము ద్వారా బయలుపరచబడిన నీ విశ్వాస్యతను బట్టి నీకు స్తుతులు చెల్లించుదును.*

యీ భాగములోని వచనములు హెబ్రీ అక్షరమైన 'మేమ్' (mem) తో మొదలవుతున్నాయి. యీ వాక్య భాగము యొక్క చివరి వచనములలో కీర్తనాకారుడు దేవుని వాక్యము యొక్క తియ్యదనము గురించి మాట్లాడుచున్నాడు. దేవుడు ఎవరైయున్నాడు, ఆయన ఏమి చేయగలడు అను సత్యము మీద విపులంగా వివరణ యివ్వడం ద్వారా దేవుని వాక్యపు తియ్యదనము మనకు బయలుపరచబడినది. అలాగే ప్రేమామయుడైన యేసుక్రీస్తు (మెస్సీయ) పైన దేవుని వాక్యము యొక్క అందము, ఘనత కేంద్రీకరించబడియున్నవి (కీర్తన 45). మన ఆపదల నుండి దేవుడు మనకు విడుదల ఎలా కలిగిస్తాడన్న సత్యమును దేవుని వాక్యము బయలుపరచినపుడు అది మన మానసిక జీవితమునకు తియ్యగా వుంటుంది. మన జీవితములలో దేవుడు తన అద్భుతమైన ప్రణాళికను ఎలా జరిగించుచున్నాడన్న సత్యమును మనము చూచినపుడు, అది మన ఆత్మీయ గ్రహింపునకు తియ్యగా వుంటుంది. దేవుని వాక్యములోని న్యాయవిధులు నిజంగా *"తేనె కంటెను, జుంటి తేనె ధారలకంటెను మధురమైనవి"* (కీర్తన 19:10).

1. దేవుని వాక్యమునకు ప్రేమతో కూడిన ప్రతిస్పందన - వ.97,103
2. దేవుని వాక్యము గొప్ప మూలాధారముగా వున్నది - వ.98-100
3. అది వ్యక్తిగతంగా పాపము చేయకుండుటకు సహాయపడుతుంది- వ.101-102
4. అది దైవికమైన ఫలితములను కలిగిస్తుంది- వ.104

97వ వచనము దాదాపుగా యీ అనుదిన ధ్యానముల పుస్తకము యొక్క సారాంశమైయున్నది. - *"నీ ధర్మశాస్త్రము నాకెంతో ప్రియముగావున్నది. దినమెల్ల నేను దానిని ధ్యానించుచున్నాను".* విశ్వాసియొక్క జీవితములో దేవునివాక్యము ఎంతో ముఖ్యమైనది. మన గ్రహింపునకు, మన పరిపక్వతకు, మనము ఫలించుటకు మరియు మన జీవన శైలికి దేవుని వాక్యము ఎంతో కీలకమైనదని తెలుసుకొనుచున్నాము.

**ధ్యాన వచనము 103 :** *నీ వాక్యములు నా జిహ్వకు ఎంతో మధురములు. అవి నా నోటికి తేనెకంటె తీపిగానున్నవి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యము నా హృదయమునకు తీపిగా వున్నది. నీవు సెలవిచ్చిన ప్రతి మాటను చదివి, ధ్యానించుటకు ఎంతో యిష్టపడుదును.*

యీ వాక్య భాగములోని వచనములు 'నూన్' (nun) అను హెబ్రీ అక్షరముతో మొదలవుతున్నాయి. దేవుని వాక్యము మన జీవితములకు దారి చూపునన్న భావమును ప్రారంభ వచనాల్లో చూస్తున్నాము. దేవుని వాక్యము "వెలుగు" గాను, "దీపము" గాను మనకు తోడైయున్నది. దేవుని వాక్యములోని జవాబులను మనము వెదకని కారణంగా మన జీవితములో ఏమి చేయాలో, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో, ఏ విషయాలకు ప్రాధాన్యతనివ్వాలో తెలియనివారంగా వున్నాము. మనము దేవుని వాక్యమును అలక్ష్యము చేసిన యెడల ఎంతో నష్టపోతాము. దేవుని వాక్యమును గూర్చిన జ్ఞానము లేనికారణంగా మన జీవితములో అనేక కష్టములు కలుగుచున్నవి.

1. దేవుని వాక్యము మనము నడువవలసిన త్రోవను చూపిస్తుంది- వ.105-106
   ఎ) అది మనకుదారి చూపిస్తుంది - వ.105
   బి) దానిననుసరించుటకు సమర్పణ అవసరము - వ.106
2. దేవుని వాక్యము శ్రమలలో మన ప్రాణములను తెప్పరిల్లజేస్తుంది- వ.107-110
   ఎ) శ్రమల యొక్క స్వభావము:
      1) మిక్కిలి గొప్ప శ్రమ -వ.107ఎ 2) మానసిక క్షోభ -వ.109 ఎ
      3) అకస్మాత్తుగా, ఆశ్చర్యము కలిగించే శ్రమ -వ.110 ఎ
   బి) శ్రమలలో మనకున్న అవసరత:
      1) అంతరంగ బలమును పొందుట -వ.107 బి
      2) స్తుతి, ఆరాధనలతో ప్రతిస్పందించుట -వ.108ఎ
      3) దేవుని మార్గములను గూర్చిన గ్రహింపుకొరకై మనవి చేయుట -వ.108బి
      4) దేవుని మాటలను మరువకుండుట -109బి
      5) దేవుని వాక్యమునకు నమ్మకత్వము కనబరచుటలోని ప్రాముఖ్యతను గుర్తించుట -వ.110 బి
3. దేవుని వాక్యము మన హృదయములను ఆనందింపజేయును- వ.111-112

మనకు శ్రమల సమయములో దేవుని వాక్యము అవసరమైయున్నదను సంగతిని బాగా యెరిగియుండవలెను.

**ధ్యాన వచనము 107:** *యెహోవా, నేను మిక్కిలి శ్రమపడుచున్నాను. నీ మాట చొప్పున నన్ను బ్రదికింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను కష్ట సమయములగుండా వెళ్లుతున్నప్పుడు నా హృదయమును ఉజ్జీవింపజేయ శక్తిగల నీ వాక్యమునుబట్టి నీకు వందనములు.*

యీ వాక్య భాగములోని వచనములు ‘సామెహ్’ (samech) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నవి. 114వ వచనములో వ్రాయబడిన “మరుగు చోటు” అనుమాట కీర్తనల గ్రంథములోని అనేక వాక్య భాగములను గుర్తు చేయుచున్నది. సామెతల గ్రంథములో కూడా దేవునియొద్ద మనము కలిగియున్న ఆశ్రయ స్థానమును గురించి చదివెదము. ఉదాహరణకు సామెతలు 14:26లో, “*యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహు ధైర్యము పుట్టించును. అట్టివారి పిల్లలకు ఆశ్రయ స్థానము కలదు*” అని వ్రాయబడినది. దేవునియొద్ద వున్న “మరుగుచోటు” లో క్షేమము మరియు భద్రత వున్నాయి. ఆయన మన “కేడెము”గా వుండి, శత్రువునుండి వచ్చే అగ్ని బాణములన్నిటినుండి తప్పించుకొనుటకు రక్షణ కవచముగా వున్నాడు.

1. మనము దేవుని “మరుగు చోటు” మరియు “కేడెముగా” కలిగియుండవలసిన అవసరత మనకెందుకు వున్నదనుటకు కారణములు:
   ఎ) మన మనస్సుతో వున్న సమస్య- వ. 113
   బి) దుష్క్రియలు చేయువారు మనచుట్టు వుండుట - వ. 115
   సి) అధైర్యపడిపోయే అవకాశము మనము కలిగియుండుట - వ. 116-117
   డి) దుష్టులు శిక్షింపబడుట - వ. 118-119
2. దేవుని “మరుగుచోటు” మరియు “కేడెముగా” కలిగియుండవలసిన అవసరతగల వారి ప్రతిస్పందన:
   ఎ) వారు దేవుని వాక్యమునందు ఆనందించుదురు - వ. 113,119
   బి) వారు దేవుని వాక్యముమీద ఆధారపడుదురు - వ. 114
   సి) వారు దేవుని వాక్యమును అనుసరించుదురు- వ. 115,117
   డి) వారు దేవుని పట్ల, ఆయన వాక్యముపట్ల ఉత్తరవాదమును ప్రదర్శింతురు- వ. 120

దేవుడు మనకు ఆశ్రయస్థానము. మన జీవితములకు రక్షణ కేడెముగా వున్నాడు. ఆయనయందు దాగియుండుటకు మనము నేర్చుకొందుము గాక!

**ధ్యాన వచనము 114 :** *నాకు మరుగుచోటు, నా కేడెము నీవే. నేను నీ వాక్యముమీద ఆశపెట్టుకొని యున్నాను.*

**ప్రార్థన:** *ప్రభువా, నన్ను కాపాడి, నాకు భద్రత కలుగజేయు నీ ఆశ్చర్యకరమైన హస్తములను బట్టి నీకు వందనములు.*

యీ వాక్యభాగములోని వచనములు 'అయిన్' (ain) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నవి. 125వ వచనములో వ్రాయబడిన "నేను నీ సేవకుడను" అను మాటలు యీ భాగముయొక్క ప్రధాన అంశముగా వున్నాయి. పాత నిబంధనలోని చరిత్రలో చూచినట్లయితే, దేవుని చేత ఏర్పరచబడిన నాయకులు "దేవుని సేవకులు"గా పిలువబడిరి. దావీదు అనేకమార్లు "దేవుని సేవకుడు"గా పిలువబడ్డాడు. యిట్లు పిలువబడుట ఆయన జీవితము మరియు పరిచర్యను సూచిస్తున్నది. యీ భాగములో దేవుని సేవకుడు ఎలా కనిపిస్తాడు మరియు ఆయన ఏమి చేస్తాడన్న విషయాలను గురించి నేర్చుకొంటున్నాము.

1. దేవుని సేవకుడు దేవుని దృష్టిలో సరియైన దానిని చేస్తాడు– వ. 121
2. దేవుని రక్షణ తనకు అవసరమైయున్నదని ప్రకటిస్తాడు– వ. 121 బి – 123
3. ఆయన దేవుని కృపమీద ఆధారపడతాడు – వ. 124 ఎ
4. దేవుని వాక్యమును తెలుసుకోవాలని కోరుకుంటాడు – వ. 124 బి – 125
5. దేవుని హస్తములకు సంగతులన్నిటిని వదిలివేయాలని నిర్ణయిస్తాడు– వ. 126
6. ఆయన దేవుని వాక్యమునుబట్టి ఆనందిస్తాడు – వ. 127
7. దేవుని పరిశుద్ధతతో జీవించాలని కోరుకుంటాడు– వ. 128

125వ వచనములో "నేను నీ సేవకుడను" అని వ్రాయబడిన మాటలు దేవునితోను, ఆయన వాక్యముతోను మనకున్న సంబంధ, సహవాసములను గూర్చి ఎంతో గొప్పగా తెలియజేయుచున్నాయి.

**ధ్యాన వచనము 125 :** *నేను నీ సేవకుడను. నీ శాసనములను గ్రహించునట్లు నాకు జ్ఞానము కలుగజేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సేవకుడనుగా వుండి, నీ మార్గములను, నీ సత్యమును అర్థము చేసుకొనుటకు ఆశపడుచున్నాను. గ్రహింపుగల హృదయమును నాకు దయచేయుము.*

పై వాక్యభాగములోని వచనములు 'పే' (pe) అను హెబ్రీ అక్షరముతో మొదలవుచున్నాయి. యీ అక్షరము హెబ్రీ భాషలో "ఆశ్చర్యమైన" అను పదములో భాగమైయున్నది. యీ పదము హెబ్రీ భాషలో "ఊహకు మించిన" లేదా "తెలుసు కొనుటకు, అర్థం చేసుకొనుటకు చాలా కష్టమైన" అను అర్థము నిస్తున్నది. యెషయా 9:6లో మెస్సీయయైన యేసుక్రీస్తును గూర్చి, "ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త" అని వ్రాయబడినది. యిది ఆయన గుణమును తెలియజేయుచున్నది. కీర్తన 139:5లో దేవుని తెలివిని గూర్చి దావీదు మాట్లాడుతూ "*యిట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము. అది నాకందదు*" అని పలుకుచున్నాడు. దేవుని కార్యములు, ఆయన జ్ఞానము మరియు ఆయన వాక్యము ఆశ్చర్యకరమైనవి.

1. దేవుని ఆశ్చర్యకరమైన వాక్యము కీర్తనాకారుడు కలిగిన ప్రాధాన్యతల ద్వారా బయలుపరచబడుచున్నది- వ.129-131
   ఎ) యిది ఆయన నమ్మకమైన సమర్పణలో కనిపిస్తున్నది - వ.129
   బి) యిది కీర్తనాకారుని నిరంతర పరిశోధనలో కనిపిస్తున్నది- వ.130
   సి)యిది ఆయన బలమైన కోరికలో కనిపిస్తున్నది- వ.131
2. కీర్తనాకారుని ప్రార్థనలు దేవుని ఆశ్చర్యకరమైన వాక్యమును బయలుపరుస్తున్నాయి - వ.132-136
   ఎ) దేవుని కరుణమీద తాను ఆధారపడినట్లు గుర్తించాడు- వ.132
   బి)పాపముమీద జయముకొరకు దేవుని వాక్యముమీద ఆధారపడుతున్నాడు- వ.133
   సి)దేవునికి విధేయులైయుండుటలో మనమెదుర్కొనే పోరాటములను ఆయన గుర్తించాడు - వ.134
   డి)దేవుని ఆశీర్వాదమును, సహాయమును కోరుచున్నాడు- వ.135
   ఇ)దేవుని వాక్యమునకు అవిధేయులైన వారిపట్ల ప్రతిస్పందించాడు - వ.136

దేవుని వాక్యములో మనము అర్థము చేసుకోలేని సంగతులెన్నో ఉండవచ్చు. అయితే ఆ వాక్యములో నమ్మలేని సంగతులు ఏవీలేవు. దేవుడు ఎవరు? ఆయన ఏమి చేయగలడు? చేసియున్నాడు అను సత్యములను మనము తెలుసుకున్నట్లయితే, ఆయనను సంపూర్ణముగా విశ్వసించుటలో సమాధానము కలిగియుంటాము.

**ధ్యాన వచనము 133:** *నీ వాక్యమునుబట్టి నా అడుగులు స్థిరపరచుము. ఏ పాపమును నన్ను ఏలనియ్యకుము.*

**ప్రార్థన:** ప్రభువా, నీ వాక్యమునుబట్టి నిన్నెంతగానో స్తుతించుదును. నీ వాక్యము నా ప్రాణమునకు వెలుగును, గ్రహింపును కలుగజేయుచున్నది.

యీ భాగములోని వచనములు 'సాదె' (tsadik) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నాయి. యీ అక్షరము హెబ్రీ వర్ణమాలలో 18వ అక్షరముగా వుండి, "నీతి" అను అర్థము నిచ్చుచున్నది. దేవునితో సరియైన సంబంధము కలిగియుండుట ఎంతో ప్రాముఖ్యమైనది. మన హృదయములు దేవునితో సరిలేనట్లయితే మిగతా విషయాలన్ని కూడా దెబ్బతింటాయి. మనము దేవునితో కలిగియున్న సంబంధము మీద యితరులతో మనము కలిగియుండే సంబంధాలు ఆధారపడియుంటాయి.

1. దేవుని నీతిని గూర్చి కీర్తనాకారుడు వివరించుట– వ. 137–138
   ఎ) దేవుని నీతి ఆయన గుణమును వర్ణిస్తున్నది– వ. 137
   బి) దేవుని నీతి ఆయన ఆజ్ఞలను వర్ణిస్తున్నది – వ. 138
2. దేవుని నీతిపట్ల కీర్తనాకారుడు కలిగియున్న భక్తి– వ. 139–141
   ఎ) ఆయన కారణము బి) ఆయన ప్రతి స్పందన
   సి) ఆయన జ్ఞాపకము
3. దేవుని నీతియందు కీర్తనాకారుడు ఆనందించుట – వ. 142–144
   ఎ) యెందుకనగా దేవుని నీతి శాశ్వతమైనది – వ. 142
   బి) యెందుకనగా దేవుని నీతి ప్రోత్సహిస్తున్నది– వ. 143
   సి) యెందుకనగా దేవుని నీతి బ్రదికింపజేస్తుంది– వ. 144

క్రైస్తవ జీవితమును జీవించుటకు దేవునితో సరియైన సంబంధము కలిగియుండుట ఎంతో ప్రాముఖ్యమైన విషయము. దేవుని వాక్యములో యెంతో స్పష్టంగా బయలుపరచబడిన దేవుని నీతిని యెరిగినప్పుడే జ్ఞానమును, తెలివిని పొందగలము.

**ధ్యాన వచనము 143:** *శ్రమయు, వేదనయు నన్ను పట్టియున్నవి. అయినను నీ ఆజ్ఞలు నాకు సంతోషము కలుగజేయుచున్నవి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీతో సరియైన సంబంధము కలిగియుండవలెనని కోరుకొంటున్నాను. నీ వాక్యములోనుండి నీవు చూపే మార్గము నాకు తప్పనిసరియైన అవసరముగా వున్నది.*

పై వాక్యభాగములోని వచనములు 'ఖోఫ్' (koph) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నాయి. యీ భాగమునకు "సహాయము కొరకైన మొఱ" అని పేరు పెట్టవచ్చును. మనము ఎన్నిసార్లు దేవుని సన్నిధిలో ఆయన సహాయముకొరకు మొఱపెట్టినప్పటికీ, ఆయన అలసిపోడన్న సత్యమును తెలుసుకొనుట ఎంత ఆశ్చర్యకరము! 146వ వచనములో "నేను నీకు మొఱపెట్టుచున్నాను"అని చదువుచున్నాము. దేవుడు మన మొఱలను ఆలకించి, మనము అనుభవిస్తున్నదానియంతటిలోను మనలను సంరక్షిస్తున్నాడు. ఆయన "సమస్తమైన ఆదరణను అనుగ్రహించుదేవుడు" (2కొరింథీ 1:3).

1. దేవుని సహాయముకొరకు మనవి- వ.145-148
   - ఎ) యిది సహాయముకొరకు గాఢమైన రీతిలో చేయబడిన మనవి- వ.145 ఎ
   - బి) యిది దేవునికి నేరుగా చేయబడిన ప్రార్థన- వ.145 బి - 146
   - సి) యిది నిరంతరపోరాటముగా వున్నది- వ.147-148
   - డి) యిట్లు మొఱపెట్టుటలో నిర్దిష్టమైన ఉద్దేశ్యమున్నది:
     1) వాక్యము పట్ల అధికమైన సమర్పణను కలిగించుటకు- వ.145 బి, 146 బి
     2) వాక్యముమీద అధికముగా ఆధారపడునట్లు ప్రోత్సహించుటకు- వ.147 బి
2. మనకు అవసరమైన ఉజ్జీవము- వ.149-150
   - ఎ) దేవుని కృపనుబట్టి ఉజ్జీవము సాధ్యమౌతుంది- వ.149 ఎ
   - బి) దేవుని న్యాయవిధులప్రకారము ఉజ్జీవింప బడతాము- వ.149 బి
   - సి) దుష్టులు మనకు సమీపముగా వున్నందున ఉజ్జీవము అవసరము- వ.150
3. దేవుని సన్నిధి, ఆయన వాక్యము మనకెల్లప్పుడు అందుబాటులో వున్నాయి - వ.151-152

దేవుడు మన పట్ల కలిగియున్న ప్రేమనుబట్టి మన మొఱలకు జవాబునిచ్చు చున్నాడు. ఆ జవాబు మనము ఊహించింది కాకపోవచ్చును. అయితే అది మన అవసరతలను తీర్చేదిగా ఎల్లప్పుడూ వుంటుంది.

**ధ్యాన వచనము 149:** *నీ కృపనుబట్టి నా మొఱ ఆలకింపుము. యెహోవా, నీ వాక్యవిధులను బట్టి నన్ను బ్రదికింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు మొఱపెట్టినప్పుడు, నీవు నా మొఱ ఆలకించెదవనియు, నాకేమి అవసరమైయున్నదో నాకంటె బాగుగా నీకు తెలుసుననియు నేనెరుగుదును.*

యీ వాక్య భాగములోని వచనములు 'రేష్' (resh) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నవి. యీ భాగము దేవుని కృప లేదా కనికరమును ప్రధాన అంశముగా కలిగియున్నది. 156వ వచనములో "యెహోవా, నీ కనికరములు మితిలేనివి" అని వ్రాయబడినది. యిది కీలకమైన వచనము. అంతే గాక కీర్తనాకారుడు దేవుని వాక్యము ద్వారా తనను బ్రతికించుమని (ఉజ్జీవింపచేయుమని) దేవుని కృప, కనికరములను కోరుకుంటున్నాడు.

1. యీ వచనములు మనము దేవుని కాపుదలకొరకు ప్రార్థించడానికి ప్రోత్సహిస్తున్నాయి.
   ఎ) దేవుని విడుదల, కాపుదల తనకు మూడు కారణములను బట్టి అవసరమైనదని కీర్తనాకారుడు తెలియజేయుచున్నాడు:
      1) తన వ్యక్తిగత పరిస్థితి –వ. 153
      2) తన నీతియుక్తమైన వ్యాజ్యము– వ. 154
      3) కొనసాగుతున్న తన సమస్యలు – వ. 157
   బి) కీర్తనాకారుడు దేవుని వాక్యమందు తన నమ్మకమును వ్యక్తపరుస్తున్నాడు
      1) దేవుని వాక్యమును తాను అనుసరిస్తున్నాడు – వ. 153
      2) దుష్టులపట్ల తన వైఖరి– వ. 155,158
      3) దేవుని వాక్యమును తానెంతో యిష్టపడుతున్నాడు – వ. 159
      4) దేవుని వాక్యము నమ్మదగినదన్న నిశ్చయతను తాను కలిగియున్నాడు – వ. 160
2. దేవుని బలము కొరకు ప్రార్థించమని యీ వచనములు మనలను ప్రోత్సహించుచున్నవి. దేవుని మాటల చొప్పున (వ. 154), ఆయన న్యాయవిధులనుబట్టి (వ. 156) మరియు ఆయన కృప చొప్పున (వ. 159) తన బలము బయలు పరచబడును.

దేవుని కృప మరియు ఆయన కనికరములను మించి మన హృదయములకు బలము కలిగించేవి వేరే ఏమీ లేవు. ముఖ్యంగా మనము శ్రమను అనుభవిస్తున్నప్పుడు యివి ఎంతో బలమునిస్తాయి. మనము ఆత్మీయంగా విఫలమైనపుడు దేవుని కృప మనకున్నది గనుక ఆయన మనలను పైకి లేవనెత్తును.

**ధ్యాన వచనము 159:** *యెహోవా, చిత్తగించుము. నీ ఉద్దేశ్యములు నాకెంతో ప్రీతికరములు. నీ కృపచొప్పున నన్ను బ్రదికింపుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యము నన్ను లేవనెత్తునదిగా, నా వైఖరిని శుద్ధిచేయునదిగా, నీ కొరకు జీవించవలెనన్న నా తీర్మానమును బలపరచునదిగా వున్నందుకు నీకు వందనములు.*

యీ వాక్యభాగములోని వచనములు 'షీన్' (shin) అను హెబ్రీ అక్షరముతో మొదలగుచున్నాయి. 162వ వచనములో, "విస్తారమైన దోపు సొమ్ము సంపాదించిన వానివలె నీ విచ్చిన మాటనుబట్టి నేను సంతోషించుచున్నాను" అని వ్రాయబడినది. బైబిల్‌ను మనము ఒక ప్రశస్తమైన నిధిగా కలిగియున్నామా? బైబిల్ మనకు ఎలాంటి నిధిగావున్నది? మరియు అది మనకు ఏమి చేస్తుంది? అను ప్రశ్నలను గురించి ఆలోచించుటకు మనము కొంత సమయమును కేటాయించాలి. బైబిల్ మనపట్ల జరిగించే నాలుగు సంగతులను క్రింద తెలిపిన విధంగా గమనించుము:

1. బైబిల్ మనకు ఉత్సాహమును కలుగజేస్తుంది.
   ఎ) సంతోషము - వ. 162 బి) ప్రేమ - వ. 163 సి) స్తుతి - వ. 164
2. బైబిల్ మనకు కలుగజేయు ఫలము:
   ఎ) నిర్నిమిత్తముగా కలిగే హింసలో హృదయమందు వాక్యముపట్ల భయమును కలిగిస్తుంది - వ. 161
   బి) అబద్ధమును అసహ్యించుకునేటట్లు చేస్తుంది- వ. 163
   సి) వాక్యమునకు విధేయత కలిగియుండుటకు తీర్మానము తీసుకునేటట్లు చేస్తుంది- వ. 166 - 168
3. బైబిల్ మనకు కలిగించే ప్రోత్సాహము - వ. 165
   ఎ) నెమ్మది కలిగించుట బి) స్థిరత్వమును కలిగించుట
4. బైబిలు మనకు నిరీక్షణకలుగజేయుచున్నది- వ. 166

పైన తెలిపిన విధంగా మరియు ఇంకా ఎన్నో రీతులలోను దేవుని వాక్యము మనకు ఉపయోగకరంగా వుంటున్నది. మనము దేవుని వాక్యమును ప్రతి రోజు చదివి, ధ్యానించాలన్నది యీ అనుదిన ధ్యానముల ఉద్దేశ్యములలో ఒకటైయున్నది. దేవుని వాక్యము మనకు ఎంతగానో అవసరమైయున్నది.

**ధ్యాన వచనము 165 :** *నీ ధర్మశాస్త్రమును ప్రేమించువారికి యెంతో నెమ్మది గలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియు లేదు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ వాక్యమును ఒక ధన నిధిగా కూడబెట్టుకొందును. నా జీవితములో ప్రతి విషయములోను నాకు కావలసిన గ్రహింపు, జ్ఞానమును నాకు అనుగ్రహించుచున్నందుకు నీకు వందనములు.*

హెబ్రీ వర్ణమాలలోని ఆఖరి అక్షరము 'తౌ' (tau). పై వాక్య భాగములోని వచనములు యీ అక్షరముతో మొదలగుచున్నవి. యీ భాగములోని 174వ వచనములో కీర్తన 119 యొక్క సారాంశమును సూచించే మాటలు వ్రాయబడి యున్నవి – *"యెహోవా, నీ రక్షణకొరకు నేను మిగుల ఆశపడుచున్నాను. నీ ధర్మశాస్త్రము నాకు సంతోషకరము".* యీ మాటలు మన హృదయములలో వాస్తవమైనప్పుడు మన వైఖరి మరియు క్రియలలో ఆశ్చర్యకరమైన మార్పు కలుగుతుంది. దేవుడు కోరుకున్న రీతిలో మనము జీవించాలంటే ఆయన వాక్యము మనకు అవసరము.

1. కీర్తనాకారుని ప్రార్థన– వ. 169–170
   ఎ) ఆ ప్రార్థన దేవునియెదుట పెట్టబడిన 'మొఱ'గా వున్నది – వ. 169 ఎ
   బి) కీర్తనాకారుడు వివేకము కొరకు మొఱపెట్టుచున్నాడు– వ. 169 బి
   సి) దేవుని విమోచనపట్ల కీర్తనాకారుడు తన నమ్మకమును ప్రార్థనలో వ్యక్తపరచుచున్నాడు – వ. 170
2. కీర్తనాకారుని స్తుతి – వ. 171–172
   ఎ) స్తుతి చెల్లించవలసిన అవసరత –వ. 171
   బి) దేవుని వాక్యమును గూర్చి కీర్తనాకారుడు స్తుతి కీర్తన చేయుట– వ. 172
3. సహాయము కొరకు కీర్తనాకారుని మనవి – వ. 173–175
   ఎ) దేవుని సహాయము అడుగుటకు గల కారణము– వ. 173
   బి) కీర్తనాకారుని ప్రతిస్పందన– వ. 174–175
   సి) కీర్తనాకారుని పరిస్థితి– వ. 176ఎ
   డి) కీర్తనాకారుని మనవి – వ. 176 బి

యీ వాక్య భాగము దేవుని వాక్యముపట్ల మనము కలిగియుండ వలసిన ప్రతి స్పందనను గూర్చి వక్కాణించుచూ, ఆయన వాక్యము లేకుంటే మనము సులభంగా దేవుని సన్నిధినుండి దూరమై పోగలమని తెలియజేయుచున్నది (వ. 176).

**ధ్యాన వచనము 169 :** *యెహోవా, నా మొఱ నీ సన్నిధికి వచ్చును గాక. నీ మాట చొప్పున నాకు వివేకము నిమ్ము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ జ్ఞానమును నీ చిత్తమును తెలుసుకొనునట్లు నా మనో నేత్రములను తెరువుము. నేను నీ వాక్యమునుబట్టి ఆనందించుదును.*

యీ కీర్తన అవిశ్వాసులమధ్య నివసించుచున్న ఒక విశ్వాసి దేవునికి పెట్టుచున్న ఒక మొఱగా వున్నట్లు అనిపిస్తున్నది. కీర్తనాకారుడు నిత్యము అబద్ధములాడు పెదవులు గలవారిని, మోసకరమైన నాలుకలు గల వారిని మరియు సమాధానమును కాకుండా యుద్ధమునే కోరు మనుష్యులను ఎదుర్కొంటున్నాడు. నీవు కూడా కొన్ని సమయములలో అటువంటి కష్టతరమైన పరిస్థితులను ఎదుర్కొంటుండవచ్చును.

అటువంటి సమయములలో దేవుడు నిన్ను విడువకుండా నీకు విడుదల, ఆదరణ కలిగిస్తాడు. మన విశ్వాసము, నమ్మిక దేవునియందున్నది. కీర్తనాకారుడు "యెహోవా, నా ప్రాణమును విడిపించుము" అని తనను తప్పకుండా విడిపించగల, విడిపించబోయే దేవునికి మొఱపెట్టుచున్నాడు.

1. కీర్తనాకారుడు తన శ్రమలో దేవునికి మొఱపెట్టుట– వ. 1
2. ఆయనకు అవసరమైయున్న విడుదల – వ. 2
3. మోసకరమైన నాలుక – వ. 3
4. కీర్తనాకారుడు ఎదుర్కొంటున్న అధైర్యకర పరిస్థితులు – వ. 4–6
5. సమాధానమును తృణీకరించిన కీర్తనాకారుని శత్రువులు – వ. 7

యితరులు మనకు ఏమిచేసినను, మన గురించి ఏమిచెప్పినను మనము దేవునిపై, యీ లోకములో ఆయన కలిగియున్న ఉద్దేశ్యములపై మన గురి కలిగియుండవలెను. మోసము చేయుచు, అబద్ధములాడు వారితో కలిసినయెడల మన ప్రాణములకు గొప్ప నష్టము కలుగును. యితరులు ఎలా ప్రతిస్పందించినను మనము సత్యముకొరకే నిలబడవలెను.

**ధ్యాన వచనము 1 :** *నా శ్రమలో నేను యెహోవాకు మొఱపెట్టితిని. ఆయన నాకు ఉత్తరమిచ్చెను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా మొఱలను విని, నాకు విడుదలను గూర్చిన వాగ్దానమిచ్చినందుకు నీకు వందనములు.*

యీ కీర్తనలో దేవుడు తన ప్రజలకు అనుగ్రహించే కాపుదల మరియు సంరక్షణను గూర్చి తెలుపబడినది. పరలోకమును మరియు ఈ భూమిని సృష్టించిన సృష్టికర్త నుండే మనకు సహాయము కలుగునని యీ కీర్తన ద్వారా జ్ఞాపకము చేయబడుచున్నాము. యీ వాక్యభాగములో కీర్తనాకారుడు కనీసం పదిసార్లు దేవుని పేరును వాడుచున్నాడు. సాధారణంగా *"మనము, దేవుడు కలిసినపుడు అధిక సంఖ్యగా చేయబడెదమని"* సామెతగా చెప్పుకొందుము. కొన్నిసార్లు మనకు గతంలో ఎదురైన అనుభవములనుబట్టి శత్రువు భయమును కలిగిస్తాడు. అయితే దేవుడు మన సహాయకుడు. ఆయన మనలను ఎల్లప్పుడు భద్రపరుస్తాడు. మనలను ఎన్నడూ ఎడబాయడు. ద్వితీయోపదేశకాండం 33:27లో "శాశ్వతుడైన దేవుడు నీకు నివాస స్థలము. నిత్యముగనుండు బాహువులు నీ క్రిందనుండును" అని చదువుచున్నాము.

1. మన సహాయమునకు మూలము - వ.1-2
2. మనలను కాయు దేవునికి నిద్ర అక్కరలేదు- వ.3-4
3. మనకు నీడగా వుండి ఆయన మనలను కాపాడును - వ.5-6
4. మన ప్రాణములను ఆయన భద్రపరచును - వ.7
5. నిరంతరము దేవుడు తన కాపుదలను మనకు తోడుగా వుంచును - వ.8

దేవుడు ఎల్లప్పుడు మనకు తోడైయున్నాడని తెలుసుకొనుట ఎంతో ఆదరణ కలిగించే సత్యము. మనలను సంరక్షిస్తానని ఆయన మనకు వాగ్దానము చేసియున్నాడు. భవిష్యత్తును గురించి దేవుడు మనకు చేసిన వాగ్దానములు మన గ్రహింపునకు మరియు మన ఊహకు మించియున్నవి (1కొరింథీ 2:9).

**ధ్యాన వచనము 1-2:** *కొండలతట్టు నా కన్నులెత్తుచున్నాను. నాకు సహాయము ఎక్కడనుండి వచ్చును? యెహోవా వలననే నాకు సహాయము కలుగును. ఆయన భూమ్యాకాశములను సృజించినవాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో నీయొక్క నిత్యమైన కాపుదల, భద్రత నాకు తోడుగా వుంచినందుకు మరియు నన్ను యెల్లప్పుడు కాయుదువన్న నిశ్చయతకొరకు నీకు స్తుతులు చెల్లించెదను.*

యెరూషలేము అను పదము బైబిల్‌లో 118 సార్లు పేర్కొనబడినది. యీ పట్టణము ప్రపంచములోకెల్లా ముఖ్యమైన పట్టణము. యిది ఇశ్రాయేలుకు నిత్యమైన రాజధాని నగరము. దేవుడు యీ పట్టణములో తన నామమును నిరంతరము ఉంచుటకు దానిని ఏర్పరచుకొన్నాడు. భౌతికమైన యెరూషలేము నగరము ఇశ్రాయేలులో ఉండగా, నీతి నివసించే *"పరలోక యెరూషలేము"*ను దేవుడు ఒకానొక దినమున యీ భూమి మీద నెలకొల్పబోవుచున్నాడు. యీ *"పరలోక"* పట్టణము *"నూతన యెరూషలేము"*గా పిలువబడుతున్నది. యిది దేవుని ప్రజలు నిత్యము నివసించబోయే పట్టణము. అచ్చట రాత్రి వుండదు. తండ్రియైన దేవుడు, దేవుని గొఱ్ఱెపిల్ల మరియు మెస్సీయయైన ప్రభువైన యేసుక్రీస్తు మనకవసరమైన వెలుగుగా వుందురు. యీ ఆశీర్వదింపబడిన దినముకొరకు మనము ఎదురుచూస్తున్నాము. ఇశ్రాయేలులో వున్న భౌతిక యెరూషలేము లోని "పరిశు ద్ధ స్థలములు" యూదులకు, ముస్లింలకు, క్రైస్తవులకు పరిశుద్ధముగా యెంచబడుచున్నవని యెరూషలేమును *"అంతర్జాతీయ నగరము"*గా పరిగణించాలని కొందరు కోరుకుంటారు. అయితే బైబిల్ బోధిస్తున్న ప్రకారము యెరూషలేము ఇశ్రాయేలుకు చెందుతుంది.

1. దేవుని మందిరమునకు వెళ్లువారి హృదయములు సంతోషముతో నింపబడుట- వ. 1
2. ఆరాధికులు యెరూషలేము గుమ్మములలో ప్రవేశించుట- వ. 2
3. భద్రత కలిగించు రీతిలో యెరూషలేము కట్టబడుట - వ. 3
4. ఆరాధనకు వెళ్లు గోత్రముల యొక్క లక్ష్యము - వ. 4

దేవుని ఆరాధించి, ఆయన నామమునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుటకు యెరూషలేమునకు వెళ్లుదురు. ఎంత చక్కటి సత్యముతో యీ దినము గుర్తుచేయబడు చున్నాము! ఒకానొక దినమున ప్రపంచ దేశ ప్రజలందరు యెరూషలేమునకువచ్చి, దేవుని ఆరాధింతురు (జెకర్యా 14:16).

**ధ్యాన వచనము 1 :** *యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ నామము ఆరాధించబడుటకు, స్తుతించ బడుటకు యెరూషలేమును నీవు యెన్నుకొన్నందుకు నీకు వందనములు.*

యెరూషలేము దేవుని పట్టణము. యిది ఆదికాండం 14:18లో "షాలేము" అను పేరుతో పిలువబడినది. దీని మొట్టమొదటి రాజు "నీతిరాజు" అను అర్థమునిచ్చే "మెల్కీసెదెకు". మెల్కీసెదెకు అనగా అబ్రహామునకు ప్రత్యక్షమైన మన ప్రభువైన యేసుక్రీస్తు మరియు మెస్సీయ (హెబ్రీ 7:1-10). కీర్తన 76:2లో కూడా "షాలేము" అను పేరు వ్రాయబడినది. పై వాక్య భాగములోని వచనములలో యెరూషలేము "దావీదు వంశీయుల సింహాసనములు" కలిగిన స్థలముగా చెప్పబడుచున్నది. మెస్సీయ (యేసుక్రీస్తు) ఒకానొక దినము తన తండ్రియైన దావీదు సింహాసనముమీద కూర్చొని, ప్రపంచమంతటినీ పరిపాలించబోవుచున్నాడు. పై వాక్యభాగము యెరూషలేము పట్టణము "సమాధానపు" పట్టణమని నొక్కిచెప్పుచున్నది.

1. యెరూషలేములోని దేవుని సన్నిధి- వ. 5
2. యెరూషలేముకొరకు ప్రార్థన - వ. 6
3. యెరూషలేమునందున్న సమాధానము, నెమ్మది - వ. 7,8
4. యెరూషలేముపట్ల విశ్వాసులకుండ వలసిన ఉద్దేశ్యము - వ. 9

యెరూషలేము పట్టణమువలె మనలో అనేకులము సమాధానము లోపించిన వారమైయున్నాము. మనము విశ్వాసులముగా మారినపుడు "*విశ్వాసమూలమున నీతిమంతులముగా తీర్చబడి, దేవునితో సమాధానము*" కలిగియుందుము (రోమా 5:1). విశ్వాసులు తమ ప్రార్థనా విన్నపములను దేవునియొద్దకు తెచ్చి, కృతజ్ఞతాస్తుతులతో నిండిన హృదయములతో ప్రార్థించినప్పుడు వారికి "దేవుని సమాధానము" వాగ్దానము చేయబడినది. "సమాధానకర్త"యైన దేవుడు ఒకానొక దినమున యీ లోకమునకు సమాధానమును తీసుకువస్తాడు. అయితే అంతవరకు మన హృదయములకు సమాధానము అవసరము.

**ధ్యాన వచనము 9:** *మన దేవుడైన యెహోవా మందిరము నిమిత్తము నీకు మేలు చేయ ప్రయత్నించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ సమాధానమునుబట్టి నీకు వందనములు. ప్రభువైన యేసుక్రీస్తు (మెస్సీయ) వచ్చువరకు నిజమైన శాంతి యీ భూమిమీద వుండదని నాకు గుర్తు చేసినందుకు నీకు వందనములు.*

పై వాక్య భాగములో పరలోకమును మరియు భూమిని సృష్టించి, “ఆకాశమందు ఆసీనుడైన” దేవునిపైన మన కన్నులు నిలుపుకొని యుండవలసిన ప్రాముఖ్యతను గూర్చి కీర్తనాకారుడు తెలియజేయుచున్నాడు. దేవుని దాసులు నిందకు, తిరస్కారమునకు గురియైనప్పుడు దేవుడు కలిగించుకొని, తన కరుణను చూపుమని కోరుతూ దేవునికి పెట్టబడిన మొఱగా యీ కీర్తన వ్రాయబడినది. దేవుడు అత్యంత కరుణామయుడు, విడిపించుటకు సిద్ధమనసు గలవాడైయుండి, తనకు మొఱపెట్టి, మన అవసరత తీరుటకొరకు తనయందు నమ్మికయుంచవలసిందిగా మనలను ప్రోత్సహించుచున్నాడు. హెబ్రీ 4:16లో *“మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయముకొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదమని”* చదువుచున్నాము.

1. మన దేవుడు ఆకాశమందు కలిగియున్న స్థానము - వ. 1
2. దేవునియొద్ద కనిపెట్టుకొనుటకు అవసరమైన సహనము- వ. 2
3. దేవుని దాసులను తిరస్కరిస్తున్న వారి గర్వము - వ. 3
4. దేవుని కరుణకొరకు మనవి - వ. 4

నీ పరిస్థితి యెంత కష్టతరమైనదైనను దేవుడు ఎల్లప్పుడు కరుణామయుడై, మన పరిస్థితినుండి మనకు విడుదల కలుగజేయుటకు సమర్థుడైయున్నాడు. ఆయనకు మొఱపెట్టుటకు వెనుకాడకుండా, నీ జీవితములోని ప్రతి పరిస్థితియందును ఆయనయందు నమ్మికయుంచుము.

**ధ్యాన వచనము 1 :** ఆకాశమందు ఆసీనుడవైనవాడా, నీ తట్టు నా కన్నులెత్తు చున్నాను.

**ప్రార్థన:** *ప్రభువా, నీవు సమస్తమును చూచుచున్నావని, సమస్తమును యెరిగియున్నావని నాకు తెలియును. నా జీవితములో జరుగు ప్రతి విషయముపట్ల నీవు ఆలోచన కలిగి యున్నావని నేను యెరుగుదును.*

మనలను నాశనము చేసి, మన సాక్ష్యమును పాడుచేయవలెనని ప్రయత్నిస్తున్న మన శత్రువులను ఎదుర్కొనుటకు మనకవసరమైయున్న దేవుని సహాయమును గూర్చి యీ కీర్తన వివరించుచున్నది. నూతన నిబంధనలో అపొస్తలుడైన పౌలు "దేవుడిచ్చు సర్వాంగ కవచమును" ధరించుకొనమని మనకు తెలిపాడు. యీ కవచము దుష్టుని నుండి వచ్చు దాడులను ఎదిరించుటకు సహాయపడుతుంది. మనలను ఓడించి, గొప్ప అధైర్యమునకు గురిచేయాలన్న దుష్టుని యుక్తులతోను, అనేక ఒత్తిళ్లతోను మన జీవితం నిండియుంటుంది. 8వ వచనములో సెలవిచ్చినట్లు "భూమ్యాకాశములను సృజించిన యెహోవా నామమువలననే మనకు సహాయము కలుగుచున్నది".

1. మనకు ఎంతగానో అవసరమైయున్న దేవుని కాపుదల - వ. 1-2
2. మన శత్రువులయొక్క ఎదిరింపులవలన కలుగు ఒత్తిళ్లు - వ3-5
3. మనకు విడుదల కలిగించిన దేవుని స్తుతించుట - వ. 6-7
4. సహాయముకొరకు మనము దేవుని సన్నిధికి వెళ్లగలము - వ. 8

మనపైన శత్రువుయొక్క యెదిరింపులు ఎంత గొప్పవైనను, దేవుడు మనకు విడుదల కలుగజేసి, మనమెదుర్కొంటున్న ఒత్తిళ్లద్వారా మనలను బలపరచగలడు (1పేతురు 5:8-11).

**ధ్యాన వచనము 8 :** *భూమ్యాకాశములను సృజించిన యెహోవా నామమువలననే మనకు సహాయము కలుగుచున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నా శత్రువుల చేతిలోనుండి నాకు విడుదల కలుగజేసినందుకు నీకు వందనములు. నీ కొరకు జీవించుటకు మరియు నా జీవితములో నీ ఆశీర్వాదమును అనుభవించుటకు నాకు సహాయము చేయుచున్నందుకు నీకు వందనములు.*

దేవుడు "సమాధానము"నకు కర్తగా వున్నాడు. ఇశ్రాయేలుకు అవసరమైన సమాధానమును దేవుడు అనుగ్రహిస్తాడు. ఆయన మన కాపరి. యెరూషలేముచుట్టు పర్వతములున్నట్లు దేవుడు తన సన్నిధిని మన చుట్టు వుంచుచున్నాడు. మనము ఆయన మీద ఆధారపడుతున్నకొద్దీ ఆయన మంచితనముద్వారా మన జీవితములలో మేలును అనుభవిస్తామని గుర్తెరిగి, "ఆయన యందు ఎల్లవేళలా నమ్మిక" యుంచవలసిన వారముగా వున్నాము. నాలుగవ వచనములో చెప్పబడినట్లు మన "హృదయములలో" మనము "యథార్థత" కలిగియుండవలెను. అనేకసార్లు మనము మన సొంత అవిధేయతను బట్టి, దేవుని మరియు ఆయన వాక్యమును అలక్ష్యము చేయడాన్నిబట్టి నష్టమును కొనితెచ్చుకుంటాము.

1. సీయోను కొండను కదిలించుట అసంభవము– వ. 1
2. దేవుని కాపుదలను గుర్తెరుగుట– వ. 2
3. భక్తిహీనుల రాజదండము – వ. 3
4. దేవుని మంచితనముయొక్క ఫలితము – వ. 4
5. దేవుని సమాధానమును గుర్తెరుగుట – వ. 5

యీ కీర్తనలో దేవుని ప్రజలకు ఆయన కాపుదల మరియు దుష్టులకు ఆయన విధించే శిక్ష వాగ్దానము చేయబడియున్నవి. దేవుడు తన సమాధానమును కూడా వాగ్దానము చేసియున్నాడు. ఒకానొక దినము సమాధానకర్త, మెస్సీయయైన యేసుక్రీస్తు యీ భూమికి వచ్చి, తన రాజ్యమును స్థాపించబోవుచున్నాడు.

**ధ్యాన వచనము 1** : *యెహోవాయందు నమ్మికయుంచువారు కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలె వుందురు.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీయందు నమ్మికయుంచుదును. ప్రేమతో నీవు నా చుట్టు వుంచిన భద్రతమీద సంపూర్ణముగా ఆధారపడి, నీ మహిమ, స్తుతికొరకు నన్ను నేను అప్పజెప్పుకొనవలెనని ఆశపడుదును.*

ఇశ్రాయేలీయులు కలిగియున్న నిరీక్షణను గూర్చి మరియు దేవుని వాగ్దానములందు వారు కలిగియున్న నమ్మికను గూర్చి యీ కీర్తన ఎంతో బలంగా మాట్లాడుచున్నది. యూదా ప్రజలు బబులోనులో బందీలుగా వుండి, వారు సీయోనుకు తిరిగివచ్చిన సంఘటనను గూర్చి పై వాక్యభాగములో గుర్తుచేయబడుచున్నారు. అధికారియైన జెరుబ్బాబెలు మరియు ప్రధాన యాజకుడగు యెహోషువా నాయకత్వములో యూదా ప్రజలను దేవుడు బబులోనులోనుండి ఇశ్రాయేలుకు రప్పించినపుడు వారి దు:ఖము సంతోషముగా మారి, వారి హృదయములు తిరిగి గానము చేయుచుండెను. పిడికెడు విత్తనములతో "యేడ్చుచు పోవు విత్తువాడు" ఒకానొక దినమున "సంతోషగానము చేయుచు పనలు మోసికొని వచ్చునని" మనము గుర్తుచేయబడుచున్నాము. దేవుడు తన ప్రజలకు వాగ్దానముచేసిన మహిమతో పోలిస్తే యీ జీవితములోని శ్రమలన్నియు ఎన్నదగినవికావని దేవుని వాక్యము సెలవిస్తున్నది (రోమా 8:18-25).

1. చెరలో నుండి దేవుని ప్రజలు విడిపింపబడుట - వ. 1,4
2. దేవుని ప్రజల నాలుకలు ఆనందగానముతో పాడుట - వ. 2
3. దేవుడు తన ప్రజలపట్ల జరిగించిన కార్యములు - వ. 3
4. సంతోషముగా మారబోయే కన్నీళ్లు - వ. 5
5. పిడికెడు విత్తనములద్వారా కలుగబోయే గొప్పపంట - వ. 6

మనము కష్టతరమైన సమయముల ద్వారా వెళ్లుచున్నప్పుడు 5-6 వచనములను జ్ఞప్తికి తెచ్చుకొనుట ఎంతో ఆశీర్వాదకరము. యీ దినము మనము పెట్టుచున్న "కన్నీళ్లు" రేపటి దినపు "సంతోషముగా" మార్చడం దేవునికి సులభమే.

**ధ్యాన వచనము 6 :** పిడికెడు విత్తనములు చేతపట్టుకొని, యేడ్చుచుపోవు విత్తువాడు సంతోషగానము చేయుచు, పనలు మోసికొనివచ్చును.

**ప్రార్థన:** ప్రభువా, నా దుఃఖమును సంతోషముగా మార్చగల దేవుడవై యున్నందుకు మరియు నాకు విడుదలను, ఆశీర్వాదమును వాగ్దానము చేసినందుకు నీకు వందనములు.

మంచి కుటుంబములు ఎలా కట్టబడతాయన్న సత్యమును యీ కీర్తన మనకు గుర్తుచేయుచున్నది. అట్టి కుటుంబములు దేవుని చేత స్వయంగా నిర్మించబడతాయి. మనము దేవుని వాక్యమును అనుసరిస్తూ, మన పిల్లలకు దేవుని మార్గమును బోధించాలి (సామెతలు 22:6). పై వాక్య భాగములోని వచనములు దేవుడనుగ్రహించే సంతానపు ఆశీర్వాదమును గూర్చి తెలియజేయుచున్నవి. కొన్నిసార్లు మన సంతానము ఆశీర్వాదము కన్నా సమస్యాపూర్వకముగాను, భారంగాను వున్నట్లు మనకనిపిస్తుంది. దేవుడు చెప్పిన మాటలను నమ్మి, మన పిల్లలను బహుమానముగా మనకనుగ్రహించిన దేవునికి ప్రతి దినము వందనములు చెల్లించుట ప్రాముఖ్యమైన సత్యము. ఎందుకనగా మన పిల్లలు *"ఆయన యిచ్చు బహుమానము"* (వ.3). యీ దినము కొంత సమయము తీసుకొని, నీ పిల్లలనుబట్టి దేవునికి వందనములు చెల్లించి, నీ పిల్లలను నీవు ఎంతగా ప్రేమిస్తున్నావో వారికి తెలుపుము. వారిని నీ జీవితములో గొప్ప బహుమానముగా ఎంచుము.

1. దేవుని పని మరియు ఆయన కాపుదలను గుర్తించుట - వ.1
2. మనము సుఖమైన నిద్రను ఎలా పొందవలెనో గ్రహించుట - వ.2
3. పిల్లలు దేవుని బహుమానము - వ.3
4. అనేకమంది సంతానమునుబట్టి కలుగు ఆనందము- వ.4-5

ప్రస్తుత దినములలో వున్న సంస్కృతిలో మన జీవన శైలిని బట్టి మన కుటుంబములతో మనము సమయము తగినంతగా గడుపుటకు చాలా కష్టముగా వుంటుంది. తలిదండ్రుల తప్పుడు వైఖరి మరియు ఉదాహరణలనుబట్టి పిల్లలు చాలా నష్టపోతారు. దేవుని కట్టడలు నీ కుటుంబమునకు గొప్ప సంతోషమును మరియు ఆశీర్వాదమును కలిగిస్తాయి.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా యిల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే. యెహోవా పట్టణమును కాపాడని యెడల దాని కావలికాయువారు మేలుకొని యుండుట వ్యర్థమే.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకిచ్చిన కుటుంబమును బట్టి, సంతానమును బట్టి నీకు వందనములు. నీవు కోరుకుంటున్న రీతిలో నేను వారికి ఆశీర్వాదముగా వుందును గాక.*

యెహోవాయందు భయభక్తులు గలవాడు ధన్యుడు. దేవుడు అతనిపై, అతని కుటుంబముపై ఆశీర్వాదమును కొనసాగించును. పై వచనములు దేవునియందు భయభక్తులు కలిగియుండవలసిన అవసరతను గూర్చి బలమైన రీతిలో గుర్తు చేయుచు, గొప్ప ప్రోత్సాహమును కలిగించు విధంగా వ్రాయబడినవి. సామెతలు 9:10లో పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివి యెహోవాయందలి భయముతో సమాంతరముగా వున్నట్లు వ్రాయబడినది. దేవునికి భయపడడమనగా దుష్టత్వమునుండి తొలగిపోవుట (సామెతలు 16:6). యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహు ధైర్యము పుట్టించును (సామెతలు 14:26). సామెతలు 1:7లో యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలమని గుర్తుచేయబడుచున్నాము.

1. మనము నడవ వలసిన నడక – వ. 1
2. మన జీవితములకు కలుగు క్షేమము – వ. 2
3. ఫలించుచున్న భార్య – వ. 3
4. ఆశీర్వాదమునకు మార్గము – వ. 4
5. ఆశీర్వాదమును, సమాధానమును కలిగించు మాటలు – వ. 5–6

నిజమైన సమాధానము మరియు ఆశీర్వాదము దేవునినుండి కలుగును. యెషయా 26:3లో, "ఎవని మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతిగలవానిగా కాపాడుదువు. ఏలయనగా అతడు నీయందు విశ్వాసముంచియున్నాడు" అని దేవుని వాక్యము సెలవిస్తున్నది.

**ధ్యాన వచనము 4 :** *యెహోవాయందు భయభక్తులు గలవాడు యీలాగు ఆశీర్వదింపబడును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీపట్ల నేను కలిగియుండవలసిన జవాబుదారీ తనమును నేను గుర్తించి, నీవు నేనేమైయుండవలెనని కోరుకుంటున్నావో ఆలాగు వుండవలెనని ఆశపడుచున్నాను.*

ఇశ్రాయేలీయుల యెడల ఆ దేశపు శతృవులు వ్యవహరించిన తీరు యీ కీర్తనలో ప్రధాన అంశముగా వున్నది. ప్రారంభములోని రెండు వచనములలో "అధిక బాధలు" అను మాట వ్రాయబడియున్నది. అవును, ఇశ్రాయేలీయుల శతృవులు వారికి అధిక బాధలు కలిగించుటకు ప్రయత్నిస్తూ వచ్చారు. అయితే, ఇశ్రాయేలు దైవికమైన నిబంధనను బట్టి నశించిపోకుండా వున్నది. యీ నిబంధన యెలాంటి షరతులు లేనిదై, దేవుని విశ్వాస్యతమీద ఆధారపడియున్నది. యిది ఇశ్రాయేలు పనితీరుపై ఆధారపడియుండదు. ఇశ్రాయేలును దీవించువారిని దీవిస్తానని, ఆ దేశమును శపించువారిని శపిస్తానని దేవుడు వాగ్దానము చేసియున్నాడు. 8వ వచనములో చెప్పబడినట్లు ఇశ్రాయేలు శతృవులు "యెహోవా నామమున మేము మిమ్మును దీవించుచున్నాము" అని చెప్పరు. చరిత్రయంతటిలోను యీ మాట ఇశ్రాయేలీయులపట్ల నిజమైయున్నది. వారి విశ్వాసమును బట్టి వారు ఎన్నో బాధలొంది, హింసింపబడిరి. అయితే భవిష్యత్తులో ఒకానొకదినమున వారు ప్రతి ఫలమును పొందబోవుచున్నారు. 2 తిమోతి 2:12లో పౌలు చెప్పినట్లు "సహించినవారమైతే ఆయనతో కూడా ఏలుదుము".

1. ఇశ్రాయేలీయులు అనుభవించిన బాధలు - వ. 1
2. ఇశ్రాయేలు శతృవుల ప్రయత్నములు ఫలించకపోవుట - వ. 2
3. ఇశ్రాయేలుపై జరిగిన హింసాకాండ - వ. 3
4. న్యాయవంతుడైన దేవుని ప్రతిస్పందన - వ. 4
5. సీయోనును ద్వేషించువారికి వ్యతిరేకంగా చేయబడుతున్న మనవి - వ. 5-7
6. ఇశ్రాయేలీయులను దీవించని వారి శతృవులు - వ. 8

దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులను బాధించుటకు ప్రయత్నించిన వారినందరిని దేవుడు తీవ్రంగా శిక్షిస్తాడు. ఇది ఎంతో నిజము.

**ధ్యాన వచనము 4 :** *యెహోవా న్యాయవంతుడు. భక్తిహీనులు కట్టిన త్రాళ్లు ఆయన తెంపియున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నీ ప్రజలను యెలా కాయుచున్నది నాకు గుర్తు చేసినందుకు నీకు వందనములు. నీ ప్రజలకు బాధ కలుగజేయచూచువారికి నీవు తీర్పు తీర్చు దేవుడవుగా వున్నందుకు నీకు వందనములు.*

క్షమాపణ ముఖ్యమైన అంశముగా వున్న యీ కీర్తన దేవుని కనికరమును, తన ప్రజల పట్ల ఆయన కలిగియున్న పట్టింపును బలమైన రీతిలో గుర్తుచేయుచున్నది. అంతేగాక దేవుడు మన పాపముల పట్టికను సిద్ధపరచిన యెడల మనము ఆయన ముందు నిలువలేమని యీ కీర్తన తెలుపుచున్నది. దేవుడు "క్షమించుటకు సిద్ధముగా" వున్నాడను మాటలు (కీర్తన 86:5) మనకు ఒక శుభవర్తమానముగా వున్నాయి. దేవుడు తన ప్రజలను వారి పాపములన్నిటినుండి "విమోచించే" దేవుడుగా వున్నాడు గనుక ఇశ్రాయేలు ఆయనయందు మాత్రమే నిరీక్షణ కలిగి యుండవలెను. 1యోహాను 1:9లో *"మన పాపములను మనము ఒప్పుకొనినయెడల, ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును"* అని దేవుని వాక్యము సెలవిస్తుంది.

1. క్షమాపణ కొరకు కీర్తనాకారుని మొఱ - వ.1-2
2. మన పాపముల యొక్క పరిణామములు తట్టుకొనలేనివి - వ.3
3. దేవుని కనికరము - వ.4
4. మనకు అవసరమైయున్న నమ్మకము - వ.5-6
5. దేవుడు కలుగజేసే విమోచన - వ.7-8

దేవుడు మనలను క్షమించు దేవుడై యున్నందునుబట్టి మనకందరికి నిరీక్షణయున్నది గనుక దేవునికి స్తోత్రములు. మెస్సీయయైన ప్రభువైన యేసుక్రీస్తు మరణము ద్వారా యీ క్షమాపణ సాధ్యమైనది. యెషయా 53:5,6వ వచనములలో "మన అతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగగొట్ట బడెను.....యెహోవా మనయందరి దోషమును అతనిమీద మోపెను" అని చదువుచున్నాము.

**ధ్యాన వచనము 7:** *ఇశ్రాయేలూ, యెహోవామీద ఆశపెట్టుకొనుము. యెహోవాయొద్ద కృపదొరుకును. ఆయనయొద్ద సంపూర్ణ విమోచన దొరుకును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ క్షమాపణకొరకు నీకు వందనములు. నీ కుమారుడు, నా రక్షకుడు, ప్రభువైన యేసుక్రీస్తు మరణముద్వారా నాకు పాప విమోచన కలుగజేసినందుకు నీకు వందనములు.*

మన పూర్ణహృదయములతో మనము యెహోవాయందు నమ్మికయుంచినప్పుడు పై వచనములలో తెలుపబడిన వైఖరిని మనము కలిగియుందుము. అనగా వినయముతో కూడిన వైఖరిని కలిగి, చనుపాలు విడిచిన పిల్ల తన తల్లియొద్దనున్నట్లు దేవునిమీద ఆధారపడియుందుము. నేటి దినములలో విశ్వాసులలో మితిమీరిన అహంకారము, గర్వము వున్నాయి. మనము దేవుని చేత ఆశీర్వదింపబడినాము. అయితే దానితో స్వయం సంతుష్టులమైపోయాము. దేవుడు లేకుండా మనము లేమన్న సత్యమును గ్రహించుటకు విఫలమైపోవుచున్నాము. మన నిరీక్షణ మన బ్యాంకు ఖాతాలపై, మన గృహములపై , మనకున్న కార్లపై, మన ఉద్యోగాలపై కాదుగానీ, దేవునియందే నిరీక్షణ కలిగియున్నాము.

1. మనకు అవసరమైన వినయము – వ. 1
2. మనము అలవరచుకొనవలసిన జీవిత అలవాట్లు – వ. 2
3. మనకు నిత్యము అవసరమైన నిరీక్షణ – వ. 3

దేవుడు "విరిగి నలిగిన హృదయమును" ఘనపరుస్తాడు (కీర్తన 51:17). అటువంటి వైఖరి తనకిష్టమైన ఆరాధనగా దేవుడు సెలవిచ్చాడు. "విరిగిన హృదయము" గలవారికి యెహోవా ఆసన్నుడు (కీర్తన 34:18). ఆయన దీనులకు "కృపను అనుగ్రహించును" (యాకోబు 4:6).

**ధ్యాన వచనము 3 :** *ఇశ్రాయేలూ, యిది మొదలుకొని నిత్యము యెహోవామీదనే ఆశపెట్టుకొనుము.*

**ప్రార్థన:** *ప్రభువా, వినయముతో కూడిన హృదయము కలిగి, అన్ని వేళలయందు నీ మీద ఆధారపడి జీవించుటకు నాకు నేర్పింపుము.*

'యెహోవా, దావీదునకు కలిగిన "బాధలన్నిటిని" అతని పక్షమున జ్ఞాపకము చేసుకొనుము' అను ప్రార్థన మనకందరికీ వర్తిస్తున్నది. జీవితము ఎన్నో "బాధలతో" నిండి యున్నది. యీ ప్రార్థన చేయుటలో కీర్తనాకారుడు దేవుని ఆరాధించుటకు తీర్మానము కలిగియున్నాడని తెలుసుకుంటున్నాము. దేవునికి ఒక నివాస స్థలమును నిర్మించేవరకు తాను విశ్రాంతి తీసుకోడు. దావీదు దేవుని మందిరము కట్టుటకు కావలసిన సామగ్రియంతటిని సమకూర్చి, దర్శనమును కలుగజేయగా ఆయన కుమారుడైన సొలోమోను దేవుని మందిరమును కట్టించాడు. దేవుని ఆరాధించడమనేది విశ్వాసికి అన్నిటికంటెపైగా వున్న బాధ్యత. మనము ఆరాధించినపుడు మనకు కలుగుతున్న పరీక్షలు వేరేలా అనిపిస్తాయి. అవి మనకు అడ్డంకులుగా కాకుండా, దేవుని గుణము, ఆయన ప్రేమ బయలుపరచబడే మార్గాలుగా మారిపోతాయి.

1. తన బాధలను జ్ఞాపకముచేసుకోమని కీర్తనాకారుని ప్రార్థన - వ. 1
2. దేవునితో కీర్తనాకారుడు చేసిన వాగ్దానము - వ. 2
3. దేవుని నివాసస్థలమును కట్టుటకు కీర్తనాకారుడు కలిగియున్న తీర్మానము - వ. 3-5
4. దేవుని ఆరాధించుటకు పిలుపు - వ. 6-7

నిజమైన ఆరాధన యొక్క విలువను ఎన్నడూ తక్కువగా అంచనా వేయకుము. యోహాను 4:23లో యేసుక్రీస్తు, "తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు" అని సెలవిచ్చాడు. అంతేగాక, తరువాతి వచనములో "దేవుడు ఆత్మ *గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెనని*" పలికాడు.

**ధ్యాన వచనము 7:** *ఆయన నివాసస్థలములకు పోదము రండి. ఆయన పాదపీఠము యెదుట సాగిలపడుదము రండి.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో సమస్తము కంటె పైగా నా ఆరాధనను నీవు కోరుకుంటున్నావని జ్ఞాపకముంచుకొనుటకు నాకు సహాయము చేయుము.*

యీ వాక్య భాగము మెస్సీయయైన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన ప్రవచనముతో నిండియున్నది. 11వ వచనములో దేవుడు దావీదుతో చేసిన వాగ్దానమును గూర్చి చదువుచున్నాము - *"నీ గర్భఫలమును నీ రాజ్యము మీద నేను నియమింతును".* ప్రభువైన యేసుక్రీస్తు తల్లియగు మరియ దావీదు కుమారుడైన నాతాను ద్వారా దావీదు వంశావళిలో వున్నది. దేవుడు దావీదుతో చేసిన వాగ్దానము మరియు ఒక కన్యగా గర్భము ధరించుట ద్వారా నెరవేర్చబడింది (యెషయా 7:14; మత్తయి 1:23). తద్వారా సొలోమోను వంశావళిపై వున్న శాపము తొలగించబడింది (యిర్మీయా 22:28-30). యేసుక్రీస్తు జన్మించిన తరువాత సొలోమోను వంశావళిలో పుట్టిన యోసేపు మరియను వివాహమాడి, యేసుక్రీస్తును పెంపుడు కొడుకుగా చేసుకోవడంద్వారా దావీదు సింహాసనమునకు యేసుక్రీస్తు చట్టబద్ధమైన వారసత్వమును పొందాడు. దేవుడు దావీదుతో చేసిన వాగ్దానమును నెరవేర్చాడు. అంతేగాక ఆయన మనతో చేసిన వాగ్దానములన్నిటిని నెరవేరుస్తాడు.

1. ప్రతిస్పందించమని దేవునికి కీర్తనాకారుడు చేయు ప్రార్థన - వ.8
2. నీతివస్త్రములు ధరించుకున్న యాజకులు- వ.9
3. దేవునితో కీర్తనాకారుని మనవి - వ.10
4. దావీదుకు యివ్వబడిన వాగ్దానము- వ.11 ఎ, 12
5. దావీదు కుమారుల విధేయత కోరుతున్న దేవుడు-వ.11బి

దేవుడు దావీదుతో చేసిన వాగ్దానము షరతులు లేనిదై, మెస్సీయయైన యేసుక్రీస్తు రాకడతో ముడిపడియున్నది. దావీదు కుమారుడైన యేసుక్రీస్తు తన తండ్రియగు దావీదు సింహాసనముమీద కూర్చొని, ఒకానొక దినము యీ లోకమును పరిపాలించబోవు చున్నాడు.

**ధ్యాన వచనము 11, 12:** *నీ గర్భ ఫలమును నీ రాజ్యము మీద నేను నియమింతును..... యెహోవా సత్య ప్రమాణమును దావీదుతో చేసెను. ఆయన మాట తప్పని వాడు.*

**ప్రార్థన:** ప్రభువా, దావీదు కుమారుడైన ప్రభువైన యేసుక్రీస్తును యీ లోకమును పరిపాలించుటకు నీవు పంపెదవన్న వాగ్దానమునుబట్టి నేను ఆనందించుదును.

సీయోను లేదా యెరూషలేమును గూర్చి దేవుడు చేసిన ఆశ్చర్యకరమైన వాగ్దానములను గూర్చి పై వాక్య భాగము తెలియజేయుచున్నది. యెరూషలేమును సొంతము చేసుకొనవలెనని యీ లోక ప్రజలు పోట్లాడుచుండగా దేవుడు యెరూషలేము తనకు చెందియున్నదని, అది తన "నివాస స్థలమని" పేర్కొంటున్నాడు. 14వ వచనములో "ఇది నిత్యము నాకు విశ్రమ స్థానముగా వుండును" అని యెరూషలేమును గూర్చి దేవుడు స్పష్టంగా సెలవిస్తున్నాడు. దేవుని ప్రవచన ప్రణాళికలో యెరూషలేము ప్రధానమైన పాత్ర పోషించనున్నది. జెకర్యా 12:1–3లో యెరూషలేమునకు వ్యతిరేకముగా వచ్చువారికందరికీ అది ఒక "*మత్తు పుట్టించు పాత్ర*"గాను, "*బరువైన రాయి*"గాను వుండునని దేవుడు సెలవిచ్చాడు. ఒకానొక దినము తనవారికొరకు స్థలము సిద్ధపరుస్తున్న దేవునియొద్దనుండి "*నూతన యెరూషలేము*" దిగివచ్చుట మనము చూస్తాము. అది ఎంత గొప్ప దినము!

1. దేవుడు సీయోనును ఏర్పరచుకొనుట – వ. 13
2. దానియందు నివసించుటకు దేవుడు వచ్చుట – వ. 14
3. ప్రజలు యెరూషలేముద్వారా సంతుష్టులగుట – వ. 15
4. యాజకులయొక్క వస్త్రధారణ – వ. 16
5. దావీదు సంతానముపై తేజరిల్ల బోవుతున్న కిరీటము– వ. 17–18

దేవుని వాగ్దానములు సరియైన సమయములోనే ఆలస్యము లేకుండా నెరవేరుతాయి. ఇశ్రాయేలును గూర్చి, యెరూషలేమును గూర్చి మరియు తన పిల్లలకు రూపొందించిన మహిమతో కూడిన భవిష్యత్తును గూర్చి దేవుడు చేసిన వాగ్దానములన్నియు నెరవేరుతాయి. యీ సత్యమును ఎన్నడూ సందేహించవద్దు.

**ధ్యాన వచనము 13 :** *యెహోవా సీయోనును ఏర్పరచుకొని యున్నాడు. తనకు నివాస స్థలముగా దానిని కోరుకొనియున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ రాకడ దినము కొరకు యెదురుచూచెదను. నీ శాశ్వతమైన రాజ్యము యీ భూమిమీద స్థాపించబడును.*

ఐక్యత విశ్వాసులమధ్య యీ దినములలో ఎంతో అవసరమైయున్నది. దేవుని ఆశీర్వాదము ఐక్యతయొక్క ప్రాముఖ్యతతో ముడిపడియున్నది. పౌలు ఎఫెసీ 4:3లో మనము *"సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగిన వారము"*గా వుండవలెనని చెప్పియున్నాడు. సాతాను, వాని శక్తులు విశ్వాసులమధ్య జ్ఞానము, సమాధానమునకు బదులుగా అనైక్యతను, వివాదమును కలుగజేస్తాయి (యాకోబు 3:13-18). 3వ వచనములో వ్రాయబడిన "సీయోను కొండలు" అనుమాట యెరూషలేముయొక్క అనైక్యతను సూచిస్తున్నది. సమాధానకర్తయైన యేసుక్రీస్తు ఈ భూమికి తిరిగివచ్చినప్పుడు అశాంతితో వున్న యీ లోకమునకు నిజమైన సమాధానమును తీసుకువస్తాడన్న సత్యమునుబట్టి దేవునికి వందనములు చెల్లించుము.

1. ఐక్యత కలిగించే మనోహరత - వ. 1
2. ఐక్యత యొక్క ప్రశస్తత - వ. 2
3. ఐక్యత యొక్క వర్ణన - వ. 3 ఎ
4. ఐక్యతను గూర్చిన వాగ్దానము - వ. 3 బి

1 కొరింథీలోని మొదటి నాలుగు అధ్యాయములు కొరింథీ సంఘములోని విశ్వాసుల మధ్య వున్న అనైక్యతను గురించి వివరించుచున్నాయి. ఆ సంఘస్తులు బోధకుల యొక్క వ్యక్తిత్వము, వారి బోధనా పద్ధతులలో వున్న వ్యత్యాసములపై విభజించబడి, వారి మధ్య ఐక్యతను కలిగించే పరిశుద్ధాత్మ స్థానమును అలక్ష్యము చేసియుండిరి. విశ్వాసుల మధ్య ఐక్యతను కలిగించుటకు ఎల్లపుడూ ఉత్తమమైన రీతిలో ప్రయాసపడుము.

**ధ్యాన వచనము 1 :** *సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!*

**ప్రార్థన:** *ప్రభువా, విశ్వాసుల మధ్య భేదములు కలిగించి, అనైక్యతకు కారకుడను గాకుండా, వారి మధ్య ఐక్యతను కలిగించే సాధనముగా నేను వుండుటకు నాకు సహాయపడుము.*

యీ కీర్తనలో దేవుని మందిరములోని యాజకులు మరియు సేవకులు దేవుని స్తుతించమని కీర్తనాకారునిచేత కోరబడుచున్నారు. 1 పేతురు 2:5-9లో పేతురు విశ్వాసులందరినీ "యాజకులు"గా పేర్కొంటున్నాడు. హెబ్రీ 13:15-16లో "కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదుము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదుము.....అట్టి యాగములు దేవునికిష్టమైనవి" అని దేవుని వాక్యము సెలవిస్తున్నది. దేవునికి స్తుతియాగమర్పించి, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయుచుండుట యాజకులందరూ కలిగియున్న ప్రాథమిక కర్తవ్యము. దేవుని ఆరాధించి, స్తుతించడమనేది విశ్వాసికున్న అత్యధికమైన ప్రాధాన్యత.

1. దేవుని మందిరములో మనముచేయు స్తుతి - వ. 1
2. చేతులెత్తి దేవుని స్తుతించుట - వ. 2
3. దేవుని సృష్టి, ఆయన ఆశీర్వాదమును గూర్చిన ప్రకటన - వ. 3

మన స్తుతి, ఆరాధనల కన్నా దేవుని హృదయమును ఎక్కువగా హర్షింపజేయునదేదీ లేదు. ఆయన ఆశీర్వాదమును పొందుటకంటె ఆయనను స్తుతించుట ప్రాముఖ్యమైనది. ఆయనను స్తుతించడమనగా ఆయన గుణము, ఆయన బలమును గూర్చి పొగడడమని తెలుసుకుంటున్నాము.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా సేవకులారా, యెహోవా మందిరములో రాత్రి నిలుచుండువారలారా, మీరందరు యెహోవాను సన్నుతించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ యాజకుడనుగా అనుదినము నిన్ను ఆరాధించి స్తుతించవలెనని మరియు సంతోషము, వందనములను బలులు నీకు అర్పించవలెనని కోరుకొందును.*

యీ వాక్య భాగములో "యెహోవాను స్తుతించుడి" అను మాటలు మాటిమాటికీ వ్రాయబడియున్నవి. 4వ వచనములో "యెహోవా తనకొరకు యాకోబును ఏర్పరచుకొనెను. తనకు స్వకీయ ధనముగా ఇశ్రాయేలును ఏర్పరచుకొనెను" అను మాటలు దేవుని హృదయము, ఆయన ప్రణాళికలో ఇశ్రాయేలుకున్న స్థానమును గుర్తుచేయుచున్నాయి. దేవుడు గొప్పవాడు మరియు మంచివాడైయుండి, ఆకాశమందును, భూమియందును తనకిష్టమైనదంతయు జరిగించుచున్నాడు. ఆరాధన యనేది "స్తుతించుట" తో కూడుకొని యున్నది. ఆరాధించు స్థలము (దేవుని మందిరము) ఆరాధనతో నిండియుండవలెను. దేవుడు తనను, తన గొప్ప తనమును గుర్తించి, దానినిబట్టి ఆయన నామమును స్తుతించవలెనని మనలను కోరుకుంటున్నాడు. 3వ వచనములో అట్లు చేయుట "మనోహరమని" వ్రాయబడియున్నది.

1. దేవుడు మనయొద్ద నుండి కోరే స్తుతి - వ. 1
2. మనము దేవుని స్తుతించే స్థలము- వ. 2
3. దేవుని స్తుతించుట మనోహరకరము- వ. 3
4. దేవుడు తన హృదయములో ఇశ్రాయేలుపట్ల కలిగియున్న ప్రాధాన్యత- వ. 4
5. మన దేవుడు సమస్తముపైన హెచ్చింపబడియున్నాడు - వ. 5
6. మన దేవుడు తన కిష్టమైనది జరిగించువాడు - వ. 6

మనము దేవుని స్తుతించినపుడు ఆయన చిత్తమును జరిగిస్తూ, ఆయన హృదయమును ఆనందింపజేయుదుము. తనను స్తుతించుటకు ఆయన మనలను సృష్టించాడు. మన స్తుతులను ఆయనకు చెల్లించకపోయిన యెడల నెమ్మది లేనివారమై, ఖాళీగా వున్న హృదయములను కలిగియుందుము.

**ధ్యాన వచనము 5:** *యెహోవా గొప్పవాడనియు, మన ప్రభువు సమస్త దేవతలకంటె గొప్ప వాడనియు నేనెరుగుదును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ గొప్పతనమునుబట్టి, నీ మంచితనమునుబట్టి నీకు స్తుతులు చెల్లించుదును. నీకిష్టమైన దానిని నీవు జరిగించుచున్నందుకు నిన్ను స్తుతించెదను.*

పై వాక్య భాగములో దేవుని మహాత్మ్యము గురించి వివరింపబడినది. ఆయనను మనము స్తుతించుటకు యిది ఒక కారణముగా వున్నది. ఆయన బలము మనచుట్టువున్న ప్రకృతిలోను, ఆయన సృష్టిలోను, ప్రాచీన ఐగుప్తులో తాను జరిగించిన అద్భుతములలోను మరియు ఇశ్రాయేలీయులు అరణ్యమార్గము ద్వారా వాగ్దానము చేయబడిన కనాను దేశములో ప్రవేశించుటలో తాను వారికి కలిగించిన విమోచనయంతటిలోను బయలు పరచబడుచున్నది. దేవుడు దేనినైనా జరిగించగలడని, ప్రకృతికి విరుద్ధమైన గొప్ప అద్భుతకార్యములు జరిగించ సమర్థుడని తెలుసుకుంటున్నాము.

1. వాతావరణము దేవుని అధీనములో వుండుట – వ. 7
2. ప్రాచీన ఐగుప్తులో దేవుడు తీసుకు వచ్చిన పరిణామములు – వ. 8–9
3. దేవుడు అన్యజనుల రాజ్యములను గెలిచాడు – వ. 10–11
4. దేవుడు అన్యుల దేశమును ఇశ్రాయేలీయులకు యిచ్చాడు – వ. 12
5. నిత్యము నిలిచియుండే దేవుని నామము స్తుతింపబడుట – వ. 13

దేవుడు ఏమి జరిగించాడు, ఏమి జరిగించగలడు అనువాటిని ఎన్నడూ మరచిపోవద్దు. మన సమస్యలు తీరిపోయేవిగా మనకు అనిపించక పోవచ్చును. అయితే దేవునికి అసాధ్యమైనదేదీ లేదు.

**ధ్యాన వచనము 13 :** *యెహోవా, నీ నామము నిత్యము నిలుచును. యెహోవా నీ జ్ఞాపకార్థమైన నామము తరతరములుండును.*

**ప్రార్థన:** *ప్రభువా, చేయుటకు నీకు అసాధ్యమైనది యేదియు లేదని నేనెరుగుదును. నాకు మేలుకరమైనది, నీకు మహిమ, స్తుతి కలిగించునది నీవు జరిగింతువని నిన్ను నమ్ముకొందును.*

ఇశ్రాయేలుయొక్క దేవుడు మనుష్యుల చేతులతో నిర్మింపబడలేదు. "అన్యజనుల విగ్రహములు" మనుష్యుల చేతి పనులు. అవి ఎటువంటి అద్భుతమును జరిగించలేవు. వాటిని నిర్మించిన మనుష్యులకు ప్రత్యుత్తరమియ్యలేవు. అయితే, మన దేవుడు పూర్తిగా వేరై యున్నాడు. ఆయన అందరికీ న్యాయాధిపతిగా వున్నాడు. మన స్తుతులకు ఆయన మాత్రమే పాత్రుడుగా వున్నాడు. యీ కీర్తన చివరి వచనములో ఆయన "యెరూషలేములో నివసించుచున్నాడని" చదువుచున్నాము. తన మందిరమును నెలకొల్పి, తన సన్నిధిని బయలుపరచుటకు ఆయన యెరూషలేమును ఏర్పరచుకొన్నాడు. యెరూషలేమును తమ సొంతం చేసుకొనేందుకు యీ ప్రపంచ దేశములు పోరాటమును కొనసాగిస్తాయి. అయితే యెరూషలేముపట్ల దేవుడు భవిష్యత్తులో జరిగించ తలపెట్టిన కార్యములు యీ ప్రపంచదేశాలు చేస్తున్న ప్రయత్నాలను బట్టి ఆగిపోవు.

1. దేవుని న్యాయముయొక్క ప్రభావము - వ. 14
2. అన్యజనుల యొక్క విగ్రహములు - వ. 15
3. విగ్రహములు ప్రతిస్పందించలేవు- వ. 16-17
4. విగ్రహములయందు నమ్మికయుంచుట వ్యర్థము - వ. 18
5. దేవునియందు నమ్మికయుంచి, ఆయనను స్తుతించుట ఎంతో ముఖ్యమైనది- వ. 19 - 21

మనుష్యులు నిర్మించి, సృష్టించే వాటియందు ఎన్నడూ నమ్మికయుంచవద్దు. నిత్యమైన దేవుడే సమస్తమును సృష్టించియున్నాడు. మన సంపూర్ణమైన విశ్వాసమునకు మరియు మన స్తుతులకు ఆయనే పాత్రుడు.

**ధ్యాన వచనము 21 :** యెరూషలేములో నివసించు యెహోవా సీయోనులోనుండి సన్నుతింపబడును గాక. యెహోవాను స్తుతించుడి.

**ప్రార్థన:** *ప్రభువా, మనుష్యులు నీకు బదులుగా సృష్టించుకున్న వాటియందు నమ్మికయుంచుటకు తిరస్కరించి, నీయందు మాత్రమే నేను నమ్మిక కలిగియుందును.*

యీ కీర్తనలోని ప్రతి వచనము "ఆయన కృప నిరంతరముండును" అను మాటలతో ముగియుచున్నది. హెబ్రీ భాషలో "చెసెద్" అను పదమునకు "కృపాతిశయము" మరియు "కరుణాతిశయము" అని అర్థము. దేవుని ఆశ్చర్యకార్యములన్నిటి వెనుక ఆయన కనికరమున్నది. పై వాక్య భాగము దేవుని సృష్టియైన యీ భౌతిక ప్రపంచమును గూర్చి తెలియజేయుచున్నది. "తాను మాత్రమే మహాశ్చర్యకార్యములు చేయగల" దేవునికి "కృతజ్ఞతాస్తుతులు" చెల్లించుమని దేవుని వాక్యము మనలను ప్రోత్సహించుచున్నది. ఆకాశములోవున్న సూర్యుని, చంద్రుని, నక్షత్రములను చూడుము. వాటి నన్నిటిని మన దేవుడు సృష్టించాడు. అవన్నియు దేవుని శక్తి మరియు ఆయన మహిమను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి.

1. దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించమని కోరుతున్న కీర్తనాకారుడు – వ.1–3
2. గొప్ప కార్యములు చేయుటకు సమర్థుడైన దేవుడు – వ.4
3. దేవుని జ్ఞానమును గుర్తించుట – వ.5
4. దేవుని బలమును గూర్చి సాక్ష్యమిస్తున్న సృష్టి – వ.6–9

రాత్రిపూట మనలో ప్రతి ఒక్కరము ఆకాశములోని నక్షత్రములను చూచుట మంచిది. వాటిలో ప్రతి నక్షత్రమును దేవుడు ఎరిగి, వాటన్నిటికీ పేర్లు పెట్టియున్నాడు. ఆయన గొప్పతనము మన గ్రహింపునకు మించియున్నది. అయితే ఆయన "మన దేవుడు".

**ధ్యాన వచనము 1 :** *యెహోవా దయాళుడు. ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీ గొప్పతనమునుబట్టి, నీ మంచి తనమునుబట్టి, నీ జ్ఞానమునుబట్టి, నీ బలమునుబట్టి నీకు వందనములు. నాకున్న యే సమస్యయైనను పరిష్కరించుటకు నీకు కష్టతరముకాదు గనుక నీకు వందనములు.*

*"ఆయన కృప నిరంతరముండును"* అను మాటలతో ముగియుచున్న వచనములను కలిగిన యీ వాక్యభాగము ఇశ్రాయేలు చరిత్రను గూర్చి, దేవుడు వారిపట్ల జరిగించిన కార్యములను గూర్చి తెలియజేయుచున్నది. ఇశ్రాయేలీయులను గూర్చి చదివిన యెడల దేవుడు వారికనుగ్రహించిన బలము మరియు ఆయన కృపద్వారా వారు అరణ్య ప్రయాణమును తట్టుకొని, తమ శత్రురాజులను ఓడించారన్న విషయము స్పష్టమగుచున్నది. మార్గమధ్యమంతటిలోను దేవుడు వారి అవసరములు తీరుస్తూ వచ్చాడు. పై వాక్య భాగము యొక్క సారాంశమును 26వ వచనములో చదువుచున్నాము: *"ఆకాశమందుండు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును".* ఇశ్రాయేలీయుల జీవితములలోని ప్రతి పరిస్థితిని దేవుడు తన అధీనములో కలిగి, వారి పట్ల తన ప్రణాళికను జరిగిస్తూ వచ్చాడు. ఆయన వారిముందు నడచి వెళ్లి, తన గొప్ప మహాత్మ్యమును మాటిమాటికీ బయలుపరుస్తూ వచ్చాడు.

1. ఐగుప్తునుండి విడుదల పొందిన ఇశ్రాయేలీయులు - వ. 10-12
2. ఐగుప్తు సైన్యము ముంచివేయబడుట - వ. 13-15
3. అరణ్య మార్గములో దేవుడు తన ప్రజలను నడిపించుట - వ. 16
4. శత్రురాజులపై దేవుడు ప్రతీకారము తీర్చుకొనుట - వ. 17-20
5. కనాను దేశమును స్వాస్థ్యముగా దేవుడు తన ప్రజలకిచ్చుట - వ. 21-22
6. దేవుడు తన ప్రజలను జ్ఞాపకము చేసుకొనుట- వ. 23
7. దేవుడు తన ప్రజలను విడిపించి, వారి అవసరములు తీర్చుట- వ. 24-25
8. కృతజ్ఞతాస్తుతులతో ఆయన ప్రజలు ప్రతిస్పందించుట - వ. -26

దేవుడు తన ప్రజలను వారి మార్గమంతా నడిపించి, వారి అవసరాలన్నీ తీరుస్తూవచ్చాడు. వారి శత్రువుల మీద వారికి విజయమనుగ్రహించాడు. కనాను దేశమును సాస్థ్యముగా వారికిచ్చాడు. దేవుడు జరిగించిన, జరిగించబోయే దానినంతటినిబట్టి కృతజ్ఞతా స్తుతులతో మనము ప్రతిస్పందించవలెను.

**ధ్యాన వచనము 26 :** *ఆకాశమందుండు దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నీ ప్రజలైన ఇశ్రాయేలీయులపట్ల జరిగించిన సమస్తమునుబట్టి నిన్ను స్తుతించి, నీకు వందనములు తెలియజేసుకొందును. నా అవసరములన్నిటిని తీర్చెదనని వాగ్దానమునిచ్చినందుకు నీకు వందనములు.*

ఇశ్రాయేలీయులు బబులోనుకు బందీలుగా తీసుకొనిపోబడిరి. అక్కడ సీయోను గీతములు పాడుటకు వారికి కష్టముగా అనిపించింది. క్రీస్తు పూర్వము 586లో యెరూషలేము పాడుచేయబడినది. అయితే దేవుడు తన ప్రజలను ఎన్నడూ మరచిపోలేదు. 6వ వచనములో కీర్తనాకారుడు యెరూషలేమును తన "ముఖ్య సంతోషము" కంటె అధికముగా యెంచుచున్నాడు. ఇశ్రాయేలుకును, యెరూషలేము పట్టణమునకును చేసిన దానినిబట్టి బబులోను పాడుచేయబడబోవునని పై కీర్తన చివరి వచనములలో చదువుచున్నాము. యీ జీవితములో మనము దుఃఖమును, కష్టమును ఓర్చుకోవలసి వచ్చినను దేవుడు తన పిల్లలకు అంతిమ విజయమును వాగ్దానము చేసియున్నాడు.

1. సీయోను జ్ఞాపకము చేసికొనబడుట – వ. 1
2. ఇశ్రాయేలీయులు బబులోనులో సీయోను గీతములను పాడకపోవుట – వ. 2-4
3. యెరూషలేము జ్ఞాపకము చేసుకొనబడుట – వ. 5-6
4. బబులోనుపై దేవుని తీర్పు – వ. 7-9

మన జీవితములలో మనము ఎన్నో దుర్ఘటనలను ఎదుర్కొనవలసివస్తుంది. అయితే దేవుని వాగ్దానములు మనకు తోడుగా లేకుంటే మనము పూర్తిగా నిరాశ, నిస్పృహ మరియు అధైర్యమునకు లోనవుతాము. దేవుడు తన నిబంధనను ఎన్నడూ మరచిపోడు. తన వాగ్దానములన్నిటిని మనపట్ల నెరవేరుస్తాడు.

**ధ్యాన వచనము 6 :** *నేను నిన్ను జ్ఞాపకము చేసికొననియెడల, నా ముఖ్య సంతోషముకంటె నేను యెరూషలేమును హెచ్చుగా యెంచనియెడల నా నాలుక నా అంగిటికి అంటుకొనును గాక.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు యెంత తీవ్రమైన శోధన, నొప్పి, శ్రమ కలిగినను, నాకు విజయమును, ఆశీర్వాదమును వాగ్దానము చేసినందుకు నీకు వందనములు.*

రాజైన దావీదు రచించిన యీ స్తుతి కీర్తన తన జీవితములో తనకు అతి ప్రాముఖ్యమైనది ఏమిటన్న దానికి సాక్ష్యమిచ్చుచున్నది. దేవుడు తనకు జరిగించిన దానిని బట్టి తాను దేవునికి చెల్లిస్తున్న స్తుతి, ఆరాధన నిజమైనదిగాను, నిరంతరము కొనసాగేదిగాను వున్నది. ఒకానొక దినమున సమస్త దేశములు ఆయనను స్తుతించబోవుచున్నాయన్న సత్యమును తాను యెరిగియున్నాడు. తన "ఆపదలో" తనను "బ్రతికించి", దేవుడు తనకు నమ్మికను మరియు నిశ్చయతను తిరిగి సమకూర్చుతాడన్న గ్రహింపు దావీదు కలిగియున్నాడు. దేవుడు తనలో మొదలుపెట్టిన కార్యమును పరిపూర్ణము గావించబోవుచున్నాడని దావీదు యెరిగియున్నాడు. పౌలు ఫిలిప్పీ 1:6లో, *"మీలో యీ సత్క్రియను ఆరంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను"* అని చెప్పియున్నాడు.

1. పూర్ణ హృదయముతో దావీదు దేవుని స్తుతించుట– వ. 1
2. దేవుని వాక్యము గొప్ప చేయబడుట– వ. 2
3. దావీదు ప్రార్థనను ఆలకించిన దేవుడు– వ. 3
4. భూరాజులందరు దేవుని గూర్చి పాడి, ఆయనను స్తుతించుట– వ. 4–5
5. గర్విష్టులు దేవుని ఆశీర్వాదమును పొందలేరు– వ. 6
6. దేవుని కాపుదలను అనుభవించిన దావీదు– వ. 7
7. దేవుడు తన ప్రణాళికను నెరవేరుస్తాడు. – వ. 8

అవును, మన జీవితములలో తాను మొదలుపెట్టి, కొనసాగిస్తున్న తన సత్క్రియను దేవుడు తప్పకుండా పూర్తిగావిస్తాడని మనము నమ్మవలెను. ఆయన మనలను *"బ్రతికించి, రక్షిస్తాడు"*.

**ధ్యాన వచనము 2 :** నీ పరిశుద్ధాలయము తట్టు నేను నమస్కారము చేయుచున్నాను. నీ నామమంతటికంటె నీ విచ్చిన వాక్యమును నీవు గొప్ప చేసియున్నావు. నీ కృపాసత్యములను బట్టి నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు నేను చెల్లించెదను.

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితములో సంభవించు ప్రతి పరిస్థితిలోను నిన్ను నమ్ముకొందును. నీ యొక్క పరిపూర్ణ ప్రణాళికను నా ద్వారా నెరవేర్చుచున్నావని నేనెరుగుదును.*

పై వాక్య భాగములో దావీదు దేవుని గుణములను గూర్చి ఉద్ఘాటించుట ప్రతి విశ్వాసి హృదయమునకు ఎంతో ప్రోత్సాహమును కలిగించుచున్నది. అదే సమయములో అవిశ్వాసులకు యిది ఒక హెచ్చరికగా వున్నది. పై వాక్యభాగము యొక్క ప్రారంభవచనములలో దేవుని 'సర్వజ్ఞత'ను గూర్చి తెలియజేయబడినది. అనగా మన తలంపు, మాట, క్రియలను మనకంటే ముందుగానే దేవుడు ఎరిగియున్నాడు. *"ఇట్టి తెలివి నాకు మించినది"* అని కీర్తనాకారుడు పలుకుచున్నాడు. హెబ్రీ భాషలో దీని అర్థము *"దేవుని గూర్చిన తెలివి మన ఊహకు మించియున్నది"*. అది గ్రహింపశక్యము కానిది. దేవుడు సమస్తమును యెరిగియున్నాడు. మనలో ప్రతి ఒక్కరికి ఏది ఉత్తమమో అది ఆయనకు తెలిసియున్నది.

1. దేవుడు మనలను పరిశోధించుట– వ. 1
2. నా జీవిత పరిస్థితులన్నీ దేవుడు యెరిగియున్నాడు– వ. 2
3. నా జీవిత రహస్యములన్ని ఆయనకు తెలియును– వ. 3
4. నేను మాట్లాడే మాటలను ఆయన యెరిగియున్నాడు– వ. 4
5. నా జీవితముయొక్క స్థిరత్వము ఆయన అధీనములో వున్నది– వ. 5
6. దేవుని తెలివియొక్క గొప్పతనము– వ. 6

సామెతలు 3:5లో మన స్వబుద్ధిని *"ఆధారము చేసికొనకుండా"* మనము దేవునియందు నమ్మికయుంచవలెనని దేవుని వాక్యము సెలవిస్తున్నది. అంతేగాక 6వ వచనం ప్రకారము మన ప్రవర్తనయంతటి యందు ఆయన అధికారమునకు *"ఒప్పుకొని"* ఆయన మన *"త్రోవలను సరాళము చేస్తాడన్న"* నమ్మికను మనము కలిగియుండవలెను. ఆయనను గూర్చిన తెలివిమీద ఆనుకొని, ఆయన సమస్తమును యెరిగియున్నాడని తెలుసుకొనుము.

**ధ్యాన వచనము 6:** *ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము. అది నాకందదు.*

**ప్రార్థన:** *ప్రభువా, ప్రతి విషయమును గూర్చి నీకున్న తెలివినిబట్టి నేను విశ్రమింతును. నా జీవితమునకు యింతకు మునుపే నీవొక ప్రణాళికను రూపొందించియున్నావని నేనెరుగుదును. నీకు సమస్తమును తెలియును గనుక నేనేమి చెప్పినను, ఏమి చేసినను అది నీ ప్రణాళికను తారుమారు చేయదు.*

పై వాక్యభాగములో కీర్తనాకారుడు దేవుడు “సర్వాంతర్యామి”యని అనగా ఆయన అంతటా వున్నాడని మరియు మనము ఆయన సన్నిధినుండి దాగుకొనుటకు లేదా పారిపోవుటకు ప్రయత్నించలేమని తెలియజేయుచున్నాడు. యిది కొంతమందికి హెచ్చరికగా వున్నప్పటికీ దేవునితో నడుచుచున్నవారికి యిది గొప్ప ఆశీర్వాదము. దేవుడు మనలను ప్రేమిస్తూ, కాపాడుతూ, నడిపిస్తూ, ఆదరిస్తూ మరియు బలపరుస్తూ వున్నాడన్న సత్యమును తెలుసుకొనుట ఎంత ఆనందకరము! ప్రభువైన యేసుక్రీస్తు మత్తయి 28:20లో, “ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా వున్నానని” సెలవిచ్చాడు. అంతేగాక, “నిన్ను ఏ మాత్రమును విడువను. నిన్ను ఎన్నడును ఎడబాయనని” కూడా వాగ్దానమిచ్చాడు. నీవు ఒంటరిగా వున్నట్లును, దేవుడు ఎక్కడ వున్నాడనియు నీకనిపించవచ్చు. అయితే ఆయన నిన్ను విడిచి వెళ్లిపోలేదు.

1. దేవుని సన్నిధినుండి ఎక్కడికి పోలేనని పలికిన కీర్తనాకారుడు- వ.7
2. ఆకాశములోనికి వెళ్లినను ఆయన సన్నిధిని తప్పించుకోలేము- వ.8
3. ఆయన సన్నిధినుండి పారిపోవుటకు చేసే ప్రయత్నాలు వ్యర్థమే- వ.9-10
4. వెలుగు లేక పోవుట వలన ఆయన సన్నిధి ఉండదనుకోవడం పొరపాటు - వ.11-12

ఆయన ఎల్లప్పుడు మనతో వున్నాడన్న సత్యము మన హృదయములకు గొప్ప ఆదరణ కలిగిస్తుంది. మనము ఏ సమయములోనైనా ఆయనకు మొఱపెట్టవచ్చును. మన మొఱను విని, సమాధానమిచ్చుటకు ఆయన మనతో కూడా వున్నాడు. ఆయన సన్నిధిని గూర్చిన నిశ్చయతను కలిగి మన హృదయములు ఉత్సహించునుగాక!

**ధ్యాన వచనము 7 :** *నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధి నుండి నేనెక్కడికి పారిపోవుదును?*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు యెల్లవేళలా వున్నందుకు నీకు వందనములు. నీ సన్నిధి నాకు తోడుగా వుండుటనుబట్టి నేను ఒంటరివాడిని కాదు.*

యీ కీర్తనలో కీర్తనాకారుడు మొదట దేవుడు సర్వజ్ఞియని మరియు ఆయన సర్వాంతర్యామియని తెలియజేసిన తరువాత పై వాక్య భాగములో దేవుని సర్వశక్తిత్వము గురించి అనగా ఆయన సమస్తమును చేయగల, గొప్ప బలముగల దేవుడని తెలుపుచున్నాడు. ముఖ్యముగా మానవుని సృష్టించుటలో దేవుని సర్వశక్తిత్వము బయలు పరచబడినది. మానవ జీవితముయొక్క పవిత్రత దేవుని గుణములోనుండి మొదలవుచున్నది. గర్భములో వున్న పిండము దేవుని అపారమైన జ్ఞానము మరియు ఆయన శక్తిచేత రూపొందించ బడి, ఒక మనిషిగా దేవునిచేత పిలువబడుచున్నది. మానవుని సృష్టి, అతని నిర్మాణము దేవుడు తన సృష్టిపట్ల కలిగియున్న ప్రేమపూర్వక తలంపులను సూచిస్తున్నది. కనుకనే గర్భములోని పిండమును గర్భస్రావము చేసి తీసివేయుట బైబిల్ ప్రకారము పాపముగా ఎంచబడుచున్నది.

1. తల్లి గర్భమందు మానవుడు రూపింపబడుట – వ. 13
2. మానవుడు సృష్టింపబడిన విధానము దేవుని స్తుతికి కారణమగుచున్నది – వ. 14
3. మానవుడు సృష్టింపబడు విధానమంతయు దేవుడు యెరిగియున్నాడు – వ. 15
4. మానవుని జీవితమంతయు దేవుని ఆధీనములో వున్నది – వ. 16
5. దేవుని తలంపులను లెక్కించుటకు ప్రయత్నించుట – వ. 17–18

అవును, దేవుని తలంపులు మనకు నిజంగా "ప్రియమైనవి". మనము ఎన్నడూ కనుగొనని విధానములో ఆయన మనలను యెరిగియున్నాడు. దేవుడు తనయందు విశ్వాసముంచు వారి భవిష్యత్తుకు సంబంధించి మానవుల ఊహకు మించిన రీతిలో తన ప్రణాళికను సిద్ధపరచియున్నాడు (1కొరింథీ2:9).

**ధ్యాన వచనము 17 :** *దేవా, నీ తలంపులు నాకెంత ప్రియమైనవి! వాటిమొత్తమెంత గొప్పది!*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితమునకు సంబంధించిన ప్రతి విషయములోను నీ యొక్క పథకము, ప్రణాళికను రూపొందించియున్నావు. నీవు నాకు నియమించిన దినములన్నిటిలోను నిన్ను స్తుతిస్తూ, సేవిస్తూ గడపవలెనని ఆశపడుచున్నాను.*

మనసొంత శక్తి, సామర్థ్యములను మనము నమ్మకుండా దేవునియందు నమ్మికయుంచి జీవించే తీర్మానము కలిగియుండునట్లు ఆయన గుణములు మనకు సహాయపడతాయి. దుష్టులందరినీ దేవుడు శిక్షిస్తాడు. వారిపై ప్రతీ కారము తీర్చుకొనే విషయములను దేవునికి వదిలివేయవలెను. మనలో ప్రతి ఒక్కరము చేయవలసిన ముఖ్యమైన పని యేమనగా దేవునితో మన నడకను యిబ్బందిపెట్టే "ఆయాసకరమైన మార్గమేదైనా" మనలో వుంటే, దానిని ఒప్పుకొని, విడిచిపెట్టవలెను. యిది మన దృక్పథం కాదు గానీ దేవుని దృక్పథము. కీర్తనాకారుడు "దేవా, నన్ను పరిశోధించుము" అని దేవునితో మొఱపెడుతున్నాడు. మనము కూడా అట్లు చేయవలసిన వారముగా వున్నాము. హెబ్రీ 4:13లో "దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగావున్నదని" వాక్యము సెలవిస్తున్నది. మనము దేవునికి తెలియకుండా దాగుకొనలేము.

1. భక్తిహీనులు సంహరించబడుట– వ. 19
2. దేవునికి వ్యతిరేకముగా భక్తిహీనులు మాట్లాడుట– వ. 20
3. నీతిమంతులు దేవునితో ఏకీభవించుట– వ. 21
4. దేవునితో విశ్వాసి కలిగియున్న సంబంధము యొక్క బలము– వ. 22
5. విశ్వాసి హృదయము పరీక్షింపబడుట– వ. 22–24

మన తలంపులను దేవుడు యెరిగియున్నాడు. దేవునితో సంబంధము కలిగియుండుటకు మన హృదయములలో యథార్థతను కలిగియుండుట ముఖ్యమైన విషయము. దేవునియెదుట శుద్ధమైన హృదయము మరియు శుద్ధమైన మనస్సాక్షి కలిగియుండుటకన్నా మధురమైన విషయము మరొకటి లేదు.

**ధ్యాన వచనము 23 :** *దేవా, నన్ను పరిశోధించి, నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి, నా ఆలోచనలను తెలిసికొనుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా తలంపులను నీ ముందుకు తెచ్చుకొనుచున్నాను. నన్ను కడిగి, నా జీవితములో నీ మార్గమును నాకు బయలుపరచినందుకు నిన్ను స్తుతించెదను.*

అన్ని వైపులనుండి దాడులను ఎదుర్కొంటున్న దావీదు తనకు నిరీక్షణ మరియు ఆశ్రయము కేవలము దేవుని యొద్ద మాత్రమే లభిస్తాయని యెరిగియున్నాడు. మొదటి వచనములో "యెహోవా, దుష్టుల చేతిలోనుండి నన్ను విడిపింపుము" అని ప్రార్థనతో మొదలు పెట్టి, 6వ వచనములో "నీవే నా దేవుడవు" అను మాటలతో ముగించుచున్నాడు. తన శత్రువులు తనకు వ్యతిరేకంగా అపాయకరమైన యోచనలు చేయుచు, బలత్కారపు క్రియలు జరిగించాలని చూస్తున్నట్లు దావీదు గుర్తించుచున్నాడు. దేవుని కాపుదల తనకు అవసరమైయున్నదని యెరిగి, 4వ వచనములో "నన్ను కాపాడుము" అని ప్రార్థించుచున్నాడు. మనకు యెటువంటి పరిస్థితులు యెదురైననూ, దేవునియందు సంపూర్ణమైన నమ్మిక వుంచవలసిన అవసరత మనకున్నదని గుర్తించుదుముగాక!

1. విడుదలకొరకు ప్రార్థన– వ. 1
2. యుద్ధముకొరకు శత్రువులు సిద్ధపడుట– వ. 2
3. శత్రువుల పెదవుల క్రిందవున్న విషము– వ. 3
4. దేవుని కాపుదలకొరకు కీర్తనాకారుని ప్రార్థన– వ. 4
5. శత్రువుల హృదయములయొక్క గర్వము– వ. 5
6. తన మొఱను ఆలకించుమని కీర్తనాకారుడు దేవునికి మనవి చేయుట– వ. 6

మనము మొఱపెట్టినపుడు దేవుడు మన మొఱను ఆలకిస్తాడు. విరిగిన హృదయము గలవారికి ఆయన దగ్గరగా వున్నాడు. వినయమనస్కులకు ఆయన అద్భుతమైన వాగ్దానములు చేసియున్నాడు. ఆయన మనకు అవసరమైన వాటిని మనము అడుగకముందే యెరిగియున్నాడు. ఆయన మన ప్రార్థనలను వింటాడన్న నిశ్చయత మనకు యివ్వబడినది.

**ధ్యాన వచనము 6 :** *అయినను నేను యెహోవాతో ఈలాగు మనవి చేయుచున్నాను - "యెహోవా, నీవే నా దేవుడవు. నా విజ్ఞాపనలకు చెవియొగ్గుము".*

**ప్రార్థన:** *ప్రభువా, శత్రువు నామీద చేయు దాడులకు, నామీద తీసుకువచ్చే వత్తిడులకు నేను తట్టుకోలేనని నాకు తెలియును. అందుకే నేను వాటినుండి విడుదలకొరకు, రక్షణ కొరకు నీయొద్దకు వచ్చి, నీకు మొఱపెట్టుకొందును.*

కొన్నిసార్లు దావీదు అనుభవిస్తున్న పరిస్థితులకు, మన జీవితములలో ఎదురవుతున్న పరిస్థితులకు సంబంధమున్నట్లు అనిపించదు. 10వ వచనములో వ్రాయబడిన “కణకణలాడు నిప్పులు” అను మాటలు అపొస్తలుడైన పౌలు రోమా 12 : 19-21 వచనములలో వ్రాసిన మాటలను గుర్తుచేయుచున్నవి: “ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి. పగతీర్చుట నాపని. నేనే ప్రతిఫలము నిత్తును” అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడినది. కాబట్టి నీ శత్రువు ఆకలి గొనియుంటే అతనికి భోజనము పెట్టుము. దప్పిగొనియుంటే దాహమిమ్ము. ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడు వలన జయింపబడక, మేలుచేత కీడును జయించుము. దావీదు ఎంతో కష్టమైన పరీక్షల ద్వారావెళుతూ, తన శత్రువుల నుండి తనకు ప్రాణ హాని జరిగే ప్రమాదమును ప్రతి దినము ఎదుర్కొంటున్నాడు. అయితే, దీనియంతటిలోను మన కాపుదల మరియు మన ఆశీర్వాదము దేవుని నుండిమాత్రమే వస్తాయని మనకు గుర్తుచేయుచున్నాడు.

1. విశ్వాసి కలిగియున్న దేవుని కాపుదల- వ. 7
2. భక్తిహీనుల కోరికలు నిరాకరింపబడుట- వ. 8
3. భక్తిహీనులకు కలుగవలెనని కీర్తనాకారుడు కోరుతున్న పరిణామములు- వ. 9-11
4. దేవుడు బాధింపబడువారి పక్షమున వ్యాజ్యెమాడుట- వ. 12
5. దేవుని సన్నిధివలన కలుగు ఆదరణ- వ. 13

మన కష్టపరిస్థితుల ద్వారా దేవుడు మనలను నడిపించాలని కోరుకొని, ఆయన కొరకు సహనముతో కనిపెట్టుకొనుట సులభమైన పనికాదు గానీ అట్లు చేయుట చాలా అవసరము. యితరులు నీకు చేయుదానిని బట్టి నీవు విచారపడకుండా, నీ భారమంతటినీ ఆయన పాదములయొద్దకు తీసుకు రమ్ము. తన సమయానుసారము, తన చిత్తానుసారము ఆయన నీ పరిస్థితులను సరిజేయును.

**ధ్యాన వచనము 7 :** *ప్రభువైన యెహోవా నా రక్షణ దుర్గము. యుద్ధదినమున నీవు నా తలను కాయుదువు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా జీవితమును, నా పరిస్థితులన్నిటిని నీ చేతులలో వుంచుదును. నీ చిత్త ప్రకారము, నీ మహిమకొరకు మరియు నాకు మేలుకలుగుటకై నా జీవితములో ప్రతి విషయమును నీవు జరిగించుచున్నావని నేనెరుగుదును.*

దావీదు తన శత్రువుల నుండి ఎదురవుతున్న దాడుల గురించి మొఱ్ఱపెట్టడమేగాక తన సొంత సమస్యలను గుర్తించి, వాటిని అధిగమించుటకు దేవుని సహాయము కొరకు మొఱపెడుతున్నాడు. 3వ వచనములో దావీదు చేస్తున్న ప్రార్థన యెంతో ప్రాముఖ్యమైనది: "యెహోవా, నా నోటికి కావలియుంచుము. నా పెదవుల ద్వారమునకు కాపు పెట్టుము". మన నోరు మనకు ఎంతో సమస్యను తీసుకురాగలదు. అనవసరమైన మాటలను మన నోటితో మాట్లాడి, తరువాత బాధపడతాము. మనము మాట్లాడే మాటలు, శత్రువుల గురించియైనా సరే, అవి మనయొద్దకు తిరిగి వచ్చి, మనలను దుఃఖపెడతాయి. దావీదు దుష్టుల పాపములో పాలివాడు కాకుండా జాగ్రత్త పడవలెనని కోరుకొనుచున్నాడు. శత్రువుల "చెడు మాటలు, క్రియల" ప్రకారము కొన్నిసార్లు మనమే జీవించే ప్రమాదమున్నది. కనుక మనకు దేవుని సహాయము ఎంతో అవసరమైయున్నది.

1. దావీదు దేవునికి మొఱపెట్టుట– వ. 1
2. ధూపము, సాయంకాల నైవేద్యములతో పోల్చబడుతున్న మన ప్రార్థన– వ. 2
3. నోటిని అదుపులో వుంచుకొనుట– వ. 3
4. దుష్టత్వపు క్రియలనుండి దూరంగా వుండుటకు తీర్మానించుకొనుట– వ. 4
5. నీతిమంతుల గద్దింపు అంగీకారము– వ. 5

పాపము జరిగించువారి క్రియలను మనము కూడా చేయుదుమేమోనన్న భయముతో చెడు ప్రభావము నుండి మనము దూరముగా వుండవలయును. పాపమును జయించి, నష్టము రాకుండా వుండుటకు మన నోటిని అదుపులో వుంచుకొనుట ఎంతో కీలకమైన విషయము.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా, నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నా యొద్దకు త్వరపడి రమ్ము. నేను మొఱ్ఱపెట్టగా నా మాటకు చెవియొగ్గుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా నాలుకను కాచుకొనుటకు దయచేసి నాకు సహాయము చేయుము. నా నోటి మాటలు నీ దృష్టికి అంగీకారములగును గాక.*

తన శత్రువులపట్ల కీర్తనాకారుడైన దావీదు ప్రార్థన ఎంతో జ్ఞానయుక్తమైనదిగా గమనించుచున్నాము. తన శత్రువుల దుర్నీతికార్యములలో తానుకూడా పడిపోయి, వారితో పాటు పాపము చేసే ప్రమాదము నుండి దూరంగా వుండవలెనని తాను యెరిగియున్నాడు. అట్టి పరిస్థితి నుండి తనను కాపాడుమని దేవుని కోరుకొంటున్నాడు. తన శత్రువులు శిక్షింపబడినపుడు తన మాటలు ప్రజలకు "మధురమైనవి"గా వుండునని 6వ వచనములో పలుకుచున్నాడు. మనలో ప్రతి ఒక్కరివలె దావీదు కూడా దుష్టుల యొక్క "వల లేదా ఉచ్చుల" నుండి కాపాడబడవలసిన అవసరత కలిగియున్నాడు. ఎఫెసీ 6:10–11 లో సాతాను "తంత్రములను" యెదిరించుటకు దేవుని శక్తి మనకు అవసరమైయున్నదని అపొస్తలుడైన పౌలు గుర్తుచేయుచున్నాడు. "తంత్రములు" అను పదము "పద్ధతులు" అను అర్థము కలిగి, సాతాను మనపై వాడే పథకములను సూచిస్తున్నది. 8వ వచనములో దావీదు చెప్పినట్లు మన కన్నులు ఆయనపై ఉంచుకొన వలెను.

1. దావీదు మాటలలోని మాధుర్యము– వ. 6
2. దేవుని ప్రజల యెముకలు చెదరగొట్టబడుట– వ. 7
3. కీర్తనాకారుడు దేవునికి చేయుచున్న విన్నపము– వ. 8
4. పాపము చేయువారి వల, ఉచ్చు నుండి తప్పించుకొనవలెనన్న కీర్తనాకారుని కోరిక– వ. 9
5. కీర్తనాకారుడు భక్తిహీనుల వల నుండి తప్పించుకొనుట– వ. 10

8వవచనములో "నీ శరణుజొచ్చియున్నాను" అను మాటలు సామాన్యమైన వైనప్పటికీ బలముగలవి. యీ మాటలు మన మనసులు మరియు హృదయములలో నిలిచియుండవలెను.

**ధ్యాన వచనము 8 :** *యెహోవా, నా ప్రభువా, నా కన్నులు నీ తట్టు చూచుచున్నవి. నీ శరణు జొచ్చియున్నాను. నా ప్రాణము ధారపోయకుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నా కన్నులు నీ వైపు కలిగి వుండవలెనని నేనెరుగుదును. నా జీవితకాల మంతయు ప్రతి విషయములోను నిన్ను విశ్వసించవలెనని నేనెరుగుదును.*

యీ కీర్తనను దావీదు ఏన్గెదీ అరణ్యములోని గుహలో వున్నప్పుడు రచించాడు. ఆ ప్రాంతములో అందమైన జలపాతముతో పాటు అనేకమైన గుహలు, లేళ్లు, మేకలలాంటి జంతువులు, ఎర్రకాళ్ల కొంగలు వున్నాయి. యీ కీర్తనను చదువుచున్నప్పుడు దావీదు హృదయములోని బాధ మనకు అర్థమవుతున్నది. దావీదు ఒంటరిగా వున్నాడు. అయితే దేవుడు అతనికి తోడుగా వుండడాన్ని బట్టి దావీదు తన కష్టతరమైన పరీక్షను అధిగమించుటకు దేవునియొద్ద శక్తిని పొందాడు. దావీదు తాను పొందిన నిరాశ మరియు అధైర్యమును నిజాయితీగా ఒప్పుకొంటున్నాడు. మనము కూడా దావీదుకు ఎదురైన పరిస్థితులద్వారా వెళ్తూవుంటాము. దావీదు వలె మనము కూడా దేవుడు మన ఆశ్రయమనియు, మన ప్రాణములను సంరక్షించుననియు గ్రహించి, దేవుని వెదకుటకు నేర్చుకొందుముగాక!

1. దావీదు దేవునికి చేసిన ప్రార్థన- వ.1
2. తన బాధను దేవుని ముందు తెలియజెప్పుట- వ.2
3. తన మార్గమును దేవుడు యెరిగియుండుట- వ.3
4. దావీదు ఒంటరిగా, ఎవరును పట్టించుకోని స్థితిలో వుండుట- వ.4
5. దావీదు స్వాస్థ్యము దేవుడే- వ.5
6. తనను హింసించువారి చేతిలోనుండి విడుదలను కోరుకుంటున్న దావీదు- వ.6
7. తన శ్రమలమధ్య దేవుని స్తుతించిన దావీదు- వ.7

నిన్ను గూర్చి ఎవరూపట్టించుకోకపోయినప్పటికీ దేవుడు నీకు తోడైయుండి, సంరక్షిస్తాడు. దేవుడు “సమస్తమైన ఆదరణ”ను అనుగ్రహించు దేవుడు. ఆయన మనలను గూర్చి చింతించుచున్నాడు గనుక మన “చింత యావత్తు అతని మీద వేయమని మనలను ఆహ్వానించుచున్నాడు (1పేతురు 5:7).

**ధ్యాన వచనము 5 :** *యెహోవా, నీకే నేను మొఱ్ఱపెట్టుచున్నాను. నా ఆశ్రయదుర్గము నీవే. సజీవులున్న భూమిమీద నా స్వాస్థ్యము నీవే అని నేననుకొంటిని.*

**ప్రార్థన:** *ప్రభువా, నాకు సంబంధించిన ప్రతి విషయమును గూర్చి నీవు ఆలోచన కలిగియున్నందుకు నీకు వందనములు. నా మార్గములో నేనెదుర్కొనే ప్రతి సమస్యలోను సహాయముచేయగల సామర్థ్యుడవైనందుకు నీకు వందనములు.*

దావీదు తన శత్రువులచేత చుట్టబడి, అధికమైన కష్టములలో చిక్కుకొనియున్నాడు. తాను తన పరిస్థితుల మధ్య దేవునికి మొఱ్ఱపెట్టవలెనని యెరిగియున్నాడు. తన ప్రార్థనకు దేవుడు తన విశ్వాస్యతనుబట్టి జవాబిస్తాడని నమ్మిక కలిగియున్నాడు. దావీదు పొందియున్న అధైర్యము ఎంతో వాస్తవమైనదని 4వ వచనములో, "నా ఆత్మ నాలో క్రుంగియున్నది" అను మాటల ద్వారా తెలుసుకొనుచున్నాము. దేవుని పిల్లల జీవితాలలో కూడా అటువంటి సమయములు వస్తాయి. దేవుడు తనకు ఎంతో అవసరమైయున్నాడని దావీదు యెరిగియున్నాడు. దేవునిపట్ల తాను కలిగియున్న దాహమును 6వ వచనము ద్వారా వ్యక్తపరుస్తున్నాడు: *"నీ తట్టు నా చేతులు చాపుచున్నాను. ఎండిపోయిన భూమివలె నా ప్రాణము నీకొరకు ఆశపడుచున్నది".* యీ దినము దేవునిపట్ల నీవు కలిగియున్న దాహము ఎంత గొప్పదో పరీక్షించుకొనుము.

1. తన విన్నపములను దేవునియొద్దకు తీసుకు వచ్చిన దావీదు– వ. 1
2. దేవునియెదుట ఎవరును నీతిమంతుడుగా లేరు– వ. 2
3. దావీదు శత్రువులచే తరుమబడుట– వ. 3
4. దావీదు క్రుంగిపోయి యుండుట– వ. 4
5. దావీదు దేవుని క్రియలను ధ్యానించుట– వ. 5
6. దావీదు తన చేతులను దేవునివైపు చాపియుండుట– వ. 6

దావీదు దేవుని క్రియలను ధ్యానించుచున్నానని చెప్పుచున్నాడు. కీర్తనలపై వ్రాయబడిన యీ "అనుదిన ధ్యానములు" యిదే ఉద్దేశ్యముతో వ్రాయబడినవి. దేవుడు ఎవరైయున్నాడన్న సత్యమును, ఆయన జరిగించిన సమస్తమును, భవిష్యత్తులో ఆయన జరిగించబోయే సమస్తమును గూర్చి జ్ఞాపకము చేసుకొనుటకు సమయమును కేటాయించుము.

**ధ్యాన వచనము 1 :** *యెహోవా, నా ప్రార్థన ఆలకింపుము. నా విన్నపములకు చెవియొగ్గుము. నీ విశ్వాస్యతనుబట్టియు, నీ నీతినిబట్టియు నాకు ఉత్తరమిమ్ము.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు నాపట్ల జరిగించిన దానిని యెంతో యెక్కువగా జ్ఞాపకముంచుకొందును. నీ బలమునుబట్టి నిన్ను స్తుతించెదను. నీ విశ్వాస్యతను బట్టియు, నీ నీతినిబట్టియు నా జీవితములో నన్ను నడిపించెదవని నమ్మెదను.*

పై వాక్యభాగములో దావీదు విడుదల, నడిపింపు మరియు తన ప్రాణము యొక్క ఉజ్జీవముకొరకు దేవునికి ప్రార్థించుచున్నాడు. శత్రువులనుండి వస్తున్న ఒత్తిళ్లు ఎంతో అధికమై, ఆయన తన ఆత్మలో క్రుంగిపోయి, అధైర్యపడియున్నాడు. ఉదయకాలసమయములో ఆయన దేవుని కృపావార్తను వినాలని కోరుకుంటున్నాడు. తన నమ్మిక దేవునియందు మాత్రమే కలిగియున్నానని పునరుద్ఘాటించుచున్నాడు. యీ కీర్తన 12వ వచనము "నేను నీ సేవకుడును" అని తీర్మానముతో పలుకబడిన దావీదు మాటలతో ముగియుచున్నది. మనలో ప్రతి ఒక్కరి నుండి దేవుడు ఏమి కోరుతున్నాడన్నది యీ మాటలద్వారా తెలియుచున్నది. మనము ఎదుర్కొంటున్న కష్టములు మన హృదయములను నిరాశ, క్రుంగుదలకు గురిచేయకుండా వుండాలంటే మన దేవుని గుణము, ఆయన సామర్థ్యమును తెలుసుకునే ఆశకలిగియుండవలెను.

1. దావీదు ఎదుర్కొంటున్న నిరాశ– వ. 7
2. దేవునియందు నమ్మికయుంచవలెనని కోరుకుంటున్న దావీదు– వ. 8
3. దావీదుకు అవసరమైయున్న విడుదల– వ. 9
4. దేవుని చిత్తముమీద ఆధారపడియున్న దావీదు– వ. 10
5. అధైర్యకర పరిస్థితిలో తన ప్రాణమును ఉజ్జీవింపజేయుమని దావీదు దేవుని ప్రార్థించుట – వ. 11
6. దావీదు శత్రువులు నశింపజేయబడుట– వ. 12

యీ వాక్యభాగములో రెండు ముఖ్యమైన మనవులను గమనించుచున్నాము: మొదటిది 8వ వచనము: "నేను నడువవలసిన మార్గము నాకు తెలియజేయుము". రెండవది 10వ వచనము: " నీ చిత్తానుసారముగా ప్రవర్తించుటకు నాకు నేర్పుము". మనము నడువ వలసిన మార్గము మరియు దానికి సంబంధించిన దేవుని చిత్తము అను యీ రెండు విషయములు దేవునితో మనము నడచుటకు కీలకమైనవి.

**ధ్యాన వచనము 8:** *నీయందు నేను నమ్మిక యుంచియున్నాను. ఉదయమున నీ కృపావార్తను నాకు వినిపింపుము. నీ వైపు నా మనస్సు నేనెత్తికొనుచున్నాను. నేను నడువవలసిన మార్గము నాకు తెలియజేయుము.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీ చిత్తము తెలుసుకొని, నీవు కోరుకొను మార్గములో నడువవలెనని ఆశపడుచున్నాను. నీ చిత్తమునకు లోబడి, దానిని జరిగించుటకు నాకు నేర్పించుము.*

దావీదు దేవుని శక్తిని హెచ్చించి, మానవుని దేవునితో పోలుస్తూ *"యెహోవా, నీవు నరులను లక్ష్యపెట్టుటకువారుఏపాటివారు? నీవు వారిని ఎన్నిక చేయుటకు మనుష్యులు ఏపాటివారు?"* అని మనుష్యుల స్థితిని గూర్చి తెలియజేయుచున్నాడు. 4వ వచనములో *"నరులు వట్టి ఊపిరిని పోలియున్నారు"* అని గుర్తుచేయుచున్నాడు. యాకోబు 4:14లో మన జీవితములు త్వరలో మాయమైపోయే "ఆవిరి"వంటివని వ్రాయబడినది. అనేక సార్లు మన జీవిత ప్రాముఖ్యతను గూర్చి మనము గొప్పగా చెప్పుకొని, దేవుడు మనలను యీ భూమిమీద నుండి తీసివేయగలడన్న సత్యమును మరచిపోతుంటాము. దావీదు విడుదల గురించి ప్రార్థిస్తూ, దేవుని శక్తిని గూర్చి మనకు గుర్తుచేయుచున్నాడు. మొదటి వచనములో *"నాకు ఆశ్రయ దుర్గమగు యెహోవా సన్నుతింపబడునుగాక!"* అని దావీదు పలికిన మాటలు మనము దేవుని స్తుతించి, మన పూర్ణహృదయములతో ఆయనయందు నమ్మికయుంచుటకు ప్రోత్సాహకరంగా వున్నాయి.

1. దేవుడు దావీదు చేతులకు నేర్పించే యుద్ధము– వ. 1
2. దావీదు హృదయము దేవుని నమ్మియుండుట– వ. 2
3. దేవుడు నరునిపట్ల కలిగియున్న ఆలోచనలు– వ. 3
4. నరుని జీవితకాలము తాత్కాలికము– వ. 4
5. దేవుడు పర్వతములను ముట్టుకొనుట– వ. 5
6. ప్రకృతిలో భయము పుట్టించే దేవుని బలము– వ. 6
7. దేవుడు మనలను గొప్ప ఆపద నుండి విడిపించగలడు– వ. 7–8

మన నమ్మిక మానవ జ్ఞానము, సామర్థ్యమందుగాక దేవునియందు కలిగియున్నాము. మనుష్యుడు *"ఊపిరి"*వంటివాడు. ప్రసంగిలో సొలొమోను తెలిపిన రీతిలో మనుష్యుని ప్రయత్నములన్నియు "వ్యర్థమే". అనగా మనుష్యుని ప్రయత్నములు దేవుని హస్తములేకుంటే నిత్యత్వములో విలువలేనివైయుంటాయి.

**ధ్యాన వచనము 2:** *ఆయన నాకు కృపానిధి. నా కోట. నా దుర్గము, నన్ను తప్పించువాడు. నా కేడెము, నేనాశ్రయించువాడు. ఆయన నా జనులను నాకు లోబరచువాడై యున్నాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా విశ్వాసము నీయందున్నది. మనుష్యుల సామర్థ్యతను హెచ్చుగా తలంచకుండా, నీ బలమును తక్కువగా అంచనా వేయకుండా వుండుటకు నాకు సహాయము చేయుమని ప్రార్థించుదును.*

పై వాక్యభాగములో దావీదు చక్కని సాక్ష్యము యిచ్చుచున్నాడు. తన విడుదలను గూర్చి దేవునికి ఒక క్రొత్తకీర్తన పాడవలెనన్న కోరికను మొదట తెలియజేసి, తరువాత తన విడుదలద్వారా తాను పొందే ఆశీర్వాదములను గూర్చి పేర్కొని, "*యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు*" అను మాటలతో ముగించుచున్నాడు. యిది ఎంత సత్యము! ఇశ్రాయేలీయుల చరిత్రలో జరిగిన పోరాటములనుబట్టి చూస్తే 11వ వచనములోని ప్రార్థన ఎంతో సరియైనదిగా వున్నది: "*నన్ను తప్పింపుము. అన్యుల చేతిలో నుండి నన్ను విడిపింపుము. వారి నోరు వట్టిమాటలాడుచున్నది. వారి కుడిచేయి అబద్ధముతో కూడియున్నది*". ఇశ్రాయేలులో నిజమైన శాంతిని మెస్సీయయైన ప్రభువైన యేసుక్రీస్తు సమాధానకర్తగా తిరిగి వచ్చినపుడు నెలకొల్పబోవుచున్నాడు. అంత వరకు మన నమ్మిక దేవునియందు, ఆయన అనుగ్రహించు విడుదలయందు కలిగియున్నాము.

1. దేవునికి స్తుతి కీర్తనలు పాడుట– వ. 9
2. దావీదుకు దేవుడు కలుగజేసిన రక్షణ– వ. 10
3. అన్యుల దుష్టత్వమునుండి తప్పించమని దావీదు ప్రార్థన– వ. 11
4. భవిష్యత్తులో సంతానము ఆశీర్వదింపబడుట– వ. 12
5. ఆహారము, పశువులు విస్తారముగా నుండుట– వ. 13–14
6. సంతోషమునకు మూలము– వ. 15

నిజమైన సంతోషము మనము కలిగియున్న ఆస్తిపాస్తులనుబట్టి కాదుగానీ దేవునితో మనము కలిగియున్న సంబంధమునుండే కలుగును.

**ధ్యాన వచనము 9 :** *దేవా, నిన్ను గూర్చి నేనొక క్రొత్తకీర్తన పాడెదను. పది తంతుల సితారాతో నిన్ను కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా దేవా, నా హృదయముయొక్క సంగీతము నీ దృష్టికి అంగీకారముగా వుండునుగాక. నా సంతోషము నిన్ను బట్టి మాత్రమే కలుగును గాక.*

యీ వాక్యభాగము మనము ఎలుగెత్తి దేవుని స్తుతించునట్లు చేయుచున్నది. యీ వచనములు దేవుని, ఆయన రాజ్యమును హెచ్చిస్తూ, ఆయన గుణములను మరియు ఆయన గొప్ప కార్యములను గుర్తు చేయుచున్నవి. యీ వాక్యభాగములోని ప్రారంభవచనములు దేవుని గొప్పతనమును బయలుపరుస్తూ, దావీదు "దేవుని హృదయానుసారిగా" పిలువబడుటలో వున్న నిజమైన రహస్యమును గూర్చి తెలియజేయుచున్నాయి. దావీదు యీ వచనములలో బలవంతుడైన దేవుని ఆరాధించి, స్తుతించుచున్నాడు. ఆయన దేవుని గొప్పతనమును చూసినవాడై తనను తాను తగ్గించుకొని, దేవునిమీద ఆధారపడవలసిన అవసరతను గుర్తించాడు. దేవుని ఆరాధించుటకు మనకు సమయము లేనియెడల ఎంతో నష్టపోతాము.

1. అనుదినము దేవుని స్తుతించుట- వ. 1-2
2. దేవుని గొప్పతనము- వ. 3
3. దేవుని స్తుతించబోయే తరములు- వ. 4
4. దేవుని శక్తియొక్క మహిమ- వ. 5-6
5. దేవుని దయాళుత్వము- వ. 7

దేవుడు ఎవరైయున్నాడు, ఆయన ఏమి జరిగించాడు మరియు ఏమి జరిగిస్తాడు అను సంగతులనుబట్టి దేవునికి స్తుతులు, వందనములు చెల్లించుటకు యిప్పుడే కొంత సమయమును కేటాయించుము. యిట్లు చేసినపుడు నీ హృదయము మరియు నీ జీవితము గొప్పగా ప్రభావితము చేయబడును.

**ధ్యాన వచనము 3 :** *యెహోవా మహాత్మ్యముగలవాడు. ఆయన అధికస్తోత్రము నొందదగినవాడు. ఆయన మహాత్మ్యము గ్రహింప శక్యము కానిది.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు గొప్ప దేవుడవైనందుకు, ఎంతో మంచితనముగల దేవుడవైనందుకు యీ దినమందు నిన్ను స్తుతించుదును.*

యీ వాక్యభాగము విశ్వాసులకిష్టమైన వచనముల పట్టీలో వుండవలయును. ప్రార్థన, స్తుతి మరియు మన ప్రతి అవసరత కొరకు ఆయనమీద ఆధారపడే దృక్పథము దేవుని స్వభావము మరియు ఆయన గుణములను బట్టినదై యుండవలెనని యీ వాక్యభాగము తెలియజేయుచున్నది. దేవుని రాజ్యము యొక్క "మహిమ"ను గూర్చి యీ వాక్యభాగము తెలుపుతూ, విశ్వాసముతో ప్రభువైన యేసుక్రీస్తును మన ప్రభువు, రక్షకుడుగా అంగీకరించి, పరిశుద్ధాత్మద్వారా తిరిగి జన్మించినపుడు మనము కూడా యీ దేవుని రాజ్య పౌరులుగా చేయబడియున్నామని తెలుసుకొనుటకు ప్రోత్సహించుచున్నది. మనము సదాకాలము మన దేవునితో పాటు పరిపాలించెదము. మన జీవితములలోని ప్రతి దినము దేవుని "బలము" మరియు ఆయన "శౌర్యము"ను స్తుతించుచుండవలెను. మనకున్న ఎటువంటి సమస్యనైనను ఆయన పరిష్కరించగలడని మన హృదయములలో ఎలాంటి సందేహము లేక విశ్వసించవలెను.

1. దేవుని సమస్త కార్యములు ఆయన కనికరమును చూపిస్తున్నవి– వ. 8–9
2. దేవుని గూర్చి సాక్ష్యమిచ్చుటకు ఆయన ప్రజలకున్న తీర్మానము– వ. 10–12
3. దేవుని రాజ్యముయొక్క స్వభావము– వ. 13
4. పడిపోవు వారందరిని దేవుడు లేవనెత్తువాడు– వ. 14
5. సకల సృష్టి దేవుని బట్టి తృప్తిపరచబడుచున్నది– వ. 15–16

16వ వచనములో *"ప్రతి జీవి కోరికను తృప్తిపరచుచున్నావు"* అని వ్రాయబడిన మాటలు ఎంతో చక్కనివి. పౌలు విశ్వాసములో తన కుమారుడైన తిమోతికి వ్రాయుచూ, *"సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమై యున్నదని"* తెలిపాడు (1తిమోతి 6:6).

**ధ్యాన వచనము 8 :** *యెహోవా దయాదాక్షిణ్యములు గలవాడు. ఆయన దీర్ఘశాంతుడు. కృపాతిశయము గలవాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నా పట్ల నీ యొక్క మంచితనము, కనికరమునుబట్టి నీకు వందనములు. నేను పడిపోయినపుడు నన్ను లేవనెత్తు వాడవుగాను, నేను అవసరతలో వున్నప్పుడు నా అవసరము తీర్చు దేవుడవుగాను నాకున్నందుకు నీకు వందనములు.*

దేవుడు జరిగించిన మరియు జరిగించుచున్న కార్యములను గూర్చి యీ వాక్యభాగములో దావీదు తెలియజేయుచున్నాడు. "యెహోవా తన మార్గములన్నిటిలో నీతిగలవాడని" మరియు ఆయన మనకు సమీపముగా వుంటూ, మన కోరికలను తీరుస్తూ, మనలను రక్షించుచున్నాడని దావీదు తెలుపుచున్నాడు. మనము దేవునికి దగ్గరగా వున్నట్లు మనకు అనిపించకపోతే దేవుడు మన నుండి దూరముగా వెళ్లలేదుగానీ మనమే ఆయన నుండి దూరంగా వెళ్లిపోయామని అర్థము. ఆయన ఎల్లప్పుడూ మనకు సమీపంగా వుండాలనుకునే దేవుడు. ఆయన చేయు సమస్తమును "నీతి"తో కూడియుండును. ఆయన సరియైన వాటినే జరిగించి, మనకు గొప్ప ఆశీర్వాదమును కలిగించేవాటినే చేస్తాడని మనము ఆయనను నమ్మవచ్చును. పై వాక్యభాగములో ఆయనకు "మొఱపెట్టుమని" ప్రోత్సహించబడుచున్నాము. మన మొఱలను వినుటలో ఆయన ఎన్నడూ అలసిపోడు. దేవుని మీద సంపూర్ణముగా ఆధారపడవలెనన్న అతి ప్రాముఖ్యమైన సత్యమును కీర్తనల గ్రంథము ద్వారా నేర్చుకుంటున్నాము.

1. దేవుని నీతి – వ. 17
2. ఆయనకు మొఱపెట్టువారందరికీ దేవుని ప్రతిస్పందన – వ. 18
3. తనకు మొఱపెట్టువారికి దేవుడిచ్చు ప్రతిఫలము – వ. 19
4. తనను ప్రేమించువారికందరికీ దేవుడిచ్చు ఆశ్రయము – వ. 20
5. శరీరులందరూ దేవుని స్తుతించుట – వ. 21

ప్రతి దినము దేవుని స్తుతించెదనని యీ రోజు తీర్మానించుకొనుము. 21వ వచనములో "ఆయన పరిశుద్ధ నామమును నిత్యము సన్నుతించుదురుగాక" అని వ్రాయబడినది. దేవుడు ఏమైయున్నాడు మరియు ఆయన ఏమి జరిగించాడు అను వాటిని బట్టి దేవుని స్తుతించిన యెడల నీ వైఖరులు మారును. నీ జీవితములో సణుగుడు తగ్గి, సంతోషము అధికమగును.

**ధ్యాన వచనము 19 :** *తనయందు భయభక్తులు గలవారి కోరిక ఆయన నెరవేర్చును. వారి మొఱ ఆలకించి, వారిని రక్షించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నేను నీకు మొఱ పెట్టినప్పుడెల్లా నా మొఱను ఆలకించుటకు నీవున్నందుకు నిన్ను స్తుతించుదును. నన్ను రక్షించి, ఆశ్రయమిచ్చి, నా హృదయవాంఛను తీర్చే దేవుడవైయున్నందుకు నిన్ను స్తుతించుదును.*

పై వచనములు దేవునికి స్తుతికీర్తనగా వ్రాయబడిన మరొక వాక్యభాగముగా వున్నాయి. యీ దినము క్రిస్మస్ ఉత్సవమునకు ముందటి దినము గనుక సరియైన సమయములో యీ ధ్యానమును చదువుచున్నాము. యీ క్రిస్మస్ వేడుకను జరుపుకొనుటకు దేవునికి స్తుతితో కూడిన బహుమానమును అర్పించుట ఎంత ముఖ్యము! క్రిస్మస్ బహుమానములు యిచ్చుకునే యీ పండుగ సందర్భములోమనకొరకు తన జీవమునిచ్చిన దేవునికి స్తుతి చెల్లించే బహుమతిని యివ్వడం మరచి పోకుందుముగాక! 2వ వచనములో కీర్తనాకారుడు, “నా జీవితకాలమంతయు నేను యెహోవాను స్తుతించెదను” అని పలుకుచున్నాడు. ప్రతి విశ్వాసి హృదయములో యీ సత్యము నిజమగును గాక!

1. దేవుని స్తుతించుట– వ. 1
2. దేవుని స్తుతించుటకున్న ప్రాధాన్యత– వ. 2
3. యీ లోకములోని రాజులు, నరులను నమ్మలేము– వ. 3
4. మానవులైన నాయకుల సంకల్పములు నశించిపోవుట– వ. 4

మానవ నాయకులు మనకు సహాయపడే విషయములో విఫలమైనప్పటికీ దేవుడు ఎన్నడూ విఫలమవ్వడు. మానవ నాయకులు గొప్ప వాటిని గురించి కలలు కంటారు. కానీ వారి ఆలోచనలు ఒకానొక దినమున నశించిపోతాయి. అయితే దేవుని ఆలోచనలు నిత్యము నిలుస్తాయి. స్తుతితో కూడిన మాటలను మాట్లాడి, నీ జీవితములోని ప్రతిదినము నీ స్తుతి కీర్తనను దేవునికి పాడుము. ఆయన మాత్రమే మన స్తుతికి యోగ్యుడు.

**ధ్యాన వచనము 2 :** *నా జీవితకాలమంతయు నేను యెహోవాను స్తుతించెదను. నేను బ్రతుకు కాలమంతయు నా దేవుని కీర్తించెదను.*

**ప్రార్థన:** *ప్రభువా, నా స్తుతి, ఆరాధనకు పాత్రుడవైన నీవంటి దేవుడు యింకెవరూ లేరు. నీ కుమారుడు, నా రక్షకుడైన ప్రభువైన యేసుక్రీస్తును యీ లోకములోనికి పంపినందుకు నీకు వేలాది వందనములు.*

యీ క్రిస్మస్‌రోజు ప్రభువైన యేసుక్రీస్తుయొక్క జన్మదినమును జరుపుకుంటాము. దేవుని స్తుతించుటకు యింతకన్నా మేలైన దినము లేదు. యీ వాక్య భాగములో దేవుడు జరిగించిన మరియు జరిగించుచున్న సమస్తమునుబట్టి కీర్తనాకారుడు దేవుని స్తుతించుచున్నాడు. 5వ వచనములో దేవుని తన "సహాయుడు"గా మరియు తను "ఆశపెట్టుకొనిన" దేవుడుగా కీర్తనాకారుడు తెలియజేయుచున్నాడు. దేవుడు సృష్టికర్తయని, బాధపరచబడు వారికి న్యాయము తీర్చువాడని, ఆకలిగొనిన వారికి ఆహారము దయచేయునని చదువుచున్నాము. అంతేగాక "గ్రుడ్డివారి కన్నులు తెరవజేయువాడని" మరియు "క్రుంగిన వారిని లేవనెత్తువాడని" 8వ వచనములో చదువుచున్నాము. దేవుడు నీతిమంతులను ప్రేమించి, అవసరములో వున్నవారిని కాపాడి, ఆదరించేవాడు. అన్నిటికంటె మిన్నగా, ఆయన "నిరంతరము ఏలును". యిదంతయు చదివిన తరువాత దేవుడు తన ప్రజలకు జరిగించే వాటినిబట్టి ఆయనను మహిమపరచి, వందనములు చెల్లించకుండా వుండలేము.

1. దేవుడనుగ్రహించే సహాయము- వ. 5
2. దేవుడు సమస్తమును సృష్టించాడు- వ. 6
3. దేవుడు ఆకలిగొనిన వారికి ఆహారమిచ్చును- వ. 7
4. ఆయన స్వస్థతను కలుగజేయును- వ. 8
5. ఆయన నిత్యము మన నిరీక్షణగా వున్నాడు- వ. 9-10

"యెహోవా నిరంతరము ఏలును. సీయోనూ, నీ దేవుడు తరములన్నిటను రాజ్యము చేయును". అవును దేవుడు రాజులకు రాజు మరియు ప్రభువులకు ప్రభువు. మన స్తుతి మరియు ఆరాధనకు పాత్రుడు. మెర్రీ క్రిస్మస్.

**ధ్యాన వచనము 8:** *యెహోవా గ్రుడ్డివారి కన్నులు తెరువజేయువాడు. యెహోవా క్రుంగిన వారిని లేవనెత్తువాడు. యెహోవా నీతిమంతులను ప్రేమించువాడు.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవే నాకు సహాయము, నాకు నిరీక్షణ. నీవు నాపట్ల నెరవేర్చిన దానినంతటినిబట్టి మరియు భవిష్యత్తులో నాపట్ల నెరవేర్చబోవు దానినంతటినిబట్టి నిన్ను స్తుతిస్తున్నాను.*

దేవుని అపారమైన జ్ఞానము మరియు గ్రహింపు మన ఊహకు మించియున్నవి. 5వ వచనములో కీర్తనాకారుడు, “మన ప్రభువు గొప్పవాడు. ఆయన అధికశక్తి గలవాడు. ఆయన జ్ఞానమునకు మితిలేదు” అని తెలుపుతూ, 7వ వచనములో, “కృతజ్ఞతాస్తుతులతో యెహోవాను కీర్తించుడి” అని మనలను కోరుతున్నాడు. యీ సృష్టిలో దేవుడు జరిగించే సమస్తమును మరియు ప్రకృతిని, జగత్తును పరిరక్షించేందుకు ఆయన చేయువాటన్నిటిని గూర్చి కీర్తనాకారుడు తెలియజేయుచున్నాడు. ఆయనకున్న గొప్ప గుణములలో ఒక దానిని 3వ వచనములో చదువుచున్నాము: “గుండె చెదరిన వారిని ఆయన బాగుచేయువాడు. వారి గాయములు కట్టువాడు”. దేవుడు మానవుని శక్తి సామర్థ్యములను బట్టి ఆకర్షింపబడడుగానీ తనయందు భయభక్తులు కలిగి, తనకృప కొరకు కనిపెట్టువారి యందు ఆనందించుచున్నాడు.

1. దేవునికి చెల్లించబడుతున్న స్తుతి– వ. 1
2. దేవుడు యెరూషలేమును కట్టుట– వ. 2
3. గుండె చెదరిన వారిపట్ల ఆయనకున్న భారము– వ. 3
4. దేవుని తెలివితేటల యొక్క గొప్పతనము– వ. 4
5. దేవుని శక్తి– వ. 5–6
6. దేవుని స్తుతించుటకున్న ప్రాధాన్యత– వ. 7
7. దేవుడు ప్రకృతిని, పశుపక్ష్యాదులను సంరక్షించుట– వ. 8–9
8. తనయందు భయభక్తులుగల వారిని బట్టి దేవుడు ఆనందించుట– వ. 10–11

మానవుల తెలివితేటలు, సామర్థ్యము లేదా వారు పొందే సఫలతను బట్టి మనము కొన్నిసార్లు ఆకర్షితులమవుతుంటాము. అయితే దేవుడు అలా ఆకర్షింపబడడు లేదా వాటియందు ఆనందించడు. మనము దేవునిపట్ల మన ఉత్తర వాదమును యెరిగి, ఆయన కృప, కనికరముమీద ఆధారపడినపుడే ఆయనను మనము ఘనపరచిన వారమౌతాము.

**ధ్యాన వచనము 1 :** *యెహోవాను స్తుతించుడి. మన దేవునికి స్తోత్రగానము చేయుట మంచిది. అది మనోహరము. స్తోత్రము చేయుట ఒప్పిదము.*

**ప్రార్థన:** *ప్రభువా, మనుష్యుని పనిని బట్టి ప్రభావితము కాకుండా, నీయందు మాత్రమే విశ్వాసము, నిరీక్షణ కలిగి, ముందుకు సాగునట్లు నాకు సహాయపడుము.*

యీ వాక్యభాగములో మరొకసారి ఇశ్రాయేలీయులను గూర్చి వ్రాయబడినది. యెరూషలేము మరియు సీయోను దేవుని స్తుతించుటకుగల కారణములు యిచ్చట తెలుపబడినవి. దేవుని ఆశీర్వాదమును గూర్చి మరియు నిజమైన సమాధానము దేవుని నుండే వస్తుందన్న సత్యమును గూర్చి ఇశ్రాయేలీయులు గుర్తుచేయబడుచున్నారు. దేవునికున్న సృష్టించే శక్తి మరియు ప్రకృతి నియమములను ఆయన పరిరక్షించే తీరును గూర్చి పై వాక్యభాగములో చదువుచున్నాము. 20వ వచనములో వ్రాయబడిన మాటలు ఎంతో నిజమైనవి –*"ఏ జనమునకు ఆయన ఈలాగు చేసియుండలేదు"*. భూమి మీద దేశములన్నిటికంటె గొప్పగా ఇశ్రాయేలు దేవుని చేత ఆశీర్వదింపబడినది. దేవుడు తన న్యాయ విధులను, తన కట్టడలను ఇశ్రాయేలీయులకు తెలియపరచినప్పటికీ వారు వాటిని యెరుగకయుండిరి. దాని ఫలితముగా వారు దేవునికి విధేయత చూపనందుకు ఎంతో నష్టపోయిరి. తన ప్రజలపట్ల దేవుడు చూపించే దీర్ఘశాంతమునుబట్టి మరియు వారి పాపము, తిరుగుబాటును లెక్కచేయకుండా వారిని ఆశీర్వదించు విధమునుబట్టి దేవుడు అధికమైన స్తుతికి యోగ్యుడైయున్నాడు.

1. దేవుని స్తుతించమని కోరుతున్న కీర్తనాకారుడు– వ. 12
2. తన ప్రజలను ఆశీర్వదించుటలో దేవునికున్న సామర్థ్యము– వ. 13
3. సమాధానము దేవుని నుండే కలుగుతుంది– వ. 14
4. ప్రకృతి నియమములను పరిరక్షించుచున్న దేవుడు– వ. 15–18
5. తన ప్రజలపట్ల దేవుని వాక్యమునకున్న అధికారము– వ. 19–20

ఇశ్రాయేలీయులు దేవునిచేత గొప్పగా ఆశీర్వదింపబడిరి. అయితే వారు దేవుని న్యాయవిధులను యెరుగక, దేవుని వాక్యమును అనుసరించకపోయిరి. యిది మనకందరికీ ఒక గుర్తుగా వున్నది. దేవుని వాక్యము మనకు బోధించే మాటలు నిత్యము నిలుచుచున్నవి –*"దేవుని స్తుతించుడి"*.

**ధ్యాన వచనము 20 :** *ఏ జనమునకు ఆయన ఈలాగు చేసియుండలేదు. ఆయన న్యాయవిధులు వారికి తెలియకయే యున్నవి. యెహోవాను స్తుతించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, యీ ప్రపంచములోని సృష్టి యావత్తును నీవు పోషించుచున్న విధానమును బట్టి నిన్ను స్తుతిస్తున్నాను. నీ నోట నుండి వచ్చు ఒక్కమాట చేత ప్రకృతి యావత్తు స్పందించినట్లు నేను కూడా నీ మాటలకు స్పందించుదును గాక!*

యీ సృష్టి యావత్తు దేవునికి స్తుతి మరియు మహిమను చెల్లించుటకై ఆయన చేత రూపొందించబడినది. కీర్తన 19:1లో *"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది"* అని వాక్యము సెలవిస్తున్నది. రోమా 1:20–23లో దేవుని సర్వసృష్టికర్తగా మహిమపరచక పోయినందుకు మానవునికి కలిగిన నష్టమును గూర్చి చదువుచున్నాము. దేవుని మహిమ దేవునికి చెందకుండా సాధారణంగా మానవుడు సృష్టించిన వాటికి, నిర్మించిన వాటికి యివ్వబడుతున్నది. అయితే దేవుని మహిమపరచడంలో ఒక భాగము ఆయనకు "కృతజ్ఞతాస్తుతులు" చెల్లించడమని రోమా 1:21లో చదువుచున్నాము. సృష్టికర్తయైన దేవునికి నిజమైన ఆరాధన చెల్లించాలంటే కృతజ్ఞతతోకూడిన హృదయము మనము కలిగియుండుట ఎంతో అవసరము. నీ చుట్టువున్న సృష్టిని చూసి, దేవుడు సృష్టించిన అనేకమైన వాటినిబట్టి ఆయనకు వందనములు చెల్లించుము.

1. దేవుని స్తుతించుటకై పిలుపు– వ. 1
2. దేవుని స్తుతించే వ్యక్తులు– వ. 2
3. వెలుగునిచ్చే సూర్య, చంద్ర, నక్షత్రములు దేవుని స్తుతించుట– వ. 3
4. ఆకాశములు దేవుని స్తుతించుట– వ. 4
5. సృష్టిని కలుగజేయుటలో దేవుని ఉద్దేశ్యము, ప్రణాళిక– వ. 5–6

ఆకాశములోని సమస్తము దేవుని స్తుతించుటకు రూపొందించబడినవి. ఆకాశములు దేవుని శక్తి మరియు ఆయన గుణములను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. దేవుడు "పరిశుద్ధుడు". మానవుడు సృష్టించిన ప్రతిమలుగా దేవుని మహిమను మార్చకూడదు. ఆయన సమస్తమునకు పైగా హెచ్చింపబడి, సమస్తమును తన అధీనములో కలిగియున్నాడు. యీ దినము నీ హృదయమెత్తి, ఆయనను స్తుతించుము.

**ధ్యాన వచనము 5 :** *యెహోవా ఆజ్ఞ ఇయ్యగా అవి పుట్టెను. అవి యెహోవా నామమును స్తుతించును గాక!*

**ప్రార్థన:** *ప్రభువా, ఆకాశమండలమందు నీ సృష్టిని పరిశీలించి చూడగా, నీ గొప్పతనమును గుర్తించి, నాపట్ల నీకున్న ప్రేమనుబట్టి పొంగిపోవుచున్నాను.*

యీ వాక్యభాగములో దేవుడు సృష్టించిన యీ భూమిని బట్టి కీర్తనాకారుడు దేవుని స్తుతించుట కొనసాగించుచున్నాడు. నిన్నటి భాగములో దేవుని స్తుతించుటకొరకై సృష్టించబడిన ఆకాశములను గూర్చి తెలియజేసిన తరువాత కీర్తనాకారుడు యీ భూమి మీది వాటి గురించి వివరించుచున్నాడు. 7వ వచనములో "భూమి మీద నున్న మకరములారా, అగాధ జలములారా, యెహోవాను స్తుతించుడి" అని పలుకుచున్నాడు. 1వ వచనములో, "ఆకాశ వాసులారా" అన్న మాటలు వ్రాయబడినవి. పై వాక్య భాగములో కీర్తనాకారుడు వాతావరణముయొక్క క్రమము, భూమి పై నున్న పర్వతములు, గుట్టలు, ఫలములు, వృక్షములు, జంతువులు మరియు యీ భూమి మీద ప్రజలు, నాయకులందరూ వయసు నిమిత్తము లేకుండా మన ఆశ్చర్యకరుడైన దేవుని స్తుతించుటకొరకై సృష్టించబడియున్నారని తెలుపుచున్నాడు. యీ దినము నీ చుట్టు నీకు కనిపిస్తున్న వాటినన్నిటిని చూసి, దేవుని హస్తము వాటిని కలుగజేసినదని ఆయనను స్తుతించుము.

1. దేవుని స్తుతికొరకు సృష్టించబడిన భూమి– వ. 7
2. ఆయన మాటను నెరవేర్చుచున్న వాతావరణము– వ. 8
3. భూమిమీది ప్రదేశములు, వృక్షములు, జంతువులను దేవుడు సృష్టించుట– వ. 9–10
4. మానవులందరూ దేవుని స్తుతించుటకు పిలువబడుట– వ. 11–12
5. సకల స్తుతికి పాత్రుడైన దేవుడు– వ. 13
6. తన ప్రజలకొరకు దేవుని చిత్తము– వ. 14

దేవుని సృష్టి యావత్తు ఆయనను స్తుతించుటకు కలుగజేయబడినది. మన జీవితములోని అనేక సమస్యలు దేవునిపై నుండి, ఆయన చేసిన కార్యములపై నుండి మన కన్నులను తొలగించుటద్వారా కలుగుచున్నవి. మనమెదుర్కొంటున్న సమస్యలను బట్టి, మన పరిస్థితులనుబట్టి మనము అధైర్యపడిపోయి, దేవుడు ఎవరైయున్నాడు, ఆయన ఏమి జరిగించగలడు అను సత్యమును మరిచిపోయే వారముగా వుంటాము.

**ధ్యాన వచనము 13:** *అందరును యెహోవా నామమును స్తుతించుదురు గాక! ఆయన నామము మహోన్నతమైన నామము. ఆయన ప్రభావము భూమ్యాకాశములకు పైగా వున్నది.*

**ప్రార్థన:** *ప్రభువా, నా కుటుంబమునుబట్టి, నా స్నేహితులనుబట్టి, నా యింటినిబట్టి మరియు నాకు కలిగిన సమస్తమునుబట్టి నిన్ను స్తుతించెదను. అంతేగాక, నీ సృష్టి గురించి సాక్ష్యమిచ్చుచున్న అందమైన పరిసరములనుబట్టి (చెట్లు, పర్వతములు, నదులు, సముద్రములనుబట్టి) నిన్ను స్తుతించెదను.*

యీ కీర్తన విశ్వాసులందరూ దేవునియెదుట కలిగియున్న స్థానము మరియు వారి ఆధిక్యతలను గుర్తుచేయుచూ, దేవుని స్తుతిగా వ్రాయబడినది. మరొకసారి కీర్తనాకారుడు *"ఇశ్రాయేలీయులు"* మరియు *"సీయోను జనులను"* గూర్చి వ్రాయుచున్నాడు. యీ కీర్తనలో దేవుని ఘనత మరియు ఆయన మహిమ కొరకు తన తీర్పును తన ప్రజల హస్తముల ద్వారా జరిగించుచున్నాడు. ఆయన *"రాజు"* మరియు మనము *"ఆయన ప్రజలము"*. 2వ వచనములో దేవుడు ఇశ్రాయేలును నిర్మించాడని యెషయా 43:1లో వ్రాయబడిన మాటలను గుర్తు చేయుచూ, *"ఇశ్రాయేలీయులు తమ్మును పుట్టించిన వానిని బట్టి సంతోషించుదురుగాక"* అని కీర్తనాకారుడు పలుకుచున్నాడు. ఇశ్రాయేలు నోవహు ముగ్గురు కుమారుల నుండి కలిగిన దేశములలో వ్రాయబడలేదు. వారు దేవునిచేత ప్రత్యేకమైన రీతిలో ఆయన మహిమకొరకు మరియు ఆయన ప్రేమ, విశ్వాస్యతలను బయలుపరచుటకై సృష్టించబడియున్నారు (ద్వితీయోపదేశ కాండం 7:6-9).

1. భక్తుల సమాజములో వున్న స్తుతి- వ. 1
2. సీయోను జనులు ఆనందించవలెను- వ. 2
3. నాట్యముతో దేవుని స్తుతించుట- వ. 3
4. తన ప్రజలపట్ల దేవునికున్న ప్రేమ- వ. 4
5. దేవుని ప్రజల నోట దేవుని స్తుతియుండుట- వ. 5-6
6. దేవుని తీర్పును జరిగించుట కొరకైన తీర్మానము- వ. 7-9

దేవుని ప్రజలు తమ శత్రువులందరిపైన విజయము సాధించెదరు. ప్రకటన గ్రంథము యీ విజయమును గూర్చి వివరిస్తున్నది. అది రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువైన మెస్సీయ యేసుక్రీస్తు ద్వారా సాధించబడును. భవిష్యత్తులో వలె యిప్పుడు కూడా దేవుని ప్రజలు సమస్తమును జయించబోతున్న దేవునికి స్తుతులు చెల్లించెదరు.

**ధ్యాన వచనము 4 :** *యెహోవా తన ప్రజలయందు ప్రీతిగలవాడు. ఆయన దీనులను రక్షణతో అలంకరించును.*

**ప్రార్థన:** *ప్రభువా, నీవు రాజులందరికంటె బలమైన రాజువు గనుక సంతోషముతోను, స్తుతితోను కూడిన పాటను నేను పాడెదను. నీ జనులకొరకు నీవు సిద్ధపరచిన జయమును బట్టి నేను ఆనందించుదును.*

యీ దినము సంవత్సరముయొక్క అఖరి దినము. యీ కీర్తన మన దేవునిపట్ల అద్భుతమైన స్తుతి, ఆరాధనలతో నిండియున్న కీర్తనల గ్రంథము యొక్క ఆఖరి కీర్తన. అనేకులు యీ దినమందు నూతన సంవత్సరములో తాము కోరుకునే మార్పులను గురించి *"నూతన సంవత్సర తీర్మానములను"* (New Year's Resolutions) వ్రాసుకొందురు. మన ఆత్మీయ జీవితములలో దేవునితో పాటు మనము కలిగియున్న నడకను గూర్చిన ధ్యాస కలిగియుండుట మంచిది. కీర్తనల గ్రంథము ద్వారా దేవుని స్తుతించవలెనని పదేపదే గుర్తుచేయబడియున్నాము. రేపు మొదలవుతున్న నూతన సంవత్సరములో పూర్ణ హృదయముతో దేవుని స్తుతించి, ఆరాధించుటకు ప్రతి దినము ఒక నిర్దిష్టమైన సమయమును కేటాయించే తీర్మానమును తీసుకుంటే అది గొప్ప విషయము. యితరులతో కలిసి దేవుని స్తుతించుట ఆశీర్వాదకరమే. కానీ నీవు ఒంటరిగా వున్నప్పుడు ఆయనను స్తుతిస్తే, దేవుని సహవాసములో నీవు ఎంత బలంగా వున్నావన్న సత్యము రుజువుచేయబడుతుంది. రాబోతున్న నూతన సంవత్సరము స్తుతులతో నిండియుండునుగాక!

1. అన్ని స్థలములలోను దేవుని స్తుతించుట వ. 1
2. దేవుని శక్తిని బట్టి ఆయనను స్తుతించుట– వ. 2
3. సంగీతవాయిద్యములన్నిటితోను దేవుని స్తుతించుట– వ. 3–5
4. దేవుని స్తుతించుట జీవిత ప్రాధాన్యతగా కలిగియుండుట– వ. 6

యీ కీర్తనలోని ఆఖరి మాటలు ప్రతి దినము మన పెదవుల నుండి వచ్చు మొదటి మాటలు కావలెను – *"యెహోవాను స్తుతించుడి"*. మనము దేవుని స్తుతించి, ఆయనకు వందనములు చెల్లించుట నేర్చుకున్నప్పుడు మన జీవితములోని సంగతులన్నియు మారిపోవును. దేవుని గొప్ప తనము మరియు ఆయన బలముయొక్క వెలుగులో మన కష్టతరమైన పరిస్థితులు, సమస్యలన్నియు తేలికైపోతాయి.

**ధ్యాన వచనము 6 :** *సకల ప్రాణులు యెహోవాను స్తుతించుదురుగాక. యెహోవాను స్తుతించుడి.*

**ప్రార్థన:** *ప్రభువా, బలమైన ఆశ, తీర్మానముతో రాబోవు సంవత్సరమంతా మిమ్మును స్తుతిస్తూ, మహిమ పరుస్తూ జీవించుటకు నా జీవితమును మీకు సమర్పించదలుచు కున్నాను. మీరెవరు అను సత్యమునుబట్టి మరియు యిప్పటి వరకు మీరు జరిగించిన దానినిబట్టి, భవిష్యత్తులో మీరు జరిగించబోయే దానినిబట్టి మిమ్మును ఆరాధిస్తూ జీవించదలుచుకున్నాను.*